# రామదాసు కీర్తనలు - ఒక పరిశీలన


పరిశోధన

**గండవరం విద్యాధరి**

పర్యవేక్షణ

**ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం**



పిహెచ్.డి., పట్టం కోసం హైదరాబాదు విశ్వ విద్యాలయానికి

సమర్పించిన సిద్ధాంత వ్యాసం

జూన్, 1998

# అంకితం

నాకు జన్మనిచ్చి, అక్షరాభ్యాసం నాటి నుంచి ఉన్నత విద్య వరకు నాకు సహకరించి, నిరంతరం నా శ్రేయస్సును, అభివృద్ధిని కాంక్షించే పూజ్యులైన నా అమ్మ, నాన్నలకు నా ఈ సిద్ధాంత గ్రంథం అంకితం.......

***Dr. G.V. SUBRAHMANYAM,***
***PROFESSOR,***
***DEPARTMENT OF TELUGU,***
***UNIVERSITY OF HYDERABAD,***
***HYDERABAD.***

# CERTIFICATE

This is to certify that the Thesis entitled ***"RAMADASU KEERTHANALU - OKA PARISHEELANA"*** Submitted for the award of Ph.D., degree is a record of Research work done by ***Smt. G. VIDYADHARI*** during the period of her study as a Research Student under my supervision.

PLACE : Hyderabad

DATE : 25-6-1998

Prof. G.V. SUBRAHMANYAM.

Dr R. SRIHARI
Professor and Head 26/6
Department of Telugu
University of Hyderabad
Central University Post
HYDERABAD-500 134

DEAN
SCHOOL OF HUMANITIES
University of Hyderabad
Hyderabad-500 134

# ***DECLARATION***

I, **G. VIDYADHARI**, declare that this Thesis entitled **"RAMADASU KEERTANLU - OKA PARISHEELANA "** carried out by me under the supervision of **Prof.G.V.Subrahmanyam** Department of Telugu, University of Hyderabad has not been submitted for any other degree either in part or in full to this University or any other University.

PLACE : HYDERABAD

G. Vidyadhari

GANDAVARAM VIDYADHARI.

DATE : 25.6.98

# భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రప్రభువు



శ్రీరామ చంద్రః శ్రిత పారిజాతః
సమస్త కళ్యాణ గుణాభిరామః ।
సీతా ముఖాంభోరుహా చంచరీకః
నిరంతరం మంగళ మా తనోతు ॥




ధ్యానమందిరంలో నెలకొల్పిన
భక్తరామదాసుని విగ్రహము

# విషయ సూచిక

కృతజ్ఞతలు

ప్రవేశిక i - iii

*1. మొదటి అధ్యాయం*

రామదాసు జీవిత చరిత్ర - కొన్ని చర్చనీయాంశాలు 1-50

*2. రెండవ అధ్యాయం*

రామదాసు కాలం నాటి సామాజిక పరిస్థితులు 51 -107

*3. మూడవ అధ్యాయం*

రామదాసు కీర్తనలు - కొన్ని పరిశీలనలు 108-123

*4. నాల్గవ అధ్యాయం*

తహసీల్దారుగా రామదాసు వ్రాసిన కీర్తనలు 124-226

*5. అయిదవ అధ్యాయం*

రామదాసు జైలులో వ్రాసిన కీర్తనలు 227-272

*6. ఆరవ అధ్యాయం*

రామదాసు కారాగారవాసానంతరం వ్రాసిన కీర్తనలు 273 -315

*7. ఏడవ అధ్యాయం*

రామదాసు కీర్తనలలో సంగీత భాషా విశేషాలు 316-320

*8. ఎనిమిదవ అధ్యాయం*

రామదాసు కీర్తనల ప్రశస్తి 321-332

ముగింపు 333

ఉపయుక్త గ్రంథాలు 334 - 341

అనుబంధము - 1

(భద్రాద్రి సీతారామచంద్రుల వారి ఆభరణములు - రామదాసు చేయించినవి )

# కృతజ్ఞతలు

"రామదాసు కీర్తనలు - ఒక పరిశీలన" అనే అంశం గూర్చి పరిశోధన చేయడానికి అవకాశాన్నిచ్చిన హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య రవ్వా శ్రీహరి గారికి, డీన్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నా యీ పరిశోధనకు పర్యవేక్షణ వహించి తమ అమూల్యమైన కాలాన్ని వెచ్చించి ఎప్పటికప్పుడు తగిన సలహాలను అందించిన గురుదేవులు, పూజ్యులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారికి నా హృదయ పూర్వక నమస్సుమాంజలులు.

రామదాసు కీర్తనల గూర్చి పరిశోధన చేయమని సూచనగా తెల్పి, నన్నెంతగానో ప్రోత్సహించి, నాయీ పరిశోధన పూర్తి కావడానికి ప్రతిక్షణం సహకరించిన పిత్రు తుల్యులు ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖ రీడర్ శ్రీ కసిరెడ్డి వెంకటరెడ్డి గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

తెలుగు పరిశోధనయందు ఆసక్తిని పెంపొందించిన తెలుగు శాఖయందలి గురువులు డా॥ ముదిగొండ వీరభద్రయ్యగారికి, ఆచార్య సి. ఆనందరామం గారికి, డా॥ ఎన్.ఎస్. రాజుగారికి, డా॥ పరిమి రామనరసింహం గారికి, డా॥ శరత్‌జ్యోత్స్నా రాణిగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నా పరిశోధన కాలంలో తమ అమూల్యమైన సలహాలనిచ్చి, సహకరించిన కేంద్ర విశ్వ విద్యాలయం చరిత్ర శాఖాధ్యక్షులు, ఆచార్య రామకృష్ణగారికి, డా॥ హంగ్లూ గారికి, మాదన్న ట్రస్టు ఛైర్మన్ కె.వి.భూపాలరావు గారికి, బి.ఎన్.శాస్త్రిగారికి, డా॥ దాశరథుల బాలయ్య గారికి, డా॥ బాలాంత్రపు రజనీకాంతరావు గారికీ, డా॥ ఓగేటి అచ్యుత రామశాస్త్రిగారికి, డా॥ టి.వి నాగరంజని గారికి, తెలుగు విశ్వ విద్యాలయం భాషా పీఠంలో రీడర్ ఉషాదేవి గారికి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, భాషాశాస్త్రం శాఖలో రీడర్ డా॥ నాగమ్మ రెడ్డి గారికి నా హార్దిక కృతజ్ఞతలు.

భద్రాచలం దేవస్థానం ధర్మ కర్త మండలి వారికి, భద్రాచలం దేవస్థాన అర్చక సిబ్బందికి, భద్రాచల దేవాలయ సంస్కృత అధ్యాపకులు ఎస్.జి.టి. శ్రీమన్నారాయణాచార్యులు గారికి, పరిశోధనకు కావలసిన గ్రంథ సేకరణలో తోడ్పడిన కేంద్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికీ, ఉస్మానియా విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికీ, తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికీ, స్టేట్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ గ్రంథాలయ శాఖ సిబ్బందికీ, కాకతీయ విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికీ, సిటీ సెంట్రల్ లైబ్రరీ వారికీ, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ వారికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అక్షరాభ్యాసం మొదలు ఇంతవరకు నా విద్యాభ్యాసాన్ని పూర్తి చేయడానికి ప్రోత్సహిస్తూ, ఎల్లప్పుడూ నా శ్రేయస్సును కాంక్షించే నా తల్లిదండ్రులు గౌ॥ శ్రీమతి సుభద్ర, గౌ॥ శ్రీ జి. దశరథరామి రెడ్డి గార్లకు నా హృదయ పూర్వక కృతజ్ఞతా స్తుతులు తెలియజేస్తున్నాను.

నాయీ పరిశోధన పూర్తి కావడానికి సహకరించిన మా శ్రీవారు శ్రీ దయాకర్ రెడ్డి గారికి, మా సోదరి, పద్మజకు, బావగారికి, ఉష అక్కయ్యకు, నాకు ఈ పరిశోధనలో సహకరించిన మిత్రులు బాణాల భుజంగరెడ్డి, శ్రీనాథ్, కోయి కోటేశ్వర రావు, కిషోర్, కృష్ణ, వసుమతి, అనిత, ఇంకా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన మిత్ర బృందానికి నా కృతజ్ఞతలు.

నా యీ గ్రంథాన్ని చక్కగా డి.టి.పి. చేసి యిచ్చిన కావ్యశ్రీ గ్రాఫిక్స్ మనోహరి, కమలాకర శర్మ దంపతులకు నా హృదయపూర్వక, స్నేహపూర్వక కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నాను.

ఇంకా నా ఈ పరిశోధన దిగ్విజయంగా పూర్తి కావడానికి సహకరించిన కేంద్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ కార్యాలయ సిబ్బందికీ, కేంద్ర విశ్వవిద్యాలయం పరిపాలనా శాఖ వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు అందజేస్తున్నాను.

*విద్యాధరి - గండవరం*

# ప్రవేశిక

భారతీయ సంస్కృతిని, భక్తి తత్త్వాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చినవారు మన వాగ్గేయకారులు. ఈ వాగ్గేయకారులు మన సనాతన హైందవ ధర్మాన్ని కాపాడడంలో ఎనలేని కృషి చేశారు. ఈ వాగ్గేయకారుల్లో జయదేవుడు, లీలాశుకుడు, నారాయణ తీర్థులు వంటి ప్రసిద్ధ సంస్కృత వాగ్గేయకారులు, అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, సారంగపాణి, త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులు, తూము నరసింహదాసు, కాలజ్ఞాన తత్త్వకర్తలు మొదలైన ఆంధ్ర వాగ్గేయకారులు ప్రసిద్ధి గాంచారు. వీరందరూ పదకవితా సాహిత్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

ఈ వాగ్గేయకారుల సంకీర్తనలు, పద కవిత్వం గూర్చి పరిశోధనలు విశ్వ విద్యాలయాల్లో జరిగాయి. "రామదాసు" కీర్తన సాహిత్యం గూర్చి కూడా కొంతవరకు పరిశోధన జరిగింది. రామదాసు కీర్తనల్లోని సంగీతం, భాషా సాహిత్యాంశాల గూర్చి, వారి జీవిత విశేషాల గూర్చి కొంత పరిశోధన స్థూలంగా జరిగింది. అయితే రామదాసు జీవిత విశేషాలకు, ఆయన కీర్తన సాహిత్యానికి గల అవినాభావ సంబంధాన్ని గూర్చి ఆనాటి అంటే రామదాసు జీవించి కుతుబ్షాహీ రాజుల కాలం నాటి సాంఘిక, రాజకీయ, చారిత్రక, మత పరిస్థితుల ప్రభావం ఈ కీర్తనలపై ఏవిధంగా ఉందో పరిశీలించడం జరగలేదు.

అందుకే రామదాసు కీర్తనా సాహిత్యంపై అతని జీవితంలో జరిగిన సంఘటనల ప్రభావం ఏవిధంగా ఉందో, ఆనాటి రాజకీయ, చారిత్రక, సామాజిక, మత పరిస్థితుల ప్రభావం ఈ కీర్తనలపై ఏవిధంగా ఉందో పరిశీలించడం నా యీ పరిశోధన ప్రధానోద్దేశం. ఈ అంశాలపై పరిశోధన ఇంతవరకు క్షుణ్ణంగా జరగలేదు.

కుతుబ్షాహీ రాజుల కాలం నాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక, చారిత్రక పరిస్థితులు రామదాసు జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయో, ఆ కీర్తనలు ఏ పరిస్థితులలో ఆవిర్భవించాయో పరిశోధించవలసిన అవసరం ఉంది. ఈ దృక్కోణంలో రామదాసు కీర్తనలను పరిశీలించడం అవసరమని భావించి సిద్ధాంత గ్రంథ రచనకు పూనుకున్నాను. నేను ఈ పరిశోధనా గ్రంథంలో రామదాసు కీర్తనలపై అతని జీవితంలో జరిగిన సంఘటనల ప్రభావం ఏ విధంగా ఉందో, కుతుబ్షాహీ రాజుల కాలంనాటి సామాజిక పరిస్థితుల ప్రభావం కీర్తనలపై ఏవిధంగా ఉందో పరిశీలించాను.

## ఈ పరిశోధనలో చర్చించిన అంశాలు :

### మొదటి అధ్యాయం : రామదాసు జీవిత చరిత్ర - కొన్ని చర్చనీయాంశాలు :

ఈ అధ్యాయంలో, గోపన్న తల్లి తండ్రులు, అతని స్వగ్రామం, రామదాసు శాఖ, గోత్రం, వంశనామం, రామదాసు గురువు, రామదాసు విద్యాభ్యాసం, రామదాసు రఘునాథ భట్టాచార్యులవద్ద వైష్ణవం స్వీకరించి తారక మంత్రోపదేశం పొందడం, గోపన్న మేనమామలు అక్కన్న మాదన్నలని నిరూపించడం, గోపన్న భద్రాచలం తహసీల్దారుగా 1650లో అబ్దుల్లా కుతుబ్షా కాలంలో నియమింపబడి, 1665 ప్రాంతాల్లో భద్రాచల సీతారామచంద్ర ప్రభువు దేవస్థాన నిర్మాణం గావించడం, ఆలయ నిర్మాణానికై ప్రభుత్వ ధనం 6 లక్షలు వ్యయం చేశాడన్న నేరం రామదాసుపై ఆరోపించబడి అబ్దుల్లా కుతుబ్షా కాలంలో 1665 ప్రాంతంలో గోల్కొండ ఖైదులో బంధింపబడి, అబుల్‌హసన్ తానీషా కాలంలో 1677 వరకు 12 సం॥లు జైలుశిక్ష అనుభవించి, ఆ తర్వాత రామానుగ్రహంతో 6 లక్షల ఋణ విముక్తుడైనందున, అబుల్ హసన్ తానీషా రామదాసును చెరనుండి విడిపించడం అనే ముఖ్యాంశాలు రామద్సాసు జీవితంలో జరిగాయి. ఈ సంఘటనలను గూర్చి చారిత్రక గ్రంథాల ఆధారంగా విశ్లేషించడం జరిగింది.

### రెండవ అధ్యాయం : రామదాసు కాలంనాటి సామాజిక పరిస్థితులు :

ఈ అధ్యాయంలో చర్చించిన అంశాలు ఇవి. కుతుబ్షాహీ కాలం నాటి చారిత్రక పరిస్థితులు, రామదాసు జీవించిన కాలం (1620 - 1680 ) నాటి సమకాలీన రాజకీయ, చారిత్రక, సాంఘిక, మత పరిస్థితుల

గూర్చి, వాటి ప్రభావం రామదాసు జీవితంపై ఏవిధంగా ఉందో, ఆయన రచించిన కీర్తనలు ఆవిర్భవించడానికి ఆనాటి సామాజిక పరిస్థితులు ఏవిధంగా దోహదపడ్డాయో వివరించడం జరిగింది.

రామదాసు మేనమామలైన అక్కన్న, మాదన్నలు కుతుబ్షాహీ రాజులైన అబ్దుల్లా, అబుల్ హసన్ తానీషాల కాలంలో ప్రధాన మంత్రి, సర్వసైన్యాధ్యక్ష పదవి నలంకరించి గోల్కొండ రాజ్య పటిష్టతకు వారు తోడ్పడిన వైనం, మాదన్న అనుసరించిన ఆర్థికవిధానం, ఆయన రాజనీతి చతురత, గోల్కొండ రాజ్యరక్షణకై అబుల్‌హసన్, శివాజీల మధ్య సంధి ఒప్పందం కుదర్చడం, గోల్కొండను శివాజీ మరణానంతరం 1687 లో మొగలాయి చక్రవర్తి ముట్టడించి, ఆక్రమించడం, అక్కన్న మాదన్నలను ఔరంగజేబు హత్య చేయించడం, ఈ పరిస్థితుల్లోనే రామదాసు జీవించడం, ఆలయ నిర్మాణం చేపట్టి కారాగార జీవితం అనుభవించడం, ఈ పరిస్థితుల ప్రభావం ఆయన కీర్తనల్లో ఏవిధంగా ఉందో చర్చించడం జరిగింది.

ఇంకా, కుతుబ్షాహీ రాజుల కాలం నాటి మతపరిస్థితులు, కుతుబ్షాహీలు హిందూ మతాన్ని వైదిక సంస్కృతిని కాపాడిన విధం, భక్తి, సమాజ కవులు ఆవిర్భవించి, హిందూ ధర్మాన్ని కాపాడడానికి వీరు చేసిన కృషి, భారతీయ సంస్కృతిని, వైదిక ధర్మాన్ని పరిరక్షించడానికి రామదాసు ప్రయత్నం, సమాజ కవిగా రామదాసు స్థానం, ఆనాటి మత, సాంఘిక పరిస్థితులు రామదాసు కీర్తనలను ప్రభావితం చేసిన తీరు మొదలైనవి ఈ అధ్యాయ చర్చనీయాంశాలు.

**మూడవ అధ్యాయం : రామదాసు కీర్తనలు - కొన్ని పరిశీలనలు :**

రామదాసు జీవితం గూర్చి, ఆయన కీర్తనా సాహిత్యంగూర్చి ఇంతవరకు వెలువడిన గ్రంథాలు, విశ్వవిద్యాలయాల్లో వాటిపై జరిగిన పరిశోధనలు, పద కవిత్వావిర్భావ వికాసాలు, సంగీత కళ ప్రాశస్త్యం, రామదాసు కీర్తనలకు పదకవితా సాహిత్యంలో ఉన్న ప్రాధాన్యం మొదలగు విషయాలు ఈ అధ్యాయంలోని అంశాలు.

**నాలుగవ అధ్యాయం : తహసీల్దారుగా రామదాసు వ్రాసిన కీర్తనలు :**

ఈ అధ్యాయంలో రామదాసు భద్రాచల దేవాలయ నిర్మాణం గావించిన తీరు, ఆ భద్రాచల ఆలయం విశిష్టత, రామదాసు తహసీల్దారుగా రాక పూర్వం భద్రాచలంలో పోకల దమ్మక్క సీతారాములకు చేసిన సేవ, రామదాసు ప్రభుత్వ ధనం ఆరులక్షలు ఖర్చు చేశాడన్న నేరంపై రామదాసును అబ్దుల్లా కుతుబ్షా గోల్కొండ ఖైదులో బంధించడం, 1650 నుండి 1665 వరకు తహసీల్దారుగా ధర్మబద్ధమైన జీవితం గడుపుతూ రామదాసు పాడిన కీర్తనల గూర్చి, కారాగార ప్రవేశానికి పూర్వం రామదాసు జీవితంలో జరిగిన సంఘటనలను కీర్తనల ఆధారంగా ప్రస్తావించడం మొదలైన విషయాలు ఈ అధ్యాయ పరిశీలనాంశాలు.

**అయిదవ అధ్యాయం : రామదాసు జైలులో వ్రాసిన కీర్తనలు :**

రామదాసు ప్రభుత్వధనం ఆరులక్షలు వ్యయంచేసి భద్రాద్రి శ్రీ సీతారామచంద్రుల ఆలయం నిర్మించి, వారికి వైభవోపేతంగా ఆభరణాలు, వస్తువాహనాలు తయారు చేయించి, బ్రహ్మోత్సవాది కైంకర్యాలు చేయిస్తున్నాడని తెలిసి అబ్దుల్లా కుతుబ్షా రామదాసును బంధించి ఆధనం చెల్లించమని కోరడం, ప్రభుత్వ ధనం ఆరులక్షలు చెల్లించలేక రాముడే తన ఋణం చెల్లించగలడన్న విశ్వాసంతో 12 సం॥లు కారాగార శిక్షను రామదాసు అనుభవించడం, 1665 - 1677 వరకు జైలుశిక్ష అనుభవించి అబుల్‌హసన్‌తానీషా కాలంలో 1677 ప్రాంతాల్లో రామానుగ్రహంతో ఋణ విముక్తుడై చెరనుండి విడుదల కావడం అనే అంశాలు ఈ అధ్యాయంలో పరిశీలించబడినాయి.

రామదాసు కారాగారంలో 12 సం॥లు కఠిన శిక్షలు అనుభవిస్తూ, రాముని ప్రార్థిస్తూ పాడిన ఆత్మ నివేదనతో కూడిన కీర్తనల గూర్చి, ఆ కీర్తనల ద్వారా రామదాసు రామభక్తి వెల్లడైన విధం, ఆ కీర్తనల ద్వారా రామదాసు కారాగార జీవితం ఎలా అనుభవించాడో తెలియజేయడం, మొ॥లగు అంశాలు ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది.

**ఆరవ అధ్యాయం : రామదాసు కారాగారవాసానంతరం వ్రాసిన కీర్తనలు :**

రామదాసు 1677లో జైలునుండి రామానుగ్రహంతో విడుదలైన విషయం గూర్చి, రామలక్ష్మణులే తానీషాకు ఆరు లక్షల వరహాలు ధనం చెల్లించి, తానీషా వద్దనుండి రసీదు తీసుకుని రామదాసును ఖైదునుండి 12 సం॥ల తర్వాత విడిపించడం, ఈ సంఘటన చారిత్రకంగా సత్యమని వివిధ చారిత్రక గ్రంథాల ఆధారంగా, రామదాసు కీర్తనల ఆధారంగా నిరూపించడం, అబుల్‌హసన్‌తానీషా రామదాసు అపారమైన రామభక్తికి మెచ్చి రామదాసుకు రామలక్ష్మణులు తనికిచ్చిన ఆరు లక్షల ధనాన్ని, భద్రాచలం పరగణాను రామ కైంకర్యానికై దానంగా ఇవ్వడం, రామదాసు తిరిగి భద్రాచలం తాలూకా తహసీల్దారుగా నియమింపబడడం, భద్రాచలానికి 12 సం॥ల తర్వాత తిరిగి వెళ్తుండగా మార్గ మధ్యంలో చోరులడ్డగించి ద్రవ్యాన్ని అపహరించబోగా, ఆ రామలక్ష్మణులు వచ్చి చోరులను సంహరించి, రామదాసును, ఆ ద్రవ్యాన్ని కాపాడటం, రామదాసు చరమజీవితం భద్రాద్రిరామ సన్నిధిలో గడపడం, వృద్ధాప్యంలో రామదాసు శూలబాధ, కాలు బెణకడం వలన 3 నెలల పాటు రాముని వద్దకు వెళ్లలేక దుఃఖిస్తూ రాముని ప్రార్థించడం, ఆ తర్వాత చివరికి రామ సాయుజ్యం పొందడం, భద్రాద్రి వాసులందరూ చూస్తుండగా శ్రీరామునిలో ఐక్యం కావడం అనే సంఘటనల గూర్చి, ఆయా సందర్భాలలో రామదాసు వ్రాసిన కీర్తనల గూర్చి, ఈ కారాగారవాసానంతరం రామదాసు వ్రాసిన వైరాగ్య నీతి ప్రబోధాత్మకమైన రామభక్తితో కూడిన కీర్తనల గూర్చి ఈ కారాగార వాసానంతరం రామదాసు జీవితంలో జరిగిన సంఘటనల ప్రభావం ఆయన కీర్తనలపై ఏవిధంగా ఉన్నదో తెలియజేయడం అనే ఈ ముఖ్యాంశాలు ఈ అధ్యాయాంశాలు.

**ఏడవ అధ్యాయం : రామదాసు కీర్తనలలో సంగీత భాషా విశేషాలు :**

రామదాసు కీర్తనల్లోని సంగీతాంశాలు, ఆయన ఉపయోగించిన రాగాలు, భజన సంప్రదాయ కీర్తనలుగా రామదాసు కీర్తనలకున్న ప్రాశస్త్యం, సంగీత శాస్త్రంలో రామదాసు కీర్తనల కున్న ప్రాముఖ్యం, రామదాసు తన కీర్తనల్లోని సంగీతానికున్న ప్రాముఖ్యాన్ని గూర్చి ప్రస్తావించిన అంశాలు, భాషా విశేషాలలో, ఈ కీర్తనల్లోని పదబంధాలు, నూతన పదప్రయోగాలు, అన్యదేశ్యాలు, పలుకుబళ్లు, జాతీయాలు, నుడికారాలు, దాశరథీ శతకం, రామదాసు కీర్తనల్లోని అంశాలకున్న పోలికలు, రామదాసు సంస్కృతభాషలో రచించిన కీర్తనలు, వీటిద్వారా రామదాసుకు సంస్కృత, ఆంధ్ర భాషల్లో గల పాండిత్యం ఎటువంటిదో తెలియజేయడం మొదలైన అంశాలు ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది.

**ఎనిమిదవ అధ్యాయం : రామదాసు కీర్తనల ప్రశస్తి :**

రామదాసు కీర్తనలకు తెలుగునాట, మరియు పదకవితా సాహిత్యంలో ఉన్న ప్రాముఖ్యం, జానపద గేయ వాఙ్మయంలో రామదాసు కీర్తనలకున్న ప్రాచుర్యం, భజన సంప్రదాయ ప్రక్రియను ఈ కీర్తనలు ఏవిధంగా అభివృద్ధిలోకి తెస్తున్నాయన్న విషయం, చెక్కభజన, రామభజన మొదలైన జానపద భజనప్రక్రియల్లో ఈ కీర్తనలకున్న స్థానం, దాసరులు, హరిదాసులు, పట్టివర్ధనముల వారు మొదలైన జానపదభిక్షుకగాయకులు రామదాసు కీర్తనలను ప్రాచుర్యంలోకి తెస్తున్న విధం, ఈ కీర్తనల అభివృద్ధికి వారు చేస్తున్న సేవ, రామదాసును అతని కీర్తనలను, త్యాగరాజు ప్రశంసించిన విధం, రామదాసు కీర్తనల సంఖ్యానిర్ణయం, రామదాసు జీవితంలోని సంఘటనల ఆధారంగా ఈ కీర్తనలను నామగుణ, ఆత్మనివేదకం, నీతి, వైరాగ్య ప్రధానమైన కీర్తనలుగా విభజించడం, తెలుగు సాహిత్యంలో ఈ కీర్తనలకున్న స్థానం, పదసాహిత్యంలో, వాగ్గేయకారులలో రామదాసుకు, అతని రామ భక్తి ప్రధాన కీర్తనలకు ఉన్న స్థానం, ఆ కీర్తనల వైశిష్ట్యం, ప్రాశస్త్యం గూర్చి చర్చించడం జరిగింది. ఇవి నా పరిశోధనా గ్రంథంలోని ఎనిమిది అధ్యాయాల్లో చర్చించిన అంశాలు.

నా ఈ పరిశోధనా గ్రంథం "రామదాసు కీర్తనా సాహిత్యం" పై పరిశోధన చేయాలనే ఆసక్తి గల తరువాతి పరిశోధకులకు మార్గదర్శకంగా ఉంటుందని భావిస్తున్నాను. ఈ రామదాసు కీర్తనల్లోని భాషా విశేషాలగూర్చి, భాషా శాస్త్ర రీత్యా పరిశీలించి పరిశోధన చేయవచ్చు. ఇంకా ఈ కీర్తనల్లోని ఛందోలంకారాది వ్యాకరణ విశేషాల గూర్చి, ఈ కీర్తనలను ఇతర వాగ్గేయ కారుల కీర్తనలతో పోల్చి తులనాత్మకంగా అధ్యయనం చేయవచ్చును. నా పరిశోధనా గ్రంథంలో భాషా విశేషాలు, తులనాత్మక అధ్యయనం అనేవి ప్రధానాంశాలు కావు. ముందు ముందు ఈ అంశాలపై పరిశోధనావకాశాలున్నాయి.

## మొదటి అధ్యాయం

# 1. రామదాసు జీవిత చరిత్ర : కొన్ని చర్చనీయాంశాలు

## 1.0. గోపన్న తల్లిదండ్రులు - స్వగ్రామం :

తెలుగునాట రామభక్తుడుగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ వాగ్గేయకారుడు "రామదాస" బిరుదాంకితుడైన కంచెర్ల గోపన్న. గోపన్న నివాస స్థానం ఖమ్మం జిల్లా భద్రాచలం తాలూకా నేలకొండపల్లి గ్రామం. పింగళి వంశంవాడు. గోపన్న తన పేరును, తన తండ్రి పేరును, గోత్రాన్ని తాను రచించిన దాశరథీ శతకంలోని ఈ పద్యంలో చెప్పకున్నాడు.

ఉ॥ "*అల్లన లింగ మంత్రి సుతు డత్రిజ గోత్రజుడాది శాఖికం*
*చెర్ల కులోద్భవుండన బ్రసిద్ధుడనై భవదంకితంబుగా*
*నెల్ల కవుల్ నుతింప రచియించితి గోప కవీంద్రుడన్ జగ*
*ద్వల్లభ నీకు దాసుడను దాశరథీ కరుణాపయోనిధీ*[1] !"

"జగదీశ్వరుడగు దయ గల భద్రాచల రామా ! ఆత్రేయస గోత్రుడును, ప్రథమ శాఖాధ్యాయియు నగు కంచెర్ల లింగయామాత్యునకు గొడుకునై, నీకు దాసుడనైన గోపకవి యను నేను కవులందఱు బొగడునట్లు నీ పేర ముందుగా శతకమును నిర్మించితిని.

రామదాసు తన అసలు పేరు కంచెర్ల గోపన్న అని, తన తండ్రిపేరు లింగన మంత్రి అని, ఆత్రేయస గోత్రుడు, ప్రథమ శాఖాధ్యాయుడని చెప్పతొన్నాడు. శతకంలోని ఈ పద్యంలో తన తల్లి పేరు లేదు. తన ఊరి పేరు కూడా లేదు. కాని "రామదాసు జీవిత చరిత్ర"ను గూర్చిన గ్రంథాల్లో రామదాసు తల్లి 'కామాంబ' అని, ఆతని ఊరు 'నేలకొండపల్లె' అని చెప్పబడ్డాయి.

## జన్మస్థానం :

ఆరుద్ర తన సమగ్రాంధ్ర సాహిత్యంలో, కంచెర్ల గోపన్న నివాసస్థానం "భద్రాచల తాలూకా నేలకొండపల్లి గ్రామం" అని పేర్కొన్నాడు.[2]

1. దాశరథి శతకము - గోపన్న కంచెర్ల, పుట 78, పద్యం 103, వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్.
2. సమగ్రాంధ్ర సాహిత్యం - ఏడవ సంపుటం(నాయక రాజుల యుగం) క్రీ.శ.166-1670, ఆరుద్ర పుట 384.

"శతక సంపుటము" అనే గ్రంథంలో గ్రంథకర్త ఈ విధంగా తెలియ జేసాడు. 'కంచెర్ల శరభ కవి' యాధ్యాత్మ రామాయణంలోని

తే॥ "కొండపల్లిని గొందలు గొల్లపూడి
గొందలుండిరి తంజాపురందు గొంద
లెలమి వసియించి ప్రబలిరి చెలువు మిగుల
మీఱి కంచెర్ల వంశంబు వారు ధరణి "

అను పద్యం వలన కంచెర్ల వారు నేలకొండపల్లిలో పూర్వం నివసించిరనుట విశ్వాసార్హమే.[1] ఈ పద్యంలోని విషయాన్ని పరిశీలిస్తే నేలకొండపల్లి వాస్తవ్యులు కంచెర్ల వంశంవారు అని తెలుస్తుంది.

సింగరదాసు రచించిన "రామదాసు చరిత్రము"లోని
శ్రీమించిన నెలకొండ పల్లిలో శిష్ట జనులు పొగడను
కామాంబకు గోపన్న జనించెను కమలాక్షుని వరమునను
ఆత్రేయస గోత్రంబున కంచెర్లాంధ్రార్యుల వంశంబునను
పుత్రుడగుచు లింగన మంత్రికి తా బుట్టెను గోపన్నయును[2]

అనే తొహరా వల్లనూ, యాదవదాసు రచించిన రామదాసు చరిత్ర యక్షగానంలోని

"చెలగుచు శ్రీభద్రాచలము తాలూక
కలిపైన దేశపాండ్య కరుణాల మూర
నేలపల్లి కొండలో క్షేమంబుతోను
కలిసి వర్తింతుము ఘన మోదమునను
మా తల్లి కామాంబ వది శీలవతియు
మా తండ్రి లింగయ్య మంత్రి శ్రేష్ఠుండు
గోపాల రాయుడ కొమరప్పగాను
ప్రేమ మీరగ పిలుతురి వేళ నన్ను[3]

అనే ఈ ద్విపద వల్లనూ గోపన్న గారి ఊరు 'నేలకొండపల్లి' అని, తల్లిపేరు 'కామాంబ'అని, తండ్రి లింగన మంత్రి అని, తాను ఆత్రేయస గోత్రుడని కంచెర్ల వంశం వాడని స్పష్టమౌతుంది. ఈ తొహరా, ద్విపదలలోని వంశాను క్రమణిక దాశరథీ శతకంలోని కంచెర్ల గోపన్న వంశాను క్రమణికకు అన్ని విధాల సరిపోతుంది. ఇంకను వివిధ గ్రంథాల్లో రామదాసు జీవిత విశేషాలు

1. శతక సంపుటము : చెన్నపురి వావిళ్ల రామస్వామి అండ్ సన్స్ (1926)(దాశరథి శతకం)
2,3 . రామదాసు చరిత్రము - సింగరదాసు, - ఎస్.వి. గోపాల్ అండ్ కం. నెం.37., 1981, పుట 15

తెల్పే నాటకాలు, కావ్యాలు, యక్షగానాలు, మొదలైన వానిలో గోపన్న తల్లిదండ్రులు, వారి వంశం గూర్చి, నివాస స్థానం గూర్చి ఈ విధంగా ఉంది.

ఈ గోపన్న నివాస స్థానం గూర్చి " ఈతను బహుశః ఖమ్మం జిల్లా నేలకొండ పల్లి అను గ్రామ కాపురస్థుడు గావచ్చును"[1] అని హోవార్డు మార్టిన్ అనే అతడు తన గ్రంథంలో వ్రాశాడు. ఇతడు డచ్చి యాత్రికుడు"

మిన్నికంటి గురునాథ శర్మ తన గ్రంథం "కంచెర్ల గోపన్న అను రామదాసు" అనేదానిలో ఈ విధంగా తెలియజేశాడు. "రామదాసు" అను పదము ఆదియందు వృత్తి వలననే జనించిన దగుట వలనను, గోపన్నయను పితృదత్త నామము క్రమముగా వాడుకలో దొలగి యుండును. 'పోతనామాత్యులు, రామదాసుల గోత్రములు, శాఖలు, పిత్రాధికాభేదములు తుల్యములు"[2] (ఫోర్టు సెయింట్ జార్జి గెజిట్).

## 1.1. రామదాసు శాఖ :

రామదాసు ప్రథమ శాఖ నియోగి బ్రాహ్మణుడు" అని గురునాథ శర్మగారి అభిప్రాయం. దానికి దాశరథీ శతక పద్యం నిదర్శనం.

"రామదాసు ఆర్వేల నియోగి బ్రాహ్మణుడని కొందరు అభిప్రాయ పడగా, దానిని ఖండించి ఆర్యశాఖకు చెందిన వాడు రామదాసని"[3] గురునాథ శర్మ అభిప్రాయం వ్యక్తం చేశారు.

" ఆత్రేయన గోత్రంబున గంచె

ర్లాంధ్రార్యుల వంశమునన్"[4] అని 'రామదాసు చరిత్రము'లో కలదు. ఇందు " ఆర్య' శబ్దాన్ని తన తెగను తెల్పుటకే గోపన్న వాడెను. అంతేకాని ఆర్యులు, దస్యులు అను జాతులను దెల్పుటకు గాదని జూక్ష్మముగ బరికించిన గోచరము కాగలదు"[5] అని గురునాథ శర్మ తెల్పెను. ఇంకా

"భూసుర వరుడు నియోగియు

భాసుర కంచెర్ల కులజ భవ్యయశుడున్"[6] అని రామదాసు చరిత్రమున కలదు.

ఈ చర్చను బట్టి గోపన్న ప్రథమ శాఖ (ఆర్యశాఖ) నియోగి బ్రాహ్మణుడని స్పష్టమౌతుంది. ఈతని తల్లి కామాంబ, తండ్రి లింగన మంత్రి అని స్పష్టం చేశాడు గురునాథ శర్మ.

---

1. మాదన్న మహామంత్రి - కె.వి.భూపాలరావు గారు పుట. 57.

2,3,4. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ(ప్రథమ ప్రకరణం) పుట. 513, మరియు రామదాసు చరిత్ర విమర్శనము (భారతి అక్టోబరు-1931 - మిన్నికంటి గురునాథ శర్మ)

5,6 . చూ. పుట.513 రామదాసు చరిత్ర విమర్శనము (మిన్నికంటి గురునాథ శర్మ ప్రణీతము.

### "రామదాసు నాటకము" :

ధర్మవరం గోపాలాచార్యులు గారు రచించిన దానిలో 'నేలకొండపల్లి'లో ఉండే గోపన్నకు మాదన్న, అక్కన్నలు ఒక లేఖ వ్రాస్తారు. దానిలో ఆతనిని భద్రాచలం తహసీల్దారుగా నియమించిన విషయం ప్రస్తావించారు. ఈ అంశం ద్వారా రామదాసుది నేలకొండపల్లి స్వగ్రామం అని తెలుస్తుంది. రామదాసు తల్లిదండ్రుల గురించి ఈ నాటకంలో ఎక్కడా ప్రస్తావించలేదు.

## "భక్త రామదాసు అను రామదాసు విజయము" :

ఈ నాటకాన్ని శ్రీ కేతవరపు శివరామ శాస్త్రిగారు రచించారు. దీనిలో గోపన్న తన పెద తండ్రి రంగనాథం గారింట పెరిగి పెద్దవాడైనట్లు ఉంది. రామదాసు చరితములో కాని మరెందులో కాని గోపన్న పెదతండ్రి ప్రస్తావన రాలేదు. దీనిలో మాత్రం ఉంది.

"గోపన్న పెదతండ్రి కంచెర్ల రంగనాథం, గోపన్న కబీరుతో తన వంశం పుట్టు పూర్వోత్తరాలను గూర్చి తాను కంచెర్ల కులస్థుడనని, లింగన్న మంత్రి కుమారుడనని చెప్తాడు. తన తల్లి కామాంబ మాదన్నకు అక్క. మాదన్న గోపన్నకు మేనమామ అని ఈ నాటకంలో ప్రస్తావించడం జరిగింది. గోపన్న తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించటం వలన గోపన్న తన పెద తండ్రి రంగనాథం ఇంట పెరిగి పెద్దవాడైనాడని ఈ నాటకంలో ఉంది.

## "శ్రీరామదాసు" :

రామ నారాయణ కవులు రచించిన నాటకంలో రామదాసు తల్లిదండ్రులు కామాంబ, లింగన మంత్రులని, లింగన మంత్రి కూడా గోపన్న వలె భద్రాచలం తాలూకాకు తహసీల్దారుగా ఉండెనని వ్రాయబడి ఉంది. గోపన్న ఇంటి పేరు 'కంచెర్ల'వారు.

## "భక్త రామదాసు" :

భక్తరామదాసు అనే బుర్రకథను శ్రీ దుగ్గిరాల గౌరీ మనోహర రావుగారు వ్రాశారు. దీనిలో రామదాసు తల్లిదండ్రుల గూర్చి, ఆతని వంశానుక్రమణిక, గోత్రాదుల గూర్చి చెప్పబడింది. ఈ ఉదాహరణ అందుకు నిదర్శనం.

"నేలకొండ పల్లిలో కామాంబకు
గోపన్న జనియించెనండీ
ఆత్రేయస గోత్రంబు కంచర్ల వారు
గోపన్న గారండీ

కమలాక్షుని వరమున పుట్టెనని
తల్లి సంతసించె
గోపన్న తండ్రి లింగన్న గోల్కొండ రాజు
కొలువున వుండె . . . "[1]

ఈ బుర్రకథ ద్వారా గోపన్న తల్లి కామాంబ, తండ్రి లింగన మంత్రి, ఇతని కులం కంచెర్ల (వంశం), ఆత్రేయస గోత్రం, నేలకొండపల్లి నివాసం అని స్పష్టమైంది.

## "గోపన్న" :

గోపన్న అనే పుస్తకాన్ని కీ. శే. గరిమెళ్ల సత్య గోదావరి శర్మగారు వ్రాశారు. ఇందు "గోపన్న తల్లి కామాంబ, తండ్రి లింగన మంత్రి, కంచెర్ల ఇంటిపేరు, నేలకొండపల్లి గ్రామం నివాస స్థానం, గోపన్న విష్ణుభక్తుడు" అని, గోపన్న తల్లిదండ్రులు "సంతాన గోపాల మంత్రం పఠించి గోపన్నకు జన్మనిచ్చారు. గోపన్న చిన్నతనం నుండి రాముడియందు భక్తి కలిగి యుండెను"[2] అని గోదావరి శర్మగారు గోపన్న వంశాను క్రమణికను గూర్చి వ్రాశారు.

## "రామదాసు నాటకము" :

ఈ నాటకాన్ని రావూ సాహెబు డి. వేంకట రామణయ్య గారు రచించారు. దీనిలో రామదాసు (గోపన్న) తండ్రి లింగన మంత్రి గారు గోల్కొండ తహసీల్దారుగా ఉన్నారుని, తల్లి కామమ్మ అని , నేలకొండపల్లి నివాస స్థానం అని ఉంది.

## "రామదాస చరిత్రము" :

ఈ హిందూస్థానీ నాటకాన్ని నాదెండ్ల పురుషోత్తమ కవి రచించాడు. ఈ నాటకంలో కూడా రామదాసు తండ్రి లింగన మంత్రి అని, తల్లి పేరు మాత్రం విమలాంబ అని ఉంది. నివాస స్థానం నేలకొండపల్లి అని చెప్పబడింది.

## "రామదాసు చరిత్రము (కావ్యము)" :

చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు ఈ కావ్యాన్ని రచించారు. దీనిలో గోపన్న తల్లిదండ్రులు కామమ్మ, లింగనమంత్రులని, నేలకొండపల్లి నివాసస్థుడని ఉంది.

1. భక్త రామదాసు - బుర్రకథ - దుగ్గిరాల గౌరీ మనోహర రావుగారు.
2. గోపన్న - కీ.శే.గరిమెళ్ళ సత్య గోదావరి శర్మగారు (1973).

## "శ్రీ రామదాస నాటకము" :

కేశిరాజు వేంకట సుబ్బరాయ కవి ఈ నాటకాన్ని రచించాడు (1927). ఈ నాటకంలో కూడా గోపన్న తల్లిదండ్రులు కామాంబ, లింగన మంత్రి అని, గోపన్న ఆత్రేయస గోత్రజుడు, కంచర్ల కులోద్భవుడని ఉంది.

## "భద్రాచల రామదాసు చరిత్రము" :

తిరుక్కడయూరి కృష్ణదాసు రచించిన భద్రాచల రామదాసు చరిత్రము అనే యక్షగానంలో " ఈ తుకిడీల జేరిన గ్రామము నెలకొండపల్లియ యందు, ఖ్యాతిగ లింగన మంత్రి వసించెను. గాపురముగ నందు, లింగనమంత్రి వివాహంబయ్యెను మంగళవతి గామాంబన్" [1] అని ఉంది.

కామాంబ, లింగన మంత్రులకు గోపన్న జన్మించాడు . కామాంబ, లింగన మంత్రులు నేలకొండపల్లి నివాసస్థులు. వారి పుత్రుడు గోపన్న అని గోపన్న తల్లిదండ్రుల గూర్చి చెప్పాడు కృష్ణదాసు.

"క్రీ. శ. 1600 ప్రాంతంలో గోల్కొండ రాజ్యంలోని నేలకొండపల్లిలో లింగన మంత్రికీ, కామమ్మకూ పుత్రుడై గోపన్న జన్మించాడు." [2] అని బాలాంత్రపు రజనీకాంతరావు గారు తన "ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము"లో తెలియజేశారు.

"భద్రాచల రామ చరిత్రము" అనే గ్రంథంలో కవిరాజ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు పంచమాశ్వాసంలో రామదాసు తల్లిదండ్రుల గూర్చి, ఆయన శాఖను గూర్చి ఈ విధంగా వ్రాశారు

"అల కంచెర్ల కులాబ్ధి చంద్రుడగు
గోపాభిఖ్యు డాత్రేయ గో
త్ర లసద్భూసుర ముఖ్యు డాతడు
జగద్వర్ణ్య ........." [3]

కంచెర్ల కులంవాడు, ఆత్రేయ గోత్రుడు అగు గోపన్న కామాంబ, లింగన మంత్రి దంపతులకు జన్మించాడు. నేలకొండ పల్లి స్వగ్రామం అని కూడా చెప్పాడు ఈ కవి.

వరద రామదాసు రచించిన "రామదాసు చరిత్రము" అనే యక్షగానంలోని తూమూరు వల్ల గోపన్నది నేలకొండపల్లి నివాసం అని, అతని తల్లిదండ్రులు కామాంబ, లింగన మంత్రులని తెలుస్తుంది.

1.భద్రాచల రామదాసు చరిత్రము (యక్షగానము) - తిరుక్కడయూరి కృష్ణదాసు పుట 7.
2. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము-బాలాంత్రపు రజనీకాంతరావు పుట 198-199.
3. భద్రాచల రామ చరిత్రము - కవిరాజ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి. (పంచమాశ్వాసం)

తొహరా : "నేలకొండపల్లె । నివసించి యుండుట
కరుణ గలుగు తల్లి । కామాంబ
అమర దండ్రి లింగ । నార్యుడటందురు
నాదు పేరు గోప । న యని యండ్రు"[1]

"దేవాలయములు-తత్త్వవేత్తలు" అనే గ్రంథంలో శ్రీ వి.టి. శేషాచార్యులు గారు గోపన్న తల్లి 'మల్లికాంబ' అని వ్రాశారు. కాని మల్లికాంబ కాదు 'కామాంబ' అని రామదాసు చరిత్రల వల్ల స్పష్టమౌతుంది.

రామదాసు గూర్చి మంచాళ జగన్నాథరావు సంకలనం చేసిన కీర్తనల పుస్తకం పీఠికలో బాలాంత్రపు రజనీకాంత రావుగారు గోపన్న తల్లిదండ్రులు కామాంబ, లింగన మంత్రులని నేలకొండపల్లి నివాస స్థానం అని తెలియజేశాడు.[2]

"భద్రాచల క్షేత్ర మహాత్మ్యము" అనే పుస్తకంలో శ్రీ పి.బి. వీరాచార్యులు గోపన్న తల్లిదండ్రులు కామమ్మ, కంచెర్ల లింగన్నలని, నేలకొండపల్లి వారి స్వగ్రామమని"[3] తెలియజేశారు. "పూర్వకాలములో నేలకొండపల్లి అనే గ్రామంలో కంచర్ల లింగన్న అనబడే గృహస్తుడుండేవాడు. ఆయన ధర్మపత్ని పేరు కామమ్మ, వారి కుమారుడు గోపన్న"అని వ్రాశారు.

ఈ పై రామదాస చరిత్ర గ్రంథాల ఆధారంగా, ఇతర పరిశోధకులు తెలియజేసిన అంశాల ఆధారంగా, గోపన్న నేలకొండపల్లి వాస్తవ్యుడని, తన తల్లి పేరు కామాంబ అని, తండ్రి లింగన మంత్రి అని స్పష్టమౌతుంది. ఈయన నివసించిన నేలకొండపల్లిట ఖమ్మంమెట్టుకు 10 మైళ్ల దూరంలో కలదు. అచ్చట నేటికీ ఒక ప్రదేశం రామదాసు గారి స్వగృహ ప్రదేశమని చూపిస్తారు. అచటనే గ్రామస్థులు రామదాసు గారి స్మారక మందిరాన్ని నిర్మించారు.

"రామదాసు తన స్వగృహాన్ని ఒక గృహస్తుకు దానం చేసినట్లు గ్రామస్థులకు వ్రాసిన లేఖ ప్రతి ఆ గ్రామవాసుల నుండి ఇటీవల లభించినది. దీనిని భద్రాచల దేవస్థానం వారు వాగ్గేయకార ఉత్సవ సంచికలో ప్రచురించారు.[4] అది ఇలా ఉంది.

1.(వరద రామదాసు - రామదాసు చరిత్రము) సింగరదాసు-రామదాసు చరిత్రము పుట 28.

2. భక్త రామదాసు కీర్తనలు (మంచాళ జగన్నాథరావు.సంకలనం) పీఠిక బాలాంత్రపు రజనీకాంత రావు.

3. భద్రాచల క్షేత్ర మాహాత్మ్యము (శ్రీ పి.బి. వీరాచార్యులు) పుట 53.

4. భద్రాచలం - 9వ వాగ్గేయకార మహోత్సవ విద్వత్ సన్మాన సంచిక - 1981-1982, దేవస్థానం ప్రచురణ, పుట. 38 (వాగ్గేయకార మహోత్సవ సంచిక)

"శ్రీరామ ప్రభో ! నేలకొండపల్లి పెద్ద మనుష్యులకు కంచెర్ల గోపన్న వ్రాసుకున్న విజ్ఞప్తి. నేలకొండపల్లిలో మహమ్మాయి దేవాలయము వద్దయున్న మా పూరిల్లు శ్రీ జిన్నాభట్ల సీతారామయ్య గారికి - గృహ దానం చేసినాను . కావున వారిక ఇప్పించ వలసినది.

ఇట్లు

బుధజన విధేయుడు

కంచెర్ల గోపన్న.

పై లేఖ ప్రతి వల్ల కంచెర్ల గోపన్న గారి స్వగ్రామం నేలకొండపల్లి అని స్పష్టమౌతుంది. నేడు నిర్మించిన రామదాసు స్మారక మందిరం కూడా మహమ్మాయి దేవాలయం ప్రక్కనే ఉంది. కనుక రామదాసు గారి స్వగ్రామం నేలకొండపల్లే అనడానికి బలమైన ఆధారాలు లభించాయని చెప్పవచ్చును. నేలకొండపల్లిలో రామదాసు గారి వంశీయులు నేడెవరూ లేకపోవడం శోచనీయం.

## 1.2. రామదాసు గురువు (బాల్యం - విద్యాభ్యాసం) :

గోపన్న చిన్నతనంలో సంస్కృతాంధ్రాలతో పాటు ఉర్దూ, ఫారసీ భాషలు కూడా నేర్చినట్లు కీర్తన సాహిత్యం వల్ల తెలుస్తుంది. తన విద్యా గురువు 'రఘునాథ భట్టరాచార్యు'ల వారని దాశరథి శతకంలోని ఈ పద్యాల వల్ల తెలుస్తుంది.

" ఆర్యులకెల్ల మ్రొక్కి వినతాంగుడనై రఘునాథ భట్టరా
చార్యుల కంజలెత్తి కవిసత్తముల న్వినుతించి కార్య సౌ
కర్య మెలర్ప నొక్క శతకం బొన గూర్చి రచింతు నేడు తా
త్పర్యమునన్ గ్రహింపుమిది దాశరథీ కరుణాపయోనిధీ ![1]

రామా ! ఎల్ల సాధువులకు మ్రొక్కి వినయము గలవాడనై నా గురువగు 'రఘునాథ భట్టరాచార్యులకు దండమిడి వ్యాస వాల్మీకి కాళిదాస నన్నయ భట్టాది కవులను పొగడి, కోరిక దీర నొక్క శతకము జేసి నీకిత్తును, కరుణతో చిత్తగింపుము.

"పట్టితి భట్టరార్య గురు పాదములిమ్మెయి నూర్ధ్వపుండ్రముం
బెట్టితి మంత్రరాజమొడి బెట్టితి నయ్యమకింక రాళికిం
గట్టితి బొమ్మ మీ చరణకంజములందు దలంపు పెట్టి పో
దట్టితి బాప పుంజముల దాశరథీ కరుణా పయోనిధీ"[2]

1. దాశరథీ శతకము (కంచెర్ల గోపన్న ప్రణీతము) పద్యం.6, పుట 8, వావిళ్ల రామస్వామి అండ్ సన్స్, 1967, మద్రాసు,1967.

2. దాశరథీ శతకము పద్యం 102, పుట 77, వావిళ్ల రామస్వామి అండ్ సన్స్ మద్రాసు.

రామా ! భట్టరాచార్యులను గురువుగా జేకొంటిని. దేహమున నూర్ధ్వ పుండ్రము బెట్టితిని. అష్టాక్షరిని సంగ్రహించి యుంచుకొన్నాను. ఇంక నా యమదూతలకు బంగనామము బెట్టితి గదా ! మీ పాదముల మీద దృష్టి నిలిపి పాపముల బాపుకొంటిని.

రామదాసు తాను "రఘునాథ భట్టరాచార్యుల శిష్యుడనని, వైష్ణవం స్వీకరించి, రామ మంత్రోపదేశం పొందితినని తానే స్వయంగా చెప్పుకొన్నాడు. అష్టాక్షరీ మంత్రం "ఓం నమో నారాయణాయ" అనేది. దానిని "రఘునాథ భట్టరాచార్యుల" నుండి ఉపదేశం పొందానని చెప్పుకొన్నాడు. ఈ రఘునాథ భట్టరాచార్యులు ఎవరో తెలుసుకోవలసి ఉంది. దాశరథి శతకంలోని

" శ్రీ రమ సీత గాగ నిజ సేవక బృందము వీర వైష్ణవా
చార జనంబు గాగ విరజా నది గౌతమి వికుంఠము
న్నారయ భద్ర శైల శిఖరాగ్రము గాగ వసించి చేతనో
ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ కరుణా పయోనిధీ "[1]

రామచంద్రా ! శ్రీ మహాలక్ష్మి సీతా రూరుతో నుండగా, నీ సేవకులందరు వీరు వైష్ణవోత్తములు కాగా, విరజా నదిని, గోదావరిగా జేసి వైకుంఠమును భద్రాచలముగా జేసి, యందుండి యెల్ల జీవులను గాపాడు నీవు విష్ణుడవే కని వేఱు కాదు" అనే ఈ పద్యాన్ని బట్టి ఆ కాలంలో వీర వైష్ణవ కుటుంబాలు ఆంధ్ర దేశానికి చేరినట్లు తెలుస్తుంది. "కైఫీయతులను బట్టి దక్షిణ దేశము నుండి 25 వైష్ణవ కుటుంబాల వారు ఆంధ్ర దేశానికి వచ్చిరని, వారు వైష్ణవ మత ప్రబోధం చేస్తూ ఇచటనే స్థిరపడిరనియు తెలియుచున్నదని"[2] కొడాలి లక్ష్మీ నారాయణగారు వివరించారు.

"కమ్మరి వరుస కైఫీయతులను బట్టి, పులివఱ్ఱ కైఫీయతులను బట్టి, తొండమాన్ చక్రవర్తి, శ్రీరంగ రాజ భట్టర్ పేర్లు కనిపిస్తున్నవని, తొండమాన్ చక్రవర్తికి గురుస్వాములు శ్రీ రంగరాజ భట్టార్ అయ్యవార్లుంగారని, శ్రీ రంగరాజ భట్టర్ వంశీకులు బుచ్చిభట్టరు, వరపు రఘునాథ భట్టరులని. . . వీరు క్రీ.శ. 1650 ప్రాంతానికి సంబంధించిన వారని, గోపన్న కూడా ఆ కాలం వాడే అగుట చేత గోపన్న విద్యా గురువు ఈ రఘునాఘ భట్టరులే" అని కొడాలి లక్ష్మీనారాయణ గారు అభిప్రాయ పడ్డారు.[3]

1.దాశరథీ శతకం - పుట 10, పద్యం 20, కంచెర్ల గోపన్న ప్రణీతము, వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్, చెన్నపురి ప్రచురణలు 1967.

2. భద్రాచల రామదాసు చరిత్ర - కొడాలి లక్ష్మీనారాయణ పుట 5, (ఇతిహాస పరిశోధక మాల కుసుమము -55 1977.

3. చూ. పై 2, పుట 6.

రఘునాథ భట్టరుల గురుత్వంలో బాల రామాయణాది కావ్యాలు కూడా చదివాడు గోపన్న వైష్ణవ భక్తిని, ఛందోబద్ధ కవిత్వాన్ని ఈయనే నేర్పి ఉంటాడు. ఇంతలో లింగన్న మంత్రి కీర్తి శేషుడు కావడం జరుగుతుంది కొంత కాలానికి కామమ్మ గోపన్నకు 'కమలమ్మ' అను కన్యను తెచ్చి పెండ్లి చేస్తుంది. దంపతులు చక్కగా సంసారం చేస్తుండగా కామమ్మ చనిపోతుంది. గోపన్న మనసు కుదుట పరచుకొని గృహస్థ జీవనం గడుపుతుంటాడు. దిన దినం భక్తి పెరుగగా భాగవతార్చనం, అతిథి పూజా సత్కారాలు జరుగుతుంటాయి.

## 1.3. రామదాసు తారక మంత్రోపదేశం పొందుట :

ఒకనాడు గోపరాజింటికి కబీరుదాసు వచ్చి, గోపన్న ముఖ లక్షణాలు గుర్తించి, భగవద్భక్తి లక్షణాలుండటం గమనించి కబీరుదాసు గోపన్నకు రామ మంత్రముపదేశించినట్లు రామదాసు చరిత్రము నందు కలదు.

"కబీరు దాసుల కటాక్షమున తాగాంచె రామ నామమును
జపంబు సేయుచు జలజ నయనుని చరణ సేవ నిత్యమును"[1] అను తొహరా వల్ల కబీరుదాసు గోపరాజుకు రామ మంత్రోపదేశం చేసినట్లు తెలుస్తుంది.

కాని గోపరాజెక్కడా తన గురువు 'కబీరుదాసు' అని చెప్పకోలేదు. తన గురువు భట్టరాచార్యులని మాత్రం శతకంలో రెండు పద్యాల్లో చెప్పకున్నాడు. కీర్తనల్లో తన గురువు పేరు ఎక్కడా చెప్పకోలేదు. కబీరుదాసు పేరు కీర్తనల్లో గాని, శతకంలో గాని ఎక్కడా లేదు. సింగరదాస కృత రామదాసు చరిత్రంలోనూ, యాదవదాసు రచించిన రామదాసు చరిత్రంలోనూ, రామదాసు గురువు కబీరుదాసు అనే చెప్పారు. కాని రఘునాథ భట్టరుల విషయం ఎక్కడా చెప్పలేదు.

ధర్మవరం గోపాలాచార్యులు రచించిన రామదాసు నాటకం పీఠికలో "నేను హైదరాబాదు నగరమున చిరకాలము వసించి భద్రాచల రామదాసు చరిత్రను విమర్శించి యున్నాడను. ఈ నాటకము యొక్క కథాభాగము చరిత్ర ననుసరించి యున్నది. రెండు వందల సంవత్సరముల క్రిందట గోలకొండ రాజ్య పాలకుడగు తానాషా కాలమున అక్కన్న అను నియోగి బ్రాహ్మణుడు రాజ మంత్రియై యుండెను. అతనికి గోపన్న మేనల్లుడు. ఇతడు కబీరుదాసు వలన రామ మంత్రోపదేశము బడసినాడు ....[2]" అని వ్రాసిరి.

1. రామదాసు చరిత్ర - సింగరదాసు ., ఎన్.వి.గోపాల్ అండ్ కం., నెం.37, మద్రాసు 1, పుట 19.
2. రామదాసు నాటకము - ధర్మవరము గోపాలాచార్యులు, రామా బుక్‌డిపో , బళ్ళారి, 1946, పుట 1.

"ధర్మవరం గోపాలాచార్యులు" ఈ నాటకంలో కబీరుకు ఎంతటి ప్రాముఖ్యం ఇచ్చాడో ఈ కథను పరిశీలిస్తేనే అర్థమౌతుంది. ప్రథమాంకంలో గోపన్నకు, కబీరుకు మధ్య సంభాషణ కొనసాగుతుంది. కబీరు భద్రాద్రి ఆలయంలోకి ప్రవేశించబోగా ధర్మకర్త రానీయకుండడం, కబీరు, గోపన్నల మధ్య రామ మహిమను గూర్చి, దేవుడి గూర్చిన సంభాషణ, కబీరు రామదాసుకు రామ మంత్రోపదేశం చేయడం, (ఇది కథ) జరిగింది. కబీరుకు ఆలయ ప్రవేశం కల్గించనందున రామాలయంలో విగ్రహాలు అదృశ్యమౌతాయి. ఈ విషయం గ్రహించిన దమ్మక్క(పోకల దమ్మక్క) రామ లక్ష్మణుల విగ్రహాలు అదృశ్యం కావడానికి కారకులైన ధర్మకర్తలను బ్రాహ్మణులను నిందిస్తుంది. కబీరును ఆదరించి ఆలయంలోనికి ప్రవేశింపనీయమని ధర్మకర్తలను కోరుతుంది. కబీరు "రామ్ రహీమ్ ఏక్ హై" అనే నినాదంతో అద్వైత భావాన్ని వ్యక్తం చేస్తాడు. ఆ తర్వాత కబీరు ఆలయంలోకి వచ్చి రాముని కీర్తించగా ఆ రామ లక్ష్మణుల విగ్రహాలు యథా స్థానంలోకి వస్తాయి. కబీరు రామభక్తికి మెచ్చి ఆయనను అచ్చటి ధర్మకర్తలు గౌరవిస్తారు. ఇది ప్రథమాంకంలోని కథ.

ఇక తృతీయాంకంలో మరల కబీరు ప్రవేశిస్తాడు. కబీరు గోపన్నకు 'రామదాసని' బిరుదం ఇస్తాడు. రామదాసు కుమారుడు రఘురాముని కబీరురు గురు దక్షిణగా ఇస్తాడు. కాని ఆయన ఆ బిడ్డను గ్రహించక, వేరొక గురు దక్షిణ స్వీకరిస్తాడు. రామదాసుతే గురు దక్షిణగా కబీరు రఘురాముని ఇస్తాడు.

"రామదాసు కుమారుడు రఘురాముడు చదువుకుంటు బావిపై కూర్చొని ఉండగా, ప్రమాద వశాత్తు, బావిలోపడి, మరణిస్తాడు. అప్పుడు 'రామ కైంకర్యం' జరిగింది. బ్రాహ్మణ సంతర్పణం జరుగుతున్నది. ఆ సంతర్పణానంతరం తన కుమారుని మరణ వార్త విని రామదాసు దుఃఖిస్తాడు. ఆ సమయంలో కబీరు కూడా అక్కడే ఉంటాడు. విషయం తెలిసి కబీరు ఆ బావి చుట్టూ రామధ్యానం చేస్తూ తిరుగుతాడు. అంతట రామదాసు కుమారుడు రఘురాముడు బావిలో నుండి రామ నామ స్మరణ చేస్తూ పైకి వస్తాడు. బ్రతుకుతాడు.

పంచమాంకంలో కూడా కబీరు ప్రస్తావన ఉంది. రామదాసు ప్రభుత్వ ధనంతో భద్రాద్రి రామాలయం నిర్మించిన నేరానికి రామదాసును తానాషా చెరలో పెట్టాడు. ఆ సమయంలో ఒకమారు కబీరు తానాషాను కలుసుకుంటాడు. కబీరు రామదాసు గొప్పతనాన్ని, రామభక్తిని గూర్చి తానాషాకు విన్నవిస్తాడు. అప్పుడు తానాషా "రామదాసుపై తనకు జాలి ఉందని, కొందరి చెప్పుడు మాటలు విని

రామదాసును ఖైదునందుంచానని, ఆయనను రహస్యంగా చెర నుండి విముక్తుని చేయదలచినను, అందుకు ఆయన అంగీకరించడు. కొందరు భద్రాద్రి ఆలయాన్ని మహమ్మదీయ పాఠశాలగా చేసి, రామదాసును విడిపించవలెనన్నారు. ఇది మత విషయం. కావున ఈ పనికి నేనంగీకరింపను" అని దీని గురించి నీవు రామదాసుతో తెల్పగలవు అని రామదాసు విషయం కబీరుతో తానాషా అంటాడు.

చెరలో ఉన్న రామదాసును కబీరు కలుసుకొని "తానాషా నిన్ను రక్షించువాడు" అని చెప్పెను. తానాషా చెప్పిన పై మాటలను కబీరు రామదాసుతో చెప్పగా, రామదాసు కబీరును నిందిస్తాడు. రామదాసు ఖైదు నుండి విడుదలైన తర్వాత రామదాసును తానాషా సభకు సాదరంగా ఆహ్వానిస్తాడు. రామదాసును చూడడానికి కబీరు మరల తానాషా సభకు వస్తాడు. రాముడే రామదాసు అప్పను తీర్చాడని, ఆ రాముని తనకు చూపమని కబీరుతో తానాషా అంటాడు. అప్పుడు కబీరు "నీకు రామునితో పనియేమి. ఆయన మానవుడు. అధర్మ వర్తనుడు. అసత్యవాది. దరిద్రుడు. భక్తులను రక్షింపలేని వాడు. నీవు భూపాలుడవు. రామదాసును మంత్రిగ జేయగలిగిన వాడవు. అతని కొడుకును చక్రవర్తిగా చేయగలవు. అందుకు సర్వ శక్తుడవు" అని తానాషాను నిష్ఠురోక్తులాడుతాడు. అందుకు తానాషా తన తప్పు తెలుసుకొని పశ్చాత్తాప పడతాడు.

తానాషా, రామదాసుల పూర్వ జన్మ వృత్తాంతం గూర్చి ఈ నాటకంలో ఉంది. ఇందు తానాషా మోక్షాభిలాష చేత తపస్సు చేస్తూ, పరమాత్ముడు ప్రత్యక్షమయ్యే సమయాన తపోభంగం గావింప వచ్చిన గంధర్వ స్త్రీని చూసి కాముకుడైనందున భూపాలుడై జన్మించాడు. ఆ శ్రీమహా విష్ణువు వాహనం గరుత్మంతుడే 'కబీరట'. తానాషా భార్య సితారగా గంధర్వ కన్య జన్మించిందట. అహ్మద్ అనేవాడు చిలుక అట. ఈ కట్టు కథను ఎక్కడ నుండి గ్రహించాడో నాటక కర్త.[1]

కబీరు నిజానికి 1455 సంవత్సరం వాడు. రామదాసు 1620-1680 ప్రాంతం వాడు. కబీరు 1552లో పరమపదించాడు. కబీరు మరణించే నాటికి రామదాసు జన్మించనే లేదు. అయినా కబీరుకు రామదాసుకు ఎంతో అవినాభావ సంబంధం ఉన్నట్లు కథ ప్రచారంలో ఉంది. ఇదే కాక మరికొన్ని రామదాసు చరిత్రలందు కూడ కబీరే రామదాసుకు తారక మంత్రోపదేశం చేశాడని ఉంది.

1. ధర్మవరం గోపాలాచార్యులు - రామదాసు నాటకము.

మిన్నికంటి గురునాథ శర్మగారు రామదాసు గురువు కబీరు కాదని నిరూపించే ప్రయత్నం చేశారు. "రామదాసు రఘునాథ భట్టరాచార్యుల వద్ద నామ లింగానంశాసనం, కాళిదాస త్రయం, నాథ పంచకావ్యాల అధ్యయనం పూర్తి చేశాడు".

"రాజ విద్య అని ఉర్దూ కూడా నేర్చుకొని ఉత్తమ కక్ష్యల కృతార్థుడైనాడు. రామదాసు రామభక్తికి, వాల్మీకి రామాయణ గాథ పఠనాసక్తికి గురువు సంతసించాడు. గోపన్నకు ఈ గురువే ఉపనయనం జరిపించాడు. గోపన్న ఆచార్యుల వద్ద చక్కని వైదుష్యాన్ని సముపార్జించి పదునెనిమిది పురాణాలను చదువునెడ బ్రహ్మాండ పురాణంలోని గౌతమీ మాహాత్మ్యం, భద్రాద్రి ప్రభావం పఠించి, భక్తి ప్రేరణము వల్ల ఒకసారి భద్రగిరి కేగి శ్రీరామచంద్రమూర్తిని సందర్శించి వచ్చినాడు".[1]

"గోపన్నకు వైష్ణవం ఇప్పించి, రామ మంత్రోపదేశం చేసింది రఘునాథ భట్టాచార్యులే. నిర్గుణ పరబ్రహ్మ తత్త్వమును కూడా ఉపదేశించెను గోపన్నకు ఈ గురువు"[2] అని గురునాథ శర్మగారు రామదాసు గురువు రఘునాథ భట్టాచార్యులే అని తెలియజేశారు. రామదాసు గురువు కబీరు కాదని నిరూపించే ప్రయత్నం కూడా ఈతడు చేశాడు. వివిధ ఉదాహరణల ద్వారా, కబీరే రామదాసు గురువన్న రచయితలను ఖండించాడు.

"కబీరు దాసుని కటాక్షమున దా గాంచె రామ నామమును" అని నాగండ్ల వరద రామదాసు 1832లో రామదాసు హరికథ యందు చెప్పెను.[3] అయితే క్రీ.శ. 1398. కబీరు కాలం అని ఈతడు చెప్పాడు. రామదాసు కాలం 1620-1680 మధ్య అంటే 17వ శతాబ్దం. కబీరు కాలం 14వ శతాబ్ది ఉత్తరార్థం అని. ఏది ఏమైనప్పటికీ వీరిరువురి కలయిక వీలుపడనిది. 14-15 శతాబ్దాలలోని కబీరు 17వ శతాబ్ది నాటి గోపన్నను కలుసుకోవడం అసాధ్యం.

ధర్మవరం గోపాలాచార్యులు తన "రామదాసు నాటకం"లో కబీరునకు అత్యంత ప్రాధాన్యమివ్వడాన్ని వీరు విమర్శించారు. "కబీరు విక్రమ శకము 1455వ సంవత్సరమున జన్మించెను. అంటే క్రీ.శ.1398. దానికి ఎన్నో ఆధారాలున్నాయి. 260 సంవత్సరాలు కబీరు బ్రతికి ఉండటం అసాధ్యం"[4] అని మిన్నికంటి గురునాథ శర్మగారు అభిప్రాయపడినారు.

1. మిన్నికంటి గురునాథ శర్మ - "కంచెర్ల గోపన్న అను రామదాసు" (విమర్శనాత్మక గ్రంథం), ద్వితీయ ప్రకరణం.
2. " " " తృతీయ ప్రకరణం
3. " " " తృతీయ ప్రకరణం.
4. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ

మరొక ముఖ్య విషయం కబీరు నిర్గుణోపాసకుడు. రామదాసు సగుణోపాసకుడు. వీరిరువురి రామభక్తిలోనూ ఎంతో వ్యత్యాసం ఉంది. కబీరు రాముడు ఆత్మారాముడు. రామదాసు రాముడు దశరథ రాముడు. అయోధ్య రాముడు. కబీరు అవతారాలను నమ్మడు. నిర్గుణోపాసకుడు. రామదాసు రాముడు మానవాకృతి దాల్చిన అయోధ్య రాముడు.

## కబీరు మాటలు ఇవి :

"దునియా ఐసీ బాబరీ, పత్థర పూజ నజాయ్

ఘరకీ చకియా కాహే నపూజైజే నకాపీ సా భాయ్"

లోకము పిచ్చిది. ఎందుకనగా రాతిని పూజించును. గృహమందలి తిరుగలిని ఏల పూజింపరాదు ? అది విసిరిన పిండిని మనము తినుచుంటిమిగా ? అని పై దాని భావము[1]. మరొకచోట "రాతిని బూజించిన భగవానుడు కన్పించినచో నేను బర్వతమునే పూజించెద"[2] అనెను. మరొక చోట కబీరు "రాళ్ళు కంకర ప్రోగు చేసి మసీదును నిర్మించెదరు. పూజారి దానిపై నెక్కి గొంతు పగల నఱచును. భగవంతునకు జెవుడు వచ్చినదా ? యేమి ?"[3] అనెను.

ఈ విధంగా ఆలోచించి విగ్రహారాధనను నిరసించే కబీరు తన శిష్యుడి చేత భద్రాచలమందలి ఆలయ నిర్మాణాదుల కాఱు లక్షల వ్యయము చేయుచుండ చూచుచు మిన్నకుండ గలడా? అని అంటూ కబీరు రామదాసు గురువు కాదని స్పష్టం చేశారు గురునాథ శర్మగారు.[4] కబీరు రామదాసు గురువు కాదనడానికి గురునాథ శర్మగారు ఇచ్చిన ఉదాహరణలే నిదర్శనం. మరొక విషయం - కబీరు మతమునకు , రామదాసు మతమునకు హస్తిమశకాంతరము కలదు. కబీరు కాశీ క్షేత్రమును వదలి 'బస్తీ' మండలంలోని మగహర అను గ్రామానికి వెళ్ళి అక్కడనే విక్రమ శకము 1552లో ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి నాడు క్రీ.శ.1495న పరమపదించెనని "భక్తి సుధా బిందు స్వాదం" అను గ్రంథంలో కలదు. ఆయన కళేబరమును సమాధి చేయ మహమ్మదీయులును, దహనం చేయ హిందువులును, పోరాడి చివరికెట్లో సమాధాన పడిరట ! ఎవరేమి చేసినను క్రీ.శ. 1495లో మృతి చెందినవాడు 17వ శతాబ్ది మధ్యమున రామదాసునకు ఉపదేశింప లేచి వచ్చుట అసంభవము కాదా ?"[5] అని అభిప్రాయపడినారు గురునాథ శర్మగారు.

---

1. మిన్నికంటి గురునాథ శర్మ - కంచెర్ల గోపన్న అను రామదాసు - తృతీయ ప్రకరణం పుట 43. 1935.

2,3. కంచెర్ల గోపన్న అను రామదాసు -మిన్నికంటి గురునాథ శర్మ తృతీయ ప్రకరణం, పుట 43.

4,5. " " " పుట 44

"ఎన్ని జన్మలెత్తగా వలయునో..." అను కీర్తనలో అనుదినమును గురు నుపదేశ యోగము నభ్యసింపనైతింగా " అని గురువు వున్నట్లొప్పకున్నాడు. ఆ గురువు రఘునాథ భట్టాచార్యులని దాశరథీ శతకంలో స్వయంగా గోపన్న చెప్పాడు. ఇందు వైష్ణవం ఇప్పించిన గురువితడే అని చెప్పకొన్నాడు. ఈ విధంగా పై విమర్శనాత్మక పరిశీలనం వల్ల రామదాసు గురువు కబీరు కాదని, రఘునాథ భట్టరాచార్యులేనని స్పష్టమైంది. అయితే ఈ విషయం గ్రహింపలేక వివిధ రామదాసు చరిత్ర గ్రంథకర్తలందరు తమ గ్రంథాలలో కబీరుకు రామదాసుకు మధ్య సంబంధం కల్పించి, కబీరుకు అత్యంత ప్రాధాన్యాన్ని ఇచ్చారు.

"భక్త రామదాసు అను రామదాసు విజయం" (నాటకం) అనే గ్రంథంలో కీ.శే. కేతవరపు శివరామశాస్త్రి గారు కబీరు గురించి ఇలా వ్రాశారు. "కబీరు గోపన్నకు రామ మంత్రోపదేశం చేస్తాడు. రామదాసే కబీరును తనకు రామ మంత్రోపదేశం చేయమని కోరుతాడు. గోపన్న కబీరుకు తన తల్లిదండ్రులు, వంశం పేరు మొదలైన వివరాలు తెలియజేస్తాడు". ప్రథమాంకంలో ఈ వివరాలున్నాయి. తృతీయాంకంలో "గోపన్న కుమారుడు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ దినం నాడు ఒక సంతర్పణ సందర్భంలో వేడి గంజి గుంటలో పడి మరణిస్తాడు. ఆ సమయంలో కబీరు అక్కడికి వచ్చి రామాలయానికి తన కొడుకుని తీసుకొని వెళ్లి రాముని ప్రార్థించమని కబీరు గోపన్నకు సలహానివ్వగా ఆ సలహా మేరకు రామాలయానికి తన బిడ్డను తీసుకొని వెళ్లి రాముని ప్రార్థించగా ఆ బిడ్డ బ్రతుకుతాడు" అని ఉంది. షష్ఠాంకంలో "రామదాసు భార్య శారదాంబను కబీరు కలుసుకోవడం, శారదాంబ రామదాసు ఖైదులో ఉన్న విషయం కబీరుకు తెల్పగా, కొలది రోజుల్లో రామదాసు జైలు నుండి విడుదలై ఆమెను కలుసుకోగలడని కబీరు చెప్పడం, ప్రధానాంశాలు. ఆ తర్వాత రామదాసు ఖైదు నుండి విడుదలై తానాషా కడకు సాదరంగా ఆహ్వానింప బడగా, కబీరు, రామదాసు భార్య శారదాంబలు తానాషా కడకు వస్తారు. కబీరు రామదాసు రామభక్తికి మెచ్చి అభినందిస్తాడు. ఈ విధంగా ఈ నాటకంలో కబీరుకు, రామదాసుకు సంబంధ బాంధవ్యాలు ఉన్నట్లు వ్రాయడం జరిగింది.

రామ నారాయణ కవులు వ్రాసిన "శ్రీ రామదాసు" అనే నాటకంలో కూడా కబీరు ప్రస్తావన ఉంది. ప్రథమాంకంలో "కబీరు వచ్చి మహమ్మదీయుడైనా రామ భక్తుడైన గోపన్నకు రామ మంత్రోపదేశం చేసినట్లుగా" చెప్పబడింది. ద్వితీయాంకంలో "రామదాసు కుమారుడు మరణించగా (మృతికి కారణం చెప్పలేదు) దుఃఖిస్తున్న రామదాసును కబీరు ఓదారుస్తాడు. రామధ్యానంతో రామానుగ్రహంతో తన పుత్రుడు తిరిగి బ్రతుకుతాడు. అప్పడు శ్రీరాముడే రక్షించినా, శిక్షించినా కర్త" ఏ కార్యమైనా ఆయన ఆలోచనలతోనే జరుగుతుంది అని కబీరు అంటాడు. ఆనాటి నుండి గోపన్నను "రామదాసు"గా కబీరు కొనియాడాడు. రామదాసు అని గోపన్నకు నామకరణం చేస్తాడు" అని కబీరు ప్రస్తావన ఉంది.

తృతీయాంకంలోని ఈ కథ ఎక్కడా మనకు కనబడదు. "ఒక మహిషం భద్రాద్రి రామాలయ నిర్మాణం జరుగుతున్న సందర్భంలో, రామునికై తయారు చేయబడిన శయ్యపై పడి దొర్లుచు నానా బీభత్సం సృష్టించగా, ఆ మహిషాన్ని గ్రామస్థులు, తదితరులు తరిమారు. అప్పుడు అక్కడే ఉన్న కబీరు 'మహిష రూపాన శ్రీరాముడే అక్కడకు వచ్చాడని రామదాసుకు కబీరు చెప్తాడు. అది విని అపచారం జరిగెనని రామునికి క్షమాపణ చెప్తాడు రామదాసు. ఇది కట్టు కథ. రామదాసు జైలులో నుండి విడుదలైనప్పడు కబీరు రామదాసును కలవడం ఈ నాటకంలో లేదు.

'భక్తరామదాసు' బుర్రకథను శ్రీ దుగ్గిరాల గౌరీ మనోహర రావుగారు వ్రాశారు. దానిలో కూడా కబీరు రామదాసుకు రామ మంత్రోపదేశం చేసినట్లుగానే చెప్పబడి ఉంది. ఇంతకు మించి ఈ బుర్రకథలో కబీరు ప్రస్తావన లేదు.

గరిమెళ్ళ సత్య గోదావరి శర్మగారు వ్రాసిన 'గోపన్న' అనే గ్రంథంలో కబీరు వచ్చి గోపన్నకు రామ మంత్రోపదేశం చేసి వెళ్లినట్లు గా వ్రాయబడింది.

రామదాసు నాటకం లో రావూ సాహెబు డి. వెంకట రమణయ్య గారు కబీరును గూర్చి ఈ విధంగా వ్రాశారు. " మొదటి అంకంలోని మొదటి రంగంలోని అంశం. కబీరు నేలకొండపల్లిలోని రామ మందిరానికి అందరూ రామభజన చేస్తుండగా వస్తాడు. కబీరు అచ్చటికి రాగా, మహమ్మదీయుని మహాత్ముడుగా భావించడాన్ని కొందరు విమర్శిస్తారు. హిందూ, మహమ్మదీయ భేదం ఎందుకు, అందరికీ దైవమొక్కడే అని రామదాసు అంటాడు. కబీరు గోపన్నకు తారక మంత్రోపదేశం చేస్తాడు. కబీరు గోపన్న రామభక్తికి మెచ్చి ఆశీర్వదిస్తాడు. తక్కిన వారందరు తమ తప్పు తెలుసుకొని ఆయనకు నమస్కరిస్తారు".

రెండవ అంకంలోని కథ. "భద్రాచలంలో గోపన్న కుమారుడు పుట్టిన దినం రోజున ఆ పిల్లవాడి పేరుతో అన్న సంతర్పణ జరిపిస్తాడు. ఆ సమారాధన సందర్భంలో ఆ పిల్లవాడు అకస్మాత్తుగా వేడి గంజి గుంటలో పడి మరణిస్తాడు. ఈ విషయం తెలిసి గోపన్న, తన భార్య దుఃఖిస్తారు. ఐదు సంవత్సరాలు నిండిన బాలుడతడు, కబీరు ఆ సమయంలో అచ్చటికి వచ్చి రామదాసు భార్య భ్రమరాంబ పుత్ర మరణంతో దుఃఖిస్తుండగా రాముని వేడుకోమని కోరుతాడు. అంతట రామదాసు భార్య రాముని ప్రార్థించగా మరణించిన కుమారుడు పునర్జీవితుడౌతాడు. ఆనాటి నుండి గోపన్న రామదాసుగా ఖ్యాతి చెందాడు. గోపన్న రామభక్తిని అందరు కొనియాడారు. ఈ నాటకంలో కబీరుదాసును గురించిన ప్రస్తావని ఇది.

"రామదాసు చరిత్రము" అనే హిందుస్థానీ నాటకంలో కబీరును గూర్చి నాదెండ్ల పురుషోత్తమ కవి వ్రాశాడు. అయితే ఇందులో కబీరు అనే పేరుకు బదులుగా కపీరు అని ఉంది. కపీరు రామదాసుకు రామ మంత్రోపదేశం చేసాడని రాయబడి ఉంది. ఈ కపీరు కబీరు వంశానికి చెందినవాడై ఉండవచ్చు. కపీరు, కబీరు శబ్దానికి అర్థం ఒకటేనా కాదా అని నిర్ధారించడం కష్టం. ఈ ఒక్క విషయమే కబీరు (కపీరు) గురించి ఉంది.

"రామదాసు చరిత్రము" (కావ్యము) అనే దానిలో చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు కూడా కపీరుదాసు రామదాసుకు రామ మంత్రోపదేశం చేసినట్లుగా వ్రాశారు.

"శ్రీరామదాస నాటకము" అనే కేశిరాజు వేంకట సుబ్బారాయ కవి గారి ఈ రచనలో కబీరు ప్రస్తావన లేనే లేదు. రామ మంత్రోపదేశం కబీరుదాసు చేసినట్లు లేదు. రామదాసు తారక మంత్రోపదేశం పొందడం అనే అంశం ఈ నాటకంలో అసలు ప్రస్తావింపబడలేదు.

తిరుక్కడయూరి కృష్ణదాసు రచించిన భద్రాచల రామదాసు చరిత్రము అనే యక్షగానంలో కబీరు గూర్చి ఈ విధంగా తెలియజేశాడు. " రామదాసు 20 ఏండ్ల ప్రాయంలో గోపన్నకు కబీరుదాసు రామ మంత్రోపదేశం చేస్తాడని చెప్పబడింది. కబీరు పాడిన ఒకటి రెండు పాటలను కూడా ఉదహరించాడు ఈ యక్షగానంలో కృష్ణదాసు.

**రాగం - హిందుస్థానీ - కపీ - ఏకతారం**

*'నహీ భరోసాయి నతన ధనకా రామ నామ ముఖబోలేరే ॥నహీ ॥*
*జోరు లడకే దవతల దునియామాయా మృగ జల సరనారే ॥ నహీ ॥*
*ఫుతాయె చీడియా లేగుయెు శఖరా వైసా జమ కాఫా సారే ॥ నహీ ॥*
*కహత కబీరు సునోబై సాధు దేఖత కాలత మషారే ॥ నహీ ॥*[1]

రామనామాన్ని నిరంతరం జపించమని, ఈ తనువు అశాశ్వతం అయినందున భగవన్నామ స్మరణం ద్వారా మోక్షం పొందమని అంటాడు కబీరు. అయితే ఇక్కడ కబీరు రాముడు ఆత్మారాముడే కాని, నిరాకార నిర్గుణ స్వరూపుడైన రాముడే కాని, అయోధ్య రాముడు కాదు. నిర్గుణోపాసకుడైన రామభక్తుడు కబీరు. ఈ కబీరు సగుణోపాసకుడైన రామదాసుకు రామ మంత్రోపదేశం చేసాడని ఇందులో ఉంది.

1. భద్రాచల రామదాసు చరిత్రము (యక్షగానము) తిరుక్కడయూరి కృష్ణదాసు. పుట 13.

కబీరు రామదాసుకు ఉపదేశించిన మంత్రం ఇది

" శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే

సహస్ర నామ తత్తుల్యం రామ నామ వరాననే "[1] అనే శ్లోకాన్ని కబీరు రామదాసుకు ఉపదేశించాడు. అని కృష్ణదాసు యక్షగానంలో వ్రాయబడి ఉంది. "కబీరు పాడిన మరో కీర్తన ఈ యక్షగానంలో ఉంది. కబీరు రామదాసుకు ఈ కీర్తనల గురించి ఇలా తెలియ బరచాడు.

**బ్యాగ్ రాగము - జాలై తాళము**

*జంకా అజప్తడా కాటేతుం క్యాజాన్ లడకాటే* *॥ జంకా ॥*

*నౌజీ మరగయె దనజీ మరగయె మరగయె శాస్త్ర అధ్యాసీ* *॥ జంకా ॥*

*తెత్తిన కోటీ దేవ తామర గయె ఫడీ కాలకీ పాశా* *॥ జంకా ॥*[2]

ఈ కీర్తనల తాత్పర్యం ఇది . హే సాధు సత్తమా ! ఈ కీర్తనలోని తాత్పర్యం ఏమనగా యముని యొక్క దెబ్బ యెవ్వరికిని తప్పదు. ఆస్తంబ బ్రహ్మ పర్యంతము యెనబది నాలుగు కోట్ల జీవ రాశులును కాలుని పాశముల కట్టుబడియున్నవి గాన నటుల గాక చావుంబుట్టువు లేని పదవిం జెంద గోరితివేని త్రిలోకారాధ్యుండు, గజేంద్రుండునునైన శ్రీరామ మూర్తిని యితర విచారంబులం బోదోలి భజియింప వలయునని ఫలీ భూతార్థము గావున.

*"ఎన్ని పనులు నీకుండిన దగ నన్నాక్షించితివిది మొదలు*

*పన్నుగ శ్రీరఘు రామ రామయని పల్కుట రేయింబవలు"*[3] అని రామ నామం పల్కమని అంటూ ఇలా రాముని కీర్తిస్తాడు. ఈ కీర్తనలో తన రాముడు ఆత్మారాముడని చెప్పకొంటాడు కబీరు.

**రాగము - హిందూస్థానీ కాపి - చాపు తాళం**

"హరి బోలో హరి బోలో హరి బోలో భాయీ

హరి నామ బోలె వాహకు రామ దురాయీ ॥ హరి ॥

హరికే భజన పతసబ కామ కరనా

సంసార సాగర పావు తరనా ॥ హరి ॥

సబరామ లేతు సబిరి నాలాగే

హరి నామ లేతు కవరిన లాగె ॥ హరి ॥

కహత కబీర సునో భాయి సాధు

సబఘట "ఆత్మారామ" గోవిందు ॥ హరి ॥[4]

1,2. భద్రాచల రామదాసు చరిత్రము -తిరుక్కడయూరి కృష్ణదాసు పుట 13.

3,4. భద్రాచల రామదాసు చరిత్రము - తిరుక్కడయూరి కృష్ణదాసు పుట 14.

ఆత్మారాముని సేవించమని, ప్రార్థించమని అన్నాడే కాని అయోధ్య రాముని ప్రస్తావన ఇక్కడ లేదు. మరి అటువంటి కబీరు నిర్గుణోపాసకుడు గోపన్నకు రామ మంత్రోపదేశం చేశాడని కృష్ణదాసు వ్రాశాడు.

గోపన్న గురు దక్షిణగా కబీరునకు ఏమి చెల్లించవలెనో అని భావిస్తాడు. తన జన్మ రామ మంత్రోపదేశంతో చరితార్థమైనట్లుగా గోపన్న భావిస్తాడు.

"అనిన నవ్వి యా గోపన గారికి నాతడిట్లులనెను
ఘనమతి నన్ను కబీరని చెప్పడ రనయము భువిలోను"[1] అని కబీరు తన పేరని గోపన్నకు చెప్తాడు ఇంకను,

" గోపన్న లేచి యా వనజాక్షుని దాసునకున్
మనమలరగ సాష్టాంగ వందనము మనసు చలింపక చేసెన్
చేసి కబీరున శిరము జేయిడి యిట్లనె గోపనగారు
వేసటకై నను రామునేమర వివేక మొసగినారు"[2] అని రామ నామాన్ని ఏమరక నిరంతరం ధ్యానిస్తు స్మరిస్తూనే ఉంటానని కబీరునకు గోపన్న ప్రమాణం చేయడం ఇందులో స్పష్టమౌతుంది.

కబీరు నాజ్ఞను దాటక గోపన కమలాక్షుని బాడుచును . . ."[3] అని రాశాడు. కబీరు, రామదాసుకు రామ మంత్రోపదేశం చేశాడని ఇందు చెప్పడం జరిగింది. కాని కబీరు రామదాసుకు తారక మంత్రోపదేశం చేయలేదని గురునాథ శర్మగారి చర్చలో తేలింది. ఇందులో కబీరు కీర్తన ద్వారా కబీరు రాముడు ఆత్మారాముడని స్పష్టమైంది. కావున విగ్రహారాధన చేసే గోపన్నకు కబీరు రామ మంత్రోపదేశం చేయడం అసమంజసం.

సింగరదాసు రచించిన రామదాసు చరిత్రము యక్షగానంలో " ఈ ప్రకారముగా కబీరుదాసుగారు గోపన్నకు రామ నామమును బఠించుచు నుండుమని రామ మంత్రంబు చెప్పి, యథేచ్ఛం జనువాడై. . ."[4] అని కబీరు గోపన్నకు రామ మంత్రోపదేశం చేశాడని వ్రాయబడింది. కాని ఇది సత్యం కాదు. రఘునాథ భట్టాచార్యులే రామదాసు గురువు. వైష్ణవం ఇప్పించింది కూడా ఈతడే. దానికి దాశరథీ శతకమే సాక్ష్యం. కొందరు విమర్శకులు, చరిత్రకారులు ఈ రామదాసు గురువు ఎవరన్న విషయంపై తెలియజేసిన అంశాలను గురించి ప్రస్తావించ వలసి ఉంది.

1. భద్రాచల రామదాసు చరిత్రము - తిరుక్కడయూరి కృష్ణదాసు పుట 14.
2. " " " పుట 15.
3. " " " పుట 18.
4. సింగరదాసు - రామదాసు చరిత్రము (బలుసు వెంకట రమణయ్య గారిచే పరిష్కృతము ) పుట 51.

ఆరుద్ర "గోపన్న రఘునాథ భట్టాచార్యుల వద్ద వైష్ణవ మతం స్వీకరించాడు. తారక మంత్రోపదేశం చేసినవాడు కబీరు[1] అని తెలియజేశారు. కాని ఉన్నది ఒక్క గురువే. రామ మంత్రోపదేశం చేసింది, వైష్ణవం ఇప్పించింది , తదితర విద్యలు నేర్పింది రఘునాథ భట్టాచార్యులే. కబీరు రామ మంత్రోపదేశం చేయలేదు.

బాలాంత్రపు రజనీకాంత రావుగారు "కబీరు పంథాకు చెందిన ఫకీరు ద్వారా గోపన్న తారక మంత్రోపదేశం పొందినప్పుడు సంతోషం పట్టజాలక పాడిన కీర్తన.

**ధన్యాసి రాగం - ఆది తాళం**

*తారక మంత్రము కోరిన దొరికెను - ధన్యుడనైతిని ఓరన్నా* ( క్రీశ. 117) అని భక్త రామదాసు కీర్తనలు పీఠికలో[2] పేర్కొన్నారు. ఈ పీఠికలోనే ఇంకా ఇలా తెలియజేశారు రజనీకాంత రావుగారు. "కంచెర్ల గోపన్న స్వగ్రామం తెలంగాణాలోని నేలకొండపల్లి. గోపన్న వంశస్థులిప్పటికీ ఆ గ్రామంలో నివసిస్తున్నారు. లింగనమంత్రి, లక్కమాంబా అతడి తండ్రి, తల్లీ, రఘునాథ భట్టరు అనే గురువుల ద్వారా నారాయణ మంత్రోపదేశమూ, వైష్ణవ ప్రపత్తీ కలిగాయి. ఇంటిలో నిత్య దేవతార్చనా, సంకీర్తన గోష్ఠులూ, సాధు సంతర్పణా, ఆలయంలో పురాణ శ్రవణం ఇత్యాది కుటుంబ సాంప్రదాయిక వాతావరణంలో గోపన్నకు భక్తి తత్పరత బాల్యంలోనే మనస్సులో నాటుకొంది. ఇలా ఉండగా ఉత్తరాది నుంచి యాత్రలలో వచ్చిన కబీరు పంథకు చెందిన ఒక ఫకీరు గోపన్నకు ఒకనాడు తారక మంత్రోపదేశం చేశాడు"[3] అని వ్రాశారు.

ఇందులో రామదాసు వంశస్థులు ఇప్పటికీ ఆ నేలకొండపల్లి గ్రామంలో నివసిస్తున్నారని రజనీకాంత రావుగారు అభిప్రాయ పడగా, దాశరథుల బాలయ్య గారు ఈనాడు ఆ కంచెర్ల వంశస్థులు ఎవరూ నేలకొండపల్లిలో నివసించుట లేదని తమ సిద్ధాంత గ్రంథం "భక్తరామదాసు - జీవితము - రచనలు" అనే దానిలో పేర్కొన్నారు.

మరో ముఖ్య విషయం. రఘునాథ భట్టరుడు నారాయణ మంత్రోపదేశం చేసిన గురువుగాను, కబీరు పంథకు చెందిన ఫకీరు రామ మంత్రోపదేశం చేసిన గురువుగాను గోపన్నకు ఇరువురు గురువులున్నట్లు అభిప్రాయ పడినారు రజనీకాంతరావు గారు. ఇది పరిశీలించదగిన ముఖ్యాంశం.

1. సమగ్రాంధ్ర సాహిత్యము - ఏడవ సంపుటము - ఆరుద్ర (నాయక రాజుల యుగం).
2. భక్త రామదాసు కీర్తనలు (పీఠిక - బాలాంత్రపు రజనీకాంతరావుగారు)
   సంకలనం దాశరథుల బాలయ్య, పుట 7, 1993, జనవరి.
3. " " పుట 7. "

"భద్రాచల దేవస్థాన హరిదాసులైన శ్రీ బుంహ్వా వరపు వెంకట నరసింహా దాస్ భాగవతార్, శ్రీ శేషం రాధాకృష్ణమూర్తి భాగవతార్ మొదలగువారు రామదాసు గారి గురువు కబీరుదాసు అనియే హరికథల్లో చెపుతూ ఉంటామని, వారి తాత ముత్తాతల నుండియు అలాగే చెపుతూ వస్తున్నామనియు"[1] దాశరథుల బాలయ్య గారితో సెలవిచ్చారు" అని బాలయ్య గారు పేర్కొన్నారు. అయితే కబీరు శిష్యుల్లో ప్రథముడు కమాల్, వీరు గాక పద్మనాభ, తత్త్వం, జీవ, జ్ఞాని, జగదాస్, రామ కృపాల్ మొదలగు ప్రభృతుల పేర్లున్నవి. కాని రామదాసు పేరు లేదు.[2]

"కబీరుదాసు మరణించు నాటికి రామదాసు జన్మించనే లేదు. కనుక రామదాసు గురువు కాశీ వాసియైన కబీరుదాసు కాకపో వచ్చును. రామదాసు కంటె కబీరు చాలా పూర్వుడు. కబీరు శిష్య పరంపరలోని వారెవరైనా ఈయనకు రామ మంత్రోపదేశము చేసినట్లు చెప్పకోవచ్చును. అదే అభిప్రాయంతో నారుమంచి సుబ్బారావు గారు కూడా ఏకీభవిస్తూ 'మహాత్మా కబీరు' అను మహమ్మదీయ భక్తాగ్రేసరుని శిష్య పరంపరలోని ఒక కబీరు నేలకొండపల్లి వచ్చి గోపన్నయందు భాగవత లక్షణములు గమనించి రామ తారక మంత్రముపదేశించి 'రామదాసు' అని పేరిడి వెడలిపోయెను"[3] అని వ్రాసిరి.

సింగరదాసు రచించిన 'రామదాసు చరిత్ర' ప్రాత ప్రతిలో (1916) రామదాసు గారి గురువు 'కబీరు దాసు' అని కలదు.[4] కపీరుదాసుల కటాక్షమున తాగాంచె రామ నామమును జపంబు సేయుచు జల జనయనుని చరణ సేవ నీమమును. ఇట్లే మరి మూడు చోట్ల కపీరు శబ్దమే వాడబడినది. కాని కబీరు శబ్దము వాడబడలేదు. పై తోహరాలో కపీరు శబ్దమే సరియైనదని తోచుచున్నది. ప్రాస నియయానికి 'కపీరు' శబ్దం సరిపోయినది. 'కబీరు' శబ్దము ప్రాస భంగము కలిగించుచున్నది".

"జనవాడుకచే కపీరు శబ్దము కబీరు శబ్దముగా మారే అవకాశము కూడా ఎంతయో కలదు. కనుక మనము చెపుతూ వచ్చిన కబీరు శిష్య పరంపరలోని వాడైన ఈ కపీరే రామదాసునకు మంత్రోపదేశము చేసెనోయేమో తెలియదు. దీనికి చరిత్ర చెప్పే ఆధారమేమి లేదు. కనుక రామదాసు గారికి తారక మంత్రోపదేశము చేసినది కాశీ వాసియైన కబీరు కాడని, కబీరు శిష్య పరంపరలోని

1. భక్త రామదాసు జీవితము-రచనలు -దాశరథుల బాలయ్య 1985 ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం. ఉస్మానియా విశ్వ విద్యాలయం. (రామదాసు జీవితము రెండవ అధ్యాయం).
2. కబీరు - డా॥ పరస్‌నాథ్ తివారి, తెనుగు సేత డా॥ అమరేంద్ర, పుట 39.
3. శ్రీ భద్రాచల రామదాసు జీవిత సంగ్రహము - నారుమంచి సుబ్బారావు, పుట 8, సీతారామ గానసభ, తెనాలి, 1967.
4. రామదాసు చరిత్ర - సింగరదాసు నాగప్ప నాయకర్ పుట 20, 1996, మద్రాసు.

ఎవరో ఒకరు మంత్రోపదేశము చేసిరని చెప్పకొనుట సమంజసముగా తోచుచున్నది"[1] అని దాశరథుల బాలయ్యగారు తమ సిద్ధాంత వ్యాసంలో నిరూపించే ప్రయత్నం చేశారు. కాని ఈ కపీరు కబీరు శబ్దపరమైన మార్పే కాని, కపీరు కబీరు ఒకటేనని భావించవచ్చును. కబీరు వంశం వారుగాని, ఆయన శిష్య పరంపరలో ఎవరైనా కాని గోపన్నకు రామ మంత్రోపదేశం చేయలేదు. కారణం కబీరు శిష్యులు కూడా కబీరు వలె నిర్గుణోపాసకులే అయి ఉంటారు. అందుకే కబీరు పంథాకు చెందినవారు సగుణోపాసకుడైన గోపన్నకు తారక మంత్రోపదేశం చేయడానికి అవకాశం లేదు అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

డా॥ ఎస్. గంగప్పగారు " గోపన్నకు వైష్ణవ మిచ్చిన గురువు రఘునాథ భట్టాచార్యులని"[2] వ్రాశారు.

"శతక సంపుటము"న రామదాసుకు శ్రీరఘునాథ భట్టాచార్యులచే రామ మంత్రోపదేశమై, వైష్ణవము దీక్ష పొందెను అని రామ తారక మంత్రోపదేశమైనపుడు ఆనందంతో "తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా" అనే కీర్తన పాడాడు[3] అని వ్రాయబడి ఉంది. "ప్రముఖ వాగ్గేయకారులు" అనే పుస్తకంలో గోపన్న గూర్చి వ్రాస్తు రచయిత జి. కృష్ణ "రామభక్తుడు కదా ఇతడు. అందువలన వైష్ణవ మతం స్వీకరించాడు. నేలకొండపల్లి సమీపంలో నాయకులగూడెం అనే ఊరు ఉంది. అక్కడ రఘునాథ భట్టరు అనే వైష్ణవ స్వామి అతడిని వైష్ణవ మతంలో చేర్చాడు. వైష్ణవ మతం స్వీకరించిన నాటి నుండి గోపన్న అనే పేరుకు మారుగా, 'రామదాసు' అనే పేరు వచ్చింది[4] అని తెలియజేశారు. అంతేకాక "రామదాసు కబీరుకు శిష్యుడనే విశ్వాసం. ఆయన కబీరును కలిశాడనే విశ్వాసం ప్రజలలో ఉంది . కాని ఇది అసాధ్య విషయం"[5] అని కబీరు రామదాసు గురువు కాదని స్పష్టం చేసారు.

బాలాంత్రపు రజనీకాంత రావుగారు 'ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము' అనే తమ గ్రంథంలో మాత్రం రామదాసు గురువు కబీరా, కాదా ! అనే సంశయాన్ని వ్యక్తం చేశారు. రామదాసు చరిత్రలలో ఉన్న అంశాన్నే వీరూ పేర్కొన్నారు. ఆయన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశారు. "గోపన్న ఇంట్లో

---

1. భక్తరామదాసు జీవితము -రచనలు దాశరథుల బాలయ్య - ఎం.ఫిల్ 1985
2. తెలుగులో పద కవిత - డా॥ ఎస్. గంగప్ప పుట 80-82
3. శతక సంపుటము - చెన్నపురి వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ 1926.
4. ప్రముఖ వాగ్గేయ కారులు - జి. కృష్ణ పుట 21.
5. ప్రముఖ వాగ్గేయ కారులు - జి. కృష్ణ పుట 21.

ఎల్లప్పుడు భజన గోష్ఠులు, భాగవత సత్కారమూ జరుగుతూండేవి. తన భక్తి కవితలలో, వేదాంత కీర్తనలతో ఉత్తర హిందూస్థానం ఉర్రూతలూగించిన కబీర్‌దాస్ ఇతని గ్రామానికి వచ్చి, ఇతనికి రామ మంత్రోపదేశం చేశాడని, రామదాసు చరిత్ర హరికథలో ఉన్నది. ఈ సందర్భంలోనే గోపన్న 'తారక మంత్రము కోరిన దొరికెను' అనే కీర్తన రచించాడు"[1] అని అభిప్రాయం వ్యక్తం చేశారు. రజనీకాంత రావుగారు రామదాసు గురువు రఘునాథ భట్టరాచార్యులేనని స్పష్టంగా చెప్పలేదు. కబీరు లేక కబీరు అని, కబీరు శిష్యులలో ఒకరువరైనా కాని రామదాసుకు రామ మంత్రోపదేశం చేసి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారే కాని, రఘునాథ భట్టరాచార్యులని తెలియజేయలేదు. శ్రీ కె.వి.భూపాలరావుగారు (మాదన్న ట్రస్టు వ్యవస్థాపకులు) అక్కన్న, మాదన్నలు కుతుబ్షాహీ రాజుల పరిపాలనా వ్యవస్థ గురించి విస్తృతంగా పరిశోధన చేశారు. ఆయనతో నేను గోపన్న గారి గురించిన కొన్ని విషయాలు గూర్చి ప్రస్తావిస్తూ వారిని గోపన్న గురువు ఎవరని అడుగగా వారిచ్చిన సమాధానం ఇది.

"రామదాసు కాలం 16-17 శతాబ్దుల మధ్య . కబీరుది 13వ శతాబ్దం. కావున కబీరు వచ్చి రామదాసుకు తారక మంత్రోపదేశం చేసే అవకాశం లేదు. కబీరు మఠాధిపతులెవరైనా ఉంటే వారు వచ్చి ఆ కాలంలో రామదాసుకు తారక మంత్రోపదేశం చేసి ఉంటారు అని ఊహించవచ్చును. అయినా దానికి దాఖలాలు లేవు"[2] అని చెప్పారు. వారి అభిప్రాయంలో కూడా కబీరు రామదాసు గురువు కాడని స్పష్టం అయింది. ఇంకను రామదాసు గురువు శ్రీరంగ భట్టరాచార్యులు అని తానే స్వయంగా చెప్పకున్నాడు కావున కబీరు రామదాసుకు గురువు కావడానికి వీలు లేదని కె.వి.భూపాలరావు గారు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

కవిరాజ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు కూడా "భద్రాచల రామ చరితము" అనే కావ్యంలో రామదాసుకు కబీరు రామ మంత్రోపదేశం చేసినట్లు వ్రాశారు. (పంచమాశ్వాసం).

"కొత్త సంగీత విద్యా దర్పణము" అనే గ్రంథంలో శ్రీ ఏకా సుబ్బారావుగారు రామదాసు గురువు గురించి ఈ విధంగా తెలియజేశారు. "రామదాసుకు భక్తులగు రఘునాథ భట్టరాచార్యులు గారును, పిదప కబీరుదాసుగారు తమ యింటికి వచ్చి వీరి భక్తికి సంతసించి శ్రీ రామ తారమ క మంత్రముపదేశించి వెడలి పోయిరి" అని వ్రాశారు. రామదాసుకు ఇరువురు గురువులు లేరు. వైష్ణవం ఇప్పించినది, రామ మంత్రోపదేశం చేసింది ఒకరే. అతడే రాఘునాథ భట్టాచార్యులు. కబీరు,

1. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - పుట 198-199 బాలాంత్రపు రజనీకాంత రావుగారు.

2. కె.వి. భూపాలరావు గారితో పరిచయ కార్యక్రమం. (వ్యవస్థాపకులు, మాదన్న ట్రస్టు), ముఖాముఖి.

రఘునాథ భట్టరాచార్యులు ఇరువురును గోపన్నకు తారక మంత్రోపదేశం చేసినట్లు, చెప్పిన ఏకా సుబ్బారావుగారి అభిప్రాయం చరిత్ర సత్యం కాదు. కబీరు రామదాసుకు తారక మంత్రోపదేశం చేయలేదు. ఇది స్పష్టం.

"భారత సంగీత ఇతిహాసము" అనే గ్రంథంలో రామదాసుకు రఘునాథ భట్టరాచార్యులు వైష్ణవం ఇప్పించి శ్రీ రామ తారకం ఉపదేశించినాడు"[1] అని ఉంది. మొదట ఇతడు శైవుడు. శ్రీ వేదం వెంకటరాయ శాస్త్రిగారు గోపన్నకు రామ మంత్రోపదేశము చేసిన గురువు గూర్చి ఈ విధంగా తెలియజేశారు.

"హిందూ మహమ్మదీయ మతాభిప్రాయములు మేళవించి వేదాంతము ప్రబలియుండిన దినములవి. రామ రహీముగా దైవ ప్రార్థనలు సలుపు కాలము. కబీరు పంథాకు చెందిన ఒక వ్యక్తి గోపన్నకు రామ మంత్ర ప్రభావమును తెల్పెను. అది మొదలు గోపన్నగారు నిరంతరం భజనయందు, భద్రాద్రి దేవుని సేవయందు కాలము గడుపుచుండెను"[2] అని వ్రాసిరి.

హిందూ ముస్లిం సమైక్యత గూర్చి ప్రస్తావిస్తూనే ఈ రామదాసు చరిత్రములందు, విమర్శన గ్రంథములందు అన్నింటను కబీరు, రామదాసులకు ఐక్యత గూర్చే ప్రయత్నం చేశారు. బహుశా "రామ్ రహీమ్‌లకు అభేదాన్ని చెప్పడానికే ఈ కబీరును రామదాసును ఏకం చేసి ఉంటారీ గ్రంథకర్తలందరు. పైగా నాటకాలు, యక్షగానాలు, కావ్యాలు అన్నింటిలోనూ ఈ రామదాసు చరిత్రమును రాసిన గ్రంథకర్తలందరూ హిందూ ముస్లిం ఐక్యతా భావాన్ని ప్రదర్శించారు. అందకే కబీరు రామదాసుకు రామ మంత్రోపదేశం చేసినట్లు రాశారు. భారతీయ సంస్కృతిలో అన్ని మతాలు ఒకటేనన్న లౌకిక వాదాన్ని స్థిర పరచడానికి ఈ విధంగా రాసి ఉంటారని అనవచ్చును. అంతేకాని కబీరు, రామదాసుకు తారక మంత్రోపదేశం చేసి ఉండడం నిజం కాదు. వేదము వేంకటరాయ శాస్త్రిగారు మాత్రం "కబీరు పంథాకు చెందిన ఒక వ్యక్తి" రామదాసుకు తారక మంత్రోపదేశం చేశారని వ్రాశారు. ఇదీ నిజం కాదనే నా అభిప్రాయం.

"బాలల విజ్ఞాన సర్వస్వం" అనే గ్రంథంలో గోపన్నగారి గూర్చి రాస్తూ ఆయన గురువు గురించి అందులో ఈ విధంగా తెలియజేయబడింది. "కబీరు దాసు కొందరు భక్తులతో కలిసి

1. భారత సంగీత ఇతిహాసము - ఆంధ్ర సంగీతము - ప్రథమ భాగము -మంగిపూడి రామ లింగ శాస్త్రి.

2. అక్కన్న - మాదన్నల చరిత్ర - వేదము వెంకట రాయ శాస్త్రి. పుట 80-82 (1951).

భద్రాచలం వెళ్ళాడని, అక్కడ దేవాలయ ధర్మ కర్తలు కబీరు మహమ్మదీయుడనియు, ఆలయ ప్రవేశం చేయనీయక పోవడం వల్ల, రాముడు అంతర్ధానం అయినాడని, ఆ తర్వాత కబీరు రామభక్తి తెలుసుకొని ఆయనను ఆలయ ప్రవేశం చేయనివ్వగా రాముడు యథా ప్రకారం ఆలయంలో దర్శనమిచ్చాడని స్థానిక గాథ. ఆయన రామ భక్తికి మెచ్చిన రామదాసు కబీరు వద్ద రామ మంత్రోపదేశం పొందాడని కథనం ఉంది"[1] అని రాస్తూ, ఇది బహుశా కల్పిత గాథ అయి ఉండవచ్చన్న సంశయం వ్యక్తం చేయబడింది.

"రామదాసు కీర్తనలు" పీఠికలో రజనీకాంతరావుగారు రామదాసు గురువు, వైష్ణవమిచ్చిన గురువు రఘునాథ భట్టాచార్యులు"[2] అని రాశారు. తారక మంత్రోపదేశం చేసిన గురువు ఇతడే అని మాత్రం ఈ పీఠికలో చెప్పలేదు. "భక్త కవి పుంగవులు" అనే గ్రంథంలో కబీరు రామదాసుకు తారక మంత్రోపదేశం చేసిన గురువు అని, రఘునాథ భట్టరాచార్యులు వైష్ణవం ఇచ్చిన గురువు అని"[3] ఇరువురు గురువులు గోపన్నకు ఉన్నట్లు రాయబడింది. ఇతడి అభిప్రాయం కూడా సత్యం కాదు. కబీరు గురువు కాదు.

"సంగీత ప్రపంచమునకు మూల విరాట్టులనదగిన నారాయణ తీర్థులు, సిద్ధేంద్ర యోగి, క్షేత్రయ్య, కబీరులకు రామదాసు సమకాలికుడు"[4] అని శ్రీమతి పండా శమంతక మణి గారు అభిప్రాయ పడ్డారు.

కబీరు రామదాసు సమకాలికుడన్నది మాత్రం పూర్తిగా చారిత్రకంగా అసత్యం. కబీరు తప్ప తక్కిన వారు కొంతవరకు సమకాలికులని చెప్పవచ్చు. కబీరు ది14 వ శతాబ్దంఉత్తరార్థం. రామదాసు17 వ శతాబ్దంవాడు. ఇరువురి మధ్య ఎంతో కాలవ్యత్యాసం ఉంది.

రామదాసు గురువు రఘునాథ భట్టారకుని గూర్చి శ్రీ నిడదవోలు వెంకటరావు గారు " ఈ రఘునాథ భట్టరాచార్యుడు కులశేఖర మహీపాల చరిత్రము అను వైష్ణవప్రబంధము రచించిన

1. బాలల విజ్ఞాన సర్వస్వము - సంస్కృతి విభాగం , సం : బుడ్డిగ సుబ్బరాయన్ పుట. 134.
2. రామదాసు కీర్తనలు - మంచాళ జగన్నాథరావు గారు పీఠిక - రజనీకాంతరావు.
3. భక్తకవి పుంగవులు - పులాభొట్ల వెంకటేశ్వర్లు.
4. తెలుగు సాహిత్యములో రామకథ - శ్రీమతి పండా శమంతక మణి 1972, పుట 271.

శేషం రఘునాథాచార్యుడని ఒక వ్యాసమున నిరూపించి యుంటిని".[1] అని పేర్కొన్నారు.

శ్రీ పి.సాంబమూర్తి గారు "రామదాసు గురువు కబీరు కాదని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. అందుకు ఈ వాక్యాలే నిదర్శనం".

" Since Kabir Das lived about 200 years before Ramadas, the probability is that Kabir Das appreared to Ramdas in dream and gave him the Upadesa. . . ."

రామదాసుకు 200 సంవత్సరాలకు పూర్వుడైన కబీరు గోపన్నకు బహుశా కలలో కనబడి రామ మంత్రోపదేశం చేశాడేమో ! అని అభిప్రాయ పడినారు పి. సాంబమూర్తి గారు. ఇది నిజం కాదని, రామదాసు గురువు కబీరు కాదని స్పష్టం చేశారు. ఇంకా ఇలా అన్నారు సాంబమూర్తిగారు.

" kabir Das lived from 1440-1511 A.D and so as already pointed out he could not have physically met Ramadas and give him the Upadesa of the Taraka mantra".[3]

కబీరుదాసు క్రీ.శ. 1440-1511 ల మధ్య జీవించిన వాడు. రామదాసు కాలం 1620-1690 రామదాసుకు కబీరు మంత్రోపదేశం చేసే అవకాశం లేదు. ప్రత్యక్షంగా కబీరు రామదాసును కలుసుకునే అవకాశం లేనేలేదు. కలుసుకోలేదు. తారకమంత్రోపదేశం చేయలేదు" అని స్పష్టం చేశారు సాంబమూర్తిగారు. అయితే సాంబమూర్తి గారు "రఘునాథ భట్టాచార్యుల గూర్చి ఎక్కడా చెప్పలేదు". కబీరు రామదాసు గురువు కాదని మాత్రం నిర్ధారించారు. ఆంధ్ర పత్రికలోని "శతక వాఙ్మయము" అనే వ్యాసంలో (దాశరథి శతకం) "కంచెర్ల గోపన్న భట్టరార్య శిష్యుడు"[4] అని వ్రాయబడింది. అలాగే రామదాసు కాలంలో వైష్ణవం ప్రబలంగా ఉన్నందున రామదాసు వైష్ణవ మతాన్ని భట్టరార్యుల వలన పొందాడని వ్రాయడం జరిగింది.

"భక్తరామదాసు " అనే గ్రంథంలో శ్రీ వేముగంటి నరసింహాచార్యులు గారు గోపన్న రఘునాథ భట్టరునకు శిష్యుడై తిరు మంత్రమును నిలచికొనుట అని, "గోపన్న వివాహానంతరం, భక్తాగ్రగణ్యుడు కబీరుదాసు ఏతెంచి గోపన్న గుణములు గని వాత్సల్యమునొంద గోపన్న తారక మంత్రముపదేశమిమ్మని కోరుటచే నా మంత్రముపదేశించెను"[5] అని వ్రాశారు.

1. Kulasekhara in Telugu Literature - N. Venkata Rao - Journal of the Madras University Vol 23. No 182, 1952, P.No. 57 to 61.
2. P. Samba Murthy - The Great Composers P.No . 57.
3. " " " P.No. 64.
4. ఆంధ్రపత్రిక -సం. శంభుప్రసాద్ శివలెంక, కాశీనాథుని నాగేశ్వర రావు జయంతి సంచిక, 1967-68, పుట 177.
5. భక్తరామదాసు - వేముగంటి నరసింహాచార్యులు, (భోగయ్యగారి వేంకటేశ గుప్త సమీక్ష), పుట 37, సప్తగిరి, మే 1989.

"గోపన్న విద్యాభ్యాసము కొరకై సోమశాస్త్రి గారి వద్ద ఉండెనని విద్యాభ్యాసానంతరం కమల అనే కాంతను వివాహమాడెనని, వివాహానంతరం కబీరుచే తారక మంత్రోపదేశం పొందారని, రఘునాథ భట్టరుల వలన తిరుమంత్రమును అంటే నారాయణ మంత్రోపదేశం పొంది వైష్ణవం స్వీకరించారని, పుస్తకంలో ఉంది.[1] అంటే గోపన్నకు ముగ్గురు గురువులన్నమాట. ఇందులో సోమశాస్త్రి అనే గురువు ప్రస్తావన మరెందులోనూ లేదు. ఇందులో చెప్పబడినట్లుగా కాక గోపన్న తిరుమంత్రం, తారక మంత్రం రెండూ రఘునాథుని వలననే ఉపదేశం పొందాడు. వైష్ణవం కూడా ఈ గురువే ఇచ్చాడు. కబీరు కాదు. 'సోమశాస్త్రి' విద్యాభ్యాసం చేయించలేదు. రఘునాథ భట్టరుడే గోపన్నకు వేద వేదాంగ పురాణాలను గూర్చి బోధించాడు. వైష్ణవ తత్త్వాన్ని బోధించాడు. కావున గోపన్నకు ఉన్నది ఒకే ఒక గురువు. అంటే (శఠకోపమౌని) రఘునాథ భట్టరు అని నిర్ధారించవచ్చును.

డా॥ వి. రాఘవన్ గారు " రామదాసు గురువు కబీరు అని కథలు వచ్చాయి. కాని రామానందుని శిష్యుడైన కబీరుదాసు క్రీ.శ. 1440-1518 ల మధ్య వున్నవాడు గనుక రామదాసుకు గురువు కావడం సంభవం కాదు. అంతేకాక రామదాసును గురించిన అస్పష్టత ఏమీ లేదు"[2] అని కబీరు రామదాసు గురువు కాదని స్పష్టం చేశారు.

"భద్రాచల క్షేత్ర మాహాత్మ్యము" అనే పుస్తకంలో కూడా కబీరు రామదాసుకు రామ మంత్రోపదేశం చేసినట్లు చెప్పబడి ఉంది.

డా॥ వి. రాఘవన్ గారు "Traditionally Kabirdas of Banaras, is said by Hari Katha performers to have been the guru of Ramadas but this is not possible as kabir, a disciple of Ramananda, flourished between 1440 and 1518 A.D. Further there is nothing hazy about the figure of Ramdas who is a well known name in Telugu history and Literature"[3] అని కబీరు రామదాసుకు గురువు కావడం అసాధ్యం అని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇంత వరకు వివిధ రామదాసు చరిత్రములను, వివిధ విమర్శనాత్మక పరిశోధనలను బట్టి చూడగా రామదాసు గురువు కబీరు కాదని, రఘునాథ భట్టరాచార్యులని, అతడే రామదాసుకు తారక

1. భక్త రామదాసు - వేముగంటి నరసింహాచార్యులు (బోగయ్య గారి వెంకటేశ గుప్త సమీక్ష, శ్రీ బాలకృష్ణ గారు సమీక్షకులు. పుట 37.
2. రామ భక్త శిఖామణి - భద్రాచల రామదాసు డి.సే. డా॥ వి. రాఘవన్. పుట. 24, "భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర ప్రభువు గీర్తన సంచిక, భద్రాచల దేవస్థానం.
3 (Great comporers) Dr. V. Raghavan, Badrachala Ramadas (Editors : Gowri Kuppu Swamy, M. Hari Haran).

మంత్రోపదేశం చేశాడని, వైష్ణవం కూడా ఇచ్చిన గురువని స్పష్టమౌతుంది. కబీరు పంథాకు చెందిన వారు కూడా రామదాసుకు తారక మంత్రోపదేశం చేయలేదని కచ్చితంగా చెప్పవచ్చు.

## 1.4. గోపన్న గృహస్థాశ్రమ జీవితం :

హనుమకొండలో 'అమిల్' వద్ద పింగళి భానూజియ్య గారనే ఉద్యోగి ఒకాయన ఉండేవాడు. ఆయన తన కూతురు కామమ్మను కంచెర్ల లింగన్నకు ఇచ్చి పెళ్ళి చేశాడు. ఈ దంపతులకు గోపన్న పుట్టాడు. ఈ పింగళి భానూజియ్యకు పింగళి అక్కన్న, మాదన్న, విస్సన్న, మల్లన్న అనే నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. వీరు పింగళి వంశానికి చెందిన నియోగి బ్రాహ్మణులు. అక్కన్న మాదన్నల పెద్ద తోబుట్టువు కంచెర్ల వారింటికి, రెండవ తోబుట్టువు పొదిలి వారింటికి, మూడవ తోబుట్టువు పులిపల్లి వారింటికి కోడండ్రైనారు.

వీరి తోబుట్టువులలో పెద్ద తోబుట్టువు కామమ్మ అని పేరు మాత్రం ఉంది. తక్కిన వారి పేర్లు తెలియదు. కంచెర్ల గోపన్న, అక్కన్న, మాదన్నల మేనల్లుడు అని చెప్పబడి ఉంది. అక్కన్న మాదన్నలు గోపన్న మేనమామలా కాదా అనే అంశం మీద పరిశోధనలు కూడా జరిగాయి.

## 1.4.0. అక్కన్న మాదన్నలు-చరిత్ర : (గోపన్న మేనమామలు) :

అక్కన్న మాదన్నలకు గోపన్న మేనల్లుడని కృష్ణా జిల్లా మాన్యుయల్‌లో ఈ విధంగా వ్రాయబడి ఉంది. 1883 సంవత్సరంలో వెలువడ్డ ఈ మ్యాన్యుయల్‌లో కృష్ణాజిల్లా చరిత్రకారుడగు మెకంజి "గోపన్నగారు మాదన్నగారి మేనల్లుడనియు, ఖమ్మం మెట్టు పేష్కారనియు"[1] వ్రాసిరి. అక్కన్న మాదన్నలు గోలకొండ చరిత్రలో పేరు పొందిరి. అక్కన్న మాదన్నలు గోల్కొండ సుల్తాను అబ్దుల్లా కుతుబ్షా కాలంలో చిన్న ఉద్యోగాల్లో చేరి క్రమంగా అభివృద్ధిలోకి వచ్చి తానాషా గారి కాలంలో అక్కన్న సేనాపతిగాను, మాదన్న మహామంత్రిగాను, నియుక్తులైనారు.

"హైదరాబాదున మేనమామలు అక్కన్న మాదనగార్లూ సదయులు తానష వద్ద మంత్రులై సఖ్యతతో నున్నారు"[2] అని రామదాసు చరిత్రములో ఉండడం వల్లనూ గోపన్నకు అక్కన్న మాదన్నలకు గల బంధుత్వం తెలుస్తుంది. గోపన్న తన మేనమామలు అక్కన్న, మాదన్నలని వ్యక్తం చేశాడు.

సమగ్రాంధ్ర సాహిత్యంలో " అక్కన్న మాదన్నలు మేనల్లుడైన గోపన్నకు భద్రాచలం తాలూకాలో చిన్న ఉద్యోగం ఇప్పించారు. క్రమేపి గోపన్న తహసీల్దారు అయ్యాడు."[3] అని ఆరుద్ర వ్రాశాడు.

1. భద్రాచల క్షేత్ర చరిత్ర - కొండపల్లి రామచంద్రారావు - భద్రాచల దేవస్థాన ప్రచురణ 1971 పుట 12.
2. రామదాసు చరిత్రము - సింగరదాసు ఎన్.వి.గోపాల్ అండ్ కం. మద్రాసు 1 పుట 21
3. సమగ్రాంధ్ర సాహిత్యము - ఏడవ సంపుటము, (నాయక రాజుల యుగము) , ఆరుద్ర, పుట 385.

"తెలుగులో పదకవిత" లో

"గోల్కొండ రాజ్యాన్ని అబ్దుల్లా తానీషా, అబుల్ హసన్ తానీషాలు పరిపాలిస్తుండేవారు. వారి కొలువులో ఉన్న అధికారులు అక్కన్న మాదన్నలు అనే అన్నదమ్ములు గోపన్న మేనమామలు."[1] అని డా॥ గంగప్ప గారు వ్రాశారు.

గోపన్న తండ్రి మరణించిన తర్వాత కొంతకాలానికి గోపన్నకు 'కమల' అనే కన్యతో వివాహమైంది. గోపన్న భార్య 'కమల' మాదన్న గారి కుమార్తె అని కొన్ని రామదాసు చరిత్రల్లో ఉంది. మేనమామ కూతురిని గోపన్న వివాహం చేసుకున్నాడని రామదాసు చరిత్రములో ఉంది. "రామదాసు నాటకము" లో ధర్మవరం గోపాలాచార్యులు గారు, ఈ విధంగా వ్రాశారు. " తానీషా భార్య సితార, మాదన్న భార్య శ్యామలాంబల సంభాషణ ద్వారా మాదన్న కుమార్తె 'కమల' ను తన మేనల్లుడైన గోపన్నకిచ్చి వివాహం జరిపించనున్నట్లు, అప్పుడు బాల్య వివాహం మంచిది కాదని 'దిలారి' అనే తానీషా భార్య ఖండించడం జరుగుతుంది. మాదన్నగారి కూతురుకు మొదట ఒక వివాహం నిశ్చయమై ఉంటుంది. అయితే ఆమెకు మొదటి వివాహం నిశ్చయమైన వరునకు 3 సం॥ల వరకు వివాహం జరుగదని పురోహితుడు చెప్పగా, అదే ముహూర్తానికి కమలకు గోపన్నతో వివాహం జరుగుతుంది. గోపన్నకు కారాగార ప్రాప్తి కూడా ఉంటుందని అంటాడు ఆ పురోహితుడు."[2] ఇందు మేనమామ మాదన్న కుమార్తె కమలను వివాహం చేసుకొన్నట్లు కథ ఉంది. గోపన్నకు అక్కన్న, మాదన్నలు మేనమామలు అని ఈ నాటకంలో ఈ సంఘటన వలన వ్యక్తం అవుతుంది.

"శతక సంపుటం"లో రామదాసు వివాహ విషయం, అతని మేనమామలైన అక్కన్న, మాదన్నల గూర్చిన ప్రస్తావన ఉంది. " గోపన్నకు కమల అనే కన్యతో వివాహమై పుత్రుడు జన్మించెను. తల్లిదండ్రులు గతించిరి. ఆస్తినంతా దాన ధర్మాలకు ఖర్చు చేసి గోపన్న బీదరికం అనుభవించే పరిస్థితికి వచ్చెను. ఆ తర్వాత భార్య కోరిక మేరకు హైదరాబాదులో నున్న తన మేనమామలను, అబ్దుల్లా తానాషా వద్ద మంత్రులైన అక్కన్న, మాదన్న సహాయంతో భద్రాచలము తహసీలుదారు ఉద్యోగము సంపాదించెను".[3]

"ప్రముఖ వాగ్గేయకారులు" అనే పుస్తకంలో "ఆయన గోల్కొండ మంత్రులు అక్కన్న మాదన్నలకు మేనల్లుడనే విశేషం ఇతిహాస పరిశోధకులకు ఇది తేలని ముచ్చట"[4] అని కృష్ణగారు సంశయం వ్యక్తం చేశారు.

1. తెలుగులో పద కవిత డా॥ ఎస్.గంగప్ప పుట 80-82.
2. ధర్మవరం గోపాలాచార్యులు - రామదాసు నాటకము , ద్వితీయాంకము.
3. శతక సంపుటము - చెన్నపురి వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1926.
4. ప్రముఖ వాగ్గేయకారులు - బి. కృష్ణ పుట 22

కె.వి.భూపాలరావు గారు "కంచెర్ల గోపన్న (భద్రాచల రామదాసు) పింగళి భానూజియ్యకు ఒక కుమార్తె కుమారుడని ప్రతీతి ఉంది గాని, ఐతిహాసికముగ ఇది సరిఅని చెప్పటకు ఆధారములు ఇప్పటికిని లభించుటలేదు అని గోపన్న మాదన్న మేనల్లుడు కాకపోవచ్చని"[1] అభిప్రాయం వ్యక్తం చేశారు.

"హోవార్డు-మార్టిన్" అనే డచ్చి యాత్రికులు (చరిత్రకారులు) తమ గ్రంథంలో ఇలా వ్రాశారు. " వారికి గోపన్న యను నొక మేనల్లుడుండెను. ఈతను బహుశః ఖమ్మం జిల్లా నేలకొండపల్లి అను గ్రామ కాపురస్థుడు గావచ్చును"[2] అని గోపన్న అక్కన్న, మాదన్నల మేనల్లుడని వ్రాసినారు.

బి.రామరాజు గారు" అక్కన్న మాదన్నలు రామదాసు మేన మామలు. అక్కన్న, మాదన్నల పెద్ద తోబుట్టువు కంచెర్ల వారింటికి, రెండవ తోబుట్టువు పులిపల్లి వారింటికి కోడండ్లైనారు. అక్కన్న, మాదన్న, విస్సన్న, మల్లన్నలు అనే నలుగురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు. పింగళి భానూజియ్య సంతానం" అని[3] వ్రాశారు. పింగళి అక్కన్న, మాదన్నల పెద్ద మేనల్లుడు కంచెర్ల గోపన్న అని వారు తెలియజేసారు. మాదన్న పెద్ద సోదరి కుమారుడు కంచెర్ల గోపన్న అని వారు తెలియజేసారు.

మిన్నికంటి గురునాథ శర్మగారు 'మాదన్న గారి మేనల్లుడు గోపన్న' అని నిరూపించే ప్రయత్నం చేసారు. "గోపన్న మేనమామ మాదన్నగారు 1682వ సంవత్సరమున అత్యంత ప్రాభవోపేతుడై యుండెను. అదే సంవత్సరం ఇబ్రహీముకున్న షామా లష్కర్ అధికారమును తొలగించి అక్కన్న గారికి ఇప్పించెను. మాదన్న తన కుమారునకు అదే సంవత్సరం (మల్లన్న) వివాహం చేశాడు"[4] అని వ్రాశారు.

గురునాథ శర్మగారు "గోపన్నకు యాదెమ్మ అను కన్యతో వివాహం అయింది. (కమల అని కొందరందురు). కమల మాదన్న కూతురని, ఆమెతో వివాహం జరిగిందని ధర్మవరం గోపాలాచార్యులు చెప్పినారు. గోపన్నకు కొన్నాళ్లకు సంతానం కల్గింది. కొంత కాలానికి కామమ్మ మరణించింది. గోపన్న కుమారుని పేరు 'లింగయ్య శర్మ' అని రఘురాముడని కొన్ని చరిత్రలలో కలదు. (కబీరు ఈ పేరు పెట్టాడట. ఇది అసత్యం).

1. మహామంత్రి మాదన్న కథ - కె.వి.భూపాలరావు పుట 12
2. మాదన్న మహామంత్రి - కె.వి.భూపాలరావు పుట 57.
3. అనుభవ కవి కంచెర్ల గోపన్న - బి.రామరాజు పుట 47.
4. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ ప్రణీతము మొదటి ప్రకరణము పుట 6.

"పోర్చుగీసు వారి గ్రంథానుసారముగా బ్రకటింపబడిన ఆర్కియలాజికల్ రిపోర్టులో 'దాసు' గారికి అక్కన్న మాదన్నల గార్లకు సంబంధం లేనట్లు వ్రాయబడి యున్నది" అని బ్రహ్మశ్రీ కా. బ్రహ్మయ్య శాస్త్రిగారు, బెద్దాపుర సంస్థాన చరిత్ర విమర్శనమున వ్రాసియుండిరి. కనుక గోపన్న వారికి మేనల్లుడు కాదని భావించవచ్చుననాడు" అని గురునాథ శర్మగారు అభిప్రాయం ఉదాహరణ పూర్వకంగా తెలియచేసారు"[1].

'భక్తరామదాసు' అను రామదాసు విజయం లో కీ.శే. కేతవరపు శివ రామశాస్త్రిగారు ఈ నాటకంలో ఈ విధంగా వ్రాశారు. "గోపన్న మేనమామలు అక్కన్న, మాదన్న గార్లు. మాదన్న అక్క కామాంబ అని వ్రాశారు. ఈ కామాంబ కుమారుడే గోపన్న. కంచెర్ల వంశస్థుడు. అయితే గోపన్న భార్య శారదాంబ"[2] అని వీరు వ్రాశారు. ఆమె మాదన్న కుమార్తెగా ఎక్కడా చెప్పబడలేదు. ఇందు కూడా గోపన్న కుమారుని పేరు లేదు. 'శ్రీరామదాసు' అనే రామనారాయణ కవుల నాటకములో "అక్కన్న మాదన్నలు గోపన్న మేనమామలని, గోపన్న భార్య సుశీల"[3] అని వ్రాయబడి ఉంది. రామదాసు కుమారుని పేరు ఈ నాటకంలో లేదు.

"భక్తరామదాసు" అనే బుర్రకథలో శ్రీ దుగ్గిరాల గౌరీ మనోహర రావుగారు "ఈ వార్త విని. ..... మేనమామలు అక్కన్న మాదన్నలు మిక్కిలి సంతసించెను" అని గోపన్న మేనమామలు అక్కన్న, మాదన్నలని చెప్పారు. ఈ బుర్ర కథలో గోపన్న భార్య పేరు లేదు. కేవలం కుమారుడి ప్రస్తావన ఉంది. కుమారుడి పేరు కూడా ఇందులో లేదు.

"గోపన్న" అనే గ్రంథంలో కీ.శే.గరిమెళ్ళ సత్య గోదావరి శర్మగారు ఈ విధంగా వ్రాశారు " గోపన్న అక్కన్న మాదన్నలను తన మేనమామల సహాయముతో 'తానాషా'గారి కొలువులో ఉద్యోగమునందు చేరెను. భద్రాచల తాలూకా తహసీల్దారయ్యెను" గోపన్న తండ్రి అతనికి ఉపనయనము చేయించెను. అతనికి కమలాంబ అను నామెతో వివాహమైంది. అనుకూల వతియైన పేద ఇంటి అమ్మాయి, కొంతకాలానికి లింగన మంత్రి, అటు తర్వాత కామాంబ మరణించారు"[4] అని గోపన్న గూర్చి వ్రాశారు. వాలి కుమారుడి పేరు ఇందులో కూడా ప్రస్తావింపబడలేదు.

---

1. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ ప్రణీతము పుట 69 (నాల్గవ ప్రకరణము)
2. భక్త రామదాసు - రామదాసు విజయము (నాటకము) - కీ.శే. కేతవరపు శివరామ శాస్త్రిగారు 1924.
3. శ్రీ రామదాసు - రామ నారాయణ కవులు (నాటకము) 1929.
4. గోపన్న - కీ.శే. గరిమెళ్ల సత్య గోదావరి శర్మ 1973.

'రామదాసు నాటకము' లో డి.వెంకట రమణయ్య గారు కూడా అక్కన్న, మాదన్నలు గోపన్న మేనమామలని వ్రాశారు. ఈ నాటకంలో గోపన్న భార్య పేరు భ్రమరాంబ అని, పుత్రుడి పేరు రామమూర్తి అని వ్రాశారు. రామదాసు భార్య, పుత్రుల పేర్ల విషయంలో సందేహం ఉంది. ఐతిహాసిక ఆధారాలు లేవు.[1]

'రామదాస చరిత్రము' - హిందూస్థానీ నాటకంలో కూడా "రామదాసు మేనమామలు అక్కన్న మాదన్నలని ఉంది. అయితే రామదాసు భార్య, బిడ్డల పేర్లు చెప్పబడలేదు. మాదన్న కుమార్తెను గోపన్న పెండ్లి చేసుకున్నట్లుగా లేదు.[2]

"రామదాసు చరిత్రము" కావ్యంలో చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు "నక్కన్న మాదన్న యనెడు వారి మేనమామల గనుగొని మెచ్చి యవల నిదియ యది నని యల్లన నేగి గోపనార్యుడొదిగెను గొల్చున యందునొకట"[3] అని, గోపన్న మేనమామలు అక్కన్న మాదన్నలని పేర్కొనిరి. ఈ కావ్యంలో గోపన్న, భార్యాపుత్రుల నామములు పేర్కొనబడలేదు.

"శ్రీరామదాస నాటకము" లో కేశిరాజు వేంకట సుబ్బారాయ కవిగారు అక్కన్న మాదన్నల గూర్చి ఇలా వ్రాశారు .

గీ॥ "అరయ నక్కన్న మాదన లనగ నొప్ప
మంత్రులిరు వంక ధృతి రాజ్య తంత్రులగుచు
ముచ్చటలు దెల్ప సభ చేర వచ్చెనపుడు
చారుతర కీర్తి తానిషా చక్రవర్తి"[4]

ఇందు రామదాసు భార్య కళావతి అని ఉంది. కుమారుడి పేరు లేదు. తానాషా వద్ద అక్కన్న మాదన్నలు మంత్రులుగా ఉన్నారని, వారు గోపన్న మేనమామలని తెలియజేశారు.

"భద్రాచల రామదాసు చరిత్రము" అనే యక్షగానంలో ఈ విధంగా రాయబడింది. "గోపన్న భార్య కమల. వారి కుమారుడు 'రఘురాముడు' అని అక్కన్న మాదన్నలు తన మేనమామలని"[5] చెప్పబడింది.

వివిధ రామదాసు చరిత్రములను పరిశీలించగా స్పష్టమైన విషయాలు ఇవి. " రామదాసుకు మేనమామలు అక్కన్న మాదన్నలని, వారికి భార్య, ఒక పుత్రుడు ఉన్నారని స్పష్టం. అయితే వీరి పేర్ల విషయంలో మాత్రం అస్పష్టత ఉంది. చరిత్రలో మాదన్న అక్కన్నల సోదరీమణుల పేర్లు ఎక్కడా చెప్పబడలేదు.

1. రామదాస నాటకము - రావు సాహెబు డి. వెంకట రమణయ్య గారు 1927.
2. రామదాసు చరిత్రము - హిందూస్థానీ నాటకము - నాదెండ్ల పురుషోత్తము కవి.
3. రామదాసు చరిత్రము (కావ్యం) - చల్లా పిచ్చయ్య శాస్త్రి (తృతీయాశ్వాసం) పుట 83.
4. శ్రీ రామదాస నాటకము - కేశిరాజు వెంకట సుబ్బరాయ కవి (ప్రథమాంకము) 1927.
5. భద్రాచల రామదాసు చరిత్రము (యక్షగానము) తిరుక్కడయూరి కృష్ణదాసు.

కాని పెద్ద తోబుట్టువు కొడుకు కంచెర్ల గోపన్న అని, దీనిని బట్టి గోపన్న అక్కన్న మాదన్నల మేనల్లుడని స్పష్టమైంది. మాదన్న కూతురిని గోపన్నకు ఇచ్చి వివాహం చేసినట్లు చారిత్రకాధారాలు ఏమీ లేవు అని చెప్పవచ్చు.

వరద రామదాసు రచించిన రామదాసు చరిత్రమునందు

కం॥ "మామలు మంత్రులు నాకును
నేమచ్చిక జూడ గోరి యిటు వచ్చితి
మామల కెటిగింపుండని
వేమరు వేడెదనటంచు వెన వచ్చితిమె" అని ఉన్నది.

అకన్న మాదన్నలు గోపన్న మేనమామలని స్పష్టమైంది. గోపన్న తండ్రి మరణించిన కొంత కాలానికి తల్లి తన కుమారునికి వివాహం చేసింది. గోపన్నకు వివాహమైన కొంత కాలానికి తన తల్లి కామమ్మ కూడా మరణించింది. వారికి ఒక కుమారుడు జన్మించాడు. గోపన్న తారక మంత్రోపదేశం పొందిన పిమ్మట నిరంతరం శ్రీరామ నామ స్మరణంతోనూ, సాధు సంతర్పణలతోనూ, భజన గోష్ఠులతోనూ, శ్రీరామునికి ఉత్సవాలు జరిపిస్తూ కాలం గడపసాగాడు. మరియు తారకోపదేశమైన నాటి నుండి గృహ కృత్యాల మాట తలపక శ్రీరామ కైంకర్యం నందే అహోరాత్రులు గడుపుతుండేవాడు. పేదలకు అన్నదానాలు చేస్తూ ఉండేవాడు. ఆ రోజుల్లో కుతుబ్షాహీల కాలంలో 'కరువు' రావడం వల్ల (ఆ ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ప్రాంతంలో) తన సమస్తం వెచ్చించి దానధర్మాలు చేస్తాడు. తత్ఫలితంగా తనకున్న ఆస్తి అంతా తరిగిపోతుంది. పేదరికం అనుభవించవలసివస్తుంది. పూట గడవడం కష్టమై పోతుంది.

ఆ సమయంలోనే హైదరాబాదు నేలే గోల్కొండ రాజు వద్ద అబ్దుల్లా కుతుబ్షా, అబుల్ హసన్ తానాషాల కాలంలో మంత్రులుగా అక్కన్న, మాదన్న గార్లు ఉంటారు. అక్కన్న సర్వసైన్యాధిపతి, మాదన్న గారు ప్రధానమంత్రి(మీర్‌జుమ్లా) గా ఉంటారు. ఈ అక్కన్న, మాదన్నగార్లు గోపన్న గారికి స్వయానా మేనమామలని ఇంతకుముందే ప్రస్తావించాను. అర్ధాంగి ప్రోత్సాహంతో గోపన్న సతీ సమేతంగా అక్కన్న, మాదన్నల వద్దకు వెళ్తాడు. తన గోడునంతా వినిపించుకుంటాడు. గోపన్న పేదరికాన్ని చూసి వారు జాలితో సుల్తానును ఎలాగో మెప్పించి ముందుగా పేష్కారు పదవినిప్పిస్తారు. ఆ తర్వాత పాల్వంచ పరగణాకు తహసీల్దారుడౌతాడు గోపన్న.

1. రామదాసు చరిత్ర విమర్శనము (ముద్దుకంటి గురునాథ శర్మ ) భారతి అక్టోబరు 1931.

# గోపన్న భద్రాచలం తహసీల్దారగుట :-

## 1.4.1. భద్రాచలం తహసీల్దారుగా గోపన్న :-

ఆ కాలంలో జిల్లాలు, తాలూకాలు ఏర్పడలేదు. రాజ్యమెల్ల కొన్ని సర్కారులుగాను, సర్కారులు పరగణాలుగను, పరగణాలు పట్టీలుగను విభజింపబడియుండేవి. ఒక్కొక్క ప్రాంతం ఒక్కొక్కరి అధీనంలో ఉంచబడింది. ఖమ్మంమెట్టు సర్కారులోని హసనాబాదు పరగణాకు గోపన్న గారు బాధ్యతగల ఉద్యోగిగా నియమించబడినాడు. ఈ పరగణాను పాల్వంచ అనేపేరుతో ప్రఖ్యాతమవటంవల్ల, దానిలో భద్రాచలం ప్రాంతం కూడా చేరడంవల్ల లోకంలో రామదాసు పాల్వంచ తహసీల్దారనీ, భద్రాచలం తహసీల్దారనీ చెప్పసాగిరి. 1883 సం॥న వెలువడ్డ " Krishna District Manuval "లో కృష్ణా జిల్లా చరిత్రకారుడైన జి. మెకంజి - గోపన్నగారు మాదన్న గారి మేనల్లుడనీ, ఖమ్మంమెట్టు పేష్కారనీ వ్రాసినారు. ఎట్లయినా భద్రాచలం ప్రాంతానికి ప్రధానాదికారిగా గోపన్నను నియమించినారన్నది నిర్వివాదాంశం.

"Madanna Panthulu had a nephew Gopanna who was appointed Peshkar of the Kammampet Taluq, which includes the village of Badrachalam on the Godavari one of the halting places of Rama, Sita and Lakshmana in their wanderings"[2] అని కృష్ణా డిస్ట్రిక్ట్ మాన్యుయల్‌లో ఉంది.

సింగరదాసు రచించిన 'రామదాసు చరిత్రము'లో "భద్రాచలమును తాలూకాకు పంపుడు తహసీల్ పనిగా ముద్రనిశానితో హుకుములిచ్చి ముద్రిరాలందు మనిరి వేగ"[3] అను తొహరా వల్లనూ, "భద్రాద్రికి నధిపుడవై - భద్రయశుండగుచు ప్రజల పాలించుచునే - ఛిద్రము లేకను సైకము-భద్రముగా గూర్చుమనుచు పతి నియమించెన్"[4] అను పద్యం వల్లనూ భద్రాచలానికి గోపన్న ప్రధానాధికారిగా నియమింపబడినాడని స్పష్టంగా తెలుస్తున్నది.

'హోవార్డు, మార్టిన్' అను డచ్చి యాత్రికుడు తన గ్రంథములో ఈ విధంగా రాశాడు "వారికి(అక్కన్న, మాదన్న) గోపన్నయను నొక మేనల్లుడుండెను. ప్రభుత్వమాతనిని భద్రాచలము పరగణాకు తహస్సీలుదారుగా నియమించెను. శ్రీరామచంద్రుని యందు ఇతను విశేషమగు భక్తి గలవాడు. భక్తి పారవశ్యమున అతను ప్రభుత్వపు బొక్కసము నుండి అనేక లక్షల హోన్నుల ద్రవ్యమును వ్యయపరచి సుందరమగు నొక గొప్ప గుడి కట్టించెను. శ్రీరామునకు అమూల్యములగు అనేకాభరణములను జేయించెను. ప్రభుత్వ ధనమును అనుమతి లేకయే వెచ్చించి నందులకు అతడు శిక్షింపబడి చెఱసాల

1. భద్రాచల క్షేత్ర చరిత్ర - కొండపల్లి రామచంద్ర రావు , దేవస్థాన ప్రచురణ 1971 పుట 12.
2. కృష్ణా జిల్లా మాన్యుయల్ పుట 37,38,97,98.
3,4 . రామదాసు చరిత్రము - సింగరదాసు ఎస్.వి.గోపాల్ అండ్ కం. మద్రాసు 1981, పుట 21,22

పెట్టబడెను. ఒకనాటి రాత్రి శ్రీరామ చంద్రుడు సర్కారు పైకమును సుల్తానుకు చెల్లించి గోపన్నను చెఱసాల నుండి విడిపించెను"[1] అని ఉంది.

ఆరుద్రగారు "అక్కన్న, మాదన్నలు మేనల్లుడైన గోపన్నకు భద్రాచలం తాలూకాలో చిన్న ఉద్యోగం ఇప్పించారు. క్రమేపి గోపన్న తహసీల్దారు అయ్యాడు"[2] అని రాశారు.

"History of the Qutb Shahi Dynasty" అనే ఆంగ్ల గ్రంథంలో ఈ విధంగా ఉంది. " The other great name in the out put of Telugu during the reign is that of Madanna's nephew Gopanna Kancharla who was later called "Bhadrachala Ramadasu or simply Ramadas. Gopanna was appointed 'Tahasildar' or 'Revenue Officer' of Bhadrachalam and was in sole charge of the collection of the revenue of the locality"[3]

"భద్రాచలం పరగణాకు రామదాసు తహసీల్దారుగా నియమింపబడి, రెవెన్యూ అధికారిగా ఆ ప్రాంతం నుండి పన్ను వసూలు చేసే బాధ్యత స్వీకరించెను. పశ్చిమ గోదావరి జిల్లా సమాచార గ్రంథంలో ఈ విధంగా వ్రాయబడింది. " రామదాసు భద్రాచలంలో తహసీల్దారుగా ఉండగా రామాలయ నిర్మాణం గావించి ప్రభుత్వ ధనం ఖర్చు చేసినందుకు జైలు శిక్షను అనుభవించాడు. తానాషా గోల్కొండలోని బంధిఖానాలో రామదాసును 12 సం॥లు బంధించాడు. ఆ తర్వాత రామ లక్ష్మణులు రామదాసు చెల్లించవలసిన ఆరు లక్షల పైకం తానీషాకు చెల్లించి, రామదాసును విడిపించారు" అని ఉంది.

ఇదే విషయాన్ని గూర్చి కృష్ణస్వామి అయ్యంగార్ గారు ఇలా తెలియజేశారు. "Instead of remitting the amount collected he quietly constructed a temple sacred to Shri Rama at his head quarters. On the discovery of this he was arrested, brought to Haidarabad and interned to Golkonda Fort. Krishna Swamy Aiyangar says that " the story has it that a miraculous payment of the sum was made and a receipt obtained by two men calling themselves Rama and Lakshmana, peons of the Bhadrachalam circar, who came over night paid the balance demanded in cash and obtained a receipt there and then of the padishah himself"[4] "Telugu literature in Qutb Shahi period"అనే గ్రంథంలో "గోపన్న దేవాలయ నిర్మాణానికి చేసిన ఋణం రామ లక్ష్మణులు తీర్చారని, తానీషా రామదాసు రామభక్తికి మెచ్చి భద్రాచలం మరియు మరో రెండు పరగణాలు అగ్రహారాలు దానంగా గోపన్నకు ఇచ్చాడని వ్రాయబడింది.

1. మాదన్న మహామంత్రి - కె.వి.భూపాలరావు గారు పుట 57.
2. సమగ్రాంధ్ర సాహిత్యము - ఏడవ సంపుటము , ఆరుద్ర పుట 385
3. History of the Qutub Shahi Dynasty - By H.K. Sherwani p.no.606
4. S. Krishna Swamy Aiyangar 'Abul Hasan Qutub Shah and his ministers Madanna and akkanna, J.I.H. 1931, p. 128.

"This is a variation of the popular tradition that it was in a dream that Abul-Hasan received payment from Sri Rama and his brother and on awakening he found the money lying by his pillow. However that may be, Gopanna was there upon released, and impressed by the miraculous payment, the Sultan endowed the revenues of Bhadrachalam and two other villages as agraharam for the expences of the newly constructed temple. The miracle has earned Gopanna the title of Ramadas[1]"

(రామదాసు కీర్తనలలో ఈ విషయానికి నిదర్శనం లభిస్తుంది. అబుల్ హసన్‌కు రామ లక్ష్మణులు వచ్చి ధనం చెల్లించి వెళ్లినట్లుగా నిదర్శనం లభించే కీర్తన ఉంది. ఈ కీర్తనలను గూర్చి రామదాసు జీవిత విశేషాలకు ఈ కీర్తనతో ఉన్న అవినాభావ సంబంధం గూర్చి ఇదే అధ్యాయంలో ప్రత్యేకంగా చర్చించడం జరుగుతుంది). ఈ ఉదాహరణలను, చరిత్రకారులు వ్రాసిన రాతలను బట్టి, రామదాసు చరిత్రలను బట్టి రామదాసు భద్రాచలం పరగణాకు తహసీల్దారు అయినట్లు నిర్ణయించవచ్చు. రామదాసు తహసీల్దారుగా భద్రాచలం పరగణాలో ఎప్పుడు ప్రవేశించాడో తెలుసుకోవలసి ఉంది.

### 1.4.2.0. రామదాసు తహసీల్దారుగా భద్రాచలంలో ప్రవేశించిన కాల నిర్ణయం :

గోపన్న మేనమామలు అక్కన్న, మాదన్నలగుట వల్లనూ, వారు తానాషా వద్ద మంత్రులుగా ఉండడం వల్లనూ, వారివల్లనే గోపన్న భద్రాచలానికి తహసీల్దారైనట్లు ఐతిహ్యం ఉండడం వల్లనూ గోపన్న 17వ శతాబ్దం మధ్య భాగంలో జీవించాడని భావించవచ్చు. అయితే రామదాసు కాలాన్ని గూర్చి, తానాషా కాలాన్ని గూర్చి అక్కన్న మాదన్నల మంత్రిత్వ కాలం గూర్చి పలువురు చరిత్రకారులు పలు రకాల అభిప్రాయాలను వెల్లడించారు. రామదాసును గూర్చి కొందరు రచయితల అభిప్రాయాలులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| | రచయిత | రామదాసు జననం |
|---|---|---|
| 1. | నారుమంచి సుబ్బారావు | 1630[2] |
| 2. | గురునాథ శర్మ | 1650[3] |
| 3. | కొడాలి లక్ష్మీనారాయణ | 1630[4] |
| 4. | రఘుపాత్రో నరసింగరావ్-పట్నాయక్ | 1638[5] |
| 5. | కంచెర్ల పాండురంగ శర్మ | 1659[6] |
| 6. | విజ్ఞాన సర్వస్వము-నాలుగవ సంపుటములో రామదాసు 1650 కి చెందినవాడని వివరించారు.[7] | |

1. జి. వసుమతి , తెలుగు లిటరేచర్ ఇన్ కుతుబ్ షాహీ పీరియడ్ పుట 264.
2. భద్రాచల రామదాసు జీవిత సంగ్రహము-నారుమంచి సుబ్బారావు, 1907, సీతారామ [illegible], తెనాలి, పుట 7.
3. రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ, పుట 6.
4. భద్రాచల రామదాసు చరిత్ర - కొడాలి లక్ష్మీనారాయణ పుట 6.
5. భద్రాచల మాహాత్మ్యము (రామదాసు చరిత్ర) - రఘుపాత్రో నరసింగరావ్ పట్నాయక్ 1962, పుట 16.
6. రామదాసు - కంచెర్ల పాండురంగ శర్మ పుట 6.
7. విజ్ఞాన సర్వస్వము - 4వ సంపుటము పుట 1074.

బాలాంత్రపు రజనీకాంతరావు గారు క్రీ.శ.1620-1680ల మధ్య రామదాసు జీవించాడని అభిప్రాయపడినారు.[1] వావిళ్ళ వారు వేసిన రామదాసు చరిత్ర పీఠికా కారులు -వేదం లక్ష్మీనారాయణ శాస్త్రిగారు, భావరాజు వేంకట కృష్ణారావు గారు రామదాసు కాలం 1620 అని నిర్ణయించారు.[2] కె.వి.భూపాలరావు గారు 16-17 శతాబ్దాల మధ్య అని, బి.ఎన్.శాస్త్రిగారు "కుతుబ్షాహీ రాజులలో అయిదవ వాడైన మహమ్మద్ కులీ కుతుబ్షా పరిపాలిస్తున్న కాలంలో (1620) జన్మించినట్లు తెలుస్తుందని"[3] అభిప్రాయపడినారు. "1664-1687"లో తానీషా కాలంలో గోపన్న మేనమామలు అక్కన్న మాదన్నలు ఉద్యోగమందుండిరి కావున గోపన్న ఈ కాలం వాడే అనుట నిస్సందేహము అని శతక సంపుటంలో ఉంది.[4] పి. సాంబమూర్తిగారు 1620-1688 అని,[5] 1630-1680 అని భద్రాద్రిలో ఉన్న శాసనములు నిరూపించు చున్నవని మద్దాల గురు బ్రహ్మశర్మగారు శ్రీ వంగూరి సుబ్బారావుగారికి వ్రాసినారు.[6] ఆరుద్ర 1620 అని,[7] డా.ఎస్. గంగప్పగారు 1620-1680 అని వివరించారు.[8]

వివిధ చరిత్రకారుల అభిప్రాయాలను పరిశీలించగా 1620-1680ల మధ్య రామదాసు జీవించినట్లు చెప్పవచ్చు. రామదాసు తానీషా కాలంలో తహసీల్దారు అయినట్లుగా పలు రామదాసు చరిత్రలు తెలియజేస్తున్నాయి. రామదాసు జీవిత చరిత్ర యక్షగానాలు, హరికథలు, నాటకాలు అన్నింటిలోనూ తానీషా కాలంలోనే గోపన్న తహసీల్దారు అయినట్లు వ్రాయబడినది. పలువురు చరిత్రకారులు, పరిశోధకులు రామదాసు తహసీల్దారు అయిన కాలాన్ని ఈ విధంగా తెలియజేశారు.

1. శ్రీమతి అశోక కుమారి క్రీ.శ. 1650.[9]
2. వేదం లక్ష్మీనారాయణ శాస్త్రి, భావరాజు వేంకట కృష్ణారావు 1650[10]
3. క్రీ.శ. 1650 అని శ్రీ ఏకా సుబ్బారావు గారు[11]
4. వేదగిరి రాంబాబు - 1670 ప్రాంతం.[12]
5. బి.ఎన్.శాస్త్రి - 1650 ప్రాంతం[13]

---

1. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావుగారు 1958, పుట 198-199.
2. భారతి జూలై, 1951, (రామదాసు చరిత్రము).
3. గోల్కొండ చరిత్ర-సంస్కృతి-శాసనములు- చరిత్ర - బి.ఎన్.శాస్త్రి. పుట 140.
4. శతక సంపుటం మొదటి భాగం వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్ , పుట 118.
5. గ్రేట్ కంపోసర్స్ - పి. సాంబమూర్తి.
6. ఆంధ్ర పత్రిక 1967-68, సంపాదకుడు శివలెంక శంభూప్రసాద్, పుట 178.
7. సమగ్రాంధ్ర సాహిత్యము - ఆరుద్ర పుట 385.
8. తెలుగులో పద కవిత ఎస్. గంగప్ప పుట 80-82.
9. రామదాసు కీర్తనలలో భక్తి మరియు రసవిశేషణం - శ్రీమతి అశోక కుమారి పుట 6,8.
10. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - రజనీకాంతరావుగారు
11. కొత్త సంగీత విద్యా దర్పణము - ఏకా సుబ్బారావుగారు
12. నాలుగు శతాబ్దాల నగరం - వేదగిరి రాంబాబు
13. గోల్కొండ చరిత్ర-సంస్కృతి-శాసనములు , బి.ఎన్.శాస్త్రి పుట 140.

6. భద్రాచల రామదాసు చరిత్రము (సింగరదాసు) బులుసు వేంకట రమణయ్య గారిచే పరిష్కృతం. ఈ గ్రంథంలో కొన్ని ముఖ్య తేదీలను గూర్చి ప్రస్తావిస్తూ 1670లో రామదాసు తహసీల్దారు అయినట్లు వ్రాయబడి ఉంది.

7. నారుమంచి సుబ్బారావు 1675లో రామదాసు తహసీల్దారు అయినాడని వ్రాశారు.[1]

8. భద్రాచలంలోని శాసన స్తంభంపై నున్న అంశాల ఆధారంగా 1635లో రామదాసు తహసీల్దారు అయినట్లు తెలుస్తుంది.[2]

9. 1658-87 లో అబ్దుల్లా కాలంలో రామదాసు భద్రాచలం పరగణాకు తహసీల్దారు అయినాడు అని తంగిరాల ఆంజనేయ శాస్త్రిగారు తమ వ్యాసంలో పేర్కొన్నారు.[3]

10. బాలాంత్రపు రజనీకాంతరావు గారు క్రీ.శ. 1650లో తహసీల్దారైనట్లు పేర్కొన్నారు.[4]

11. టెంపుల్ ఇండియా అనే గ్రంథంలో 1654-87ల మధ్య కాలంలో రామదాసు తహసీల్దారు అయినాడని చెప్పబడింది.[5]

అబ్దుల్లా కుతుబ్షా అబుల్ హసన్ కుతుబ్షాల కాలం గూర్చి, వారు గోల్కొండను పరిపాలించిన కాలం గూర్చి వివిధ చరిత్రకారులు వ్రాసిన దానినిబట్టి వారి కాలాన్ని నిర్ణయించవచ్చు.

## 1.4.1.1. అబ్దుల్లా కుతుబ్షా కాలం :

గోల్కొండ రాజ్యాన్ని పరిపాలించిన 8 మంది రాజులలో ఏడవవాడు అబ్దుల్లా కుతుబ్షా ఇతని కాలం గూర్చి చరిత్రకారులు వివిధ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

1. క్రీ.శ.1611-1658 అని గురునాథ శర్మగారు[6]

2. క్రీ.శ. 1620-1672 అని డి. అశోక కుమారిగారు[7]

3. క్రీ.శ. 1626-1672 అని డా॥ కె.వి.గోపాల కృష్ణారావుగారు[8]

4. మహమ్మద్ కులీ కుతుబ్షా కాలం 1580-1612, సుల్తాన్ మహమ్మద్ కుతుబ్షా క్రీ.శ.1612-1626, అబ్దుల్లా కుతుబ్షా 1626-1672 అని బి.ఎన్.శాస్త్రిగారి అభిప్రాయం.[9]

1. సంగీత మహర్షులు పుట 37.
2. శ్రీ సంగూరి సుబ్బారావు, ముట్నూరి గురునాథ శర్మగారి కంచెర్ల గోపన్న అన్న రామదాసు చరిత్రము, శతక సంపుటం.
3. అక్కన్న మాదన్న - ఆంధ్రదేశ చరిత్రము భూగోళ సర్వస్వము మొదటి సంపుటము 1971 (తంగిరాల ఆంజనేయ శాస్త్రి).
4. భక్తరామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పీఠిక- బాలాంత్రపు రజనీకాంతరావు పుట 11.
5. Temple India - Published by Viveknanda Kendra Prakasam -3, Singarachary Streetm Triplicane, Madras 600 003 India
6. రామదాసు చరిత్ర విమర్శనము - ముట్నూరి గురునాథ శర్మ - భారతి అక్టోబరు 1931, పుట 515.
7. శ్రీభద్రాచల రామదాసు కీర్తనలలో భక్తి మరియు రస పోషణ - డి. అశోక కుమారి.
8. గోలకొండ నవాబులు - డా॥ కె.వి.గోపాల కృష్ణారావుగారు తెలుగువాణి 1975, పుట 43-48.
9. గోలకొండ చరిత్ర -సంస్కృతి-శాసనములు - బి.ఎన్. శాస్త్రి, పుట 1-2, మూసీ పబ్లికేషన్స్ హైదరాబాదు.

5. ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరంగార్లు క్రీ.శ. 1626-1672 అని, 21-11-1614 అబ్దుల్లా జననం, 1-2-1626లో అబ్దుల్లా చక్రవర్తియైనాడని, 1626 నుండి 47 సం॥లు గోల్కొండ రాజ్యాన్ని పరిపాలించి 21-4-1672లో మరణించాడు.[1] అని తెలియజేశారు.

6. భావరాజు వేంకట కృష్ణారావుగారు 1672లో అబ్దుల్లా మరణించాడని పేర్కొన్నారు.[2]

7. పి.సాంబమూర్తి 1626-1672 అని పేర్కొన్నారు.[3]

8. కృష్ణాజిల్లా మాన్యుయల్‌లో 1621 అబ్దుల్లా కాలం అని 1621లో రాజైనాడని, చెప్పబడింది. 1621-1669 అబ్దుల్లా కాలమని 1669లో మరణించాడని వ్రాయబడింది.

9. 'Geaological Table of the Qutb Shahis of Golconda' లో 1614 అబ్దుల్లా జననం అని, 1626-1672 అబ్దుల్లా పరిపాలనా పకాలం అని ఉంది. అబ్దుల్లా 7వ రాజు.[4]

10. హెచ్.కె.షేర్వాని మరో గ్రంథంలో అబ్దుల్లా కాలం 1-2-1626 నుండి 21-4-1672 అని వ్రాశారు.[5]

11. కుతుబ్షాహీ కింగ్స్ ఆఫ్ గోల్కొండ అనే చరిత్ర గ్రంథంలో 1672లో అబ్దుల్లా మరణించినట్లుగా ఉంది.

12. శతక సంపుటంలో 1626-1672 అబ్దుల్లా కాలం అని వ్రాయబడింది.[6]

13. బి.రామరాజుగారు 1626-1672 అని నిర్ణయించారు.[7]

14. కె.వి.భూపాలరావు 1648-1663.[8]

15.హ్యావర్టు వ్రాతలు - డచ్చి యాత్రికుడు 1611-1622 అని వ్రాశాడు.[9]

16. వేదగిరి రాంబాబు 1626-1672 అని తెలిపారు.[10]

17. 1627 -1669 (ఆంధ్రదేశ చరిత్రము మొదటి భాగం) చిల్లరిగె శ్రీనివాసరావు
ఆంధ్రసరస్వతీ గ్రంథమాల (28-1-1933) పుట 121-122

18. బి.ఎన్. శాస్త్రి 1626-1672 గోల్కొండ చరిత్ర సంస్కృతీ శాసనములు.[11]

పై వివిధ చారిత్రక గ్రంథముల ఆధారంగా పరిశీలించిన మీదట 1626-1672 అబ్దుల్లా కాలమని, గోల్కొండను అబ్దుల్లా 47 సం॥లు పరిపాలించాడని స్పష్టమౌతుంది.

---

1. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందుశేఖరం పుట 167.
2. భారతి జూలై 1951, భద్రాచలం - భావరాజు వేంకటకృష్ణారావు.
3. The Great Composers - P. Samba Murthy.
4. H.K. Sherwani - History of Qutb Shahi Dynasty, New Delhi 1974.
5. The Qutb Shahis of Golconda , Hyderabad.
6. శతక సంపుటము - వావిళ్ల రామస్వామి అండ్ సన్స్, 1926.
7. అనుభవ కవి కంచెర్ల గోపన్న - బి.రామరాజు 'శౌరి సమాజ కవులు' సంపా. కె.కె. రంగనాథాచార్యులు.

8,9. మాదన్న మహామంత్రి, కె.వి. భూపాలరావు, మాదన్న ట్రస్టు, సావిత్రీ సదనము, బర్కత్‌పుర, హైదరాబాదు.

10. నాలుగు శతాబ్దాల నగరం, వేదగిరి రాంబాబు, పుట - 60.
11. గోల్కొండ చరిత్ర - సంస్కృతి - శాసనములు, బి.ఎన్. శాస్త్రి, మూసీ పబ్లికేషన్స్, హైదరాబాదు.

## 1.4.1.2. తానీషా (అబుల్ హసన్ కుతుబ్షా) కాలం :

అబుల్ హసన్ కుతుబ్షా అబ్దుల్లా కుతుబ్షాకు చిన్న అల్లుడు. ఆఖరి కుమార్తె భర్త. అబ్దుల్లాకు కుమారులు లేరు. ముగ్గురూ కుమార్తెలే. చివరి అల్లుడు అబుల్ హసన్ కుతుబ్షా, ఇతడే తానాషాగా ప్రసిద్ధుడు.

తానాషా పరిపాలనా కాల నిర్ణయాన్ని గూర్చి పలువురు చరిత్రకారుల అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.

1. ఏటుకూరి బలరామమూర్తి,[1] కె.వి.లక్ష్మణరావు,[2] ఖండవల్లి లక్ష్మీరంజనం,[3] కొడాలి లక్ష్మీనారాయణగారు,[4] మొ॥వారు తానాషా 1658 నుండి 1687 ప్రాంతం వరకు గోల్కొండను పాలించాడని వివరించారు.

2. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశంలోనూ,[5] Gazetter of India లోనూ[6] Imperial Gazetter లోనూ[7] భట్టిప్రోలు హనుమంతరావుగారి ఆంధ్రుల చరిత్రలోనూ,[8] తానీషా 1672 నుండి 1687 వరకు పాలించినట్లు తెలుపబడింది.

3. మెకంజి గారి కృష్ణా జిల్లా మాన్యుయల్‌లోనూ,[9] కొండపల్లి రామచంద్రరావు గారి భద్రాచల క్షేత్ర చరిత్రలోనూ,[10] తానాషాగారు 1669 నుండి 1687 వరకు గోలకొండను పాలించినట్లు[11] వ్రాయబడిఉంది. అబుల్ హసన్ కాలం మిన్నికంటి గురునాథ శర్మగారు 1658-87[12] అని , డి. అశోక కుమారి గారు 1672-87 అని,[13] భావరాజు వేంకట కృష్ణారావు గారు, వేదం వేంకటరాయ శాస్త్రిగారు[14] 1672-87 అని , కె.వి.గోపాలకృష్ణారావు గారు,[15]

---

1. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర - ఏటుకూరి బలరామ మూర్తి , విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ -2 1975
2. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము -1, మహమ్మదీయ యుగం , కె.వి. లక్ష్మణ రావు.
3. ఆంధ్రుల చరిత్ర - ఖండవల్లి లక్ష్మీరంజనం.
4. భద్రాచల రామదాసు చరిత్రము - కొడాలి లక్ష్మీనారాయణ పుట 33.
5. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము -3, సంగ్రహాంధ్ర విజ్ఞాన సమితి ప్రచురణ హైదరాబాదు, 1962, పుట 478.
6. ది గెజిటీర్ ఆఫ్ ఇండియా, వాల్యూమ్ 3, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ వెల్ఫేర్ ఎడిటర్ డా॥ పి.ఎన్ చోప్రా, 1973, పుట 488.
7. ఇంపీరియల్ గెజిటీర్ - డబ్ల్యు ఇర్విన్
8. ఆంధ్రుల చరిత్ర - భట్టిప్రోలు హనుమంతరావు.
9. కృష్ణాజిల్లా మాన్యుయల్ - జి. మెకంజి.
10. శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్ర - కొండపల్లి రామచంద్రరావు. దేవస్థాన ప్రచురణ ఏప్రిల్ 1971, పుట 27.
11. షార్ట్ హిస్టరీ ఆఫ్ భద్రాచల - కొండపల్లి రామచంద్రరావు.
12. రామదాసు చరిత్ర - విమర్శనము అక్టోబరు భారతి 1931.
13. శ్రీ భద్రాచల రామదాసు కీర్తనలలో భక్తి మరియు రస పోషణ -శ్రీమతి డి. అశోక కుమారి.
14. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము- బాలాంత్రపు రజనీకాంతరావు.
15. గోలకొండ నవాబులు - డా॥ కె.వి. గోపాల కృష్ణారావు తెలుగువాణి 1975, పుట 43-48.

రజనీకాంతరావుగారు,[1] బి.ఎన్.శాస్త్రి గారు,[2] ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరం గార్లు[3] 1672-87 అబుల్ హసన్ గోల్కొండను పరిపాలించిన కాలంగా పేర్కొన్నారు. కె.వి.భూపాలరావు గారు, తానాషా 1672 ఏప్రిల్ 21న రాజ్యానికి వచ్చి 1687 సెప్టెంబరు వరకు గోల్కొండ రాజ్యాన్ని 16 సం॥లు పరిపాలించాడు అని తెలియజేశారు.[4]

1. హావీవర్టు అనే డచ్చి యాత్రికుడు తన గ్రంథంలో 1663 తర్వాత తానీషా రాజై 1687 వరకు పరిపాలించాడని పేర్కొన్నాడు. 1687 సం॥న తానీషాను ఔరంగజేబు బంధించి దౌలతాబాదు ఖైదులో బంధించాడు.[5]

2. వేదగిరి రాంబాబు 1672-1687 తానాషా కాలం అని, 1687-1700 వరకు దౌలతాబాదు ఖైదులో ఉంచబడినాడు అని తెలియజేశారు.[6]

3. పి.సాంబమూర్తి గారు 1672-1686 అబుల్ హసన్ కాలం అని చెప్పారు.[7]

4. స్తంభాద్రి గ్లింప్సెస్ ఆఫ్ ఖమ్మం హిస్టరీలో 1658-1687 అబుల్ హసన్ కుతుబ్షా కాలం అని వ్రాయబడింది.[8]

5. బులుసు వేంకట రమణయ్యగారిచే పరిష్కృతమైన (సింగరదాసు)రామదాసు చరిత్రంలో 1669 అని ఉంది.[9]

6. భావరాజు వేంకట కృష్ణారావు, తానీషా 1672లో రాజైనాడని వ్రాశారు.[10]

7. శతక సంపుటంలో 1664-87 లో తానీషా రాజైనాడని రాయబడింది.[11]

8. భద్రాద్రి శ్రీరామ చంద్ర ప్రభువు ఉత్సవ సంచిక వాగ్గేయకార మహోత్సవ సంచికలో 1674-1699 అబుల్ హసన్ కాలం అని ఉంది.[12]

9. హిస్టరీ ఆఫ్ కుతుబ్‌షాహీ డైనాస్టీలో 1674-1699 అబ్దుల్లా కుతుబ్షా కాలం అని, 1687లో ఔరంగజేబుకు ఖైదీగా చిక్కాడని చెప్పబడి ఉంది.[13]

10. 21-4-1672 నుండి 17-9-1687 అని కుతుబ్షాహీస్ ఆఫ్ గోల్కొండ అనే గ్రంథంలో ఉంది.[14]

---

1. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావు
2. గోల్కొండ చరిత్ర -సంస్కృతి -శాసనములు బి.ఎస్. శాస్త్రి, పుట 1-2.
3. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీ రంజనం, బాలేందు శేఖరం.
4. కె.వి. భూపాలరావు గారు మాదన్న ట్రస్టు, (నేను వారితో చేసిన ఇంటర్వ్యూలో తెలిసిన విషయం)
5. హావీవర్టు - ఆంధ్ర పరిషత్పత్రిక, శుక్ల నామ సం॥ ఆశ్వయుజ కార్తిక మాసములు సంపుటి 18 సంచిక 4.
6. నాలుగు శతాబ్దాల నగరం- వేదగిరి రాంబాబు.
7. గ్రేట్ కంపోసర్స్- పి. సాంబమూర్తి.
8. స్తంభాద్రి గ్లింపసెస్ ఆఫ్ ఖమ్మం హిస్టరీ, కొదమసింహం సత్యనారాయణాచార్యులు.
9. భద్రాచల రామదాసు చరిత్రము - బులుసు వేంకటరమణయ్య గారి పరిష్కృతము -సింగరదాసు.
10. భద్రాచలము భావరాజు వేంకట కృష్ణారావు, పుట 651, భారతి 1951 జులై.
11. శతక సంపుటము పుట 118, వాల్యూం 1.
12. భద్రాద్రి రామచంద్ర ప్రభువు ఉత్సవ సంచిక పుట 23.
13. హెచ్.కె. షేర్వాని-హిస్టరీ ఆఫ్ కుతుబ్‌షాహీ డైనాస్టీ
14. ది కుతుబ్‌షాహీస్ ఆఫ్ గోల్కొండ - హెచ్.కె. షేర్వాని.

11. 1687 సెప్టెంబరు 21న దౌలతాబాదు జైలులో బంధింపబడి 1704 వరకు ఖైదులో ఉండి మరణించాడు తానీషా.[1]

12. తానీషా కాలం 1672-1687 అని రామరాజు గారు అభిప్రాయపడ్డారు.[2]

ఇంతవరకు పరిశీలించిన వివిధ చరిత్రకారుల, పరిశోధకుల గ్రంథాలను బట్టి అబుల్ హసన్ కాలం 1672-1686 అని, 1687లో ఔరంగజేబుకు బందీగా తానీషా చిక్కి దౌలతాబాదు ఖైదులో ఉంచబడినాడని చరిత్ర గ్రంథాల వల్ల తెలుస్తుంది. 1687-1704 (1700 అని కొందరు) వరకు ఖైదులో ఉండి తానీషా మరణించాడు. 14 సం॥లు తానీషా ఖైదులో ఉన్నాడు.

అబ్దుల్లా కాలం 1626-72, తానీషా కాలం 1672-87 అని స్పష్టమైంది. రామదాసు తానీషా కాలంలోనే తహసీల్దారు కావడమూ, రామాలయ నిర్మాణం చేయడమూ, కారాగార వాసము 12 ఏండ్లు అనుభవించడమూ చివరికి కారాగార విముక్తుడై భద్రాద్రిని చేరుకోవడమూ ఇదంతా అబుల్ హసన్ కాలంలోనే జరిగి ఉండక పోవచ్చని చరిత్రకారులు చేసిన కాల నిర్ణయాన్ని బట్టి తెలుస్తుంది.

అబ్దుల్లా కాలం 1626-72 ఈ మధ్యలో 1650 ప్రాంతంలో తహసీల్దారు అయి ఉండవచ్చని చెప్పవచ్చు. తానీషా కంటె ముందు పరిపాలించిన అబ్దుల్లా కుతుబ్షా పరిపాలనా కాలంలో రామదాసు గారు తహసీల్దారై కారాగారంలో బంధింపబడి ఉంటాడని, అబ్దుల్లా కుతుబ్షా తర్వాత రాజైన అబుల్ హసన్ తానీషా పరిపాలనా కాలంలో రామదాసు గారు చెర నుండి విడుదలై భద్రాద్రిని చేరుకొని ఉంటాడని చరిత్రకారులు, ఆధునిక విమర్శకుల కొందరు అభిప్రాయ పడుతున్నారు. వీరు నిర్ణయించిన కాలాలు ఇందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

### 1.4.1.3. భద్రాచలంలో రామదాసు రామాలయ నిర్మాణం గావించిన కాలం :

భద్రాచలం తాలూకా తహసీల్దారుగా అయిన తర్వాత రామదాసు భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర ప్రభువు దేవస్థానాన్ని సముద్ధరించాడు. తిరిగి ప్రాచీన కాలం నాటి రామాలయం నిర్మాణం గావించబడింది. ఈ రామాలయ నిర్మాణం ఎప్పుడు జరిగిందో పరిశీలించ వలసి ఉంది.

1. వేదగిరి రాంబాబు 1674లో రామాలయ నిర్మాణం గావింపబడిందని అభిప్రాయపడినారు.[3] (అబుల్ హసన్ కాలంలో రామాలయ నిర్మాణం జరిగిందని ఈతని అభిప్రాయం)

2. 1652 ప్రాంతంలో రామాలయ నిర్మాణం జరిగింది.అని శ్రీ రామాలయ సముద్ధరణము అనే వ్యాసంలో చెప్పబడింది.[4]

1. Qutbshahi king of a land mark

2. తెలుగులో తొలి సమాజ కవులు - ఆచార్య బి. రామరాజు, అనుభవ కవి కంచెర్ల గోపన్న వ్యాసం, ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రచురణలు.

3. వేదగిరి రాంబాబు - నాలుగు శతాబ్దాల నగరము.

4. శ్రీ రామాలయ సముద్ధరణము - ఆరాధన, జూన్, 1960, పుట 6.

3. రామదాసు చరిత్రములో 1674లో ఆలయ నిర్మాణం జరిగిందని వ్రాయబడి ఉంది.[1]

4. భద్రాచలంలో ఉన్న శాసన స్తంభం ఆధారంగా 1635-40 (39-40)లో రామాలయ నిర్మాణం జరిగిందని తెలుస్తుంది (ఇది అబ్దుల్లా కాలం)

5. The date of the inscription is the 9th day of the Sukla Paksha of the lunar month of Chitra of Nandana year Saka (1652).[2]

1652 నందన నామ సంవత్సరం అని ఈ శాసన స్తంభంలో ఉంది. శాసన స్తంభం ఆధారంగా పరిశీలించి చూస్తే 1635-40 మధ్య రామాలయ నిర్మాణం జరిగిందని, క్రీ.శ. 1652లో జరిగిందని కొందరు రాశారు. ఈ శాసన స్తంభంలోని తేదీని బట్టి 'రామాలయ సముద్ధరణ' అనే వ్యాసంలోని తేదీ సం॥ 1652ను బట్టి ఈ ఆలయ నిర్మాణం అబ్దుల్లా కుతుబ్షా కాలంలో జరిగిందని చెప్పవచ్చు.

## 1.4.1.4. రామదాసును ఖైదులో ఉంచబడిన కాలం :

రామదాసు రామాలయ నిర్మాణం గావించి, ఆ ఆలయన నిర్మాణం కొరకై ప్రభుత్వ ధనం ఆరు లక్షల రూపాయలు వెచ్చించినందున, రామదాసును కుతుబ్షాహీ రాజు ఖైదులో ఉంచాడు. అబ్దుల్లా కాలంలో రామదాసు ఖైదులో ఉంచబడినాడని కొందరు, అబుల్ హసన్ తానీషా కాలంలో ఉంచబడినాడని కొందరు చరిత్రకారులు, విమర్శకులు అభిప్రాయపడినారు. వివిధములైన కాల నిర్ణయాలు ఈ క్రింది విధంగా చేశారు.

1. శ్రీమతి డి. అశోక కుమారి క్రీ.శ. 1665 లో రామదాసు ఖైదులో ఉంచబడెనని అభిప్రాయపడినారు.[3]

2. వేదం లక్ష్మీ నారాయణ శాస్త్రి , భావరాజు వేంకట కృష్ణారావు గారు 1665 ప్రాంతం అని,[4]

3. మాదన్న 1674-1686 వరకు మహా మంత్రిగా ఉన్న ఈ 13 సంవత్సరాల కాలంలో మాదన్న గారి మేనల్లుడు 12 సం॥లు ఖైదులో ఉన్నాడనడానికి వీలు లేదు" అని కె.వి. భూపాలరావుగారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంకా 1660-66 (1665-66) ఆ కాలంలో అంటే అబ్దుల్లా కుతుబ్షా కాలంలో రామదాసు జైలుకు వెళ్ళి ఉండవచ్చు అని అభిప్రాయం తెలియజేశారు భూపాలరావు గారు.[5]

---

1. భద్రాచల రామదాసు చరిత్రము - సింగరదాసు -బులుసు వేంకటరమణయ్య గారిచే పరిష్కృతము.
2. ది గ్రేట్ కంపోసర్స్ - పి. సాంబమూర్తి.
3. శ్రీ భద్రాచల రామదాసు కీర్తనలలో భక్తి మరియు రసపోషణం - డి. అశోక కుమారి, పుట 8.
4. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావు గారు.
5. కె.వి. భూపాలరావు గారు మాదన్న ట్రస్టు, సావిత్రీ సదనం, బర్కత్‌పుర, హైదరాబాదు.
6. భూపాలరావు గారితో నేను చేసిన ఇంటర్వ్యూలోని అంశాలివి.

మరో విషయం, "రామదాసును గోల్కొండ ఖైదులో బంధించలేదని భూపాలరావు గారి అభిప్రాయం. కారణం 12 సం॥లు పూర్తిగా కాళ్లకు, చేతులకు సంకెళ్ళు ఉన్నాయి"[1] అని అన్నారు. కాని ఇది నిజం కాదు. రామదాసు గోల్కొండ జైలులోనే ఉన్నారు. గోల్కొండ బందిఖానాలోని గోడలపై "రామ, లక్ష్మణులు, సీతాదేవి, హనుమంతుడి బొమ్మలు చెక్కబడి ఉన్నాయి. రామదాసే వీటిని ఖైదులో ఉండగా చెక్కాడని" చరిత్రకారులు అభిప్రాయపడినారు. అయితే భూపాలరావు గారు ఈ బొమ్మలకు, భద్రాచలంలోని రామాలయంలోని విగ్రహాల స్వరూపానికి తేడా ఉందని, అందుకే వాటిని రామదాసు చెక్కలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే రామదాసే బందిఖానాలో ఈ విగ్రహాలను జైలు గోడలపై చెక్కినాడని ఐతిహ్యం ఉంది.

తానీషా 12 సం॥లు రామదాసును ఖైదులో ఉంచి అష్ట కష్టాలు పెట్టెను"అని ఏకా సుబ్బారావు గారు అభిప్రాయపడినారు.[2]

వేదగిరి రాంబాబు గారు 1674 నుండి 12 సం॥లు తానీషా కాలంలోనే రామదాసు జైలులో బంధింపబడినాడని తెలియజేశారు.[3]

బి.ఎన్.శాస్త్రి గారు "అబ్దుల్లా తానీషా కాలంలో క్రీ.శ. 1665లో గోల్కొండ కోటలో రామదాసును చెర పెట్టించెను. 1677 వరకు చెరలో ఉండెను" అని తెలియజేశారు. అబ్దుల్లా కుతుబ్షా (తానాషా అనేది బిరుదు) కాలంలో (1626-1672) 1665 నుండి 1677 వరకు **అబుల్ హసన్ తానాషా** కాలంలో **జైలునందుండి 1677లో విడుదలైనాడు. తానాషా కాలం 1672-87, తానాషా రాజైన తర్వాత** 6 సం॥లకు రామదాసు జైలునుండి విడుదలైనాడు" అని బి.ఎన్.శాస్త్రి గారి అభిప్రాయం.[4]

"రామదాసు చరిత్రము" నందు 1674లో రామదాసు జైలుకు వెళ్లినట్లు చెప్పబడింది.[5]

1674లో అబుల్ హసన్ కాలంలోనే జైలునందు పెట్టబడి 1686లో ఖైదు నుండి రామదాసు విడుదలైనట్లు రామదాసు చరిత్ర కర్త అభిప్రాయం. అలాగే వేదగిరి రాంబాబు కూడా ఇదే విధంగా తెలియజేశారు. అయితే 1674-1686 మధ్య గోల్కొండ రాజ్య పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. ఔరంగజేబు 1686లో గోల్కొండను ముట్టడించి ఆక్రమించాడు. 1686లో ఎందరో హిందువులను చంపించాడు. అబుల్ హసన్ తానీషా కాలంలో మొగల్ చక్రవర్తి దాడులను అరికట్టే ప్రయత్నంలో మాదన్న మహామంత్రి సహాయంతో శివాజీ సంధి కుదుర్చుకొని తన రాజ్యం రక్షించుకొనే ప్రయత్నంలో తానీషా ఉన్నాడు. 1677 తర్వాత సమస్యలు మరింత ఉధృతంగా ఉన్నాయి. అస్తవ్యస్త రాజకీయ పరిస్థితుల మధ్య రామదాసు

1. కె.వి.భూపాలరావు గారు నాకు తెలియజేసిన అభిప్రాయం ఇది.
2. కొత్త సంగీత విద్యా దర్పణము - ఏకా సుబ్బారావు.
3. నాలుగు శతాబ్దాల నగరం - వేదగిరి రాంబాబు పుట 77
4. గోల్కొండ చరిత్ర -సంస్కృతి-శాసనములు -బి.ఎన్.శాస్త్రి పుట 140.
5. రామదాసు చరిత్రము (సింగరదాసు) బులుసు వేంకట రమణయ్యగారి పరిష్కృతము.

1686 వరకు జీవితం గడిపి ఉండకపోవచ్చు. ఒకవేళ రామదాసు 1686 వరకు జైలులో ఉంటే, ఆ సమయంలో ఔరంగజేబు ఘాతుకానికి అతడు కూడా బలి అయి ఉండవచ్చు అని అనుకుంటే తానాషా 'రామదాసు'కు భద్రాద్రి ఆలయ కైంకర్యానికి ఇచ్చిన భద్రాచలం, తదితర పరగణాలు అగ్రహారాలు, దానంగా ఇచ్చినట్లు భద్రాచల ఆలయంలోని శాసన స్తంభం రామదాసే వేయించినట్లు, వరద రామదాసు 'రామదాసు చరిత్ర' వలన తెలుస్తుంది. కావున రామదాసు 1686 వరకు జైలులో లేడని నిర్ణయించవచ్చు. 12 సం॥లు మాత్రం జైలులో ఉన్నాడు. కావున 1674-1686 వరకు ఉండడం అసంభవం. కావున అబ్దుల్లా కాలంలోనే 1665 నుండి అబుల్ హసన్ కాలంలో 1677 వరకు జైలులో ఉన్నాడని చెప్పవచ్చు.

పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు గారు కూడా 1674-86 మధ్య కాలంలో రామదాసు జైలు జీవితం గడిపినాడని వ్రాశారు.[1] వీరి కాల నిర్ణయం కూడా సరియైనది కాదని భావించవచ్చు.

భద్రాచల దేవాలయ రాతి స్తంభ శాసనం నందు రామదాసు 1640-51లో జైలు జీవితం గడిపినట్లు ఉంది. ఇది అబ్దుల్లా కుతుబ్షా కాలం. రామదాసు అబ్దుల్లా కుతుబ్షా కాలంలోనే జైలు జీవితం గడిపినాడని ఈ శాసనంలో ఉంది.[2]

రజనీకాంతరావు గారు 1665-1677వరకు 12 సం॥లు రామదాసు జైలులో ఉండినట్లు తెలియజేశారు. వారి అభిప్రాయం కూడా అబ్దుల్లా కాలంలో ఖైదులో ఉంచబడి అబుల్ హసన్ కాలంలో విడుదలైనట్లుగా భావించవచ్చు.[3]

శతక సంపుటంలో కూడా 1665 నుండి 12 సం॥లు అంటే 1677 వరకు రామదాసు బందిఖానాలో ఉండినట్లు చెప్పబడింది. అబ్దుల్లా కుతుబ్షా కాలంలోనే రామదాసు జైలునందు పెట్టబడెనని ఈ కాలం బట్టి నిర్ణయించవచ్చు.[4]

బి. రామరాజు గారు క్రీ॥శ.1665లోనే జైలులో పెట్టబడినాడు రామదాసు"అని కాల నిర్ణయం చేశారు. వారి అభిప్రాయం ద్వారా కూడా అబ్దుల్లా కుతుబ్షాయే రామదాసును గోల్కొండ జైలునందు బంధించాడని స్పష్టమౌతుంది.[5]

---

1. భక్త కవి పుంగవులు - పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు
2. ఈ శాసనాన్ని వంగూరి సుబ్బారావు గారు తమ శతక సంపుటంలో ప్రచురించారు. శతక సంపుటం, సంపా : వంగూరి సుబ్బారావు.
3. భక్త రామదాసు కీర్తనలు - పీఠిక, బాలాంత్రపు రజనీకాంతరావు (సంకలనం దాశరథుల బాలయ్య) పుట 12.
4. శతక సంపుటము - వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ 1926.
5. అనుభవ కవి కంచెర్ల గోపన్న, బి. రామరాజుగారు- తెలుగులో తొలి సమాజ కవులు - సంపా: కె.కె.రంగనాథాచార్యులు, ఆంధ్రసారస్వత పరిషత్ ప్రచురణలు, హైదరాబాదు.

పై వివిధ చరిత్రకారులు, విమర్శకులు నిర్ణయించిన కాలం బట్టి చూస్తే రామదాసును అబుల్ హసన్ తానాషా బంధించలేదని, అబ్దుల్లా కుతుబ్షాయే బంధించాడని, అబుల్ హసన్ తానాషా విడుదల చేసాడని స్పష్టమౌతుంది. అబుల్ హసన్ తానాషా కాలంలోనే 12 సం॥లు రామదాసు జైలు శిక్ష అనుభవించాడని చెప్పడం కష్టం. రామదాసు జైలులోనే మరణించాడని కొందరు, జైలునుండి విడుదలై కొంతకాలం భద్రాచలంలో తహసీల్దారుగా ఉండి చరమ జీవితాన్ని భద్రాచలంలో గడిపాడని కొందరు చరిత్రకారులు వివిధమైన అభిప్రాయాలను వెల్లడి చేశారు. అసలు రామదాసు జైలు నుండి ఎప్పుడు విడుదలైనాడో పరిశీలించవలసి ఉంది. వివిధ చరిత్రకారుల, విమర్శకుల అభిప్రాయాలు, వారు చేసిన కాల నిర్ణయాన్ని బట్టి ఈయన జైలు నుండి ఎప్పుడు విడుదలైనాడనే విషయం నిర్ణయించవచ్చు. అందకు ఈ క్రింది విమర్శకుల, చరిత్రకారుల కాల నిర్ణయాలు పరిశీలించ వలసిఉంది.

## 1.4.1.5. రామదాసు గోల్కొండ ఖైదు నుండి విడుదలైన కాలం :

రామదాసు అబ్దుల్లా కుతుబ్షా కాలంలో క్రీ.శ. 1665 ప్రాంతంలో జైలులో పెట్టబడి, అబుల్ హసన్ కుతుబ్షా (తానాషా) కాలంలో క్రీ.శ.1677లో జైలు నుండి విడుదలైనట్లు చాలామంది చరిత్రకారులు, విమర్శకుల కాల నిర్ణయాన్ని బట్టి తెలుస్తుంది.

1677లో తానీషాకు రామ సాక్షాత్కారం అయిన పిదప రామదాసు జైలునుండ విడుదలైనాడు"[1] అని శ్రీమతి డి. అశోక కుమారి గారు తెలియజేశారు. రామదాసు జైలులో ఉన్న 12 సం॥లు కాలం నిరంతరం రామభక్తి పరాయణుడై, శ్రీ రామ చంద్రుని ధ్యానిస్తూ కాలం గడపసాగాడు. ఎప్పటికైనా శ్రీరామ చంద్రుడే తాను రామాలయ నిర్మాణానికై ఖర్చు చేసిన ప్రభుత్వ ధనం ఆరు లక్షల రూపాయలు తానాషాకు తిరిగి ఇచ్చివేసి, తనను కారాగార విముక్తుని చేస్తాడన్న నమ్మకం, శ్రీరామునిపై భక్తి విశ్వాసాలుంచి కాలం గడపసాగాడు. అలా 12 సం॥లు గడిచి పోయాయి. చివరకు విసిగి పోయిన రామదాసు రాముడు తనను కాపాడలేడని నిశ్చయించి విషం తీసుకొని మరణించాలని ప్రయత్నిస్తాడు. అంతట ఒకనాటి రాత్రి సమయంలో రామదాసు మొర విన్న రామ లక్ష్మణులు రామదాసు భటులుగా, రామదాసు పంపిన దూతలుగా తానీషాకు దర్శనమిచ్చి, రామదాసు గోల్కొండ ప్రభుత్వానికి చెల్లించవలసిన ఆరు లక్షల పైకం వడ్డీతో సహా కలిపి 10 లక్షలు బంగారు నాణాల రూపంలో ఇచ్చారు. తానీషా కడ రసీదు పొంది ఆ రసీదును రామదాసు కడ ఉంచి అంతర్ధానమయ్యారు. అంతట తానీషా తాను జరిగినది తెలుసుకొని, తానీషా తన కడకు వచ్చింది రామ లక్ష్మణులే అని గ్రహించి తనకు రామ దర్శనమైనందుకు ఎంతో ఆనందపడి, వెంటనే రామదాసు కడకు వెళ్ళి రామదాసును బంధ విముక్తుని

1. శ్రీ భద్రాచల రామదాసు కీర్తనలు భక్తి, మరియు రసపోషణ శ్రీమతి డి. అశోక కుమారి పుట 8

గావించి, సాదరంగా ఆహ్వానించి గౌరవించి, భద్రాచలం రామాలయ అభివృద్ధికి, రామ కైంకర్యానికి "భద్రాచలం, శంకరగిరి" పరగణాలు, ఇంకా ఇతర అగ్రహారాలును, రామదాసుకు తిరిగి ఆరు లక్షల పైకం ఇచ్చి సన్మానించాడు తానీషా. తానాషాకు రామ లక్ష్మణులు ఇచ్చిన నాణేలపై ఒకవైపు సీతా రామ లక్ష్మణుల పట్టాభిషేకం ముద్ర, మరోవైపు హనుమంతుడి ముద్ర ఉన్నాయి. వీటిని 'రామ టంకాలు' అని అన్నారు. "రామ టంకాలు"గా ప్రసిద్ధి గాంచిన ఆ నాణేల నమూనాలు ఈ నాటికి భద్రాచలం దేవస్థానంలో భద్ర పరచబడినాయి.

తానీషాకు రామదర్శనమైంది 1677 సం॥ అని చరిత్రకారుల అభిప్రాయం.

1. వేదం లక్ష్మీనారాయణ శాస్త్రి, భావరాజు వేంకట కృష్ణారావు గార్లు కూడా, 1677లో తానీషా శ్రీరామ సాక్షాత్కారం పొందిన అనంతరం, రామదాసు విడుదల జరిగిందని అభిప్రాయపడినారు.[1]

2. కె.వి.భూపాలరావు గారు కూడా 1676-77లో రామదాసు విడుదలైనాడని, 1684-86 మధ్య కాలంలో గోల్కొండ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, ఈ కాలంలో రామదాసు విడుదలయ్యాడని చెప్పలేము. అని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. తానాషా కాలంలోనే 1677లో రామదాసు ఖైదు నుండి విడుదలైనాడు అని భూపాలరావు గారు తెలియజేశారు , ఇంకా " రామదాసు జైలునుండి విడుదల అయిన తర్వాత భద్రాచలం, పానగల్లు, అశ్వారావుపేట మొదలైన ప్రాంతాలను రామదాసుకు దానంగా ఇచ్చినట్లు తానీషా ఒక ఫర్మానా ఇచ్చాడు. అది దొరకడం లేదు. అది లభ్యమైతే అన్ని విషయాలకు పరిష్కారం లభించవచ్చు" అని భూపాలరావుగారు అన్నారు.[2]

3. వేదగిరి రాంబాబుగారు 1686లో రామదాసు జైలునుండి విడుదలైనాడని అన్నారు.[3] 1686లో ఔరంగజేబు గోల్కొండను ముట్టడించాడు. ఆ సమయంలో గోపన్న ఖైదులో ఉండి ఉండకపోవచ్చును. ఒకవేళ ఖైదులో ఉంటే అక్కన్న, మాదన్నలతో పాటు రామదాసును కూడా హత్య గావించి ఉండేవారు ఔరంగజేబు సైనికులు, మత దురహంకారులు. కాని 1686కు ముందే అంటే 1677లోనే ఔరంగజేబు గోల్కొండ ముట్టడికి ముందే రామదాసు చెరనుండి విముక్తుడైనాడని భావించవచ్చు. పైగా భద్రచలం వెళ్లి రామదాసు భద్రాచలం ఆలయంలో ఒక శాసన స్తంభం నాటించాడు. అందులో భద్రాచలం ఆలయ కైంకర్యానికై 'అశ్వారావు పేట, పానగల్లు, భద్రచలం పరగణాలు' అగ్రహారాలుగా తానాషా ఇచ్చినట్లు వ్రాయబడి ఉంది. కావున రామదాసు చెరలోనే మరణించలేదని, బంధ విముక్తుడై భద్రాచలం తిరిగి వచ్చాడని, తహసీల్దారీ వృత్తి చేపట్టాడని స్పష్టమౌతుంది.

1. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావు
2. కె.వి.భూపాలరావు గారు - మాదన్న ట్రస్టు, సావిత్రీ సదనము , బర్కత్‌పుర, హైదరాబాదు.
3. నాలుగు శతాబ్దాల నగరం - వేదగిరి రాంబాబు.

4. బి.ఎన్.శాస్త్రి గారు 1677లో అబుల్ హసన్ తానాషా రామదాసును శ్రీరాముని ఆజ్ఞ మేరకు విడుదల చేశాడు అని తెలియజేశారు.[1]

5. రామదాసు చరిత్రములో 1686లో జైలు నుండి రామదాసు విడుదలైనట్లుగా ఉంది.[2]

6. గోపన్న చెరనుండి విడుదల కాక మరణించినట్లు శ్రీ బ్రహ్మయ్య పంతులు గారు ఖమ్మం జిల్లా మాన్యుయల్‌లో వ్రాశారు. బ్రహ్మయ్య గారు చెప్పిన దానికి భద్రాచలం శాసనం ఆధారంగా రామదాసు చెరలో మృతి పొందక విడుదలైనట్లు వంగూరి సుబ్బారావు గారు వారికి లేఖ వ్రాసి, రామదాసు చెరలో మృతి పొందలేదని, విడుదలైనాడని సమాధానమిచ్చారు. ఈ శాసనం ఆధారంగా 1652లో విడుదలై, 1680 వరకు చరమ జీవితం గడిపాడు.[3]

ఈ శాసనం ఆధారంగా అబ్దుల్లా కుతుబ్షా కాలంలో 1635లో తహసీల్దారై, 1635-40 ప్రాంతంలో ఆలయ నిర్మాణం గావించి, 1640-51 వరకు జైలు జీవితం గడిపి, 1652లో జైలు నుండి విడుదలై, 1680 వరకు చరమ జీవితం భద్రాచలంలో గడిపి చివరకు రామ సాయుజ్యాన్ని పొందినట్లు తెలుస్తుంది. ఈ శాసనాన్ని బట్టి చూస్తే అబ్దుల్లా కుతుబ్షా కాలంలోనే బంధింపబడి, అబ్దుల్లాచే రామదాసు విడుదల గావింపబడినాడు అని తెలుస్తుంది . ఔరంగజేబు 1686లో గోల్కొండను ముట్టడించే నాటికి రామదాసు జీవించి ఉండలేదని, 1680లోనే పరమపదించాడని, ఈ శాసనాన్ని బట్టి తెలుస్తుంది. అక్కన్న, మాదన్నల హత్య జరిగే నాటికి రామదాసు లేడు అని ఈ శాసనం చూస్తే అర్థం అవుతుంది. అయితే రామదాసు అబ్దుల్లా కాలంలో విడుదల కాలేదని ఇంతకు ముందే తెలియజేశాను.

7. బాలాంత్రపు రజనీకాంతరావు గారు "రామదాసు 1677లో చెరనుండి విడుదలైనట్లు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. రజనీకాంతరావు గారు కూడా అబుల్ హసన్ కాలంలో రామదసు చెరనుండి విడుదలైనట్లు స్పష్టం చేశారు.[4]

8. ఆరుద్రగారు రామదాసు 1674 నాటికి గోల్కొండ బందిఖానా నుండి విడుదలైనట్టుగా వ్రాశారు.[5]

9. బి. రామరాజుగారు కూడా 1677లో తానీషా రాజైన 3 సం॥లకు రామదాసు ఖైదు నుండి విడుదలైనాడని అభిప్రాయం వ్యక్తం చేశారు.[6]

ఈ వివిధ అభిప్రాయాలను బట్టి రామదాసు అబ్దుల్లా కాలంలో 1665 చెరలో పెట్టబడి, అబుల్ హసన్ కాలంలో 1677లో విడుదల కావింపబడినాడని చరిత్రకారుల కాలనిర్ణయాన్ని బట్టి చెప్పవచ్చు. అబ్దుల్లా 1665లో రామదాసును జైలులో పెట్టగా, అబుల్ హసన్ తానీషా కాలంలో 1677లో తానాషా రామ దర్శనం పొందిన పిదప రామదాసును విడుదల చేశాడు. మరియు భద్రాచలం, అశ్వారావు పేట,

1. బి.ఎన్.శాస్త్రి - గోల్కొండ చరిత్ర-సంస్కృతి-శాసనములు పుట 140.
2. రామదాసు చరిత్రము (బులుసు వేంకట రమణయ్య గారిచే పరిష్కృతము) (సింగర దాసు మూలం).
3. వంగూరి సుబ్బారావు గారు - శతక సంపుటం. ( ఆంధ్ర వాఙ్మయ విలాసం).
4. భక్తరామదాసు కీర్తనలు - పీఠిక, బాలాంత్రపు రజనీకాంతరావు, సంకలనం దాశరథుల బాలయ్య.
5. ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం - ఏడవ సంపుటం పుట 385.
6. అనుభవ కవి - కంచెర్ల గోపన్న - బి.రామరాజు, తెలుగులో తొలి సమాజ కవులు, సంపా: కె.కె. రంగనాథాచార్యులు.

పానగల్లు పరగణాలు భద్రాద్రి ఆలయ కైంకర్యానికై తానాషా రామదాసుకు దానంగా ఇచ్చాడు. ఈ విషయం ఒక ఫర్మానా ద్వారా తెలియజేశాడు. ఈ విషయమే భద్రచలం ఆలయ ప్రాంగణంలో గల రామదాసు వేయించిన శాసనంలో కూడా ఉంది.

ఇంతవరకు పరిశీలించిన రామదాసు జీవితంలో జరిగిన వివిధ సంఘటనల విషయమై జరిపిన కాల నిర్ణయం గూర్చి వివిధ విమర్శకుల అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి. మంచాళ జగన్నాథ రావు సంకలనం చేసిన 'రామదాసు కీర్తనలు' అనే పుస్తకంలో బాలాంత్రపు రజనీకాంతరావు పీఠిక రాస్తూ రామదాసు 1620 ప్రాంతాన జన్మించారని, 1650లో భద్రాచలం తహసీల్దార్ పదవి పొందాడని, 1665 నుండి 1677 వరకు కారాగారంలో బంధించినది అబ్దుల్లా కుతుబ్షాయే అని, 1675లో అబుల్ హసన్ తానాషా రాజు కాగా 1677లో తానాషా చేత కారాగార విముక్తుడైనాడని కనుక రామ సాక్షాత్కారం పొందిన తానాషా అబుల్ హసన్ తానాషాయే అని వారు అభిప్రాయం వెల్లడించారు.[1]

ఆచార్య బిరుదురాజు రామరాజు గారు కూడా ఇదే విషయాన్ని గూర్చి ప్రస్తావిస్తూ "రామదాసు గారు 1620 ప్రాంతంలో జన్మించి, 1680 ప్రాంతంలో పరమ పదించినట్లు ఊహించవచ్చు. కారాగార విముక్తుడై తిరిగి భద్రాచలం చేరుకొని శ్రీ రామచంద్రుని సేవలో కనీసం మూడేండ్లైనా జీవిత శేషం గడిపినాడనుకుంటే 1677లో అనగా తానాషా సింహాసనం అధిష్ఠించిన మూడేండ్లకు రామదాసు గారికి బంధ విమోచనం అయినట్లు భావించవచ్చు. ఆయన 12 ఏళ్ళు కారాగార వాసం అనుభవించినట్లు ఐతిహ్యం ఉంది కనుక 1665 ప్రాంతంలో చెరసాల పాలైనట్లు చెప్పకోవచ్చు. అది అబ్దుల్లా కుతుబ్షా కాలం. రామదాసును బందిఖానాలో పెట్టినది అబ్దుల్లా కుతుబ్షాయే గాని తానాషా కాదన్నమాట".

అబ్దుల్లా కుతుబ్షా కాలంలో అక్కన్న మాదన్నలు చిన్న చిన్న ఉద్యోగాల్లో ఉండిన వారే గాని పేష్కారు మీర్జుమ్లాలు కాదు. వారు ఆ ఉన్నత పదవులు అలంకరించింది తానాషా కాలంలోనే. రామదాసు గారు శ్రీ రామచంద్రుని చుట్టూ ప్రాకారాలు కట్టించే కైంకర్యం కోసం భద్రాచలానికి తరలిపోయినది 1660 ప్రాంతంలో కావచ్చు. అంతకు ముందు పన్నెండేండ్లయినా ఇతర ప్రాంతాలలో కొలువు చేసినారనుకుంటే 1650 అనగా తన 30వ ఏట రామదాసుగారు ఉద్యోగంలో చేలినట్లు భావించవచ్చు. కథలో ఉన్నట్లు రామదాసుగారు మొదటి సారిగానే తహసీల్దార్ పదవిలో నియుక్తులు కాకపోవచ్చును . . . ." అని తమ అభిప్రాయమును వెలిబుచ్చారు.[2]

1. రామదాసు కీర్తనలు - మంచాళ జగన్నాథరావు, సంకలనకర్త, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణలు, పీఠిక బాలాంత్రపు రజనీకాంతరావు గారు , 1975, పుట 6.

1. "తెలుగులో తొలి సమాజ కవులు" అనుభవ కవి - కంచెర్ల గోపన్న , ఆచార్య బిరుదురాజు రామరాజు పుట 52.

భావరాజు వెంకట కృష్ణారావు గారు 'భారతి'లోనూ, వేదం లక్ష్మీ నారాయణ శాస్త్రి గారు పీఠికలోనూ రామదాసు 1620-1680 ప్రాంతానికి చెందినట్లు కాల నిర్ణయం చేసి నిరూపించినట్లు, బాలాంత్రపు రజనీకాంతరావు గారు మంచాళ వారి రామదాసు కీర్తనలు పీఠికలో తెలిపినారు.[1]

పై చారిత్రకుల అభిప్రాయాల ఆధారంగా రామదాసు గారు 1620లో పుట్టారని, 1650లో ఉద్యోగంలో చేరాడని, తర్వాత తహసీల్దారై 1665 వరకు ఆలయ నిర్మాణం పూర్తి చేశాడనీ, 1665 నుండి 1677 వరకు కారాగార వాసం అనుభవించి 1680 లో పరమపదించాడని చెప్పకొవచ్చు. వివిధ చారిత్రకుల అభిప్రాయాలను బట్టి తేలిన విషయం పరిశీలిస్తే గోల్కొండ కోటలోని బందిఖానాలో బంధింపబడినాడని, అబుల్ హసన్ తానాషా అతనిని చెర నుండి విముక్తి గావించినాడని స్పష్టమౌతుంది. అంటే రామదాసు చరిత్ర గ్రంథాలలో తానీషాయే రామదాసును బంధించి, తానీషాయే విడుదల చేసినట్లున్న కథ నిజం కాదని ఈ పరిశీలనను బట్టి స్పష్టమౌతున్నది .

1. రామదాసు కీర్తనలు - మంచాళ జగన్నాథ రావు పీఠిక పుట 1, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణలు, హైదరాబాదు.

రెండవ అధ్యాయం

# రామదాసు కాలం నాటి సామాజిక పరిస్థితులు

# రెండవ అధ్యాయము

# రామదాసు కాలం నాటి సామాజిక పరిస్థితులు

ఒక పదం కాని, పాటగాని, ఒక కావ్యం కాని ప్రాదుర్భవించడానికి ఎన్నో కారణాలుంటాయి. అందులో ముఖ్యంగా ఆ రచయిత, కవి పుట్టిన కాలం, దేశం, సమాజం, రాజకీయ వ్యవస్థ చారిత్రక పరిస్థితులు, సాహిత్యం పరిణామ యుగంలోని రచయిత అస్తిత్వ ఇవన్నీ ప్రధాన పాత్ర వహిస్తాయి. రామదాసు విషయంలో కూడా ఈ దృక్పథంతో అధ్యయనం చేయాల్సి ఉంది.

రామదాసు కాలం నాటి చారిత్రక, రాజకీయ, సామాజిక, సాంస్కృతికమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని వీటి ప్రభావం రామదాసు కీర్తనలపై అతని రచనలపై ఏ విధంగా ఉందో విశ్లేషించడం అవసరం. రామదాసు కీర్తనల సాహిత్యం గూర్చి ప్రస్తావించే ముందు "రామదాసు జీవించిన కుతుబ్షాహీ రాజుల కాలం నాటి రాజరిక వ్యవస్థ, చారిత్రక సంఘటనల గూర్చి పరిశీలించాల్సి ఉంది.

## 2.0. కుతుబ్షాహీ రాజులు - చారిత్రక నేపథ్యం :

తెలుగు ప్రజల రాజకీయ వ్యక్తిత్వాన్ని, సంస్కృతిని రూపు దిద్దింది తూర్పు చాళుక్య రాజ్యం. దీని కేంద్రం కోస్తా ఆంధ్ర దేశం. తెలుగు వెలసింది కోస్తా ఆంధ్రలోనైనా, వికసించింది కాకతీయుల కాలంలో. దీని కేంద్రం తెలంగాణం. ఈ తెలుగు సంస్కృతి వికాస భాగంగా నాయంకర క్షాత్రప విధానం, శైవ ధర్మం, సరస్సుల సహాయంతో సేద్యం కొనసాగించే పద్ధతి, వాణిజ్య సంప్రదాయం, వాటన్నింటిని అనుసరించి ఎదిగిన కుల వ్యవస్థ స్థిర పడ్డాయి. 200 సంవత్సరాలలో ఈ క్లిష్టమైన తెలుగు సంస్కృతితో బహమనీ, కుతుబ్షాహీ రాజ్యం, మొగలు సామ్రాజ్యానికి విడిగా స్వతంత్రంగా ఏర్పడింది. తుర్కో పర్షియన్ సంస్కృతిని ప్రాతి పదికగా చేసుకొని ప్రబలిన ఇస్లామిక్ రాజ్యం ఇది.

బహమనీ సామ్రాజ్యం క్రీ.శ.1600లలో స్థాపించబడింది. బహమనీ సామ్రాజ్యం "బీదరు, బీరారు, బీజపూరు, అహమ్మదునగరు, గోల్కొండ" అనే అయిదు రాజ్యాలు కలిసి ఏర్పడింది. కొంతకాలానికి ఏకంగా ఉన్న బహమనీ సామ్రాజ్యం విఛ్ఛిన్నమై బీదరు, బీరారు, గోల్కొండ, బీజపూరు, అహమ్మదునగరు అనే అయిదు రాజ్యాలుగా విడిపోయింది. గోల్కొండ బహమనీ సామ్రాజ్యాంతర్భూతమైంది. ఈ రాజ్యాన్ని ఏలిన వారు కుతుబ్షాహీలు.

గోలకొండ కుతుబ్షాహీలు తమ ఉచ్ఛ దశలో పూర్తి తెలుగు దేశాన్ని దాదాపు మూడు వంతులు కన్నడ దేశాన్ని, తమిళ దేశంలో కొంత భాగాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకొని పరిపాలించారు. గోల్కొండ రాజ్యాన్ని రమారమి రెండు వందల సంవత్సరాలు పాలించిన కుతుబ్షాహీ వంశానికి మూల పురుషుడు 'సుల్తాన్ కులీ కుతుబుల్ముల్కు'. బహమనీ వంశపు తుది చక్రవర్తియైన మహమూద్ షా బహమనీ కాలంలో ఈతడు తన భవిష్యత్తును అన్వేషించుకుంటూ మహమ్మదాబాద్ బీదరుకు వచ్చాడు. తుర్కిస్థానులోని 'ఖురానే'లు అనే ప్రసిద్ధి చెందిన వంశమితనిది.

సుల్తాన్ కులీ తన జీవిత కాలంలో బహమనీల ఏలుబడిలో ఉన్న ప్రాంతాలను ఆక్రమించలేదు. బహమనీ రాజుల కాలంలో ఇతడు గోల్కొండకు సుబేదారుగా ఉన్నాడు. 24 ఏండ్లు సుబేదారుగా పరిపాలించాడు. 'కుతుబ్షాహీ వంశీయులీ రాజ్యాన్ని సుమారు నూట డెబ్బది సంవత్సరాలు పరిపాలించారని డా॥ కె. గోపాల కృష్ణారావు గారు పేర్కొన్నారు.[1]

ఈ సుల్తాన్ కులీ 1512లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించి గోల్కొండ రాజధానిగా గోలకొండ రాజ్యాన్ని స్థాపించాడు. ఆదిల్‌షాహీ, నిజాంషాహీ రాజ్యాలకు, నూతనంగా ఏర్పడ్డ గోలకొండ రాజ్యానికి అప్పడంతఃకలహాలు చెలరేగుతుండేవి. తమ తమ ప్రాబల్యాలను నిలుపుకోడానికై ప్రయత్నించుచుండేవారు.

## 2.0.1. గోల్కొండను పరిపాలించిన కుతుబ్షాహీ రాజులు :

గోలకొండ రాజ్యాన్నేలిన కుతుబ్షాహీ వంశీయులు ఎనిమిది మంది. వారు.

1. సుల్తాన్ కులీ కుతుబుల్ముల్కు (క్రీశ 1518-1543).
2. జంషీద్ కుతుబ్షా (క్రీ.శ. 1543-1550).
3. సుభాన్ కులీ (క్రీ.శ. 1550).
4. ఇబ్రహీం కులీ కుతుబ్షా (క్రీ.శ. 1550-1580).
5. మహమ్మద్ కులీ కుతుబ్షా ( క్రీ.శ. 1580- 1612).
6. సుల్తాన్ మహమ్మద్ కుతుబ్షా (క్రీ.శ. 1612-1626).
7. అబ్దుల్లా కుతుబ్షా (క్రీ.శ. 1626-1672)
8. అబుల్ హసన్ తానీషా (క్రీ.శ. 1672-1687).

క్రీశ 1687లో గోల్కొండ రాజ్యం అంతరించింది. ఈ ఎనిమిది మంది రాజుల గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

1. గోల్కొండ నవాబులు - డా॥ కె. గోపాల కృష్ణారావు గారు, తెలుగు వాణి 1975, పుట43-48.

## 1. సుల్తాన్ కులీ కుతుబుల్ముల్కు (క్రీ.శ. 1518-1543) :

సుల్తాన్ కులీ మొదటి గోల్కొండ రాజు. ఇతడు దక్షుడైన పాలకుడుగా కీర్తి వహించాడు. సుల్తాన్ కులీ పుత్రులలో క్రూరుడుగను (1525-1543) స్వార్థపరుడుగను, పితృ హంతకుడుగను వార్త కెక్కినవాడు జంషీద్ కుతుబ్షా రెండవ వాడు.

## 2. జంషీద్ కుతుబ్షా (క్రీ.శ. 1543-1550) :

జంషీద్ సోదరుడు ఇబ్రహీం. తండ్రి పరిపాలనా కాలంలో దేవరకొండ దుర్గాధిపతిగ ఉన్నాడు. కుటిల రాజనీతి పరుడగు జంషీద్ రాజ్యాధికారం వహించిన క్షణమున ఇబ్రహీం రాజ్యాన్ని వదలి విజయ నగర ప్రభువును ఆశ్రయించి అచటనే తల దాచుకొన్నాడు. జంషీదు మరణానంతరం అతని సోదరుడు విజయనగరం నుండి విచ్చేసి రాజ్యాధికారం స్వీకరించాడు. సుభాన్ కులీ గురించి అంతగా తెలియదు.

## 3. ఇబ్రహీం కుతుబ్షా (1550-1580) :

క్రీ.శ. 1550లో ఇతడు పట్టాభిషిక్తుడై 1580 వరకు పరిపాలించాడు. ఇతడు రాజనీతి విశారదుడుగను, కవి పండితుడుగను, పోషకుడుగను, ఉదార శీలుడుగను ప్రశస్తి వహించెను. తెలుగువారు మల్కిభరాముడు గా కీర్తించిన కుతుబ్షాహీ ప్రభువితడే.

## 4. మహమ్మదు కులీ కుతుబ్షా (1580-1612) :

ఇబ్రహీం కులీ మరణానంతరం అతని కుమారుడు మహమ్మదు కులీ కుతుబ్షా గోలకొండ సింహాసనం అధిష్టించాడు. ఇతడు భాగీరథికి జన్మించిన పుత్రుడు. పదిహేనవ ఏట అనగా 1580లో పట్టాభిషిక్తుడై క్రీ.శ. 1612 వరకు రాజ్యాన్ని పాలించాడు. తండ్రివలె మహమ్మదు కులీ రాజనీతి కుశలుడు, రసికత మూర్తీభవించిన రాజేంద్రుడు. ఈ సుల్తాను కాలం నాటికి గోలకొండ పరిసరాలు దినదినాభివృద్ధి చెంది జన సంకీర్ణంతో ఉన్నాయి. ఇతని కాలంలోనే మూసీ తీరమున నూత్న నగరం నిర్మించబడి భాగ్యనగరంగా ప్రశస్తి వహించి గోలకొండ సామ్రాజ్యానికి నూతన రాజధాని అయింది. ఈ నవాబు జాతి, మత విచక్షణ లేక ప్రజలను ప్రేమించాడు. అధికారులలో మీర్ మోమిన్, మహమ్మద్ అమీన్ వంటి వారితో పాటు ఎందరో హైందవులు ఉన్నత పదవులు అలంకరించారు. మహమ్మద్ కులీకి పురుష సంతానం కలగలేదు. భాగ్యమతి వల్ల జన్మించిన ఏకైక పుత్రిక హయత్ భక్షీ బేగంను సోదర పుత్రుడగు సుల్తాన్ మహమ్మద్‌కు ఇచ్చి క్రీ.శ. 1607లో వైభవంగా వివాహం జరిపించాడు. మహమ్మదు కుతుబ్షాహీ సామ్రాజ్యానికి అధీశుడై క్రీ.శ. 1612లో పట్టాభిషిక్తుడైనాడు.

## 5. మహమ్మదు కుతుబ్షా ( క్రీ.శ.1612-1626) :

మహమ్మద్ కులీ అల్లుడైన మహమ్మద్ కుతుబ్షా 1612 నుండి 1626 వరకు గోల్కొండ రాజ్యాన్ని పరిపాలించాడు.

## 6. అబ్దుల్లా కుతుబ్షా (క్రీ.శ. 1626-1672) :

సుల్తాన్ మహమ్మదుకు హయత్ బక్షీ బేగం వల్ల కలిగిన కుమారుడు అబ్దుల్లా కుతుబ్షా క్రీ.శ. 1626లో గోల్కొండ సుల్తానయ్యాడు. క్రీ.శ. 1626 నుండి 1672 వరకు పరిపాలించాడు. ఇతడి కాలమే గోలకొండ పతనానికి నాంది పలికింది. ఢిల్లీలో సుప్రతిష్ఠితమైన విజయ పరంపరలు సాధించిన మొగలాయి చక్రవర్తులు దక్షిణా పథంలో విజయ ధ్వజాన్ని నాటడానికై సంకల్పించారు. గోల్కొండపై దండయాత్రలు చేయడానికి ఆరంభించారు.. 17వ శతాబ్ది మధ్య ఆరంభమైన ఢిల్లీ సుల్తానుల దండయాత్రలను అసమర్థుడు, అశక్తుడును అయిన అబ్దుల్లా కుతుబ్షా ఎదుర్కొనలేక వారితో సంధిం చేసుకొన్నాడు. అచిర కాలంలో గోలకొండ సామ్రాజ్యం ఢిల్లీ సుల్తానులకు విధేయమై నామ మాత్రంగా స్వతంత్ర రాజ్యంగా ఉంది. 'అబ్దుల్లా మీర్జా' అనే పేరు గల అబ్దుల్లా కుతుబ్షా 21-11-1614లో జన్మించాడు. 1-2-1626లో అబ్దుల్లా కుతుబ్షా సింహాసన మధిష్టించాడు. అబ్దుల్లా తల్లి హయత్ బక్షీ బేగం పరిపాలనా దక్షత గలది. ఇతని అవసాన కాలంలో రాజ కుటుంబంలో కలహాలేర్పడినాయి. రాజ్య పీఠాన్ని చేజిక్కించుకొనడానికి ఇతని వారసులైన అల్లుండ్రు తగవులాడినారు.

అబ్దుల్లా కుతుబ్షాకు పురుష సంతతి లేదు. ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె గౌరవ కుటుంబానికి చెందిన 'సయ్యదహమదు'ను వివాహమాడింది . అబ్దుల్లా కుతుబ్షా 'సయ్యదు మహమదు'ను గోలకొండకు పిలిపించి ఉన్నతోద్యోగంలో నియమించాడు. సయ్యదహమదు కుతుబ్షా మన్ననలకు పాత్రుడై, అతని పెద్దల్లుడై, సమస్త రాజ్య కార్యాలను నిర్వహిస్తూ ప్రముఖుడైనాడు.

ఔరంగజేబు తనయుడైన మహమ్మదు సుల్తాను కుతుబ్షా రెండవ కుమార్తెను క్రీ.శ. 1656లో వివాహం చేసుకొన్నాడు. ఈమె భర్త వెంట ఉత్తర భారత దేశంలో నివసించింది . విచిత్ర పరిస్థితులలో అబ్దుల్లా కుతుబ్షా మూడవ కుమార్తె బాదుషా బీబీ వివాహం అబుల్ హసన్‌తో జరిగింది. అతడే గోలకొండ రాజ్యానికి ఆఖరి రాజుగా వారసుడయ్యాడు. 1672-1687 వరకు అతడు గోలకొండను పరిపాలించాడు. అబ్దుల్లా కుతుబ్షా 1626-1647 మధ్య గోల్కొండ రాజ్యాన్ని పాలించెను. 21-4-1672లో మరణించాడు. అబ్దుల్లా 1677 నవంబరు 23న ఔరంగజేబుకు బందీయై కృశించి మరణించాడని, శ్రీ కె.వి.భూపాలరావు గారు తెలియజేశారు.

అబ్దుల్లా కుతుబ్షా కాలంలో గోల్కొండ సామ్రాజ్యం మొగలులకు ఒక విధంగా సామంత రాజ్యం అయింది. దీనికి గల కారణాలు ఇవి.

1. అనుభవం లేని అబ్దుల్లా యుద్ధం వంకతో నెలలపాటు రాజ్యానికి దూరంగా వుండడంతో పాలనా యంత్రాంగం, మంత్రుల అధీనమైంది. వారు స్వార్థంతో స్వలాభాలు చూసుకొన్నారు.

2. అబ్దుల్లా చేసిన మరో తప్పు. మొగలుల వల్ల అహమ్మద్ నగర్ ఆపదలో ఉన్నప్పుడు దానికి సాయం చేయలేదు. దాంతో మొగలులు అహమ్మద్ నగర్‌ను ఆక్రమించి, గోల్కొండ మీద దృష్టి సారించారు. అబ్దుల్లా ఈ పరిణామాలను ఆకళింపు చేసుకోలేకపోయాడు.

3. సుఖమయ జీవితానికి అలవాటు పడిన అబ్దుల్లా యాత్రలు, షికార్లు ఎక్కువగా చేస్తుండేవాడు. అలాగే వర్షాకాలం వచ్చిందంటే రాజధాని వీడి ఎక్కడికో వెళ్ళి విలాస జీవితాన్ని గడిపేవాడు. కవి. సాహితీ పిపాసి, వీటన్నింటి కన్నా భోగ లాలసుడు.

ఈ కారణాల వల్ల అబ్దుల్లా కాలంలో రాజరిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండి, గోల్కొండ రాజ్యం గూర్చి అబ్దుల్లా పట్టించుకోనందు వల్ల, అసమర్థుడైన ఈ రాజు మొగల్ దాడులను అరికట్టే స్థితిలో లేనందు వల్ల ఈ గోల్కొండ రాజ్యం పతనావస్థకు దిగజారింది. నామ మాత్రంగా మిగిలింది. పై కారణాల వల్లనే అబ్దుల్లా మొగలులకు సామంత రాజయ్యాడు అని చెప్పవచ్చు.

అబ్దుల్లా గోల్కొండకు రాజుగా ఉండగా, మొగల్ చక్రవర్తిగా ఢిల్లీలో షాజహాన్ చక్రవర్తి ఉన్నాడు. సహజంగానే యుద్ధాలంటే భయపడే అబ్దుల్లా, షాజహాన్ బెదిరింపుకు భయపడి సంధి చేసుకొన్నాడు. మరికొంత కాలానికి గోల్కొండతో పాటు బీజపూర్ కూడా మొగలులకు సామంత రాజ్యం అయింది.

## అబ్దుల్లా కాలంనాటి రాజకీయ పరిస్థితులు :

మహమ్మద్ సయీద్ (మీర్ జుమ్లా) : గోల్కొండ రాజ్యం పతనం చెందడానికి, మొగలుల హస్తగతం కావడానికి ఈ మహమ్మదు సయీద్ అనే రాజద్రోహి ప్రధాన కారణం అని చెప్పవచ్చు. మహమ్మద్ సయీద్ అనే అతనిని అబ్దుల్లా కుతుబ్షా తన దర్బారులో చేర్చుకున్నాడు. క్రమంగా అతడు ఉన్నత పదవుల అలంకరిస్తూ కర్నాటక గవర్నరు అయ్యాడు. ఆ తర్వాత అబ్దుల్లా అతడిని మీర్‌జుమ్లా గా(ప్రధాన మంత్రి) నియమించాడు. ఆ తర్వాత 1645లో అతని నాయకత్వంలో గోల్కొండ సైన్యం కర్నాటక ప్రాంతాలపై దండెత్తి విజయం సాధించి కొంత భూభాగాన్ని ఆక్రమించింది. ఈ ప్రాంతం నుంచే ప్రభుత్వానికి సంవత్సరానికి నలభై లక్షల రూపాయలు ఆదాయం వచ్చేది. ఈ విజయంతో గనులు త్రవ్వించి విలువైన రత్నాలను స్వాధీనపరచుకొన్నాడు. సైన్యాన్ని సేకరించి స్వతంత్రుడిలా ప్రవర్తించసాగాడు. కర్నాటక ప్రాంత ధనాన్ని గోలకొండకి పంపించడం మానివేశాడు. అబ్దుల్లా గోలకొండకి రమ్మన్నా రాలేదు. మొగలులు సయీద్‌కి సహకరించారు. మహమ్మద్ సయీద్ కుమారుడు మహమ్మద్ అమీన్ "మేము మొగలు చక్రవర్తి ఉద్యోగులుగానే ఉండదల్చుకున్నాం"[1] అని ప్రకటించాడు.

"మహమ్మద్ సయీద్ సంబంధీకుల్ని ఎవ్వరిని ఎటువంటి ఇబ్బందులకూ లోను చేయ కూడదు" అని వర్తమానాన్ని మొగలు చక్రవర్తి ఔరంగజేబు అబ్దుల్లా కుతుబ్షాకు పంపించాడు.[2] ఈ అండతో మహమ్మదమీన్ గోలకొండలో హద్దులు మీరి ప్రవర్తించసాగాడు. అబ్దుల్లా కుతుబ్షా కోపంతో అతనిని బంధించాడు. విషయం తెలిసిన మొగలు చక్రవర్తి అబ్దుల్లాని మందలిస్తూ మహమ్మదమీన్‌ను అప్పగించమని ఆజ్ఞాపించాడు. ఔరంగజేబు 1655లో తన కుమారుడు మహమ్మద్ సుల్తాన్‌ను నాందేడుకు మహమ్మదమీనను బాధిస్తుంటే అబ్దుల్లా కుతుబ్షాను బంధించి తీసుకురమ్మని పంపించాడు.

1,2. నాలుగు శతాబ్దాల నగరం - వేదగిరి రాంబాబు పుట 58.

అబ్దుల్లా పిరికి వాడు కావడంతో చక్రవర్తి ఆజ్ఞ ప్రకారం మహమ్మదమీన్‌ను వదలి వేద్దామనుకొన్నాడు. కాని పెద్ద అల్లుడు సయ్యద్ అహమ్మద్, అబ్దుల్లా అమీన్‌ను వదలి వేస్తే అబ్దుల్లాను చంపేస్తానని బెదిరించాడు. ఈలోగా మహమ్మద్ సుల్తాన్ సైన్యంతో రావడంతో మహమ్మదమీన్‌ను అబ్దుల్లా విడిచి పెట్టాడు. అప్పుడు మొగల్పుర ప్రాంతంలో మొగలు సైనికులు హైదరాబాదు నగరంలోకి చొచ్చుకొని వచ్చి విచ్చలవిడిగా ప్రవర్తించసాగారు. వాళ్ళ దుశ్చర్యలను ఆపలేని దుస్థితిలో అబ్దుల్లా ఉన్నాడు. అందుకని మహమ్మదు సుల్తాన్‌తో సంధి ఒడంబడిక కుదుర్చుకొన్నాడు. సుల్తాన్‌కు అందుకు అధికారం లేదు. ఔరంగజేబు చక్రవర్తి అబ్దుల్లాకు విలువనివ్వ లేదు. చివరకు రాజమాత హయాత్ బక్షీ బేగంతో ఔరంగజేబుకి సంధి కబురు చేశాడు. ఆవిడ మాటలకు ఔరంగజేబు గౌరవ మిచ్చాడు. సుల్తాన్ అబ్దుల్లా రెండవ కుమార్తె బాదుషా బీబీని మహమ్మద్ సుల్తాన్‌కిచ్చి వివాహం చెయ్యడంతో పాటు యుద్ధ నష్ట పరిహారం చెల్లించడానికి సంధి జరిగింది. అబ్దుల్లా కుతుబ్షా తన వారసునిగా మొదట మహమ్మదు సుల్తాన్‌ను ప్రకటించాడు.

దీనితో మొగలులు గోల్కొండపై దాడి చేయడం తగ్గింది. దాంతో అబ్దుల్లా నిశ్చింతగా ఉన్నాడు. క్రమంగా గోల్కొండలో ఉన్న మొగలు ప్రతినిధి అధికారాన్ని చెలాయిస్తూ ప్రజలను బాధించసాగాడు. కుతుబ్షా అధికారులకు ఇతనే ఆజ్ఞలు ఇచ్చేవాడు. దాంతో ప్రజలు అబ్దుల్లా కుతుబ్షాను లెక్కచేయక మొగలు అధికారులకే ఎక్కువ విలువనిచ్చేవారు. అబ్దుల్లా రాజ దర్బారుకు రావడం మానేసి, గోలకొండ కోటలో అతివలతో కాలక్షేపం చేయసాగాడు. ఈ విధంగా అసమర్థుడు, బలహీనుడు అయిన అబ్దుల్లా కుతుబ్షా వల్ల గోల్కొండ రాజ్యం మొగలులకు దాసోహం అనవలసి వచ్చింది.

"మహమ్మద్ సుల్తాన్ తండ్రి కోపానికి బలై చెరసాలలో ఉండటంతో 1672లో అబ్దుల్లా మరణించిన తర్వాత మూడవ అల్లుడు 'అబుల్ హసన్' రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొన్నాడు. 1672లో ఇతడు గోల్కొండకు రాజయ్యాడు.

## 7. అబుల్ హసన్ కుతుబ్షా (తానీషా)(క్రీ.శ.1672-87) :

అబుల్ హసన్‌కు, అబ్దుల్లా కుతుబ్షాతో బాంధవ్యమున్నదని, అతడనామకుడై పనిలేక ఉండెనని, మొగలు జాతీయుడని, ఇరాన్ నుండి గోలకొండకు వచ్చాడని, అబ్దుల్లా కుతుబ్షా అన్న కుమారుడని, అల్లుడని వివిధములైన అభిప్రాయాలు చారిత్రకులు వెల్లడించారు.

సిద్ధిపేట స్థానిక గాథను అనుసరించి 'అబుల్ హసన్ అనంతగిరి నివాసియని, దూదేకుల వాడని, ఆ గ్రామ వాస్తవ్యులగు అక్కన్న మాదన్నలను బ్రాహ్మణులతనిని పోషించిరని, రాజైన పిదప వారికి ఉద్యోగాలు ఇచ్చాడని తెలుస్తుంది. అబుల్ హసన్ సత్ప్రవర్తన కలవాడు. భక్తిపరుడు. సర్వ మానవ శ్రేయస్సును ఆకాంక్షించువాడు. వీరుడు. పండితుడు. ఇతడికి రాజకుమార్తెతో వివాహం జరుగునను ఆశ లేకుండెను.

ఇతడు "షారాజు ఖిత్తల్" శిష్యుడై అతని చెంత ఆధ్యాత్మిక జీవితం గడుపుచుండెను. షారాజు అతనికి రాజ కుమార్తెతో వివాహం జరుగునని జోస్యం చెప్పాడు. అప్పటికి రాజకుమార్తె వివాహం సయ్యదు సుల్తాన్‌తో నిశ్చయమయింది.

అబుల్ హసన్ తండ్రి అబ్దుల్లా కుతుబ్షాకు బంధువు. వ్యాపారం చేసిన ఆయన చనిపోయేటప్పుడు అబుల్ హసన్‌కు ఏమి మిగల్చలేదు. తండ్రి చనిపోయే నాటికి అబుల్ హసన్ వయస్సు 14 సం॥లు. ఆ తర్వాత మరో 14 సం॥లు షారాజు శిష్యుడై కాలం గడిపాడు. ఈ సూఫీ మత గురువు శిష్యరికాన్ని స్వీకరించిన అబుల్ హసన్ సహవాసాన్ని నీచ సహవాసంగా భావించి ధనికులు దూరంగా ఉండేవారు. అబుల్ హసన్‌కు వేదాంతం బాగా వంటబట్ట సాగింది. ఇదిలా ఉండగా, అనుకోకుండా అబ్దుల్లా చివరి కూతురు వివాహం మొదట అనుకున్న సయ్యదు సుల్తాన్‌తో రద్దయి, అబుల్ హసన్‌తో జరుగుతుంది. ఇలా అబుల్ హసన్ అబ్దుల్లా కుతుబ్షా అల్లుడయ్యాడు. ఆ తర్వాత గర్విష్టి అయిన పెద్దల్లుడు సయ్యదహమదు మామగారిని బంధించి సర్వాధికారాలను చేజిక్కించుకున్నాడు. అబ్దుల్లా కాలంలో అక్కన్న మాదన్నలనే బ్రాహ్మణులు ఉద్యోగస్తులుగా ఉండేవారు. "సయ్యదు ముజఫరు, మూసాఖాను మొదలైన వారు హవల్దారులు అబుల్ హసన్‌కు అనుకూలంగా ఉన్నారు. అక్కన్న మాదన్నలు కూడా అబుల్ హసన్‌కు తమ పూర్తి సహకారాన్ని అందించడానికి సిద్ధమయ్యారు. అందుకని పెద్ద అల్లుడు, చిన్న అల్లుడి మధ్య శత్రుత్వం అధికమైంది. అయితే అబ్దుల్లా మరణించిన తర్వాత, చాలా తెలివిగా సయ్యదు ముజఫరు, సయ్యదహమదును, అతని భార్యను బందీలుగా చేసి అబుల్ హసన్‌ని గోల్కొండ సుల్తాన్‌గా ప్రకటించాడు. 1672లో అబుల్ హసన్ గోల్కొండ రాజయ్యాడు. మొహర్రం పండుగ 5వ దినాన 1672లో గోల్కొండ వారసునిగా ప్రకటింపబడినాడు.

సయ్యదు ముజఫర్ అమీరులుమ్రా బిరుదంతో సన్మానింపబడి మీర్ జుమ్లా పదవిలో నియుక్తుడైనాడు. అంతకు పూర్వం మీర్ జుమ్లాగా ఉన్న మహమ్మద్ సయీద్ అవినీతి పరుడని గ్రహించి పదవి నుండి అబుల్ హసన్‌చే తొలగింపబడినాడు.

మూసాఖాన్ హవల్దారు ఖాన్ ఖనాన్ బిరుదము పొంది ప్రధాన వ్యవహర్తగా నియోగింపబడినాడు. మాదన్న సయ్యద్ ముజఫర్ పేష్కారుగా, అక్కన్న మాదన్నకు ప్రధాన కార్యదర్శిగాను నియమింపబడినారు. అబుల్ హసన్ తానాషా, ప్రభుత్వాధికారులకు పండితులకు సింహాసనం అధిష్టించడంలో తనకు తోడ్పడిన వారందరికి కానుకలిచ్చి, సన్మానించాడు. సయ్యద్ ముజఫర్‌ను అత్యంత గౌరవంగా ఆదరంగా సంభావించాడు.

## 2.0.2.అక్కన్న - మాదన్నలు :

అక్కన్న మాదన్నలు అబ్దుల్లా కుతుబ్షా కాలంలో గోల్కొండకు వచ్చి ప్రభుత్వోద్యోగంలో చేరారు.

హనుమకొండ వాస్తవ్యులు వీరు. "అక్కన్న మాదన్నలు ఆర్వేల నియోగులనీ, ఋగ్వేదులనీ, వారి ఇంటి పేరు పింగళి వారనీ, వారి వంశీకులగు పింగళి వారును సిద్దలూరి వారునూ, ఇప్పటికి ఉన్నారనీ, వారికి గోలకొండ వ్యాపారులతో సంబంధ బాంధవ్యాలున్నాయనీ సాక్ష్యంగా తెలుస్తుంది.[1] ఇంకా క్రీ.శ. 1760-1797 మధ్య ఉన్న తిమ్మ గజపతి ఆస్థాన పండితుడగు లక్ష్మణ కవి తన "తుల్యా మహాత్మ్యము"లో

సీ॥ "సుల్తనబ్దుల్ హసన్ క్షోణీశ్వరుని చేత మాటి మాటికి బహుమాన మందె

మఱియును బింగళి మాదన్న భానూజీ మంత్రుల్ల వలన సమ్మానమొందె

అక్కన్న మొదలైన యట్టి పెద్దల చేత మేలు భూషణములు మెప్పలందె" [2]

అనుట వలనను, మఱియు గిమ్మూరు సీమ కైఫీయతులో కూడ "సుల్తాను శహా బహద్దరు అబ్దుల్ హసన్ అనే ప్రభువున్ను పింగళి మాదన్న గారును, విశేషమైన బహుమతీలున్ను జగతి' అనే బిరుద నామమున్ను ఇప్పించినారు.[3]అని ఉండడం వలన మాదన్న ఇంటి పేరు పింగళి వారనుట స్పష్టం అవుతుంది అని మిన్నికంటి గురునాథ శర్మగారు అభిప్రాయపడినరు.

వీరి తల్లిదండ్రులు భానోజీ పంతులు, భాగమ్మలు. హనుమకొండలో దస్తు వసూలు చేయు ఉద్యోగి భానోజీ పంతులు. అతని భార్య భాగమ్మ. కాకతీయుల కాలంలో హనుమకొండలో నివసించారు. వీరు. భానోజీ పంత్ ఓరుగల్లులో కాకతీయ రాజైన ప్రతాపరుద్రుని కొలువులో పని చేస్తుండేవాడు. వ్యవసాయదారుడు. భానూజీ పంత్ కుమారులు అక్కన్న మాదన్న, మల్లన్న విస్సన్న అనే నలుగురు. ముగ్గురు కుమార్తెలున్నారు. కుమార్తెల పేర్లు తెలియడం లేదు.

"ఒక కుమార్తెకు పొదిలి లింగన్న కుమారుడు. మరొక కుమార్తెకు పులిపల్లి వెంకన్న కుమారుడు. ఇతడు ప్రముఖ సేనానిగా 'రుస్తుంరావు' అను బిరుదు పొందెను. కంచెర్ల గోపన్న మని రథా నాయకుడు. భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి పొందిన వాడు మరొక కుమార్తె కుమారుడు. వీరు ముగ్గురు అంటే పొదలి లింగన్న, పులిపల్లి వెంకన్న, కంచెర్ల గోపన్నలు అక్కన్న, మాదన్నలకు మేనల్లుళ్లు అని చెప్పబడింది. అయితే దీనికి ఐతిహాసికంగా సరైన ఆధారాలు లేవు అని కె.వి.భూపాలరావు గారు పేర్కొన్నారు.[4] బాల్యం నుండే విద్యాభ్యాసమొనర్చి అరబ్బీ, పారసీ, ఆంధ్ర భాషలను క్షుణ్ణంగా నేర్చుకొని, రాజ ఫర్మానాలు చదువు కొనడం లోను, వ్రాయుటలోను నైపుణ్యం సంపాదించారు. అబ్దుల్లా కుతుబ్షా కాలంలో వారు గోలకొండకు వచ్చి కుతుబ్షా ప్రభుత్వోద్యోగులుగ నియమింపబడినారు.

---

1. భారతి అక్టోబరు 1931, రామదాసు చరిత్ర విమర్శనము - మిన్నికంటి గురునాథ శర్మ పుట 513.

2,3 . " " " "

4. మహామంత్రి మాదన్న కథ - కె.వి.భూపాలరావు పుట 12.

## 2.0.2.0. అక్కన్న మాదన్నల ఉద్యోగ జీవితం :

"1645 ప్రాంతంలో 20,22 సంవత్సరాల ప్రాయంలో అక్కన్న మాదన్నలు హైదరాబాదులో అబ్దుల్లా కాలంలో ఉద్యోగాలు సంపాదించారు. 1666లో సైనిక వ్యయాధికారిగా సయ్యద్ ముజఫర్‌కు మాదన్న కార్యదర్శి. అక్కడనే అక్కన్న కూడా సైనిక వ్యవహారాల సహాయకుడు.[1]" ఎక్కడ చేరినా తల వంచుకొని పని చేయడమే కొంతకాలం ఆదాయ శాఖలో పని చేశారు. వారి హోదాలు కూడా క్రమాభివృద్ధి చెందుతున్నాయి.. అబ్దుల్లా కుతుబ్షా పరిపాలన ముగిసే నాటికి అక్కన్న మాదన్నలు పరిపాలనలో ప్రముఖులైనారు.

"తదుపరి తానాషా రాజైన తర్వాత 1672లో మీర్ జుమ్లా సయ్యద్ ముజఫర్‌కు కార్యదర్శిగాను, ఆదాయ శాఖకు మంత్రిగాను నియుక్తుడయ్యెను. అవినీతి కారణంగా మీర్ జుమ్లా పదవి నుండి సయ్యద్ ముజఫర్‌ను తొలగించి తానాషా 1674లో మాదన్నను ప్రధాన మంత్రిగా నియమించెను. తానీషా మాదన్న మంత్రికి 'సూర్య ప్రకాశ రావు' అనే బిరుదునిచ్చెను. తదుపరి అక్కన్నకు 'ముజఫర్ జంగ్ అక్బర్ బహదూర్' అను బిరుదునిచ్చెను.[2]

అక్కన్న మాదన్నలు గోలకొండ చరిత్రలోనే పేరు పొందారు. వీరు తానాషా కాలంలో ఉన్నత పదవులను పొందిరి. అబుల్ హసన్ తానాషా కాలంలో అక్కన్న సేనాపతిగాను, మాదన్న మహా మంత్రిగాను నియుక్తులైనారు. వారు ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడే సోదరుడు విస్సన్న హనుమకొండ అమిల్ గాను, మేనల్లుడు కంచెర్ల గోపన్న భద్రాచలం తాలూకా తహసీల్దారుగాను, మరొక మేనల్లుడు పులివల్లి వెంకన్న దండనాయకుడుగాను నియుక్తులైనట్లు "History of Medieval Deccan" లో వివరింపబడింది.

" . . . . Madanna's brother Akkanna was made minister in charge of the Armed Forces, His nephew 'Podili Linganna' was appointed Tarafdar of Poonamathi and later Governer of Karnataka. Another nephew 'Yenkanna' was given the title of Rustum Rao and made a commander in the army. A third nephew Gopanna known in history as Ramadas. was made Revenue officer of Bhadrachalam"[3]

"1682లో అంతవరకు సేనానిగా ఉన్న మహమ్మద్ ఇబ్రహీం అను వానిని తొలగించి తానాషా సేనాపతి పదవిని అక్కన్నకు ఇచ్చారని ప్రభుత్వం వారు సేకరించిన "Letters to Fort St. George" అను రికార్డులలో ఉన్నది. కుంఫిణీ అధికారులు క్రీ.శ. 1678-2-6 న వ్రాసిన జాబులో అక్కన్న మాదన్నలు మనకు తగిన మిత్రులని ఉన్నట్లును,[4] గోలకొండలోని బ్రాహ్మణ వీర రాఘవయ్యకు 26-11-1679న వ్రాసిన ఉత్తరంలో

1. మహామంత్రి మాదన్న కథ పుట 12 - కె.వి.భూపాలరావు.
2. మహామంత్రి మాదన్న కథ పుట 13 - కె.వి.భూపాలరావు.
3. History of Medieval Deccan (1295-1726) vol I Editor P.B.Prof. H.K. Shervani. P.No 485,1973.
4. భద్రాచల క్షేత్ర చరిత్ర - కొండపల్లి రామచంద్ర రావు పుట 30.

" We do also order you to watch an apportunity to prevail with Brahmin Akkanna toget raised outof divine Books the Pagodas 54. We have been glad to hear of what you have done in cassaveerannas request to Brahmin Madanna and Akkanna concerning St. Thomas . . . " అని అక్కన్న, మాదన్నల పేర్లున్నట్లు తెలుస్తుంది.[1] ఇంకను వీరి గుణ గణముల గూర్చి "ధీర జన మనో విరాజితము" అనే గ్రంథంలో ఇలా తెలియ జేయబడింది.

" శ్రీ రమ్యాబ్జ కళా వతంస పద రాజీవార్చనాసక్తులన్ . . .

మహోదారుల్ మాదన అక్కనల్ గలరు తత్వ జ్ఞాన సంపూర్ణులై"[2]

" శివ దిగ్విజయము" అను గ్రంథంలో మాదన్న ప్రస్తావన ఉన్నది. మాదన్న నిత్య శివ పూజా ధురంధరుడనియు, మత సామరస్యము కలవాడనియు తెలుస్తుంది.

ఇట్లు బహు ప్రకారములగు వ్రాతలు చారిత్రక నిదర్శనాలు ఉండడం వలన అక్కన్న మాదన్నల మంత్రిత్వం తానాషా యెడ నిరూపించుచున్నది.

"హైదరాబాదున మేనమామలు అక్కన్న మాదన్న గార్లు సదయులు తానాషా వద్ద మంత్రులై సఖ్యముతోనున్నారు"[4] అని రామదాసు చరిత్రములో గలదు. గోపన్న మేనమామలు అక్కన్న, మాదన్నలని ఇందు చెప్పబడింది. ఈ రామదాసు చరిత్రములో ఇంకను ఇట్లు చెప్పబడింది.

కం॥"అనఘుల శాస్త్ర విధిజ్ఞుల

నను రక్తుల బిత్య పితామహ క్రమ

ఛ్ఛిన విపుల మంత్రులుగా

నొనరించెను గార్య సంప్రయోగము కొఱకున్"[5]

తానాషా చక్కని పరిపాలనా దక్షతకై అక్కన్న మాదన్నలను మంత్రులుగా నియమించాడు అని చెప్పబడింది.

"అక్కన్న సేనాపతి, మాదన్న మంత్రి అని చరిత్ర చెప్పచున్నను కవి(సింగరదాసు) అది తెలిసి ఉన్నను ఇరువురు అవినాభావ సంబంధం గల వారగుటచే అట్లు పద్యంలో మంత్రులుగా ఒనరించెనని అనుకొనినాడని అనుకొందము" సరే ఆ మంత్రి తాత తండ్రులు మంత్రులైనట్లు నిదర్శనాలు లేవని" అభిప్రాయం గురునాథ శర్మగారు వ్యక్తం చేసారు."[6]

క్రీ.శ. 1611-1658 వరకు రాజ్యమేలిన అబ్దుల్లా హుసేన్ కుతుబ్షా దగ్గర మీర్ జుమ్లా దివానుగా ఉండి గడబిడ చేసినట్లు చరిత్ర వలన తెలియుచున్నది పిదప క్రీ.శ. 1658-1687 వరకు ఏలిన అబుల్ హసన్ తానీషా దగ్గర మాదన్నయే మంత్రిగా ఉండెను"[7]

---

1. భద్రాచల రామదాసు చరిత్రము - కొడాలి లక్ష్మీనారాయణ పుట 26.

2,3 . " " " "

4. రామదాసు చరిత్రము - సింగరదాసు - ఎన్.వి.గోపాల్ అండ్ కం. పుట 21.

5. రామదాసు చరిత్ర విమర్శనము - మిన్నికంటి గురునాథ శర్మ పుట 515.

6,7. మిన్నికంటి గురునాథ శర్మగారు - రామదాసు చరిత్ర విమర్శనము భారతి, 1931 అక్టోబరు, పుట 515.

అని మిన్నికంటి గురునాథ శర్మ గారు పేర్కొనిరి. ఇక్కడ ఒక ముఖ్యాంశమును గమనించాలి. తానీషా 1672లో రాజ్యానికి వచ్చి, 1687 వరకు పరిపాలించాడు. "అబ్దుల్లా 1672లో రాజ్యాన్ని వీడి ఔరంగజేబు బందీయై 1677లో ఖైదులోనే ఉండి మరణించాడు" అని మాదన్న కథలో కె.వి.భూపాలరావుగారు అభిప్రాయపడ్డారు. క్రీ.శ.1626-1672 అబ్దుల్లా గోల్కొండను పాలించిన కాలం. 1672-1687 తానాషా గోల్కొండను పాలించిన కాలం. కాని మిన్నికంటి గురునాథ శర్మగారు 1611-1658 అబ్దుల్లా కాలం అని, 1658-1687 తానాషా కాలం అని చెప్పారు. కాని ఇది చారిత్రక సత్యం కాదు.

### 2.0.2.1. మాదన్న ప్రధాన మంత్రిత్వం (మీర్ జుమ్లాగా మాదన్న) :

అబుల్ హసన్ తానాషా కాలంలో సయ్యదు ముజఫరు వద్ద పేష్కారుగా మాదన్న, అక్కన్న మాదన్న కార్యదర్శిగా పని చేస్తుండిరి. సయ్యదు ముజఫరు ఆజ్ఞలను మాదన్న అమలు పరుస్తుండెను. ముజఫరు రహస్యములన్నీ (తప్పుడు లెక్కలు చూపడం, దొంగ లెక్కలు వ్రాయడం) మాదన్నకు తెలిసి ఉండెను. అబుల్ హసన్ తానాషా మాదన్న నుండి ముజఫర్ సమాచారాన్ని తెలుసుకొని క్రీ.శ. 1674లో సార్వజనిక సమావేశం ఏర్పరచినాడు. తన గురించి కుతుబ్షా మాదన్న నుండి సమాచారం సేకరించినట్లు ముజఫర్‌కు తెలియదు. ఆ సమావేశంలో తానాషా సయ్యదు ముజఫరు ప్రవర్తన, తిరుగుబాటు తనం, దురాశ, నిరంకుశ చర్యలను ప్రకటించాడు. కుతుబ్షా అతనిని మీర్ జుమ్లా పదవి నుండి తొలగించి పూర్వమాతడు నిర్వహించిన 'భక్షీముల్ముల్కు' పదవి నిచ్చాడు. న్యాయంగా రాజద్రోహికి విధించే ఉరిశిక్ష సయ్యదు ముజఫరు కివ్వవలసింది. కాని అతని సేవలను గుర్తించి పదవి, హోదా తగ్గింపబడింది. అతడు తన జాగీరులను అనుభవించునట్లు అనుగ్రహింపబడింది.

మీర్‌జుమ్లాగా మాదన్న నియమితుడైనాడు. అతనికి 'సూర్య ప్రకాశరావు' అనే బిరుదమీయబడింది. అక్కన్న ఇంతకు పూర్వం మాదన్న నిర్వహించిన పేష్కారు పదవిని పొందాడు. మూసాబేగును సైన్యాధికారిగా నియమించి సైనికుల జీత బత్తెములు నేరుగా ప్రభుత్వం చెల్లించునట్లు తానాషా ఏర్పాటు చేసెను. సయ్యదు ముజఫర్ అభిమానులీ మార్పునకు చకితులైనారు.

"మహమ్మదు ఇబ్రహీం సేనానిని తొలగించి అక్కన్నను శాహ లష్కరుగా నియమించెను తానాషా అని " Letter to Fort St. George" అను రికార్డులో కలదు[1]

( Letters to Fort St.George vol II, Pages 105-109, Press List of Ancient Record in Fort st. George, Publicons Vol VI,VII,VIII లోను కలవు[2]

1,2 . శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము - కొండపల్లి రామచంద్రరావు

అక్కన్న మాదన్నల గూర్చి వారి సమకాలికుడైన హ్యావర్టు స్వయంగా ఎరిగినట్టి వాడై ఈ డచ్చి దేశస్థుడు, తన పేరిట ప్రకటించిన "హ్యావర్టు" అనే పత్రికలో ఈ సోదరుల వృత్తాంతం కొంత, వారి ప్రతిబింబాలతో గూడ ప్రకటించాడు. దాని సారాంశం ఇది. "రాజకీయ శాసనాధికారిగారు 1914-15లో సం॥పు కార్యదర్శి నివేదనంలో ప్రకటించారు. దీని సారాంశాన్ని శ్రీ జయంతి రామయ్య పంతులుగారు తెలుగులోకి అనువదించారు.

హ్యావర్టు చెప్పిన విషయాలివి. "అక్కన్న మాదన్నలన్నదమ్ములు. తొలుత మిక్కిలి బీదవారలు. గోలకొండ నవాబు అబ్దుల్లా కుతుబ్షా అనునతడు రాజ్యము చేయుచున్నప్పుడును, వారిరువురును నవాబుగారి మంత్రియు, మీరుజుమ్లాయను సుప్రసిద్ధ బిరుదము గలవాడును నగు సయ్యదు ముస్తఫా యను నతని యొద్ద క్రీశ.1666వ సంవత్సరములో నెలకు బది గిల్డర్లు జీతము మీద షరాబులు గా ప్రవేశించి క్రమక్రమముగా వృద్ధిలోనికి వచ్చిరి. మాదన్నకు సూర్య ప్రకాశరావను నామాంతరముండెను. ఈతడు తెలివి గలవాడు. అక్కన్న యసక్త దుర్జనుడు. వారుచ్ఛ స్థితికి వచ్చిన కాలములో వారి యజమానుడయిన మీరుజుమ్లా పద భ్రష్టుడయ్యెను. దీనికి అక్కన్న మాదన్న గార్లే కారకులేమోయని కొందఱనుకొనిరి.

మాదన్న క్రమముగా నవాబు గారి యొద్ద సన్నిధాన వర్తియు, సర్వ కార్య దురంధరుడునయ్యెను. నవాబుగారు రాజ్య భారమంతయు మాదన్నయందుంచి తాను జీవనార్థము 75,000 డాలర్ల ధనము తీసికొనుచుండెను.

అబ్దుల్లా కుతుబ్షా క్రీశ. 1611-22 యనంతరం అబుల్ హసన్ అను నతడు రాజయ్యెను. ఈతనికి తానీషాయను బిరుదము కలదు. ఈతని యొద్ద గూడ నీ యక్కన్న, మాదన్నలు గొప్ప యుద్యోగములలోనే యుండిరి"[1]

మీర్ జుమ్లాగా సయ్యదహామదు అబ్దుల్లా కాలంలో 1630-40 సం॥ మధ్య మీర్ జుమ్లాయని పారశీకుడ ప్రధానియయ్యెను" అతని పేరు మహమ్మదు సయ్యదు. మీర్ జుమ్లా అనేది బిరుదం పదవి పేరు. ఇరవై సంవత్సరాలు గోల్కొండ వ్యవహారాలు చక్కదిద్దెను.[2] మీర్ జుమ్లా కొలువునందు తొలుత అక్కన్న మాదన్న గార్లు ప్రవేశించి గోల్కొండకు వచ్చిరి. మొదట నెలకు పది వరహాలు జీతమునకు గుమాస్తాలుగా చేరిరి. క్రమక్రమముగా తమ ప్రతిభా విశేషములు చూపి మీర్ జుమ్లా దయకు పాత్రులై ఉన్నత స్థితికి వచ్చిరి. వీరిద్దరు అన్నదమ్ములు.

సుల్తాన్ అబ్దుల్లా తల్లితో గల రహస్య ప్రేమానుబంధమును పురస్కరించుకొని మీర్ జుమ్లా తానే సుల్తాను అన్నట్లు రాజ్య పాలనము చేసెను. అతని కార్య దక్షత వల్ల గోల్కొండ సామ్రాజ్యము దక్షిణమున కడప మండలము వరకు వ్యాపించెను. మీర్ జుమ్లా తన అధికారమును దుర్వినియోగ పరచుట ఆరంభించెను. "అబుల్ హసన్ కుతుబ్షా పరిపాలనా కాలంలో మాదన్న

1. ఆంధ్ర పరిషత్పత్రిక -శుక్ల నామ సంవత్సరం, ఆశ్వయుజ కార్తిక మాసములు సంపుటం 18, సంచిక 4, పుట 201,202.

2. భద్రాచలము - శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు భారతి జూలై 1951.

ప్రధాని, లేదా దివాన్ పదవియందు, ఆయన అన్నగారు అక్కన్న షర్ లష్కర్ లేక సమస్త సేనాధ్యక్షుడుగను ఉండిరి"[1] అని శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు గారు వీరి గురించి తెలియజేశారు.

బి.ఎన్.శాస్త్రిగారు "అబ్దుల్లా కాలమునందు వీరు గోల్కొండ కేతెంచి కుతుబ్షా ప్రభుత్వోద్యోగులుగా నియమింప బడిరి. క్రీ.శ. 1656లో సయ్యదు ముజఫర్ కార్యదర్శిగా మాదన్న పనిలో చేరెను. క్రీ.శ. 1672లో సయ్యదు ముజఫర్ మీర్ జుంలా ఐన పిదప మాదన్నకు పేష్కారు పదవి లభించెను. మీర్ జుంలా పేష్కారుగా మాదన్న సమస్త రాజ్య వ్యవహారముల నిర్వహించుచు, కుతుబ్షా ప్రేమకు పాత్రుడై మీర్ జుంలా పదవిని చేపట్టెను"[2] అని అక్కన్న, మాదన్న గారిని గూర్చి తెలియజేశారు.

మాదన్న ప్రధానమంత్రిగ నిర్వహించిన రాజ్యాంగ విధానం, విదేశాంగ నీతి, రాజధర్మాలు ఎన్నదగినవి. గోల్కొండ రాజ్యం పటిష్టతకు, సుస్థిరతకు ఈతడు అనుసరించిన విధానం ఎన్నదగినది.

### 2.0.2.2. మాదన్న ప్రధానిగా ఉన్న కాలంలో నాటి దేశ రాజకీయ పరిస్థితులు :

కుతుబ్షాహీల పాలనలో తొలి తెలుగు ప్రధాన మంత్రి పదవిని చేపట్టిన మాదన్న ప్రతిభావంతుడు. పరిపాలనా దక్షుడు. కుతుబ్షా ఆలోచనల కనుకూలంగా దేశ విదేశ వ్యవహారములను అత్యంత శ్రద్ధాసక్తులతో ప్రతిభావంతంగా నిర్వహించి, గోలకొండ రాజ్య పాలనా వ్యవహారములను అత్యంత పటిష్టంగా నడిపించిన కీర్తి మాదన్న మహా మంత్రికి దక్కింది. దేశం సుభిక్షంగా ఉండునట్లు, శాంతి భద్రతలు వర్ధిల్లునట్లు పరిపాలనను సాగించి, దక్కను సుస్థిరతను కాపాడిన ఘనత మాదన్న మంత్రిదే.

గోల్కొండ రాజ్యం ఆంధ్ర ప్రాంతంలోనిదైనందు వల్ల తెలుగు సంస్కృతిని తనలో ఇముడ్చుకొని ఈ నవాబులు పరిపాలన కొనసాగించ వలసి వచ్చింది. మాదన్న మంత్రిగా అబుల్ హసన్ తానాషా తన రాజ్యానికి, కాలానికి తగిన రాజకీయ, సాంఘిక విధానాలను ఏర్పరచుకోవటానికి తోడ్పడినాయి. ఇది మాదన్న రాజకీయ దక్షతకు నిర్వివాద నిరూపణం.

**ఆర్థిక విధానము :**

మాదన్న మహామంత్రిత్వంలో పాశ్చాత్య వ్యాపారుల కార్యకలాపాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయబడింది. వారి నుండి రావలసిన పన్నులు, సక్రమంగా వసూలు చేయబడినాయి. అబుల్ హసన్ తానాషాతో పాటు మాదన్న సామ్రాజ్యమంతటా సంచరించి, పాలనా వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను సవరించడంలో తోడ్పడ్డాడు. కొత్తగా జయించిన కర్ణాటక ప్రాంతంలో మాదన్న పర్యటించి, పాశ్చాత్య వర్తకులు సృష్టించిన అలజడులను అణచివేశాడు. క్రీ.శ. 1674 నవంబరులో

1. భద్రాచలము - శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు - భారతి, జూలై 1951.
2. గోలకొండ చరిత్ర -సంస్కృతి -శాసనములు , బి.ఎన్.శాస్త్రి. పుట 177.

తానాషా, మాదన్నలు దేశ పర్యటనకు బయలు దేరి, జనవరి 1675లో తిరిగి వచ్చారు. క్రీశ. 1676, 1678లలో పర్యటనలు సాగినాయి. "మహామాత్యశేఖరుడైన మాదన్నగారు బందరు, బెజవాడ, చెన్నపురి మున్నగు పట్టణములకేగి యుండిరి. అప్పుడు దానధర్మములాచరించి శాసనములు వేయింపకుందురా ? ఈస్టిండియా కంపెనీ వారు మాదన్న కొడుకగు మల్లన్నకు నతని పినతండ్రికి జివర కతని సుబేదారునకు ననేక బహుమతులంపి మాదన్నగారి యనుగ్రహము వడయు విశ్వప్రయత్నములు చేయుచుండిరట. నౌకావ్యాపారము నుండెనట."[1] అని మిన్నికంటి గురునాథ శర్మగారు తన అభిప్రాయం వ్యక్తం చేశారు. 'మాదన్న' మెప్పు పొందడం కోసం ఆయనకు ఎన్నో బహుమానాలందించి ఈస్టిండియా కంపెనీ వారు ప్రయత్నించినారు. కాని మాదన్నగారు వారిని అణచివేసే ప్రయత్నమే చేశారు. దేశ రక్షణకై ఎన్నో పటిష్టమైన కార్యక్రమాలు అమలుపరచారు. అనేక మార్పులు గోల్కొండ పరిపాలనలో మాదన్నగారు ప్రవేశపెట్టారు.

అప్పటికి ఉన్నత పదవుల్లో ఉన్న విదేశీయులను పదవులనుండి తీసివేసి వారి స్థానాల్లో స్వదేశీయులను నియమించినాడు. అనుకూలురను, తన అనుయాయులను, విధేయులను, సన్నిహిత బంధువులను ఉన్నతోద్యోగాలలో నియమించడం వల్ల స్వదేశ, విదేశ ముస్లింలకు కోపం తెప్పించినాడు.

1. అక్కన్న పేష్కారు పదవితో పాటు 'మజ్మెమొదారు' పదవి నిర్వహించినాడు.

2. మాదన్న రెండవ సోదరుడు ఆశన్న వరంగల్ అమల్దారుగా నున్నాడు.

3. మాదన్న సోదరి పుత్రుడు ఎంకన్న 'రుస్తుంరావు' బిరుదాంచితుడై కర్ణాటక సుబేదారుగాను, సర్వసైన్యాధికారిగను ఉన్నాడు.

4. 'గోపన్న' మాదన్న మేనల్లుడు (కామమ్మ లింగన మంత్రి కుమారుడు) భద్రాచలం పరగణాకు తహసీల్దారుగా నియమితుడైనాడు.

మాదన్న మంత్రి కాలంలో ఈ పనులు చేశాడు. గోల్కొండ రాజ్య పటిష్టంకై మాదన్న మహామంత్రి " అబుల్ హసన్ " కాలంలో చేపట్టిన పనులు ఎన్నదగినవై ఉన్నాయి.

1. కొండలలో నుండి దేశోపద్రవం చేసే జాతుల వారిని శిక్షించి, పైరు పంటలకు, పశువులకు రక్షణ కల్పించినాడు.

2. ప్రజలను పీడించే జమీందార్లను, సుంకపు అధికార్లను తీసివేసి, రాజ్యంలో నిష్కంటక పన్ను వసూలు చేసినాడు.

3. అన్ని సుబాలలో ప్రతి గ్రామాన్ని సర్వే చేయించి, పట్టికలు వివరంగా ఆయా సంవత్సరాలకు ప్రత్యేకంగా తయారు చేయించినాడు.

4. ఈనాములు, అగ్రహారాలు, దేవ బ్రాహ్మణులకిచ్చినవి, నౌకరీ మాన్యాలు మొదలైన వాని పరిపాలనలో అక్రమాలను మాన్పించాడు.

5. మాదన్న పంతులు కొద్ది మార్పులు చేర్పులు చేసి ఇంతకు ముందున్న విదేశాంగ నీతినే అనుసరించినాడు.

1. రామదాసు చరిత్ర నిమర్శనము - మిన్నికంటి గురునాథ శర్మ, భారతి. పుట 515, అక్టోబరు, 1931.

తానీషా గోలకొండను పరిపాలించే నాటికి, మద్రాసులో (చెన్నపట్నం) ఆంగ్లేయులు వ్యాపారరీత్యా, రాజకీయంగా కాలూనడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. చెన్నపట్నాన్ని వారు వ్యాపారం కోసం 1200 పగోడాలకు అద్దెకు తీసుకున్నారు. సాంథోమ్ చర్చి సమీపంలో భూమిని 1300 పగోడాలకు కౌలుగా గ్రహించారు. వారు క్రమంగా అచ్చట అధికారం వహించడమే వారి ఆశయం. లింగన్న వారితో చక్కగా వ్యవహరించి, హైదరాబాదు ప్రభువులతో అన్ని కట్టుబాట్లు చేయించి, వారి దురాక్రమణను కొంతవరకు ఆపగలిగాడు. మాదన్న ప్రధానిగా ఉన్నంత వరకు ఆంగ్లేయులు గోల్కొండ వైపు కన్నెత్తి కూడా చూసే శక్తి లేకపోయింది. విదేశీ దాడుల నుండి గోల్కొండను రక్షించేందుకై మాదన్న, అక్కన్నలు ప్రయత్నించారు. మాదన్న ముఖ్యమంత్రి పదవిని స్వీకరించే నాటికి రాజ్యంలో కరువు ఏర్పడింది. ఆర్థిక సంక్షోభం నెలకొని ఉంది. ఆయన వ్యవసాయాన్ని అభివృద్ధి పరిచాడు. కొన్ని పన్నులు పెంచి విదేశీ వాణిజ్యంపై పన్ను, వస్త్రాల గనుల త్రవ్వకం (అబ్దుల్లా కాలంలో వజ్రాల గనులు మూత పడ్డాయి) మొదలయిన చర్యల ద్వారా ఆ రాజ్య ఆర్థిక పరిస్థితిని మాదన్న మెరుగు పరచినాడు. పన్నులు కట్టలేక గ్రామాలు విడిచి పెట్టి వెళ్ళిపోయిన రైతులను వెనుకకు పిలిపించి బంజరు భూములుగా మారిన నేలలను సాగు చేయించాడు.

వ్యవసాయ భూములుగా మారిన ఈ బంజరు భూములమీద కొంత కాలం పన్నులు మాఫీ చేసాడు. కాలువలు త్రవ్వించడం, ఆనకట్టలు నిర్మించడం, ధాన్యానికి న్యాయమైన ధరలు నిర్ణయించడం ద్వారా వ్యవసాయాన్ని చాలా ప్రోత్సహించాడు. పళ్ళ తోటలను, ఉద్యాన వనాలను అభివృద్ధి చేసాడు.

దేవాలయ భూములపై కూడా నామ మాత్రపు పన్ను విధించాడు. దేవాలయ నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసి కొనినాడు. ఉద్యోగులకు అధిక జీతాలను తగ్గించడం ద్వారా పొదుపు చేసాడు. మాదన్న వేసిన పన్నులు ఎక్కువగా ధనవంతులపైననే కాబట్టి ఇందువల్ల సామాన్యుల మీద ఏ విధమైన అధిక భారమూ పడలేదు. ఆనాటి కుతుబ్షాహీ రాజ్యం సిరి సంపదలతో తులతూగడానికి మాదన్న తీసుకున్న ఆర్థిక చర్యలే ప్రధాన హేతువులని చెప్పవచ్చు.

అప్పటికే భారతదేశంలో వాణిజ్య వ్యాపార స్థావరాలను ఏర్పరుచుకొని పోర్చుగీసు, ఫ్రెంచి, డచ్చి, ఇంగ్లీషు వారు బలపడుతూ ఉన్నారు. తూర్పు తీరంలో పోర్చుగీసు వారి ప్రాబల్యం తక్కువగానే ఉంది. ఫ్రెంచి, డచ్, ఇంగ్లీషు వ్యాపారస్థులే ఇక్కడ ప్రబలంగా ఉన్నారు. వారి వ్యాపారాన్ని క్రమబద్ధం చేయడానికి, దేశ రాజకీయ వ్యవహారాలలో పరిపాలనా వ్యవస్థలో వారు జోక్యం కలుగజేసుకొనకుండా ఉండడానికి వాళ్ళపై ఒక కన్ను వేసి ఉండవలసిన అవసరం ఏర్పడింది. ఈ విషయంలో మాదన్న పటిష్ఠమైన చర్యలు తీసుకొన్నాడు. తీర ప్రాంతాలకు అధికారిగా 'లింగన్న' అనే వ్యక్తిని నియమించాడు.

ఈ వర్తక సంఘాల వారి ప్రతినిధులు గోల్కొండలో ఉన్నప్పటికీ వాళ్లు ఏ విధం గానూ కేంద్ర ప్రభుత్వంతో నేరుగా వ్యవహరించడానికి వీల్లేదు. లింగన్న ద్వారానే ఈ వ్యవహారాలు జరగాలి. అందువల్ల లింగన్న పదవికి ప్రతిష్ఠ పెంచడమే కాక కేంద్రం లింగన్న ద్వారా కఠినంగా వ్యవహరించడానికి కూడా అవకాశం ఏర్పడింది. ఈ అవకాశాన్ని లింగన్న చక్కగా వినియోగించుకొన్నాడు.

ఆంగ్లేయులు తమ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించకుండా ఎప్పటికప్పుడు లింగన్న అదుపు చేస్తూ వచ్చినాడు. ఎగ్మూరు, వేపేరి ప్రాంతాలలో నూతన అమ్మక కేంద్రాలను ఏర్పాటు చేసుకుని కోటలను నిర్మించాలనుకున్న ఆంగ్లేయుల ప్రయత్నాలను లింగన్న భగ్నం చేసినాడు. స్వంత నాణాలు ముద్రించుకోడానికి, స్వంత న్యాయస్థానాలు స్థాపించుకోడానికీ, కొన్ని గ్రామాలపై పూర్తి అధికారం చేజిక్కించుకోవడానికి చూచిన ఆంగ్లేయుల ఆటలను లింగన్న, మాదన్నలు కొనసాగనివ్వలేదు. ఆంగ్లేయులను, డచ్చివారికి కూడా అవసరమైనపుడు సైనిక చర్యలతో అదుపులో ఉంచినారు.

మాదన్న సోదరుడైన అక్కన్న కర్ణాటక ప్రాంతానికి రాజపాలుడుగా నున్నాడు. విదేశీ వ్యాపారుల విషయంలో ఎప్పటికప్పుడు లింగన్నకు సహకరిస్తూ తగు జాగ్రత్తలు తీసుకున్నాడు. విదేశీ వ్యాపారులు రాజ్య వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకోకుండా, కోటలు కట్టుకోకుండా, కేంద్రాధికార పరిధి లోనుండి జారిపోకుండా చూడడం విషయంలో కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ వారి వ్యాపార విషయంలో మాదన్న దయగానే వ్యవహరించాడు.

ఈ విధమైన ' ఆర్థిక విధానాన్ని ' అందరికీ ఆదర్శవంతమైన విధానాన్ని అనుసరించి మాదన్న మహామంత్రి, తానాషా మరియు ప్రజల మన్ననలు పొందినాడు. గోల్కొండ రాజ్యంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండడానికై సస్యశ్యామలంగా వ్యవసాయ క్షేత్రం ఉండడానికి రైతులకు మాదన్న ఎంతగానో తోడ్పడినాడు. సిరిసంపదలతో గోల్కొండ రాజ్యం తులతూగిందంటే అదంతా మాదన్న గారి చలువే అని చెప్పడం అతిశయోక్తి కాదు.

**2.0.2.3. అబుల్‌హసన్‌తానాషాకాలంనాటిరాజకీయ పరిస్థితులు - దేశ పరిస్థితి :**

1672-1687 వరకు జరిగిన చారిత్రక, రాజకీయ సంఘటనలు, మొగలుల, ఆంగ్లేయుల బారినుండి గోల్కొండను రక్షించే ప్రయత్నంలో అక్కన్న మాదన్నలు నిర్వహించిన పాత్ర గూర్చి తెలుసుకోవడం ముఖ్యం. గోల్కొండ రాజ్య పతనానికి దారి తీసిన రాజకీయ పరిస్థితులను గూర్చి ప్రస్తావించడం ముఖ్యం. గోల్కొండను కాపాడడానికై మొగలుల దాడుల నుండి రక్షించడానికి మాదన్న మహామంత్రి చూపిన రాజకీయ చతురత గొప్పది.

**2.0.2.3.0. శివాజీ-తానీషాల సంధి ఒడంబడిక :**

తానీషా అధికారానికి వచ్చేనాటికి మహారాష్ట్రులు ఉన్నత స్థితిలో ఉన్నారు. ఛత్రపతి శివాజీ

దక్షిణ భారత దేశంలో ప్రముఖ వ్యక్తిగా ప్రఖ్యాతి పొందాడు. 1674లో శివాజీ మహారాష్ట్ర పాలకుడుగ పట్టాభిషిక్తుడైనాడు. శివాజీ వలన కుతుబ్షాహీ రాజ్యానికి కూడ ప్రమాదం కలిగి ఉండేది. కాని, మహామంత్రి మాదన్న వలననేమి, తానీషా రాజకీయ చతురత వలననేమి శివాజీకి ఈ రాజ్యంతో స్నేహం కలిగింది. ఈ స్నేహ సంబంధం నిర్వహించినవాడు 'వెంకోజీ' అనే మహారాష్ట్రుడు. అతడు తానీషా దర్బారులో చక్కని పర్షియన్ భాషలో ప్రసంగించి, రాజు హృదయాన్ని, స్నేహాన్ని చూరగొన్నాడు. ఈ రాయబార కారణంగా క్రీ.శ. 1677లో శివాజీ హైదరాబాదుకు వచ్చి తానీషాను కలుసుకొనే అవకాశం కలిగింది.

శివాజీ తానీషాల మధ్య మైత్రి కుదిరింది. రెండు నెలల పాటు శివాజీ గోల్కొండలో ఉన్నాడు. శివాజీ చూపిన రాజకీయ చతురత మూలాన, దక్షిణ భారతంలో తాత్కాలికంగానైనా మొగలు రాజుల ప్రవేశం అరి కట్టబడింది. అక్కన్న, మాదన్నలు శివాజీకి, అబుల్ హసన్ తానీషాకు స్నేహం కల్గించాడు. వీరిరువురు ఏకమై మొగలులను ప్రతిఘటించడానికి నిశ్చయించారు. తానీషా కాలంలో మొగలు రాజు ఔరంగజేబు ఈ విషయం తెలిసి గోల్కొండ రాజ్యంపై మరింత పగ బట్టాడు. శివాజీ 1680లో 53 సంవత్సరాల ప్రాయంలో మరణించాడు. ఈ మహావీరుని మరణం యదార్థానికి గోలకొండ ప్రభువులకు, వారి రాజ్యానికి తీరని లోటు కలిగించింది. కారణమేమంటే మొగలాయీ రాజులు దక్షిణ భారత దేశం మీద దండయాత్ర చేసినప్పుడు వారికి సాయం చేయడానికి సమర్థులైన మహారాష్ట్ర ప్రభువులు లేకపోవడమే. ఈ విషాద సంఘటనమే, 17వ శతాబ్దిలో దక్షిణ దేశంలో ఉన్న కుతుబ్షాహీ, ఆదిల్షాహీ రాజ్యాలు నశించి పోవడానికి కారణమైందని చారిత్రకులు భావిస్తారు.

అబుల్ హసన్ తానీషా మొగలుల ముట్టడి తప్పదని భావించి క్రీ.శ. 1679లో కొండపల్లి దుర్గాన్ని బాగు చేయించాడు. అక్కన్న, మజ్ముయేదారు పదవిలో నియమింపబడినాడు. తన పదవి హోదా కుదింపబడినందువల్ల మహమ్మదిబ్రహీం కినిసి మొగలు చక్రవర్తిని ఆశ్రయించాడు . అక్కన్న ఆంతరంగిక శాఖా వ్యవహారాలను, మాదన్న విదేశీ వ్యవహారాలను చూసేవారు. క్రీ.శ. 1685 నాటికి గోలకొండ శక్తి సమన్వితమైన రాజ్యంగా రూపు దిద్దుకొని మొగలుల దాడులను ఎదుర్కొనే స్థితికి వచ్చింది.

### 2.0.2.4. గోల్కొండ - మొగలుల రాజ్య వ్యవస్థ :

రెండూ ఇస్లాం మత సంబంధమైనవైనా, మొగలు సామ్రాజ్యం, బహమనీ రాజ్యాల మధ్య మొదటి నుండి వైరం ఉండేది. 1670 నుండీ దక్కన్ రాజకీయాల్లో మార్పులు వచ్చాయి. 1672 నుంచే బీజాపూర్‌లో ఆఫ్ఘన్, దక్కనీ కులీన వర్గాల మధ్య అంతః కలహాలు చెలరేగి కేంద్ర ప్రభుత్వం పట్టు పూర్తిగా సడలింది. పూణే కేంద్రంగా శివాజీ ఆధిపత్యంలో స్వతంత్ర మరాఠా రాజ్యం ఏర్పడింది. 1674లో శివాజీ ఛత్రపతి అయ్యాడు. ఈ పరిస్థితిలో మహామంత్రి మాదన్న ఈ అవకాశాన్ని గ్రహించి

అబుల్ హసన్ తానాషా శివాజీతో సైనిక ఒడంబడికను చేసుకునేట్లు చేశాడు. బిజాపుర వ్యవహారాలను చక్కదిద్ది అక్కడ గోల్కొండ ఆధిక్యాన్ని నెలకొల్పటానికి మాదన్న ఆలోచించాడు.

మాదన్న మంత్రాలోచన ప్రకారం గోల్కొండ రాజ్యం మరాఠాల మైత్రిని, బిజాపురంలో ఆధిక్యాన్ని సంపాదించి దక్కన్‌లో మొగలాయి అధికారం నెలకొనే అవకాశాన్ని పూర్తిగా రూపు మాపుతుంది. 1681లో యువరాజు అక్బర్ ఔరంగజేబు చక్రవర్తికి వ్యతిరేకంగా ప్రవర్తించి శంభాజీ కొలువులో ఆత్మ రక్షణకై చేరటంతో, చక్రవర్తి దృష్టి పూర్తిగా దక్కన్‌పై కేంద్రీకృతమైంది. యువరాజు అక్బర్ మరాఠా, రాజపుత్ర బిజాపుర, గోల్కొండ రాజ్యాల అండతో దక్కన్‌లో స్వతంత్ర మొగలాయి రాజ్యాన్ని ఏర్పరుస్తాడేమోనని ఔరంగజేబు భయపడ్డాడు. మాదన్న రాజకీయ విధానాల ద్వారా గోల్కొండ దక్కన్‌లో కీలకమైన పాత్రను నిర్వహిస్తోందని గ్రహించి గోల్కొండపై దండయాత్రకు నిర్ణయించాడు. ఇదిలా ఉండగా "1677లో మొగలుల్ని ఎదర్కోవడానికి శివాజీ, కుతుబ్షాలు ఓ సంధి చేసుకున్నారు. ఆ సంధి ప్రకారం శివాజీకి సైనిక వ్యయానికి లక్ష హొన్నులివ్వాలి. శివాజీ తాను గెల్చుకున్న భూభాగాల్లో కొన్ని కుతుబ్షాకి ఇవ్వాలి". ఈ నిబంధనల ప్రకారం శివాజీకి అబుల్ హసన్ కుతుబ్షా పైకమిచ్చాడు. కాని శివాజీ మాత్రం యుద్ధాలలో విజయాలు సాధించినా కుతుబ్షాకు ఇవ్వాల్సిన రాజ్య భాగాలు ఇవ్వలేదు. అప్పట్లో శివాజీ బీజాపూర్‌తో కూడా ఇలాగే వ్యవహరించాడు. క్రీ.శ. 1680లో శివాజీ మరణించాడు. అంతట మొగలులు గోల్కొండలో బీభత్సం సృష్టించారు.

అబ్దుల్లా కాలంలో 1655-56లలో ఔరంగజేబు ఆనాడు తండ్రి షాజహాను పనుపున గోల్కొండ ఇవ్వవలసిన కప్పాన్ని రాబట్టుకోడానికై దక్కనుకు వచ్చాడు. క్రీ.శ. 1655-56ల నడుమ గోల్కొండను మిక్కిలి క్షోభ పెట్టాడు. హైదరాబాదు పట్టణాన్ని కొల్లగొట్టి దోచుకొన్నాడు. ఔరంగజేబు గావించిన దుష్కృత్యాల వలననేమి, మీర్ జుమ్లా యొక్క స్వామి ద్రోహపు కార్యాల వల్లనేమి గోల్కొండ పెక్కు కష్టాల పాలయ్యింది. అది మొదలు ఐదారేండ్ల వరకు గోల్కొండ వ్యవహారాలు చక్కబడలేదు. ఆ తర్వాత అబుల్ హసన్ కాలంలో పరిపాలనా దక్షత కల్గిన అక్కన్న మాదన్నల కారణంగా గోల్కొండ రాజ్యం మొగలు దాడుల నుండి అరికట్టబడింది.

### 2.0.2.5. గోల్కొడపై మొగలుల దాడి :

బీజాపూరు రాజ్యాన్ని అధీనం చేసుకోవడానికి ఔరంగజేబు 1685లో రాజకుమారుడైన ఆజంను పంపించాడు. ఆ రాజ్యం మొగలాయీలకు వశం కాక పూర్వమే చక్రవర్తి తన కుమారుడైన మోజం అనే వాడిని గోలకొండపై దండయాత్రకు పంపించాడు. తానీషా, మాదన్న సహాయంతో 'ఖలీలుల్లాఖాను' అనే అతనిని, రుస్తుంరావును మొగలు సైన్యాన్ని ఎదుర్కోవడానికి పంపించాడు. గోల్కొండ రాజ్యం సరిహద్దులో మాల్ఖేడ్ అనే చోట రెండు

1. నాలుగు శతాబ్దాల నగరం - వేదగిరి రాంబాబు పుట. 66

సైన్యాలకు సంఘర్షణలు జరిగాయి. చాలా సందర్భాలలో మొగలాయి సైన్యానికే పరాజయం కలిగింది. ఆ తర్వాత 1686 జనవరిలో మొగలు సైన్యాలు గోల్కొండ బలాన్ని క్రమంగా వెనక్కి నెట్టి గోల్కొండలో ప్రవేశించాయి. ఈ సందర్భంలో ఖలీలుల్లాఖాను స్వామి ద్రోహం చేసి మొగలాయి సైన్యంలో చేరిపోయాడు. దీని తర్వాత శత్రు పక్షంలో చాలామంది ముసల్మాను సరదారులు చేరినారు. దానితో అబుల్ హసన్ తానీషా భయ భ్రాంతుడు కావడమే కాక, ఏకాకి అయిపోయాడు. దానితో తాను, తన పరివారం హైదరాబాదు నగరాన్ని విడిచి గోలకొండలో తల దాచుకొన్నారు. రాజధాని నగరం మొగల్ సైనికుల వశమైనట్లే అయింది.

రాజ కుమారుడు మోజం, తానీషాకు తాకీదు పంపిస్తూ మాదన్నను మహామంత్రి పదవి నుండి తొలగించమని కోరాడు. ఔరంగజేబు (ఆజం రాకుమారుడు) కొన్ని నిబంధనలతో సంధి గావించుకొనదలచు కొన్నాడు. తానీషాకు తెలియజేసిన నిబంధనలు ఇవి.

1. అక్కన్న మాదన్నలను ఉద్యోగాల నుండి తొలగించడం.

2. మాల్ఖేడ్, సేడంల మధ్య యుద్ధం జరిగింది. అప్పుడు సేడం గోల్కొండ వశం అయింది. అందుకే సేడం-రామగిరి పరగణాలను మొగలుల వశపర్చడం.

3. పేష్కసు బకాయీలు చెల్లించడం. ఈ నిబంధనలను దక్కను సేనానులు అంగీకరించక పోవడం వల్ల యుద్ధం కొనసాగింది. బీభత్సకరమైన మొగలుల యుద్ధాన్ని ఆపడానికై తానీషా వారి షరతుల్ని అంగీకరించాడు. క్రీ.శ. 1686లో ఈ సంధి సమకూరింది.

తానాషా అక్కన్న మాదన్నలను పదవి నుండి తొలగించడంలో ఆలస్యం చేస్తున్నాడు. మొగలులు, అంతఃపుర వాసులు, ముస్లింలు అక్కన్న మాదన్నలకు విరోధులు. తానాషా సంధి ప్రకారం వారిని తొలగించడంలో ఆలస్యం చేయడం వీరు సహింపకున్నారు. తానాషా ప్రియురాండ్రు సరుమ, జానీ సాహెబు అనేవాళ్లు అక్కన్న మాదన్నలను అంతమొందించు కుట్రలో ప్రధాన పాత్ర వహించారు. ఈ కుట్రకు నాయకుడు షేక్ మిన్హాజ్.

### 2.0.2.6. అక్కన్న మాదన్నల హత్య :

అక్కన్న మాదన్నలను పదవి నుండి తొలగించే విషయమై, సంప్రదింపులు జరుగుతుండగానే, ఒకనాడు అక్కన్న, మాదన్నలు తానీషా వద్దనుండి తమ గృహాలకు వెళ్తుండగా, గోల్కొండ నగర వీధులలో స్వామి ద్రోహులైన దుండగులు అక్కన్న, మాదన్నలను తలలు నరికి హత్య గావించారు. అక్కన్న, మాదన్నల హత్య గురించి మార్టిను మరియు బెంద్రేలు వ్రాతలు ఇలా ఉన్నాయి.

" చమూపతి మహమ్మదు ఇబ్రాహీముషా ఆలం కొలువులో జేరుటకు పోవుచున్నప్పుడు ద్రోహి మాదన్న యెడ జాగ్రత్త యని సుల్తానునకు సందేశమంపెను. సుల్తానా సందేశమును స్వీకరించునపుడు మాదన్నయు సరసననే యుండెను. సుల్తానతనికా లేఖ జూపి సమాధానమడిగెను. మీరు అనుమతించిన

నేను కోట నుండి వెలువడి నిజమగు ద్రోహిని బంధించి దెచ్చి మీ కర్పించెదనని జెప్పెను. సుల్తాను మారాడక అంతఃపురంలోకి బోయెను. సుల్తాన్ విషయాన్ని కాకతాళీయంగా తన రాణులలో ఒకరికి చెప్పెను. "మాదన్న యదార్థంగా రాజద్రోహి యనియును ఈ నెపమున కోట బయటికి బోయి శత్రువునిలో జేరనుంకించు చున్నాడనియును అతనిని వెంటనే జంపించబలసినది అనియును ఆయమ సుల్తానుకు జెప్పెనట. సమీపమున నుండి ఈ సంభాషణ విన్న 'హబ్షీ ఘులాము' తన ప్రక్కనే నిలబడియున్న మాదన్నపై మెరుపు దాడి చేసి చంపెనట. అతను మరికొంతమందిని, గూర్చుకొని ఇండ్లలో నున్న అక్కన్న, రుస్తుంరావులను గూడ హతమార్చెను. అతనంతటితో నాగక దుర్గములోనూ పట్టణములోనూ నివసించు అక్కన్న మాదన్నల బంధు మిత్రులను వారి స్వజాతీయులను బహుళ సంఖ్యలో జంపెను. వారి ఇండ్లు దోచుకొని తగులబెట్టిరి. హతులైన అన్నదమ్ముల శవములను ఈడ్చుచు వీథులలో ద్రిప్పిరి. కోట ద్వారముల తలక్రిందులుగ వ్రేలాడ దీసిరి. తలలు గోసి వానిని షా ఆలం బహద్దరు రాకుమారుని వద్దకు బంపిరి"[1].

'మున్షీ ఖాదరు ఖాను - పుట 475 మనూషి - మార్టిను మహమ్మదు సాజీ - ఈశ్వర ప్రసాదు'లో ఈ హత్య గురించి ఈ విధంగా వ్రాయబడి ఉంది. " 1686వ సంవత్సరం మార్చి నెలలో ఒక అసుర సంధ్యన రాచ కార్యములు ముగించుకొని రాజు సెలవు బొంది అక్కన్న, మాదన్నలు తమ నెలవులకు బయలు దేరిరి. జమ్షీద్ మెరుపువలె వారిపై బడియెను. లంచమందుకొన్న అంగరక్షకులు ఆదుకొనక దప్పుకొనిరి. ఘులాములు యీ అన్నదమ్ములను నేలపై బడద్రోసి గోసిరి. మొండెములకు త్రాళ్ళు కట్టి వీథులలో నీడ్చిరి. ఇంటనున్న రుస్తుంరావు పై బడి జంపిరి. రాణులను, కుట్ర బన్నిన అమీరులును అక్కన్న మాదన్నల శిరములను కోహీరులో నున్న షా ఆలం బహద్దరు రాకుమారునకు కానుకగా బంపిరి"[2].

హోవర్డు అక్కన్న మాదన్నల హత్య గూర్చి ఈ విధగా వ్రాశాడు. " క్రీశ 1685వ సంవత్సరంలో ఢిల్లీ చక్రవర్తియైన ఔరంగజేబు గోలకొండపైకి దండెత్తి వచ్చి ముందుగా మాదన్న యిల్లు చూఱగొనియెను. పట్టణములోని ప్రజయంతయు భయ భ్రాంతమయ్యెను. మాదన్న రాజ ద్రోహము చేసి ఔరంగజేబుకు తోడ్పడెనని ప్రవాదము కలిగెను. కొందరు జనులు రాజానుమతిని బొంది యంతఃపురమునకు దనుక రాజుగారి యంతరంగిక మిత్రులుగ నుండిన యక్కన్న, మాదన్నలను వీథుల వెంట నీడ్చుకొని పోయి పరాభవించి చంపిరి. వారి తలలు నతీకి మాదన్న తలను ఔరంగజేబునకు బంపి అక్కన్న తలను ఏనుగు కాలి క్రింద బెట్టి త్రొక్కించిరి" ఢిల్లీ సేన గోలకొండ పట్నము క్రీ.శ. 1685 వ సంవత్సరము అక్టోబరు నెల 29వ తేదీకి ప్రవేశించెను. అక్కన్న మాదన్న గార్ల హత్య యా దినముననో లేక యా నెల 30-31వ తేదీలలోనో

1. మాదన్న మహామంత్రి - కె.వి.భూపాలరావు గారు పుట 217.

2. మున్షీ ఖాదరు ఖాను (పుట 475) మానూషి - మార్టిను మహమ్మదు సాజీ-ఈశ్వర ప్రసాదు.

జరిగియుండును. 1687వ సంవత్సరములో తానీషాను పట్టుకొని దౌలతాబాదు కోటలో చెఱలోనుంచిరి". అని జయంతి రామయ్య పంతులు గారు అక్కన్న మాదన్నలు అనే వ్యాసంలో వ్రాశారు.

"అక్కన్న మాదన్నలు హత్య గావింపబడినది 'జమాది లవ్వల్ 1097 హిజరి అంటే క్రీశ. 1686వ సంవత్సరము. అట్లే రుస్తుంరావు ఇంటిలోనికి చొచ్చి, అతనిని, అతని కుటుంబ సభ్యులను సంహరించి సమస్త మును దోచుకొనిరి. మందిరమును ధ్వంసమొనర్చి, హిందువులను బ్రాహ్మణులను సంహరించి, దౌర్జన్యములు, దోపిడిలు సాగించిరి. ప్రభుత్వమీ సమయమున అప్రమత్తత వహించి అలజడులను అదుపులోనికి తెచ్చెను".

1686 నుండి దాదాపు ఎనిమిది నెలల కాలం మొగలులు గోల్కొండ కోటను వశపరచుకోలేకున్నారు. అక్కన్న, మాదన్నల హత్యతో గోల్కొడ సామ్రాజ్యం కీర్తి ప్రతిష్టలు నశించి, పతనం చెందింది. అక్కన్న మాదన్నల మరణం మొగలులకు ఆనంద దాయకమైంది. 10-7-1687లో గోల్కొండను ఆజం రాకుమారుడు, ఔరంగజేబు , రహులుల్లాఖాన్‌లు ముట్టడించి వశపరచుకొన్నారు. తానాషా మొగలులకు బందీయైనాడు.

## 2.0.3. మొగలుల గోల్కొండ ఆక్రమణ :

అక్కన్న, మాదన్నల హత్య అనంతరం మొగలులకు ఈ గోల్కొండ దుర్గం వశం కావడానికి ఎనిమిది నెలలు పట్టింది. ఈ ఎనిమిది నెలల కాలం అబుల్ హసన్ తానీషా చూపించిన ధైర్య సాహసాలు, ఆయన మంత్రుల రాజనీతి, వారి పరిపాలనా వ్యవస్థలోని పటిష్టతకు తార్కాణం అని చెప్పవచ్చు. దుర్గ రక్షణకై 'షేక్ మిన్హాక్, షార్జాఖాన్, అబ్దుల్ రజాక్ లారా' అనేవారిని తానాషా నియమించాడు. అబ్దుల్ రజాక్ లారా స్వామిభక్తుడు. చివరి దాక పోరాడిన వీరుడు. ఒక కన్ను పోయినా చివరి దాకా సాహసోపేతంగా యుద్ధం చేశాడు. దౌర్భాగ్య వశాన 1686లో బిజాపూర రాజ్యం మొగలు రాజులకు వశం కావడం చేత, అక్కడ ఉండిన సైన్యమంతా గోలకొండపై దాడి చేయడానికి మొగలాయీలు ఉపయోగించారు. దీని వల్ల తానీషాకు విఘాతం కలిగింది.

### గోలకొండ మొగలుల వశం కావడానికి గల కారణాలు :

గోల్కొండ మొగలుల వశం కావడానికి అనేక కారణాలున్నట్లు చారిత్రకులు భావిస్తారు.

1. ఖ్వాజా ఆబిద్ ఖిలీజ్ ఖాన్ అనే సరదారు మరణించడం, ఇతడు మహా వీరుడు. యుద్ధంలో ఒక బాహువు ఖండింపబడిన తర్వాత కూడా అతడు యుద్ధం నిర్వహించాడు.

1. అక్కన్న మాదన్నలు - జయంతి రామయ్య పంతులు. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక - శుక్ల నామ సంవత్సరము - ఆశ్వయుజ, కార్తిక మాసములు సంపుటి 17 సంచిక 4

2. గోలకొండ చరిత్ర-సంస్కృతి-శాసనములు - బి.ఎన్.శాస్త్రి. పుట 198.

2. కుతుబ్షాహీ సరదారులు కొందరు మొగలు సైన్యంలో చేరిపోయి స్వామి ద్రోహం చేసిన కారణంగా, గోలకొండ పరిస్థితి బలహీనమైపోయింది. ఈ సరదారులకు ఔరంగజేబు ఉన్నత పదవుల ఆశ చూపించడమే దీనికి కారణం.

3. ఈ స్థితిలో అబ్దుల్లాఖాన్ పన్నీ అనేవాడు తలపెట్టిన ద్రోహ కారణంగా గోలకొండ శత్రువుల అధీనమైపోయింది. ఈ అబ్దుల్లాఖాన్ 21-9-1687 నాడు అర్ధరాత్రి సమయంలో, దుర్గంలోని వెనుక తలుపు తెరచి మొగల్ సైనికులకు దారి ఇచ్చాడు. దానితో ముందు ద్వారాలు కూడా తెరుచుకున్నాయి.

4. అబ్దుల్ రజాక్ లార్ అనే సరదారు, తన స్వామి తానీషాను రక్షించడానికి చివరిదాకా పోరాడాడు. అతని కన్ను గాయమై రాలిపోయిన ధైర్యంతో పోరాడిన వీరుడు ఇతడు. చివరకు చక్రవర్తియే అతనికి వైద్యం చేయించినాడట.


5. ఇక తానీషా గౌరవంగా తన ఓటమిని అంగీకరించి, 'రుహులుల్లాఖాన్'కు వశమై పోగా, అతడు అతన్ని మోజంకు అప్పగించాడు. చివరకు తానీషా ఔరంగజేబు వద్దకు చేర్చబడినాడు.

6. మొగలాయీలు అబుల్ హసన్ తానీషాను దౌలతాబాదు కోటలోని కాలా మహల్‌లో బంధించారు. అతడు అచటనే క్రీశ. 1703 సంవత్సరంలో కాల ధర్మం చెందాడు.

ఇవి అబుల్ హసన్ కాలం నాటి రాజకీయ పరిణామాలు. 1687లో చివరకు గోల్కొండ రాజ్యం ఔరంగజేబు వశం అయింది.

క్రీశ 1620-80 రామదాసు కాలం అని చరిత్రకారులు నిర్ణయించారు. ఈయన కాలంలో జరిగిన రాజకీయ పరిస్థితులను ఇంతవరకు తెలియజేశాను. ఈ విధమైన పరిస్థితులలో రామదాసు జీవించాడు.

ఈ రాజకీయ పరిస్థితుల ప్రభావం రామదాసుపై ఎంతగానో ఉంది. ఈ విషయాలను గూర్చి, ఈ పరిస్థితులు రామదాసు సాహిత్యంపై ఎటువంటి ముద్రను వేశాయో తర్వాతి అంశాలలో రామదాసు జీవిత విశేషాలను గూర్చి చర్చించే సమయంలో ప్రస్తావిస్తాను. ఈ రాజకీయ నేపథ్యం ఎలా రామదాసు సాహిత్యంపై ముఖ్యంగా కీర్తన సాహిత్యంపై ప్రభావం వేసిందో, ముందు అంశాలలో చర్చిస్తాను.



## 2.1. రామదాసు కాలంనాటి సాంఘిక , మత పరిస్థితులు :

మత సహనానికి, వాఙ్మయ సేవకు సాధన నిర్మాణానికి గోల్కొండ సుల్తానులు ప్రఖ్యాతి వహించారు. వీరు నేల విడిచి సాము చేయక, వాస్తవిక దృష్టి కలిగి, తాము పాలించేది ఆంధ్ర దేశం, ప్రజలాంధ్రులు కావున తామాంధ్ర సుల్తానులమని భావించి, గుర్తించిన కుతుబ్షాహీ రాజులు హిందూ మహమ్మదీయులను సమానంగా చూశారు. హిందువులకు పెద్ద పెద్ద ఉద్యోగాలిచ్చి, తెలుగు కవులను పోషించారు. స్థానిక భాషయైన తెలుగులో పరిపాలన సాగించి, స్వయంగా సుల్తానులు తెలుగు నేర్చుకొని ప్రజల కష్టాలను ఆలించి, పాలించడంచే ప్రజాభిమానాన్ని చూరగొన్నారు.

## 2.1.0. కుతుబ్షాహీ రాజుల కాలం నాటి హిందూ ఉద్యోగులు :

ఈ కుతుబ్షాహీ రాజులు మహమ్మదీయులతో పాటు హిందువులకు ఉద్యోగాలిచ్చి గౌరవించారు. హిందువులు కూడా వారికి నమ్మిన బంటులై ఉండేవారు. వారి కాలంలో హిందూ సామంతులు, జాగీర్దారులు అధికంగానే ఉన్నారు. గోల్కొండలో స్వాతంత్ర్యం ప్రకటించుకున్న తర్వాత కులీ కుతుబ్షా తెలుగు దేశంలోని అనేక కోటలను జయించాడు. ఈ దుర్గాలలో చాలా వాటికి హిందువులే దుర్గాధిపతులుగా ఉన్నారు. క్రీ.శ. 1686 నాటికి పూర్తి ఆంధ్ర దేశం గోల్కొండ కుతుబ్షాహీల ఆధీనంలో ఉంది.

క్రీ.శ 1512-1687 మధ్య కాలంలో ఏడుగురు చక్రవర్తులు గోల్కొండను పాలించారు. గోల్కొండ సైన్యంలో హిందూ సైనికులే అధికంగా ఉన్నారు. కుతుబ్షాహీల అధీనంలో ఉన్న అరవై ఆరు దుర్గాలలో ఒక్కొక్క దానిలో సుమారు 1200 మంది హిందూ సైనికులు ఉండేవారట. ఈ సైన్యానికి 'నాయక్' అనే ఒక హిందూ సైన్యాధికారి ఉండేవాడు. ఎక్నాజీ, గణ నాయక్ అనే ఇద్దరు నాయక్‌లు చాలా ప్రసిద్ధి వహించారు. అమీర్ చరీద్ అనే రాజును ఓడించడంలో సామర్థ్యం చూపించిన గణ నాయక్‌కు 'జగదేవ' బిరుదిచ్చి కులీ కుతుబ్షా సత్కరించాడు.

మహమ్మద్ కులీ కాలంలో 'అశ్వారావు' సైన్యాధిపతిగా ఉన్నాడు. అబ్దుల్లా కుతుబ్షా కాలంలో 'అంబాజీరావు' ముఖ్య సైన్యాధికారిగా ఉన్నాడు. ఈ రాజు కాలంలోనే 'నారాయణరావు' ఆర్థిక మంత్రిగా ఉండి ఆర్థిక వ్యవస్థలో అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టాడు. ధర్మారావు, జగపతి రావు, సభాజీ భలేరావు, హరిచంద్, ముకుంద్ రాజ్, శంకర్ రాజ్, రామ్‌రావు మొదలైన వారు వివిధ కుతుబ్షాహీ రాజుల కాలంలో ఉన్నతోద్యోగాలు నిర్వహించారు.

కుతుబ్షాహీ రాజుల కాలంలో ఉన్నత పదవులు అలంకరించిన రామదాసు బంధువుల గూర్చి ఇక్కడ ప్రస్తావించవలసి ఉంది. తానీషా దగ్గర పరిపాలనలో భాగస్వామ్యం స్వీకరించి ప్రముఖ స్థానంలో ఉన్న రామదాసు బంధువులు పేర్కొనదగిన హిందూ ఉద్యోగులు.

### 2.1.0.0. తానాషా వద్ద ఉద్యోగులుగా ఉన్న రామదాసు బంధువులు :

అబ్దుల్లా కాలంలో అక్కన్న మాదన్నలు అనే బ్రాహ్మణ సోదరులు ఉద్యోగస్తులుగా ఉన్నారు. వీరు రామదాసుకు మేన మామలు. ఈ అక్కన్న, మాదన్నల గూర్చి ఇంతకు పూర్వం చర్చించడం జరిగింది. హనుమకొండలో దస్తు వసూలు చేసే ఉద్యోగి భానూజీ పంతులు, అతని భార్య భాగమ్మలకు అక్కన్న, మాదన్న, విస్సన్న, మల్లన్న అనే నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తెకు పొదిలి లింగన్న, మరియొక కుమార్తెకు పులిపల్లి వెంకన్న, మరొక కుమార్తెకు కంచెర్ల గోపన్న కుమారులుగా జన్మించిరు. కంచెర్ల గోపన్న తల్లి కామాంబ, తండ్రి లింగన మంత్రి. కామాంబ అనే పేరు రామదాసు చరిత్రలలో కనిపిస్తుంది. ఇది ఎంతవరకు నిజమో తెలియదు. వీరు ముగ్గురు అక్కన్న, మాదన్నల మేనల్లుళ్ళు. పులిపల్లి వెంకన్న 'రుస్తుంరావు' అనే పేరుతో ప్రసిద్ధి పొందాడు. ప్రముఖ సేనానిగా అబుల్ హసన్ కాలంలో ప్రఖ్యాతి వహించాడు.

### 2.1.0.1. అక్కన్న - మాదన్న :

అబ్దుల్లా కాలంలో అక్కన్న సైనిక వ్యవహారాల సహాయకుడుగా ఉన్నాడు. 1666లో సైనిక వ్యయాధికారి సయ్యద్ ముజఫర్‌కు మాదన్న కార్యదర్శిగా ఉన్నాడు. కొంత కాలం వీరు ఆదాయ శాఖలో పనిచేశారు. అబుల్ హసన్ తానీషా రాజైన తర్వాత 1672లో మీర్ జుమ్లా సయ్యద్ ముజఫర్‌కు కార్యదర్శిగా, ఆదాయ శాఖకు మంత్రిగా మాదన్న నియుక్తుడయ్యాడు. అవినీతి కారణంగా సయ్యదు ముజఫరు తొలగింపబడి, 1674లో మాదన్న మీర్‌జుమ్లా పదవిని స్వీకరించాడు. మీరజుమ్లా అంటే ప్రధానమంత్రి పదవి. తానీషా మాదన్నకు 'సూర్య ప్రకాశరావు' అనే బిరుదమిచ్చి సత్కరించాడు. అక్కన్నకు 'ముజఫర్ జంగ్ అక్బర్ బహదూర్' అనే బిరుదం ఇచ్చి తానాషా సత్కరించాడు. అక్కన్న సేనాపతిగా తానీషా కాలంలో నియమింపబడ్డాడు.

అక్కన్న మాదన్నలు ఉన్నత పదవుల్లో ఉండగానే సోదరుడు విస్సన్న హనుమకొండ అమిల్‌గాను, మేనల్లుడు కంచెర్ల గోపన్న భద్రాచలం పరగణాకు తహసీల్దారుగాను, మరొక మేనల్లుడు పులిపల్లి వెంకన్న దండనాయకుడుగాను నియుక్తుడైనట్లు "హిస్టరీ ఆఫ్ మిడీవల్ దక్కన్" లో వివరించబడింది. అంతవరకు సేనానిగా ఉన్న మహమ్మద్ ఇబ్రహీం అనువానిని తొలగించి తానాషా 1682లో అక్కన్నకు సేనాపతి పదవిని ఇచ్చాడని ప్రభుత్వం వారు సేకరించిన "లెటర్స్ టు ఫోర్టు సెంట్ జార్జ్" అను రికార్డులలో ఉంది.

అబుల్ హసన్ తానీషా చేత మాదన్న సోదరుడు వెంకన్న రుస్తుంరావు అనే బిరుదం పొంది రాజు విశ్వాసాన్ని పొందాడు. మాదన్న చిన్న తమ్ముడు విస్సన్న హనుమకొండకు రెవెన్యూ అధికారి అయినాడు. రామదాసు వారి మేనల్లుడే . వెంగన్న సైన్యాధికారిగా ఉన్నాడు. ఈ విధంగా రామదాసు బంధువులు తానీషా కాలంలో ఉన్నత పదవులను అలంకరించారు.

ప్రాంతీయాధికారులు సర్వ సామాన్యంగా హిందువులే అయి ఉండేవారు. 'వైజయంతీ విలాస' కర్త అయిన సారంగు తమ్మయ్య ఇబ్రహీం కుతుబ్షా కాలంలో గోల్కొండకు కరణంగా ఉండేవాడు. ఈ విధంగా వివిధ పదవులందు హిందువులు ఉద్యోగులుగా ఉన్నారు.

## 2.1.1. కుతుబ్షాహీ రాజుల భాషా సాహిత్య సేవ :

గోల్కొండ సుల్తానులు సంస్కృతాంధ్ర వాఙ్మయాలను, పారశీక, ఉర్దూ భాషా వాఙ్మయాలను చక్కగా పోషించారు. సంస్కృతంలో "శృంగార మంజరి" అనే అలంకార గ్రంథం ఈ యుగంలో రచింపబడినదే. ఆంధ్ర భాషా వాఙ్మయ పోషణమునందు, పండిత ఆదరణమునందు గోలకొండ సుల్తానులు చూపిన అభిరుచి ప్రశస్తమైంది. భక్తి ఉద్యమం, చారిత్రక ఉద్యమం, అచ్చ తెనుగు ఉద్యమం వంటి ఉద్యమాలు విజృంభించినవి గోల్కొండ రాజుల కాలంలోనే. నృత్య ప్రధానమైన పద సాహిత్యం అన్నమాచార్యులు, క్షేత్రయ్య, రామదాసు కీర్తనలు, గేయ ప్రధానమైన 'సుగ్రీవ విజయం' వంటి యక్షగానాలు, దాశరథి శతకం, శుక సప్తతి వంటి శతక వాఙ్మయం కుతుబ్షాహీ రాజుల కాలంలో ఆవిర్భవించాయి. అంతేకాక కదిరీపతి వంటి వారి కథా కావ్యాలు, రంగ రాయ చరిత్ర, సిద్ధేశ్వర చరిత్ర, శ్రీకృష్ణ దేవరాయ విజయం వంటి చారిత్రక కావ్యాలు, కుతుబ్షాహీల కాలంలో వచ్చాయి. హిందూ ముస్లిం సామరస్య పురోగతి ఈ యుగ సాంఘిక పరిణామాల్లో గమనించదగ్గ అంశం. సామరస్య దృష్టి, ప్రజల్లో ప్రతిఫలించి పరస్పర అవగాహనకు, సంస్కృతీ సమ్మేళనానికి దోహదం చేసింది. వాస్తవానికి దక్షిణ భారతంలో హిందూ ముస్లిం సామరస్యం ముస్లిం సూఫీ మత గురువుల బోధనలతోనే ప్రారంభమైంది.

కుతుబ్షాహీ రాజులలో కొందరు కళా పోషకులు. పర్షియన్ సాహిత్యాన్నే కాక, తెలుగు సాహిత్యాన్ని కూడా ఆదరించారు. ఇబ్రహీం కుతుబ్షా మొదలుగా తరువాత సుల్తానులు అందరు ఆంధ్ర భాషా సేవ చేశారు. వారందరు స్వయంగా పండితులు, కవులుగా ఉండి కవి పండితులను పోషించారు.

### 2.1.1.0. ఇబ్రహీం కుతుబ్షా తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన సేవ :

ఆంధ్ర కవులచే ఇబ్రహీం కుతుబ్షా "మల్కిభరాముడు" "ఇభ రాముడు", "ఇభ రాముషా" గా ప్రశంసింపబడ్డాడు.

ఇబ్రహీం కుతుబ్షా గోలకొండ ప్రభువులలో మూడవ వాడు. ఇతడు కొన్ని చారిత్రక కారణాల వల్ల తన జీవిత కాలంలో కొద్ది భాగం విజయ నగర సామ్రాజ్యంలో గడపవలసి వచ్చింది. అప్పుడు మహా ప్రభువైన శ్రీ కృష్ణదేవరాయల అల్లుడు అళియ రామరాయల పరిపాలనా కాలం. మహోదాత్తంగా సాహిత్యం వెలుగుతున్న కాలం కూడా అది. ఆ ఉజ్జ్వల సమయంలో ఇబ్రహీం రామరాజ భూషణుని వంటి కవి పండితుల సంపర్కంలో ఉన్నాడు. స్పర్శ వేదిలాగ వారి సాహిత్య వాసన ఇతనికి కూడ వచ్చింది. గోలకొండ ప్రభువుగా అధికారం వహించిన తర్వాత ఈ ఇబ్రహీం ప్రభువే కవుల భాషలో 'ఇభ రాము'డైనాడు. తెలుగు భాషా సాహిత్యాలను పోషించి అజరామరుడైనాడు. ఈ కాలంలో వెలువడిన కొన్ని ముఖ్య కావ్యాల గూర్చి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

### 2.1.1.0.0. యయాతి చరిత్ర :

కుతుబ్షాహీల సాహిత్యంలో యాయాతి చరిత్రకు మొదటి స్థానం లభిస్తుంది. ఇది అచ్చ తెనుగు కావ్యం. పొన్నికంటి తెలగనార్యుడు దీనిని రచించాడు. రాజుగారి అభిరుచిని అనుసరించి ఆయన సేనాధిపతి 'అమీనుఖాను' లేక 'అమీరుఖాను' అనే సరదారు పొన్నికంటి తెలగనార్యుని ప్రోత్సహించి మొట్టమొదటి అచ్చ తెనుగు కావ్యాన్ని ఆవిర్భవింపజేసాడు. తెలగనార్యుడు నూతనత్వాన్ని తన కావ్యంలో ప్రదర్శించవలెనని కావచ్చు లేదా ముసల్మాను ప్రభువును సంతోష పెట్టడానికి కావచ్చు ఈ ప్రబంధాన్ని సాహిత్య లోకానికి ప్రసాదించాడు. అది వెలువడిన సమయం ఏమో కాని అప్పటికీ ఇప్పటికీ యాయాతి చరిత్రకు ప్రథమ స్థానమే ఉంది. ఈ అచ్చ తెలుగు ప్రబంధానికి మరింగంటి అప్పలాచార్యులు కూడా ప్రోత్సాహకులైనట్లుగ చారిత్రకులు చెప్తున్నారు. స్వయంగా ఇభరాము ప్రభువు కూడ సాహిత్య పోషణలో తాను విజయ నగరంలో సంతరించుకున్న అభిరుచిని పండించుకున్నాడు. క్రీ.శ. 1574- 1581 కాలంలో యయాతి చరిత్ర వెలువడింది. ఈతని నివాసం గోల్కొండ దగ్గర పటంచెరువు. ఇతని తండ్రి భావనామాత్యుడు. మదన గోపాల మంత్ర జపంతో సారస్వత స్ఫూర్తి పొందాడు. యయాతి చరిత్రను అచ్చ తెలుగులో ఎందుకు వ్రాశాడో తెలగనార్యుడు ఇలా చెప్పాడు.

" అచ్చ తెనుంగు పద్దెమొకటైనను
గబ్బములోన నుండినన్
హెచ్చని యాడుచుందురది యెన్నుచు
నేర్పున పొత్తమెల్లని
ట్లచ్చ తెలుంగునన్ నొడువ నందుల
చంద మెఱుంగు వారునిన్
మెచ్చరో యబ్బురంబనరో మేలనరో
కొనియాడరో నినున్"[1] (యయాతి చరిత్ర 1-12)

1. "తెలంగాణా అచ్చ తెనుగు కవులు " - డా॥ కె. రాజన్న శాస్త్రి, పుట 11, హైదరాబాదు నాలుగు శతాబ్దాల సాహిత్య వికాసం , ఉ. వి. సెమినార్ మార్చి 1991.

ఈ కావ్యం గోల్కొండ నవాబు 'మల్కిభరాం పాదుషా' సర్దారు అమీన్‌ఖాన్‌కు అంకితమీయబడింది. ఈ యయాతి చరిత్రము అయిదాశ్వాసాల కావ్యం. శృంగార రస ప్రధానమైంది. మహా భారతంలో యయాతి, దేవయాని శర్మిష్ఠల వృత్తాంతం ఇందు వర్ణింపబడింది. యయాతి, శర్మిష్ఠను కూడా గాంధర్వ విధిగా వివాహమాడి ఆమెయందు సంతానం బడయటంతో కథ ముగుస్తుంది. ప్రబంధోచిత వర్ణనలు, వసంత, ఉద్యాన, వన విహార, పుష్పాపచయాలు, నగరం, వేట, సూర్యోదయాస్తమయాలు ఇందు చోటు చేసుకున్నాయి. మరో విశేషం యయాతికి జాబాలి ద్వారా రామ కథా శ్రవణం 40 పద్యాల్లో చేయించాడు కవి. కచ దేవయానీ వృత్తాంతం కూడా రేఖా మాత్రంగ స్పృశించాడు.

అచ్చ తెనుగు కంటె కొన్ని చోట్ల సంస్కృత పదాలే సరళం. కొన్ని సంస్కృత పదాలను తెలుగులోకి అనువదించినా సంస్కృత పద స్ఫూర్తితోనే తెలుగులో అర్థం భావించాలి.

1. పైడికంటి రాకాసి (యయాతి 4-106) హిరణ్యాక్షుడు.

2. తమ్మి పొక్కట వేల్పు (యయాతి 2-20) పద్మనాభుడు.

అర్థ స్ఫూర్తి బాధ కలుగకుండడానికి సంజ్ఞా వాచక సంస్కృత పదాలను బిరుదులను తెలిగించక యథాతథంగా సంస్కృత పదాలనే గ్రహిస్తానన్నాడు కవి. ఈ ఉదాహరణ గమనిస్తే ఈ విషయం బోధపడుతుంది.

కం. "తెనుగుననుసు మాటలు పేళ్లడి
*పెనచిన విన గూడదనుచు బిరుదులు పేళ్లన్*
*మును వేల్పు బాన వెంబడి*
*నునిచెదగా దనకు డయ్యుయుల్లము లందున్"* (యయాతి - 1-14)

తెలుగన్న అచ్చ తెలుగు అందరి కర్థమయ్యే తేట తెలుగని ప్రసిద్ధి పొందింది. ఈ పద్యంలోని అందం చక్కని పదజాలం పరిశీలిస్తే ఈ విషయం వ్యక్తమౌతుంది.

కం. " *సిరిరా మోకాలొడ్డిన*
*కరణింటై కొసుచు నేనకదియగ ననుని*
*నెరవుగ విడనాడుచు నొక*
*తలిపెపు జెలి పట్టి జేరంటివి రెదవేమో* (యయాతి 2-93)

ఇవి రావణుడు రంభతో అనిన పలుకులు. ఈ జాతీయం తిక్కన ఈ సందర్భంలో వాడిందే తెలగన స్వీకరించాడు. తెలగన కవితా ధార సాఫీగా సాగింది.

కం. " *తాళి గట్టినపుడె తలిరాకు బోడికి*
*పుడమి రేడు వేడ్క కడలి కొనగ*
*దనరు పెక్కు వాలు దమ్ముల మ్రోతలు*
*చెలగి ముజ్జగములు చెవుడు వడుక* ( 4-110)

అర్థం ఇక్కడ సుగమం. ముఱ్ఱిగములు సంస్కృత సమంతో తెలుగు సమాసమా ? ఇక్కడ ఒక విశేషం గుర్తించాలి. తెలగన కవిత్వంలో సంస్కృత సమా(సా)లు గా మనం భావించేవి ఆ కవి దృష్టిలో అట్లా కావు. వర్ణ లోపం పొందిన వానిని కవి సంస్కృత సమాలుగా గుర్తించలేదు.

ఈ కావ్యంలో కృతిపతి అమీన్‌ఖాన్ (మీర్‌జుమ్లా) ఆయన భార్య బడే బీబీల ఔదార్యాన్ని, కృతిపతి వంశ వర్ణనలో ఎంతగానో ప్రశంసించాడు. యయాతి చరిత్ర మూలకథను యథాతథంగా అనువదించలేదు. కవి కొంత కథను వదలివేసి, మరికొన్ని మార్పులు చేయడానికి కారణం ఆయన నివసించిన సంఘ ప్రభావం. ఈ ఉప కథను కావ్యంగా మలచటంలో తెలగన్నది మహాభారతంలో వలె ధార్మిక దృష్టి కాదు. శృంగారాత్మక కల్పన ఇందున్నది.

అపార భోగ విలాసాలతో నిండిన గోల్కొండ నవాబులు, వారి సర్దారుల మనసుకు ఎక్కాలంటే తెలగన్న ఈ మార్పు చేయక తప్పదు. ఒక రాజు ఇద్దరి భార్యలను ముద్దుగా పెళ్ళాడి వారితో, వారి పుత్ర సంతతితో హాయిగా కాలం గడిపినాడని శృంగార కవనం చేసినపుడు తాదాత్మ్యంతో ఆ కథనాన్ని విన్న ఏ రాజయినా హాయిని, ఆనందాన్ని అనుభవిస్తాడు. యయాతి పెళ్ళాడిన ఇద్దరు కన్యలు ఒకరు రాజు కూతురు. మరొకరు రాజగురువు కుమార్తె. సౌందర్యం, సౌభాగ్యాలలో ఒకరినొకరు తీసిపోరు. వీరిద్దరు ఒకరి తర్వాత మరొకరు వరుసగా యయాతిని ప్రేమించి పెళ్ళాడి అయిదుగురు కొడుకులను ఆయనకు అందించారు. ఈ సరసమైన శృంగార కథను విన్న రసిక రాజులు 'భళీ' అనవలసిందే ! వందల కొద్దీ భార్యలను పెట్టుకొనే నవాబుల యుగంలో సమకాలికుల మెప్పునాశించి తెలగన్న దేవయాని, శర్మిష్ఠలతో యయాతి పెళ్ళి వృత్తాంతాన్ని మాత్రమే కథా వస్తువుగా స్వీకరించి కాలానుగుణమైన ఔచిత్యాన్ని పాటించాడు.

యయాతికి శుక్రుని శాపం మొదలైన అంశాలతో కూడిన కథా భాగాన్ని వదలి వేసి ప్రబంధ రచనకు అనుకూలంగా కథా వస్తువును సంగ్రహించాడు. కథా సంవిధానంలో మూల కథలో వలె ఆఖ్యాన శిల్పం కాకుండా నాటకీయ శిల్పాన్ని ప్రవేశపెట్టాడు.

### కథా క్రమంలో చేసిన మార్పులు :

1. కథా క్రమంలో దేవయాని, శర్మిష్ఠల పాత్ర చిత్రణలో కొంత మార్పు చేసాడు. జలక్రీడ అనంతరం శర్మిష్ఠ, దేవయానులు వలువలు మారినపుడు ముందు అసహ్యించి, కోపించినది దేవయాని అని భారత కథ. తెలగన్న తన కథలో ముందు అసహ్యించి, నిందించినది రాజబిడ్డ అయిన శర్మిష్ఠ అని చెబుతాడు.

2. ఇదే విధంగా భారత కథలో ఉన్నట్లుగా కాక, కామావేశంలో శర్మిష్ఠ, యయాతులు సంయోగం

చేసినట్లు కథను మార్చాడు. ఈ సందర్భంలో కామ ధర్మమే అన్ని ధర్మాల కంటే మిన్న అని తెలగన్న వాచ్యంగా చెబుతాడు. ఈ మార్పు ఆ కాలపు జనులలో ప్రవృద్ధమైన భోగ లాలసతను స్పష్టంగా చూపిస్తుంది. మూల కథకు భిన్నంగా తెలగన్న చేసిన మార్పుల వెనుక నన్నయ నాటి నుంచి నవాబుల నాటికి మారిన వ్యవస్థా ధర్మం ప్రభావం కచ్చితంగా కనిపిస్తుంది.

3. యయాతి చరిత్రలో తెలగన్న చేసిన మరొక ప్రధానమైన మార్పు మహర్షి జాబాలి యయాతికి రామకథను చెప్పటం. తెలగన్న రామభక్తి , ఇబ్రహీంషాను ఇభరామునిగా భావించటం కారణమని కొంతమంది పరిశోధకుల అభిప్రాయం. కాని ఈ మార్పుకు కారణం ఆనాటి భక్తి ఉద్యమం. క్రీ.శ. 15వ శతాబ్దం తర్వాత వైష్ణవ భక్తి ఉద్యమం కారణంగా అటు ఉత్తర, ఇటు దక్షిణ భారత దేశాల్లో వ్యాపించిన రామ భక్తి సంప్రదాయం ప్రధాన కారణం. విజయ నగర రాయల పరిపాలనా కాలంలో దక్షిణ భారత దేశంలో రాముని గుళ్లు ఊరూరా వెలసినాయి. రామానందుడు, కబీరు మొ॥ ఉద్యమకారుల మూలంగా రామకథ విశేష జనాదరణ పొందింది. జానపదుల రామభజన ప్రభావంతో తెలగన్న యయాతికి రామకథను జాబాలి చేత చెప్పించాడు. అంతే కాని తెలగన్న రామభక్తి కారణమని చెప్పటంలో ఔచిత్యం కనిపించదు. ఒకవేళ తెలగన్న రామ భక్తుడే అయితే ఆ విషయాన్ని కావ్యంలో సూచించకుండి ఉండడు. ఇబ్రహీంషా 'ఇభరాముని'గా సంభావించటం, అది ఆయన పట్ల ఆయా వ్యక్తులకున్న విశ్వాసమే !

ఈ యయాతి చరిత్రలో తెలగన్న తన కృతిపతి అయిన అమీనుఖానును బ్రోవుమని తన ఇష్ట దేవతలను ప్రార్థించాడు. ఈ పద్యం అందుకు నిదర్శనం.

"సిరులు మెఱుంగు బోడి తన చెక్కులు
సిబ్బెపు గుబ్బ గుబ్బలన్
బరువడి నాల్గు చేతులను బట్టగ, నల్వ
దలంచి కేలు దా
మరగుడి కన్ను మూయుటకు, మాటికి
నవ్వెడు వెన్నుడింపుతో
చిరముగ బ్రోచు గావుత మదిం జెల
రేగి యమీను ఖానునిన్" [1] అని పొన్నకంటి తెలగన అన్నాడు.

ఈ విధంగా పొన్నికంటి తెలగనకు, అతని కావ్యం యయాతి చరిత్రకు తెలుగు సాహిత్య చరిత్రలో ప్రముఖ స్థానం లభించింది.

1. కుతుబ్షాహీ రాజుల నాటి హిందూ ఉద్యోగులు - వారి సేవ , మహామంత్రి మాదన్న సద్గ్రంతి సంచిక మార్చి 1987, పుట 6.

### 2.1.1.0.1. తపతీ సంవరణోపాఖ్యానము :

అద్దంకి గంగాధర కవి ఈ కావ్యం రచించాడు. ఇతడు కూడా ఇబ్రహీం కుతుబ్షా కాలంలోని వాడే. ఇబ్రహీ కుతుబ్షా ఈ కవిని సభకాహ్వానించి ఈతనిని తపతీ సంవరణోపాఖ్యానము' ను రచించమని ఆదేశించాడు.

" పెక్కు కృతులు చమత్కృతులు పెంపుగ అందితి గాని నీదు సమ్మత్కృతి కన్నపై గల అభిమానం నాకు అధికంగా ఉంటుంది"[1] అని అన్నాడట. దాని పరిణామం చక్కని ప్రబంధం వ్రాసి గంగాధరుడు ప్రభువునకు సమర్పించినాడు. ఈ ప్రబంధం ప్రభావం ఉర్దూ సాహిత్యంపై కూడా పడింది. ఈ అద్దంకి గంగాధర కవి గోల్కొండ నివాసి. క్రీ.శ. 1550- 65 మధ్య కాలంవాడు. ఇబ్రహీం కుతుబ్షాకు ఈ తపతీ సంవరణోపాఖ్యాన కావ్యం అంకితమీయబడింది.

" ప్రతివారస్తుత ధీర ప్రణుత విజయ చారిత్రకున్"[2]

" సారస్వత సారస్య విచార స్తుతమతి కవీంద్ర సన్నుత మూర్తీ"[3]

" హిందూ రాయ విభాళ సత్యవిమణీ బృందావన ప్రక్రియా మందార ద్రుమా"[4] అని గంగాధర కవి ఇబ్రహీంషా సాహిత్యాభిలాషను, కవి పండిత పోషణను కొనియాడాడు.

ఆంధ్ర సాహిత్యాన్ని ఆదరించిన తెనుగు కవులను పోషించిన మల్కిభరాం పాదుషా ఎన్నో కృతులను అంకితం పుచ్చుకున్నట్లు, "పెక్కు కృతుల్ చమత్కృతులు పెంపుగ నందితి గాని . . ."[5] అను పద్య పాదం ద్వారా తెలియ జేసినప్పటికి ఇబ్రహీంషాకు అంకితమిచ్చిన కావ్యం ఒక్క తపతీ సంవరణోపాఖ్యానం మాత్రమే నేడు కనిపిస్తుంది.

"భారతాఖ్యానమందు గలుగు తాపత్య చరితంబు ఘనత పెరిగేటట్లు" వివిధ శృంగార మహిమలతో విస్తరించి తన పేర కబ్బం చెప్పమని ఇబ్రహీం కుతుబ్షా గంగాధర కవికి కర్పూర తాంబూలమిచ్చి కావ్యం వ్రాయ వలసిన రీతిని కూడా సూచించాడు.[6]

ఇబ్రహీంషా కోరికను అనుసరించి గంగాధర కవి మూలకథను అనేక శృంగార విశేషాలతో విస్తరించి నవ రస భావ బంధురంగా తపతీ సంవరణోపాఖ్యానాన్ని నిర్మించాడు. అద్దంకి గంగాధర కవి తన కావ్యంలో కృతిపతియైన ఇబ్రహీం కుతుబ్షాను రక్షించమని, తన ఇష్ట దేవతలను ప్రార్థిస్తూ ఇలా అన్నాడు.

" శ్రీసతి మించుగాగ దులసీ దళ
మాలిక కౌస్తుభోజ్వలం
బైసుర చాప లీల జెలువందగ
వేణు రవంబు గర్జితంబై సొబగొంద

1. హైదరాబాదు నాలుగు శతాబ్దాల సాహిత్య వికాసం , 1991 మార్చి, ఉ.వి. జాతీయ సదస్సు కులశేఖర రావు గారు పుట 1-2.
2,3,4,5. కుతుబ్షాహీ ప్రబంధాలు - డా॥ కె. విద్యావతి "హైదరాబాదు నాలుగు శతాబ్దాల వికాసం, 1991 ఉ.వి. జాతీయ సదస్సు పుట 17.
6. " " " " " పుట 18.

శౌరి ఘనుడై, కరుణా రస వృష్టి చేసి రా

యా సత బ్రోచు గావుత నృపాగ్రణి

మల్కిభ రాము శాహివున్" అనినాడు అద్దంకి గంగాధర కవి.[1]

ఇబ్రహీం కుతుబ్షా సభలో

" సకల వేద పురాణ శాస్త్ర పారంగులైన

యొంటరి విద్వాంసులొక్క వంక

సప్త భాషలయందు సాంద్యంబు లేకుండ

హొంతకారి కవీంద్రు లొక్క వంక

గజపతి నరపతిక్ష్మా భర్తలంపిన

యొడికంపు రాయ బార్లొక్క వంక

మేరు మందిరముల మించ గల్గిన మన్ని

యులు దండ నాథులొక్కొక్క వంక"[2]

ఉండినట్లు గంగాధర కవి వర్ణించాడు.

తపతీ సంవరణోపాఖ్యానం మహాభారతంలోని ఆది పర్వంలో ఉంది. దానిని నన్నయ గారు 23 గద్య పద్యాల్లో వ్రాసారు. ఈ చిన్న కథను పెంచి గంగాధరుడు అయిదు ఆశ్వాసాల శృంగార ప్రబంధంగా మలచాడు. మహాభారతంలో నామ మాత్రంగా ఉన్న కథను ప్రబంధంగా వికసింప జేయడానికి కవి ప్రవేశపెట్టిన మార్పులు చేర్పులు ఎన్నో ఉన్నాయి.

పన్నెండు గద్య పద్యాలలో చేసిన తపతి, సంవరుణుల వివాహ వర్ణన ఈనాటి తెలుగు వారి పెళ్లిని చూపిస్తుంది. సమకాలీన సాంఘిక విశేషాలు కూడా కొన్ని మనకు ఈ కావ్యంలో కనిపిస్తాయి. గౌరీ కల్యాణం పాటలు పాడుతూ ఆడవాళ్ళు పెళ్లి పనులు చేయటం, వశిష్ఠుడు తపతిని ధారవోసి కన్యా దానం చేయటం మొదలైన సమకాలిక ఆచారాలను తెలియజేశాడు. ఔచిత్యంతో కూడిన ప్రబంధ వర్ణనలు, సహజ సౌందర్యంతో ఒప్పుతున్న సంభాషణలు కావ్య శోభను ఇనుమడింపజేశాయి.

" అందని ప్రూనిపై నాసలు, నిత్య కళ్యాణం పచ్చ తోరణం, పిలువని పేరంటం, కొంగు బంగారం, పూస గుచ్చిన రీతి" వంటి జాతీయాలు, కడుపు చల్లన, బంగారు బొమ్మ, ముద్దాడు, సింగారము, గొల్లున నవ్వు, చిలుకల కొలికి, చిలుక పలుకులు, కొదవ లేక వంటి ఎన్నో పలుకుబడులతో కూడిన ఈ కావ్య భాష తెలుగు పాఠకుల మనస్సును అలరింపజేస్తుంది.

అక్కడక్కడ పూర్వ కవులను అనుసరించినట్లు కనిపించినా, శయ్యా సౌభాగ్యంలో కథా నిర్వహణలో స్వతంత్రతను చూపిన కావ్యమిది. ఇది ఒక శృంగార ప్రబంధం.

1. మహామంత్రి మాదన్న త్రిశత వర్ధంతి ప్రత్యేక సంచిక 23,24 మార్చి 1987, పుట 6, "కుతుబ్షాహీ రాజుల నాటి హిందూ ఉద్యోగులు-వారి సేవ , దేవులపల్లి రామానుజరావుగారు.

2. చూ. పైదే (1) పుట 6.

## 2.1.1.0.2. నిరంకుశోపాఖ్యానము :

ఇబ్రహీంషా కాలంలోని రుద్రకవి 'నిరంకుశోపాఖ్యానము' అనే శృంగార కావ్యాన్ని రచించాడు. ఈ కవి రంచించిన ఈ కృతి వలన ఈ రుద్రకవి నివాసం నెల్లూరు జిల్లాలోని కందుకూరని తెలుస్తుంది. కాళీ భక్తుడైన రుద్రకవి ఆమె వర ప్రసాదం వల్ల లబ్ధ వర్ణన వర్ణనీయు కవిత్వ ధౌరేయుడైనాడట. ఈ కవి నిరంకుశోపాఖ్యానాన్ని కందుకూరిలోని సోమేశ్వరునికి అంకితమిచ్చాడు. రుద్రకవి క్రీ.శ. 17వ శతాబ్ది పూర్వార్థంలో ఉండెనని కొందరు , క్రీ.శ. 1540 వరకు పాలించిన ఇబ్రహీంషా వలన చింతల పాలెంను అగ్రహారంగా పొందిన రుద్రకవి ఇతడే అగుటచే క్రీ.శ 16వ శతాబ్ది ఉత్తరార్థంలో ఉండెనని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఏది ఏమైనా ఈతడు కుతుబ్షాహీ రాజుల కాలంలో ఉన్న ప్రసిద్ధ కవి.

ఈ నిరంకుశోపాఖ్యానంలో గోల్కొండ నవాబుల గురించి ఎటువంటి సమాచారం లభించదు. ఈ కథ పెక్కు విధాల తెనాలి రామకృష్ణుని నిగమ శర్మ కథను పోలి ఉంటుంది. సంభోగ వ్యసనమున తగుల్కొని పాపము నొందని వాడు కలడా అని ధర్మ శీలుడను రాజడుగగా దానికి సమాధానంగా పులస్త్య మహర్షి ఈ కథను ఎరిగించాడు. వేశ్య మాత కొర్కాన్ని, నిరంకుశుడు జీర్ణ దేవాలయంలో శివ లింగాన్ని చూసి తనతో జూదమాడ రమ్మని బలవంత పెట్టిన ఘట్టాన్ని ఇందు మిక్కిలి రమణీయంగా కవి వర్ణించాడు. పుర వర్ణనాదుల సందర్భంలో ఇందు వసు చరిత్ర రీతులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. రుద్రకవి ఈ కథ ద్వారా ప్రకటించిన పరమార్థమేమీ లేకపోయినా సరసమైన శైలి చేత, అందందు కనబడు ప్రౌఢ సంస్కృత రీతుల చేత, జాతీయాలు, నానుడుల చేత ఈ ప్రబంధాన్ని పఠితలకు ఆనందం కల్గించే విధంగా రచించాడు కందుకూరి రుద్రకవి.

## 2.1.1.0.2.0. సుగ్రీవ విజయం :

కందుకూరి రుద్రకవి రచించిందే మరో కావ్యం 'సుగ్రీవ విజయం'. ఇది యక్షగాన ప్రక్రియకు చెందింది. ఇది ఇంతవరకు లభించిన యక్షగానాలలో మొదటిది. ఇది "సీతాన్వేషణ పరాయణులై వచ్చిన రామ లక్ష్మణులను హనుమంతుడు దర్శించడంతో మొదలై క్రమంగా వాలి వధానంతరం, సుగ్రీవుడు పట్టాభిషిక్తుడవడంతో ముగుస్తుంది. వాలి మరణ దుఃఖితయై తార శ్రీరాముని దూషించిన ఘట్టం ఇందు కరుణ రస భరితమై, హృదయ ద్రావకంగా ఉంది. ఇట్లే వాలి సుగ్రీవుల యుద్ధం, సప్త తాళ భంజనం మున్నగు ఘట్టాలందు వీర రసం పోషించబడింది. ఇందు ద్విపదలు, దరువులు, అర్ధ చంద్రికలు, ఏలలు మున్నగు దేశి రచనలు ఉన్నాయి.

### 2.1.1.1. వైజయంతీ విలాసము :

కుతుబ్షాహీ కావ్యాల్లో తర్వాత పేర్కొనదగినది "వైజయంతీ విలాసం". దీన్ని సారంగు తమ్మయ్య అనే కవి రచించాడు. వైజయంతీ విలాసమను పేర విప్రనారాయణ చరిత్రమను ప్రబంధాన్ని రచించిన ఈ సారంగు తమ్మయ మహమ్మదు కుతుబ్షా కాలంలో గోలకొండ కరణంగా ఉన్నాడు. ఇతడు వైష్ణవ మతాభిమాని. తన ఈ కావ్యాన్ని శ్రీ రామునికంకితం చేశాడు. క్రీ.శ. 16వ శతాబ్దం చివరి భాగంలో మహమ్మద్ కులీ కుతుబ్షా రాజ్యం చేస్తుండగా ఈ శృంగార ప్రబంధం వెలుబడింది. రాజు ఆదరణ ఇతనికి లభించిందో లేదో కాని, ఇతడు ఈ కావ్యాన్ని నరాంకితం చేయక రామాంకితం చేసి కృతార్థుడైనాడు.

ఈ శృంగార ప్రబంధం సౌందర్యాన్ని గూర్చి చెప్పాలంటే భక్తుడైన విప్రనారాయణుని, నాయిక అయిన దేవ దేవిని గుర్తు చేసుకుంటే చాలు. వీరితో విశిష్టాద్వైతాన్ని జోడించి ఈ కవి తన నేర్పును ప్రదర్శించాడు. ఇతడు క్రీ.శ. 1580 ప్రాంతంలో గోల్కొండ నగరంలో ఉన్నాడు. తమ్మయ వంశపు మూలపురుషుడని పేరు సారంగ ధరుడు. అందుచేత వీరిని సారంగు వారని పిలిచేవారట. మహమ్మదు కులీ కుతుబ్షా గోల్కొండను 84 దుర్గాలతో ఏలుతున్నప్పుడు సారంగు తమ్మయ గోల్కొండ నగరానికి కరణీకం చేసేవాడని వైజయంతీ విలాస కావ్యావతారిక ద్వారా తెలుస్తుంది. మహమ్మద్ కులీ, తమ్మయ్యలు ఎంతో సఖ్యంగా ఉండేవారట. రాజుతో ఇంతటి సన్నిహితత్వం ఉన్నా కూడా తన కావ్యాన్ని రామునికే అంకితం చేసాడు.

తెలంగాణంలో వ్యాపించిన శ్రీ వైష్ణవం ప్రభావంతో వైజయంతీ విలాస ప్రబంధం వెలువడింది. వైష్ణవ సంప్రదాయానికి మూల పురుషులు పన్నిదరాళ్వారులు. దివ్య సూరులుగా, నిత్య సూరులుగా ప్రశస్తి పొందిన పన్నిద్దరాళ్వారులలో "తొండరడిప్పొడి యాళ్వారు" వరున క్రమంలో పదవ వాడు. తొండరడిప్పొడి సంస్కృతార్థం, భక్తాంఘ్రి రేణువు. 'విప్ర నారాయణుడే తొండరడిప్పొడి యాళ్వారు. ఈయన కథనమే వైజయంతీ విలాసంలో చెప్పబడింది. తొండరడిప్పొడి యాళ్వారు శ్రీ మహా విష్ణువు ధరించే వనమాల అంశాన జన్మించాడు.

పన్నిద్దరాళ్వారుల చరిత్రను తెలుపు సంస్కృత గ్రంథాలలో మొదటిది 'దివ్య సూరి చరిత్రము'. ఇది క్రీ.శ. 14 వ శతాబ్దంలో రచింపబడింది. రెండవది 'ఉపదేశ రత్నమాల' అనే పేరు గల ద్రావిడ భాషా గ్రంథం (క్రీ.శ. 14) . మూడవది 'ప్రసన్నామృతము' అనే సంస్కృత గ్రంథం. ఇది క్రీ.శ. 16వ శతాబ్దంలో రచింపబడింది. క్రీ.శ. 1545 నుండి 1600 మధ్య కాలంలో ఒక విష్ణు భక్తుని చరిత్ర కేవలం తెలుగు భాషలోనే నాలుగు సార్లు రచించ బడడానికి కారణం ఆ కాలంలో విజృంభించిన వైష్ణవ సంప్రదాయ ప్రభావమే ! " ఎవ్వరి ముద్ర తప్పినా తాతాచార్యుల ముద్ర మాత్రం తప్పదు" అన్న సామెత రాయల యుగంలో వ్యాపించిన వైష్ణవాన్ని మనకు గుర్తు చేస్తుంది.

సమకాలిక సంఘంలోని చిత్తవృత్తిని స్పష్టిస్తూ నిరంకుశోపాఖ్యానం వంటి సాంఘిక కావ్యాలు వచ్చాయి. తెలంగాణాలో గోల్కొండ ప్రాంతమందలి శ్రీ వైష్ణవ ప్రసిద్ధిని తెలిపే వైజయంతీ విలాసం వంటి సరస ప్రబంధాలు వెలువడ్డాయి. సారంగు తమ్మయ వైష్ణవ మతాభిమాని అని ఈ కావ్యం పరిశీలిస్తే వ్యక్తమౌతుంది. ఈ ప్రబంధమతి శృంగార మయమై అచ్చటచ్చట సభ్యతా మర్యాదను కూడా అతిక్రమించినట్లుంటుంది. ఐనను ఇందలి కథ రమ్యం. రచన మధురం. వేశ్యా లోలత్వం వల్ల కలిగే నష్టం ఇందు చక్కగా ప్రదర్శింపబడింది. ఇంత వరకు పేర్కొనబడిన ఈ ప్రబంధాలు అన్నీ గోల్కొండ నవాబుల కాలంలో వెలువడిన సాహిత్యంలోని ప్రక్రియా వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

సమాజంలో నుంచి కవులు పొందిన అనుభవానికి దర్పణాలు పై ప్రబంధాలు. గోల్కొండ నవాబుల యుగంలో వచ్చిన ఈ మాదిరి ప్రబంధాలు పాలక వర్గం ప్రయోజనాలకే ఉపకరిస్తూ, ఆనాటి సామాజిక నీతి శైథిల్యాన్ని కనబరుస్తున్నాయి. ఉన్నతమైన మానవ విలువల ప్రమేయం వీటిలో కనిపించదు. ఇవే కాక ఇంకా మరికొందరు కవులు, వారి కావ్యాలు పేర్కొనదగినవి కూడా కుతుబ్షాహీ రాజుల కాలంలో వెలువడ్డాయి. వాటిని గూర్చి ప్రస్తావిస్తాను.

### 2.1.1.2. కుతుబ్షాహీల కాలంలోని శివ కవులు :

1. మల్లారెడ్డి :- గోల్కొండ నవాబుల కాలంలో బిక్కనూరు సంస్థానాన్ని పరిపాలించిన మల్లారెడ్డి ప్రభువు చక్కని సాహిత్య కృషి చేసాడు. ఇతడు మల్కిభ రాముని సమకాలికుడు. ఈయన విఖ్యాతుడైన శివ కవి. ఈయన రచించిన 'షట్చక్రవర్తి చరిత్ర, శివ ధర్మోత్తరం, పద్మ పురాణం' అనే కావ్యాల్లో పద్మ పురాణానికి మంచి ప్రాచుర్యం లభించింది. ఈ సంస్థానాధీశులు గోలకొండ ప్రభువుల సాహిత్య కృషి చేత ప్రభావితులైనారటంలో అసామంజస్యం కనిపించదు. మల్లారెడ్డి క్రీ.శ. 16వ శతాబ్దాంతంనందు మెదకు సమీపమందలి బిక్కనవోలు రాజధానిగా రాజ్యం చేసిన రెడ్డి రాజుల వంశానికి చెందినవాడు.

**షట్చక్రవర్తి చరిత్రము :**

షట్చక్రవర్తి చరిత్రంలో హరిశ్చంద్రాదులగు ఆర్గురు చక్రవర్తుల కథలు వర్ణింపబడినాయి. ఇందు ప్రబంధ సామాన్యములగు వర్ణనలన్నీ గోచరిస్తాయి. ఇందు రచన శ్లేష శబ్దాలంకారాలతో కూడి వసు చరిత్ర రచనను అనుకరిస్తుంటుంది.

**శివ ధర్మోత్తరము :**

శివ ధర్మోత్తరము శివ పారమ్యాన్ని బోధించే గ్రంథం. ఇందు శైవ మతం యొక్క ధర్మం, వేదాంతం శైవాచారాలు వర్ణితాలై ఉన్నాయి.

**పద్మ పురాణము :**

మల్లారెడ్డి శ్లేషాదులకై అంతగా యత్నించనందున అతని పద్మపురాణంలోని

కవిత్వం సులభంగానూ, సహజంగా కనిపిస్తుంది. దీనిలోని నాల్గవ ఆశ్వాసంలో రామాయణ కథ చెప్పబడింది. వాల్మీకి రామాయణంలోని కథకు దీనిలోని కథకూ కొన్ని భేదాలు కనిపిస్తున్నాయి. మల్లారెడ్డి, అతని వంశీయులు కూడా శివభక్తి పరాయణులు.

ఈతని సోదరుల్లో కామిరెడ్డి, ఎల్లారెడ్డి అనేవారు సాహిత్య ప్రియులైన కవుల్ని పోషించి వారివల్ల కావ్యాలు అంకితం పొందినట్లు తెలుస్తుంది. మల్లాలెడ్డి కావ్యాల్లో అతని వినయశీలం, భ్రాతృ భక్తి వ్యక్తమౌతున్నాయి.

**2. ఘట్ట శేషయ్య :-** ఈతని వంశీయుల్లో (మల్లారెడ్డి వంశీయుల్లో) గోల్కొండ సామంతుడైన 'ఘట్ట ప్రభువు' అనే నామాంతరం వున్న ఘట్ట శేషయ్య "సురభాండేశ్వరం" అనే గ్రంథం రచించాడు. ఇతడు గద్వాల కర్నూలు ప్రాంతం వాడుగా ఊహించవచ్చు.

**3. ముదిగొండ బ్రహ్మయ్య కవి:-** మెదకు సీమలోని ముదిగొండ బ్రహ్మయ్య కవి 1700 ప్రాంతంలో "శివరహస్య ఖాండం" వచనంలో వ్రాసి తత్త్వ ప్రకాశిని అనే పేరు పెట్టాడు.

**4. శివరామలింగకవి** " వీరశైవాచార సంగ్రహం" రచించాడు.

**5. కానూరి వీరభద్రయ్య** "బసవ మహిమామృత" విలాసాన్ని కొలనుపాక సోమేశ్వర శివలింగానికి అంకితం చేశాడు.

వీరందరూ ఈ కాలం లోని శివకవులు.

**2.1.1.3 . వైష్ణవ కవులు :-** "నిరంకుశోపాఖ్యాన" కర్త సారంగు తిమ్మయ "వైష్ణవ భక్తి" ప్రధాన రచన చేశాడు. అలాగే మరికొందరు 'వైష్ణవభక్తి ' ప్రధాన కావ్యాలు రచించారు.

**1. మరింగంటి సింగరాచార్యులు :-** 16 వ శతాబ్దం లోని వాడు ఈ కవి. ఈయన రచన 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణం.' ఇబ్రహీం కుతుబ్‌షా వద్ద మన్నన లందిన మరింగంటి అప్పన్నకు సోదరుడీతడు. మిర్యాలగూడెం తాలూకా వాడపల్లి నృసింహస్వామి ఆలయం లో స్థానాచార్యులుగా పని చేశారు. వీరి తండ్రి తిరు వేంగళాచార్యుడు. తాతగారు తిరుమల దేశికులు. గోత్రం మౌద్గల్యస . శ్రీ లక్ష్మీ నృసింహావతార వేంకటేశ్వర వర ప్రసాదం చేత కవిత్వం మొదలైన సకలైశ్వర్యాల్ని పొందినట్లు చెప్పకున్నాడు. వీరి బిరుదాలు "ఇష్టాదృష్ట భాషా విశేష" మొదలైనవి.

దశరథరాజనందన చరిత్రాన్ని కూడా ఈ కవి నిరోష్ఠ్యంగా రచించారు. ఇంకా 20 ప్రబంధాల్ని కూడా రచించారు. నిరోష్ఠ్యంగా అచ్చతెనుగులో 'సీతా కల్యాణం' కావ్యాన్ని నృసింహ స్వామి ప్రేరణతో మూడాశ్వాసాలలో రచించారు. సముచితంగా ఆ యా వర్ణనలో తీర్చిదిద్దారు. విశిష్టాద్వైత సంప్రదాయానుసారంగా కావ్యారంభంలో విష్ణువును, లక్ష్మిని పంచాయుధాల్ని పన్నిద్దరాళ్వార్లను నుతించాడు. పుత్ర కామేష్టి చేయడానికి సన్నాహంతో కావ్య కథారంభం - రావణ దుశ్చర్యలు, ఇంద్రాదుల మొర, భగవంతుని అవతారం మొ॥ విశేషాలతో కథాక్రమముండి సీతాకల్యాణం తో ఈ కావ్యం ముగుస్తుంది.

శివ ధనుర్భంగానంతరం సీత రాముని మెడలో స్వయం వరమాల వేస్తుంది. అప్పటి ఆమె ముగ్ధత్వం చక్కగా వర్ణింపబడింది. ఇంకా ఎన్నో కథా గమనం లోని వర్ణనలు హృద్యంగా ఉన్నాయి. సంతతి లేని దశరథుడు ఎంతగా తపించాడో ఆ బాధను వశిష్ఠునితో విన్నవించడం చూడండి.

కం. "కాళ్లన్ గజ్జియలందెల్

*గల్లన తల జడల నాడగంటల్ నెలగన్*

*జిల్ల సంతాడగ (సంతు-ఆడగనెద)*

*తల్లిందండ్రి సిరి చేత దనరరె చాలన్"*[1]

అచ్చ తెనుగులో రచన అంటేనే కష్టం. అందులో ఓష్ఠ వర్ణాలు - ప వర్గం-వ, మరియు ఉకారం, బకార-జకారాలతో కూడిన హల్లులు పరిహరింపబడినాయి. ఈ కవి మిశ్రాంధ్ర శుద్ధాంధ్రాలలో రామ కథా కావ్యాలు రెండు దశరథ రాజనందన చరిత్రం, సీతా కళ్యాణం అనునవి. నిరోష్ఠ్యంగా రచించారు. ఈ నిరోష్ఠ్య నియమం వల్ల 'రామ' నామం లేకుండా కావ్యాల్ని ముగించారు.

కవి భావనా బలం, పాండిత్య ప్రకర్ష ఈ కావ్యాల్లో గోచరిస్తుంది. వారి కాలంలోని కొందరు సమకాలిక కవుల గూర్చి ప్రస్తావిస్తాను.

### 2. చరిగొండ ధర్మన్న :

చిత్ర భారతాన్ని వ్రాసి చిత్తాపుఖానుని మంత్రి అయిన ఎమ్మల పల్లి పెద్దామాత్యునికి అంకితం చేసాడు. క్రీ.శ.1504వ సంవత్సరంలో మహమ్మదీయుల నుండి ఓరుగల్లు కోటను వశపరచుకొని, సమర్థతతో పాలించినట్లు తెలుస్తుంది. "చిత్ర భారతం"లోని కథ బ్రహ్మాండ పురాణం నుంచి గ్రహించబడింది. ఇందులో అక్కడక్కడా చిత్ర కవిత్వం కూడా కనిపిస్తుంది. ఇందు వీర రసం అద్భుతంగా వర్ణింపబడింది.

### హరిభట్టు (క్రీ.శ.1530) :

వరాహ పురాణం, మత్స్య పురాణం, భాగవతంలోని షష్ఠైకాదశ ద్వాదశ స్కంధాలు, నరసింహ పురాణం అను గ్రంథాల్ని రచించాడు. ఇందులో మత్స్య, వరాహ పురాణాలు మాత్రమే ముద్రితాలైనాయి. వరాహ పురాణం నిజాము రాష్ట్రంలోని కంబమ్మెట్టు గ్రామానికి కరణంగా ఉన్న కొలిపాక ఎల్లయామాత్యునికి అంకితం ఇవ్వబడింది. హరిభట్టు మత్స్య పురాణాన్ని పూర్తిగా అనువదించలేదు. అందులోని విష్ణు ధర్మోత్తర ఖండాల్ని మాత్రమే ఐదు ఆశ్వాసాల్లో రచించాడు. ఇందులో విష్ణు పూజా ఫలం, తులసీ మాహాత్మ్యం మొదలైన కథలు వర్ణించబడ్డాయి. ఈ గ్రంథం శ్రీరంగేశునికి అంకితం చేయబడింది. ఎఱ్ఱాప్రగడ నరసింహ పురాణంలోని పూర్వ భాగం మాత్రం అనువదించగా, హరిభట్టు పూర్వ ఉత్తర భాగాల్ని

1. తెలంగాణా అచ్చ తెనుగు కవులు - డా॥ రాజన్న శాస్త్రి గారు ( హైదరాబాదు నాలుగు శతాబ్దాల సాహిత్య వికాసం, ఉ.యూ. జాతీయ సదస్సు మార్చి 1991.

కూడా అనువదించాడు. ఈ గ్రంథం వచన కావ్యమని పేర్కొనబడింది కాని ఇది పద్య గద్యాత్మకమైన చంపూ కావ్యం. హరిభట్టు రచన సంస్కృతాంధ్ర పద భూయిష్ఠమైందిగా, మధురంగా ఉంటుంది.

### 4. వెలగపూడి వెంగయామాత్యుడు (క్రీ.శ. 1530) :

బిల్వ మంగళుడని నామాంతరం గల లీలాశుకుడు అనే కవి సంస్కృతంలో వ్రాసిన శ్రీకృష్ణ కర్ణామృతంలోని మూడు వందల శ్లోకాల్ని మూలంలోని భావం చెడకుండా అతి మధురంగా అనువదించాడు.

### 5. కాసె సర్వప్ప :

క్రీ.శ. 16వ శతాబ్ది పూర్వోత్తరానికి చెందినవాడు. ఇతడు సిద్ధేశ్వర చరిత్ర అనే చారిత్రక కావ్యాన్ని రచించాడు. దానికే ప్రతాప చరిత్రం, కాకతీయ రాజ వంశావళి అను నామాంతరాలు ఉన్నాయి. సర్వప్ప కాలం ఇదమిత్థమని నిర్ణయించడానికి తగిన ఆధారాలు లేవు. పార్వతీ పరమేశ్వరులు కైలాసాన్ని వదలి పద్మాక్షి, సిద్ధేశ్వరులుగా అవతరించిన వృత్తాంతంతో ఈ గ్రంథం ప్రారంభమౌతుంది. ఇందులో ద్విపద కంటె వచన భాగమే సరసంగా ఉంది. మొత్తం మీద వచనం అప్రౌఢం, బహు దోష భూయిష్ఠంగా ఉంది. ఈ గ్రంథంలో విషయ ప్రాధాన్యమే కాని కవితా ప్రాధాన్యం అంతగా కనిపించదు.

### 6. అందుగుల వెంకయ్య (క్రీ.శ. 1630) :

నరపతి విజయం అనే ఒక చారిత్రక కావ్యాన్ని వ్రాసి అళియ రామరాయల మనుమడైన కోదండ రామరాజుకు అంకితం ఇచ్చాడు. ఈ గ్రంథానికి రామ రాజీయం అనే నామాంతరం కూడా ఉంది. ఒకవైపు విజయ నగర రాజులు రాజ్యం చేస్తున్నారు. వీరిని ఈ కాలంలో నరపతులు అని వ్యవహరించారు. అందుకే ఈ గ్రంథానికి నరపతి విజయం అని పేరు పెట్టాడు. రామరాయల తమ్ముడైన తిరుమల రాయల, అతని కుమారుడైన వీర వేంకటపతి రాయల పరిపాలనం ఇందులో వర్ణింపబడినాయి. ఇందులోని కథ చారిత్రకం. అయినా కావ్యం సరసంగా రచించాడు. ఇందులో అక్కడక్కడా గర్భ కవిత్వం కూడా ఉంది. ఇతని శైలి సులభ సుందరంగా సర్వ జన సుబోధకంగా ఉంది.

### 7. వేంకటాచార్యుడు :

ఇతడు క్రీ.శ. 1650 సంవత్సరం ప్రాంతం వాడని చెప్పవచ్చు. 'కృష్ణరాయ విజయం' అనే చారిత్రక కావ్యం రచాంచాడు. శ్రీ కాళహస్తి మాహాత్మ్యాన్ని రచించిన ధూర్జటి ఇతని పెద తాత అని

ఇతడు చెప్పకున్నాడు. ఈ కావ్యాన్ని శ్రీ రామునికి అంకితం చేశాడు. ఇందులో కృష్ణరాయల పరాక్రమం, పరిపాలన క్రమం విపులంగా వర్ణింపబడ్డాయి. ఇందులో శృంగార, వీర రసాలు పోషించబడ్డాయి. శృంగారాదులు అంగ రసాలు. ఇతని శైలి సులభంగా, సరసంగా ఉంటుంది. కావ్యారంభంలో ఇతడు చేసిన విద్యానగర నిర్మాణ వృత్తాంతం ఆ నగర వర్ణనం రమణీయంగా ఉన్నాయి. కుమార ధూర్జటి అని ఇతనికి మరో పేరు ఉంది. ఇతడు సావిత్రీ చరిత్రం, ఇందుమతీ వివాహం అనే కావ్యాల్ని కూడా రచించాడు.

చరికొండ ధర్మన్న, హరిభట్టు, వెలగపూడి వెంగయామాత్యుడు, కాసె సర్వప్ప, అందుగుల వెంకయ్య, వేంకటాచార్యుడు (కుమార ధూర్జటి) అనేవారు కుతుబ్షాహీ రాజుల కాలంలోని సమ కాలీన కవులు. కుతుబ్షాహీలు పోషించిన కవులకు సమకాలికులు. క్షేత్రయ్య కూడా ఈ కాలంలోని వాడే. ఇబ్రహీం కుతుబ్షా రాజాస్థానాన్ని ఇతడు దర్శించాడు.

గోపన్న రచించిన రామభక్తి ప్రధాన కీర్తనలు, దాశరథీ శతకం ఈ కుతుబ్షాహీ రాజుల కాలంలో ప్రసిద్ధి చెందాయి. అబ్దుల్లా కుతుబ్షా కాలంలో ఈ గోపన్న భద్రాద్రి రామాలయాన్ని నిర్మించి జన్మ చరితార్థం చేసుకున్నాడు. గోపన్న లేక రామదాసు రచనల గూర్చి, వాటి ఆవిర్భావానికి దోహదపడిన సాంఘిక పరిస్థితుల గూర్చి ముందు ముందు చర్చించడం జరుగుతుంది. ఇబ్రహీం కుతుబ్షా మొదలుగా తర్వాత సుల్తానులందరూ ఆంధ్ర భాషా సేవ చేసిన వారే. వారందరు, స్వయంగా పండితులు, కవులై పండితుల్ని పోషించారు. కడపటి రాజైన అబుల్ హసన్ తానీషా కాలంలో ఉద్యోగి కంచెర్ల గోపన్న గొప్ప రామ భక్తుడై రామదాసుడని పిలువబడ్డాడు. ఇతడు దాశరథీ శతకం, రామభక్తి పూరితాలైన కీర్తనలు వ్రాశాడు.

### 2.1.2. "భక్తి సాహిత్యావిర్భావానికి దోహదపడిన నాటి సాంఘిక స్థితి గతులు :"

**మత వ్యవస్థ :** మొగలాయి ప్రభుత్వ పటిష్టంగా ఉన్న కాలం అది. ఔరంగజేబు భారత దేశాన్ని అట్టుడికిస్తున్న కాలం. ఉత్తరాదిలో గురు గోవింద సింగు, దక్షిణాదిలో ఒకవైపు ఛత్రపతి శివాజీ మహారాజు, మరొక వైపు నిజాంషాహీలు, కుతుబ్షాహీలు మొదలైన ముస్లిం పాలకులు కూడా అతని ఏకచ్ఛత్రాధిపత్యాన్ని ఎదిరిస్తున్న కాలం. ఒకవైపు మహమ్మదీయ సేనల అఘాయిత్యాలు, మరోవైపు బ్రిటీషు, ఫ్రెంచి, సేనల పద ఘట్టనలు ఆంధ్ర దేశం నలు మూలలా వ్యాపించాయి. సాంఘిక క్షేమం నశించింది. తిండికీ, గుడ్డకు కరువు వచ్చింది. రెండు వేల సంవత్సరాల నుండి అవిచ్ఛిన్నంగా వస్తున్న సంపూర్ణ గ్రామ వ్యవస్థ భిన్నం కాసాగింది. గృహ పరిశ్రమలు, చేతి పరిశ్రమలు మూలపడ సాగాయి. యావద్భారత దేశంలో ఈ పరిణామం ప్రారంభమైంది.

ఈ పరిణామానికి కారణం ప్రజలు తెలుసుకోలేకపోయారు. ఆర్థిక విచ్ఛిత్తితో పాటు, సమాజంలో కుల భేదాలు, మూఢాచారాలు, కట్టుబాట్లు మితిమీరి పోయాయి. ఈ దశలో తమలో ఐకమత్యం లేక రాజులు పరస్పరం యుద్ధాల్లో నిమగ్నులైనందువల్ల క్రమ క్రమంగా హిందూ రాజుల శక్తి క్షీణించడం వల్ల మహమ్మదీయుల దాడి ఎక్కువైంది. మహమ్మదీయ రాజ్య స్థాపనతో మహమ్మదీయుల మతమైన ఇస్లాం ఈ దేశంలో అడుగుపెట్టింది. హిందూ దేవాలయాలపై దాడి ఎక్కువైంది. దేశంలో మహమ్మదీయుల దాడిని సహించలేని హిందువులకు భక్త వత్సలుడైన పరమాత్ముడే శరణుడయ్యాడు. హిందూ కవుల్ని ఆశ్రయించే దాత కరువయ్యాడు. ప్రజల కడగండ్లు దినదినానికి ఎక్కువయ్యాయి. అటువంటి సమయాన భగవంతుని వైపుకు హిందువుల దృష్టి మరలడం సహజమే. భగవంతుడే తమకు శరణ్యమని, అతడే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కావించి తమ జాతిని కాపాడగలడనే విశ్వాసం హిందువులకు కలిగించడం చాలా అవసరమైంది.

### 2.1.2.1. భక్తి - సమాజకవుల ఆవశ్యకత :-

దావానలంలా వ్యాపిస్తున్న ఇస్లాంను ఆపడానికి హిందూధర్మంలోని భిన్న శాఖలవాళ్లు భక్తులు, సాధువులు, సంతులు తమ రచనల ద్వారా ప్రబోధాల ద్వారా ప్రజల్ని జాగృతం చేస్తున్నారు. మహారాష్ట్ర దేశంలో 'తుకారాం' (1608 -1650) తన అభంగుల ద్వారా భాగవత పంథాను పుష్టం చేస్తున్నాడు. 'సమర్థ రామస్వామి' (1608 - 1681) మనోబోధ, దాసబోధ, అభంగులతో అటు శివాజీని ఇటు ప్రజల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేస్తున్నాడు. 'అగ్నిదాసు' వంటి ప్రజాకవి (1654) శివాజీ వీరకృత్యాల్ని పావాడాలుగా అల్లి ప్రజల్లో వీరచైతన్యం పెల్లుబికిస్తున్నాడు. మహారాష్ట్ర దేశంలో పావాడాలతో పాటు లావణీలనే గాథా గేయాలు కూడా ఈ కాలంలోనే విరివిగా ప్రచారమయ్యాయి. కన్నడ దేశంలో పురందర దాసు, విజయదాసు, గోపాలదాసు, జగన్నాథదాసు, కనకదాసుల ప్రభావంతో దాసకూటోద్యమం ప్రబలి భక్తి సంకీర్తనలు దేశమంతటా మార్మోగుతున్నాయి. 'ఓఢ్ర' దేశంలో చైతన్య భక్తి వాహిని వెల్లువలై పారింది. తమిళ దేశంలో శైవ వైష్ణవ భక్తి కవితలు పరవళ్లు త్రొక్కుతుంది. ఉత్తర హిందు స్థానంలో ఆనాడు మతాల స్థితి చాలా అయోమయంగా ఉంది.

'శంకర భగవాను' ల 'అద్వైత మతతత్త్వం' పండితుకు మాత్రమే అర్థమై సామాన్యజనాలకు అర్థం కాక, సామాన్య ప్రజల్ని తనవైపు ఆకర్షింపలేకపోయింది. భాగవత మతావలంబకులు కుల భేదాలు ఎక్కువగా పాటిస్తూ, బ్రాహ్మణులకు తప్ప మిగితా వారికి వేదాధ్యయంలో అధికారం లేదనే వాదాల్ని అనుసరించి, పూజలు, ఆచారాల్నే మతాలని అనుకోసాగారు. ఈ సమయంలోనే శ్రీ రామానుజాచార్యుల శిష్యకోటికి చెందిన శ్రీ రామానందులు కూడా భక్తి ద్వారా మోక్షాన్ని పొందడం సులభమని బోధించడమే కాక కుల మతాల్ని పాటించక అందరిని తమ శిష్యులుగా చేసుకోసాగారు. నిరాశ, అంధకారంలో

పడిఉన్న ప్రజలకు భక్తే శరణ్యమయింది. ఇట్లు భక్తికి సంబంధించిన కావ్య రచనకు ఈ విధంగా పరిస్థితులు దోహదపడ్డాయి.

### 2.1.2.2. వైదిక మతం - ఆవశ్యకత ( హైందవ సంస్కృతికి వివిధ మతాలు చేసిన సేవ) :

భారతీయ సంస్కృతికి, హైందవ సంస్కృతికి మన మతాలు చేసిన సేవ గణనీయమైంది. ఈ విశాల దేశపు సుదీర్ఘ చరిత్రలో వివిధ ప్రజా సంఘాల్ని ఒక్క తాటిపైకి తేవడానికి, ఆ సమైక్య భావాన్ని నిరంతరం పెంచి పోషించడానికి అనేక ప్రయత్నాలకు ఊపును ఇచ్చిన ఏకైక శక్తి ఏదైనా ఉంటే అది వైదిక మతమే. క్రీస్తు పూర్వం తర్వాత రెండు దశాబ్దాల్లో మన దేశంపై దండయాత్ర చేసిన పలువురు గ్రీకులు, గ్రీకు సంఘాలు, శకులు కృష్ణ భక్తికి ఆకృష్టులై పరమ భాగవతులయ్యారు. "హెలియోడోరస్' అనే గ్రీకు పౌరుడు బేస్ నగరంలో స్థాపించిన గరుడ ధ్వజంపై చెక్కిన శాసనంలో తనను 'పరమ భాగవతుడు' అని చెప్పకున్నాడు. తనుత్యాగ ప్రమాదాలు అనుశీలించాలనీ, అవే అమరత్వానికి నిశ్చితమైన మార్గాలని" చెప్పాడు. కృష్ణునిలాగే శ్రీరాముని వ్యక్తిత్వం కూడా వైదేశికుల్ని 'రామ భక్తు'లుగా చేసి, వారిని మన ప్రజల్లో ఒకరుగా మార్చింది.

"ఈ రామభక్తి ప్రవాహంలో మునకలిడిన వారిలో ముస్లింలు, యూరోపియన్‌లు కూడా ఉన్నారు. తమిళనాడు రాజధానియైన మద్రాసుకు సమీపంలోని మధురాంతకంలో పూర్వం ఒక కలెక్టరుగా ఉన్న ఆంగ్లేయుని ఉదంతం మనకు తెలియవస్తుంది. మధురాంతకంలోని పెద్ద చెరువు కట్ట తెగకుండా కాపాడుతూ కట్టపై ధనుర్బాణాలు ధరించి లక్ష్మణునితో సహా రాముడు నిలబడినట్లు ఆ బ్రిటీష్ కలెక్టరుకు దర్శనమిచ్చాడట. ఈ రాముడే తన రాజ్యం వదలుకొని కాలి నడకన అరణ్యాలు, కొండలు, కోనలు దాటి లంక వరకు వెళ్ళి వ్యాధుని, ఆటవికులను, రాక్షసులను ఆకర్షించాడు ( గుహుడు, శబరి, వానరులు, విభీషణాదులు). ఈ రామనీలి మేఘం మన దేశ క్షితిజంపై నాటి నుంచి నేటి వరకు వెలుగొందుచూ, ముస్లింలు, అన్య దేశీయులు మొదలు ప్రతివానిపై తన సౌందర్యాన్ని విరజిమ్ముతూ, ఆశీస్సులను వర్షిస్తున్నది"[1] అని డా॥ వి. రాఘవన్ గారు రామభక్తి, రాముని ప్రాశస్త్యాన్ని చాటారు. శ్రీరామునికి మన సంస్కృతిలో ఇంతటి ప్రాధాన్యం ఉంది.

"భక్తి మార్గం వల్ల ఈ దేశం సమైక్య భూమిగా పరిణమిస్తున్నప్పడు, సామరస్య నవనీతం తేల నున్నప్పడు, దురదృష్ట వశాత్తు మతాహంకార మత్తుడైన ఔరంగజేబు రంగంలో కనిపించి కుండను పగుల గొట్టినట్లు, ఉత్తర భారతంలో మత సామరస్య శాంత్యుద్యమాన్ని శాశ్వతంగా నాశనం చేశాడు".[2] అతడు ఉత్తర భారతంలో తెచ్చిన ఈ వినాశంతో సంతృప్తి చెందక, తన పిశాచ దృష్టిని దక్కన్‌పై

1,2 . రామ భక్త శిఖామణి - భద్రాచల రామదాసు - డా॥ వి. రాఘవన్, పుట 21.

ప్రసరింపజేశాడు. అది కుతుబ్షాహీ రాజ వంశం వారు గోలకొండను పాలిస్తున్న సమయం. వారు ముస్లింలైనా స్థానిక భాషైన తెలుగుకు, సంగీత నాట్యాది కళలకు గొప్ప ఆదరణ కల్పించారు. వారిలో ఉత్తమోత్తముడు "మాలిక్ ఇబ్రాహీం".

2.1.2.3 కుతుబ్షాహీల మత సహనం - భారతీయ సంస్కృతికి చేసిన సేవ :

గోలకొండ నవాబులు మహమ్మదీయులైనా కాని హిందువులకు ఉన్నత పదవులిచ్చి, తమ పరమత సహనాన్ని చాటుకొన్నారు. కుతుబ్షాహీ వంశీయులు మసీదుల్ని నిర్మించి, దేవాలయ నిర్మాణానికి, జీర్ణోద్ధరణ కార్యాలకు తోడ్పడ్డారు. దేవాలయాలకు, బ్రాహ్మణులకు, మత గురువులకు, కవి పండితులకు అగ్రహారాల్ని ఇచ్చారు. భూదానాలు చేసినపుడు ఫారసీ, అరబీ, తెలుగు, సంస్కృతం, ఉర్దూ భాషలలో శాసనాలు వేయించారు. అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి, ఆంధ్ర ప్రజల ఆదరాభిమానాల్ని పొంది చిర యశస్సు పొందినారు.

మొగలు చక్రవర్తి ఔరంగజేబు పరమత సహనం లేనివాడు. అతడు "షియా మతానుయాయు"లైన గోలకొండ కుతుబ్షాహీల ఉనికిని సహింపక, పలుమార్లు దండయాత్రలు నిర్వహించి, క్రీ.శ. 1687లో మోసంతో గోలకొండ దుర్గాన్ని జయించి, కుతుబ్షాహీ రాజ్యాన్ని మొగలు సామ్రాజ్యాంతర్భాగం చేశాడు. కుతుబ్షాహీ రాజ్య పతనంతో, తెలుగు వారి సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థల్లో మార్పులు జరిగాయి. పాశ్చాత్య వర్తకులు, వ్యాపారులు వర్తక స్థావరాలు ఏర్పరచుకోడం వల్ల, ఆసఫ్జా వంశీయులు రాజ్యాన్ని స్థాపించడం వల్ల , ఆంధ్ర దేశంలో నూతన సాంఘిక పరిణామాలేర్పడ్డాయి. ఆంధ్రుల సంస్కృతి, ఆచార వ్యవహారాలు, వేష భాషల్లో మార్పులు వచ్చాయి. దేశంలో అధునాతన పద్ధతులు, సంస్కృతీ సభ్యతలు నెలకొన్నాయి. పాశ్చాత్య నాగరికతా ప్రభావం ప్రజలపై పడింది.

కుతుబ్షాహీలు మహమ్మదీయులైనా కాని, హిందూ దేవాలయాలకు దానం చేశారు. అందకు నిదర్శనం నేటికీ భద్రాద్రి రామ క్షేత్రానికి , శ్రీరామ నవమినాడు సీతా కల్యాణానికి సంబారం హైదరాబాదు నవాబు వద్ద నుండి (ముత్యాలు)పోతుంది. ఈ ఆనవాయితీ తానీషా కాలం నుండీ కొనసాగుతుంది. భద్రాచలం, సత్రశాల మొదలైన ప్రాంతాల్లో ఆలయాలకు భద్రాచల రామాలయానికి "జాగీర్లు, మడిమాన్యాలు తానాషా ఇచ్చినట్లు శాసనాధారాలున్నాయి.

కుతుబ్షాహీలు పారశీకం నుండి వచ్చిన షియా మతస్థులు. షియా సంప్రదాయానికి ఉన్న సహజమైన సహనం కుతుబ్షాహీలు ప్రదర్శించారు. హిందూ దేవాలయాలకు, బ్రాహ్మణులకు అగ్రహారాలు ఇచ్చి గౌరవించడం గమనార్హం. అబుల్ హసన్ తానాషా భద్రాచల రామాలయానికి పాల్వంచ, శంకరగిరి, భద్రాచలం గ్రామాల్ని, కృష్ణా తీరంలోని మల్లేశ్వర స్వామి ఆలయానికి భోగా పురం, చెరుకూరు, వీర పట్నాల్ని దానం చేశాడు. కూచిపూడి భాగవతులకు కూచిపూడి అగ్రహారాన్ని తానాషా దానంగా ఇచ్చాడు. అబ్దుల్లా కాలంలో మీర్ జుమ్లా ఒక బ్రాహ్మణునికి మధురాపురం అగ్రహారాన్ని దానంగా ఇచ్చాడు.

మాలిక్ ఇబ్రహీం అనే అతడే ఇబ్రహీం కుతుబ్షా. ఈ మాలిక్ ఇబ్రహీం పెక్కు పాటల్లో 'ఇభరాముడు'గా ప్రస్తుతించబడ్డాడు. ఈ మాలిక్ ఇబ్రహీం కుమారుడు మహమ్మద్ కులీ కుతుబ్షా హిందూ స్త్రీయైన 'భాగమతి' అనే నర్తకిని వివాహం చేసుకొని ఆమె పేరుతో ఒక నగరాన్ని నిర్మించాడు. అదే నేటి భాగ్యనగరం. హైదరాబాదుగా తర్వాత ఇది ప్రసిద్ధి చెందింది. మువ్వ గోపాల భక్తుడైన క్షేత్రయ్య అబ్దుల్లా కుతుబ్షా దర్బారులో మన్ననలు పొందాడు. ఇతడు కవి, వాగ్గేయకారుడు, రసాలంకార శాస్త్ర నిష్ణాతుడు. ఇతనికి, అబ్దుల్లా కుతుబ్షా దర్బారులో నాయికా నాయక భావంపై తులసీమూర్తి అనే అలంకార శాస్త్రజ్ఞునితో వాద వివాదాలు జరిగాయి. ఈ వాద వివాదాల్లో పాదుషా పోషకత్వాన మువ్వ గోపాలునికి అనుగ్రహంతో 1100 పదాలు రచించాడు. ఆయన దేవ గాంధారి రాగంలో చెప్పిన ఒక పదంలో 'అబ్దుల్లా'ను కొనియాడాడు. తన గూర్చి చెప్పుకొన్నాడు.

" బలవంతుడై గోలకొండ
పాదుషా బహుమానమొసగి
తులసీమూర్తితో వాదులాడే వేళఆ
వెలయు మువ్వ గోపాలుడు
వెయ్యిన్నూరు పదములు
నలువది దినములలోనే
నన్ను కలిసి వినుపించెన్"[1] అని అన్నాడు క్షేత్రయ్య.

ఈ సమయంలో గోల్కొండ నవాబు భక్తిలో ఒకటైన మధుర భక్తికి విశేషంగా ఆలవాలమయిన నాయికా నాయక భావంలో చాలా ఆసక్తి చూపినట్లు స్పష్టం. రాజకీయ రంగంలో వెనుకంజ వేసిన అబ్దుల్లా యుగం భాషా, సాహిత్య, సంగీతాది కళా క్షేత్రాన విఖ్యాతి గాంచింది. హిందూ పండితుల్ని, కవుల్ని ఆదరించాడు. అబ్దుల్లా స్వమతాచారాల్ని నియమ యుక్తంగా పాటించి, అన్య మతాల్ని గౌరవించాడు. వేద విద్యల్ని గౌరవించి, వేద పండితుల్ని సత్కరించి, అగ్రహారాలు ఇచ్చిన కీర్తి ఇతనికే దక్కింది. ఈతడు సంగీత కళా ప్రియుడు.

**అబుల్ హసన్ తానాషా :**

అబ్దుల్లా అనంతరం అతని అల్లుడు గోల్కొండ రాజ్యాన్ని పరిపాలించాడు. క్రీ.శ. 1672-1687 వరకు పరిపాలించాడు. కుతుబ్షాహీ సుల్తానుల్లో తెలుగు వారికి ఆత్మీయుడుగను, అభిమాన పాత్రుడుగా ఉన్నవాడు తానాషా. ఇతడు ఉర్దూ భాషలో రసవంతమైన కవితలల్లినాడు. ఈ రాజు కాలంలో హిందూ, ముస్లిం సామరస్యం మరింత పెరిగింది. ఆయన మంత్రులు అక్కన్న, మాదన్న అనే బ్రాహ్మణులు. తానీషాకు అత్యంత ప్రియతములు. వారు హిందువులు అయినా కూడా, పలువురు మహమ్మదీయాధికారులతో కూడి స్వేచ్ఛగా హిందువుల పండుగలతో పాటు, మహమ్మదీయుల పండుగల్లో పాల్గొనేవారు.

1. కీ.శే. డా. జి. రాఘవన్ - సీతారామ చంద్ర ప్రభువు ఉత్సవ సంచిక 'భక్త రామదాసు'. పుట 22

అబుల్ హసన్ తానీషా కాలంలో ఎందరో హిందువులు ఉన్నత పదవుల్ని అలంకరించారు. మన కథా నాయకుడు గోపన్న, ఈతని కాలంలో భద్రాచలం పరగణాకు తహసీల్దారుగా ఉండగా, రామాలయాన్ని ప్రభుత్వ ధనంతో నిర్మించి, 12 సంవత్సరాలు కారాగార శిక్షను గోల్కొండ బందిఖానాలో అనుభవించి, ఆ తర్వాత రామ లక్ష్మణుల సహాయంతో విడుదలైనాడు. తానీషాకు రామ లక్ష్మణులు దర్శనమిచ్చి, తానీషాకు ఆరు లక్షల రూపాలయల పైకం ఇచ్చి, రామదాసును విడిపించారు. రామదాసు రామభక్తిని తానాషా కొనియాడి, తానుకూడా రామసేవలో జీవితం గడిపాడు. తానీషా రామదాసుకు ఆ ఆరు లక్షల ధనం, భద్రాచలం, పాల్వంచ, శంకరగిరి గ్రామాలు అగ్రహారాలుగా దానం ఇచ్చి, తన పరమత సహనాన్ని చాటుకున్నాడు. భద్రాచలంలోని ఒక శిలా స్తంభ శాసనంపై ఈ వివరాలున్నాయి. రామదాసును గౌరవించినందువల్ల తానీషా పేరు కూడా చిరస్థాయిగా నిలిచిపోయింది.

హిందువుల్ని గౌరవిస్తున్నాడని ఔరంగజేబుకు తానీషాపై ఈర్ష్య అధికమైంది. గోల్కొండ రాజ్యంలోని హిందూ ముస్లిం ఐక్యతను ఔరంగజేబు సహించలేక పోయాడు. అందుకే గోల్కొండను ముట్టడించి, ఔరంగజేబు అక్కన్న మాదన్నల్ని చంపించి, అబుల్ హసన్ తానీషాను బందీగా పట్టుకొని 1687లో ఆ రాజ్యాన్ని ఆక్రమించాడు. దక్షిణ భారతంలో ఏర్పడిన హిందూ ముస్లిం సమైక్యాన్ని కూడా ఈ దుర్మార్గుడు కాల రాశాడు. ఇతడు 'సున్నీ' శాఖకు చెందినవాడు.

క్రీ.శ. 1687లో ఔరంగజేబు జయభేరి మ్రోగించి గోల్కొండలో మొగలు పతాకాన్ని ప్రతిష్ఠించాడు. క్రీ.శ. 1700 వరకు తా.ఈషా దాదాపు పదమూడేండ్లు కారాగార వాసాన్ని అనుభవించాడు. ఆ తర్వాత ఖైదులో ఎన్నో కష్టాలు అనుభవించి లౌకిక బంధం నుండి విముక్తి పొందాడు. ఔరంగాబాదు నుండి మరల దౌలతాబాదుకు తీసుకొనిపోయి తానీషాను బంధించాడు. తానీషా ఔరంగజేబుకు బందీయైనపుడు తాను ప్రకటించిన భావాలు, సమకాలిక చరిత్రకారులు లిఖితం చేసినవి ఇక్కడ ప్రస్తావించవలసిన ఆవశ్యకత ఉంది.

"తేజోమయుడు, మహాశక్తి యుతుడు, ప్రపంచ సృష్టికర్త, రాజులను పేదలను రక్షించేవాడు అయిన భగవంతుడు - ఆయన మహోజ్జ్వలుడై వెలుగు గాక ! అతని సేవకుని నుంచి తన దయను, కృపా దృష్టిని ఎప్పడూ ఏ పరిస్థితిలోనూ మరలించడని, నాకు ఉద్దేశించిన ఆహారాన్ని పంపుతాడని నా ప్రగాఢ విశ్వాసం. నా పితామహులు, మాతామహులు నిరంతరం శాంతి సమృద్ధులతోను, అధికారంలోను కాలం గడిపారు. అయినా నేను కొంతకాలం దారిద్ర్యంలో గడపాలని భగవంతుడు సంకల్పించాడు. మరల భగవంతుడు తన ఉదార కరుణా దృష్టిని నాపై పరచి, నావంటి సామాన్యుని ఒక గడియ లోపల రాజరికం వంటి ఉన్నత స్థితి రాగల పరిసరాలు కల్పించాడు. నేనే కాక ఎవరూ నేను రాజవుతానని ఎప్పడూ ఊహించలేదు. అప్పడు నిరంతరం స్తుతింపబడు గాక, నా మనస్సులో ఇప్పడు ఎలాంటి వాంఛగాని, వాత్సల్యాన్ని గాని ఉండనివ్వడం లేదు. నేను లక్షలు దానమిచ్చాను. కోట్లు వెచ్చించాడు. నేనేదో తగని పని

చేసినందుకు శిక్షగా నా చేతి నుంచి ప్రభుత్వాధికారాన్ని అప్పుడప్పుడు తీసుకొని ఉంటాడు. ఆయన దయామయ ప్రవర్తనకు నేను అతనిపై కసి పెంచుకోను" అని తానీషా అన్న మాటలు ఇవి. ఈ మాటల్లోని భావ పరిణతిని గుర్తించాలి.

"రామదాసుతో వ్యవహరించడంలో అతనిని అనుగ్రహించిన శ్రీరామ చంద్ర దర్శనం వల్ల కలిగిన అపూర్వానుభవం కూడా కారణమని చెప్పవచ్చును. "రామదాసు మహమ్మదీయ పాలకుని కూడా వెంట తీసుకొని వెళ్లడం రామదర్శనం చేయించడం ఆశ్చర్యకరమైన విషయం. ధన్యుడవు తానాషా నీవు నన్ను కన్నయ్య పదములు కనుల కన్నావు" అని రామదాసే చెప్పి దివ్య దర్శనానుగ్రహం పొందినందుకు తానీషాను అభినందించాడు.

ఇక్కడ తానీషా స్వయంగా తాను చెప్పకున్న మాటల్లో ఒక ముఖ్యాంశం గమనించదగింది. తానీషా తానేదో కానిపని, పొరపాటు చేసినందుకే భగవంతుడు తనకు 13 సం॥లు కారాగార శిక్ష విధించాడు అని చెప్పకున్నాడు. రామదాసును తానీషా 12 సం॥లు ఖైదులో పెట్టాడని కొందరు చరిత్రకారులు అంటున్నారు. ఆ రామభక్తుడైన రామదాసును రామాలయ నిర్మాణం గావించిన నేరంపై 12 సం॥లు గోల్కొండ ఖైదులో బంధించిన కారణంగా, ఆ పాపానికి శిక్షగా రాముడే తానీషాకు 13 సం॥లు కారాగార వాస శిక్ష వేసాడని భావించవచ్చును. లౌకికమైన చర్చలకు ఇది సత్య దూరం. కాని తానాషా తాను స్వయం కృతాపరాధం వల్లనే 13 సం॥లు జైలు శిక్ష అనుభవించినట్లుగా స్పష్టం చేశాడు. తానీషా జీవితాన్ని పరిశీలిస్తే రామదాసుకు జైలు శిక్ష వేసింది అబ్దుల్లా అని, ఆ తర్వాత అబుల్ హసన్ కాలంలో కూడా ఖైదులో ఉండి కష్టాలు అనుభవించినట్లు, రామదాసు శిక్షలకు తానీషా కూడా బాధ్యుడే అని చెప్పవచ్చును. అబ్దుల్లా కూడా ఔరంగజేబుకు బందీయై, ఖైదులోనే మరణించాడని కొందరు చరిత్రకారులు స్పష్టం చేశారు. ఇంతకు ముందు అంశాల్లో ఈ విషయం గూర్చి ప్రస్తావించడం జరిగింది.

అక్కన్న, మాదన్నలపై ఔరంగజేబుకు ఉన్న ఈర్ష్య, అసూయ, ద్వేషాలకు ఈ అంశాలే నిదర్శనం. కొందరు హిందూ వ్యతిరేకులు అక్కన్న, మాదన్నలపై దుష్ప్రచారం చేసి, కొందరు మహమ్మదీయ చరిత్రకారులు తమ గ్రంథాల్లో ఇలా వ్రాశారు. మాదన్న ప్రవర్తనం మహమ్మదీయులకు భరింపరానిదయింది. అందుకే మాదన్న గూర్చి మహమ్మదీయ చరిత్రకారులు ఈ విధంగా అసత్య వాక్యాలు వ్రాశారు " ఇతడు మసీదులందు దీపములను వెలిగింప వీలు లేదనియు, ముస్లింల నవమాన పరచెననియు" ముస్లిం చరిత్రకారులు వ్రాసినారు. మాదన్న ఒకనాడు ఒక ఉత్సవానికి ససైన్యుడై వెడలెను. అచ్చట నున్న ముస్లింలను, సయ్యదులను ఉద్దేశించి, "మీ పూర్వీకులు మా దేవతా విగ్రహాలను ధ్వంసమొనర్చినారు. నేను మిమ్ములనవమాన పరచెదనని" పలికెను. ఒక సయ్యదుపై పితూరి నేరము మోపి అతనికి శిక్షనిప్పించి చేతులు నరికించెను.[3]

1,2. "రామభక్త శిఖామణి - భద్రాచల రామదాసు , డా.వి.రాఘవన్ - భద్రాద్రి సీతారామ చంద్ర ప్రభువు ఉత్సవ సంచిక పుట - 23

3 . ఖాఫీఖాన్ బుక్ 3, పుట 311. (ఆంధ్రుల సాంఘిక చరిత్ర-సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరం (పుట 187-188)

మహమ్మదీయులకు హిందువులపై ఉన్న ద్వేషం వలననే హిందువుల గూర్చి ఇలా తప్పుగా వ్రాశారు. నిజానికి మాదన్న అటువంటి వాడుకాదు. తప్పచేస్తే హిందువైనా సరే శిక్షించేవాడు. ముస్లింలను కూడా శిక్షించేవాడు. ఒక శిక్ష వేస్తే ఇద్దరికీ సమానంగా ఉండేది. మాదన్న పరమత సహనం కలవాడు. ఇటువంటి కిరాతక చర్యలకు పూనుకొని ఉండడు. నిజానికి ఇటువంటి క్రూరమైన పనులు మహమ్మదీయులే హిందువుల పట్ల చేశారు. హిందూ మత ద్వేష భావం పెల్లుబికిన కాలం అది.

మాదన్న హిందువుగా జన్మించి, గోల్కొండ సామ్రాజ్య ముఖ్యామాత్య పదవిని పొందటం మహమ్మదీయులకు కొందరికి గిట్టలేదు. సుప్రసిద్ధ చారిత్రకులు మాదన్న పాలనను దుయ్యబట్టలేదు. గోలకొండ రాజ్యానికి వ్యతిరేకులైన ముస్లిం చరిత్రకారులు, మొగలు దర్బారీయులు మాదన్నను కించపరుస్తూ, సహింపరాని వ్రాతలు వ్రాసినారు. ఈ వ్రాతలు నమ్మదగినవి కావు. ఆనాటి శాసనాలు, ప్రభుత్వ సనదులు, సాటి రాజన్యుల చరిత్రలు, మాదన్న ముఖ్య మంత్రిత్వాన గోలకొండ అజేయమైన రాజ్యంగా వర్ధిల్లిందని తెలియజేస్తున్నాయి.

కుతుబ్షాహీల కాలంలో హిందువుల ఆధిక్యత :

గోల్కొండను పరిపాలించిన రాజులు మహమ్మదీయులే అయినా నిజానికి పాలక వర్గం అంతా హిందువులే. అక్కన్న, మాదన్నల వంటి పటిష్ఠమైన మంత్రులు హిందువులు. వారి పరిపాలనా దక్షత వల్లనే గోల్కొండ రాజ్యం గట్టి పునాదులతో నిలబడింది. ఔరంగజేబు ముట్టడి నుండి తట్టుకుంది. అక్కన్న మాదన్నలు అవలంబించిన విదేశాంగ విధానం, పరిపాలనా విధానం, రాజనీతిజ్ఞతలు ఎన్నదగినవి. మహారాష్ట్ర రాజైన శివాజీకి, తానీషాకు స్నేహ సంబంధం కుదిర్చి ఔరంగజేబు దాడుల నెదుర్కొనేందుకు వ్యూహం పన్నారు. అలాగే కీలకమైన పదవుల్లో హిందువుల్ని, తమకు అనుకూలురైన వారినే ఉంచారు. అందుకే అక్కన్న, మాదన్నలున్నంత వరకు గోల్కొండను ఔరంగజేబు ముట్టడించలేక పోయాడు.

అబ్దుల్లా కాలంలోని దేశ పరిస్థితి ఇది. ఈయన కాలంలో హిందూ విజృంభణం తిరిగి అంకురించింది. విజయనగర రాజ్య నాశనంతో దేశంలో స్వతంత్ర హిందు ప్రభుత్వాలన్నీ అంతరించాయి. కాబట్టి దేశంలో హిందువులు తలెత్తుకోవాలంటే వారిలో విజృంభణ మరల ఉదయించాలి. అది అబ్దుల్లా హుసేన్ కాలంలో ఆరంభమైంది. బీజపూరు, గోలకొండ సుల్తానులు విజయనగర రాజ్యం వారితో పోరాడే సమయంలోనే హిందూ వీరులు మహ్మదీయ సుల్తానుల వద్ద గొప్ప నాయకత్వాన్ని, మంత్రిత్వాన్ని సంపాదించి క్రమక్రమంగా పరిపాలనను తమ హస్తగతం చేసుకొన్నారు. మహమ్మదీయులు పేరుకు మాత్రమే రాజులు కాని అధికారం హిందువుల చేతిలో ఉండేది. అంతేకాక ఉత్తరాన మొగలులు వచ్చి వారిని అణచివేసే ప్రయత్నం చేస్తుండేవారు.

అందుకే హిందువులు మహమ్మదీయుల దాడులనెదుర్కొనేందుకు అప్రమత్తులై, అదనుకై చూస్తున్నారు. ఈ ఉద్యమానికి నాయకుడు మహారాష్ట్రలో జన్మించాడు. హిందూ ప్రపంచమంతా ఆ ధర్మోద్ధారకుని కొరకు ఎదురు చూస్తుంది. అతడే శివాజీ. ఛత్రపతి శివాజీ మహారాజు. సమర్థ రామదాస స్వామి వంటి ఋషి సత్తముడు బయలుదేరి నలుగడల బోధనలు సలిపాడు. ఈ కార్యం శివాజీ యొక్క బాహువులపై సమర్థ రామదాసు ఉంచాడు. హిందూ ధర్మాన్ని, సంస్కృతిని యావద్భారత దేశమంతటా నిలిపేందుకు శివాజీ తన వంతు కృషి ముమ్మరంగా చేశాడు. శివాజీకి అబ్దుల్లా కుతుబ్షాకు గోల్కొండలో అక్కన్న, మాదన్నలు సంధి కుదిర్చారు. దక్షిణ దేశాన ఉన్న హిందూ, మహమ్మదీయులు ఇరువురికి మొగలుల నుండి రక్షించుకోవాలనే ఉద్దేశం కలిగింది. శివాజీ గోల్కొండ రాజ్యం మీదుగా శ్రీశైలం చేరి దక్షిణ దిగ్విజయ యాత్రను నిరాటంకంగా జరిపాడు. శ్రీశైలంలో శివాజీ విజయ చిహ్నంగా ఒక గాలి గోపురం నిర్మింపబడింది. ఇది భ్రమరాంబ, మల్లీశ్వరుల ఆలయంలోనికి అడుగు పెట్టే ముందు కనపడుతుంది. శివాజీ గోల్కొండలో దాదాపు రెండు నెలలు ఉన్నాడు. ఈ విషయాలన్నీ ఇంతకు ముందు అక్కన్న, మాదన్నల గూర్చి చర్చిస్తూ ప్రస్తావించడం జరిగింది.

శివాజీ గోల్కొండకు వచ్చినపుడు రామదాసును దర్శించినట్లు ఓగేటి అచ్యుతరామ శాస్త్రిగారు తమ నాటకంలో ప్రస్తావించారు. "రామదాసు నాటకం"లో (ఓగేటి అచ్యుత రామశాస్త్రి). అబ్దుల్లా కాలంలో రామదాసు ఖైదులో ఉండగా శివాజీ అతనిని దర్శించాడని ఇందులో వ్రాయబడింది. అక్కన్న, మాదన్నలు తరచుగా బెజవాడలో ఉండి రాజ కార్యాలు జరుపుచుండేవారు. సుల్తాను అబ్దుల్లా నిరంతరం యాత్రలు చేస్తూ అసలు పరిపాలనా విషయాలు, ప్రజల గూర్చి పట్టించుకోలేదు. అశ్రద్ధ చేస్తుండేవాడు. అక్కన్న మాదన్నలే పూర్తిగా పరిపాలనా వ్యవహారాలు చూసుకుంటుండేవారు. కొండపల్లిలో సుల్తానుంటుండేవాడు. హైదరాబాదు అనేక కుట్రలకు ఆలవాలమై ఉండేది. అక్కన్న, మాదన్నలు గోల్కొండను విదేశీ దాడుల నుండి, మొగలుల దాడుల నుండి, ఆంగ్లేయులు, ఫ్రెంచివారి దాడుల నుండి రక్షిస్తూ ఎక్కడికక్కడ శత్రువుల్ని అణచి వేస్తూ గోల్కొండను కాపాడుకుంటూ వచ్చారు.

ఉద్యోగస్తులు రెవెన్యూ వసూలు గురించి పట్టించుకునేవారు కాదు. అశ్రద్ధ చేశారు. ప్రభుత్వానికి రావలసిన ధనం వచ్చినంత వచ్చేది లేనంత లేదు. అందరు కుట్రలు చేయటంలోనే కాలాన్ని గడిపే వారు. "కంభంమెట్టు తాలూకాలో "భద్రాచలం"కు తహసీల్దార్‌గా ఉన్న గోపన్న శిస్తు వసూలు చేసి రామార్పితం చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగి ఉన్నాడు. మహమ్మదీయ కక్ష వారు ప్రత్యేకంగా దీని గూర్చి సుల్తానుకు మనవి చేసి అక్కన్న, మాదన్నలపై ఆగ్రహం వచ్చేట్లు మనవి చేశారు. హిందూ మత ద్వేషులైన మహమ్మదీయులు సుల్తానుకు అక్కన్న మాదన్నల గూర్చి వ్యతిరేకంగా చెప్పారు.

అయితే గోపన్నను సుల్తాను అబ్దుల్లా శిక్షించి జైలులో పెట్టాడే కాని, అక్కన్న మాదన్నల్ని వదులుకోలేదు. వారిపై విశ్వాసం విడువలేదు. అబ్దుల్లా కాలం నుండి అబుల్ హసన్ కాలం వరకు 12 సం॥లు గోపన్న ఖైదులో ఉన్నాడు . తానీషా చివరిదశలో అత్యంత హృదయ విదారకమైన జీవితం దౌలతాబాదులోని ఖైదులో గడపవలసి వచ్చింది. అయినా ఆంధ్రులకు అత్యంత ప్రేమాస్పదుడైన గోపన్న గారి ఆఖ్యానమునందు బద్ధుడై ఉండడం వల్ల ప్రజల హృదయ ఫలకాలపై సువర్ణాక్షరాలతో వెలసిఉన్నారు.

ఈ విధంగా కుతుబ్షాహీ రాజుల కాలంలో హిందువులు ఆధిక్యాన్ని పొందారన వచ్చును. ఈ పరిస్థితుల్లోనే సమాజ కవులు ఆవిర్భవించారు. ప్రముఖ వాగ్గేయకారుడైన రామదాసు ఈ కాలంలోనే ఆవిర్భవించాడు. ఈ సమాజ కవులు ఆవిర్భవించడానికి సామాజిక, చారిత్రక నేపథ్యాన్ని గూర్చి కె.కె. రంగనాథాచార్యులు గారు "తెలుగులో తొలి సమాజ కవులు" అనే గ్రంథంలోని సంపాదకీయ వ్యాసంలో ఎంతో విపులంగా చర్చించారు.

### 2.1.3. సమాజ కవుల ఆవిర్భావం, వికాసం, చారిత్రక, సామాజిక నేపథ్యం :

"గత చరిత్రలో మధ్య యుగంలో ప్రత్యేక చారిత్రక పరిస్థితులలో, అప్పటి ఆర్థిక సంబంధాల పునాదిపైన నిలబడిన సామాజిక వ్యవస్థలో, ఆనాటి పరిమితులలో కొంత వరకైనా అభివృద్ధి కరమైన పాత్రను, అభ్యుదయ పంథాను అవలంబించిన వారిని సమాజ కవులని పేర్కొనటం జరుగుతుంది. ఆయా చారిత్రక దశలలో వ్యవస్థను కొంత వరకైనా నిరసించి, ఎదిరించి నిలిచిన ఏ వ్యక్తి అయినా సమాజ కవే. ఏ ఉద్యమమైనా సామాజిక ఉద్యమమే".[1]

"మధ్య యుగపు భూస్వామ్య, రాచరిక వ్యవస్థలో కేంద్రంలో అధికారం ఎవరిదైనా గ్రామాధికారులు, స్థానిక భూస్వాములు సామాన్యుల పైన, శ్రమ జీవులపైన, వృత్తికారులపైన ప్రత్యక్షమైన పెత్తనం చెలాయిస్తున్న వ్యవస్థలో వారి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా వృత్తికారులు, స్వతంత్ర భావాలు గల ఇతరులు మత వ్యవస్థలో భాగంగానే భక్తిని ఆలంబనంగా చేసుకొని సంస్కరణ దృష్టితో జనాన్ని కూడ గట్టడానికి ప్రారంభించిన ఉద్యమాలకు సమాజ స్వభావం ఉంది. ఆనాటి వర్గ వైరుధ్యాలను, సామాజిక అసమానతలను విశ్లేషించి వాటికి గల మూల కారణాలను అన్వేషించగల శాస్త్రీయ దృష్టి వారికి లేదు. కాని వర్గ చైతన్యం ఉంది".[2]

### 2.1.3.0. సమాజ కవుల సాహిత్యంలోని లక్షణాలు :

"సామ్రాజ్యాల కాలంలో రాజులను కొలవటానికి అనుకూలంగా రూపొందిన 'భక్తి'ని దైవం వైపు మరల్చి, నాటి రాజకీయ వ్యవస్థలో పాలక వర్గం ముందు తరతమ భేదాలున్నా దేవుడి ముందర అందరూ సమానమే అన్న భక్తి, తత్త్వ కవులు కొంతవరకైనా సమాజానికి

1,2. తెలుగులో తొలి సమాజ కవులు - సంపాదకీయ వ్యాసం - కె.కె. రంగనాథాచార్యులు పుట 9

దగ్గరయ్యారు. అందుకే ఆనాటి పరిస్థితులలో వారు సమాజ కవులు. కులభేదాలు దేవుని ముందు లేవని చెప్పటం, నిమ్న కులాలవారే ఈ కవులలో ఎక్కువగా ఉండటం, పాలక వర్గం ఆశ్రయాన్ని నిరాకరించడం, కొందరు స్త్రీలకు సమానమైన ప్రాతినిధ్యాన్ని, స్థానాన్ని ఇవ్వటం, ఉన్నత వర్గాలకు అనుకూలమైన ఆచార వ్యవహారాలను, బాహ్యాడంబరాలను నిరాకరించి మతాన్ని సరళతమం చేయటం, రాచరిక వ్యవస్థలో క్షీణిస్తున్న విలువలను ఖండించడం, రాజాశ్రయంలో ఉన్న పండిత కవుల కంటే భిన్నంగా ఈ కవులలో కనిపించే ప్రత్యేక లక్షణాలు"[1].

"పాలక వర్గ సంస్కృతిలో ప్రజలను దూరం చేసే కారణాలను ఖండించి, నిర్మూలించే ప్రయత్నం చేయడం, వీరి విశిష్టత. కుల వ్యవస్థ బలంగా పాతుకొని పోయిన కాలంలో అది అభ్యుదయం. అప్పటి పరిస్థితులకు స్పందించిన వారు సమాజ కవులు. ఈ లక్షణాలే భక్త, తత్త్వ కవులను సమాజ కవులను చేస్తున్నాయి.[2]

"సమాజ కవుల సాహిత్యం మౌఖికమైంది. అందుకే ఇది జానపదులకు అందుబాటులో ఉండే సాహిత్యం"[3]. సమాజ కవులుగా పేర్కొంటున్న భక్తి తత్త్వకవుల మరో ప్రత్యేకత భారత ఉపఖండంలో క్రింది వర్గాలలో కూడా సమానమైన సంస్కృతిని, సమానమైన భావ జాలాన్ని పెంపొందింపజేయటం. మధ్య యుగం రెండవ దశలో చిన్న చిన్న రాజ్యాలుగా చీలి ఉన్న భారత ఉప ఖండంలో పాలక వర్గంతో సంబంధం లేకుండా ఆసేతు హిమాచలం భావ ఐక్యతను వీరు సాధించగలిగారు"[4].

ఉత్తర భారతానికి సంబంధించినంత వరకు కులభేదాలే కాదు, మత భేదాలతో కూడా సంబంధం లేకుండా క్రింది తరగతి వారిని ఏకత్రితం చేసే ప్రయత్నంగా సమాజ కవుల ఉద్యమం చాలా అభివృద్ధి కరమైన పాత్రను నిర్వహించింది. భక్తి, తత్త్వ కవులు చాలామంది జీవన విధానానికి సంబంధించిన భౌతిక మార్గీయులే అయినా కేవలం తత్త్వంగా వీరిపైన కనిపిస్తుంది. భావ వాదాన్నే ఆశ్రయించి, మతాన్ని ప్రధాన తాత్త్విక కేంద్రంగా విశ్వసిస్తూనే, ఆస్తికతను సంతరించుకుంటూనే కులం పేరిట, బలం పేరిట, బౌద్ధికత పేరిట, పాలకులు వారికి వత్తాసు పలికే మతాధిపతుల సాంఘిక దుర్మార్గాలను ఖండించారు.[5]

## 2.2 భారతీయ తత్త్వ పరంపర-వైరుధ్యాలు : విభిన్న భారతీయ తాత్త్విక దృక్పథాలు -భక్తి ఉద్యమం :

ఈ సమాజ కవులు భక్తి ఉద్యమం ప్రారంభించినప్పటి నుండి ఆ కాలంలోని ఈ కవులు స్వయంగా నైతిక బోధ చేశారు. "భక్తి ఉద్యమం క్రింది తరగతి వారి, నిమ్న కులాల వారి ఆత్మ విశ్వాసాన్ని, శ్రమ జీవుల ఆత్మ గౌరవాన్ని మానసికంగా నిలబెట్టింది. అధికార వర్గం తాత్త్వికతనే

1,2,3,4. తెలుగులో తొలి సమాజ కవులు-సంపాదకీయ వ్యాసం - కె.కె.రంగనాథాచార్యులు పుట 10.

5. తెలుగులో తొలి సమాజ కవులు - సంపాదకీయ వ్యాసం - కె.కె.రంగనాథాచార్యులు పుట 11.

వారు స్థూలంగా స్వీకరించినా వారి వర్గ పునాది పూర్తిగా భిన్నమైంది. అదే భక్తి, తాత్త్విక కవుల ప్రత్యేకత".[1]

వీరు సమాజాన్ని విమర్శించారు. పాలక వర్గ దుర్మార్గాలను ప్రత్యక్షంగా నిరసించారు. పాపం చేస్తే దేవుడు క్షమిస్తాడనే భావన సంస్కరణ వాదులైన చాలామంది భక్త కవులలో కనిపించదు. పాపం, తప్పు చేయకుండా ఉండటానికి మార్గాలనే వారు ఉపదేశించారు. అయితే తాత్త్వికంగా ఈ కవులు చాలా మంది పైన మాయా వాద అద్వైతాల ప్రభావమే కనిపిస్తుంది. అది కేవలం తత్త్వ జిజ్ఞాసగా మాత్రమే కనిపిస్తుంది".[2]

## 2.2.0 భక్తి - పుట్టు పూర్వోత్తరాలు :

భక్తి ఎలా ఆవిర్భవించి వికాసం పొందినదో 'కబీర్' దోహాలో ఈ విధంగా తెల్పబడింది.

"భక్తి ద్రావిడ ఉప జీలాయే ఉత్తర్ రామానంద్, పర్గట్ కియో కబీర్‌నే సప్త ద్వీప్ నవఖండ్"[3]

భక్తి దక్షిణ దేశంలో ఉదయించింది. రామానంద్ దానిని ఉత్తర దేశానికి తీసుకొని వచ్చాడు. కబీర్ దాన్ని సప్త ద్వీపాలు, నవఖండాలలో వ్యాపింపజేశాడని దీని భావం. ఆళ్వార్లు, నయనార్లతో ప్రారంభమైన భక్తి మార్గాన్ని పై దోహా ఉద్దేశిస్తుంది. కాని భక్తి అనేక అర్థాలలో అనేక రూపాలలో చాలాకాలం ముందు నుంచే కనిపిస్తుంది. నయనార్లలో, ఆళ్వారులలో అన్ని కులాలకు, వర్గాలకు సంబంధించిన వారు కనిపిస్తారు. ఇక్కడ నుండి భక్తి ఉద్యమం భారత ఉపఖండం అంతా వ్యాపించింది.

భక్తి ఉద్యమం ప్రాంతీయ భాషలలో, ప్రజా భాషలలో సాహిత్య సృష్టికి దోహదం చేసింది. సంస్కృతం ఉన్నత వర్గాల భాషగా, పండిత భాషగా స్థిరపడిన దశలో ఈ భక్తి, తత్త్వ కవులు సామాన్యుల కోసం ప్రాంతీయ భాషలలో సాహిత్య సృష్టి చేశారు. క్రీ.శ. 7,8 శతాబ్దాలలో ఉత్తర, పూర్వ భారతంలో ప్రచారంలో ఉన్న 'సహజయానం' అనే తాంత్రిక బౌద్ధం దక్షిన దేశంలోను, ఉత్తర దేశంలోనూ 'భక్తి'కి మూలం అయింది.

1. నాథ సంప్రదాయం :

సిద్ధుల సంప్రదాయం నాటి నాథ సంప్రదాయం మొదలైంది. యోగం ద్వారా, నాద సాధన ద్వారా మోక్షాన్ని పొందవచ్చనేది నాథ పంథీయుల సిద్ధాంతం. స్మార్త ఆచార వ్యవహారాలను, మిధ్యాడంబరాలను, కర్మ కాండలను నిరసించడం, వర్ణాశ్రమ వ్యవస్థను తిరస్కరించటం, నాథ సంప్రదాయంలోని ముఖ్య సిద్ధాంతాలు. ద్వైతాద్వైత సమ తత్త్వాన్ని వీరు ప్రతిపాదించారు

2. సంత్ భక్తి మార్గం :

రామానంద్ ద్వారా అందుకున్న దక్షిణాది వైష్ణవంలోని ప్రేమ తత్త్వం, నాథ పంథీయులలోని వర్ణాశ్రమ

1. తెలుగులో తొలి సమాజ కవులు -సంపాదకీయ వ్యాసం - కె.కె. రంగనాథాచార్యులు పుట 22.
2. " " " " పుట 14.
3. " " " " పుట 22.

భేద రాహిత్యం, ఉన్నత వర్గ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బాహ్యాడంబరాల తిరస్కారం, నాథ పంథీయులలో కొరవడిన సామాజిక, సాంసారిక జీవన ప్రాధాన్యం, సూఫీ తత్త్వంలోని నిరాకార ఈశ్వర ప్రేమ, ప్రణయ తత్త్వం సమ్మేళనం చెంది, సంత్‌ల మార్గం బయలుదేరింది. కులాలే కాదు, హిందూ ముస్లిం భేద భావం కూడా ఈ మార్గంలో లేదు. ఈ మార్గంలో ముఖ్యుడైన కబీర్ మొదట వైయక్తికమైన, రహస్యమయమైన హఠ యోగాన్ని అవలంబించినా, తరువాత దాన్ని వదలిపెట్టి సహజమైన, ప్రేమ రూపమైన నామ స్మరణ ప్రధానమైన భక్తి మార్గాన్నే అవలంబించాడు. సహజంగానే క్రీ.శ 13,14 శతాబ్దాలలో ఆర్థిక, సామాజిక రంగాలలోని అశాంత పరిస్థితులలో ఈ మార్గం సామాన్యులను ఆకర్షించింది.

శ్రమ జీవులు సంఘటితం కావడానికి భక్తి మార్గం తోడ్పడింది. తమ వృత్తులను అవలంబిస్తూనే, సాంసారిక జీవితాన్ని వదలకుండానే వారు జీవన తత్త్వాన్ని, భక్తిని బోధించారు. కబీర్, తుకారాం, రైదాస్, వీర బ్రహ్మం, సిద్ధప్ప ఇందుకు నిదర్శనం. మహారాష్ట్ర నుంచి పంజాబు వరకు పశ్చిమోత్తరంలో సంత్ భక్తి మార్గం వ్యాపించింది.

### 3. శైవ, వైష్ణవ మతాలు - అద్వైత సిద్ధాంతం :

తాత్త్విక వైరుధ్యం తత్త్వంగా మధ్య యుగాల నాటికి స్థిరపడింది. శైవం, వైష్ణవం ఆవిర్భవించడానికి కారణం ప్రధానమైన తాత్త్విక భేదం లేదు. శైవం, వైష్ణవాలు ప్రధానంగా ఆర్థికమైన సిద్ధాంతాలపై ఆవిర్భవించాయి. పాలక వర్గ మతాన్ని కాదని మరొక మతాన్ని అనుసరించారు. ఉత్తర భారతంలో పాలకులు శైవాన్ని అనుసరించగా, క్రింది తరగతుల రైతులు, వృత్తి కారులు వైష్ణవాన్ని అనుసరించారు.

### 4. శ్రీ వైష్ణవ మతం :

వైష్ణవాన్ని వ్యాపింపజేసిన రామానుజుడు శివపూజా దురంధరులకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. "కబీరు వైష్ణవుడు, రామనామ స్మరణకు ప్రాధాన్యమిచ్చాడు. ఉత్తర హిందూస్థానంలో 1400-1500 మధ్య కబీరు ఉద్భవించి కుల భేదాలను ఖండించి రామ భక్తిని ప్రచారం చేశాడు. ఇది "నిర్గుణోపాసన భక్తి". విగ్రహారాధనను ఖండించాడు కబీరు. కబీరు రాముడు "ఆత్మారాముడు" అయోధ్య రాముడు కాదు. కబీరు భక్తి తత్త్వం అద్వైతం. శ్రీ శంకర భగవత్పాదులు వైష్ణవ, శైవ మతస్థుల మధ్య గల వ్యతిరేకతను తొలగించడానికి "అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. శివ, కేశవ అభేదమే అద్వైతం. మతానికి ప్రజల్లో ఉండే ప్రాబల్యాన్ని బట్టి పాలకులు పోషించారు. అది పాలకుల మతంగా పాతుకుపోయినప్పుడు అధికారానికి అణచివేతకు అది సంకేతం అయింది. దాన్ని ఎదుర్కోదలచిన వారు మరో మతాన్ని సాధనంగా తీసుకున్నారు. మతం ఉపరితల సాధనం మాత్రమే. మూలం ఆర్థిక పరమైంది. భక్తి ఉద్యమంలోని వారు శైవులైనా, వైష్ణవులైనా వారు నిర్వహించిన పాత్ర సుమారుగా ఒక్కటే. పూర్వోత్తరంలో బెంగాల్, అస్సాం, ఒరిస్సాలలో రాధా మాధవ ప్రణయ తత్త్వం ప్రధానమైన వైష్ణవ భక్తి వ్యాపించింది.

### 5. సగుణ-నిర్గుణ భక్తి - కబీరు , రామదాసు భక్తి తత్వాలు :

కబీరు రామభక్తికి రామదాసు రామభక్తికి తేడా ఉంది. రామదాసు కూడా తెలుగు దేశంలో పుట్టి కబీరు వలె రామభక్తిని ప్రచారం చేశాడు. సగుణో పాసకుడు రామదాసు. అంటే విగ్రహారాధన, పూజలు నిర్వహించాడు రామదాసు. "రాముని అయోధ్య రామునిగా, విగ్రహ రూపంలో ధ్యానించాడు. శంఖ చక్రాలు ధరించి ఉన్న రాముని రామదాసు ధ్యానిస్తే, కబీరు నిరాకార నిర్గుణ రాముని ధ్యానించాడు. ఇది వీరిరువురి రామభక్తి పంథాలోని తేడా".

దేశమంతా రామభక్తి వాతావరణం వెల్లి విరిసింది. ఉత్సవాలు, తిరునాళ్ళ రూపంలో దేవుని పేరు తలచుకొని ప్రజలు తిరిగి ఆత్మ విశ్వాసం పొందటానికి ప్రయత్నించారు. కబీరు వలె రామదాసు కూడా సంఘ సంస్కర్త అనవచ్చు. రామభక్తి ద్వారా సమాజంలోని అసమానతలను తొలగించి, సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి, హైందవ సంస్కృతి, ధర్మాలను కాపాడే ప్రయత్నం చేశాడు. "కబీరుదాసు 1455వ సం॥ జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ నాడు క్రీ.శ. 1398న జన్మించినట్లు ప్రబలాధారములున్నవి".[1]

కబీరు రామానందుని శిష్యుడు. రామానందుడు రామానుజుని ఐదవ శిష్య పరంపరలోనివాడు. కబీరు కాశిలో నేతపని చేస్తూ ఉండేవాడు. ఆయన జాతి భేదమును విగ్రహారాధనను నిరసించెను. కర్మ కాండలకు ప్రతికూల వాది. రామ రహీములకైక్యమును గూర్చినను అవతారముల నమ్మడు. ఈ విషయాన్నే ఒక దోహాలో చెప్పాడు.

"దునియా ఐసీ బావరీ పత్థర పూజ నజాయ్

ఘరకీ చకియా కాహే నపూజై జిసకా పీసాఖాయ్"[2] అని చెప్పాడు. లోకము పిచ్చిది. ఎందుకనగా రాతిని పూజించును. గృహమందలి తిరుగలిని ఏల పూజింపరాదు ? అది విసిరిన పిండిని మనము తినుచుంటిమిగా" అని అంటాడు.

"మరొకచో "రాతిని పూజించిన భగవానుడు కనిపించినచో నేను పర్వతమును పూజించెద"నంటాడు.[3] వేయేల? కబీరు మతమునకు, రామదాసు మతమునకు చాలా తేడా కలదు. కబీరు కాశీ క్షేత్రమును వదలి 'బస్తీ' మండలంలోని మగహార గ్రామమునకేగి అక్కడనే విక్రమ శకము 1552లో ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి నాడు పరమపదించెనని భక్తి సుధా బిందుస్వా అను గ్రంథమున కలదు".[4]

కబీరుదాసు మరణించే నాటికి రామదాసు జన్మించలేదు. రామదాసు కాలం క్రీ.శ. 1620-80ల మధ్య కాలం. కబీరు రామదాసుకు రామమంత్రోపదేశం చేశాడన్నది నిజం కాదు.

### 6. భక్తి సాహిత్యం - ప్రాశస్త్యం :

రామదాసు వైష్ణవ సంప్రదాయానికి చెందిన భక్తకవి. శ్రీ వైష్ణవం స్వీకరించినాడు. నాటి శతక వాఙ్మయంలో ముప్పాతిక వంతు భక్తి ప్రధానమైనవి. "దాశరథీ శతకం" రామభక్తి

1. రామదాసు -గురునాథ శర్మ, పుట 42.
2. కబీరు డా॥ పరస్ నాథ్ తివారి- తెలుగు సేత డా॥ అమరేంద్ర పుట 39.
3. " " " " పుట 33
4. రామదాసు - గురునాథ శర్మ, పుట 44.

ప్రధానమైన శతకం రామదాసు రచించాడు. రామదాసు కీర్తనలకు ఆంధ్ర దేశంలోనే గాక, యావద్భారత దేశం ప్రచారం లభించింది.

11వ శతాబ్దాం నాటి వీరశైవ ఉద్యమంలో పుట్టిన భక్తి వాఙ్మయం మత ప్రచారం కొరకు, అన్య మతాలను ఖండిస్తూ పుట్టింది. 17-18 వ శతాబ్దాలలో ఆంధ్ర దేశంలో వ్యాపించిన భక్తి అలాంటిది కాదు. ఇది వైష్ణవ భక్తి. దాస భావంతో ప్రతిఫలాపేక్ష లేకుండా కేవలం ఆత్మ సంతృప్తికై దేవుని పూజించటం ఇందులో ప్రధానాంశం. పాత సమాజం శిథిలమై పోతున్నది. కొత్త సమాజం ఎలా ఉంటుందో, ఎవరికీ తెలియదు. ఈ సంధి యుగంలో 'భారమంతా నీదే' అనే ప్రపత్తి ధోరణిలో ఈ భక్తి వాఙ్మయం సాగింది. తెలుగులో దాశరథీ శతకం, మానస బోధ, వేణుగోపాల మొదలైన శతకాలలోని భక్తి ఇట్టి వాటిలో ముఖ్యమైంది.

ప్రజలలో విపరీతమైన మూఢ నమ్మకాలు బయలుదేరాయి . వీర భోగ వసంతరాయు అనే కలి పురుషుడ ఒకడు పుట్టి దేశాన్ని ఉద్ధరిస్తాడని, అంతకంటే తరుణోపాయం లేదని ఒక వాదన బయలు దేరింది. చంద్రగిరిని పాలించిన వీర వేంకటపతి రాయలు (1614) ఈ కొత్త పేరుతో పుడతాడని ప్రజలలో కొందరు నమ్మసాగారు. చారిత్రకంగా సంధి యుగమైన ఈ దశలో శతకాలు, గేయాలు, యక్షగానాలు మొదలైనవి వివిధ రూపాలతో సాహిత్యం వికసించటం, అది అంతా భక్తి సాహిత్యం కావటం గమనించదగ్గ అంశం. దాని తర్వాత, రాజాదరణ ఉంటేనే గాని వెలువడని ప్రబంధ వాఙ్మయం అంతరించింది.

సగుణ భక్తి, నిర్గుణ భక్తి అనే రెండు రకాల భక్తికి చెందిన కావ్యాలు ఈ సందర్భంలోనే వెలువడినాయి. కబీరు నిర్గుణ శాఖకు చెందినవాడు. వివిధ దోహాలు, హిందీలో వ్రాసినాడు. మహ్మదీయుడైనా రామభక్తుడు. శ్రీరామానందుల శిష్యుడై వేద వేదాంగ పురాణాలను ఆలకించి, వానిని అవగాహన చేసికొన్న పరమ భాగవతోత్తముడు.

రామభక్తి కావ్యాలు, కృష్ణభక్తి కావ్యాలు, తులసీదాసు కవితావళి, రామచరితమానస్, వినయ పత్రిక, భక్తి సంబంధమైన గేయ సంహితలు, కవితావళి, రామాయణ ముక్తక కావ్యం. ఇవన్నీ తులసీదాసు రచనలు. తులసీదాసు 'సగుణ భక్తి' సంప్రదాయానికి చెందినవాడు. తులసీదాసు కూడా రామభక్తుడే. రామదాసు వలె తులసీదాసు అయోధ్య రామునే పూజించాడు. విగ్రహారాధనను, ఉత్సవాలు, పూజలు నిర్వహించాడు. రాముని పూజించి, రామభక్తిని భారతదేశంలో ప్రచారం చేశాడు. ఉత్తర భారత దేశంలో రామభక్తి విస్తృతంగా ప్రచారం కావడానికి తులసీదాసు సాహిత్యం ప్రధానంగా ఉంది. రామదాసు, తులసీదాసు సమకాలికులు.

ఈ విధంగా క్రింది నుంచి భూస్వామ్య వ్యవస్థ పటిష్టమౌతున్న దశలో భక్తి సాహిత్యం ప్రారంభమైంది. భావ వాద తాత్త్విక దృక్పథాన్ని అంగీకరిస్తూనే భౌతిక, లౌకిక జీవితాన్ని భక్తి తాత్త్విక కవులు ఆశ్రయించారు. వేదాంతం, తత్త్వం నాటి పరిస్థితులలో తిరుగుబాటు చేయలేని దశలో ఆత్మ సంతృప్తికి, అంతర్ముఖులు కానటానికి ఈ భక్తి తత్త్వం , వేదాంతం, సాహిత్యం తోడ్పడినాయి.

మహమ్మదీయులను వ్యతిరేకించడానికి, మహ్మమదీయ ఇస్లాం మత ప్రభావం, హిందూ ధర్మాన్ని నశింపజేయకుండడానికి హిందూ సంస్కృతిని కాపాడుకోవడానికి భక్తి సాహిత్యం ఆవిర్భవించింది. రామభక్తి సామ్రాజ్యంలో హిందూ ప్రజలు ఓలలాడారు. ఉత్తర భారతంలో తులసీదాసు, దక్షిణ భారతంలో రామదాసులు శ్రీరామభక్తి తత్త్వాన్ని ప్రజలకు బోధించారు. ఎన్నో గేయాలు వీరిరువురు రచించారు. ప్రజలలో రామభక్తి ప్రచారానికై వారి కీర్తనలు, రామదాసు భజనలు, భజన సంప్రదాయ కీర్తలు ఎంతగానో తోడ్పడినాయి.

### 2.2.1 స్వీయ భక్తి తత్త్వ కవులు :

స్వీయ భక్తి మార్గానికి సంబంధించిన కవులలో ప్రేమ రూపమైన భక్తి ప్రధానమైంది. స్వామి, భృత్య సంబంధంగా స్నేహ సంబంధంగా, పితృ-పుత్ర సంబంధంగా, సఖీ-ప్రియ సంబంధంగా స్వీయ భక్తి వివిధ రూపాల్లో కనిపిస్తుంది. యోగంతోను, సాధనతోను గాక భక్తితో భగవంతుడిని సాధించ వచ్చంటుంది భక్తి మార్గం. తెలుగులో శుద్ధ భక్తి మార్గానికి సంబంధించిన వారు కృష్ణమాచార్యులు, అన్నమయ్య, కంచెర్ల గోపన్న, త్యాగయ్య మొదలైనవారు. ఆత్మార్పణ, ప్రపత్తి ఈ మార్గంలో ప్రధానం.

#### 2.2.1.0. స్వీయ భక్తి మార్గం - ప్రత్యేక లక్షణాలు :

1. స్వీయ భక్తి మార్గం ప్రత్యక్షంగా కుల నిరసన చేయకపోయినా, పరోక్షంగా కులాన్ని కాదన్నది. భక్తి క్షేత్రంలో కుల భేదాన్ని భక్త కవులు తిరస్కరించారు.

2. స్వీయ భక్తి మార్గంలోని మరొక ముఖ్యమైన అంశం స్త్రీ ద్వేషం లేకపోవటం. స్త్రీని నిందా పూర్వకంగా పేర్కొనకపోవటం. యోగం ప్రధానమైన మార్గంలోలాగా ఆత్మాభ్యున్నతికి స్త్రీని అవరోధంగా తలచలేదు స్వీయ భక్తి కవులు. (రామదాసు సీతమ్మను ప్రార్థించి, తన మొరను సీతమ్మ ద్వారా రామునికి నివేదించుకొన్నాడు). స్త్రీ వ్యతిరేకత అద్వైత భావ వాద ఫలితం.

3. రాజాశ్రయాన్ని నిరాకరించటం :

ఇది ఈ కోవకు చెందిన చాలామంది కవులలో కనిపించే మరో ప్రతేకత. గోపన్న రాజాశ్రయాన్ని తిరస్కరించాడు. అబ్దుల్లా చేత ఖైదులో పెట్టబడి తానాషా వలన విడుదలైన రామదాసు నరాశ్రయాన్ని తిరస్కరిస్తూ తన కీర్తనలలో కూడా "నరులను ఆశ్రయించ"వద్దని ప్రజలకు ఉద్బోధ చేస్తూ పేర్కొన్నాడు. రాముని ఆశ్రయించమంటాడు రామదాసు.

"నరహరిని నమ్మక నరులను నమ్మి
నరజన్మమీడేరునా ఓ మనసా"[1] అని అన్నాడు రామదాసు తన కీర్తనలలో. రామదాసు నరాశ్రయ తిరాస్కారానికి ఈ కీర్తన నిదర్శనం.

1. భక్త రామదాసు కీర్తనలు పుట 76 (సంకలనం - దాశరథుల బాలయ్య)

4. మానవీకరణ :

భక్త కవుల్లో కనిపించే మరొక ప్రధాన లక్షణం ముఖ్యంగా ఇది కంచెర్ల గోపన్న లేక రామదాసులో కనిపిస్తుంది. "పలుకే బంగారమాయెనా", "ఏ తీరుగ నను దయ జూచెదవో?" అని దేవుడిని ప్రత్యక్షంగా, స్నేహ పూరితంగా ప్రశ్నించటం, నను బ్రోవమని రామునికి చెప్పమని సీతమ్మ తల్లిని వేడుకోవడం, సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకమ్ము, అని గోడు వెళ్ళబుచ్చుకోవటం, ఎవడబ్బ సొమ్మని తీసుకొన్నావని రాముడిని దబాయించటం, తన లక్ష్యమైన దైవ సంబంధాన్ని మానవ సంబంధంగా తీర్చి దిద్దటానికి తార్కాణాలు".[1] అందుకే రామదాసు గీతాలకు సామాన్య జనంలో అంతగా ప్రచారం ఉంది. సాంసారిక జీవితాన్ని, శృంగారాన్ని దైవపరం చేయటం కూడా మానవీకరణలో భాగమే. అన్నమయ్య ఆధ్యాత్మిక శృంగార కీర్తనలు ఇత్యాదులు ఇందుకు ఉదాహరణలు. మువ్వ గోపాల పదాలు ఆధ్యాత్మ శృంగార ప్రధానమైనవి. మధుర భక్తి సంప్రదాయానికి చెందినవి.

5. స్వీయభక్తి కవులు గార్హస్థ్య జీవనాన్ని నిరసించలేదు. గార్హస్థ్య జీవితాన్ని అనుభవించకుండా ఎవరూ మోక్షాన్ని పొందలేరనే వారి అభిప్రాయం. "ప్రాణికోటి జన్మనిచ్చిన తల్లి మీద ఆధారపడ్డట్టు, అన్ని ఆశ్రమాలు గృహస్థాశ్రమం మీద ఆధారపడ్డా"యంటారు.

*ఆలుబిడ్డల పొందు బాసినట్టి అడవిలో పండుటాకులు మేసి,*
*జాలి జెందుటవట్టి గాసి లెస్స సంసారియై యుండి సమబుద్ధి జేసి"*[2] అని అంటాడు రామదాసు.

సంసార జీవితం గడుపుతూనే, భగవద్భక్తి కల్గి మోక్షం పొందాలనే ప్రయత్నం చెయ్యాలని ప్రజలకు ఉద్బోధ చేస్తున్నాడు రామదాసు.

6. కర్మ కాండలకు ప్రాధాన్యం ఇవ్వకపోవటం :

ఇది స్వీయ భక్తి కవులలో కనిపించే సమాన లక్షణం వీరు నామ స్మరణకు ప్రాధాన్యం ఇచ్చారు. నాథ పంథీయులు యోగం ద్వారా సాధించదలచిన దాన్ని నామ స్మరణ ద్వారా, ప్రపత్తి ద్వారా సాధించ వచ్చని వీరు భావించారు. "శ్రీరాముల దివ్య నామ స్మరణ చేయుచున్న చాలు- ఘోరమైన తపములను కోరనేటికి ఓ మనసా" అని ప్రశ్నిస్తాడు రామదాసు అంతేకాక

*"హెచ్చుగ నూటయెనిమిది తిరుపతులెలమి తిరుగ పని లేదన్నా*
*ముచ్చటగ తాపుణ్య నదులలో మునుగుట పని ఏమిటికన్నా?"*[3] అని ప్రశ్నిస్తాడు.

తీర్థ యాత్రలు, కర్మకాండలు సాధించలేనిది స్వీయ భక్తి సాధిస్తుందని ఈ మార్గానికి సంబంధించిన వారి నమ్మకం. భగవన్నామ గుణ సంకీర్తనం వలన మోక్షం పొందవచ్చనే వారి అభిప్రాయం.

---

1,2 ,3 . తెలుగులో తొలి సమాజ కవులు -సంపాదకీయ వ్యాసం -కె.కె.రంగనాథాచార్యులు పుట 29.

7. వైష్ణవ మతంలోని ఉత్సవ సంప్రదాయం, భజన సంప్రదాయం కులభేదం లేకుండా అందరినీ ఒకచోట చేర్చటానికి పనికి వచ్చింది. ఆదిమ సామూహిక సంప్రదాయం ప్రత్యామ్నాయం అయింది. నాటి సామాజిక వ్యవస్థలో భజన సంప్రదాయం, కోలాటం, ఉట్ల పండుగలు సామాన్యులకు ఉపశమనాన్ని కలిగించే అంశాలు. రామదాసు కీర్తనలు ఈ కోవకు చెందినవి. స్వీయ భక్తి కవులలోని ఈ భజన సంప్రదాయ కీర్తనలు ప్రజలను అందరినీ ఏకం చేయడానికి తోడ్పడినాయి. రామదాసు కీర్తనలు సమైక్యతా భావాన్ని భారతీయులలో పెంపొందించాయనడం అతిశయోక్తి కానేరదు. ప్రతి రామాలయంలోనూ రామదాసు కీర్తనలను భజన కూటాల వారు ఈనాటికీ ఆలపిస్తుంటారు. రామదాసు కీర్తనలు లేని భజనలు లేవు అంటే అతిశయోక్తి కాదు.

8. స్వీయ భక్తి కవులలోని మరొక ప్రధానాంశం భాష, రూపం. తెలుగుకు సంబంధించినంత వరకు మొదటి నుండి అగ్ర కులాల సాహిత్యానికే ప్రాధాన్యం ఉంది. భాషా పరంగా, వస్తు పరంగా సంస్కృతీకరణ అందులో ఎక్కువ. కాని భక్తి కవులలోని భాష, రూపం సామాన్యులకు దగ్గరగా ఉంటాయి. వాడుక భాష సామాన్యుల నోళ్లలో మెదలే పద ప్రయోగాలు, వారిలో ప్రచారంలో ఉన్న బాణీలు, వారి కవిత్వంలో కనిపిస్తాయి. "ఆడిన మాటెల్ల సమృత కావ్యముగ పాడిన పాటెల్ల పరమ గానముగ"[1] వారి కవిత్వం కనిపిస్తుంది.

రామదాసు కీర్తనలలోని భాష తేటయైన తెలుగు మాటలతో సామన్యునికి అర్థమయ్యే రీతిలో, సులభంగా ప్రాచుర్యం పొందేందుకు, సమాజంలో స్థిరంగా నిలచిపోయేటందుకు వీలైన సులభ శైలి ఇందు ఉంది. అందుకే జానపదులు కూడా ఈ కీర్తనలు ఆనందంగా పాడుకోగలుగుతున్నారు. పండిత పామర రంజకంగా ఉండేందుకు వీలైన భాష శైలి సులభతరంగా ఉండి, ఈ కీర్తనలు తెలుగు నాట చిరస్థాయిగా నిలిచిపోయాయి. రామభజన కూటాలలో రామదాసు కీర్తనలు ఆలపించని ఆంధ్రులు లేరు. ఉండరు.

9. సంస్కరణ మార్గం :

స్వీయ భక్తి మార్గంలో మానసిక పరివర్తనకు ప్రాధాన్యం ఉంది. కాని భక్తి కేంద్ర బిందువైనా ప్రధానంగా సంస్కరణలను బోధించిన వారిని సంస్కరణ మార్గానికి చెందిన కవులుగా పేర్కొనవచ్చును. స్వీయ భక్తి మార్గం కుల వ్యవస్థపైన పరోక్షంగా నిరసనను మాత్రమే ప్రకటిస్తే, సంస్కరణ మార్గం ప్రత్యక్ష నిరసనను ప్రదర్శించింది. కర్మకాండలను నిరసించటం, గార్హస్థ్య జీవితాన్ని నిరాకరించకపోవటం, కొందరు స్త్రీలకు కూడా సమాన స్థానం ఇవ్వటం, స్వీయ భక్తి మార్గంతో సమానంగా సంస్కరణ మార్గంలో కూడా కనిపిస్తాయి. వీర బ్రహ్మం, సిద్దప్ప, బసవన మొదలైన అతివాద తాత్త్వికులు ఈ కోవకు చెందినవారు. సమాజంలోని

1. తెలుగులో తొలి సమాజ కవులు - సంపాదకీయ వ్యాసం - కె.కె.రంగనాథాచార్యులు పుట 30.

దురాచారాలను నిర్దాక్షిణ్యంగా ఖండించేందుకై కంకణం కట్టుకున్నారీ తత్త్వ కవులు, సంస్కరణ కర్తలు. భక్తి తత్త్వ కవులకుండిన సంస్కరణ కవిత్వం వీరి కలాల నుండి, గళాల నుండి వెలువడింది. వీరి కారణంగా భారతదేశంలోని అవినీతి, దురాచారాలు, మూఢాచారాలు రూపు మాపబడినాయని చెప్పవచ్చును. ఈ విధంగా భక్తి, తాత్త్విక కవులు, సంస్కర్త కవులు ఆనాటి మధ్య యుగం నాటి మహమ్మదీయ దాడుల వలన ఇస్లాం మత ప్రభావం మన హిందూవులపై పడకుండేందుకు మన సంస్కృతి అంటే హైందవ సంస్కృతిని కాపాడడానికి కీర్తన సాహిత్యం భక్తి సాహిత్యం ఎంతగానో తోడ్పడిందనవచ్చు.

2.2.2. భారతీయ భక్తి కవిత్వం - శాఖలు :

"భారతీయ కవిత్వాన్ని డాక్టర్ బాడాల రామకవిగారు 1. ఆశ్రమ కవిత 2. ఆశ్రయ కవిత 3. అనుభవ కవిత అని స్థూలంగా మూడు తీరుల చెప్పినారు.

1. ఆశ్రమ కవిత : మొదటిది వన వాటికలలో ఆశ్రమాలలో ఉంటూ "లోకాః సమస్తాః సుఖినో భవన్తు" అని ఆశించిన ఋషులు, మునులు వ్రాసింది. ఇది ఆశ్రమ కవిత. అది సహజ కవిత. దానిలో అంతరాత్మ ప్రమేయమెక్కువ.

2. ఆశ్రయ కవిత : రెండవది రాజాస్థానాలలో పాలకుల రుచులకు, సమకాలీన సాంఘిక అభిరుచులకు అనుగుణంగా పండిత కవులు వ్రాసిన రసాలంకార రీతి శయ్యా పాకాల గుబాళింపుల కవిత. దానిలో బుద్ధి ప్రమేయమెక్కువ.

3. అనుభవ కవిత : మూడవది ఆయా కవుల వైయక్తిక సుఖ దుఃఖాలకు, రాగ ద్వేషాలకు ప్రేమ సంతోషాలకు సమస్తానుభవాలకు ప్రతిబింబమైన కవిత. దీనిలో హృదయ ప్రమేయం ఎక్కువ. ఇది సమకాలీన రాజకీయ, సాంఘిక , మత వ్యవస్థలను ధిక్కరించి వ్రాసింది కావచ్చు. లేదా తనకు అభిమతమైన దైవం, మతం, ప్రేమ, భక్తి మొదలైనవి ఆధారంగా వెలువడిందైనా కావచ్చు. ఇటువంటి అనుభవ కవిత్వం చెప్పిన వాడు భక్త రామదాసు. ఆనాటి సమకాలీన సాంఘిక, రాజకీయ, తాత్త్విక, మత పరిస్థితులలో, ఆనాటి కుతుబ్షాహీ రాజుల కాలం నాటి మహమ్మదీయుల బానిసత్వంలో క్రుంగి, కృశించి, తను పడిన బాధలు, వేదనల నుండి ఈ అనుభవ కవిత్వం రామదాసు కలం నుండి జాలువారింది.

శ్రీ రామాలయ నిర్మాణం అనే ధర్మ కార్యం నిర్వర్తించిన నేరానికి, ప్రభుత్వం యొక్క ధనం ఉపయోగించినందున, హిందువైనందున, మహమ్మదీయుల ద్వేషానికి బలై కారాగార వాసం అనుభవించి, 12 సం॥లు కఠిన శిక్షలు మహమ్మదీయుల వలన పొంది చివరికి రాముని వలన విముక్తుడైనాడు. రామభక్తితో కూడిన అనుభవ కవిత్వమే ఈ రామదాసు కీర్తనలలో దాగుంది.

తాను నమ్మిన దైవాన్ని నోరారా కీర్తించి తాము తరించి ఇతరులను తరింపజేసిన వారిలో భద్రాచల రామదాసు ఒకడు. ఆంధ్ర వాగ్గేయ కారులలో రామభక్తి శిఖామణులలో అజరామరమైన కీర్తి ప్రతిష్ఠలు పొందిన వాడు రామదాసు. భారతీయ సంస్కృతిలోనే రామదాసు చరిత్రకు, అతని కీర్తనా

సాహిత్యానికి ఎనలేని గౌరవ ప్రతిష్ఠలు లభించినవి. భారతీయ వాగ్గేయ కారులలో ఒక ప్రముఖ స్థానం ఈ గోపన్నకు లభించాయి. భారతీయులు శ్రీరాముని పూజించినంత కాలం రామదాసు పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

"తెలుగునాట రామనామ స్రవంతులు పారించి భక్తి సస్యాలు సూటిగా పండించిన రామదాసు పండితుల చేత భక్తుడని, ప్రజల చేత మహానుభావుడని, పామరుల చేత దేవుడని, ఈ విధంగా అన్ని వర్గాల వారి చేత ఆదరింపబడినవాడు".

ఈ విధంగా ఇంత గొప్ప అనుభవ కవిత చెప్పిన భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి చెందిన "కంచెర్ల గోపన్న" జీవిత విశేషాలు, ఆయన రచించిన కీర్తనలపై తన జీవితం యొక్క ప్రభావం ఏ విధంగా ఉందో, ఇంతవరకు పరిశీలించిన చారిత్రక, సామాజిక, మత పరిస్థితుల ప్రభావం ఆ కీర్తనలపై ఏ విధంగా ఉందో తర్వాతి అంశాలలో చర్చిస్తాను. ఇంతవరకు చర్చించబడిన కుతుబ్షాహీ రాజుల కాలం నాటి సామాజిక, రాజకీయ, మత పరిస్థితులు రామదాసు జీవితాన్ని, అతని కీర్తనలు, శతక సాహిత్యాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. ఆ ప్రభావం ఏ విధంగా ఉందో పరిశీలించడం ప్రధానోద్దేశం.

మూడవ అధ్యాయం

# రామదాసు కీర్తనలు కొన్ని పరిశీలనలు

## మూడవ అధ్యాయం

# రామదాసు కీర్తనలు - కొన్ని పరిశీలనలు

### 3.0. ఉప క్రమణిక :

భారతీయ సాహిత్యంలో సంకీర్తన సాహిత్యానికి ప్రముఖ స్థానం లభించింది. పదకవితా శాఖకు పట్టం కట్టింది భారతీయ వాగ్గేయకారులే. పద కవితా శాఖ ప్రాదుర్భావానికి పామరులే బీజం వేసారు. తెలుగు సాహిత్యంలో పద కవితకు ఒక ప్రత్యేక స్థానం ఉంది.

### 3.0.1. పద కవిత - ఆవిర్భావం - నిర్వచనం :

పాడుకోవడానికి ఉపకరించేది పదం. పదమంటే పాట అని కూడా అర్థం ఉంది. "పద పద్య కవితల్లో "పదమే" ముందు ఆవిర్భవించిందనడం సమంజసం. ఇదే విషయాన్ని రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారిలా పేర్కొన్నారు. "రాగ తాళములు రెంటిని కలిపి హృదయంగమములైన భావాలను వెలువరుచు భాషను అలంకరించుటయే పద రచనకు పరిపూర్ణ స్వరూపము. దాని పరిపూర్ణానుభవమును మనకప్పడే సతాళముగనో, వితాళముగనో, కావ్య కళా రసానుభవమును ప్రాచీన మనుష్య జాతి పాట రూపముననే అనుభవించే రసించినదని పండితులూహింతురు. మన పద్యములన్నియు పదముల పరిణామములే అని భావించుటకు పెద్ద సూక్ష్మ దృష్టి అక్కరలేదు"[1]. ఈ అభిప్రాయాన్ని స్థాపిస్తుంది మౌల్టన్ పండితుని సిద్ధాంతం.

" The improvised lyrical song, communal or individual, popular or artistic is probably the simplest and most spontanious from of lyrical expression ... The true song is primarly the instinctive, out burst of emotion or emotional thought in language by aptness or word and rythm echoes or suggests the under lying emotion and by melody of line and harmony of stanza is adapted such modulations, of this singing voice as naturally distinguish emotional utterence .... The song is a musical" therefore , more than any other lyrical kind a musical cry"[2]

ఇది జానపద గేయావిర్భావాన్ని గూర్చి చెప్పినప్పటికీ, తరువాత, దాన్ని నిబద్ధం చేస్తూ రచితమైన పదమే పద కవితకు మూలం. లక్షణ బద్ధమైంది పద్యం. ఎలాంటి లక్షణమూ లేకుండా సామాన్య ప్రజల నోళ్ళలో పాడబడేది పదం. ఇదే పాట. ఇదే మొదట ఆవిర్భవించింది. తెలుగులోనూ పదమే ప్రప్రథమంగా పుట్టింది. నన్నయకు ముందు, సమకాలికంగాను, ఎంతో దేశి కవిత ఉండి ఉంటుంది. తమిళంలో ప్రాచీన కవిత ఈ పద కనితలే. "పదం" అనేది రాగ తాళ సహితమై ఉండవచ్చు. లేదా కేవలం స్వర సహితమూ కావచ్చు. ఇది జానపద గేయాల్లో స్పష్టంగా తెలుస్తుంది. కోలాటం, దంపుళ్ళు మొదలైన పాటల్లో విధిగా తాళముంటుంది. రాగంతో పాటు, విసుర్రాయి, కపిలి (మోట) పాటల్లో రాగమే గాని తాళానికి అవకాశం ఉండదు. అయితే రెండింట లయ ఉండి తీరుతుంది. " పదం" పాడటమన్నది జన వ్యవహారం.

"భరత ముని" చేసిన పద నిర్వచనమిలా ఉంది.

"గాంధర్వం యన్మయాప్రోక్తం
స్వర తాళ పదాత్మకమ్
పదంత స్యభవేద్వస్తు స్వర తాళానుభావకమ్
యత్కించి దక్షర కృతం తత్సర్వం పద సంజ్ఞితమ్ ॥

1,2 . పద కవిత్వం - డా॥ ఎస్. గంగప్ప (శ్రీ కోరాడ రామకృష్ణయ్య జయంతి ఉత్సవ సంచిక), పుట 305.

నిబద్ధంచానిబద్ధంచ తత్పదం ద్వివిధం స్మృతమ్
అతాళంచ, సతాళంచ, ద్విప్రకారంచ తద్భవేత్
సతాళంచ ధ్రువార్థేషు నిబద్ధం తచ్ఛనైస్మృతమ్".[1]

"స్వర తాళ పదాత్మకమైంది గాంధర్వమనీ, స్వర తాళాను భావకమైన పదమే వస్తువనీ, అర్థ సహితమైన అక్షరాలతో కూడింది పదమనీ, ఈ పదం నిబద్ధం, అనిబద్ధం అని రెండు విధాలనీ భరత మహర్షి నిర్వచనం".

"నియతాక్షర సంబంధం కలిగి, ఛందో యతి సమన్వితమై, తాల పాతములతో కూడిన పదం నిబద్ధమనబడుతుంది. యతి పాద నియమం లేనిది, అనియతాక్షరం అగు పదం అనిబద్ధమనబడుతుంది". దేశీయ వ్యవహారంలోని దరువు నుండి ధ్రువ పదమనే లక్షణ నామం గాని, ధ్రువ పదం నుంచి దరువు అనే వ్యవహారంగాని వచ్చి ఉండవచ్చునని ప్రాజ్ఞుల అభిప్రాయం. సంగీత పరిభాషలో ఈ పదాలు ప్రబంధాలనబడతాయి. పైన భరతముని చెప్పిన రీతిలోనే మతంగుడు, శార్ఙ దేవుడు, చివరికి వేంకట మఖి వరకు అందరూ లక్షణాలను వివరించారు.

ఆంధ్ర సాహిత్యాన్నంతటినీ పండిత సాహిత్యం, పామర సాహిత్యం అని స్థూలంగా రెండు విధాలుగా విభజించవచ్చు. దీన్నే ప్రౌఢ సాహిత్యమూ, జానపద సాహిత్యమూ అని పేర్కొనవచ్చు. శిష్ట సాహిత్యమూ, శిష్టేతర సాహిత్యమూ అని చెప్పటం ఉంది. జానపద సాహిత్యమంతా ఆడి, పాడుకోడానికి పనికి వచ్చే పద కవితలు. పండితులకు మాత్రమే పరిమితమైన శిష్ట సాహిత్యమంతా పద్య కవితలు.

"ప్రాక్తన మానవుడు సుఖ దుఃఖాది అనుభూతులను పొందినపుడు తదనుగుణంగా ఆడి పాడుకొవడానికే ఈ పదకవిత పుట్టింది".[2] ఈ పద కవిత ఆవిర్భావాన్ని గూర్చి చక్కగా వివరించారు పింగళి లక్ష్మీకాంతం గారు. "పాడదగిన కావ్యమునకు పదమని పేరు. ఏ వాఙ్మయము నందైనను ఈ పద కవిత్వము పద్య కవిత్వము కంటె ముందు పుట్టి పెరుగుననుట బహుజనాంగీకృతమైన సిద్ధాంతము. చిత్ర విచిత్ర కావ్య కమనీయ పర్వతారణ్యమయమైన ప్రకృతిలో పెరిగిన ప్రాకృత జీవియగు ప్రాక్తన మానవుని హృదయమున సంతోషమయమో, దుఃఖ మయమో యగు నొకానొక భావము జనించి పరవశుని చేయగా అతని నోటి వెంట, అప్రతర్కితముగా ఒక పాట వ్యక్తమై యుండుననియు, ఆవేశపూరితమై అతడా పాటను చిందులు త్రొక్కుచు, పాడి యుండుననియు, ఆట పాట లేక నృత్యసంగీతము అని పేరు పెట్టవచ్చుననియు, అదియే పద కవిత్వమునకు శ్రీకారమనియు, ఈ సిద్ధాంతము యొక్క సారాంశము".[3]

ఈ ఆట, పాటలోని మూడు భిన్నాంశములైన అడుగు వేయడం, రాగం తీయడం, మాట పలుకడం, అన్న వీనికి కాలక్రమేణ నాట్యం, సంగీతం, పద్యం అనే కళలుగా పరిణమించింది. శాస్త్ర పరిభాషలో ఈ మూడింటికీ "నృత్యం, గీతం, శబ్దం" అని పేర్లు. ఈ పద కవిత్వమున శబ్దానికెంత ప్రాధాన్యముందో గీతికకును అంతే ప్రాధాన్యం ఉంది. అనగా ఇందు సుందర శబ్ద రచనతో పాటు మధురమైన పాట కూడా కలిసి ఉంటుంది.

పద కవిత నుంచే పద్య కవిత్వముద్భవించిందనీ, పదమే ప్రాచీనమనీ రాళ్ళపల్లి వారి అభిప్రాయం. "మన దేశములో చాలా ప్రాత పాటలు వేద సూక్తములు. మనుష్య జాతికి అవి మొదటి రచనలు అనియూహింప వలసినవి. ఈ రాగ తాళములు రెంటిని కలిపి హృదయంగమములైన భావములను వెలువరుచు భాషను అలంకరించుటయే పద రచనకు పరిపూర్ణ స్వరూపము".[4]

1. పద కవిత్వం - డా॥ ఎస్.గంగప్ప ( శ్రీ రోరాడ రామకృష్ణయ్య జయంతి ఉత్సవ సంచిక) పుట 306.

2. తెలుగు వాగ్గేయ కారులు - డా॥ ఎస్.గంగప్ప పుట 1.

3,4. " " " పుట 2.

రాజ రాజ నరేంద్రుని కాలం నాటికి పద కవిత్వమే కాకుండ గేయ కవిత్వం కూడా జన సామాన్యంలో వాడుకలో ఉండి ఉండవలెను కాని, దాని స్వరూపం నేడు గోచరించటం లేదు. పాల్కురికి సోమనాథుడు బసవ పురాణం, పండితారాధ్య చరిత్రలో తుమ్మెద పదాలు, ప్రభాత పదాలు, పర్వత పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు మొదలైన మధుర కవితా రచనలు ప్రజలు పాడుకొనే వారని అవి ఎటువంటివో తెలియుటం లేదు. పద కవిత్వమే సంగీత కళగా రూపు దిద్దుకుంది. ఈ సంగీత కళా వికాసం గూర్చి తెలుసుకో వలసి ఉంది.

### 3.0.2. సంగీతం - ఆవిర్భావ వికాసాలు :

పద కవిత్వమే సంగీత కళగా రూపు దిద్దుకుంది. "సంగీతం ఆపాత మధురం-సాహిత్య మాలోచనామృతం" అన్నారు పెద్దలు. "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసం ఫణిః" అని కదా ఆర్యోక్తి. మరి అటువంటి సంగీతం ఆవిర్భావం, అది వికాసం పొందిన విధం గూర్చి ప్రస్తావించడం అవసరం.

**లలిత కళలు - సంగీతం :**

లోకంలో ఉన్న విద్యలు అన్నింటిని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. అవి కళలు, శాస్త్రాలు. ఈ రెండూ మనకు పుట్టుకతో వచ్చేవి కావు. ప్రయత్న పూర్వకంగా అభ్యసించి సాధించ దగ్గవి. "కళ" అనే మాట ఆంగ్లంలోని "ఆర్ట్ " అనే శబ్దానికి సమానార్థక పదం. ఇది లాటిన్ "ఆర్టెమ్" నుండి ఉద్భవించింది. బుద్ధి సూక్ష్మతను ఉపయోగించి మనుష్యుడు కల్పించేది కళ. ఈ కళ భావనా శక్తిని రేకెత్తిస్తుంది. మనస్సులో పరోక్ష దృశ్యాన్ని సృష్టించే ప్రయత్నమే కళ అంటే సరిపోతుంది. ఈ కళని రేఖా రూపంలోనో, వర్ణ రూపంలోనో లేదా ధ్వని, హావ, భావ, లయాత్మక, చలన రూపంలోనో అభివ్యక్తం చేయడం జరుగుతుంది.

మానవునికి ఉపయోగాన్ని చేకూర్చడంతో పాటు అతనికి ఒక విధమైన ఉల్లాసాన్ని, తృప్తిని కల్గించేది కళ. సౌందర్యం, ఆనందం వాటి కలయికే కళ. మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలు కళలు. ఇవి సంప్రదాయ బద్ధంగా, తర తరాలుగా మనకు సంక్రమిస్తున్న సౌందర్య నిధులు. సంఘ జీవియైన మానవుడు ప్రయత్న పూర్వకంగానూ, అప్రయత్నంగానూ కూడా తాను సుఖానందాలను పొందినపుడో లేక ఇతరులకు తన అనుభూతిని పంచాలనుకొన్నప్పుడో చేసే ప్రదర్శన అతని సమస్త శరీరానికే సంబంధించినదై ఉంటుంది. అదే నర్తనానికి, వాగ్గేయాల విస్తృతికి దారి తీస్తుంది. దర్శనీయాలు, శ్రావ్యాలు అయిన ఆట పాటలు ఆవిర్భవిస్తాయి. పాటలు శ్రవ్య కళలుగాను, ప్రత్యేకాలై విడిగానూ, కూడి మాడీ మనగుల్గుతాయి.

"ఇలా లయ తాళ విన్యాసం గల కావ్య కళలోని కూర్పులోనూ గణ బద్ధమైన ఛందో రీతిలోనూ తోచే శ్రావ్యమైన విశిష్ట గతికి తర్వాత గానాంశ కూడా తోడై పద్యకవిత నుండి పద కవితా శాఖ వేరు రూపు దిద్దుకొనగా, గద్య కవిత గానాంశను చేర్చుకొని వచన సంకీర్తన రీతికి దారి తీసింది. కావ్య గాన కళల మేళవింపుతో ఇలా రూపు దిద్దుకొన్న సంకీర్తన పదకవితా ప్రక్రియ, తదుపరి నర్తన కళను కూడా మేళవించుకొని త్రివిధ కళా సంపుటియైనది".[1]

"ఇలా ప్రాకృతులైన ఆదిమ జాతి వారి ఆట పాటల బీజాల నుండి ఆవిర్భవించిన ఈ కళా త్రిపుటి కాల క్రమాన సంస్కారాన్ని అపేక్షించి, నియమాన్ని గ్రహించి, శిష్టమై 'పద కవితలు' అన్న పేరున పండిత పామర జనాన్ని సమంగా రంజింప జేసే నూతన ప్రక్రియగా అయింది".[2]

1.2 . పద కవితలు - వేటూరి ఆనందమూర్తి (తెలుగు వాణి వ్యాసం), ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక, పుట 178-182.

### 3.0.3. పద కవితలు - చారిత్రక నేపథ్యం :

పాల్కురికి సోమనాథుని ద్విపదల్ని మనవాళ్ళు నోరారా పాడుకొన్నారు. ఆయన తన ద్విపదల్లో మనవాళ్ళు పాడుకొన్న పాటలెన్నింటినో పేర్కొన్నాడు.

"పదములు తుమ్మెద పదముల్
ప్రభాత పదములు. . . సెజ్జ వర్ణన, మఱి
గణ వర్ణన పదములవర్ణన, ఘోషణ
ఘూర్ణిల్లుచుండ - బాడుచు నాడుచు
పరమ హర్షమున. . . . . . . ." (పండితారాధ్య చరిత్రము)[1]

ఇవన్నీ ఆయన పేర్కొన్న మన పాత పాటలే. ఈ పాటలనే లాక్షణికులు పదాలనీ, ప్రబంధాలనీ, ఏలలు అనీ అనేక నామాంతరాలతో వ్యవహరించారు. సామాన్యార్థంలో పదాలన్నా, ప్రబంధాలన్నా, ఏలలన్నా పాటలే. అందుకే "ఊగునప్పటి యేల ఊయేల, జోగునప్పటి యేల జోల" అయి వుంటుందని అంటున్నారు పితృపాదులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు. ఏలలు, ఓలలు, వాలలు అన్నీ పర్యాయ రూపాలే. ఇలా పామర జన వ్యవహారంలో ఎన్నో విధాల పదాలున్నా, పాల్కురికి వారి ద్విపదల్లో ఎన్నో పదాల పేర్లున్నా కాలం, కర్తృత్వం గుర్తింపదగిన పదాలు మాత్రం ఆనాటివి మనకెరుగ రావు".

"వీణా గానము వెన్నెల తేట
రాణమీర గార మణుల పాట
ప్రాణమైన పిన బ్రాహ్మణుల వీట

జాణలు నొత్తురు జాజర పాట[2] అన్న పాట ఒకటి నాచన సోముని 'వసంత విలాసం' లోనిదని ప్రభాకర శాస్త్రి గారు పేర్కొన్నారు. వీటినే వెనుక లాక్షణికులు చర్చరీ గానంగాను, రెట్టించి పద్ధడీ ప్రబంధంగానూ కూడా పేర్కొన్నారు.

కృష్ణమాచార్యుని రామ నామాలు, నృసింహ నామాలు, తులసీ మాహాత్మ్యం అన్నవి కూడా పై తీరు రచనలే అయినా, ఆయన రచించిన "సింహగిరి వచనాలు" మాత్రం అన్నీ కాకపోయినా కొన్ని మాత్రం తాళ లయలు కలిగి తంబూరా శ్రుతితో పాడుకోవడానికి వీలైన గేయ రచనలే. ఇవే అతని వచన సంకీర్తనలు. రచనా కాలం గుర్తింపదగినవి మనకు దొరికిన వాటిల్లో మొదటివి అనుకోవచ్చును. వీటినే బహుశః నాటి వైష్ణవాలయాల్లో సంకీర్తన చేసేవేళ సంకీర్తన పరులు పాడుతూ ఉండే వారేమో.

అనిబంధ పదాలకు, ఒక విధంగా చూర్ణాళ్ళు పదాలకే కాక, తాళ గంధి వచనాలకూ పరికల్పకుడు, ఆద్యుడు కృష్ణమాచార్యులు కాగా, సంకీర్తన పద కవితల విషయంలో ఆస్థానాన్ని తాళ్ళపాక అన్నమాచార్యులు అలంకరించారు. కృష్ణమాచార్యుని కాలంలోని వైష్ణవాలయాలలోని శాసనాలలో కొన్నింట గల సంకీర్తన సేవా ప్రశంస ఈ రచనలే ప్రథమ పద కవితలని నిర్ధారిస్తున్నాయి.

పద కవితలను సృష్టించిన వారు వాగ్గేయ కారులు. మానవుని జ్ఞానం, ఆధ్యాత్మికం, కళాత్మకం, వైజ్ఞానికం, సాహిత్యంలో విజ్ఞాన దాయకమైనవి పురాణాది గ్రంథాలు. కళాత్మకమైనవి నాట్య శాస్త్రాది గ్రంథాలు. కాల క్రమేణ కళా సంబంధి, ఆధ్యాత్మిక సంబంధి విషయాలు వేళవించి కొంతమంది రచనలు చేశారు. అలాంటి వారిలో వాగ్గేయకారుల స్థానం ప్రశంసనీయమైంది. భారతీయ తత్త్వం, భక్తి తత్త్వంతో పాటు పద కవిత సైతం ప్రారంభమైంది. భగవంతుని భజించుటకు పదములను వాడి, పదమునకు

1.2. తెలుగు పద కవిత డా॥ ఎస్ . గంగప్ప.

మాన్యతను కల్పించారు. ఈ పదాలను వ్రాసిన వారిని "పద కర్తలు, పదకారులు"[1] అని అంటారు. ఈ పదకర్తలనే వాగ్గేయకారులని అంటారు. ఈ వాగ్గేయ కారులే సంగీత కళా సృష్టికి హేతువులు. వారే సంగీత కళాభివృద్ధికి దోహదం చేశారు. భారతీయ సంగీత కళ దినాదినాభివృద్ధి చెంది, ప్రపంచంలోనే ఒక ప్రముఖ స్థానం పొందడానికి ఈ వాగ్గేయ కారుల కృషే కారణం అయింది. మరి ఈ సంగీత కళకు గల ప్రాశస్త్యాన్ని గూర్చి ప్రస్తావించడం అవసరం.

### 3.0.4. సంగీత కళా ప్రాశస్త్యం :

సంగీత కళాభివృద్ధికి కృషి చేసిన సంగీత మహర్షులెందరో కలరని శార్ఙ్గదేవుడు తన సంగీత రత్నాకరంలో ఈ శ్లోకాల్లో విశద పరచాడు.

"సదా శివశ్శివా బ్రహ్మ భరతః కశ్యపో మునిః
మతంగో యాష్టి కో దుర్గా శక్తిః శార్దూల కోహలా
విశాఖిలో దత్తిలశ్చ కంబలోశ్వతరస్తథా
వాయుర్విశ్వావసూరంభారుజున నారద తుంబురాః
ఆంజనేయో మాతృ గుప్తో రావణో నందికేశ్వరః
స్వాతిర్గుణో బిందు రాజః క్షేత్ర రాజశ్చ రాహుః
రుద్రటో నాన్య భూపాలో భోజ భూ వల్లభస్తథా
పరమర్దేచ సోమే-శో జగదేక మహీపతి :
వ్యాఖ్యాతాలో భారతీయే లోల్లటోద్భట శంకుకాః
భద్రాభినవ గుప్తశ్చ శ్రీమత్కీర్తి ధరోపరః
అన్యేచ బహువః పూర్వేయే సంగీత విశారదాః"[2]

ఈ శ్లోకాలను గమనిస్తే సదాశివ భవాన్యాదులు సంగీత శాస్త్ర కర్తలైన పూర్వాచార్యులనీ, వీరు గాక ఇతరులనేకులు గలరనీ, సంగీత రత్నాకరమున చెప్పబడింది.

" నాదో పాసన యాదేవా బ్రహ్మ విష్ణు మహేశ్వరః
భవన్తు నపాసి తానూనం యస్మాదేతే తదాత్మకాః"[3]

నాదం వలన, అక్షరమును, అక్షరం నుండి శబ్దములును, శబ్దం నుండి వ్యవహారమును కలిగెను కనుక లోకములన్నీ నాద స్వరూపంగా ఉన్నాయని శార్ఙ్గ దేవులు మొదలైన పండితులు చెప్తున్నారు. "సంగీత శాస్త్రం" అంటే ఏమిటో నిర్వచించారు సంగీతజ్ఞులు ఈ విధంగా

"విఘ్నౌఘ హారిణ సర్వ భక్తాభి మతకారణం
వారణాస్య మహం వందే మౌళావర్ధేందు ధారిణం"[4]

"శ్రీమదఖండ పరిపూర్ణ సచ్చిదానంద పరమాత్మ స్వరూపుడైన భగవంతుని చేత శ్రోత్రానందమును, ఆత్మానందమును కల్గించు నాదములు రంజనములు గలుగునట్లు విభాగించి యేర్పఱచబడిన విద్యను సంగీత శాస్త్ర[5]మందురు. గీతం(గానము) వైదిక గానం, వ్యాఖ్యా గానం, లౌకిక గానం, కేవల లౌకిక గానం అని నాలుగు విధాలు.

1. పద సాహిత్యంలో రాగాలు - శ్రీ ఎం. శ్రీనివాస్ సింగ్ (సప్తగిరి 1994, మే) పుట 21.
2,3. సంగీతసంప్రదాయప్రదర్శిని (అనువాదకులు-ఆచార్య నోరినాగభూషణం)పుట45,-సుబ్బరామదీక్షితులు
4,5. సంగీత లక్షణ సంగ్రహము (సంగీత సంప్రదాయ ప్రదర్శిని , పుట 54 - సుబ్బరామ దీక్షితులు.

1. సామగానాన్ని వైదిక గానమనీ,

2. ఋషి ప్రోక్తాలైన గద్యం, పద్యం లేక గద్య పద్యాలుగా ఉండే రామయణాది గ్రంథాల్లో గానాన్ని వ్యాఖ్యాన గానమనీ,

3. సంస్కృత భాషలోను, దేశ భాషలలోను దేవతా స్తుతులుగా నిబద్ధముగా గాని, అనిబద్ధముగా గాని చేసే గానాన్ని లౌకిక గానమనీ

4. దేవతా స్తుతులు లేకనే చేసే గానాన్ని కేవల లౌకిక గానమనీ వ్యవహరిస్తారని "సూతా సంహిత"లో చెప్పబడి ఉంది. భక్తితో చేసే స్తోత్ర గానం యొక్క ప్రయోజనాన్ని ఈ శ్లోకం విశదీకరిస్తుంది.

" గీత గానేన యోగస్స్యాత్ యోగా దేవ శివైక్యత:
గీతి జ్ఞోయది యోగేన నయాతి పరమేశ్వరం (సూత సంహిత)[1]

కనుక భక్తితో ఒక దేవతను గూర్చి గానం చేసే గాయనులకు చిత్తైకాగ్రత కలుగుతుంది. చిత్తైకాగ్రతయే యోగం. యోగం చేత పరమాత్మైక్యత్వం కలుగుతుంది. మరియు

"కావ్యాలాపాశ్చయే కేచి దీతాని సకలానిచ
శబ్దమూర్తి ధరస్యైతే విష్ణోరంశా మహాత్మన:" (విష్ణు పురాణము)[2]

సంగీతం భగవదంశమని తాత్పర్యం. భగవంతుడు ఎక్కడైతే గానం చేసే భక్తులుంటారో అక్కడే నివసిస్తాడని నారదునికి ఈ విధంగా చెప్పాడు.

"నాహం వసామి వైకుంఠేన యోగి హృదయేరవౌ
మద్భక్తా యత్ర గాయంతే తత్ర తిష్ఠామి నారద"[3]

ఓయి నారద ! నేను వైకుంఠమందును, యోగీశ్వరుల హృదయములందును, సూర్య మండలమందును వసింపలేను. నాదు భక్తులు ఎచ్చోట గానము చేయుచున్నారో అచ్చటనే వసింపుచున్నాను. అని భగవద్వాక్యము. " గాంధర్వ వేదం"గా పరిగణించిన సంగీత కళ వల్ల కలిగే ప్రయోజనాన్ని ఈ క్రింది శ్లోకం తెలియజేస్తుంది.

"ఏకం సంగీత విజ్ఞానం చతుర్వర్గ ఫలప్రదం" (శివ సర్వస్వము).[4]

దాన యజ్ఞ జపాదులన్నీ త్రివర్గములై ధర్మార్థ కామ మోక్షాలనిస్తున్నాయి. సంగీత జ్ఞానమొకటే చతుర్వర్గములైన ధర్మార్థ కామ మోక్షాలనిస్తుందని పరమేశ్వర వాక్యం. సంగీతాన్ని గాంధర్వ వేదమంటారు. గాంధర్వం పదునెనిమిది విద్యలలో ఒకటి. ఈ పదునెనిమిది విద్యలకు సృష్టికర్త పరమేశ్వరుడే. మహా భారతంలో ఈ విధంగా సంగీతాన్ని గూర్చి ప్రశంసింపబడి ఉంది.

"అష్టాదశానాం ఏతానం విద్యానాం భిన్న వరేత్మనా:
ఆది కర్తాకవిస్సాక్షా చ్ఛూల పాణిరితి శ్రుతి:"[5] అని మహాభారతంలో శాంతి పర్వంలో రాజధర్మంలో చెప్పబడింది. ఎల్లప్పుడూ గానం వినవలెననే కాంక్ష చేతనే పరమేశ్వరుడు కంబళ అశ్వ తరులనే నాగ రాజులను కుండల రూపాలుగా ధరించుకొని ఉన్నాడని సంగీత రత్నాకర వ్యాఖ్యాకారులైన కల్లినాథులు వచించారు.

గానం వలన సర్వజ్ఞుడైన సదాశివుడును, వేణు గానం వలన విష్ణువును, సామ గానం వలన చతురాననుడును, వీణా గానం వలన సరస్వతియును ప్రీతి పొందుచున్నారు. జ్ఞాన హీనములైన శిశు పశు ఫణి మృగాదులు గాన రస వశమౌతున్నాయి. గానం చేత చేతనాలు, అచేతనాలును, అచేతకాలు

1,2,3,4,5 . సంగీత సంప్రదాయ ప్రదర్శిని - పుట 54, సుబ్బరామ దీక్షితులు.

చేతనాలుగా కావడం వలన మానవుడు సంగీత జ్ఞానాన్ని కలిగి తృప్తి పొందడం జరుగుతున్నది.

"సంగీత సాహిత్య రసానభిజ్ఞ

స్సాక్షాత్పశు: - పుచ్ఛ విషాణ హీన:"[1] అనే ఈ ప్రాచీన శ్లోకమునందు సంగీత రసం తెలియని మనుష్యుని, తోక కొమ్ములు లేని పశువుగా చెప్పియుండటం వలన యీ పశువు అద్భుతమైన పశువని తలంచవలెను. ఇది గాక ఆంగ్లేయ భాషా పండితుడైన 'షేక్స్పియర్' అనే మహాకవి సంగీతం వలన కరగని మనుష్యుడు, ప్రాణ హింస, రాజ ద్రోహం మొదలైనవి చేయడానికి భయ పడతాడని చెప్పాడు.

"సామ వేదాదిదం గీతం సంజగ్రాహ పితామహ:" (సంగీత రత్నాకరం)

అని సంగీత రత్నాకరమందు శార్ఙ్గ దేవులచే చెప్పబడిన సంగీతాచార్యులలో మూడవ ఆచార్యులైన బ్రహ్మదేవుడు సప్త స్వరాలు గల సామ వేదం నుండి సంగీతాన్ని గ్రహించాడు.

"తస్య గీతస్య మాహాత్మ్యం కే ప్రశంసితుమీశతే

ధర్మార్థ కామ మోక్షాణామిద మేవైక సాధ్యం" (సంగీత రత్నాకరం)[2]

ధర్మార్థ కామ మోక్షాలకు యీ సంగీతమే ముఖ్య సాధనంగా ఉంది. కాబట్టి యీ సంగీతం ప్రముఖ విద్య అయింది. మిగుల మహిమ గలదిగా ఉంది.

"వీణా వాదన తత్త్వజ్ఞ: శ్రుతి జాతా విశారద:

తాళజ్ఞశ్చా ప్రయాసేన మోక్ష మార్గం సగచ్ఛతి"[3] (యాజ్ఞ వల్క్యస్మృతి)

వీణా నాదం స్వభావాన్ని ఎఱిగిన వాడును, శ్రుతి జాతుల వివేచనాలు తెలిసిన వాడును, తాళాన్ని తెలిసిన వాడుగా ఎవడున్నాడో వాడు ప్రయాసము లేక మోక్షాన్ని పొందుతున్నాడు. మహా భూతాలునూ గానానికి స్వాధీనమవుతున్నాయని పలు విద్వాంసుల చరిత్రల ద్వారా తెలుస్తుంది.

**నాదము :**

సంగీతానికి ఆధారం నాదం.

"నకారం ప్రాణనామానందకారమనలం విదు:

జాత: ప్రాణాగ్ని సంయోగాత్తేన నాదోభిధీయతే".[4]

నాద శబ్దమున గల నకారం ప్రాణమనీ, దకారం అగ్నిఅనీ, సంజ్ఞ కావున ప్రాణాగ్ని సంయోగం వలన నాదం కలుగుతుంది.

" ననాదేన వినాగీతం ననాదేన వినాస్వర:

ననాదేన వినా రాగ: తస్మాన్నాదాత్మకం జగతా"[5]

నాదం లేనిచో గీతమును, నాదం లేనిచో స్వరమును, నాదం లేనిచో రాగమును లేవు. కనుక ప్రపంచం నాద స్వరూపంగా ఉంది. మనుష్య శరీరంలో ఆకాశాగ్నులు సంబంధించి వాయు కంపం వలన గలిగే సూక్ష్మ ధ్వనులే నాదాలు. ఆ దానాలు హృదయం, కంఠం, శిరస్సు అనే మూడు స్థానాలలో వ్యాపించి ముఖం నుండి వెలువడుచున్నది.

శ్లో॥ నాదాచ్ఛ్రుతయో జాతా స్తేభ్యో షడ్జాదయ స్వరా:

తేభ్యో రాగ స్సముత్పన్నో గీతం తస్మాచ్ఛజాయతే

అతోనాదాత్మకం గీతం వాద్యం గీతానువర్తిచ"[6]

1,2,3,4,5,6 . సంగీత సంప్రదాయ ప్రదర్శిని - పుట 54 (మొదటి సంపుటం), "సుబ్బరామ దీక్షితులు".

నాదం వలన శ్రుతులును, శ్రుతుల వలన షడ్జాది స్వరాలును, స్వరాల వలన రాగమును, రాగం వలన గీతమును కలుగుతున్నది. కాబట్టి గీతం నాద స్వరూపం. వాద్యం గీతాన్ని అనుసరించింది. సంగీతం జాతి సంస్కృతికి ప్రతీక. దానిని పరిరక్షించుకోవడం ఒక బాధ్యత అయితే, దానిని రాబోయే తరాలకు అందించడానికి ప్రయత్నించడం ఒక యజ్ఞం. "దేవతలందరూ సంగీత మహర్షులే" అని శార్ఙ్గ దేవుడు ఒక శ్లోకంలో ఈ విధంగా తెలియజేశాడు. బ్రహ్మదేవుడు సామవేదం నుండి ఈ గీతాన్ని గ్రహించాడు.

*"గీతేన ప్రీయతే దేవః సర్వజ్ఞః పార్వతీ పతిః*
*గోపీపతి రనంతో పి వంశ ధ్వని వశంగతః*
*సామగీతి రతో బ్రహ్మ వీణాసక్తాం సరస్వతీ*
*కిమన్యే యక్ష గంధర్వ దేవ దానవ మానవాః"*[1]

సర్వజ్ఞుడగు పార్వతీ పతి గీతంచే ప్రీతుడగును. శ్రీకృష్ణుడు, ఆది శేషుడును వేణు నాద వశులైనారు. బ్రహ్మ దేవుడు సామగాన నిరతుడగును, సరస్వతీ దేవి వీణానురక్తమగును. అన్యులగు యక్షులు, గంధర్వులు, దేవతలు, దానవులు మానవులు అందరూ సంగీతానికి వశులైన వారే.

"వాగ్గేయ కారులు" పద కవితాభివృద్ధికి విశిష్ట కృషి చేశారు. ఈ పద కవులందరూ సమాజ కవులు గా ప్రసిద్ధి గాంచారు. భక్తితో సమాజంలోని అసమానతలను తొలగించడానికి ప్రయత్నించారు. పదకవితా వికాసానికి వీరి కృషి దోహదం చేసింది.

## 3.0.5. పద కవితా వికాసం :

తెలుగులోని పదకవితలకు తాళ్ళపాక అన్నమాచార్యుడే ఆద్యుడు. "పద కవితా పితామహుడుగా ప్రసిద్ధి గాంచిన అన్నమయ్య, తాళ్ళపాక పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య, చిన్నన్న, తాళ్ళపాక తిమ్మక్క మొదలైన తాళ్ళపాక కవులు ఈ పద కవితా వికాసానికి ఎనలేని కృషి చేసి, శ్రీ వేంకటేశ్వర స్వామిపై ఎన్నో కీర్తనలు వెలయించి తరించారు. అన్నమాచార్యునితో ప్రారంభమైన తెలుగు పద కవిత క్షేత్రయ్యతో ఒక స్థిర రూపం పొంది, సారంగపాణితో విస్తృత రూపం పొందింది. శృంగార పదాలకు ఈ ముగ్గురు పద కవులను పేర్కొనవచ్చు.

గోవింద సామయ్య, కూన సామయ్యలు అన్నదమ్ములు. దక్షిణాంధ్ర యుగం నాటి నాయక రాజుల కాలంలోని పదకవులు వీరిరువురు. కార్వేటి నగరం ఆస్థానంలోనే వాగ్గేయ కారులై వెలిశారు. గోవింద స్వామి భరత నాట్య శాస్త్ర కోవిదుడు. వారి తర్వాత ఘనం శీనయ్య, మధుర, విజయ రంగ చొక్కనాథ అమాత్యుల్లో ఒకడైన వంగల శీనయ్యే ఈ ఘనం శీనయ్య. ఇతడు వాగ్గేయకారుడు, సంగీత సాహిత్య నిధి. ఇతడనేక పదాలు రచించాడు. అన్నమయ్యకు ముందు కృష్ణమాచార్యుడు అనిబంధ పదాలైన వచనాలు రచించాడు. అవే "సింహగిరి వచనాలు". అన్నమాచార్యులు సంకీర్తనలనీ, పదాలనీ రచించాడు. శృంగార రస ప్రధానమైన ఆధ్యాత్మ శృంగార సంకీర్తనలు, ఇతర సంకీర్తనలు రచించాడు. అన్నమయ్య సంకీర్తనల్లో ఏలలు, కోలలు, చందమామ పదాలు, సువ్వాలలు, ఛాంగు భళాలు, తందానా పదాలు మొదలైనవి ఎన్నో జానపద గేయ రీతులు చోటు చేసుకున్నాయి. ఈయన కుమారుడు పెద తిరుమలాచార్యుడు, మనుమడు చిన తిరుమలాచార్యుడు ఈయన మార్గంలోనే రచనలు చేశారు. వీరందరు శ్రీనివాసుని భక్తులు. శ్రీ తిరుమల వేంకటేశ్వరుని అర్చించి, సేవించి, తరించిన భక్తులు.

క్షేత్రయ్య కేవలం శృంగార పదాలను రచించాడు. మువ్వ గోపాల పదాలు వ్రాశాడు. మొవ్వ గ్రామంలో వెలసిన శ్రీ గోపాల స్వామిని సేవించిన భక్తుడు. ఆధ్యాత్మ శృంగార పదాలు రచించాడు. "క్షేత్రయ్య" రచనలను, పదాలు అన్నారు. అన్నమయ్యవి సంకీర్తనలు. రామదాసు, సారంగపాణి, త్యాగరాజు ఈ పద రచనా పథంలో క్రమంగా ఉన్నత శిఖరాలను అధిరోహించారు. "రామదాసు" కీర్తనలు రామభక్తి ప్రధానమైనవి. సారంగపాణి కీర్తనలు రచించాడు. శృంగార ప్రధానమైన పదాలు రచించాడు. "త్యాగరాజు" రామభక్తుడు శ్రీరామభక్తిని చాటే కృతులు సంగీత ప్రధానమైనవి ఎన్నో రచించాడు.

1. సంగీత రత్నాకరం - శార్ఙ్గ దేవుడు (సంస్కృతం), తెలుగు అనువాదం - గంధం శ్రీరామమూర్తి పుట 5

రామదాసు కీర్తనలు - సాహిత్య ప్రధానమైనవి "భజన సంప్రదాయ" కీర్తనలుగా ప్రసిద్ధి గాంచాయి. త్యాగరాజ కృతులు సంగీత ప్రధానమైనవి. శిష్ట సంగీతానికి చెందినవి. సంప్రదాయ సంగీతానికి చెందినవి. కర్ణాటక సంగీత ప్రక్రియకు చెందిన కృతులు ఇవి. సంప్రదాయ సంగీతాన్ని అభ్యసించిన వారే ఈ కృతులను ఆలపించగలరు. కాని రామదాసు కీర్తనలు అలా కాక కొలదిగా పాడగల వారైనను ఈ కీర్తనలు గానం చేయగలరు.

అన్నమయ్యలో సంగీతం కంటే సాహిత్యం ప్రాముఖ్యం వహించగా, క్షేత్రయ్యలో సంగీత సాహిత్యాలకు సమ ప్రాధాన్యంతో పాటు అభినయం జోడింపబడి ఉండగా, క్రమంగా త్యాగరాజులో సంగీతం విశిష్టమై ఉంది. తెలుగుదనానికి, ముఖ్యంగా రాయలసీమ మాండలిక పద ప్రయోగానికి అన్నమయ్యలో మరింతగా తెలుగు తేటదనం స్పష్టమైంది. " ఈ తాళ్ళపాక పద కవిత్రయం వారి కృషి వల్ల ప్రామాణికతనందుకొన్న తెలుగు వారి పద కవితలు తరువాత యక్షగాన ప్రక్రియని, ఆట భాగవతాలను అలంబనం చేసుకొని ఎంతగానో ప్రసిద్ధిని , ప్రచారాన్ని పొందాయి. రుద్రకవి సుగ్రీవ విజయం ప్రాచీనమైన ప్రసిద్ధ ఉదాహరణం. అందులోని ద్విపదలు, ధవళాలు, జంపెలు, అర్థ చంద్రికలు, ఏలలు, సువ్వాలలు, జోలలు, బహు ప్రచారం గాంచినవే. అలాగే నారాయణ తీర్థుల వారి సంస్కృతాంధ్రాలలో రచించిన శ్రీ కృష్ణలీలాతరంగిణి, పారిజాతాపహరణం వంటి యక్షగానాలు, కూచిపూడి భాగవతుల కలాపాలు అనబడే ఆట భాగవతాలూ, నృత్య సంగీత కళా వల్లికలతో సొంపారిన మధుర నికుంజములు"[1] అని పద కవితా వికాసాన్ని గూర్చి శ్రీ వేటూరి ఆనంద మూర్తిగారు పేర్కొన్నారు.

### 3.0.6. యక్షగానాలు - పద కవుల సేవ :

తంజావూరు మండలం పద కవితలకు, వాటికి పట్టం గట్టిన యక్షగాన ప్రక్రియకు కాణాచి. నాటి పద కవుల పద రచనా విశేషాలు ఎన్నదగినవి. విజయ రాఘవ నాయకుడు, వేంకట మఖి, రంగాజమ్మ, మన్నారు దేవుడు మొదలైన వారు ఈ పద కవిత్వానికి ఎనలేని సేవ చేశారు. మహారాష్ట్రుల ఏలుబడిలోనూ, తంజావూరు మండలం పద కవితల కెంతో ప్రోత్సాహం లభించింది. నాటి మధుర, మైసూరు మండలాలు ఇలాగే పద కవితల నాదరించాయి.

ఘనం శీనయ్య నాడు పేరు మోసిన వాగ్గేయకారుడు. కాళహస్తి వలె, కార్వేటి నగరం, వేంకటగిరి పద కవులకు పుట్టినిళ్ళయినాయి. (క్రీ.శ. 17,18 శతాబ్దుల మధ్యవారు వీరు). తాళ్ళపాక కవిత్రయం తర్వాత క్షేత్రయ్య, ఘనం శీనయ్య, సారంగ పాణి, సభాపతయ్య అన్న వారిని శృంగార పద కవి చతుష్టయంగా పేర్కొనవచ్చును. సంగీత త్రిమూర్తులైన శ్యామ శాస్త్రులు, ముత్తుస్వామి దీక్షితులు, త్యాగరాజుల మూలాన పండబారిన అనుభవ యోగ్యమైంది పద కవిత్వం. వెనుకటి సంకీర్తనమే రాగ రంజితమై నాటికి కృతిగా ప్రసిద్ధి కెక్కింది. ఈ మూర్తి త్రయం తరువాత వారి శిష్య పరంపరగా తామర తంపరై సంగీత లత యీనాడు మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుచున్నది. ఈ సందర్భంలో వాగ్గేయకారులు సంగీత కళను పెంపొందించిన తీరును గూర్చి, వారికి సంగీత కళకు ఉన్న అవినాభావ సంబంధం గూర్చి "మైకెల్ గ్లింకా" తెలియజేసిన విషయం ప్రస్తావించడం సముచితం.

1. తెలుగు నాటి - పద కవితలు (వ్యాసం) (1975) (ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక - పుట 178-182)

" A nation creates music - The composer only arranges it" - Mikhail Glinka

"సంగీతమన్నది ఒక జాతి యొక్క జీవ నాడుల స్పందన వల్ల పుడుతుంది. వాగ్గేయ కారులు దానిని క్రమంతో నిబంధిస్తారంతే - మైకెల్ గ్లింకా".[1] ఈ పద కవితా ప్రశస్తిని గూర్చి, దీనికి వాగ్గేయకారుల సేవ గూర్చి రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు ఈ విధంగా వివరించారు.

"పదకవిత విషయ ప్రధానం కాక విషయి ప్రధానమైనది. అంటే ఇతర వ్యక్తుల కంటే వారి అనుభవాల కంటే తన అంతరంగ, బహిరంగానుభవాలనే ముఖ్యంగా వెలువరించేది. ఇట్టి విషయ రచనకు వర్చస్సు నిచ్చే గుణం ఆర్జవం. అంటే తాను అనుభవించిన భావాలనే వెలువరించే అకృత్రిమ స్వభావం. ఇతరుల మెప్పులకో సాంప్రదాయ సంరక్షణకో ఆశపడి తన మనస్సులో నిజంగా లేని భావాలను ఆరోపించుకొని, రచనా వ్యాపారం సాగించే సంత పని గాని, ఆర్జవ గుణమే వ్యవహారంలో కవితలో భావాలకు తీవ్రత, భాషకు పదునైన తీర్పు ఈయగలిగేది".[2] అని రాళ్ళపల్లి వారు పద కవిత్వం గూర్చి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఈ విధంగా తాళ్ళపాక కవులతో ప్రారంభమైన పద కవితా సాహిత్యం దిన దినాభివృద్ధి చెంది, క్షేత్రయ్య, రామదాసు, సారంగపాణి మరియు త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామ శాస్త్రి అనే సంగీత త్రిమూర్తుల కాలం నాటికి మూడు పూవులారు కాయలుగా అభివృద్ధి చెందింది. మకుటాయమానంగా పద సాహిత్యం తెలుగులో నిలవడానికి వాగ్గేయకారుల సేవ ఎన్నదగింది. పద సాహిత్యానికి మరి ఈ విధంగా విశిష్ట సేవ చేసిన పద కర్తలందరిలోనూ భక్త రామదాసుగా ప్రసిద్ధి చెందిన కంచెర్ల గోపన్న కీర్తనా సాహిత్యం గూర్చి రామదాసు కీర్తనలకు, ఆయన జీవితానికి గల అవినాభావ సంబంధం గూర్చి, ఈయన కీర్తనలకు గల విశిష్టతను చారిత్రక, సామాజిక నేపథ్యం గూర్చి ప్రస్తావించడం ముఖ్యోద్దేశం.

## 3.1. "కీర్తన ఆవిర్భావం - వికాసం :

"సమాజంలో అవినీతి, అసమానతలు, అధర్మం తాండవించిన తరుణంలో ఆ అసమానతను, అధర్మాన్ని తొలగించడానికి భక్తితో కూడిన సంకీర్తనం ఆయుధంగా చేపట్టి ప్రజలకు మంచిని, నీతిని ఉద్బోధ చేశారీ పద కవులు. సమాజం మూఢాచారాలతో కుల మత విభేదాలతో కృంగిపోతున్నప్పుడు వారు చూస్తూ ఊరుకోలేదు. సమాజాన్ని ఉద్ధరించమని భగవంతునికి మొర పెట్టుకున్నారు. ప్రజలు ఈ విధంగా కావడానికి కారణం ఏమిటని ఆవేదన చెందారు పదకవులు. ఈ ఆవేదన, ఆందోళనలు వీరి పదాల్లో ప్రతిబింబిస్తాయి. ఇది సామాజికమైన నేపథ్యం. ఇక చారిత్రకంగా పరిశీలిస్తే ఈ విషయాలు ద్యోతకమవుతాయి.

## 3.1.0. కీర్తనలు - చారిత్రక నేపథ్యం (సామాజిక నేపథ్యం) :

పద కవుల కాలం నాటికి రాజులు నిర్వీర్యులయ్యారు. బలవంతులైన తురుష్కులు రాజ్యాలను ఆక్రమించడం మొదలు పెట్టారు. మహమ్మదీయులు హిందువులపై దాడి చేయడం మొదలు పెట్టారు. ఈ పరిస్థితిలో హిందూ ధర్మం, సంస్కృతి క్షీణించే ప్రమాదం ఎదురు కావడంతో, మన ధర్మం సంస్కృతి పరి రక్షణకై పద కవులు "హిందూ ధర్మ రక్షణకై నడుం కట్టారు. హిందువులలో భక్తి భావాన్ని రేకెత్తించారు. మన సంస్కృతి గొప్పతనాన్ని చాటే ప్రయత్నం చేశారు. ఈ పరిస్థితిలోనే ఈ కీర్తనలు ఆవిర్భవించాయి.

1. తెలుగువాణి (1975) (ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక), పుట 178-182), పద కవితలు - వేటూరి ఆనందమూర్తి
2. అన్నమాచార్యుల ఆధ్యాత్మ, సంకీర్తనల్లో ఆత్మనివేదన - వేములకొండ విజయవల్లి దేవి ఎంఫిల్, 1988, తె.వి.

15వ శతాబ్దానికి సర్వం రాజ వ్యవస్థ పటిష్టంగా ఉండడం, రాజులు కవులను పోషించిన విధానం, నాడు కవుల కిచ్చిన గౌరవం ఆ కవుల పద్యాల వల్ల తెలుస్తున్నాయి. వీటిని పరిశీలిస్తే ఆనాటి కవులకు భగవంతుని ఉద్దేశించి ఆత్మ నివేదన చేసుకోవలసిన అవసరం అంతగా కనబడదు. తమకేది కావలసినా వారు రాజుల నడిగేవారు. ఆనాడు కవులు (15 శతాబ్దపు పూర్వం) రాజాశ్రయంలో ఉండినవారు. ఆ కాలంలో ప్రజలు కూడా అంత కష్టాలు పడినట్లు కనబడదు. భోగ లాలసత్వంతో జీవితం గడిపారు. వీరు సమాజంలోని అస్తవ్యస్త పరిస్థితుల గూర్చి పట్టించుకోలేదు. శృంగార జీవితాన్ని గడిపారు. ఆ తర్వాత 15 శతాబ్దం మధ్యలో రాజులు బలహీనులయ్యారు. బలహీనులైన రాజులు (రాయల అనంతరం) సంస్థానాధీశులు తమ రాజ్యాలను దక్కించుకోవడానికి తురుష్కులతో చేతులు కలపడం. వారి అధికారాన్ని అంగీకరించడం కోసం ప్రజలపై పన్నులు అధికం చేసి వారిని పీడించే వారు. వీటికి తోడు విజృంభించిన మతోన్మాదం, వివిధ కులాల మధ్య మతాల మధ్య గల తగాదాలు, అగ్ర వర్ణాల ఆధిక్యం ఇవన్నీ కలిసి మూకుమ్మడిగా పద కవుల హృదయాలను కదిలించాయి. రాజు బలవంతుడైనప్పుడు రక్షణ ఇవ్వగలిగి నపుడు ప్రజలు రాజుకు మొరపెట్టుకుంటారు. కాని కంచే చేను మేస్తే ఏమి చేయగలరు. అందుకే పద కవులు తమ ఆవేదనను, సంకీర్తనలు లేక పదాల రూపంలో ఆ భగవంతునికి నివేదించారు. నివేదన చేయడం అంటే నైవేద్యం పెట్టడం. పద కవులు చేసిన ఆత్మ నివేదన భగవంతుని ఉద్దేశించినా, ప్రజలందరికీ అది వర్తిస్తుంది. అంటే వారి కీర్తనల సారాన్ని గ్రహించి వీరి ఆవేదనను అర్థం చేసుకొని ప్రజలు మారాలని, తమకున్న అజ్ఞానాన్ని విడిచిపెట్టాలని పద కవుల ఆకాంక్ష

పైన పేర్కొనబడిన విషయాలను బట్టి "ఋజుత్వమే" జీవ ధర్మంగా బ్రతికేవారు పద కవులని చెప్పవచ్చు. వారు నిరాడంబరమైన జీవితాలను గడిపారు. అందివచ్చిన రాజ భోగాలను తృణీకరించారు. భావ స్వాతంత్ర్యం వారి ఆస్తి. సమాజం వారికి ఉనికిపట్టు. సామాన్య ప్రజానీకం, వారు నివసించే పరిసరాలు, ప్రకృతి వారికి వస్తువులు ఏ అధికార చట్రంలోను బంధింపబడనందున స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ, ఆనంద విషాదాలకు స్పందిస్తూ, తమ అనుభూతులను, ఆత్మానుభవాలను అలవోకగా పదాల్లో ప్రతిబింబిస్తారు. అందువల్ల శ్రవ్య, దృశ్య కావ్యాల్లో కంటే పద కవుల్లో ఆత్మ నివేదన ఎక్కువగా ఉండటానికే అవకాశం ఉంది.

ఆంధ్ర వాఙ్మయంలో, గేయ వాఙ్మయం సహజమైన ప్రజా సాహిత్యానికి లక్ష్యంగా ఉంది. ద్విపదలు, కీర్తనలు, వచనాలు, తుమ్మెద పాటలు, ఏలలు, యక్షగానాలు, గేయ కావ్య రూపంలో కావ్య రసానందాన్ని పామరులకు కలుగ జేస్తుండేవి. రసానుభవానికి సాహిత్యాంగాలైన కావ్యాలు, గేయాలు, కీర్తనలు, కృతులు,పాటలు సాధనాలుగా ఉన్నాయి.

### 3.1.1. చారిత్రకంగా కీర్తనల వికాసం :

కీర్తనల వికాసం ఈ విధంగా ఉంది. "బుద్ధ యుగంలో, మౌర్య గుప్త సామ్రాజ్య కాలంలో, వీర శైవ, వీర వైష్ణవ యుగాల్లో, కాకతీయ, విజయ నగర సామ్రాజ్య కాలాల్లో, వర్తమాన గాంధి యుగంలోను, ప్రజా ప్రబోధం, సాహిత్యాభ్యుదయానికి వినియోగ పడిన విధం, ఆయా కాలాలందు ప్రయత్నంగా, ప్రజా హృదయాంతరాళం నుండి వెడలిన కీర్తనలు, పాటలు, గీతాలు, నాటకాలు మొదలైన సాహిత్య స్వరూపాలు విశదం చేస్తున్నాయి.

### 3.1.1.0. కీర్తన - పరిణామ దశ :

కీర్తన అని ఈనాడు వ్యవహారంలో ఉన్న సంగీత ప్రక్రియకు, పద కవితా పితామహుడు, పద

కవితా మార్గదర్శి అని ప్రసిద్ధి పొందిన అద్వితీయ ప్రతిభాశాలి, ఋషి తుల్యుడూ అయిన తాళ్ళపాక అన్నమాచార్యుల వారు సృష్టికర్త అనడంలో సందేహం లేదు. అన్నమాచార్యుల కాలంలో కీర్తనను పదం అనీ, సంకీర్తనం అనీ వ్యవహరించేవారు. తాళ్ళపాక వారి పదాలు అనే ఆయన రచనలను ఇప్పటికీ అంటూ ఉంటారు. రాను రాను పదం అనే ప్రక్రియ శృంగార ప్రధానమైన రచనలకే పరిమితం కావడం, భక్తి వేదాంత ప్రబోధకమైన సంకీర్తన 'కీర్తన'గా ప్రసిద్ధం కావటం జరిగింది. వాగ్గేయ కార శిఖామణి, మహా భక్తాగ్రేసరుడు అయిన త్యాగరాజ స్వామి కాలంనుంచీ 'కృతి' అనే సంగీత ప్రక్రియ వ్యాప్తిలోకి వచ్చి ఈనాటికీ సర్వ జనాదరణ పాత్రమై సంగీత ప్రపంచంలో ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించింది. "కీర్తన సంప్రదాయానికి ఆద్యులు తాళ్ళపాక వారే అయినా వారికి కొంచెం పూర్వులైన శ్రీపాద రాయ స్వామి, నిజగుణ శివయోగి అనేవారు కర్ణాటక భాషలో భక్తి వేదాంత ప్రబోధకాలైన కీర్తనలు రచించినట్లు వీరి రచనలు కొంతవరకు అన్నమాచార్యులకు మార్గదర్శకాలైనట్లు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారి అభిప్రాయం"[1]. కీర్తనల వికాసానికి వాగ్గేయకారులు చేసిన సేవ ఎనలేనిది. ఈ కీర్తనల వికాసం ఈ విధంగా ఉంది.

### 3.1.2. తెలుగు కీర్తనల వికాసానికి వాగ్గేయకారుల కృషి :

"తెలుగులో సంకీర్తన వాఙ్మయం కృష్ణమాచార్యులతోనే ఆరంభమైంది. కృష్ణమాచార్యుడు సంకీర్తనలు "సింహగిరి వచనాలు" అనే పేరుతో అనేకం రచించారు. ఇవి వచన గంధులు. సింహాచలం దేవాలయంలో ఆయన కీర్తించినట్లు, అతడు 12వ శతాబ్దానికి చెందినట్లు పరిశోధనల వలన తెలియ వచ్చింది"[2] అని విస్సా అప్పారావు గారు తెలియజేశారు. అన్నమాచార్యులు 32 వేల పదాలు - సంకీర్తనలు రచించినట్లు తెలుస్తుంది. అవి శృంగార సంకీర్తనలు, ఆధ్యాత్మ సంకీర్తనలు అని రెండు రకాలు. అన్నమయ్య తెలుగులోనే కాక సంస్కృతంలో కూడా నూర్ల కొలది సంకీర్తనలు రచించాడు.

అన్నమాచార్యుడి కుమారుడు పెద తిరుమలాచార్యుడు తండ్రి వలె ఆధ్యాత్మిక సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు రచించి తండ్రి మార్గాన్ని అనుసరించాడు. చిన తిరుమలాచార్యుడు కూడా తన తాత, తండ్రుల వలె శృంగార సంకీర్తనలు, ఆధ్యాత్మ సంకీర్తనలు రచించి ఉత్తమ పద కవిగా నిరూపించుకున్నాడు. త్యాగరాజస్వామి కృతులు అన్నీ "త్యాగ బ్రహ్మోపనిషత్తు" అనే ప్రసిద్ధి కలిగింది. ఇతడు 2400 కీర్తనలు, కృతులు రచించినట్లు తెలుస్తుంది. అయినా ఈనాడు కొన్ని కృతులు మాత్రమే సంగీత స్వరాల్లో ప్రచారంలో ఉన్నాయి. గేయ వాఙ్మయం నందు శృంగార రస భరితాలైన క్షేత్రయ్య గారి మువ్వ గోపాల పదాలు, తాళ్ళపాక వారి తత్త్వ వచనాలు, త్యాగరాజ స్వాముల వారి కృతులును ఆంధ్ర సాహిత్యానికి సహజాలంకారాలుగా ఉన్నాయి. త్యాగరాజ కృతులాంధ్ర సాహిత్య రసామృతాన్ని దివ్య మార్గాన ప్రసాదిస్తూ బ్రహ్మానందాన్ని గలుగజేస్తున్నాయి. అలాగే "సారంగ పాణి" కీర్తనలు కూడా ప్రసిద్ధి గాంచాయి. భద్రాచల రామదాసు కీర్తనలకు ఈ సంకీర్తన సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం లభించింది.

### 3.1.3. రామదాసు కీర్తనల ప్రాముఖ్యం :

భద్రాచల రామదాసని పేరు పొంది ఆంధ్ర దేశంలోనే కాక, భారత దేశమంతటా ప్రసిద్ధి చెందిన పరమ భక్తాగ్రేసరుడు, వాగ్గేయకారుడు అయిన ఇతని పేరు కంచెర్ల గోపన్న. రక్తికి, భజన గోష్ఠులలో రామదాసు కీర్తనల తర్వాతనే మిగిలిన వారి కీర్తనలకు పేరు. ఇతడు చెరసాలలో ఉంటూ శ్రీరాముని

1. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావుగారు , పుట 76.

2. మొదటి ఆంధ్ర వాగ్గేయ కారుల కృత్య, సంగీత రత్నావళి , పుట 4.

ఆర్తితో వేడుకుంటూ అనేక కీర్తనలు రచించాడు. ప్రసిద్ధమైన రామదాసు కీర్తనలు "తారక మంత్రము కోరిన దొరికెను, పలుకే బంగారమాయెనా, ఏ తీరుగ నను దయ జూచెదవో" మొదలైనవి గలవు. రామదాసు కీర్తనలు, సంగీత సాహిత్యాలందు అంత విశేషం కలవి కాకున్నా భక్తి పారమ్యాన్ని కలిగించే వానిలో మేలు తరాలు. తెలుగునాట ఆబాల గోపాలానికి నోట వచ్చి ఉండేవి. దాసరులనే వారు వాటిని ప్రత్యేకంగా పాడుతూ భజన చేసికొంటూ దేశాటనం చేస్తుంటారు. ఈ కీర్తనల్లో సుమారు ఇరవై అయిదు రాగాలు ఉపయోగించబడినాయి. నాద, నామ క్రియలో చాల కీర్తనలు కలవు. అసావేరి, సావేరి, వరాళి, పున్నాగ వరాళి, పంతువరాళి, ఆనంద భైరవులలో కూడా పెక్కు రచనలు గలవు. ఈ కీర్తనలు భజన కూటాల్లో మిక్కిలి వాడుక గలిగి ఉన్నాయి. ఇవి పద యమకాలలో మహా ధారాళంగా నడచి పోతాయి.

తాళ్ళపాక కవులలోని భక్త్యంశ ఆకృతి దాల్చిన మహనీయుడు రామదాసు. ఈయన భజన కీర్తనలు నేటికీ భజన కూటాల వారికి భక్తులకు ప్రాణ ప్రదాలు. రామభక్తి సామ్రాజ్యాన పరవశించి పాడుకొని తబ్బిబ్బై తన కాలం వారికి భక్త్యమృతాన్ని చూఱ యిచ్చిన మధుర వాగ్గేయకారుడు. పూర్వం యాచకులు, బైరాగులు రామదాసు కీర్తనలను, తత్త్వాలను పాడుతూ ప్రజా హృదయాలలో భక్తి జ్ఞానాలను కలుగ చేస్తుండిరి. ఇంతటి విశిష్టత సంతరించుకున్న రామదాసు కీర్తనలు, ఆయన జీవితానికి సంబంధించిన ముఖ్యాంశాలను, ఆయన కీర్తనల్లో ఎలా ప్రతిబింబించాయో పరిశీలించడం ముఖ్యాంశం.

రామదాసు కీర్తన సాహిత్యం, ఆయన జీవిత విశేషాలను గూర్చి ఇంతకు ముందు కొందరు పరిశోధన చేశారు. ఈయన గూర్చి వెలువడిన పుస్తకాలు, పరిశోధనా గ్రంథాల గూర్చి కొంత ప్రస్తావించడం అవసరం.

## 3.2. రామదాసు కీర్తన సాహిత్యం - పూర్వ పరిశోధనలు :

రామదాసు కీర్తనల సాహిత్యం, జీవిత విశేషాలు, ఇతర రచనలు (దాశరథీ శతకం) గూర్చిన పూర్వ పరిశోధనాంశాలు. రామదాసు జీవిత విశేషాలను, చారిత్రక, సామాజిక అంశాలను తెలియజేసే గ్రంథాలు కొన్ని ఉన్నాయి. వీటిని గూర్చి అందలి అంశాల గురించి క్లుప్తంగా తెలియజేస్తాను.

యక్షగానాలు :

1. 'భక్త రామదాసు చరిత్రము' (శ్రీ భద్రాచల మాహాత్మ్యము మరియు రామదాసు చరిత్రము) అనే గ్రంథం ఒకటి. ఎస్.వి.గోపాల్ అండ్ కో మద్రాసు వారి చేత ప్రచురితమైంది. దీనిని రచించిన గ్రంథకర్త ఎవరో తెలియరాదు. ఇందు 150 రామదాసు కీర్తనలు కూడా ఉన్నాయి. ఇది ఒక యక్షగాన రూపంలో ఉంది. ఇందు భద్రాచల మహాత్మ్యాన్ని గూర్చి రామదాసు జీవిత విశేషాలు గూర్చి, ఈ ఆధారంగా వెలువడిన కీర్తనల గూర్చి ప్రస్తావించడం జరిగింది.

2. 'రామదాస నాటకము' అనేది కేశిరాజు వేంకట సుబ్బరాయకవి కృతం. భక్త రామదాసు జీవిత విశేషాలను చారిత్రకంగాను, సామాజికంగాను తెలియజేసే నాటకం ఇది. ఇది యక్షగాన ప్రక్రియకు చెందిన నాటకం.

3. 'రామదాసు' అనే పేరుతో తెలుగు విశ్వ విద్యాలయం ఒక పుస్తకాన్ని ప్రచురించింది. దానిని శ్రీ తాళ్ళూరి ఆంజనేయులు వ్రాశారు. ఇందులో రామదాసు జీవిత విశేషాలను గూర్చి తెలియజేయడం జరిగింది.

4. శ్రీ భద్రాచల రామదాసు చరిత్రము అనే పుస్తకాన్ని ఒకదాన్ని1952లో సి.వి.కృష్ణా బుక్ డిపో వారు ప్రచురించారు. దీని రచయిత ఎవరో తెలియదు. ఇది పద్య, గద్య రూపంలో ఉంది. మధ్య మధ్య రామదాసు కీర్తనలు కూడా ఇందులో ఉన్నాయి. రామదాసు జీవిత విశేషాలు గూర్చి ప్రస్తావింపబడి ఉంది ఈ పుస్తకంలో.

5. భద్రాచల రామదాసు చరిత్రము (కీర్తనలతో కూడినది) వరద రామదాసు సంక్షిప్తంగా తెలియజేసిన రామదాసు చరిత్ర ఆధారంగా సింగర దాసు "రామదాసు చరిత్రము"ను వ్రాశాడు. ఇది యక్షగానమ రూపంలో ఉంది. మొదట వరద రామదాసు ఈ కథను సంక్షిప్తంగా వ్రాయగా దానిని విస్తృత పరచి సింగర దాసు వ్రాశాడు.

"రామదాసు కథ వరద రామదాస్
రచియించెను సూచనగా,
ప్రేమ తోడ సింగర దాసీ కథ,
ప్రకటన పరచెను బాగా" - దీనిని బట్టి తొలుత ఈ గ్రంథాన్ని వరద రామదాసను సతడు సంగ్రహంగా రచించాడని, సింగరదాసు దీనిని విస్తరించి యక్షగాన రూపంలో వ్రాశాడని తెలుస్తుంది. రామదాసు బాల్యం, వైవాహిక, ఉద్యోగ జీవితాలు, కారాగార జీవితం, కారాగారానంతర జీవితం గూర్చి వివరంగా ఈ గ్రంథంలో చెప్పబడి ఉంది.

6. 'రామదాసు చరిత్రము' అనే యక్షగానాన్ని యాదవ దాసు కూడా రచించాడు.

7. భద్రాచల రామదాసు చరిత్రమును నాటక రూపంలో కూడా కొందరు రచించారు. అందు సుప్రసిద్ధమైన కొన్ని నాటకాలు

8. రామదాస నాటకము - కేశిరాజు వేంకట సుబ్బరాయ కవి.

9. రామదాసు నాటకము - ధర్మవరం గోపాల కృష్ణమాచార్యులు.

10. భక్త రామదాసు అను రామదాసు విజయం - కీ.శే. కేతవరపు శివ రామ శాస్త్రిగారు.

11. గరిమెళ్ళ సత్య గోదావరి శర్మ - గోపన్న (వచన ప్రధానమైంది).

12. రామదాసు నాటకం - డి. వేంకట రమణయ్య.

13. శ్రీ రామదాస చరిత్రము (హిందూస్తానీ నాటకము) - నాదెళ్ళ పురుషోత్తమ కవి.

ఇంకా కొన్ని కావ్యాలు, ఒక బుర్ర కథ రూపంలో కూడా ఈ రామదాసు చరిత్రం వ్రాయబడింది.

14. భక్త రామదాసు (బుర్రకథ) - దుగ్గిరాల గౌరీ మనోహర రావు.

15. రామదాసు చరిత్రము (కావ్యం) - చల్లా పిచ్చయ్య శాస్త్రి.

16. రామదాసు (నాటకం) - రామ నారాయణ కవులు.

17. భద్రాచల రామదాస చరిత్రము (యక్షగానం) - తిరుకడయూరి కృష్ణదాసు

18. కంచెర్ల గోపన్న అను రామదాసు (విమర్శ గ్రంథం) - మిన్నికంటి గురునాథ శర్మ.

ఇవి ప్రధానంగా లభించిన రామదాసు చరిత్రను తెల్పే గ్రంథాలు. ఇంకా రామదాసు చరిత్రను గూర్చి తెల్పే వ్యాసాలు కూడా ఉన్నాయి.

19. పరిశోధనా గ్రంథాలు : విశ్వ విద్యాలయాల్లో రామదాసు జీవిత విశేషాలు, రచనలు గూర్చి కొంత పరిశోధన జరిగింది.

1. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో డా॥ దాశరథుల బాలయ్య గారు, ఆచార్య బిరుదురాజు రామరాజు గారి పర్యవేక్షణలో 1985లో భక్త రామదాసు జీవితము- రచనలు అనే అంశంపై పరిశోధన చేశారు. దానిలోని ప్రధానాంశాలు ఇవి.

1. పద కవిత పుట్టు పూర్వోత్తరాలు, సంకీర్తన లక్షణాలు మొ॥నవి. మొదటి అధ్యాయంలోని చర్చనీయాంశాలు.

2. రామదాసు జీవితం గూర్చి రామదాసు జన్మస్థలం గూర్చిన వివేచన, ఆయన నివాస స్థానం నేలకొండపల్లె అని నిరూపించడం. రామదాసు గురువు రఘునాథ భట్టాచార్యులని నిరూపించడం, అక్కన్న మాదన్నలు రామదాసు మేనమామలని నిరూపించడం, రామదాసు తహసీల్దారైనపుడు ఉద్యోగ జీవితం, కారాగార జీవితం, కారాగారానంతర శేష జీవితం మొదలైన విషయాలను గూర్చి విపులంగా చర్చించడం జరిగింది. రెండవ అధ్యాయంలో.

3. రామదాసు కాల నిర్ణయం, మూడవ అంశం. 1620లో జన్మించి, 1680లో మరణించాడు. అని నిరూపించడం.

4. రామదాసు రచనలు - కీర్తనలు గూర్చి తెలియజేయడం (196 కీర్తనలను బాలయ్య గారు సేకరించారు)

5. రామదాసు కీర్తనల సంఖ్యా నిర్ణయం అయిదవ అంశం .

6. రామదాసు రచనల్లోని భాషా వైభవం గూర్చి క్లుప్తంగా వివరించడం జరిగింది.

7. రామదాసును ఆరాధించిన త్యాగరాజు అన్నది ఏడవ అంశం.

2. రామదాసు కీర్తనలు - స్వర లయ విన్యాసం - సాహిత్య రస పోషణం అనే పరిశోధనా వ్యాసం డా॥ టి.వి. నాగరంజని గారు వ్రాశారు. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారి పర్యవేక్షణలో కేంద్ర విశ్వ విద్యాలయం నందు ఈ అంశంపై పరిశోధన చేశారు. ఇందలి ముఖ్యాంశాలు.

1. సంగీత ప్రక్రియలు - కీర్తన : వివిధ సంగీత ప్రక్రియలైన కీర్తన, కృతి, పదం, జావళి, దరువు, తిల్లాన అనే అంశాల గూర్చి చర్చించడం.

2. ఆంధ్ర వాగ్గేయకారులు - రామదాసు : ఇందు సంక్షిప్తంగా రామదాసును ఇతర వాగ్గేయ కారులతో పోల్చి చూడడం. త్యాగరాజు రామదాసుని ప్రశంసించిన విధం, అన్నమయ్య, శివ నారాయణ తీర్థులు, క్షేత్రయ్య, మునిపల్లె సుబ్రహ్మణ్య కవి, త్యాగరాజాదులతో రామదాసును పోల్చి పరిశీలించడం. ఇది సంక్షిప్తంగా పరిశీలించడం జరిగింది.

3. రామదాసు కీర్తనల్లోని నవరసాలను భక్తి రసం ప్రధానంగా పరిశీలించడం. నవ విధ భక్తి రీతులను గూర్చి చర్చించడం ఇందలి ముఖ్యాంశం (రామదాసు కీర్తనలు - రసానుశీలనం).

4. రామదాసు కీర్తనలు - సంగీత సాహిత్య సమన్వయం.

రామదాసు కీర్తనలలోని స్వర విన్యాసం, వివిధ స్వరాలు, లయ, తాళం, రాగం మొ॥న సంగీతాంశాల గూర్చి శాస్త్రీయంగా పరిశీలించడం. ఈ స్వర లయలతో కూడిన రామదాసు కీర్తనల్లో సాహిత్యం వాటికి ఏ విధంగా దోహద పడింది అనేవి ప్రధాన చర్చనీయాంశాలు.

5. రామదాసు కీర్తనల్లోని ప్రధాన తెలుగు సంగీత సంప్రదాయానికి చెందిన అంశాలు, తెలుగు, కర్ణాటక సంగీతాల మౌలిక భేదాలు, సంప్రదాయ సిద్ధమై తెలుగు సంగీతం, తెలుగు సంగీతంలో రావలసిన మార్పులు. ఇవి చర్చనీయాంశాలు. ఈ సిద్ధాంత వ్యాసంలో ప్రధానంగా రామదాసు కీర్తనలలోని రస పోషణం, భక్తి రసం, వీటిలో సంగీత ప్రధానమైన అంశాలు గూర్చి ప్రస్తావించడం ఉంది.

3. తులసీదాసు వినయ పత్రిక - రామదాసు కీర్తనలు - తులనాత్మక పరిశీలన : ఈ అంశంపై శ్రీహరి గారు పరిశోధన చేశారు. తులసీదాసు వినయ పత్రికలోని దోహాలను, రామదాసు కీర్తనలతో సమన్వయం చేసి తులనాత్మకంగా పరిశీలించారు శ్రీహరి గారు.

4. రామదాసు - త్యాగయ్య అనే గ్రంథం డా॥ కె. సర్వోత్తమన్ గారు వ్రాశారు. ఇది కూడా పరిశోధనా గ్రంథమే. రామదాసు కీర్తనల ప్రభావం త్యాగరాజు కృతులపై ఏవిధంగా ఉందో పరిశీలించారు.

5. శ్రీమతి అశోక కుమారి గారు శ్రీ భద్రాచల రామదాసు కీర్తనల్లో భక్తి మరియు రస పోషణ అనే అంశంపై పరిశోధనా వ్యాసం వ్రాశారు. (తె.వి.) ఇవి రామదాసు సాహిత్యంపైన వచ్చిన పరిశోధనా వ్యాసాలు.

13. బాలాంత్రపు రజనీకాంతరావుగారు "రామదాసు జీవిత చరిత్ర" గూర్చి పరిశోధించి వ్యాసాలు వ్రాసారు.

రామదాసు అని విఖ్యాతి పొందిన యీ గోపన్న గారి జీవిత చరిత్రను గూర్చి గాని, ఆయన రచనలు గూర్చి గాని, లోకంలో ప్రచారంలో ఉన్న కీర్తనలను గూర్చి గాని, ఇంత వరకు పై రెండు మూడు పరిశోధనాంశాలు తప్ప, కూలంకషంగా ఇంకా పరిశోధనలు చేసిన వారు చాలా అరుదు. ఈయన గూర్చి , ఈయన సాహిత్యం గూర్చి ఇంకా పరిశోధించాల్సిన అవసరం ఉంది. " సుమారు 25,30 ఏళ్ల క్రితం శతక కవుల చరిత్రలో దాశరథి శతక కర్త అయిన గోపన్న చరిత్రమును కీ.శే.వంగూరి సుబ్బారావుగారు అంత వరకూ సంశయాస్పదాలైన కొన్ని అంశాల చారిత్రకతను వితర్కించి, కొన్ని నిర్ణయాలు చేశారు. కీ.శే. భావరాజు వేంకట కృష్ణారావు గారు భారతి పత్రికలోను, వేదం లక్ష్మీ నారాయణ శాస్త్రి గారు పీఠికలోను రామదాసు కాల నిర్ణయాన్ని చారిత్రకాధారలతో నిరూపించారు.

ఇంతవరకు పేర్కొన్న రామదాసు చరిత్రను గూర్చిన యక్షగానాలు, నాటకాలు, కావ్యాలు, బుర్ర కథలు, ఇంకా ఇతర రచనల్లోని ప్రధాన కథాంశం ఇది. " గోపన్న గారు అపారమైన రామభక్తితో సర్కారు పైకాన్ని వెచ్చించి భద్రాద్రి రామాలయానికి మరమ్మత్తులు, దేవుని కైంకర్యం చేయించినందుకు గోల్కొండ నవాబు ఆగ్రహానికి గురై, రామదాసు కారాగార శిక్ష పొందడం, నవాబు అనుచరుల ద్వారా అక్కడ 12 ఏళ్ళు కఠిన నరకం అనుభవించడం, ఆర్తితో నిత్యమూ అనేక కీర్తనలతో ఆ రాముని వేడుకోవడం, రాముడు దయ తలచి తమ్మునితో సహా సుల్తానుకు కలలో కనబడి, పైకం చెల్లించి, రసీదు పొంది, రామదాసును చెర నుండి విడిపించడం జరిగింది. ఈ ఘట్టం ఆంధ్రులందరికి రంగస్థల నాటకాల ద్వారా, హరికథలుగానూ, యక్షగానాలుగాను, వివిధ రామదాసు చరిత్ర గ్రంథాల ద్వారా చిర పరిచితమైంది.

"రామదాసు మేనమామలు అక్కన్న మాదన్నలని, తానీషా వద్ద రామదాసు తహసీల్దారుగా భద్రచలం పరగణాకు నియమించడబడడం, సర్కారు పైకం ఆరు లక్షల వరహాలను భద్రాచల ఆలయ నిర్మాణానికై ఖర్చు చేసి ఆ తర్వాత ఖైదులో ఉంచబడడం, 12 సంవత్సరాలు కష్టాలు పడడం, ఆ తర్వాత విడుదల కావడం ఇది కథ.

"రామదాసు చరిత్రమును హరికథలుగా వ్రాసిన వారిలో యాదవ దాసు ఒకడు. సింగర దాసు, నరసింహ దాసు, తిరుక్కడయూరి కృష్ణదాసు అనువారి పేర్లు కనబడుతాయి. వీరిలో సింగర దాసు, నరసింహ దాసు ఒకరేనేమో అనిపిస్తుంది. నరసింహ దాసే (తూము నరసింహ దాసు కావచ్చు). మనము రామదాసు కీర్తలను అని చెప్పకునే వాటిలో కొన్ని ఈ ఇతర హరిదాసుల కీర్తనలు అని తగ్గించినా, శైలిని బట్టి, భద్రగిరి రామదాసు ముద్ర గల చివరి చరణాలను బట్టి 100,108 కీర్తనలయినా రామదాసు కవనలుంటాయిని తోస్తుంది."[1]

దాశరథుల బాలయ్య గారు 198 కీర్తనలను రామదాసు ముద్రతో కూడినవిగా భావించి సేకరించి ప్రచురించారు. ఇవన్నీ రామదాసు కీర్తనలు. ఈ విధంగా ఇంతవరకు రామదాసు రచనల గూర్చి ఆయన జీవిత విశేషాలు గూర్చి పరిశోధన జరిగింది. ఇవే గాక ఇంకా కొందరు రామదాసు జీవిత విశేషాలు, రచనలు, దాశరథీ శతకం గూర్చి వ్యాసాలు వ్రాశారు.

1. రామదాసు కీర్తనలు - సం. మంచాళ జగన్నాథ రావు పీఠిక బాలాంత్రపు రజనీకాంతరావు గారు, పుట 6,7.

నాల్గవ అధ్యాయం

# తహసీల్దారుగా రామదాసు వ్రాసిన కీర్తనలు

# నాల్గవ అధ్యాయం

# తహసీల్దారుగా రామదాసు వ్రాసిన కీర్తనలు

### 4.0. గృహస్థాశ్రమ జీవితం :

రామదాసుకు తారక మంత్రోపదేశం చేసిన గురువు రఘునాథ భట్టాచార్యులు. వైష్ణవం కూడా ఇచ్చింది ఈ గురువే అని ఇంతకుముందు అంశంలో తెలుసుకున్నాం. తారక మంత్రోపదేశం అయినపుడు ఆనందంతో "రామనామం" పొందిన తాను ధన్యుడనైతిని అని ఆనందిస్తూ రాముని కీర్తించాడు.

**"ధన్యాసి-ఆది".**

" తారక మంత్రము కోరిన దొరికెను
ధన్యుడనైతిని ఓరన్నా
మీరిన కాలుని దూతల పాలిటి
మృత్యువె యని నమ్మరయన్నా ॥
మచ్చికతోనిక పాతకంబుల
మాయలలో పడబోకన్నా
హెచ్చుగ నూట యెనిమిది తిరుపతు
లెలమి తిరుగ పని లేదన్నా ॥
ధర్మము తప్పక భద్రాద్రీశుని
తన మదిలో నమ్ముచునున్న
మర్మను దెలిసిన రామదాసుని
మందిరమున కేగుచునున్న ॥[1]

ఈ విధంగా తారక మంత్రోపదేశం అయిన నాటినుండి శ్రీరామ కైంకర్యమందే అహోరాత్రులు గడుపుతుంటాడు. ఆనాడు గోల్కొండ రాజ్యంలో ఒక సంవత్సరం పాటు కరువు రాగా దాన ధర్మాలతో ప్రజలను ఆదుకోవడంతో తన ఆస్తి అంతా తరిగిపోయింది. పేదరికం అనుభవించ వలసివస్తుంది. పూట గడపటం కూడా కష్టమైపోతుంది. ఆ సమయంలో భార్య, బిడ్డలను పోషించే స్థితిలో లేక రామదాసు తన కష్టాలు కడతేర్చమని, తనపై దయ చూపుమని రాముని ఈ విధంగా వేడుకుంటున్నాడు.

**"నాదనామ క్రియ - ఆది"**

ఏ తీరుగ నను దయజూచెదవో ఇన వంశోత్తమ రామా
నా తరమా భవ సాగర మీదను నళినదళేక్షణ రామా ॥
శ్రీ రఘునందన సీతా రమణాశ్రితజన పోషక రామా
కారుణ్యాలయ భక్త వరద నిను కన్నది కానుపు రామా॥
క్రూరకర్మములు నేరక జేసితి నేరము లెంచకు రామా
దారిద్ర్యము పరిహారము చేయవె దైవ శిఖామణి రామా॥
వాసవనుత రామదాస పోషక వందనమయోధ్య రామా
దాసార్చిత మాకభయ మొసంగవె దాశరథీ రఘురామా ॥[2]

---

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య ) కీర్తన 75, పుట 69.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య ) కీర్తన 40, పుట 38.

మరియు దేహాభిమానంతో, ఈ సంసార సాగరంలో పడి కొట్టుకు పోతూ, ఐహిక సుఖాలలో ఉండి రాముని కనలేక పోయానని, తనను ఈ మాయ నుండి బయట పడవేయమని శ్రీరాముని వేడుకుంటున్నాడు. ఈ కీర్తనలో ఈ విధంగా తెలియజేస్తున్నాడు.

**"కల్యాణి - చాపు".**

"రామా దయజూడవే భద్రాచల
ధామా నను గానవే
రామా కౌస్తుభ ధామా నతజన
కామా జలధర శ్యామాజగదభి ॥
దేహాభిమానుడనై యున్నాళ్ళు
వ్యామోహా కలితుడనై
ఐహిక సుఖములందనురాగముంచి
వైదేహాత్మజా రమణ తెలియ లేనైతి నిను ॥
దిక్కులేని వారిని మక్కువతో
గ్రక్కున గాతువనీ
దక్కితి నీకేను భద్ర శైల రామ
దాసునే రీతిని బ్రోచెదో యిక మీద"[1]

మరో కీర్తనలో కూడా "సారం లేని సంసారంలో చిక్కి యున్న " నను ఈ కూపం నుండి బయట పడవేయమని భద్రాద్రి రాముని ప్రార్థిస్తున్నాడీ విధంగా

**"తోడిరాగం - ఏక"**

రామయ్య నన్ను రక్షించవేమయ్యా
కోదండరామ ఏమయ్య
ఏమయ్య నా మనవి గైకొనవేమయ్య
నిన్నే నమ్మియున్నానయ్య ॥
అన్నుల వేడబోనయ్య - నీ మహిమ దెలియ రాదయ్య
నా వల్ల తప్పులేమయ్య - ఆ పన్నులమైనామయ్య ॥
ఎంతో విన్నవించేమయ్య
సారములేనట్టి సంసారములోన జిక్కి
యున్నారము- నన్ను మన్నించే భారము
దేవరదేయున్నారము- నేరమెన్నకున్నారము
కన్నతండ్రి-మీవారము- మీరే మాకాధారము॥
జాలముచేసితె తాళజాలము లోకులయందె
మేలముగా నన్ని వేళాకోళము ఆడేవారు యీ
కాలము యే రీతిన గడువ గలము
అన్నిటికిని మీరేమూలము
యితరులచే బ్రతిమాలము ॥

1. భక్తరామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య ) కీర్తన 159, పుట 131.

సేయక నన్నరదావు సేయక పతితుడవని
దాయక, పాలించే రఘునాయక,
పండిత ముఖ నాయక, నా వరముని
గాయక, శ్రీ భద్రాచల నాయక పోషిత రామదాస"[1]

"రామా!" అన్నీ ఉన్నా ఆనందమయ కాలంలో నేను అందరికీ ఉపయోగపడినాను. నేడు దాన ధర్మాలతో ఉన్న ఆస్తి అంతా తరిగిపోయి దారిద్ర్యం అనుభవించే దీనమైన పరిస్థితి రాగా, ఈ లోకులే నన్ను అవహేళన చేస్తూ, అవమానిస్తున్నారు. నేను పరులను యాచించను. నిన్నే నమ్మినాను. నన్ను కాపాడు. ఈ బాధలనుండి, సంసారంలోని కష్టాలనుండి కడతేర్చు" అని దీనంగా ప్రార్థించాడు.

ఇదే విధంగా అశాశ్వతమైన ఈ సంసారం, భార్యా బిడ్డలు అనే సముద్రంలో పడి వ్యామోహంతో అలౌకికమైన ఈ ఆనందం కోసం, శాశ్వతమైన నీ సన్నిధానానికి దూరమౌతున్నాను, అలా కాకుండా నన్ను నీదరి చేర్చుకోమని ఈ దుఃఖం నుండి విముక్తి ప్రసాదించమని శ్రీరాముని వేడుకుంటున్నాడు. ఈ కీర్తనలో ఇలా వివరించాడు రామదాసు.

"ఆనంద భైరవి - ఏక"
రామా నిను నేనెటువలె నమ్ముదు
ముందలి గతి - స్వామివి నీవని వేమారు
వేడితి - నామనవికి నీవేమని పలుకవు॥.......
తాపత్రయ బహు కూపములోనను
చాపల్య విషయములను త్రెంచి,
మీ పాదములే గతియని నమ్మితి
చేసట్టక నరచూపులు చూచితె ॥
దార సుఖంబులు గోరుచును
సంసారంపుటడవుల దూరుచును,
దూర లేక మీ చేరువ జేరితె
తెరకోని వలెహోరగ జూచితె॥
రాగ ద్వేషపు రోగముచే బహు భోగ కర్మములు నేగుచును
వేగలేక మొరలిడ సాగితె - ఊరక మూగవానివలె బాగుగ పలకని॥
మాటికి నీవె పూజితుడవని చాటితిగద ముమ్మాటికి నీ పాటుగ
మాటుగ భద్రాచల వర నిను నే సూటిగ రామదాసుడనై నమ్మితి రామా ॥[2]

ఈ విధంగా రామదాసు ఇరవై ఏండ్లలోగానే ఇహలోక సుఖాలపై విరక్తి పొంది, భార్యా బిడ్డల గూర్చి పట్టించుకొనక, నిరంతరం రామనామధ్యాన తత్పరుడై, తాను రామాంకితుడై, తన పిత్రార్జిత ధనాన్ని దాన ధర్మాలకు, రామ కైంకర్యానికై ఖర్చు చేశాడు. జనులకు 'రామ నామ మహిమ'ను గూర్చి శ్రీరామ భక్తిని గూర్చి బోధిస్తూ ఉండేవాడు. బాల్యం నుండే రామభక్తిని అలవాటు చేసుకున్న రామదాసు చిన్న నాటనే "ఏలా పుట్టుక పోతినాడే రాముల తోడా"అని ,

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 167, పుట 138.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 165, పుట 136.

ఆశ పుట్టెనే శ్రీరాములతో నావహ!

పుట్టనైతిని రఘురాములతో - అయ్యో నే బుట్టనైతిని

శ్రీరాములతో బుట్టి సేవలు సేయనైతిని[1]" అని రామాయణేతి వృత్త ప్రధానమైన కీర్తన గానం చేశాడు గోపన్న. ఇంతటి బాల రామభక్తుడైన గోపన్న, తల్లిదండ్రుల మాట జవదాటలేక వివాహం చేసుకుని, ఒక పుత్రునికి జన్మనిచ్చి, ఆ ఆనందం శాశ్వతమైందిగా భావించి, నిరంతరం కుటుంబంలో కూడా రామ పూజాతత్పరుడై జీవించసాగాడు. నిరంతరం ప్రజలను రామభక్తి పరాయణులుగా చేస్తున్నాడు. ఈ విధంగా అందరితో కూడి భజనలు చేస్తుండేవాడు .

**"వంతువరాళి - రూపక".**

ఎన్నగాను రామభజన కన్న మిక్కిలున్నదా
సన్నుతించి శ్రీరామచంద్రు తలచవే మనన
కన్న విన్న వారి వేడుకొన్న నేమి ఫలము మనన॥
రామచిలుక నొకటి పెంచి ప్రేమ మాటలాడనేర్పి
రామ రామ రామయనుచు రమణిణి యొకతె పల్కగా
ప్రేమమీర భద్రాద్రి ధాముడైన రామ విభుడు
కామితార్థ ఫలములిచ్చి కైవల్య మొసగ లేదా ॥
శాపకారణము నహల్య చావరాతి చందమాయె
పాపమెల్ల బాసె రామ పదము సోకినంతనే
రూపవతులలో నధిక రూపురేఖలను గలిగియు
తాపమెల్ల తీరి రామతత్త్వమెల్ల తెలువలేదా ॥[2]

అని ఈవిధంగా రామనామ తత్త్వాన్ని, రామగాథను గూర్చి ప్రస్తావిస్తూ ప్రజలకు ఉద్బోధ చేసేవాడు. అలాగే

**" సావేరి - ఆది"**

దినమే సుదినము - సీతారామ
స్మరణమే పావనము ॥
ప్రీతినైన ప్రాణభీతినైన కలిమి
చేతనైన మిమ్మేతీరు దలచిన॥
అర్థాపేక్షను దినము వ్యర్థముగాకుండ
సార్థకముగా మిమ్ము ప్రార్థన చేసిన॥
నిరతము మెరుగు బంగరు పుష్పముల ఈ
రఘువరుని పదమ్ములనమర పూజించిన ॥
. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .
వాసిగ శ్రీహరిదాసులగూడుక
వేయుచుగంతులు వాసుదేవుని పాడు॥
అక్కరతోడ భద్రాచలమునసున్న
చక్కని సీతారాములజూచిన॥[3] అని ఆనందంగా శ్రీరాముని స్మరిస్తూ, భజనలు చేస్తూ తాండవం చేస్తూగడిపేవాడు రామదాసు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 17, పుట 18.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 39, పుట 38.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 79, పుట 72

ఈ విధంగా పరమ భాగవతోత్తముడు, శ్రీరామ భక్తుడగు యితని గృహమునందు నిరంతరం భజన గోష్టులు, రామాయణాది సత్కథా కాలక్షేపాలు జరుగుతుండేవి. బాల్య దశలో బాల రామాయణం పఠించినపుడే యితనికి రామభక్తి బీజాలు అంకురించిన నాటినుండి, తన సర్వస్వం శ్రీరామునికి అర్పించి సాధారణ జీవితం గడుతున్నాడు.

### 4.0.1. రాము పూజా కైంకర్యము :

రామదాసు తన గృహమునందు ప్రత్యేకంగా నిర్మించిన మందిరమందు బంగారంతో నిర్మించిన రాముని విగ్రహాన్ని అందుంచి, పూజిస్తుండే వాడు . శ్రీ రామనవమి ఉత్సవాన్ని తన గృహమందే అత్యంత వైభవోపేతంగా ఆచరించేవాడు. శ్రీ సీతారామ కళ్యాణోత్సవాన్ని తన గృహమందే ఎంతో ఆనందోత్సాహాలతో ఆచరించి, అతిథులకు అన్నదానం చేసేవాడు. సంతర్పణం గావించేవాడు. తాను పండితుడై ఉండడం వల్ల స్వయంగా కీర్తనలు రచించి అపార భక్తితో పాడుతూ, నృత్యం చేస్తుండేవారు. శ్రీరామచంద్రునికి భక్తితో ఈ విధంగా మేల్కొలుపులు పాడేవాడు.

"మేల్కొలుపు కీర్తన భూపాళ - చాపు"

శ్రీమించు కౌసల్య గర్భ తారక శ్రీరామ చంద్రా మేలుకో
సురలోకమానందమొంద నుదయించగ సూర్య వంశాగ్రణి మేలుకో॥
భరత లక్ష్మణ శత్రుఘ్నులతో వేద పఠన సేయవలె మేలుకో
గరిడీలు తెలిపేటి వస్తాదు లెల్లను కాచియున్నారయ్య మేలుకో ॥

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

సమయమిదిగో రామదాసున కిప్పడు సామ్రాజ్య మొసగవలె మేలుకో
క్రమమొప్ప భద్రాద్రియందున నెలకొన్న కారుణ్యనిధి వేగ మేలుకో॥
భక్తుల పాలించవలె నిద్రచాలించు భక్తవత్సల యింత మేలుకో
వేమారు పసులింత చాలగనున్నవి వారిజ లోచన మేలుకో॥"[1]

అని ఈ విధంగా శ్రీరామునికి మేల్కొలుపులు పాడినాడు రామదాసు. రామాయణేతి వృత్త ప్రధానమైన కీర్తన ఇది. ఇంకా శ్రీరామునికి "షోడశోపచార పూజాదికాలు ఏవిధంగా ఆచరించే వాడో తన కీర్తనలో వర్ణించాడు రామదాసు

"శంకరాభరణం - ఆది"

ఆరాధయామి శ్రీ నారాయణానంత
ఘోర సంసార విదూర నివారా
ఆరాధయామి శ్రీ రఘురామా
ఆరాధయామి శ్రీ రఘురామా ॥
ఆవాహయామి షోడశోపచారం
సోహం బ్రహ్మముల దేహాభిమానముల
ఆవాహయామి శ్రీ రఘురామా
అహమావాహయామి శ్రీ రఘురామా ॥

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 188, పుట 157.

భాసురమైన శ్రీ వృక్షమందు ని
వాసుడవైనట్టి వాసుదేవా నీకు
ఆసనమిదిగో శ్రీ రఘురామా
సింహాసనమిదిగో శ్రీరఘురామా

. . . . . . . . . . . . . . . . . . . . . . . .

స్వామి భద్రగిరి ధామ పావన నామ
సోమ సూర్య నేత్ర రామదాసుడనై
నీమముగ జేయుదు రఘురామా పూజ
నీమముగ జేయుదు శ్రీ రఘురామా ॥[1]

ఈ కీర్తన సుదీర్ఘమైంది. ఇందు భగవంతుడైన శ్రీరామునికి అర్ఘ్యపాద్యాలు సమర్పించి, ఆవాహనం చేసి, ఆచమనంచేసి, పంచామృతం,వస్త్రాలు, యజ్ఞోపవీతం, వివిధాభరణాలు అలంకరించి, గంధ పుష్పాదులతో, ధూపదీప నైవేద్యాదులతో పూజించి, భక్తితో మంత్ర పుష్పం అర్పించి, సాష్టాంగ నుతులు సమర్పించినట్లు వర్ణించాడు రామదాసు. మరో కీర్తనలో కూడా ఈ పూజా విధానం వర్ణింపబడింది.

**"ధన్యాసి - ఆది"**

రామ రామ శ్రీరామా రామా
రామా యనరాదా - మనసా
కామిత ఫలదుండగు శ్రీ సీతా
కాంతుని గనరాదా - మనసా ॥
నలిన భవామర పరివేష్టితు ధ్యా
నము సేయుగరాదా - మనసా
బలుడౌ రాముని రారమ్మని యా వాహన
సేయరాదా - మనసా ॥[2]

ఈ కీర్తన కూడా పూజా సమయంలో రామదాసు పాడింది.

అలాగే మరో కీర్తనలో కూడా శ్రీరామునికి జరిపే షోడశోపచారాలు వర్ణింపబడినాయి.

**కాంభోజి - ఝంపె**

సకలేంద్రియములార జరుగ సమయము గాదు
సద్దు సేయక యుండరే
ప్రకటముగ మా యింట పండుగై జానకీ
పతి పూజ సేయువేళ - మీరు ॥

. . . . . . . . . . . . . . .

శిరమునను శతకోటి సూర్యులను మించు
భాసుర కిరీటము ధరించి
హరి పాదకనులములకును మంచి స్వర్ణంపు
పువ్వులను పూజచేసి
యురు ధూప దీప నైవేద్య తాంబూలాది

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 16, పుట 14.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 130, పుట 107.

సకలోపచారమొనగి సరస భద్రాద్రీశునకు రామదాసుండు
సాష్టాంగ నుతిసేయు వేళ మీరు ॥ [1]

ఈ విధంగా నిర్మలమైన భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాములకు పూజ జరిపించి మంగళగీతాలు పాడినాడు. మంగళ హారతి కీర్తనలు రెండు కనిపిస్తాయి.

**మంగళ హారతి కీర్తనలు : "నవరోజు - ఏక"**

రామచంద్రాయ జనక - రాజజా మనోహరాయ
మామకాభీష్టదాయ - మహిత మంగళం ॥
కౌసలేయాయ మంద - హాసదాస పోషణాయ
వాసవాది వినుతి స- ద్వరద మంగళం ॥

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

రామదాస మృదుల హృదయ తామరస నివాసాయ
స్వామిభద్రగిరి వరాయ - సర్వ మంగళం ॥ [2]

అలాగే మరో కీర్తన

హారతి శ్రీ శశిశోభితాననాయై - దివ్య
హారతి త్రైలోక్య పరమ పావనాయై
కుంకుమ పంకిల వక్షాంకాయై -కర
కంకణ కేయూర విహారాయై ॥
భాసుర శ్రీ భద్రాద్రి శైల నివాసాయై - రామ
దాసపోషక చిద్విలాసాయై ॥ [3]

ఇవి రెండు సంస్కృత కీర్తనలు. ఈ విధంగా పూజాసమయంలో శ్రీరామునికి షోడశోపచార పూజలు భక్తిశ్రద్ధలతో జరిపించేవాడు. ఈ విధంగా నిరంతరం శ్రీ రామచంద్రునికి కైంకర్యం జరిపించి, దానధర్మాలను చేస్తూ ఉన్న ఆస్తి అంతా ఖర్చయిపోవడంతో దారిద్ర్యం అనుభవించవలసి వచ్చింది.

### 4.2. చారిత్రకాంశాలు :

ఆ సమయంలో హైదరాబాదును ఏలే గోల్కొండ రాజు వద్ద అక్కన్న, మాదన్నగారలు పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. ఈ అక్కన్న మాదన్నలు గోపన్నగారి మేనమామలు. అర్థాంగి ప్రోత్సాహంతో గోపన్న సతీ సమేతంగా అక్కన్న మాదన్నల వద్దకు వెళ్తాడు. తన గోడు అంతా వినిపిస్తాడు. గోపన్న పేదరికం చూసి తన మేనమామలు జాలినొంది సుల్తానును ఎలాగో ఒప్పించి ముందుగా పేష్కారు పదవిని ఇప్పిస్తారు. ఆ తర్వాత పాల్వంచ పరగణాకు తహసీల్దారుగా నియమింపబడతాడు గోపన్న.

గోపన్న తహసీల్దారు అయిన విషయం గూర్చి వివిధ చారిత్రకగ్రంథాల్లో, రామదాసు చరిత్రల్లోను ప్రస్తావింపబడి ఉంది. ఆ కాలంలో జిల్లాలు, తాలూకాలు ఏర్పడలేదు. రాజ్యమంతా కొన్ని సర్కారులుగాను, సర్కారులు పరగణాలుగాను, పరగణాలు పట్టీలుగాను విభజింపబడి యుండేవి. ఒక్కొక్క ప్రాంతం ఒక్కొక్కరి అధీనమందుంచబడింది. ఖమ్మంమెట్టు సర్కారులోని హసనాబాదు పరగణాకు గోపన్న బాధ్యత గల

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 192, పుట 161.
2. " " " కీర్తన 146, పుట 121
3. " " " కీర్తన 196, పుట 165.

ఉద్యోగిగా నియమించబడినాడు. ఈ పరగణాయే పాల్వంచ అనే పేరున ప్రఖ్యాతమవడం వల్లనూ, అందు భద్రాచల ప్రాంతము గూడా చేరి యుండడం వల్లనూ, లోకంలో రామదాసు పాల్వంచ తహసీల్దారనీ, భద్రాచలం తహసీల్దారనీ చెప్పసాగినారు. చారిత్రకంగా కూడా ఇది సత్యమే. "1883లో కృష్ణా జిల్లా మాన్యుయల్‌లో జి. మెకంజి గోపన్నగారు మాదన్న మేనల్లుడనియు, ఖమ్మంమెట్టు పేష్కారనియు వ్రాసిరి".[1] దేవాలయములు - తత్త్వవేత్తలు అనే గ్రంథంలో శ్రీ వి.టి. శేషాచార్యులుగారు ఈ విధంగా వ్రాశారు.

"రామదాసు కుటుంబ సమేతుడై తన మేనమామ మాదన్న కుమారుడు మల్లన్న వివాహానికి వెళ్ళాడు. అక్కడ అక్కన్న, మాదన్నల సలహా మేరకు గోపన్న కొంతకాలం గోల్కొండలో ఉండెను. అక్కడ గోపన్నను తహసీల్దారుగా ఏర్పాటు చేసెను" అని ఉంది.

నారుమంచి సుబ్బారావు గారు ఈ విధంగా తెలియజేశారు. " రామదాసు తన ఆస్తినంతా దానధర్మాలకు ఖర్చు చేసి పేదరికం అనుభవించే పరిస్థితి వచ్చింది. తల్లిదండ్రులు తన వివాహమైన కొంత కాలానికి మరణించారు. ఆ తర్వాత తన భార్య కోరికమేరకు బంధువుల కోరిక మేరకు హైదరాబాదు వెళ్ళి అచ్చటి మేనమామలును, అబ్దుల్లా తానీషా వద్ద మంత్రులైన అక్కన్న మాదన్నల సహాయంతో భద్రాచలం తహసీల్దారు ఉద్యోగం సంపాదించినాడు."[2]

ఇందులో 'అబ్దుల్లా తానీషా' రామదాసును తహసీల్దారుగా నియమించాడని వ్రాయబడింది. అంటే 'తానీషా' అనేది బిరుదమే కాని పేరు మాత్రం కాదు. అబ్దుల్లా, అబుల్ హసన్ కుతుబ్షాలు ఇరువురికి తానాషా అనే బిరుదం ఉందని దీన్నిబట్టి చెప్పవచ్చును. సింగర దాసు రచించిన 'రామదాసు చరిత్రము'లో

"భద్రాచలమును తాలూకాకు పంపుడు, తహసీల్ పనిగా ముద్ర నిశానితో హుకుములిచ్చి ముజరాలందు మనిరి వేగ"[3] అను తొహరా వల్లను , "భద్రాద్రికి నధిపుడవై - భద్రయశుండగుచు ప్రజల పాలించుచునే, భద్రము లేకను పైకము-భద్రముగా గూర్చుమనుచు పతి నియమించెన్"[4] అను పద్యం వల్లనూ భద్రాచలానికి గోపన్న ప్రధానాధికారిగా (తహసీల్దారు) నియమింపబడినాడని స్పష్టంగా తెలుస్తుంది.

రామదాసు నాటకమున ధర్మవరం గోపాలాచార్యులు రామదాసు తహసీల్దారైన విధం గూర్చి ఇలా వ్రాశాడు. " రామదాసు కుమారుడు రఘురాముడిచే, రామదాసు ఒక లేఖను మాదన్న మహామంత్రి వద్దకు పంపినాడు. తనకు ఉపాధి చూపమని, భద్రాద్రి తమకు స్థానంగా ఉంటే బాగుంటుందని భావించాడు. ఈ లేఖను చూసి రఘురాముడు గోల్కొండ వైపు వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు దారిలో రామదాసు మిత్రుడు సీతారామ శాస్త్రిగారు అనే బ్రాహ్మణుని ఇంటికి వెళ్తాడు రఘురాముడు. అక్కడ అక్కన్న గారి భటులు మహమ్మదీయుల భోజనం చేసి అనంతరం 'రఘురాముని' తోడ్కొని భద్రాద్రికి వెళ్తారు. అక్కడి పౌరులు ఆ భటులతో రామదాసుకు తహసీల్దార్ ఇప్పించమని అడుగుతారు."[5]

ఈ పై విషయాన్ని పరిశీలిస్తే వ్యక్తమయ్యే అంశం ఇది. ఇందు కల్పిత గాథ ఉంది. రామదాసును తహసీల్దారుగా నియమించింది, అక్కన్న, మాదన్నల అనుమతిపై అబ్దుల్లా కుతుబ్షా రాజు. మొదట పేష్కారు అయినాడని ఆ తర్వాతే తహసీల్దారు అయినాడని "కృష్ణా జిల్లా మాన్యుయల్"లో చెప్పబడింది. కావున అక్కన్న, మాదన్నలకు గోపన్న స్వయంగా లేఖ వ్రాసి భద్రాద్రికి తహసీల్దారుగా చేయమని చెప్పడం 'రఘురాముడనే' తన పుత్రునితో చెప్పి ఆ లేఖ పంపడం అంతా కల్పితం.

గలిమెళ్ళ సత్య గోదావరి శర్మగారు "గోపన్న" తహసీల్దారైన విధానం గూర్చి మరోలా వ్రాశారు. "మాదన్న

1. కృష్ణా జిల్లా మాన్యుయల్ - జి.మెకంజీ (భద్రాచల క్షేత్ర చరిత్ర - కొండపల్లి రామచంద్రారావు , దేవస్థానం ప్రచురణలు , పుట12,1971..
2. సంగీత మహార్షులు - నారుమంచి సుబ్బారావు (మొదటి భాగం) , పుట 44.
3.4. రామదాసు చరిత్ర - సింగర దాసు , ఎస్.వి.గోపాల్ అండ్ కం. మద్రాసు, పుట 21,22
5. రామదాసు నాటకం - ధర్మవరం గోపాలాచార్యులు - తృతీయాంకం.

గారు గోపన్న ఔదార్యమును, మంచితనాన్ని విని, ఒక లేఖ పంపాడు. అది చూసి గోపన్న గోల్కొండకు వెళ్లలేదు. నిత్యకృత్యాలకు అంతరాయం కలుగుతుందని భావించి గోల్కొండకు వెళ్లలేదు. ఆనాడు గోల్కొండలో వచ్చిన కరువు ఒక సంవత్సరం పాటు ఉంది. ఆ తర్వాత దేశ పరిస్థితి మామూలు స్థితికి వచ్చింది. గోపన్న ఎప్పటి లాగే రామభక్తితో కాలం గడుపుతున్నాడు."[1] అయితే, 'తారక మంత్రోపదేశం అయిన నాటినుండి గోపన్న రామకైంకర్యంతో కాలం గడుపుతూ, తన యావదాస్తిని అమ్మి ఋణవిముక్తుడై, దారిద్ర్యబాధను అనుభవించలేక, తన భార్య కమలను కూడి గోల్కొండకు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. ఇంతలో గోపన్నకు మాదన్న గారు ఒక లేఖ పంపారు గోల్కొండకు రమ్మని. గోపన్న పరిస్థితి మాదన్నకు తెల్సి విచారపడినాడు. ఇద్దరు జవానులు గోపన్నగారి ఇంటికి వెళ్లి ఆ లేఖ ఇచ్చి, ఆయనను గోల్కొండకు తీసుకొని వెళ్లదలచారు. మాదన్న అక్కన్నల వద్దకు గోపన్న వెళ్లాడు. వారితో కలసి తానీషా వద్దకు గోపన్న వెళ్లి ఉద్యోగంకై సిఫారసు చేశాడె. మాదన్న, అక్కన్నల సిఫారసు మేరకు గోపన్నకు 'భద్రాచలం తాలూకా' తహసీల్దారీ పదవిని అబుల్ హసన్ తానాషా ఇప్పించాడు. అయితే మరో తురుష్కోద్యోగి ఈ ఉద్యోగాన్ని మరొకరికి ఇప్పించమని కోరగా, అది పట్టించుకొనక గోపన్నకు ఈ పదవి ఇప్పించాడు"[2] అని వ్రాశారు. ఇక్కడ ఒక విషయం గమనించాలి. 'గోపన్న'కు అబుల్ హసన్ తానీషా తహసీల్దార్ పదవి ఇచ్చినట్లు వ్రాయబడింది కాని ఇంతకు ముందు గోపన్న అబ్దుల్లా కుతుబ్షా కాలంలోనే తహసీల్దారైనట్లు చర్చించి నిరూపించాను. అబుల్ హసన్ కాదు అని స్పష్టం చేయుటమైంది.

డా॥ వి. రాఘవన్ గారు రామదాసుకు గల రామభక్తిని, రామదాసు తనకున్న అపారమైన రామభక్తి వలన తాను దానధర్మాలు చేసి, భాగవతుల సేవ చేస్తూ ఉన్న ఆస్తినంతా ఖర్చు చేసి, పూట గడవని స్థితిలో ఉండి తన మేనమామలైన అక్కన్న మాదన్నలు గోల్కొండలో (తానీషా) నవాబు వద్ద మంత్రులుగా ఉన్న కాలంలో అక్కడికి వెళ్లి వారి సహకారంతో భద్రాచలం తాలూకా తహసీల్దారైనట్లు తెలియజేశారు. ఈ క్రింది అంశాలే ఇందుకు నిదర్శనం.

" Because of his Rama Bhakti, this Gopanna came to be known as Ramadas. The whole family was devoted to Bhakti and its propagation. According to an un published document " His uncle the Minister Madanna arranged for a Yakshagna troupe to tour from village to village, enacting puranic stories and spreading Bhakti, Ramadas continued this tradition, courting the company of Bhaktas arranging for Bhajanas, and festivals. Ramadas must have had initiation and Mantropadesa from some great soul and progressed in the spiritual path to such an extent that he saw Rama in all beings and things, a state of which he him self expressed in one of his songs"[3]

"అంతా రామమయం - ఈ జగమంతా రామమయం" **(వరాళి రాగం)**. అని రామదాసు అన్ని వస్తువుల్లోను, ఈ సృష్టిలోని ప్రతి అణువులో రాముని దర్శించాడు. మిన్నికంటి గురునాథ శర్మగారు ఈ విషయం గూర్చి ఈ విధంగా చర్చించారు. "గోపన్న మాదన్నను కలిసికొనును. తానీషా కడకు వెళ్లి తనకు ఒక ఉద్యోగం కావలెనని అబుల్ హసన్ తానీషాను అర్థించాడు గోపన్న. మాదన్న సిఫారసు మేరకు గోపన్నకు భద్రాచలం తాలూకా తహసీల్దారుగా నియమిస్తూ తానీషా ఫర్మానా ఒకటి వ్రాసి ఇచ్చాడు."[4]

1,2. . గోపన్న - కీ.శే. గరిమెళ్ల సత్య గోదావరి శర్మ , పుట 24-25.

3 Dr. V. Raghavan (Great Composers)The Machu palle kaifiat at in 1502 A.D. see (my) Bhagavata Mela Nataka in the journal of the Indian History Society of oriental art V. calcutta, 1937, P. 167 (Dr.V. Raghavan), P. No. 14.

4 కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ, ప్రణీతము, 1935, నాల్గవ ప్రకరణము పుట 65.

"భద్రాచల రామ చరిత్రము" అనే గ్రంథంలో కవిరాజ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు "రామదాసునకు ఉద్యోగమిచ్చింది తానీషా అని, ఆ తానీషా అక్కన్న మాదన్నల ఇంట పెరిగాడని, తెలియజేశారు.

మహదైశ్వర్యము నందియుందెగని ప్రేమన్ హైదరాబాదులో
సహుజూరై తనరారి భూప్రజదయన్ బాలించుచున్ భూమి భృ
త్సహితుండై కడు వేసి వేయ కెలమిన్ దానీష యున్నాడటం
చు హితుల్ సెప్పగ నల్ల పింగళికులే-శుల్ నంతసంబందుచున్.[1]

అన్నయు దమ్ముడుం బయున - మైతమకొప్పిన సంబళంబుతో
గొన్ని పగళ్ళొగిన్ నడిచి, కోరిక లీలిక లెత్తినప్పిరిం
యిచ్చె దహశీలు దార్వద మెసక మెసగ
నతని చారిత్ర శేషము నగుసు వినగ [2]

తహసీల్ దారగు రామదాసు మిగులన్ ధైర్యంబునన్ దత్పద
స్పృహణీయంబగు కార్య భారమెదపై జేకొంచు భద్రాద్రికిన్
సహసేవాజన సంచయుండగుచు నిచ్చన్ వచ్చిసొప్పద్యోగమం
దహహో నాగ నెసంగె గొన్ని సమలత్యంత ప్రభావంబునన్ [3]

తానీషా (అబుల్ హసన్) రామదాసుకు తహసీల్దారీ పదవి ఇచ్చినట్లుగా పై పద్యాల ద్వారా విశదమవుతుంది. " శ్రీ రామాలయ సముద్ధరణ" అనే వ్యాసంలో, "మేనమామలగు అక్కన్న మాదన్నల కారణంగా గోపన్నను తానీషా హయాములో భద్రాచలము తాలూకా తహశీల్దారుగా నియమించుట మొదలైన విషయాలు మన దేశమున తెలియని వారు లేరు"[4] అని ఉంది. " శ్రీ రామచంద్రులు రామదాసుకు ప్రత్యక్షమై నీవు భద్రాచలము తాలూకా తహశీలుదారువౌదువని చెప్పి అంతర్ధానమైరి"[5] అని శ్రీ ఏకా సుబ్బారావు గారు తమ గ్రంథంలో వ్రాశారు. ఇది కథే కాని, నిజం కాదు. తహసీల్ కావడం నిజం. రాముడు చెప్పడం నిజం కాకపోవచ్చు. మార్లిను, హోవార్టు అనే డచ్చి యాత్రికులు తమ గ్రంథంలో (గోపన్న) ప్రభుత్వ మాతనిని భద్రాచలము పరగణాకు తహసీలుదారుగా నియమించెను"[6] అని వ్రాసిరి.

శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రిగారు "అక్కన్న, మాదన్నలు మంత్రులైన వెంటనే తమ బంధువులనేకులకు గొప్ప యుద్యోగములిచ్చినారు. వానిలో గోపన్న తహసీలు ఒకటి"[7] అని వ్రాశారు.

"స్తంభాద్రి" అనే గ్రంథంలో ఈ విధంగా వ్రాయబడింది. "తానీషా ప్రభువు గోపన్నను మొట్టమొదట ఖమ్మంమెట్టు మండల కార్యాలయమునకు పేష్కారుగా ఉద్యోగమిచ్చి పంపెను. పిమ్మట నితడు హసనాబాదు (పాల్వంచ) పరగణా యందలి సర్కారీ శిస్తులు సరిగా వసూలు కాక బకాయి పడియున్న కారణమున, వానిని వసూలు చేయుటకై హసనాబాదు (పాల్వంచ) పరగణాధికారిగా నవాబుచే పంపబడెను. అప్పడు పాల్వంచ, బూర్గుంపాడు , భద్రాచలం తాలూకాలు మూడునూ ఈ పరగణాలో చేరియుండెనని

1. భద్రాచల రామదాసు చరిత్రము - కవి రాజ శ్రీ పాద కృష్ణశాస్త్రి పుట 125. - షష్ఠాశ్వాసం.
2,3. " " " " పుట 128-129.
4. శ్రీ రామాలయ సముద్ధరణ - ఆరాధన పత్రిక జూన్, 1960.
5. కొత్త సంగీత విద్యా దర్పణము - శ్రీ ఏకా సుబ్బారావు.
6. అక్కన్న, మాదన్నలు - కె.వి.భూపాలరావు , పుట 57.
7. అక్కన్న, మాదన్నల చరిత్ర - వేదం వేంకట రాయ శాస్త్రి, పుట 80- 82, 1951.

చేరియుండెనని చరిత్రాంశముల ద్వారా తెలియ వచ్చుచున్నది."[1]

దీనిని బట్టి మొదట గోపన్న పేష్కారుగాను, తర్వాత భద్రాచలం తాలూకా తహసీలుదారుగాను నియమింపబడినాడని తెలుస్తుంది. "రామదాసు నాటకం"లో డి. వెంకట రమణయ్య గారు గోపన్నకు తానీషా వద్ద మంత్రులుగా నున్న అక్కన్న మాదన్నలు తానీషాతో చెప్పి భద్రాచలం తహసీల్దారుగా ఉద్యోగమిప్పిస్తారు[2] అని వ్రాశారు. ఈ తానీషా అబుల్ హసన్ తానాషా అని ఈ రచయిత వ్రాశారు. 1183 సం॥న వెలువడిన "కృష్ణా డిస్ట్రిక్టు మాన్యుయల్‌లో మెకంజీ "గోపన్నగారు మాదన్నగారి మేనల్లుడనియు, ఖమ్మంమెట్టు పేష్కారు అనియు వ్రాసెను. ఆ తర్వాత భద్రాచలమునకు ప్రధానాధికారిగా గోపన్న విచ్చేసెననుట నిర్వివాదాంశము. ఈ విషయం ఈ క్రింది వాక్యాలను బట్టి తెలుస్తుంది.

"Madanna Panthulu had a nephew, Gopanna who was appointed Peshkar of the Khammammet, Taluq, which includes the village of Bhadrachalam on the Godavari one of the halting places of Rama, sita and Lakshmana in their wanderings, The hut in which they lived is still shown under the name of Parnashala".[3]

ఈ భద్రాచలం ఖమ్మం జిల్లాలో ఉందని, శ్రీ సీతారాములు నివసించిన ప్రాంతం ఇదని ఇందు చెప్పబడింది. "Seat of Lord Rama అనే వ్యాసంలో ఈ విధంగా వ్రాయబడి ఉంది.

"Gopanna was the nephew of Akkanna, the Prime Minister of the ruler of Golkonda, Abul Hassan Thanashah (1654-87). Later in the 17th century Gopanna, a Revenue official under the Qutb Shahis, he appointed as Tahsildar".[4]

గోపన్న అబుల్ హసన్ తానాషా కాలంలో అక్కన్న మాదన్నల మేనల్లుడు కావడం వల్ల వారి సహకారంతో భద్రాచలం రెవెన్యూ అధికారిగా తహసీల్ దారుగా నియమితుడైనాడు అని "1654-87" ఈతని కాలం అని వ్రాశారు. కాని 1624-72 అబ్దుల్లా కుతుబ్షా కాలం. 1672-87 అబుల్ హసన్ కుతుబ్షా కాలం. అబ్దుల్లా కాలంలో తహసీల్దారుగా గోపన్న భద్రాచలం వెళ్ళాడు. ఇది చారిత్రక సత్యం.

"భక్త రామదాసు" అనే గ్రంథంలో వేముగంటి నరసింహాచార్యులు గారు వ్రాసిన విషయాలను సమీక్షిస్తూ సమీక్షకులు శ్రీ వి. బాలకృష్ణ శాస్త్రి గారు ఈ విధంగా వ్రాశారు. "అక్కన్న మాదన్నల నాశ్రయించి తానీషా వారి వద్ద గోపన్న ఉద్యోగము పొందాడు. 'మననాత్త్రాయత ఇతి మంత్ర' అను ప్రభావంచే రామదాసు తహసీల్దారు ఉద్యోగమునొంది రైతులకు నీతులు బోధించి వారి మన్ననలను చూరగొనెను.[5]

అరుద్ర గారు "సమగ్రాంధ్ర సాహిత్యం"లో, "అక్కన్న మాదన్నలు 1650 ప్రాంతాలలో మీర్ జుమ్లా వద్ద కొద్దిపాటి జీతంలో వాళ్ళు పని చేస్తుండేవారు. వీరి మేనల్లుడైన గోపన్నకు భద్రాచలం తాలూకాలో చిన్న ఉద్యోగం ఇప్పించారు. క్రమేపీ గోపన్న తహసీల్దారు అయ్యాడు[6] అని వ్రాశారు. అంటే 1650 ప్రాంతాల్లో అబ్దుల్లా కుతుబ్షా కాలంలోనే మొదట చిన్న ఉద్యోగిగా ఉండి, ఆ తర్వాత మీర్‌జుమ్లా పదవీచ్యుతుడైన అనంతరం అక్కన్న సర్వసైన్యాధ్యక్షుడుగా, మాదన్న ప్రధాన మంత్రిగా అయిన అనంతరం గోపన్న తహసీల్దారైనాడని" అర్థమవుతుంది.

డా॥ ఎస్. గంగప్ప గారు ఈ విధంగా తెలియజేశారు. "రామదాసు క్రీ.శ 1620-1680 కాలం వాడు. అబ్దుల్లా, అబుల్ హసన్‌ల కాలంలో వీరి కొలువులో ఉన్న అధికారులు అక్కన్న, మాదన్నలనే

1. స్తంభాద్రి (గ్లింప్సెస్ ఆఫ్ ఖమ్మం హిస్టరీ) కొదమ సింహం సత్యనారాయణాచార్య, పుట 83-84.
2. రామదాసు నాటకము - డి. వెంకట రామణయ్య (ద్వితీయాంకము).
3. కృష్ణాజిల్లా మాన్యుయల్ - జి. మెకంజీ పుట 37-38.
4. తెలుగు వాణి - మార్చి, 1977. వ్యాసం - Seat of Lord Rama - M.V. Sastry.
5. భక్త రామదాసు - వేముగంటి నరసింహాచార్యులు (భోగయ్య గారి వేంకటేశ గుప్త. శ్రీ వి. బాలకృష్ణశాస్త్రి గారు, సమీక్షకులు, పుట. 37.
6. అరుద్ర - సమగ్రాంధ్ర సాహిత్యం - ఏడవ సంపుటం. పుట 385.

అన్నదమ్ములు గోపన్న మేనమామలు. వీరి మూలంగానే 1650 ప్రాంతంలో గోపన్న భద్రాచలం తాలూకా తహసీల్దారు అయ్యాడు."[1]

నారుమంచి సుబ్బారావు గారు, "అబ్దుల్లా కుతుబ్షా కాలంలో గోపన్న తహసీల్దారు అయినాడని తెలియజేశాడు."[2] శ్రీ బిరుదురాజు రామరాజు గారు రామదాసు తహసీల్దారైన విధం గూర్చి ఈ విధంగా విశ్లేషించారు. "అబ్దుల్లా కుతుబ్షా కాలంలో అక్కన్న మాదన్నలు చిన్న చిన్న ఉద్యోగాలలో ఉండన వారే కాని పేష్కార్, మీర్‌జుమ్లా కాదు. వారా ఉన్నత పదవులు అలంకరించినది తానాషా కాలంలోనే. మొదట అంతకుముందు (తహసీల్దారు కాక ముందు) పదేండ్లైనా ఇతర ప్రాంతాలలో కొలువు చేసినాడనుకుంటే 1650 ప్రాంతంలో తన 30వ ఏట రామదాసు గారు ఉద్యోగంలో చేరినట్లు భావించవచ్చు.

రామదాసుగారు మొదటిసారిగానే తహసీల్దారు పదవిలో నియుక్తులు కాకపోవచ్చును. అబ్దుల్లా కుతుబ్షా కాలంలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తుండిన అక్కన్న, మాదన్నల ప్రాపకంలో అంతకంటె చిన్న ఉద్యోగమేదో 'గిర్దావరీ' కంటె చిన్నది. రామదాసుగారికి లభించి ఉండవచ్చు. కాలక్రమంగా ఉద్యోగంతో పాటు రామభక్తి కూడా పెరిగి తహసీల్దారై ప్రభుత్వ ధనాన్ని భక్తికోసం వెచ్చించే ధైర్యం పెంచుకొని రామదాసు గారు జైలుశిక్ష అనుభవించి ఉంటారు."[3]

రామదాసు అబ్దుల్లా కుతుబ్షా కాలంలో మొదట చిన్న ఉద్యోగంలో చేరి 1660 ప్రాంతంలో భద్రాచలం తాలూకా తహసీల్దారైనట్లు వారు అభిప్రాయ పడినారు. చారిత్రకంగా కూడా ఇది నిర్వివాదాంశమే. కీ.శే. కేతవరపు శివ రామశాస్త్రి గారు తమ 'భక్త రామదాసు అను రామదాసు విజయం' అనే నాటకంలో ఈ విధంగా వ్రాశారు. "గోపన్న గారి పెద తండ్రి రంగనాథం గారు మాదన్న గారికి గోపన్న ఉద్యోగ విషయమై ఒక లేఖ వ్రాయగా, ఆ లేఖకు సమాధానంగా గోపన్నను గోల్కొండకు పంపమని రంగనాథంకు మాదన్న ఒక లేఖ వ్రాస్తాడు. అయిష్టతతోనే గోపన్న మాదన్న వద్దకు గోల్కొండకు తన మిత్రుడు వెంకటేశంతో కలసి వెళ్తాడు. అక్కడ అక్కన్న మాదన్నలు తానీషాకు చెప్పి గోపన్నకు భద్రాచలం తాలూకా తహసీల్దారు పదవి ఇప్పించాడు మాదన్న."[4]

ఇందు చారిత్రకంగా చూస్తే కొంత సత్యం ఉంది. గోపన్నకు మాదన్న సహకారంతోనే తహసీల్దారీ పదవి లభించిన మాట వాస్తవమే. కాని నేరుగా మొదటనే తహసీల్దారీ పదవి పొందలేదని చారిత్రకంగా నిరూపింపబడింది. గోపన్న విషయమై తన పెద తండ్రి కంచెర్ల రంగనాథం మాదన్నకు లేఖ వ్రాయడం అనేది నిజం కాదు. ఏ చారిత్రక గ్రంథంలోనూ ఈ విషయం లేదు. ఇది కల్పితం.

రామనారాయణ కవులు వ్రాసిన 'రామదాసు' అనే నాటకంలో ఇలా ఉంది " గోపన్న తానీషా వద్దకు అక్కన్న మాదన్నలను కలవడానికి వచ్చాడు. గోపన్న తండ్రి కూడా భద్రాచలం తాలూకా తహసీల్దారుగా ఉండి ధర్మాత్ముడుగా కీర్తి గడించాడు. గోపన్నను తానీషా భద్రాచలం తాలూకా తహసీల్దారుగా నియమించాడు. రామదాసు చరిత్రము (హిందూస్థానీ నాటకం)లో కూడా రామదాసు తానీషా కొలువుటో అక్కన్న మాదన్నల సహకారంతో భద్రాచల తాలూకా తహసీల్దారుగా నియమింపబడినట్లు వ్రాయబడి ఉంది."[6]

---

1. డా॥ ఎస్.గంగప్ప "తెలుగులో పద కవిత" పుట 80-82. (తెలుగు వాగ్గేయ కారులు)
2. సంగీత మహర్షులు - మొదటి భాగం, నారుమంచి సుబ్బారావు , పుట 44.
3. అనుభవ కవి - కంచెర్ల గోపన్న -బి.రామరాజు (వ్యాసం), తెలుగులో తొలి సమాజ కవులు-సంపాదకులు, కె.కె.రంగనాథాచార్యులు, పుట 53.
4. భక్త రామదాసు అను రామదాసు విజయం - కీ.శే. కేతవరపు శివ రామ శాస్త్రిగారు ప్రథమ, ద్వితీయాంకములు, 1924.
5. రామదాసు - రామ నారాయణ కవులు , ద్వితీయాంకము 1929.
6. నాదెండ్ల పురుషోత్తమ కవి - రామదాసు చరిత్రము (హిందుస్థానీ నాటకము)

చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు తమ 'రామదాసు చరిత్రము' (కావ్యం)లో ఈ విధంగా ప్రస్తావించారు. తానీషా గోపన్నకు భద్రాచలం తాలూకా తహసీల్దారు పదవినిచ్చాడు అనే విషయం ఈ పద్యం ద్వారా వ్యక్తమవుతుంది.

" భద్రాద్రి పరగణా నిరు
పద్రవముగ నరసి భూమి పన్నులు గొనగా
ముద్రాధికారమొసగితి
భద్రంబని నేలకొండ పలె గోపనకున్".[1]

"శ్రీరామదాస నాటకము"లో కేశిరాజు వేంకట సుబ్బారాయ కవి, "గోపన్నకు అతని మేనమామలు సహాయంతో తానీషా వద్ద భద్రాచలం తాలూకా తహసీల్దారు పదవి లభించెను."[2]

History of the Qutb Shahi Dynasty అనే గ్రంథంలో తహసీల్దారు పదవిని గురించిన ప్రస్తావన ఉంది. " The other great name in the out put of Telugu during the reign is that of Madanna's nephew, Gopanna-Kancherla who was later called "Bhadrachala Ramadas" or simply Ramadas Gopanna was appointed tahasildar or Revenue officer of Bhadrachalam and was in sole charge of the collection of the revenue of the locality".[3]

సాంబమూర్తి గారు " రామదాసు తహసీల్దారుగా తానీషా వద్ద నియమితుడైనట్లు, మాదన్న, అక్కన్నలు అతని మేన మామలని, వారి సమకారంతోనే ఈ పదవి పొందెనని, భద్రాచలం తాలూకా రెవెన్యూ అధికారిగా నియమితుడైనట్లు తెలియజేశారు. ఈ క్రింది అంశాలలో ఈ విషయం స్పష్టమౌతుంది.

"His maternal uncles Akkanna, Madanna held the posts of controller of the forces and chief minister respective by in the Kingdom of Golconda at that time, with their influence, Ramadas was appointed as Tahsildar of Bhadrachalam Taluq. He proved an able official and improved the collection of revenues due to the state".[4]

యాదవదాసు రచించిన 'రామదాసు చరిత్రము' యక్షగానంలో

" వినరోరి తెల్పెద విధమంత నేను. . . . . .
చెలగుచు శ్రీ భద్రాచలము తాలూక
కలివైన దేశ పాండ్య కరణాల మూర. . ."[5] అని ఉంది.

మరియు తానీషా వద్దకు గోల్కొండకు రామదాసు వచ్చి, పాదుషాను ఈ విధంగా కోరుతున్నాడు.

ద్విపద : "వినువేగ పాదుషా విధమంతయూను

మనసు ఉప్పొంగియు మరి జెప్పెదాను। అక్కన్న మాదన్న యను మంత్రివరులు।మక్కువతో మేనమామలు కావలెను । నవుకరి తహసీలు నాకిమ్ము వేగ పైకంబు పంపింతు బాగుగ కిస్తు దాటకమున్నె నేదాఖలు జేతు। మాట దప్పను సుమ్మి మనవి గైకొమ్ము । మీ చేత మొహోరు మీ హుకుం వ్రాసి । యిప్పడు వేగమే వలనొప్పగాను । యే హుకుం సర్కారు లేమి వల నొప్పగాను"[6] । . . . . . ఈ విధంగా రామదాసు తానీషాను కోరగా అంతట

1. రామదాసు చరిత్రము (కావ్యం), చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు తృతీయాశ్వాసం, పద్యం 81, పుట 84.
2. శ్రీ రామదాస నాటకము - కేశిరాజు వేంకట సుబ్బారాయ కవి, ప్రథమాంకము.
3. History of the QutbShahi Dynasty -by H.K.Sherwani (Munshiram Manoharlal Publishers pvt ltd, First published January, 1974, P.No. 606, Chapter VII (Bhadrachalam east Godavari District , Andhra Pradesh 17 40N - 80 56 E)
4. P. Samba murthy, The Great composers, P.No. 56 (Bhadrachala Ramadas).
5. రామదాసు చరిత్రము - యాదవ దాసు, పుట 13 (యక్షగానం).
6. " " " పుట 15. "

"అక్కన్నను నీతండును
మక్కువ మేనల్లుడంచు మాతో జెప్పన్
నిక్కమే కద యీ మాటలు
గ్రక్కున తహసీలుదారుగా జేసెనను"[1] అని తానీషా రామదాసును తహసీల్దారుగా చేశాడు.

ఈ పై పద్యాలను పరిశీలించిన తానీషా కాలంలో అక్కన్న, మాదన్నల సహకారంతో గోపన్న భద్రాచలం తాలూకా తహసీలుదారుడైనాడని, ముందు గోపన్నయే స్వయంగా తహసీల్దారు పదవిని భద్రాద్రిలో ఇప్పించమని తానీషాను కోరడం జరిగిందని స్పష్టమవుతున్నది. అయితే ఇంతకు ముందు ప్రస్తావించినట్లు తానీషా కాకుండా అబ్దుల్లా కుతుబ్షా కాలంలోనే గోపన్న తహసీల్దారైనాడని చెప్పక తప్పదు.

ఇంతవరకు ఉన్న చారిత్రక ఆధారాలు, పరిశీలించగా రామదాసు కాలనిర్ణయాన్ని బట్టి కూడా అబ్దుల్లా కుతుబ్షా కాలంలో అక్కన్న, మాదన్నల సహకారంతో భద్రాచలం తాలూకా తహసీల్దారైనట్లు స్పష్టమయింది. అయితే "రామదాసు చరిత్రము"లన్నింటిలోను అబుల్ హసన్ తానీషా కాలంలోనే రామదాసు తహసీల్దారైనట్లు, రామదాసుకు ఆ పదవి అక్కన్న, మాదన్నలే ఇప్పించినట్లు చెప్పబడి ఉంది. రామదాసు చరిత్ర గ్రంథాల్లోని కథకు, చారిత్రక ఆధారాలకు వ్యత్యాసం ఉంది.

ఇక రామదాసు తహసీల్దారు పదవిలో ప్రవేశించి, తన పదవీ బాధ్యతలు నిర్వహించిన కాలంలో తాను ఎదుర్కొన్న సమస్యలు, రామదాసు ఆ వృత్తిని నిర్వహించిన తీరును పరిశీలించవలసి ఉంది. ఆ కాలంలోని రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను కూడా ఈ సందర్భంగా పరిశీలించడం అవసరం.

## 4.3. తహసీల్దారుగా రామదాసు :

గోల్కొండ సుల్తాను అనుమతి ప్రకారం తహసీల్దారుగా పాల్వంచ పరగణాకు విచ్చేస్తాడు గోపన్న. సత్త్వ గుణ సంపన్నుడైన గోపన్న ప్రజల కష్టసుఖాలు విచారిస్తూ కన్నబిడ్డల వలె చూస్తూ ఉంటాడు. ఇక్కడ, రామదాసు తహసీల్దారు కావడం ఇష్టంలేని హిందూమతద్వేషులు ముఖ్యంగా కొందరు గోల్కొండలో నున్న రాజాస్థానంలోని మహమ్మదీయులు రామదాసును భద్రాచలం వెళ్ళే దారిలోనే హత్య చేయించాలని కుట్ర పన్నడం, అప్పుడు శ్రీరాముడు శార్దూల రూపంలో వచ్చి ఆ శత్రువులను సంహరించి, రామదాసును రక్షించడం అనే కథనం కొన్ని "రామదాసు చరిత్ర"ల్లో ఉన్న విషయాన్ని ప్రస్తావించ వలసి ఉంది.

### 4.3.0. రాముడు శార్దూల రూపంలో వచ్చి రామదాసును రక్షించుట :

ఈ కథనం గూర్చి కొన్ని గ్రంథాల్లో ఈ విధంగా చెప్పబడి ఉంది. "రామదాసు భద్రాచలము చేరుచుండు దారిలో హిందూ మత ద్వేషులు రామదాసును జంప యత్నించిరిగాని రాముడు శార్దూల రూపమున గన్పడి, హంతకుల కొందరిని జంపి మిగిలిన వారిని తరిమి వేసెను"[2] అని నారుమంచి సుబ్బారావు గారు వ్రాశారు. మిన్నికంటి గురునాథ శర్మ ఈ సంఘటనను గూర్చి ఈ విధంగా వ్రాశారు. "గోపన్న తహసీల్దారు పదవిని పొందిన తర్వాత గోపన్న మహావైభవముతో భద్రాద్రికేగుచుండెనని సితారా (తానాషా భార్య, అబ్దుల్లా కుతుబ్షా కుమార్తె) విని ఓర్వలేక దురాగ్రహగ్రస్తయై ఇబ్రహీంను పిలిపించి కొందరు తస్కరుల నంపి మధ్యే మార్గమున రామదాసుం జంపుమని యాదేశించెను.

ఇబ్రహీం వల్లెయని కఠిన చిత్తుల గాలాయు సత్వకారుల దీర్ఘ దండ హస్తుల దన నచ్చిన భటుల నంప వారు ఘోర కాంతార మధ్య ప్రదేశంబున దారసిల్లి రామదాసు నరికట్టిరి. అప్పుడు రామదాసు గారు ద్విగ్న చిత్తుడై చేయునది లేక

1. రామదాసు చరిత్రము - యాదవ దాసు (యక్షగానం), పుట 16.
2. సంగీత మహర్షులు - మొదటి భాగం, నారుమంచి సుబ్బారావు గారు పుట 37.

"ఆపదామప హర్తారం దాతారం

సర్వ సంపదాం - లోకాభిరామం శ్రీరామం

భూయో భూయో నమామ్యహమ్" అని శ్రీరాముని ప్రార్థించి, తన ఆపద నుండి రక్షింపమని వేడుకొన్నాడు. రాముండు అంతట ఘోర వ్యాఘ్రాకారంబునన్ ఏతెంచి యాముష్కర తురుష్కుల దఱిమి కొందఱి వధించి యొకచో గూర్చుండెను. అప్పుడు రామదాసా శార్దూలమ్ముం జూసి భయమ్ము సెందక యిది రామానుగ్రహమ్ము కాక మఱేమని భజన సేయుచు దాని కభిముఖుండై . . . "

"అడుగు దాటి కదలనియ్యను -

నాకభయ మీయక నిన్ను విడువను" అనే పాట పాడగా ఆ వ్యాఘ్రము చూచి పిదప నల్లనంజని యగోచరమయ్యె"[1] అని వ్రాశారు. ఈ కీర్తన రామదాసు కారాగార వాసంలో ఉండగా పాడిన కీర్తన. అయితే ఈ సందర్భంగా రామదాసు పాడిన కీర్తన ఇది అని చెప్పవచ్చును.

" ఏమయ్యా రామ బ్రహ్మేంద్రాదులకునైన

నీ మాయ దెలియ వశమా !

కామారి వినుత గుణధామ కువలయ దళ

శ్యామ నను గన్న తండ్రీ రామా !!

సుతుడనుచు దశరథుడు హితుడనుచు

సుగ్రీవు-డతి బలుండనుచు కపులు

క్షితి నాథుడనుచు భూపతులు గొలిచిరి గాని

పతిత పావనుడనుచు మతి దెలియలేరైరి"[2]

రామా నీ మాయలు ఎవరికి తెలియవు. ఎవరిని ఏ సమయంలో రక్షించడానికి ఏ రూపంలో వస్తావో తెలుసుకోవడం కష్టం. వ్యాఘ్ర రూపంలో వచ్చి నన్ను కాపాడడానికి వచ్చిన నా రాముడివే నీవు అని రామదాసు శ్రీరాముని స్తుతించాడు. ఈ పాట ఈ సందర్భానికి తగినదిగా భావించవచ్చు. ముదిగంటి గురునాథ శర్మగారు "సితార, రామదాసు విషయంలో చేసిన మోసాన్ని గూర్చి ఈ విధంగా తెలియజేశారు.

### 4.3.1. సితార-రామదాసు యెడ చేసిన మోసము :

ఈ ప్రయత్నము నిష్ఫలమగుట వలన బాడు పెద్దపులి యెటనుండి వచ్చెనోయని నిట్టూర్పు పుచ్చి కానిమ్ముతడుద్యోగముం దక్కించు కొన్నం జూతము లెమ్మని తలయూపి కొందఱు గూఢచారులం బిలిచి "రామదాసునందు తప్పలు వెదకుచు నతని యాజ్ఞ తాలూకాలో జెల్లకుండునట్లు రైతుల కుద్బోధించి సిస్తు వసూలు గాకుండునట్లు చేయుడని పంపెను. ఆచారులును భద్రాద్రికి వచ్చి మారు వేసములతో జరించుచు రామదాసు రామాలయము నిర్మింపించు సమయమున హితుల వలె వచ్చి ఖజానాలోని సొమ్మును బ్రస్తుతము వ్యయము చేసి పర్యాయమున జందాల మూలకముగా నింప వచ్చునని గఱపియట్లు చేయించి యా సమాచారమును వెంటనే సితారాకెఱింగించిరి.

'పిట్ట చిక్కెనని సితారా సంతసించి యా వేగుల వాండ్రకు బారితోషికముల బంపి యిబ్రహీమును రప్పించి, "దాసు సిస్తును వ్యయము చేయుచున్నాడు. నవాబుగారు మఱల మీ వలన వసూలు చేయుంపుమా యని రైతుల భయపెట్టి సిస్తు వసూలు గాకుండునట్లు గ్రామములలో బ్రచారము సాగించి నవాబు గారిని రామదాసు ధిక్కరించుచున్నాడని మహజరుల నంపునట్లు చేయవలసినదని"

1. కంచెర్ల గోపన్న అను రామదాసు -ముదిగంటి గురునాథ శర్మ పుట, 81-82, ఐదవ ప్రకరణము.

2. భక్త రామదాసు కీర్తనలు - (సంకలనం - దాశరథుల బాలయ్య) కీర్తన 43, పుట 41.

చెప్పి పంపి యతండు పోవుచుండ మఱలంబిలిచి ఓయీ! ఉక్కు తునియలవంటి మోటకులంబంపి భద్రాద్రి ఖజానాను గొల్లగొట్టించుము. మఱవకుము. ఈ హిందువులకును సింహస్వప్నములమయ్యెదము గాక యని చెప్పి సెలవిచ్చి పంపెను."[1]

అంత నొకనాడు మాదన్నగారు లెక్కలు తనిఖీజేసి భద్రాద్రి పైకము రాలేదని తెలుసుకుని వెంటనే విశ్వాసపాత్రులగు గూఢచారులంజీరి "నవాబు గారు భద్రాద్రి తాలూకా పైకము రాలేదని గోపించుచున్నారు. కాన నీవు వెంటనే సొమ్ము వసూలు చేసి పంపవలయును. లేకున్నంగీడు మూడును. నీయభ్యుదయమునకు భంగము గలిగింపిగొందఱ గోముఖవ్యాఘ్రములున్నారని యెఱింగి జాగరూకుడవై కను గలిగి మెలగవలయు సుమా ! అని గోపన్నకు జెప్పి బంపినాడు. తానా మాటలు గూఢచారుల వలన విని కానిమ్ము "భవితవ్యతా బలవతీ " కాగలది కాకపోదు. అంతకు శ్రీరామచంద్రమూర్తియే కలండని యాచారులనంపివేసి రామదాసు కంకణము గట్టుకుని శ్రీరామ కల్యాణ మహోత్సవాలోకానంద సముద్రమున మునిగియుండ యానాటి నడిరేయి ఇబ్రహీమ్ పంపిన దొంగల గుంపులు ఖజానా తలుపులు బ్రద్దలు కొట్టి లక్ష యేబది నేలపైకమును హరించిరి.

ఆ మర్నాడే రామదాసు తమ ధనమును వ్యయము చేసి దేవాలయముం గట్టించినాడు. కొందరు సిస్తును చెల్లించుటకే భయపడినారు. "ధర్మ కార్యములకే ఆ ధనము ఉపయోగపడుచున్నదని ఆ ధనం వసూలు చేశాడు రామదాసు.[2]

"సితార తానీషాతో రామదాసుపై లేనిపోనివి చెప్పి అతనిపై ద్వేషము రగిల్చినది. మాదన్నపై కూడా దురహంకారముతో లేని పోనివి చెప్పినది. హిందూమత ద్వేషియైనది. రామదాసు ప్రభుత్వ ధనమంతయును వ్యయపరుస్తున్నాడని సితార తానీషాతో చెప్పినది. ఈమె పరమతము పై ద్వేషం కల్గి ఉండడం తానీషాకు బాధ కలిగించింది."[3]

"సితారే రామదాసు ఖైదులో ఉండడానికి కారకురాలని మిన్నికంటి గురునాథ శర్మగారు అభిప్రాయపడ్డారు.

### 4.3.2. రామదాసు చెల్లించవలసిన ధనం :-

తాలూకాలో వసూలు కావలసిన సిస్తు రెండు లక్షల యేబది వేలు దొంగలు దోచుకొనిన లక్ష యేబది వేలు. మిగిలిన రెండు లక్షలు - ? (రామాలయ నిర్మాణానికి ఖర్చు చేసినివి) మొత్తం యీ ఆరులక్షల పైకము రామదాసు క్రిందబడెను. యీ ఆరు లక్షలపైకము చెల్లించవలెను.[4] అని గురునాథ శర్మ గారు వ్రాశారు. రామదాసు చెల్లించవలసిన ఆరు లక్షల పైకం రానందున తానీషా కడకు భటులను బంధించి తీసికొని రమ్మని హుకుం జారీ చేశాడు. అంతట తానీషా భటులు రామదాసును బంధించిరి.

"రామాలయ నిర్మాణానికి ఖర్చు చేసినది రెండు లక్షల రూపాయలే అని రామదాసు తానీషాకు విన్నవించుకున్నాడు. ఆరు లక్షల రూపాయలు తానీషాకు చెల్లించకున్నందున జైలులో పడెను".[5] ఇది జరిగిన విషయం అని, రామదాసు యెడ సితార చేసిన మోసం గూర్చి వివరించారు గురునాథ శర్మగారు. దీన్ని బట్టి రామదాసు నిజానికి ఆరు లక్షలల్లో రెండు లక్షలు మాత్రమే రామాలయ నిర్మాణానికి ఖర్చు చేశాడు. మిగిలిన రెండు లక్షల యాభై వేలు దొంగలచే సితారా దోపిడీ చేయించింది. 1 లక్ష యాభై వేలు వసూలు కావలసిన పన్ను తాలూకు పైకం వసూలు కానీయలేదు సితార మనుషులు. ఇది జరిగిన

1. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ పుట 84.
2. " " " పుట 85.
3. " " " పుట 89
4. " " " పుట 91.
5. " " " పుట 94.

మోసం. హిందూ మత ద్వేషియైన సితార చేసిన ద్రోహానికి రామదాసుపై ఆరు లక్షల భారం పడింది. ఇది జరిగిన అన్యాయం.

మిన్నికంటి గురునాథ శర్మగారు "సితార"ను ఒక హిందూ మత ద్వేషిగా చిత్రించగా, ధర్మవరం గోపాలాచార్యులు గారు మాత్రం తమ "రామదాసు నాటకం"లో సితారను రామదాసు యెడ, అతని భార్య యెడల గౌరవం, ఆదరాభిమానాలు గల స్త్రీగాను, మాదన్న గారన్నా అతని భార్యన్నా గౌరవ భావం ఉన్నట్లుగాను చిత్రించారు. అందుకు ఈ సంఘటనలే నిదర్శనం. "తానీషా భార్య సితార, మాదన్న భార్య శ్యామలాంబ, కుమార్తె కమలాంబ అంటే ప్రేమాభిమానాలు చూపేది. సితార కుమార్తె దిలారా మాదన్న గారి కుమార్తె కమలాంబలు స్నేహితులు. కమలకు చిన్న వయస్సులో 8 సం।ల ప్రాయంలో వివాహం నిశ్చయం కాగా బాల్య వివాహం మంచిది కాదని సితార శ్యామలాంబతో అంటుంది. సితారకు, మాదన్న భార్యకు మంచి స్నేహం ఉంది. అక్కన్న మాదన్నలు రామదాసు మేనమామలు. మొదట మాదన్న కుమార్తె కమలకు వివాహం వేరొకరితో నిశ్చయం కాగా, కొన్ని పరిస్థితుల వల్ల అతనితో కాక, రామదాసుతో కమల వివాహం అదే ముహూర్తానికి జరుగుతుంది. పురోహితుడు రామదాసుకు కారాగృహ ప్రాప్తి ఉంటుందని కూడా చెప్పాడు. అయినా సరే మాదన్న తన కూతుర్ని తన మేనల్లుడైన రామదాసుకు ఇచ్చి వైభవోపేతంగా వివాహం జరిపిస్తాడు.[1]

రామదాసు భద్రాచలం తహసీల్దారు కావడానికి సితార కూడా తానాషాకు చెప్పి సిఫారసు చేయించడం, ఒక కారణంగా ఈ నాటకంలో ఉంది. సితార హిందూ మతాభిమానిగా ఈ నాటకంలో చిత్రీకరింపబడింది. అయితే చరిత్రకారులు మాత్రం సితారకు రామదాసన్నా , అక్కన్న, మాదన్నలన్నా ఎంతో ద్వేష భావం ఉన్నట్లు వ్రాశారు. రామదాసు తహసీల్దారుగా ఉన్నప్పటి కాలంలోని చారిత్రక, మత, రాజకీయ పరిస్థితులకు అవి రామదాసు కారాగార శిక్షకు ఏవిధంగా దోహదకారులో తెలుసుకోవడం అవసరం.

## 4.4. రాజకీయ పరిస్థితులు :

రామదాసు తహసీల్దారు ఉద్యోగం చేస్తున్న కాలంలో, మాదన్న మహామంత్రిగాను, అక్కన్న షర్ లష్కర్‌గాను ఉన్నారు. పదవిలో ఉన్న రామదాసు రైతుల్ని ఆదరాభిమానాలతో చూస్తూ, పన్నులు శ్రద్ధగా, ధర్మంగా వసూలు చేస్తూ ఉండేవాడు. భద్రాచల రామ కైంకర్యానికై ఆ ధనం ఖర్చు చేస్తూ ఉండేవాడు. వసూలు చేసిన పైకం గోల్కొండకు వెళ్ళడంలేదు. మొదట అతడు సాధారణమైన తహసీల్దారుగానే వచ్చాడు. తన పనియందు చాలా జాగరూకుడై ఏ మాత్రం లెక్కల్లో ఎక్కువ తక్కువలు రానీయక పాడి తప్పక తహసీలు చేస్తుండేవాడు. రైతుల వద్దన నుండి 2 సం॥లుగా వసూలు కాని ధనం అంతా వసూలు చేశాడు. భద్రాచలం నుండి మొదట ప్రభుత్వ ధనం అంతా గోల్కొండకు చేర వేస్తుండేవాడు. రామదాసు ధర్మంగా తహసీల్దారీ వృత్తిని నిర్వర్తిస్తుండే వాడని చెప్పడానికి సింగరదాసు రచించిన "రామదాసు చరిత్రం"లోని ఈ తార్కాణా నిదర్శనం.

"ఎప్పుడు నీతడె తహసీల్ పనిలో
నిందుండ జనులెన్న
నొప్పగ బైకము వసూలు చేసెను
నోర్పుతోడ గోపన్న
సర్కార్ హుజూరు కంప

1. ధర్మవరం గోపాలాచార్యులు - రామదాసు నాటకం , ద్వితీయాంకము.

పేర్మోని పాదుషా ప్రేమ గల్గితా బెంపలర వర్తింప
దాన ధర్మముల నుపకారంబుల
దైవ భక్తి గోపన్న, మానక చేయుచునుండె
నప్పడు మహిలోపల బ్రజలెన్న"[1]

తహసీల్దారుగా తన వృత్తిని సక్రమంగా నిర్వర్తిస్తూ, తనదైవమైన రాముని పూజిస్తూ, గోపన్న పది మందికి ఆదర్శంగా నిలిచాడు. రామదాసు నిరంకుశుడై ప్రవర్తించక ధర్మబద్ధంగా భూస్వాముల వద్ద నుండి శిస్తు వసూలు చేసి ధర్మాత్ముడుగా పేరు గడించాడు. నిరంతరం రామ నామ స్మరణం చేస్తూ అందరి మెప్పు పొందుతూ, రైతులందరికి ప్రీతి పాత్రుడైనాడు. తాను చేసే ప్రతి కార్యం వెనుక రాముడే ఉండి అన్ని విధాల నడిపిస్తూ తన చేత ఈ కార్యాలన్నీ చేయిస్తున్నాడని భావించేవాడు గోపన్న.

రామ నారాయణ కవులు వ్రాసిన నాటకంలో రామదాసు ఎంతటి ధర్మాత్ముడో, ఉదార స్వభావుడో చెప్పడానికి ఈ సంఘటనను ప్రస్తావించారు తమ నాటకంలో " దుమ్ముగూడెం అనే గ్రామంలో వెంకటరెడ్డి అనే అతని ఒక ఎకరా పొలం నీరు నిలిచి పొలం పండక పోవడం వలన శిస్తు కట్టలేనని గోపన్నను కోరాడు. గోపన్న ఆ కుటుంబం ఎలా ఆ సంవత్సరం జీవించగలదని భావించాడు. అతని శిస్తు రద్దు చేశాడు".[2] ఇది రామదాసు మంచితనానికి నిదర్శనంగా జరిగిన సంఘటన అని చెప్పవచ్చు. ఇది కథ కావచ్చు. కాని రామదాసు గొప్పతనాన్ని చాటడానికి కవులు ఈ విషయం ప్రస్తావించారు. "శ్రీ రామదాసు నాటకం"లో కేశిరాజు వేంకట సుబ్బారాయ కవి గోపన్న తహసీల్దారుగా భద్రాచలంలో ఉండి 2 సం॥లుగా వసూలు కాని శిస్తును వసూలు చేశాడు అని తెలియజేశాడు".[3] ఈ విధంగా రామదాసు ధర్మ బద్ధంగా తహసీల్దారీ వృత్తిని సక్రమంగా నిర్వర్తిస్తూ అందరి మన్నలు పొందాడు.

"భద్రాచలం" అనే వ్యాసంలో శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు గారు క్రీ.శ. 1652-56 ప్రాంతాల్లోని గోల్కొండ పరిస్థితుల్ని గూర్చి ఇలా తెలియజేశారు.[4]

### 4.4.0. మీర్ జుమ్లా సయ్యదమమదుకు, రామదాసుకు గల సంబంధం :

మీర్ జుమ్లా అనే పారశీకుడు అబ్దుల్లా కుతుబ్షా కాలంలో ప్రధాని. ఇతని పేరు సయ్యదహమదు. మీర్‌జుమ్లా అనేది బిరుదం. 20 సం॥లు గోల్కొండ వ్యవహారాలు చక్కదిద్దెను. అక్కన్న మాదన్నల మేనల్లుడు కంచెర్ల గోపన్న హైదరాబాదునందు నివసిస్తున్న మీర్ జుమ్లా దయను సంపాదించి భద్రాచలం పరగణాకు తహసీల్దారు పదవిని సంపాదించెను. ఆ ఉద్యోగం లభించుటకు అక్కన్న, మాదన్నగారలు ఏమయినా సహాయము చేసి యుండిరేమో తెలియదు. ప్రతిభాశీలురైన బ్రాహ్మణులను అనేక మందిని మీర్‌జుమ్లా అనేక చోట్ల ఉద్యోగములందు నియమించాడు.

గోపన్న భద్రాచలానికి క్రీ.శ.1652కు పూర్వం తహశీల్దారుగా ప్రవేశించాడు. అప్పటికి ఇంకా అబ్దుల్లా కుతుబ్షా గోల్కొండను పరిపాలిస్తున్నాడు. క్రీ.శ. 1652 మొదలుకొని 1656 సంవత్సరాల మధ్య గోల్కొండ వ్యవహారాలు క్లిష్ట పరిస్థితిలోకి వచ్చాయి. మీర్‌జుమ్లా, తన అధికారాన్ని దుర్వినియోగ పరచటానికి ప్రారంభించాడు. అతనిని శిక్షించడానికి అబ్దుల్లా ప్రయత్నించాడు కాని తనకు గోల్కొండయందు నిలువ నీడ కూడ ఉండదనే భయంతో మీర్ జుమ్లా (సయ్యదహమదు) ఔరంగజేబును చేరాడు. ఔరంగజేబు ఆనాడు తండ్రి షాజహాను పనుపున గోల్కొండ యీయవలసిన కప్పాన్ని రాబట్టుకోడానికి దక్కనుకు వచ్చాడు.

1. భద్రాచల రామదాసు చరిత్రము - సింగరదాసు - బులుసు వెంకట రమణయ్యగారి పరిష్కృతము. పుట 63.
2. రామదాసు (నాటకం) రామ నారాయణ కవులు తృతీయాంకము.
3. శ్రీ రామదాస నాటకము - శ్రీ కేశిరాజు వేంకట సుబ్బారాయ కవి , ద్వితీయాంకము.
4. భద్రాచలము - శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు - భారతి, జూలై, 1951, పుట 651.

క్రీ.శ. 1655-56 సంవత్సరాల మధ్య గోల్కొండను మిక్కిలి క్షోభ పెట్టాడు. హైదరాబాదు పట్టణాన్ని కొల్లగొట్టి దోచుకున్నాడు. ఔరంగజేబు చేసిన దుష్కృత్యాల వల్లనైతేనేమి, మీర్‌జుమ్లా యొక్క స్వామి ద్రోహ కార్యాల వల్లనైతేనేమి గోల్కొండ అనేక కష్టాల పాలయింది. అది మొదలుకొని ఐదారేండ్ల వరకు గోల్కొండ వ్యవహారాలు చక్కబడ లేదు. సుల్తానబ్దుల్లా తల్లి హయత్ బక్షీ బేగంతో గల రహస్య ప్రేమానుబంధాన్ని పురస్కరించుకొని మీర్ జుమ్లా సయ్యదమముదు తానే సుల్తాను అయినట్లు రాజ్య పాలన చేశాడు.

ఔరంగజేబు ఢిల్లీకి మరలి పోయే వరకు అబ్దుల్లాకు మనశ్శాంతి లేదు. ఏటేటా పెరిగిపోతున్న ధనం మొత్తాన్ని ఢిల్లీకి కప్పం క్రింద కట్టడానికి డబ్బు కనబడడం లేదు. రాజ్య వ్యవహారాలన్నీ అసమర్థుడైన అబ్దుల్లా పరిపాలనం క్రింద అస్తవ్యస్తాలౌతున్నాయి. అటువంటి దుస్థితికి వచ్చిన దుష్ట కాలంలో గోపన్న భద్రాచలంలో తహశీల్దారు పదవిలో ఉన్నాడు. 1658-1667 సం॥ల మధ్య పరిస్థితి ఇది. తర్వాత కొన్ని సంవత్సరాలు అబ్దుల్లాకు మొగలాయి చక్రవర్తి యొక్క ఒత్తిడి తొలగిపోయింది. ఆ తరుణాన్ని పురస్కరించుకొని గోల్కొండ వజీర్లు రాజకీయ ఆర్థిక పరిస్థితుల్ని చక్కబెట్టుకోవడం ప్రారంభించారు. ఆ విధంగా ఒక పది సంవత్సరాలు గడిచింది. ఆ మధ్య కాలంలో 1658-1667 సంవత్సరాల మధ్య భద్రాచల రామదాసు కథ జరిగింది. 1658-1667 సం॥ల మధ్య కాలంలో ఆలయ నిర్మాణం జరిగింది. పరగణాల నుండి పైకాన్ని కట్టుదిట్టంగా వసూలు చేయడానికి గోల్కొండ దివాన్లు శ్రద్ధ వహించి, ఆ పనికి పూనుకొన్నారు. గోపన్నగారు భద్రాచలం పరగణా నుండి పైకం చెల్లించడం మాని, ఆ ద్రవ్యాన్నంతా శ్రీ రామచంద్ర మూర్తి వారికి దేవళ ప్రాసాదాలు నిర్మించి, ఉత్సవాలు చేస్తుండేవాడు.

### 4.4.1. గోపన్న ఖైదునందుంచ బడుట :

గోపన్న గావించిన దానికి, సర్కారు పైకం చెల్లించని దానికి, గోల్కొండకు తీసుకొని పోయి విచారించి బంధించారు. అది అబ్దుల్లా పాదుషా కాలంలో జరిగింది. గోపన్న గావించిన దుష్కార్యానికి శిక్ష విధించింది తానీషా కాదు. గోపన్న పండ్రెండు సంవత్సరాలు కారాగార వాసమందు పడరాని పాట్లు కష్టాలు పడుతూ, రామచంద్రునికి మొఱ పెట్టుకొంటూ భక్త పరాధీనుడైన పరమాత్ముడు, తనను రక్షింపక పోవునా అనే ఒక విధమైన మూఢ నమ్మకంతో జీవితాన్ని గడిపాడు.

"క్రీ.శ. 1672 మే నెల 1వ తేదీన అబ్దుల్లా కుతుబ్షా మరణించాడు. అబుల్ హసన్ పరిపాలన ప్రారంభించిన కొంత కాలానికి గోపన్న చెఱ విముక్తుడైనాడు. అప్పటికి మాదన్నగారు మహా ప్రధాని లేక దివాను పదవి యందును, ఆయన అన్నగారు షర్ లష్కర్ లేక సమస్త సేనాధ్యక్షుడుగను ఉన్నారు. మీర్ జుమ్లా వద్ద మొదట వీరు నెలకు పది వరహాలు జీతానికి ఉద్యోగంలో చేరి క్రమంగా తమ ప్రతిభా విశేషాలు చూపి మీర్ జుమ్లా దయకు పాత్రులై ఉన్నత స్థితికి వచ్చారు. అయినను గోపన్న గారికి విముక్తి అక్కన్న, మాదన్న గార్ల వలన కలిగెనని యూహింపనెంత మాత్రము వీలులేదు. అయ్యది దైవ సంఘటనముల వలన జరిగెను"[1] అని రామదాసు విడుదల విషయాన్ని గూర్చి కొండపల్లి రామచంద్రరావు గారు తెలియజేశారు. ఇక్కడ గోపన్నకు, మీర్ జుమ్లాపై ఉన్న ద్వేష భావాన్ని గూర్చి, వ్యతిరేకత గూర్చి ప్రస్తావించ వలసి ఉంది. శ్రీ బాలాంత్రపు రజనీ కాంతరావు గారు ఈ విధంగా తెలియజేశారు.

"కొందరు అపాత్రులైన మానవులను స్తుతిస్తూ కవిత్వం చెప్పినందుకు గోపన్న పశ్చాత్తాపం దాశరథీ శతక పద్యాల్లో ఒక దానిలో కనబడుతుంది. ఈ అపాత్రుడెవరో కాదు , మాదన్నగారి సిఫారసుపైని గోపన్నను పరీక్షించి తాశీల్దార్ ఉద్యోగంలో చేర్చుకున్న అప్పటి గోల్కొండ ప్రధానమంత్రి, మీర్ జుమ్లా - మహమ్మద్ సయ్యద్. ఆ పద్యం 'మసగొని రేగు పండ్లకును'[2] అనేది.

1. శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము - కొండపల్లి రామచంద్రరావు 1961, మే, పుట 31-32.

2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పీఠిక బాలాంత్రపు రజనీకాంతరావుగారు పుట 9.

" మనగొని రేగు బండ్లకును మౌక్తికముల్వెల వోసినట్టు దు
ర్ధ్యనసము జెంది కావ్యము దురాత్ముల కిచ్చితి మోసమయ్యె
నా, రసనకు బూత వృత్తి సుకరంబుగ చేకుఱునట్లు వాక్సుధా
రసములు చిల్క బద్య ముఖ రంగమునందు నటింపవయ్య[1]
నం, తనమును జెంది భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ"

రామా! ఇంతకు మునుపు రేగు బండ్లకు ముత్తెములు వెలపోసినట్లు ధనము కాశపడి చక్కని కావ్యములను దుష్ట మానవుల కిచ్చి మోసపోయితిని ఇప్పుడందుచే పరిశుద్ధి తప్పిన నా నాలుక పవిత్రమగునట్లు పద్యములతో గూడిన నా నోట నిలిచి సంతసముతో నోటిని బవిత్రము చేయుము.

"తాను కవిత్వం చెప్పి స్తుతించిన మీర్ జుమ్లా - ఆ తర్వాత జరిపిన చారిత్రిక సంఘటనల్లో గోల్కొండ పాదుషాకు వ్యతిరేకంగా తిరుగబడి, మొగల్ ప్రభుత్వపు ప్రతినిధిగా మారి, గోల్కొండ పాదుషాకు శత్రువైన విషయం ఈ పద్యంలో గోపన్న సూచించాడు. దుష్ట మనస్కునిపై కవిత చెప్పి మోసపోయానంటాడు. కొన్ని కావ్యాలు కూడా వ్రాసి ఈ దుర్మార్గునికి అంకితమిచ్చినట్లు తెలుస్తుంది. కాని ఆ కావ్యాల పేర్లు తెలీదు. అబ్దుల్లా కుతుబ్షా ఆస్థానానికి 1650లో క్షేత్రయ్య ఆహ్వానించబడినాడు. బలవంతుడైన గోల్కొండ పాదుషా క్షేత్రయ్యకు బహుమానమంపి తులసిమూర్తి అను వాగ్గేయకారునితో వివాదం తలపెట్టిన వేళకు రమ్మని ఆహ్వానించిన వాడు అబ్దుల్లా. అది 1650. తుపాకుల కృష్ణ భూపతి అనే చెంజి పాలకుని ప్రోద్బలంతో ప్రధానమంత్రియైన మీర్ జుమ్లా అబ్దుల్లా అనతిపైని క్షేత్రయ్యకు ఆహ్వానం పంపాడు. ఆ మీర్ జుమ్లా మహమ్మద్ సయ్యదే. తన రెవెన్యూ శాఖలో ఉద్యోగులయిన అక్కన్న, మాదన్నల బంధువు కంచెర్ల గోపన్నను స్వయంగానే పరీక్షించి, అతని ప్రతిభా వైదుష్యాలకు, బహు భాషా పరిజ్ఞానానికి మెచ్చుకొని భద్రాచలం తహశీల్దారు ఉద్యోగం వేయించిన సంవత్సరమూ 1650యే.

పద రచన పోటీలో నెగ్గిన క్షేత్రయ్య తన మువ్వ గోపాలునికి పూర్వావతార రూపుడైన భద్రాచల శ్రీ రామచంద్రునికి కృతజ్ఞతా పూర్వకమైన సేవ చేయడానికి భద్రాచల దేవాలయ దర్శనం చేసినప్పుడు, అప్పడే తాశీల్దారు పదవి చేపట్టిన కంచెర్ల గోపన్న(రామదాసు) ఆ వాగ్గేయకారుని అలయ మర్యాదలతో ఆహ్వానించి ఉండ వచ్చన్నది మా ఊహ"[2] అని బాలాంత్రపు రజనీకాంతరావుగారు స్పష్టం చేశారు. క్షేత్రయ్య, రామదాసు లిరువురు సమకాలికులు. మీర్ జుమ్లా మహమ్మదుసయ్యదు ఉన్న కాలంలోనే వారిరువు ఉన్నారని దీన్ని బట్టి స్పష్టమౌతున్నది.

### 4.4.2. అక్కన్న, మాదన్నలు, తానీషాతో రామదాసుకు గల సంబంధ బాంధవ్యాలు :

అబ్దుల్లా తానీషా మరణానంతరం 1672 సం॥లో అబుల్ హసన్ కుతుబ్షా గోల్కొండ నవాబు అయినాడు. అప్పటి దేశ రాజకీయ పరిస్థితులు ఇవి. అక్కన్న, మాదన్నలు అత్యున్నత పదవుల్లో తానీషా కొలువులో ఉన్నారు. 16వ శతాబ్ది నాటి గోల్కొండ రాజ్యం రెండవ ఈజిప్టని ఖ్యాతి వహించింది. మాదన్న మహామంత్రి తానీషాకు, శివాజీ మహారాజుకు స్నేహం కుదిర్చాడు. "యజమానుని రాజ్యము కాపాడ వలయుననియు, హిందువుల గౌరవమధికము చేయుటకై హిందువుల యైక్యమభివృద్ధి చేయవలయుననియు, మాదన్న పంతులు శ్రీ శివాజీకిని, తానీషాకును స్నేహము కుదిర్చెను. మాదన్న పంతులు గారాహ్వానము చేసినందున 1676లో శివాజీ గోలకొండకు బోయెను"[3]. అని ముదిగంటి గురునాథ

1. దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న పుట 9. పద్యం .7.(వావిళ్ల రామస్వామి అండ్ సన్స్ ప్రచురణ).
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పీఠిక, బాలాంత్రపు రజనీకాంతరావు గారు పుట 11.
3. కంచెర్ల గోపన్న అను రామదాసు - ముదిగంటి గురునాథ శర్మ, పుట 55.

శర్మగారు తెలియజేశారు.

"ఆనాడు గోల్కొండలో సర్వాధికారములో ప్రభుత్వము చేయుచున్న యీ మంత్రి పుంగవుల యనుగ్రహము పొంద వలెనని (అక్కన, మాదన్నలు) మన దేశము వారు గాక ఫ్రెంచి, ఇంగ్లీషు వారు గూడ విశ్వ ప్రయత్నములు చేయుచుండిరి. అప్పుడు ఈస్టు ఇండియా కంపెని వారు చిన్న వర్తకులు. చెన్న పట్టణము ఒక చిన్న గ్రామము. ప్రస్తుతము జార్జి టవున్ అనబడు స్థలము మాత్రము కంపెనీ వారి స్వాధీనములో నుండెను. మచిలీ పట్టణములో వీరికి నొక గిడ్డంగి యుండెను".[1] 1682 సం॥లో మాదన్న అత్యంత వైభవోపేతంగా ఉండెను. తన కుమారునికి అదే సంవత్సరం వివాహం చేశాడు".[2] అప్పడే కుంఫినీ వారు వీసెడు బంగారపు గొలుసులు కొన్ని బంపించిరి. మఱియు ఉగాది కానుకలని పేరు పెట్టి 400 వరహాలు మాదన్న గారికంపి వారి యనుగ్రహము కంపెనీ వారు అభ్యర్థించిరి".[3] ఇక్కడ అబుల్ హసన్ భార్య గూర్చి చెప్పడం ముఖ్యం.

### 4.4.3. హిందూ మత ద్వేషి - సితార :

"అబ్దుల్లా హుసేన్ కుమార్తె సితారా. అబుల్ హసన్ తానాషా భార్య. ఈమె హిందువుల యందు ద్వేష భావం కలదై సమయం వచ్చినప్పడెల్లా వారిని అణగ ద్రొక్క చూచుచుండెడిది. ఐనను మహాత్ముడు మాదన్న గారి యనుపమాన ప్రజ్ఞా బలమునకును ధర్మాత్ముడగు భర్త సమదృష్టికిని భయపడుచునే యుండెను. సర్వ సేనాధ్యక్షుడగు ఇబ్రహీం అనునొక మహమ్మదీయుడీమె యాలోచనముల నెఱవేర్చుచు మాదన్న గారికి సైతమపాయము గల్గింప దలంచి, నీలాల విలాసముల గామదాసుడగు తానీషాను బ్రముగ్ధునింజేసి హైందవ ద్వేషిగా జేయుమని సితారకు బోధించుచుండెను".[4]

"రామదాసుకు తహసీల్దారీ పదవిని ఈయనీయకుండా చేయదలచింది సితార. కాని, తానాషా మత సహనం కలవాడైనందు వలన ఆ పదవి హిందువు అయిన రామదాసుకే మాదన్న కోరికపై ఇచ్చాడు. అలాగే సితార రామదాసుపై, మాదన్నపై లేనిపోనివి చెప్పి తానీషాకు రామదాసుపై, మాదన్నపై ద్వేషం రగిల్చింది. అయితే రామదాసుపై కోపోద్రిక్తుడయ్యాడు కాని, మాదన్నను వదులుకో దలచలేదు తానీషా అందుకే "మాదన్న గారి వలననే ఈ గోల్కొండ రాజ్యం నిలిచి యున్నదని, మాదన్న గారిపై గౌరవం కల్గి ఉండిన తానాషా అన్నాడు సితారతో మాదన్నయే లేకుండిన మహారాష్ట్ర వీరులచే బడియుండెడిది, లేదా ఔరంగజేబు కాజేసెడి వాడే".[5] అని సితారతో మాదన్న గారి గొప్ప తనాన్ని గూర్చి తానాషా తెలియజేశాడు.

"ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము" నందు రజనీకాంతరావు గారు ఈ విధంగా రామదాసు తహసీల్దార్ పదవి గూర్చి, ఆయన ఖైదులో ఉంచబడటానికి దారి తీసిన పరిస్థితులను గూర్చి తెలియజేశారు. " రామదాసు తహసీల్దారుగా ఉండగా రైతుల వద్దనుండి శిస్తు వసూలు చేస్తున్నాడు. కాని ఆ ద్రవ్యం గోల్కొండకు చేరుట లేదు. మొగలాయి చక్రవర్తి ఔరంగజేబు పరిపాలిస్తున్న కాలం అది. గోల్కొండపై కన్ను వేసి ఉంచాడు. మొగలాయి చక్రవర్తి అయిన ఔరంగజేబు నుంచి దండయాత్రల వల్లను కప్పముల కోసము ఒత్తిడి వల్లనూ చికాకు పడుతున్న తానాషా రామదాసు అంటే ఈర్ష్యాళువులైన తురక సర్దారుల చెప్పడు మాటలు విని, శిస్తు పైకం యిమ్మని వెంటనే రామదాసుకు కబురు పంపాడు. రామదాసు

1. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ పుట 56.
2. " " " పుట 6.
3. " " " పుట 7.
4. " " " పుట 81.
5. " " " పుట 89.

పైకం ఈయలేకపోగా రాజ ద్రవ్యాపహరణం నేరం మీద అతనిని జైలులో ఉంచి పండ్రెండేళ్ళు నానా బాధలు పెట్టాడు.[1] "గోల్కొండ నవాబులు" అనే వ్యాసంలో రామదాసు ఖైదులో ఉంచబడటానికి గల కారణాలు గూర్చి ఈ విధంగా తెలియజేయబడింది.

"భద్రాచల దేవాలయ నిర్మాణానికి రామదాసు ప్రభుత్వ ధనం ఖర్చు చేస్తాడు. అయినా కొంత కాలానికి ఆ ధనం తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని భావిస్తాడు. కాని గిట్టని వారెవరో చెవులు కొరుక్కుంటారు. వసూలైన శిస్తు సొమ్ము ప్రభువుల భండారానికి చేర్చకుండా రామదాసు దుర్వినియోగం చేస్తున్నాడని ఫిర్యాదు వెడుతుంది. తానాషా సంజాయిషీ అడిగి సొమ్ముపంపమంటాడు.కానిసొమ్మేది? రాజ ద్రవ్యాపహరణ నేరం క్రింద తానీషా రామదాసుని పన్నెండేండ్లు కారాగారంలో ఉంచి నానా బాధలు పెట్టడం జరుగుతుంది".[2]

"మాదన్న అంటే ఇష్టం లేని వాళ్ళు మాదన్న మేనల్లుడు గోపన్న ప్రభుత్వ నిధుల్ని దుర్వినియోగం చేశాడంటూ దుమారం లేపడంతో విధి లేక గోపన్నను చెరలో వుంచినా తర్వాత మాదన్న మీద మమకారంతోనే అతడిని తానీషా విడిపించి, తమ సామరస్యానికి కృషి చేశాడనే వాదనా ఉంది".[3] ఆంధ్ర దేశ చరిత్రమున అబ్దుల్లా కాలం నాటి పరిస్థితుల గూర్చి ఇలా చెప్పబడింది. "అక్కన్న మాదన్నలు తరచుగా బెజవాడ యందుండి రాజ కార్యములు జరుపు చెండెడివారు. సుల్తాను కొండపల్లియందు ఉండెడివాడు. హైదరాబాదు అనేక కుట్రలకు ఆలవాలమై యుండెను. ఉద్యోగస్తులు రెవెన్యూ వసూలు గురించి కనుగొనెడి వారు కారు. వచ్చినంత వచ్చెడిది. లేనంత లేదు. అందఱకును కుట్రలు చేయుట యందే చాలా కాలము వినియోగమయ్యెడిది. ఇదే సమయంలో కంభం మెట్టు తాలూకాలో తహసీల్ దారుగా నున్న గోపన్న గారు శిస్తు వసూలు చేసి రామార్పితం చేయుచు, భక్తి పారవశ్యమున మునిగియున్నాడు. మహమ్మదీయ కక్ష వారు ప్రత్యేకముగా దీని గూర్చి సుల్తానుకు మనవి చేసి అక్కన్న మాదన్నలపై యాగ్రహము వచ్చునట్లు చేయ జూచిరి. కాని సుల్తాను రామదాసును శిక్షించెను గాని, మంత్రులపై విశ్వాసము విడువలేదు".[4]

శ్రీ వేదం వేంకట రాయశాస్త్రిగారు రామదాసు తహసీల్దారుగా ఉండినప్పటి చారిత్రక సంఘటనల గూర్చి, అప్పటి సామాజిక, రాజకీయ స్థితి గతుల గూర్చి ఇలా ప్రస్తావించారు. " రామదాసు తహసీల్దారుగా ఉండి రామాలయ నిర్మాణం జరిపి, రామ కైంకర్యానికై తన సొంత సొమ్ము, ప్రభుత్వ ధనం ఖర్చు చేసి ఉత్సవాలు, నిరతాన్న దానాలు జరిపిస్తున్నాడు. మాదన్న భద్రాద్రి తాలూకా నుండి రావలసిన ధనం రానందున ఒక భటుని, దూతను రామదాసు కడకు పంపి వివరంములు తెలుసుకొనెను". అప్పటి గోల్కొండ రాజ్య పరిస్థితి ఇది. ఈ లోపల రాజధానిలో చాలా మార్పులు ఏర్పడ్డాయి. అక్కన్న, మాదన్నల అధికారానికి లోపం లేదు గాని వీరికి శత్రువు లేర్పడ్డారు. రెండు పర్యాయాలు ఆ శత్రువులు చాడీలు చెప్పినారు. తానీషా వినలేదు. తామే వారిని చంపడానికి ప్రయత్నించి కూడా ఫలించలేదు. రామదాసు చర్యలు అత్తి మత్త షేక్ మిన్‌హాజులకు తెలిసింది. ఊరంతా గందర గోళంగా ఉన్న కాలంతో తానాషా పేరిట గోపన్నను తర్కింప సాగారు. గోపన్న కూడా వారు పెట్టే బాధల్ని సహించేవాడే గాని, మామలకు చెప్పి పంపలేదు. ఆ దుర్మార్గులు రహస్యంగా తమ క్రింది సర్దార్ల చేత గోపన్నను చెఱలో పెట్టించి క్రమంగా ఒక దినం తానాషా అండను జేరి భద్రాచలం తహసిల్దారు సర్కారు ఖజానాకు పైకం పంపక, భక్షించాడని చెప్పారు. వెంటనే దర్బారులో విచారణ జరిగింది. అది వాస్తవమే. మాదన్న ఏమీ బదులు చెప్పడానికి లేక ఆ విషయం ఈ దేశోపద్రవ కాలంలో తమకింకా తెలియ లేదనీ, ఎవరైతే నేమి, న్యాయం ప్రకారం శిక్షింప వలసిందే అనీ

1. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావు పుట 198-199.
2. గోల్కొండ నవాబులు - డా॥ కె. గోపాల కృష్ణారావు గారు , తెలుగు వాణి, 1975, పుట 43-48.
3. నాలుగు శతాబ్దాల నగరం - నేదగిరి రాంబాబు, పుట 75.
4. ఆంధ్ర దేశ చరిత్రము మొదటి భాగము - శ్రీ చిల్లరిగి శ్రీనివాసరావు పంతులు పుట 125.

సభలో చెప్పాడు. ఆ మాటే చాలని మిస్‌హోజు పక్షం వారు, అంతఃపురంలోని వారు, గోపన్నను తీవ్రంగా శిక్షింప వలసిందని తానాషాను పురికొల్పుతున్నారు. తానాషా గోపన్నను పిలిపించి, విచారణ జరిపించి, ఆయన మహా రామభక్తుడని ఎఱిగి తన మంత్రుల మీద ఉన్న అనురాగం వలన తక్షణమే క్షమించి భద్రాచలానికే మర్యాదలతో పంపాడు".

"ఈ ఘటన తానీషా మీద మహమ్మదీయుల్లో కొందఱికి ద్వేషానికి హిందువుల్లో అందరికీ అభిమానానికి కారణమయింది. పూర్వాచారాలు మూఢ విశ్వాసాలు గల ఆ దినాల్లో ఎట్టి స్వల్ప విషయాన్ని గూర్చియైనా సులువుగా కథలు అల్లుకొని చెప్పకోవడంలో ఆశ్చర్యం లేదు. ఇంత సులువుగా విషయము తేలి పోయినందు వలన శ్రీ రాముల వారే తానాషాకు దర్శనమనుగ్రహించి రామదాసును చెఱ విడిపించిరని జనులు చెప్పకోసాగిరి. మరి కొందరు తానాషాకు పూర్వ జన్మవృత్తాంతం సయితం కల్పించారు. ఈయన హిందువులకు ఎంతో ప్రియంగా ఉన్నాడు. వాటికంతా కారణం అతని గురువు షారాజు కొత్తాల్ గారి ఉపదేశమే".[1]

వేదం వేంకట రాయశాస్త్రిగారు తెలియ జేసిన పై విషయాలు పరిశీలిస్తే కొన్ని నూతన విశేషాలు తెలుస్తున్నాయి. కొన్ని చారిత్రకంగా సత్యదూరాలుగా తోస్తున్నాయి. రామదాసును హిందూ మత ద్వేషులు అయిన మహమ్మదీయులు తానీషాకు తెలియకుండానే చెరలో బంధించారు. ఆ తర్వాత ప్రభుత్వం సొమ్ము వారే కాజేసి, గోపన్న ప్రభుత్వం సొమ్ము దుర్వినియోగం చేశాడని ప్రచారం చేసి, తానీషా కడకు రప్పించేలా చేశారు. తానీషా విచారణ జరిపి గోపన్న రామభక్తుడని తెలుసుకొని రామదాసును క్షమించి తిరిగి తహసీల్దారుగా భద్రాచలానికి పంపించాడు అని వ్రాశారు. గోపన్నపై మహమ్మదీయులు కుట్ర పన్నిన మాట నిజం. అయితే అబ్దుల్లా కుతుబ్షా రామదాసును క్షమించక జైలులో పెట్టించాడు. రామదాసును ఖైదులో ఉంచింది అబుల్ హసన్ కాదు అబ్దుల్లా కుతుబ్షా. 12 సంగిలు ఖైదులో దుర్భర బాధలు అనుభవించాడు. ఆ తర్వాతే అబుల్ హసన్ తానాషా విడుదల చేశాడు. అంతేగాని వెంటనే జైలు శిక్ష అనుభవించకుండా తిరిగి తహసీల్దారుగా తానాషాచే పంపబడడం నిజం కాదు. 12 సంగిలు తర్వాతే విడుదలైనాడు. అందుకు ఆయన వ్రాసిన కీర్తనలు కూడా నిదర్శనం. వేదం వేంకట రామశాస్త్రిగారు వ్రాసినట్లు రామదాసు జైలులో ఉండక తానీషా కాలంలోనే విడుదలైనట్లు ఉన్నది అసత్యం. రామభక్తికి ఉన్న గొప్పతనాన్ని చాటడానికే తానీషా రామదాసును శిక్షించకుండా విడుదల చేసినట్లు, జైలు శిక్ష విధించలేదని వ్రాశారు శాస్త్రిగారు. నిజానికి ఇది చారిత్రక సత్యం కాదు.

ఇంత వరకు పరిశీలించిన చారిత్రకాధారాలు, విమర్శనాత్మక గ్రంథాల్లోని విషయాన్ని బట్టి చూస్తే మనకు వ్యక్తమయ్యే, కొన్ని ముఖ్యాంశాలు ఇవి. "మీర్ జుమ్లా సయ్యదహమ్మదు అబ్దుల్లా కాలం నాటి ప్రధానమంత్రి. ఇతడు అబ్దుల్లా భార్య సోదరుడు. ఇతడు అవినీతికి పాల్పడినందు వలన, పదవి నుండి అబుల్ హసన్ తానాషాచే తొలగింపబడినాడు. ఆ తర్వాత ఆ పదవి మీర్ జుమ్లా అనేది మాదన్న గారికి ఈయబడింది. షర్ లష్కర్‌గా సర్వ సేనాధిపతిగా ఇబ్రహీం అనేవాడు ఉండగా అతడు కూడా అవినీతి పరుడని, అతని ప్రవర్తన నచ్చక అబుల్ హసన్ తానాషా అతన్ని కూడా తొలగించి అతని స్థానంలో అక్కన్నను సర్వ సేనాధ్యక్షునిగా నియమించాడు. సితారా తానాషా భార్య. అబ్దుల్లా కుతుబ్షా ఆఖరి కూతురు. మత దురహంకారి. హిందూ మత ద్వేషి. మహమ్మదీయ మతాభిమాని. ఈమె సహకారంతో వీరిరువురు గోపన్నను ఖైదులో పెట్టించే ప్రయత్నం చేశారు. అక్కన్న, మాదన్నల హత్యకు కూడా వీరే కారకులైనారు. మరియు అక్కన్న, మాదన్నలకు వ్యతిరేకులైన వారు అబ్దుల్లా కుతుబ్షాకు లేని పోనివి చెప్పి

1. అక్కన్న మాదన్నల చరిత్ర - వేదము వేంకట రాయశాస్త్రి 1962

రామదాసును ఖైదులో పెట్టించారు. రామాలయ నిర్మాణానికై రామదాసు ఆరు లక్షలు దుర్వినియోగం చేసినట్లుగా చెప్పి సితార సహకారంతో రామదాసు ఖైదులో పెట్టబడినాడు. ఇక్కడ ఒక ముఖ్యాంశం పరిశీలించ వలసి ఉంది.

రామదాసు భద్రాచలం తహసీలుదారుగా అబ్దుల్లా కాలంలో (1650) అయినాడు. అలాగే అబ్దుల్లా కాలంలోనే 1665లో జైలులో ఉంచబడినాడని చారిత్రకాధారాలను బట్టి స్పష్టమౌతుంది. అయితే విడుదల చేసింది మాత్రం అబుల్ హసన్ కుతుబ్షా (తానాషా,1677) కావడం వల్ల అబ్దుల్లా కాలంలోనే మీర్ జుమ్లా గా ఉన్న సయ్యదహమదు, అబ్దుల్లా కుతుబ్షా కూతురు సితారతో కూడి అక్కన్న, మాదన్నలపై ఉన్న ద్వేషంతో అతని మేనల్లుడు రామదాసును కూడా బాధించదలచి, ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేస్తున్నాడన్న అపవాదును అబ్దుల్లాకు చేరవేసి అతనిని ఖైదులో పెట్టించారనుకోవచ్చును. అప్పటికి అబుల్ హసన్ కుతుబ్షా రాజు కాకున్నా అబ్దుల్లా అల్లుడైనందు వల్ల తానాషా సితారకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసి ఉండవచ్చు. అయినా సితార హిందూ మత ద్వేషి అయినందున, ఇబ్రహీం సయ్యదహమదుల అవినీతి అబ్దుల్లాకు తెలిసి వారిని పదవుల నండి తొలగించే ప్రయత్నం చేసి ఉన్నందువల్లనూ, అక్కన్న, మాదన్నలకు అబ్దుల్లా ప్రాధాన్యాన్నిచ్చి ఉండడం వల్లనూ వారికి అక్కన్న, మాదన్నలపై అతని మేనల్లుడు రామదాసుపై కూడా ద్వేష భావం రగిలింది. శత్రువైన ఔరంగజేబుతో చేతులు కలిపేందుకు కూడా వీరు వెనుకాడలేదు.

అందుకే మిక్కిలి బలవంతులైన రాజనీతిజ్ఞులైన అక్కన్న, మాదన్నలను చూసి సహించలేక, రామదాసు రామాలయ నిర్మాణానికి, ఒక ధర్మ కార్యానికై ధనం ఖర్చు చేసినా సహింపక ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేస్తున్నాడని అపవాదు వేసి, భద్రాచలం ఖజానాలోని రెండు లక్షలు కొల్లగొట్టి, లక్ష యాభై వేలు పన్ను వసూలు కానీయకుండా చేసి, కేవలం రెండు లక్షలు మాత్రం రామాలయ నిర్మాణానికి ఖర్చు చేస్తే, ఆరు లక్షలు ఖర్చు చేసినట్లుగా చెప్పి ఆ ధనమంతా ప్రభుత్వానికి కట్టలేనందున ఖైదులో పెట్టించి, జైలులో 12 సం॥లు రామదాసు కఠిన శిక్ష అనుభవించేందుకు సితార, సయ్యదహమదు, ఇబ్రహీంలు కారకులైనారు.

సితారకు, ఈ తప్పుడు పని చేయడానికి ఆమెకు అనుకూలురైన చారులు, ఇతర అంతఃపుర వ్యక్తులు, హిందూ వ్యతిరేకులు, మీర్ జుమ్లా సయ్యదహమదు, ఇబ్రహీంలు సహకరించారు. రామదాసును నిరంతరం శిక్షించేందుకు తన అనుచరులతో హిందూ వ్యతిరేకులైన భటులతో రామదాసును కొట్టించడం వంటి శిక్షలు సితారే అమలు జరిపింది. అబ్దుల్లాకు తర్వాత, తానాషాకు తెలియకుండానే ఆమె స్వంత నిర్ణయాలు తీసుకొని శిక్షలు వేయించిందని చెప్పక తప్పదు. ఆ తర్వాత అబ్దుల్లా కుతుబ్షా ఔరంగజేబు చేతిలో కీలు బొమ్మై పన్నులు చెల్లించవలసి రాగా ఆ పన్ను కొరకై ధనం కావలసి వచ్చినప్పుడు, అన్ని పరగణాల నుండి ధనం వసూలు చేయగా, భద్రాచలం పరగణా నుండి మాత్రం రావలసిన శిస్తు తాలూకు ధనం ప్రభుత్వానికి చేరనందున అబ్దుల్లా కుతుబ్షా ఆగ్రహం వ్యక్తం చేసి, రామదాసును ఖైదులో పెట్టి ఆ ధనం ఇవ్వమని శిక్షించాడు.

అబ్దుల్లా 1672లో మరణించిన తర్వాత అబుల్ హసన్ తానీషా రాజైనాడు. అప్పుడు తానీషా పరమత సహనం కలిగిన వాడైనందున రామదాసును విడుదల చేయాలని భావించి ఉండవచ్చును. అయితే అబుల్ హసన్ కుతుబ్షా కారణంగా పదవులు కోల్పోయిన సయ్యదహమదు, ఇబ్రహీంలు, ఇతర హిందూ వ్యతిరేకులు మరింత కోపోద్రిక్తులై తానీషాకు మనసు మార్చి రామదాసును ఖైదులోనే ఉంచే పరిస్థితిని కల్పజేశారు. అక్కన్న, మాదన్నలపై కూడా తానాషాకు లేనిపోని తప్పుడు మాటలు చెప్పినా తానీషా వినిపించుకోలేదు. అక్కన్న, మాదన్నలను వదులుకోలేదు.

మీర్ జుమ్లా పదవి కోల్పోయిన సయ్యదహమదు ఔరంగజేబుతో చేతులు కలిపాడు. గోల్కొండ రాజ్య రహస్యాలన్నీ ఔరంగజేబుకు చేరవేశాడు. సితార కూడా ఇందుకు సహకరించింది. ఔరంగజేబు తానీషాతో సంధి చేసుకొని హిందూ ఉద్యోగులందరిని, అక్కన్న మాదన్నలను ప్రధానంగాను, వారితోపాటు రామదాసును కూడా పదవి నుండి తొలగించమని ఆదేశించాడు. అయినా అక్కన్న, మాదన్నలను వదలుకోదలచు కోలేదు. కారణం వారి వల్లనే గోల్కొండ రాజ్యం సుస్థిరంగా ఉంది. అయితే రామదాసును మాత్రం ఖైదులోనే ఉంచాడు. కాని కఠిన శిక్షలు అమలు పరచలేదు. తానీషా కాలంలో కూడా అబుల్ హసన్‌కు తెలియకుండా రామదాసును, సితార మనుషులు కలిసి కఠినంగా శిక్షింపజేశారు.

అబ్దుల్లా కుతుబ్షా సూఫీ తత్త్వ ధర్మాన్ని అనుసరించి మత సహనం కలవాడైనందున షిరాజు కత్తల్ శిష్యరికంలో నేర్చుకున్న సున్నితత్వం, సర్వ మత సమానతా భావం వలన రామదాసును విడుదల చేయ దలచే ప్రయత్నం చేసి ఉండ వచ్చును. కాని నరాశ్రయాన్ని తిరస్కరించిన రామదాసు రామాశ్రయాన్ని కోరి "రామనామ స్మరణం"తో కాలం గడిపి రామ దర్శనం కోసం ఎదురు చూశాడు. తనను రాముడే ఏ నాటికైనా ఋణ విముక్తుని చేసి ఖైదు నుండి విడిపింప గలడన్న ప్రగాఢ విశ్వాసంతోను, దృఢ నిశ్చయంతోను ఉన్నాడు రామదాసు. అందుకే 12 సం॥లు రామ నామ స్మరణం చేస్తూ, రామ నామ సంకీర్తనంతో అపారమైన రామభక్తి పరాయణుడై జైలులో కాలం గడిపాడు. ఇంక కష్టాలు కడతేరే సమయం ఆసన్నమైంది. 12 సం॥లు తర్వాత రామదాసు మొర విన్నాడు తన రాముడు. అందుకే రామదాసును కాపాడడానికి శ్రీరాముడు లక్ష్మణ సమేతుడై వచ్చి తానీషా వద్దకు వెళ్ళి తానీషాకు తన దర్శనమొసంగి, ఆరు లక్షల పైకం, వడ్డీ, నాలుగు లక్షలు కలిపి పది లక్షల బంగారు వరహాలు ఇచ్చి రసీదు తీసుకొని రామదాసుకు ఇచ్చి రామదాసును విడిపించాడు. రామ టంకాలు అనే నాణాలు రాముడు తానీషాకు ఇచ్చాడు. తానీషా పూర్వ జన్మ సుకృతం వల్ల రామ దర్శనం ఆయనకు కల్గింది. రామదాసు వలన తానీషా కీర్తి ఆచంద్రార్కంగా నిలిచింది. ఒకవేళ రామదాసును రాముడు కాక, తానీషా గాని, అక్కన్న మాదన్నలు గాని విడిపించి ఉన్నట్లయితే రామదాసు పేరు ఈ నాటికీ చిరస్థాయిగా నిలిచి ఉండేది కాదేమో. అతడి అపారమైన రామభక్తే మన సంస్కృతిలో అతని పేరును చిరస్థాయిగా నిల్పింది.

కొందరు విమర్శకులు అక్కన్న, మాదన్నలే రామదాసును విడిపించి ఉంటారని అభిప్రాయపడ్డారు. నిజానికి అక్కన్న మాదన్నలు ఆరు లక్షల పైకం ప్రభుత్వానికి చెల్లించి రామదాసును విడిపించే ఉన్నత స్థాయిలోనే వారున్నారు. కాని రామదాసు అందుకంగీకరించలేదు. కారణం రామదాసుకు రాముడిపై ఉన్న భక్తి, విశ్వాసాలు అటువంటివి. అందుకే ఈ ప్రపంచానికి అఖండమైన, అజరామరమైన రామభక్తిని చాటాడు. రామభక్తి సామ్రాజ్యాన్నేలినాడు. స్థిరమైన కీర్తి పొందాడు. మరో ముఖ్య విశేషం ఈ సమయంలోనే ఎందరో మహమ్మదీయులు కూడా రామనామాన్ని జపించి రామభక్తిలో ఓలలాడారు. అందుకే తానీషా మహమ్మదీయుడైనా రామ దర్శనం పొందాడు. రామభక్తిలోనే కాలం గడిపాడు. భద్రాచలానికి తను స్వయంగా వెళ్ళి సీతారాములను దర్శించుకొని, రామదాసుకు రామ కైంకర్యం నిమిత్తం భద్రాచలం, అశ్వారావు పేట, పానగల్లు మొదలైన పరగణాలను దానంగా ఇచ్చి, తనకు రామునిపై గల అపారమైన భక్తి, విశ్వాసాలు లోకానికి చాటాడు. హిందూ ధర్మ సంరక్షణకై తానీషా వంటి మహమ్మదీయులు కూడా కృషి చేశారనడం సందేహం కాదు. అతిశయోక్తి కానేరదు.

ఎందరో హిందూ వ్యతిరేకుల ద్రోహానికి, వారి కుట్రల కారణంగా అనేక కష్టాలు పడి 12 సం॥లు కఠిన జైలు శిక్షను అనుభవించినా కూడా, ఎక్కడా వారిని నిందించినట్లు కనబడదు. వారి కీర్తనలన్నీ పరిశీలిస్తే మహమ్మదీయులను నిందించినట్లు కనబడదు. తన పూర్వ జన్మ కర్మ ఫలం తాను ఖైదులో ఉండి అనుభవించినట్లు తానే చెప్పుకొన్నాడు. రామునికై నిరీక్షించాడు. రామ దర్శనానికై పరితపించాడు. అది రామదాసుకున్న గొప్పతనానికి నిదర్శనం. ధర్మ బద్ధమైన జీవితం రామదాసు గడిపాడు. పరనిందకు పాల్పడని గొప్ప మనసు రామదాసుది. మహమ్మదీయ భటులు రామదాసును ఎన్ని విధాల శిక్షించినా వారిని దూషించలేదు. అది చూసి చివరికి గోల్కొండ రాజ్యంలో జైలు వద్ద ఉన్న కాపలాదారులు, తదితరులు రామదాసు అపారమైన రామభక్తిని గాంచి, ముగ్ధులై వారు కూడా రామనామ స్మరణంలోని గొప్పతనాన్ని గని రామనామాన్ని జపించారు.

తానీషా భార్య సితార కూడా తన తప్పు తెలుసుకొని, భర్తతో కలిసి భద్రాచలానికి వెళ్లి రాముల దర్శనం చేసుకుంది. మహమ్మదీయుల హృదయాల్లో కూడా రామభక్తిని నింపిన ఘనత రామదాసుకే దక్కింది. గోల్కొండ రాజ్య పతనానికి మీర్ జుమ్లా సయ్యదహమదు, ఇబ్రహీం, సితారలు ప్రధాన కారకులు. ఒకరకంగా చెప్పాలంటే సితార గోల్కొండ రాజ్య పతనానికి ప్రధాన కారకురాలు. గోల్కొండ అంతఃపుర స్త్రీలు గోల్కొండ రాజ్యం మొగలుల హస్త గతం కావడానికి ప్రధానంగా కారణం అయ్యారని చెప్పక తప్పదు. ఔరంగజేబు హిందూ మత ద్వేషి అయినందున సున్నీ మతస్థుడైనందున, షియాలైన కుతుబ్షాహీలపై, సూఫీ తత్త్వం అవలంబించిన అబుల్ హసన్ తానీషాపై విపరీతమైన ద్వేష భావం పెంచుకున్నాడు. హిందూ ఆధిక్యత గల గోల్కొండ రాజ్యం పైకి 1686లో దండెత్తి వచ్చి అక్కన్న, మాదన్నలను, అతని సోదరుడు విస్సన్నను, మేనల్లుడు పొదిలి లింగన్నను హత్య గావించారు ఔరంగజేబు మనుషులు. వీరిని హత్య చేయించడంలో సయ్యదహమదు, ఇబ్రహీంల పాత్ర ప్రధానంగా ఉంది. ఆ తర్వాత అబుల్ హసన్ తానీషాను ఔరంగజేబు 1687లో బంధించి దౌలతాబాదు ఖైదులో 1687-1700 వరకు 13 సం॥లు ఉంచాడు. 1700 ప్రాంతంలో అక్కడే మరణించాడు అబుల్ హసన్. 1704లో మరణించాడని కొందరు వ్రాశారు. గోల్కొండ రాజ్యం మొగలుల హస్తగతం అయిన విషయం గూర్చి బి.ఎస్.శాస్త్రి గారు " గోల్కొండ రాజ్యం మొగలుల హస్తగతం అయిన తర్వాత మొగలు సుబేదారులు దక్కన్‌లో నివసించి తెలుగు సీమనేలుచు, ప్రజలను పీడించినారు. ఆ తర్వాత నిజాముల్ముల్కు, అసఫ్జా అవ్వల్ దక్కన్ సుబేదారుగానుండి ఢిల్లీ రాజకీయ పరిస్థితులను గమనించి, స్వతంత్రుడై అసఫ్జా వంశం స్థాపించెను"[1] అని తెలియజేశారు.

బాలాంత్రపు రజనీకాంతరావు గారు ఇలా వ్రాశారు " తన వార్ధక్య దశలో చెప్పిన దాశరథీ శతకంలోని ఒక పద్యంలో తనకు వయస్సు చెల్లడమూ, మొగలు దండయాత్రలకు గోల్కొండ ఓడిపోవడమూ, తనకు ఆప్త బంధువులయిన మాదన్న మహామంత్రి, సేనాని మున్నగువీరు దుర్మరణం పాలు గావడం, సజ్జన మాన్యుడు సూఫీ సహృదయుడూ అయిన అబుల్ హసన్ తానీషా మొగల్ నిరాశాపరత్వాన్ని సూచిస్తాడు".[2] ఆ పద్యం ఇది. చరమ దశలో ఆప్త వియోగం - సర్వత్ర నిరాశలను సూచిస్తున్న పద్యం ఇది.

"దొరసిన కాయముల్ముదిమితో చిన బూచి ప్రభుత్వముల్గిరు
ల్మెఱపులు గాగ జూచి మఱి మేదినిలో దమ తోడివారు ముం
దరుగుట జూచి తెగు నాయు వెఱుంగక మోహపాశ
ముల్దరు గని వారికేమి గతి దాశరథీ కరుణాపయోనిధీ"[3]

1. ఆంధ్ర దేశ చరిత్ర -సంస్కృతి (క్రీ.శ. 1518-1990) వరకు, బి.ఎస్.శాస్త్రి, మూసీ పబ్లికేషన్స్
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పీఠిక, బాలాంత్రపు రజనీకాంతరావు పుట 9,10.
3. దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న , పద్యం 92, పుట 71. వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్

రామా ! శరీరములు ముదిసిపోవుట చేతను, దేహము అస్థిరమనియు, ప్రభుత్వాదులు నశించుటచే సంపదలు అస్థిరమనియు, తమ తోడివారు ముందుగానే మరణించుటచే తామును చావ వలసిన వారమనియు చక్కగా తెలియుచుండినను, ఆయువు నశించునని తెలియక అస్థిరములై యా దేహాదుల యందే అజ్ఞానము యొక్క పాశములచే కట్టుపడుచున్నారే. ఇట్టివారికి గలుగ గల స్థితియేమి యని భావము.

### 4.4.4. నరాశ్రయ తిరస్కారము :

విశుద్ధాత్మతో తాను రామాలయ కైంకర్యానికై ఖర్చు పెట్టిన పైకాన్ని గూర్చి తనపై అపనిందా, అభాండాలు వేసి, చెరసాలలో పెట్టిన గోల్కొండ పాలక వర్గంపై జనులపై శ్రీరాములకు చేసిన విన్నపం "జన దూషణకు పరితాపం" చెందిన రామదాసు ఒక పద్యంలో రాముని వేడుకుంటు, చేసిన విన్నపం ఉంది".[1] ఆ పద్యం.

" ఇతడు దురాత్ముడంచు జనులెన్నగనాడి గొంటినే నెపో
పతితుండనంటినో పతిత పావన మూర్తివి నీవు గల్గ నే
నితరుల వేడనంటి గిహమిచ్చిన నిమ్ము పరంబోసంగుమీ
యతులిత రామనాను మధురాక్షర పాళి నిరంతరంబు హృ
ద్గతమని నమ్మికొల్చెదను దాశరథీ కరుణాపయోనిధీ"[2]

నేను దుష్ట మనస్సు గల వాడనని జనుల చేత నింద పడితిని, నాయంతట నేను పతితుడనని నీతో చెప్పకొంటిని, పతితులను పవిత్రులనుగా జేయ నవతరించి నీవుండగా పతితుడనైన నేను నిన్నె వేడుదును గాని మరి యొకరిని వేడననియు జెప్పితిని. ఇక నీవొకడవే నాకు స్వామివి గనుక ఇహమిచ్చినను యివ్వవలయును. వరమిచ్చినను నీవ యీయవలయును. నేను మాత్రము నాయంతకు "రామ" యనెడి తీయని యక్షరములను మనస్సునందు నిలుపుకొని కొలువు చేసెదను. అని నరాశ్రయాన్ని తిరస్కరించాడు. రామదాసు రాజాశ్రయాన్ని అంగీకరించక, రాజుల కొలువులో ఉంటే కల్గే కష్టాలు, ఆపదలు గూర్చి తెలియజేసిన అంశాలు ఒక నాటకంలో "రామదాసు చరిత్రము" నందు ఈ విధంగా ఉన్నాయి.

"భక్త రామదాసు"(రామదాసు విజయము) అనే నాటకంలో ఈ విషయం స్పష్టమౌతుంది. "గోపన్న పెద్ద తండ్రి రంగనాథం, గోపన్నను ఉద్యోగం చేయమని కోరగా, గోపన్నకు ఇతరుల వద్ద ఉద్యోగం చేయడం ఇష్టం లేక, రాజుల వద్ద కొలువు చేస్తే వచ్చే సమస్యలను గూర్చి ప్రస్తావించినాడు.

"ఈ దినములలో రాజకీయోద్యోగులకు ధర్మాధర్మ విచక్షణ, న్యాయాన్యాయ పరిశీలన యుండదు. నిజమను మాటయే లేదు. దాక్షిణ్య భావము శూన్యము. భూతదయ వెదకినను కనబడదు. అబద్ధములను అన్యాయములకు ఇంచుకైనను వెఱువరు"[3] అని అన్నాడు రామదాసు. ఈ నాటకంలో ఇంకా ఈ విషయాలున్నాయి. రామదాసును తహసీల్దారీ పదవి నుండి తొలగించడానికి మహమ్మదీయులు, హిందూ మత ద్వేషులు పన్నిన కుట్రలు, రామదాసుపై నిందలు వేయడం, దోపిడీదారుగా రామదాసును చిత్రించడం, రామాలయ నిర్మాణానికి ప్రభుత్వ ధనం ఖర్చు చేసినా కూడా తగిన సంజాయిషీ కుతుబ్షాహీ రాజులను కోరినా, వారు తన యెడ నిరంకుశంగా ప్రవర్తించి జైలు శిక్ష వేయడం అనే అంశాలు సూచింపబడినాయి.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పీఠిక - బాలాంత్రపు రజనీకాంతరావుగారు పుట 11.
2. దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న, పుట 46, పద్యం 59.
3. భక్త రామదాసు అను రామదాసు విజయము - కీ.శే. శేషవరపు శివరామ శాస్త్రిగారు, 1924 ప్రథమాంకము, పుట 19.

"చిన్ననాటి నుండే రామభజన చేస్తూ రాముని ఆశ్రయించిన రామదాసు చిన్ననాడే నరాశ్రయాన్ని తిరస్కరించాడు. ఈ నాటకంలో చెప్పబడిన మరో ముఖ్య విషయం ఇది. అక్కన్న మాదన్నలు తానీషా గొప్పతనాన్ని గూర్చి చర్చించుకుంటారు. మత సామరస్యం గల రాజుగా అతనిని కొనియాడుతారు. అయితే మహమ్మదీయ పాలనలో భాతర దేశం ప్రగ్గడాన్ని అక్కన్న ఖండించాడు"[1]. గోపన్న యనిని ఓర్వలేని వారు ఆయనపై తానీషాకు నేరారోపణ చెయ్యాలని అబద్ధాలు చెప్పాలని తలచారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన వారి ఆటలు గోపన్న తహసీల్దారుగా వచ్చిన తర్వాత సాగుట లేనందున ఈర్ష్యపడి తానీషాకు గోపన్నపై పితూరీలు చెప్పదలచుకున్నారు కొందరు విద్రోహులు[2]. ఈ విద్రోహ చర్యకు అబ్దుల్లా కాలంలోనే పాల్పడ్డారు. కొందరు. కానీ తానీషా అంటే అబుల్ హసన్ కాదు. అబ్దుల్లా 'తానీషా' అనేది బిరుదం. కాని ఈ నాటకంలో అబుల్ హసన్ తానీషా కాలంలోనే ఈ సంఘటన జరిగినట్లు, రామాలయ నిర్మాణానికై తహసీల్దారుగా ఉండి ప్రభుత్వ ధనం వసూలు చేసి ఖర్చు చేసినట్లు చెప్పబడింది. ఇదంతా జరిగింది. అబ్దుల్లా కాలంలోనే అని ఇంతకు ముందే తెలియజేశాను.

### 4.4.5. ఆలయ నిర్మాణం చేపట్టుట :

రామదాసుకు మొదటి నుండీ నరులను ఆశ్రయించడం ఇష్టం లేనందున, రామభక్తి తత్పరుడైనందున తాను సంకల్పించుకొన్నట్లుగా రామాలయ నిర్మాణం భద్రాచలంలో గావించాడు. తహసీల్ సొమ్మును వ్యయపరచి ఆలయ నిర్మాణం చేపట్టినందుకు రామదాసుకు శిక్ష తప్పదని భావించిన కొందరు శ్రేయోభిలాషులు. రామదాసు జాగ్రత్త పడమని చెప్పి చూశారు. "తహసీల్ సొమ్మును వ్యయము చేసితివి. రాజుల చెల్మిలు పాముల చెల్మిలతో దుల్యములని యెఱుంగవా ? నీవనిన గిట్టని వారు నీపై జాడీలు చెప్పి తానీషాకాగ్రహము కల్గించెదరు. కనుక సొమ్మును దయారు చేసికొమ్ము" అన దాసు కానిమ్మంతకు రాముడే యున్నాడు అని "తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు" అని పాడినాడు. ధైర్యంగా ఉన్నాడు"[3]. అని గురునాథ శర్మగారి రామదాసు చరిత్ర విమర్శన గ్రంథంలో ఉంది.

"రామదాసు తన భార్యతో కూడి తన మేనమామలైన అక్కన్న, మాదన్నల కడకేగి భద్రాచలం తాలూకా తహసీల్దారు పదవిని ఇమ్మని కోరడానికి గల ప్రబోధ కారణం, శ్రీరాముడు ఇతడికి స్వప్నంలో కనబడి భద్రాచలంలో తనకు ఆలయ నిర్మాణం చేయమని కోరడమే అని చెప్తారు"[4] అని రజనీకాంతరావు గారు రామదాసు తహసీల్దారుగా భద్రాద్రికి వెళ్లిన కారణం వివరించారు. "ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళాసేవ" అనే గ్రంథంలో రామదాసుకు గల నరాశ్రయ తిరస్కార భావం గూర్చి ఈ విధంగా చెప్పబడింది. "ఆస్తి అంతా రామ కైంకర్యానికై ఖర్చు చేసినందున గోపన్నకు అక్కన్న మాదన్నలు తమ ప్రభుని కడ నుద్యోగమిప్పించి, భద్రాచలం పరగణాకు తహసీలుదారుగా నియమింపజేసిరి. నర నాథుని కొలువు సేయుచున్నాను, జగన్నాథుని కొలువే తిరమని నమ్మి నరహరిని నమ్మక నరులను నమ్మితే నర జన్మ మీడేరునా" అని క్షణ క్షణమును ఆత్మ పరిశోధన చేసికొనుచునే యుద్యోగ ధర్మము నిర్వహించుకొనుచు, భద్రగిరి రామదేవుని కైంకర్యము చేయుటకై అప్పడే వసూలైన ఆరు లక్షలు తాసీలు ద్రవ్యమును విచ్చల విడిగా ఖర్చు చేసెను"[5] అని వ్రాయబడింది. ఇక్కడ ఆరు లక్షలు రామదాసు ఖర్చు చేయలేదని, 2 లక్షలే రామాలయ నిర్మాణానికి ఖర్చు చేసినట్లు ముక్కామల గురునాథ శర్మగారు స్పష్టం చేశారు. అందుకు నిదర్శనాలు కూడా చూపారు.

1. భక్త రామదాసు అనే రామదాసు విజయం - కీ.శే. తేతవరపు శివ రామశాస్త్రిగారు ద్వితీయాంకము.
2. ,, ,, ,, ,, ,, చతుర్థాంకము.
3. కంచెర్ల గోపన్న అను రామదాసు - ముక్కామల గురునాథ శర్మ పుట 80, ఐదవ ప్రకరణం.
4. బాలాంత్రపు రజనీకాంతరావు - ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము.
5. ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళా సేవ - ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ పుట 28-29.

"గిట్టని వారు తానీషాకు గోపన్నపై చాడీలు చెప్పారు. ఆ తర్వాత అబుల్ హసన్ తానీషా గోపన్నను పిలిపించి ప్రభుత్వ ధనం తిరిగి చెల్లించమని కోరగా, అది ఏడు రోజుల్లో చెల్లించగలనని గడువు ఇవ్వమని తానీషాను కోరుకున్నాడు గోపన్న. తాను నిర్దోషిననియు, రామ కైంకర్యానికై ఆ ధనం వ్యయం చేశానని చెప్పాడు"[1] అని ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ గారు వ్రాశారు. తానీషా రామదాసును బంధించలేదు. అబ్దుల్లా కుతుబ్షా బంధించాడు.

"రామదాసు నాటకము"నందు డి. వెంకట రమణయ్య ఇలా వ్రాశారు. "గోపన్న మిత్రుడైన రామశాస్త్రి, తన భార్య ప్రోత్సాహంతో భద్రాచలానికి వెళ్ళి గోపన్న సాయంతో తాను కూడా తహశీల్దారు పదవి పొందాలని నిశ్చయిస్తాడు. రామదాసు మిత్రుడు రామశాస్త్రి. రామదాసు వద్ద తాబేదారుగా చేరుతాడు. రామదాసును తహసీల్దారు పదవి నుండి తొలగించేందుకు అవినీతి పరులైన విద్రోహులతో కూడి కుట్ర పన్నుతాడు. గోల్కొండ మహమ్మదీయులతో కుట్ర పన్ని, తానీషాకు "రామదాసు రామాలయ నిర్మాణానికై ప్రభుత్వ ధనం వ్యయం చేశాడని, దుర్వినియోగ పరుస్తూ రామ కైంకర్యాదులు చేయిస్తున్నాడని తానీషాకు రామదాసుపై లేనిపోని నిందలన్నీ వేస్తూ రామశాస్త్రి చెప్పాడు. అతడి మాటలు విని రామదాసును ఖైదు చేయిస్తాడు తానీషా. తర్వాత రామశాస్త్రి తహసీల్దారైనాడు".[2] రామశాస్త్రి ప్రస్తావన మరే రామదాసు చరిత్రల్లో లేదు.

ఇంతవరకు ఉదహరించిన చారిత్రక ఆధారాలు రామదాసు జీవిత చరిత్రలకు సంబంధించిన అంశాల్లోని గోల్కొండ రాజకీయ పరిస్థితుల గూర్చి పరిశీలించగా " రామదాసు అబ్దుల్లా కుతుబ్షా కాలంలో తహసీల్దారై ఆ రాజుచేతనే ఖైదులో పెట్టబడి, 12 సం॥లు తర్వాత అబుల్ హసన్ కుతుబ్షా కాలంలో జైలు నుండి విడుదలైనాడని, రామాలయ నిర్మాణం కొరకై 6 లక్షలు ఖర్చు చేసినాడన్న ఆరోపణను అబ్దుల్లా కుతుబ్షా రామదాసుపై వేసి ఆతనిని గోల్కొండ జైలులో బంధించి, శిక్షింపజేశాడని, ఆ తర్వాత రామానుగ్రహంతో అబుల్ హసన్ కాలంలో తానాషాకు రామ దర్శనం కాగానే ఖైదునుండి విడుదలైనట్లు మొ॥నవి విషయాలు తెలుస్తున్నాయి. ఇది రామదాసు జీవిత చరిత్రకు ఆనాటి రాజరిక వ్యవస్థకు ఉన్న సంబంధం. ఇక రామదాసు తహసీల్దారు పదవి చేపట్టిన 16వ శతాబ్దం కాలంనాటి మత పరిస్థితులు, అవి రామదాసు జీవితంపై చూపిన ప్రభావం గూర్చి పరిశీలించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## 4.5. మత, సాంఘిక పరిస్థితులు :

హిందూ మహమ్మదీయ మతాభిప్రాయాలు మేళవించి వేదాంతం ప్రబలిన రోజులవి. రామ రహీముగా దైవ ప్రార్థనలు సలుపు కాలం. ఈ విషయం తెలియ జేయడానికే కబీరు పంథాకు చెందిన వ్యక్తి. కబీరే గోపన్నకు రామ మంత్రోపదేశం చేసినట్లు రామదాసు చరిత్ర గ్రంథకర్తలు వ్రాశారు. రామదాసు చరిత్రకారులు వ్రాసినట్లు కబీరుగాని, కబీరు పంథాకు చెందిన వారుగాని రామదాసుకు తారక మంత్రోపదేశం చేయలేదు. "రామదాసు తహసీల్దారైన తర్వాత కబీరు పంథాకు చెందిన వ్యక్తి రామదాసుకు రామ మంత్రోపదేశం చేసినట్లుగా వేదం వేంకటరాయ శాస్త్రిగారు వ్రాశారు".[3] అయితే ఆనాడు కుతుబ్షాహీ రాజుల కాలంలో మత సామరస్యం ఉండేది. రామ్, రహీమ్ ఒకడే అన్న భావనను ప్రజలకు బోధ పరచడానికే ఈ కబీరును ప్రవేశపెట్టారు రామదాసు కథా చరిత్రకారులు. నిజానికి కబీరు 14వ శతాబ్దం

1. ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళా సేవ-ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ, పుట 29.
2. రామదాసు నాటకము - డి. వెంకట రమణయ్య - తృతీయాంకము.
3. అక్కన్న మాదన్నల చరిత్ర - వేదం వేంకటరాయ శాస్త్రిగారు 1951, పుట 80-82.

వాడు. పైగా కబీరుది నిర్గుణోపాసన తత్త్వం. రామదాసుది సగుణోపాసన తత్త్వం. వారిరువురి భక్తిలోనూ ఎంతో తేడా ఉంది. గోల్కొండ నవాబులు పరిపాలిస్తున్న కాలంలోనే ఒక ప్రక్క మొగలాయి ప్రభువు ఔరంగజేబు సున్నీ మతస్థుడు మహమ్మదీయ మత దురభిమాని. తన మతంలోకి బలవంతంగా ఎందరో హిందువులను చేర్చే ప్రయత్నం చేస్తున్నాడు. పర మత సహనం చాటే కుతుబ్షాహీ రాజుల యెడ ద్వేష భావాన్ని పెంపొందించుకుంటున్నాడు. మరొక ప్రక్క అదే 16-17 శతాబ్దాల్లో ఇంగ్లీషు వారు, డచ్చి, ఫ్రెంచి, పోర్చుగీసు వారు అనే ఇతర దేశీయులు భారత దేశానికి వచ్చి వ్యాపార కేంద్రాలు స్థాపించుకున్నారు. 1611లో ఆంగ్లేయులు ఆంధ్ర దేశంలో కూడా "తూర్పు ఇండియా కంపెనీ" పేరుతో బందరులో ప్రథమంగా ఫ్యాక్టరీలు స్థాపించారు. ఇది భారత దేశంలో స్థాపించిన రెండవ ఫ్యాక్టరీ. 1614లో డచ్చివారు, 1669లో ఫ్రెంచి వారు మచిలీపట్టణంలో వ్యాపారం ప్రారంభించారు. రామదాసు తహసీల్దారుగా ఉన్న కాలంలోనే అంటే 1650 ప్రాంతాల్లో ఒకవైపు డచ్చివారు, ఫ్రెంచివారు, మరోవైపు ఆంగ్లేయులు వీరంతా వ్యాపార నిమిత్తం ఆ మిషతో భారత దేశంలో స్థిర నివాసం ఏర్పరచుకొని, క్రైస్తవ మతాన్ని ప్రచారం చేయసాగారు. ఒక వైపు మహమ్మదీయులు ఇస్లాం మతాన్ని మరోవైపు క్రైస్తవులు తమ మతాన్ని ప్రచారాన్ని చేస్తూ, హైందవ సంస్కృతిని దెబ్బ తీయదలచారు. ఆ సమయంలోనే ఎందరో భక్తులు, వాగ్గేయకారులు భారత దేశంలో హైందవ జాతిని, హిందూ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని కాపాడటానికై కంకణం కట్టుకొని, కలం పట్టారు. హైందవ జాతిని జాగృతం చేయదలచారు ఈ మహానుభావులందరూ.

### 4.5.0. హైందవ సంస్కృతి - సనాతన ధర్మ రక్షణ - రామదాసు కృషి :

"ఇటువంటి తరుణంలో భక్తి ద్వారా ప్రజల్ని ఉద్దీపితుల్ని చేసి భారతీయ సంస్కృతిని, వైదిక మత ధర్మాన్ని స్థిరంగా ఉంచేందుకు కృషి చేశారు ఎందరో భక్తులు. అటువంటి వారిలో ఆంధ్ర దేశంలో జన్మించిన రామభక్తుడైన కంచర్ల గోపన్న రామదాసుగా ఖ్యాతిగాంచిన అతడు పేర్కొన దగినవాడు. భద్రాచల రామదాసు తెలుగుదేశంలో పుట్టి భక్తి వాతావరణాన్ని నెలకొల్పాడు. రామభక్తిని ప్రచారం చేశాడు. సగుణోపాసకుడు, రామదాసు విగ్రహ రూప రాముని పూజించాడు. దేశమంతా భక్తి వాతావరణం వెల్లి విరిసింది. ఉత్సవాలు, తిరునాళ్ళ రూపంలో దేవుని పేరు తలచుకొని ప్రజలు తిరిగి ఆత్మ విశ్వాసం పొందటానికి ప్రయత్నించారు".[1]

"గోల్కొండ నవాబులు ప్రత్యక్షంగా పోషణ చేసినట్లు కనబడక పోయినా భక్త రామదాసు తన కీర్తనలతో కొంత భక్తి ప్రబోధం వీరి పాలనలో చేశాడు"[2] అని సురవరం ప్రతాపరెడ్డి గారు అభిప్రాయం వ్యక్తం చేశారు. రామదాసు కవిగా కుతుబ్షాహీ రాజుల చేత పోషింపబడలేదు. తన జీవిత సమస్యలు, ఆవేదన, ఆర్తి, ఈయన కీర్తనల్లోను, దాశరథీ శతకంలోనూ ద్యోతకమవుతాయి. రామదాసు ఈ లోకంలో రామభక్తిని చాటడానికే జన్మించాడు.

రామ సాయుజ్యం పొందాడు. హిందూ ధర్మాన్ని, సంస్కృతిని పరి రక్షించడానికై, ప్రపంచానికంతటికీ రామభక్తిని చాటడానికై, అద్భుతమైన రామభక్తి ప్రధానమైన కీర్తనలు వ్రాసి, రామభక్తి గొప్పతనాన్ని లోకానికి తెలియజేశాడు. భారతీయ సంస్కృతిలో సీతారాములకు, రామాయణానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. త్రేతాయుగం నాటి శ్రీ సీతారామచంద్రుల రూపం, ఆనాటి రామయణం ఈనాటికీ

1. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర - ఏటుకూరి బలరామమూర్తి పుట 211.
2. కుతుబ్షాహీల ఆంధ్ర భాషా సాహిత్య పోషణ - సురవరం ప్రతాపరెడ్డి. పుట 311.

చెరగని ముద్రగా ప్రతి హిందువు హృదయంలో నిలిచి ఉందంటే శ్రీరాముడి ఆదర్శం, ఆయన ఆచరించిన ధర్మమే అందుకు కారణం. ప్రతి భారతీయునికి సీతా రాములే ఆదర్శం కావాలి అన్న దీక్ష పట్టుదలతో రామభక్తిని ప్రతి ఒక్కరి హృదయాల్లో నింపే ప్రయత్నం రామదాసు చేశాడు. రామాయణ గాథను చదివినా, విన్నా, రామాయణ కథా గానాన్ని చేసినా, రామనామ స్మరణం చేసినా జన్మ చరితార్థమౌతుంది. రామ నామానికున్న ప్రాశస్త్యం అంత గొప్పది. అందుకే నిరంతరం రామ నామ స్మరణంలోనే కాలం గడుపుతూ కష్టాలు, సుఖాలు సమంగా అనుభవిస్తూ నిరంతరం ఆ శ్రీరామ చంద్రుని సాన్నిధ్యంలో కాలం గడుపుతూ, రామ కైంకర్యం చేసి తరించాడు రామదాసు. తాను ఒక్కడే రామభక్తిలో మునిగి తేలడమే కాక, ప్రపంచానికంతటికీ రామనామ మాధుర్యాన్ని తెలియజేశాడు. అందరినీ తరింపజేశాడు.

ఒకవైపు మహమ్మదీయ దాడులు కొనసాగుతూ, మన హైందవ సంస్కృతి నశించిపోయే ప్రమాదం కల్గినప్పుడు, రామదాసు సమాజంలో రామభక్తి ద్వారా మహమ్మదీయ దాడుల్ని ప్రజలు ఎదుర్కొనే శక్తిని ఇచ్చాడు. మన సంస్కృతిని పరిరక్షించుకోవడానికి ఈ రామభక్తి ఉద్యమం ఎంతగానో తోడ్పడింది. వైష్ణవ మతం ప్రాబల్యం పొందిన కాలం అది. ఆ కాలంలో ఈ రామభక్తిని ఆయుధంగా చేపట్టి మన హైందవ వీరులు మహమ్మదీయులను, వారి సంస్కృతిని త్రిప్పి కొట్టేందుకై ప్రయత్నించారు. ఒక వైపు మహారాష్ట్రలో శివాజీ మహారాజు వంటివారు హిందూ ధర్మాన్ని, సంస్కృతిని పరి రక్షించేందుకై గట్టి ప్రయత్నం చేశారు. రామభక్తి ద్వారా హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి తీవ్రంగా కృషి చేశాడు రామదాసు. భారతీయ సంస్కృతికున్న గొప్పతనాన్ని, రామాయణానికి, రాముడికి ఉన్న ప్రాధాన్యాన్ని వేనోళ్ల కీర్తిస్తూ ప్రచారం చేశాడు. రామ సాయుజ్యం పొందాడు. రామదాసు కీర్తనలు కేవలం ఆత్మ నివేదనాసక్తములే కాదు, రామభక్తి ప్రపూరితాలైన సమాజాన్ని చైతన్యవంతం చేసే ప్రబోధాత్మక కీర్తనలు అవి. ఈ కీర్తనల్లో సామాజిక అంశాలెన్నో చోటు చేసుకున్నాయి. సర్వ మత సహనాన్ని చాటే అంశాలు కీర్తనలో ఉన్నాయి. రామ రాజ్యంగా ఈ భరత భూమిని తీర్చి దిద్దాలన్న తపన, ఆవేదన, రామదాసులో కనబడతాయి. ఇది వేదభూమి. పుణ్యభూమి. ఈ భూమిని, ఈ ధర్మాన్ని పరి రక్షించుకోవలసిన బాధ్యత మనందరి కర్తవ్యం అని బోధించాడు రామదాసు. ఈ సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాల్ని అవినీతిని, అసమానతల్ని తొలగించి సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని కోరుకుంటు అందుకై రామదాసు కృషి చేశాడనడం అతిశయోక్తి కాదు. రామదాసు సమాజ కవిగా ఖ్యాతి గడించాడు. రామదాసు తన సమస్యల్ని బాధలను రామునికి నివేదించుకున్నట్లుగా ఈ కీర్తనలు పైకి కన్పించినా, ఈ సమాజంలోని ప్రతి ఒక్కరి సమస్యనూ, వారి బాధను తొలగించమని రాముని తాను వేడుకుంటున్నట్లుగా ఈ కీర్తనలు ఉన్నాయి అని చెప్పవచ్చును. ఈ భక్త కవులు సనాతనమైన ఎన్నో యుగాల చరిత్ర గల భారతీయ సంస్కృతిని, హైందవ ధర్మాన్ని, వైదిక సంస్కృతిని నిలబెట్టేందుకు ప్రయత్నం చేశారు. మరియు "భద్రాచలంలో ఆయన కైంకర్యం చేసి, నెలకొల్పిన రాముల కోవెల, ఆదర్శమానవుడైన పురుషోత్తముడు మానవతా ధర్మాలను, సజ్జనతాది దైవీ గుణాలనూ ప్రోది చేసుకుని, దుర్జనత్వాది రాక్షస గుణాలపై సాధించిన చిరస్థాయి విజయంగా వెలుగొందింది. గోలకొండ సామ్రాజ్యపు పొలి మేరల్లో ఆనాడు గోలకొండ సామ్రాజ్యపు సేనానులు దేవాలయాలను కొల్లగొట్టి, విగ్రహ భంగాలు చేస్తున్న రోజుల్లో సామ్రాజ్యపు నడిబొడ్డున రామదాసు సాధించిన ప్రభవ నామ సంవత్సర శ్రీరామ సామ్రాజ్యోత్సవం చారిత్రక ప్రసిద్ధి పొందింది. అది క్రీ.శ. 1687లో కారాగార విముక్తి అయిన తర్వాత తిరిగి భద్రాచలం చేరాక జరిగింది".[1]

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పీఠిక - బాలాంత్రపు రజనీకాంతరావుగారు పుట 8,9.

మహమ్మదీయులు హిందూ దేవాలయాలెన్నో ధ్వంసం చేశారు. ఔరంగజేబు ఆంధ్ర దేశంలో ఎన్నో హిందూ దేవాలయాలు కొల్లగొట్టించే ప్రయత్నం చేశాడు. హిందువులను ఎందరినో హత్య చేయించాడు. ఇది ఔరంగజేబు ఒక్కడే కాదు, ఏనాడైతే మన దేశంలో మహమ్మదీయులు ప్రవేశించారో అంటే ఘోరీ మహమ్మదు వంటి హిందూ మత ద్వేషులు వచ్చినారో ఆనాడే మన జాతికి ఈ దురదృష్టం పట్టింది. ఇటువంటి మత దురహంకారులైన మహమ్మదీయ దాడుల్ని ఎదుర్కోవలసిన ఆవశ్యకత హైందవుల ప్రథమ కర్తవ్యం. ఇటువంటి దురాత్ముల నుండి మన దేశాన్ని, హైందవ జాతిని రక్షించేందుకే రామనామం అనే ఆయుధాన్ని చేపట్టాడు రామదాసు.

రామదాసు తహసీల్దారుగా ఉండగా ఆయన నిర్మించిన రామాలయం ప్రభుత్వ ధనంతో కట్టాడు. అందుకే రాముడంటే ద్వేషం ఉన్న మహమ్మదీయులు, కుతుబ్షా రాజుకు అబ్దుల్లాకు రామదాసుపై లేనిపోని నిందలు వేసి తప్పుడు మాటలు చెప్పడం వల్ల ఖైదు చేయించడం, అక్కన్న, మాదన్నలపై ద్వేష భావం వహించి, వారిరువురిని ఔరంగజేబు మనుషులు చంపడం కాని, వారి మత దురహంకారానికి నిదర్శనం. కుతుబ్షాహీ రాజులు మత సహనం కల్గిన వారైనను, కొందరు హిందూ వ్యతిరేకుల వల్లనే గోల్కొండ రాజ్యం నశించి మొగలుల హస్తగతమయింది.

"శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము" నందు కుతుబ్షాహీ రాజుల కాలం నాటి మత పరిస్థితులను గూర్చి, రామదాసుపై ఆ మహమ్మదీయ మతస్థులు చేసిన తప్పుడు పనుల గూర్చి శ్రీరామ చంద్రరావు గారు ఈ విధంగా తెలియజేశారు. " మహమ్మదీయులు హిందువులను ద్వేషించసాగారు. మహమ్మదీయ గూఢచారులు రామదాసుగారి యెడ విష ప్రచారమొనరించి, ఆలయ నిర్మాణమును ఒకసాకుగా తానాషాకు కంటగింప జేసి గోపన్నను బందీగా గొని తెచ్చుట కాజ్ఞ పత్రికను బంపునట్లు జేసిరి. అంతియే కాక కొందరనుచరులు దౌష్ట్యమునకు వెనుదీయక ఖజానా దోపిడీ చేయుటయు, బాకీ దారులచే శిస్తు లెగవేయించుటయు జరిపిరి. తానీషా యాజ్ఞా పత్రిక గోపన్నకు చేరు వరకు నిట్టి సకలోపద్రవములచే సంభవించిన ఖజానా లోటు ఆరు లక్షలుండి గోపన్న దానికి బాధ్యుడుగా పరిగణింపబడెను".[1] ఇదిలా ఉండగా తానీషా కొలువున అక్కన్న, మాదన్నలకు వ్యతిరేక ప్రచారాలు పొడసూపెను. మొగలు చక్రవర్తియగు ఔరంగజేబు గోల్కొండను కబళించ మాటిమాటికి నుద్యుక్తుడగుచుండెను. హిందూ, మహమ్మదీయుల సఖ్యతను ఛేదింప దన యనుచరులతో బ్రయత్నములు సాగించెను".[2] అక్కన్న మాదన్నలు విజయవాడకు వచ్చి కనక దుర్గాలయ సమీపంలో ధర్మ సత్రాలు కట్టించి బీదల కన్నదానాలు చేస్తూ, మొగలుల బారి నుండి తప్పించడానికి తానీషాను కొండపల్లి దుర్గానికి చేర్చడానికి ప్రయత్నించారు. కాని అంతకు ముందే గోల్కొండలో చీలికలు బయలుదేరాయి. మహమ్మదీయులు హిందువులను ద్వేషింపసాగిరి. ఇటువంటి కల్లోలపు సుడి గుండంలో గోపన్న చిక్క వలసి వచ్చింది.

"ఈ ఆలయ నిర్మాణము ఆచంద్రార్కము దన కీర్తి వెలయింప గావింపబడెననియు, హుజూరు వారు యేటా చేయు యధిక వ్యయములో యిది యల్పముగ బరిగణింప బడదగినదనియు, విశేష ఫలమొసంగున దనియు, దీని కంగీకరింప వలసినదనియు, తొలితనే గోపన్న దాఖలు చేసికొనిన విన్నపమునాదరింప బడెను. రాజభటులు గోపన్నను బందీగా గొనిపోయిరి. పరగణా ప్రభులెల్లరు మిక్కిలి యాక్రందించి, వెంటనంటి కొంత దవ్వేగి, తమ ప్రాణ తుల్యుడగు గోపన్న గారికి రాజ దర్బారులోను

1,2 . శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము - కొండపల్లి రామచంద్రరావు , పుట 31-32.

పట్టణములోను కొందరి సహాయ సంపత్తితో నా ఋణ మీగ వలయునని సలహాల నొసంగి క్రమ్మరిల్లిరి. కాని గోపన్న గారు కేవల మానవుల యాచించునో ! బందియై వెళ్ళుచూ "నీ సంకల్పంబెటువంటిదో గన నెంతవాడ రామా" యను కీర్తన ఆలపించాడు".[1]

**పూరిక కళ్యాణి - ఆది**

*" నీ సంకల్పంచెటువంటిదో కన నెంత వాడ రామా !*
*వాసి దొలిసి నీ దాస జనుల భువి*
*గాసి పడిన మా ఘనత యెవ్వరిదో*
*ప్రోచిన మరి విడ జూచిన నీ కృప గాచి యుందుగాని*
*తోచి తోచకను తొడరి కరంబులు*
చేచి పరులనే యాచన సేయను"[2] అని పరులను యాచించకుండా శ్రీరామునే యాచించాడు రామదాసు. నరుల సహాయాన్ని తిరస్కరించాడు రామదాసు. అందుకే 12 సం॥లు ఖైదులో ఉండి ఆ తర్వాత రామానుగ్రహం పొంది ఖైదు నుండి విడుదలైనాడు. తానాషా మహమ్మదీయుడైనా శ్రీరామ దర్శనం పొందిన మహనీయుడు. తానాషా రాజుగా వృద్ధుడును, అశక్తుడును, దూరాలోచన లేనివాడు గావచ్చును గాని, యాతడు వేదాంతి, సూఫీ సిద్ధాంతములందును అనుభూతి గలవాడు. భగవద్భక్తిని అపారముగా గలవాడు. అతనికి శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణ సమేతుడై దర్శనమిచ్చినాడన్న మాట త్రోసి వేయదగినది కాదు".[3] అని భావరాజు వేంకట కృష్ణారావు గారు తానీషాను గూర్చి ఆతని అదృష్టం గూర్చి తెలియజేశాడు. భగవంతుని దృష్టిలో అందరూ సమానులే. హిందువులైనా, మహమ్మదీయులైనా క్రైస్తవులైనా, మరే ఇతర మతస్థులైనా అందరూ భారతీయులే. అందరూ సోదరులే. సృష్టికర్త అయిన భగవంతుడి అపార కరుణా కటాక్షం ఎవరి మీదైనా ఉంటుంది. మతాలు, కులాలు, వర్ణాలు అన్నీ మనం ఏర్పరుచకున్నవే. ఏ పేరుతో పిలిచినా భగవంతుడు పలుకుతాడు. రామా! అన్నా అల్లా! అన్నా ఏసూ! అని పిలిచినా అందరూ ఒక్కరే. సర్వ మత సమ భావవ చాటేందుకే తానీషా వంటి మత సహనం కలవారు కృషి చేశారు. రామదాసు వలన, అబుల్ హసన్ తానీషా కూడా కీర్తి ప్రతిష్ఠలు గడించాడు. కుతుబ్షాహీ రాజుల్లో తానీషా పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. తానీషా ప్రపంచానికే ఆదర్శం అని చెప్పడం అతిశయోక్తి కాదు.

తానీషాకు రామదర్శనం అయిన తర్వాత రామదాసు ఖైదు నుండి విడుదలైనాడు. రామదాసు ఖైదులోనే మరణించాడనే కొందరి అపవాదును కొండపల్లి రామచంద్రరావు గారు ఈ విధంగా ఖండించారు " ప్రౌఢ వయస్సుననే యుద్యోగమొదవెననియు, తానత్యంత దుఃఖితుడై కారాగారమున నున్నను, క్లిష్టతర రాజకీయ సమస్యలడ్డు వచ్చుటచే మేనమామలు ద్రవ్య సహాయము చేసి విడిపింపలేక పోయిరనియు, అది వారు ప్రభుత్వ ద్రవ్య దుర్వినియోగముగ భావించి మిన్నకుండిరనియు, తానీషాకు బదులు చెప్ప నుద్యమించలేదనియు నూహింప వలసినదే కాని, ఖైదులో మరణించినాడను అసహన పూర్వకమగు కొందరి కల్పనలు దురూహ్యములు".[4]

"తానీషా ధర్మ స్వరూపుడు, మతోన్మాద దూరుడు. హిందూ మహమ్మదీయ తారతమ్య మెరుగని ధన్యమూర్తి, మహారాణి సితార హిందూ మత ద్వేషి. అందుకే హిందూ మత ద్వేషులు రామదాసును

1. శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము - శ్రీ కొండపల్లి రామచంద్రారావు , పుట 31-32.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 82, కీర్తన 95.
3. భద్రాచలము - శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు - భారతి జూలై, 1951, పుట 651.
4. శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యము, 1961 మే, శ్రీ కొండపల్లి రామచంద్ర రావు, పుట 43

చంప ప్రయత్నించ (భద్రాచలం వెళ్ళేటప్పుడు) రాముడు శార్దూల రూపమున కన్పడి, హంతకులను చంపి, మిగిలిన వారిని తరిమి వేసెనట". మరియు, తానీషా విషయంలో సీతాదేవి రామునితో ఇలా అన్నదట. "వైకుంఠమున సీతా మహాదేవి భర్తతో నాథా ! పరమ భక్తాగ్రేసరుడైన రామదాసుకు దర్శనమీయక, భక్తుని హింస పెట్టిన మ్లేచ్ఛ ప్రభువునకు దర్శనమిచ్చుట, ఏంటి న్యాయమని"[2] విమర్శించెను. ఇక్కడ సీతాదేవి రాముని ప్రశ్నించడం అనేది కథ కావచ్చు. అయితే రామభక్తుడైన రామదాసుకు రామదర్శనం కల్గడం పెద్ద విశేషమేమి కాదు. రామభక్తుడు కాని, రామభక్తుని శిక్షించిన మ్లేచ్ఛ ప్రభువు అయిన అబుల్ హసన్ తానీషాకు రామదార్శనం కల్గడం విశేషం. ఇక్కడ గమనింప దగ్గ మరో అంశం ఏమిటంటే, తానీషా ఏనాడు స్వయంగా రామదాసును కఠినంగా శిక్షింప చేయాలని భావంచలేదు. పైగా ఖైదు నుండి విడుదల చేయించాలని చూశాడు. కాని అతని భార్య సితార హిందూ మతం అన్నా, హిందువులన్నా ద్వేష భావం చూపినదై రామదాసును కఠిన శిక్షలకు గురి చేసింది. ఆమె ఆజ్ఞానుసారం, ఆమె అధీనంలోని భటులు, మహమ్మదీయ జవాన్లు రామదాసును నిరంతరం బాధించారు. అందుకే తానీషా తనకు తెలిసి రామదాసును బాధ పెట్టనందు వల్లనే ఆతడికి రామదర్శన భాగ్యం కల్గింది. సితారకు రామదర్శనం కల్గలేదు.

నారుమంచి సుబ్బారావు గారు తాను వ్రాసిన రామదాసు కథలో "రాముడు సీతాదేవికి రామదాసు, తానీషాల పూర్వ జన్మ గాథ గూర్చి చెప్పినట్లు" వ్రాశారు. ఈ పూర్వ జన్మ గాథలు కల్పితం. అయితే తానీషాకు మాత్రం రామదర్శనం అయిన మాట నిజం. ఇది ఐతిహాసిక సత్యం. అందుకు రామదాసు గారు వ్రాసిన ఈ కీర్తనే నిదర్శనం.

**" ఆనంద భైరవి - ఆది"**

*"తెలియకనే మోసపోతిని - దేవుండని తెలియనైతిని*
*నళినాక్షీ వినవె కేవలముగు శ్రీ భద్రా - చల ధాములయిన శ్రీ రామ లక్ష్మణుల*
*నిశ్చలముగ వివరింపనైతిని - నిశి వేళలో ద్వారమందున*
*తలుపు గొట్టుచు బిల్వగా - సామాన్యులని నేనెంచు కొంటిని*
*రక్షించుమని వేడనయితిని - ద్రవ్యాపేక్ష గలిగిని వాడనయితిని*
*తక్షణమున వారార్లక్షల వరహాల్ని - లక్ష్యముగ నొసగిన సాక్షాత్కరులను*
*పక్షమున కరుణా కటాక్ష వీక్షణాలంకార దానవ*
*శిక్ష సల్పిన పక్ష భువన రక్ష నను రక్షించు మనినే"*[3]

ఈ కీర్తనలో రామదాసు రామాలయ నిర్మాణానికై ఖర్చు చేసిన ఆరు లక్షల వరహాల పైకం రామ లక్ష్మణులు వచ్చి తీనీషాకు ఒక అర్ధరాత్రి సమయంలో ఇచ్చి రసీదు పుచ్చుకొని వెళ్లడం, ఆ విషయమంతా రామదాసుకు తానీషా చెప్పగా విని ఆనందించి రామ లక్ష్మణులను తాను దర్శించుకోలేక పోయాననే బాధను, ఆవేదనను వ్యక్తం చేశాడు రామదాసు.

రామదాసు ఖైదు నుండి విడిపింపబడడానికి రాముడే కారణం. తానీషాకు శ్రీరామ దర్శనం కాగానే, రామదాసు యొక్క అపారమైన రామభక్తిని ప్రస్తుతించి, ఆయనను సాదరంగా సభకు ఆహ్వానించి గౌరవించాడు. తానీషాకు రామ దర్శనమైందని చెప్పడానికి ఇంతకన్నా వేరే నిదర్శనం అవసరం లేదు. ఇది కట్టు కథ కాదు నిజం అనడానికి ఈ కీర్తనే నిదర్శనంగా ఉంది.

1.2 . సంగీత మహర్షులు - మొదటి భాగం - నారుమంచి సుబ్బారావు పుట 44.

3. భక్త రామదాసు కీర్తనలు పుట 68, కీర్తన 73.

రామ నారాయణ కవులు వ్రాసిన "రామదాసు నాటకం"లో ఔరంగజేబు యొక్క క్రూరత్వాన్ని, మత దురహంకారాన్ని గూర్చి చక్కగా చిత్రీకరింపబడింది. 'తానీషా మాదన్నతో అన్న మాటలు ఎన్నదగినవి. మాదన్నగారూ ! ఔరంగజేబు రాజ్య పాలనా దక్షుడని చెప్పగలను. కాని, యతి క్రూరుడు. హిందూ మత ద్వేషి. నేను సహజంగా దురుష్కుడనైనను, మత ద్వేషము సహింపక యుండిన వాడనగుటచే నాతని పరిపాలనము నాకు క్రూరముగా నున్నది. ఢిల్లీ సామ్రాజ్య రమా వధూటి యట్టి వాని హస్తమున బడవలసినది కాదు"[1] అని తానీషా పరితపించడం గమనార్హం. ఇదే సందర్భంలో అక్కన్నగారు తానీషాతో అన్న మాటలు కూడా పరిశీలించ దగినవి " మీరు నిష్కల్మష హృదయులును, ఉభయ మతోద్ధారకులును నగుటచే నట్లు సెలవిచ్చు చుండిరి. కాని, సహజముగా తురుష్క చక్రవర్తులకు హిందువుల జూచిన ద్వేషము"[2]. ఈ మాటలు సత్యమే. హిందూ మతస్థులంటే ఆనాడే కాదు ఈ నాటికీ మహమ్మదీయులకు ద్వేష భావమే. ఈ 20 వ శతాబ్దంలో కూడా హిందూ, మహమ్మదీయుల మధ్య ద్వేషం రగులుతూనే ఉంది. హిందూ దేశాన్ని నాశనం చేయాలని మహమ్మదీయులు కుట్రలు పన్నుతూనే ఉన్నారు. మరి అటువంటి కుట్రల నుండి మన జాతిని రక్షించుకోవలసిన ఆవశ్యకత ఈనాడు మనపై ఎంతగానో ఉంది.

ప్రజలు తానీషా మత సహనాన్ని మెచ్చుకున్నారు. ఔరంగజేబు ఏ క్షణాన్నైనా గోల్కొండపై దండెత్తి రాగలడని, అప్రమత్తంగా ఉండమని అక్కన్న, మాదన్న లకు హెచ్చరించాడు తానాషా. తానాషాకు ఔరంగజేబు నుండి రక్షణ కల్పించడానికే అక్కన్న, మాదన్నలు శివాజీ మహరాజు సహాయం కోరి, తానాషాకు శివాజీకి సంధి గూర్చారు. కేవలం మతదురహంకారంలో 'సున్నీ' మతస్థుడైన ఔరంగజేబు హిందువుల ఆధిక్యం ప్రధానంగా ఉన్న గోల్కొండ రాజ్యంపైకి దండెత్తి వచ్చి హిందువులందరినీ సంహరించి, అక్కన్న, మాదన్నల తలలు నరికి చంపించి, దేవాలయాలు పగులగొట్టించి, ధ్వంసంచేసి, దేవాలయ ఆస్తుల్ని కొల్లగొట్టి, అబుల్ హసన్ తానాషాను బంధించి తీసుకొని వెళ్ళి 13 సం॥లు దౌలతాబాదు ఖైదులో ఉంచినాడు. ఇదంతా ప్రధానంగా మత దురహంకారియైన ఔరంగజేబు హిందువులపై ద్వేషంతో చేసిన ద్రోహమే. విధ్వంసమే. ఔరంగజేబు ఆనాడు చేసిన విధ్వంస కాండలో ఎందరో హిందువులు నాశనమై పోయారు. సంహరింపబడ్డారు. ఔరంగజేబు కారణంగా ఆంధ్ర దేశంలో హిందువులు తమ అస్తిత్వాన్ని కోల్పోయారనే చెప్పవచ్చును. ఔరంగజేబు గోల్కొండ పైకి దాడికి వచ్చిన నాటికి శివాజీ లేడు. తన 50 వ ఏటనే మరణించినాడు. శివాజీ ఉన్నంత కాలం మహమ్మదీయ దాడులకు గురి కావలసిన దుస్థితి ఉండేది కాదు. శివాజీ ఉన్నంత కాలం మహమ్మదీయులు ఎవరూ హిందువులపై దాడి చేసే ధైర్యం చేయలేదు. హిందూ సామ్రాజ్యాన్ని యావద్భారత దేశంలోనూ స్థాపించేందుకై ఛత్రపతి శివాజీ మహారాజు తీవ్రంగా కృషి చేశారు. రాజస్థాన్ లో రాణా ప్రతాప సింగ్ కూడా హైందవ సంస్కృతిని నిలబెట్టేందుకే కృషి చేసిన రాజ పుత్రుడు.

### 4.5.1. కుతుబ్షాహీల మతసహనం :

ఆంగ్ల చారిత్రక గ్రంథాల్లో కుతుబ్షాహీ రాజుల కాలంనాటి మత పరిస్థితులు, సాంఘిక స్థితి గతులను గూర్చి చరిత్రకారులు వ్రాసిన అంశాలు పరిశీలించవలసి ఉంది.

- "Cultural synthesis in Qutb shahi kingdom " (with special references to the function of

1,2 . రామదాసు నాటకము - రామ నారాయణ కవులు, ద్వితీయాంకము, పుట 28.

Ashur Khanas) అనే వ్యాసంలో "SADIQ - NAQUI" (సాధిక్ నక్వి) అనే చరిత్రకారుడు ఈ విధంగా తెలియజేసినాడు.[1]

The Qutbshas themselves where shias and then did never hide their identity. Then participated in the religious ceremonies to the fullest extent, but this never ever tried to impose them on others, what they did was to universallise the ceremonies like Nazer, Niaz (festivals) etc.,"

"It was here that one whether muslims or Hindu, Shia or sunni could participate the proceedings in his own way and according to his own belief."

కుతుబ్షాహీ రాజులు స్వతహాగా షియా మతస్థులు. వాళ్ళు హిందువుల పర్వ దినాల్లో కూడా పాల్గొనేవారు. హిందువులు కూడా మహమ్మదీయ పర్వదినాలైన 'నాజర్', 'నియాజ్' వంటి పండుగల్లో, ఉత్సవాల్లో ఇష్ట పూర్తిగా పాల్గొనేవారు. బలవంతంగా ఏ ఒక్కరినీ తమ మతాన్ని మత పద్ధతులను అవలంబించేలా కుతుబ్షాహీలు చేయలేదు. ఎవరి ఇష్టానుసారంగా వారు హిందువులైనా, ముస్లిములైనా, షియాలైనా, సున్నీలైనా ఒకరి పర్వ దినాలలో మరొకరు పాల్గొనేవారు. అందరూ కలిసి సఖ్యతతో మెలిగేవారు. సర్వమత సమభావాన్ని చాటేందుకై కుతుబ్షాహీలు కృషి చేసినారనడానికి పై అంశం నిదర్శనంగా ఉంది.

"Dr. Mohiunddin Qadrizore in his book Hyat-e-meer-Momin confirms this saying that," The whole population whether Muslims or non Muslims used to pay Homage in Ashur Khans and while doing so the diferences of culture, religion and caste were forge Hen"[2]

"డా॥ మొహియుద్దిన్ ఖాద్రిజోర్" అనే చరిత్రకారుడు తన గ్రంథం 'హయత్-ఎ-మీర్ మొమిన్' అనే దానిలో కుతుబ్షాహీ రాజుల కాలంలో హిందువులైనా, మహమ్మదీయులైనా సరే అందరూ కలిసి మసీదులు, మొదలైన ప్రార్థనా మందిరాల్లో కలిసి ప్రార్థనలు చేసేవారని, అందరూ కలిసి వివిధ సంస్కృతి సంప్రదాయాలను ఆచరించేవారని తెలియజేయబడింది.

"Gulam Imam Khan in "Tarikh-e-Resgihuddin Khani" writes that during Muharram every one from sultan to the ordinary man sunni, shiya or Hindu performed the cermonies of lunger according to his means"[3]

"గులామ్ ఇమామ్ ఖాన్ అనే అతడు తన "తారిఖ్-ఎ-రెస్గియుద్దీన్‌ఖాని" అనే గ్రంథంలో ముహారం పండుగను హిందూ, షియా, సున్నీలు అందరూ కలిసి జరుపుకునే వారని, ఆ ఉత్సవంలో అందరూ ఆనందోత్సాహాలతో పాల్గొనేవారని, అలాగే, హోలీ పర్వ దినాన్ని హిందువులూ, మహమ్మదీయులు అందరూ కలిసి జరుపుకునే వారని వ్రాయబడింది . డా॥ బి. రామరాజు గారు ఈ విధంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

"Dr. Ramaraju feels that this was the outcome of cultural synthesis and harmonious co-existance of Hindus and Muslims in Andhra, particularly in the area which was under the direct control of the Qutb Shahis" [4].

కుతుబ్షాహీల కాలం నాటి ఈ హిందూ మహమ్మదీయ సంస్కృతీ సమ్మేళనం సమాజంలో అందరూ కలిసి జీవించాలనే ఒక ఐక్యతా భావానికి నిదర్శనం. అందుకే అందరూ కలిసి ఉండి ఇరువురి సంస్కృతులు సమ్మిళితం చేసి జీవించే ఒక జీవన విధానం కుతుబ్షాహీల కాలంలో కనిపిస్తుంది. హిందూ మహమ్మదీయ సంస్కృతీ సమ్మేళనానికి కుతుబ్షాహీల కాలం ఆదర్శంగా ఉంది. మరియు

1. Andhra Pradesh History Congress. 1985.
2. Zore-Mohiuddin Qudri Hyat-e-Mirmomin, P.No.6.
3. Gulam Immam Khan - Tarikh-Rasheed Uddin Khani, P.No 413.
4. B. Rama Raju - Muhharram folk Songs in Telugu, P.No.1.

" They took upon themselves the cultural synthesis rather than in dulging in religions castes and creeds. They crecited an atmosphere in which people started arsiging greater importance to Human Values".[1]

కుతుబ్షాహీ రాజులు కులం, మతాల కన్నా సంస్కృతికి, మానవతా విలువలకు అధిక ప్రాధాన్యాన్నిచ్చారు.

" To share the sorrow and joy, respecting the feelings and sentiments of others, became the principles of the period".[2]

ఆనాడు హిందూ, మహమ్మదీయులు ఇరువురూ ఒకరినొకరు గౌరవించుకుంటూ ఒకరి సంతోషాన్ని , దుఃఖాన్ని మరొకరు పంచుకుంటూ, కలిసి మెలిసి ఆనందంగా కాలం గడిపే వారు. వారి కాలంలో ఒకరి సిద్ధాంతాల్ని మరొకరు గౌరవించేవారు. కుతుబ్షాహీ రాజుల కాలంలోని మత పరిస్థితుల్ని గమనిస్తే మనకు మూడు అంశాలు స్పష్టమౌతాయి.

1. First, a brahmin could attain the highest position in Qutub Shahi administration.
2. Secondly, the sake of a Hindu Temple by a brahmin and,
3. The third a Muslim Sultan reaction to it of such an extreme nature that it lead to his death.[3]

1. మొదటిది బ్రాహ్మణులు ఉన్నత పదవులు అలంకరించడం ( అక్కన్న, మాదన్న, రామదాసు).

2. రెండవది హిందూ దేవాలయం ఒక బ్రాహ్మణుని చేత కట్టబడటం. రామదాసు చేత భద్రాచల ఆలయం నిర్మింపబడింది.

3. మూడవ అంశం ముఖ్యమైంది. రామాలయ నిర్మాణం జరిపిన కారణంగా ఖైదులో ఉంచబడిన బ్రాహ్మణుడు అయిన రామదాసు విడుదల చేయబడటం. ఒక మహమ్మదీయుడైన తానాషాకు రాముడు దర్శనం ఇవ్వడం, తద్వారా రామదాసును ఖైదు నుండి విడిపించడం, అలాగే అక్కన్న మాదన్నలపై ప్రేమాభిమానాలు కల్గి ఉండడం, ఈ కారణంగా అది తానీషా హత్యకు కారణమైంది. ఔరంగజేబు తానీషను ఖైదు చేసి దౌలతాబాదు జైలులో 13 సం॥లుగా బంధించగా అందు అవసాన దశలో ఎంతో కృంగి కృశించి మరణించాడు తానీషా. ఈ మూడు ప్రధానాంశాల్ని పరిశీలిస్తే కుతుబ్షాహీ రాజులు హిందువుల్ని, మహమ్మదీయులతో సమానంగా ఆదరించడమే గాక, ఉన్నత పదవులిచ్చి, వారికే పట్టం గట్టారని అనడం ఆశ్చర్యం కాదు. ఈ కారణంగానే గోల్కొండ రాజ్యం పతనమైందని తెలుస్తుంది.

"H.K.Sherwani" ఈ విధంగా తెలియ జేసినారు.

Dr. Sherwani quotes to write, "it seems that simultaneously withe the appointment of Mirahah-Mir as supreme commander of the first Qutbshahi army, Ibrahim had delegated practically all civil authority to Murahari Rao, a Brahmin who was unsuppressed in an abundance of commonsense and who was also handsome face."[4]

మొదటి కుతుబ్షా రాజు "మహమ్మద్ కులీ" కాలంలో సర్వ సైన్యాధ్యక్షుడుగా మీర్షా మీర్ ఉండగా, అతనిని మహమ్మద్ ఇబ్రహీం కుతుబ్షా తొలగించి, ఈతని స్థానంలో మురహరిరావు అనే బ్రాహ్మణుని, హిందూ మతస్థుని సర్వసైన్యాధ్యక్షుడుగా నియమించినాడు. ఈతని కాలంలోనే ఆదోనిలోని హిందూ దేవాలయాన్ని

1. Cultural synthesis in Qutub shahi kingdom - SADIQ-NAQUI(Andhra Pradesh History Congressm 1985, P.No.69.
2,3. " " " " " " P.No. 70.
4. Sherwani H.K. History of the QutbShahy Dynasty . P.No. 176.

కూడా పునరుద్ధరించడం జరిగింది. అంతేకాక కుతుబ్షాహీ రాజులు మతసహనాన్ని గూర్చి హెచ్.కె.షెర్వానీ ఇలా వ్రాశారు.

" The Sultans in person were broad minded and believed in human values. As Dr. Sherwani writes, " it maybe said that the whole out look of the state as centered in person of the sultan was non communal and if epithet may be used without any intention of anachronism it was national."[1]

"కుతుబ్షాహీ రాజులు ఎంతో ఉదార స్వభావులు, పరమత సహనం గల మానవతా మూర్తులు" అని చెప్పడం జరిగింది. డా॥ వి. రాఘవన్ గారు కుతుబ్షాహీల కాలం నాటి హిందూ, మహమ్మదీయుల సమైక్యతా భావాన్ని గూర్చి ఈ విధంగా తెలియజేశారు. తానాషా గూర్చి కూడా ఇలా వివరించారు.

"In the time of the successor Abul Hassan known as Tanashah, Hindu-Muslim Unity had grown further., not only were his ministers Hindus, the two brothers Akkanna and Madanna, but many Mohammedan officials freely participated in Hindu festivals".[2]

రామదాసుకు, తానీషాకు, శ్రీరామచంద్రునికి మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాల గూర్చి చాలా చక్కగా తెలియజేశారు రాఘవన్ గారు.

"Abul Hassan was more popularly known as Tanishah which means a Jovial King, But deep below his gaiety, there was all that he had imbibed in his stay in young age in the religious of atmosphere in Gulbarga. The maturity of spiecit was also due to the rare experience he had in his dealing with Ramadas, in the sight of Sri Rama Chandra which he was blessed with.

"It is not a matter of wonder that through his Bhakti to Rama, Ramadas attained salvation, the wonder is that Ramadas took with him the Mohammadan Ruler. So did Ramadas himself exclaim and felicitate Tanishah on the divine darshan which he was blessed".[3]

తానీషా మొదటి నుండి భగవత్తత్వాన్ని తెలుసుకునే ఉద్దేశ్యంతో ఆధ్యాత్మిక జీవితం గడిపాడు కావున భగవంతుడు ఒక్కడే అని, అన్ని మతాలు ఒక్కటేనని, సర్వ మత సమ భావాన్ని ప్రదర్శించాడు తానీషా. అబుల్ హసన్ తానీషా రామదాసును , అతని రామభక్తికి మెచ్చుకొని గౌరవించాడు. మరో విషయం, రామభక్తుడైన రామదాసు రామ సాయుజ్యం పొందడం పెద్ద విశేషం కాదు. కాని రామదాసు తనతో పాటు ఒక మహమ్మదీయుడైన తానీషాను కూడా శ్రీరామ సన్నిధికి తీసుకొని వెళ్లడం విశేషం. అందుకే రామ దర్శనం పొందిన తానీషాను,

"ధన్యుడవు తానీషా నీవు నన్ను కన్నయ్య పాదములు కనుల కన్నావు" అని ప్రస్తుతించాడు రామదాసు. శ్రీ రామ సందర్శనంతో తానాషా జన్మ చరితార్థమైంది. రామదాసు కారణంగా తానీషాకు కూడా శ్రీ రామ సాయుజ్యం కల్గిందంటే అతిశయోక్తి కాదు. తన చరమ దశలో తానీషా ఔరంగజేబుచే ఖైదు చేయబడి దౌలతాబాదు ఖైదులో రామనామాన్ని జపిస్తూ, 'రామ్ రహీం ఏక్ హై' అన్న భావాన్ని హృదయంలో నిల్పుకొని జీవితాన్ని ఆధ్యాత్మిక చింతనతో గడిపి మరణించినాడు. చరిత్ర ఉన్నంత కాలం తానాషా పేరు కూడా రామదాసు పేరున్నంత కాలం, నిలిచి ఉంటుంది. ఇది తానాషాకు, రామదాసుకు గల అత్యున్నత సంబంధం.

1. Sherwani H.K. History of the Qutb Shahi Dynasty P.No. 300.
(seen in Andhra Pradesh History Congress yearly magazine 1985.)
2. Bhadra Chala Ramadas - Dr. V. Raghavan (article) - Great Composers, P.No.12.
3. " " " " P.No.13.

### 4.5.2. కుతుబ్షాహీలు - మత సంస్థలు :-(దేవాలయ నిర్మాణం)

కుతుబ్షాహీలు హిందూ దేవాలయ నిర్మాణానికై, ఆ దేవాలయాల దైవ కైంకర్యాలకై ఎంతో ధనం ఖర్చు చేశారు. అబుల్ హసన్ తానాషా కాలంలో ఎన్నో దేవాలయాలకు ఆస్తులు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా 'భద్రాచలం' దేవాలయానికి 'భద్రాచలం, పాలుగల్లు, అశ్వారావు పేట, మొదలైన పరగణాలు దానంగా ఇవ్వబడినాయి.

The History of Qutb Shahi dynasty అనే గ్రంథంలో ఈ విషయం గూర్చి ఇలా చెప్పబడి ఉంది.

"Most of Abul Hasan's reign was covered by the ministry of Madanna, and the Military command of Akkanna, and it is so wonder that the period saw the creation of a number of Hindu temples and renovation of some of the existing ones.[1] (దేవాలయాల జీర్ణోద్ధరణ, నూతన దేవాలయాల నిర్మాణం జరిపించడం)

ఈ పై విషయాన్ని ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్ తన వ్యాసంలో తెలియజేసినారు.

(with the Dutch prints of the portraits of the two ministers opp. p. 93 Dr. Aiyangar says on P.95 of J.I.H. (Journal of Indian History)

అబుల్ హసన్ తానాషా అబ్దుల్లా తర్వాత రాజ్యాన్ని పరిపాలించి ధనాన్ని ఖర్చు చేసిన తీరునుగూర్చి "The History of Qutb Shahi Dynasty" లో చెప్పబడింది.

"It is related that immediately after his accession to the throne Abul Hasan made an inventory of the state treasury and found that it consisted of four distinct departments.

1. money to be spent according to the dictates of God.
2. advance pay of the troops .
3. money for the kings comforts and his luxuries, and
4. reserves."[2]

1. దేవాలయాలకు, దైవకార్యాలకు ఖర్చు చేయడం.
2. భక్తి తత్త్వకవులకు, ఇతర వర్గాల వారికి, సామాజిక సంస్థలకు దానంగా ధనం ఇవ్వడం.
3. విలాసాలకై ఖర్చు చేయడం.
4. కొంత మూలధనం ఖాతాలో ఉంచడం.
5. కొంత తమ స్వంత ఆస్తిగా వాడుకోవడం.

ఈ పై వ్యయం వల్ల గోల్కొండ రాజ్య ఆస్తులు క్రమంగా తరిగి పోవడం జరిగింది. పైగా ఇతర రాజ్యాల వారి దాడుల వల్ల కూడా వారి సంపదలు కొల్లగొట్టబడినాయి. దేవాలయ ఆస్తులు కూడా హరింపబడినాయి.

" Hindu and Muslim Religious Institutions in Andhradesa" అనే గ్రంథంలో ఈ విధంగా ఉంది.

" The QutbShahi monarchs were aware of the political benefits that accure from the patromage give to the religious institutions hence the temples, Mathas, Agraharas, Mosques, Darghas, Khangas, and Ashur khanas became the focus of propagation and preservation of their respective faiths." One of the main aims of these religious institutions was to promote the spiritual welfare of society as they were service oriented in nature. Apart from being great religious and

1. The History of Qutubshahi Dynasty - H.K.Sherwani, P.No. 619. (Special reference - S. Krishna Swami Aiyagar "Abul Hasan Qutbshah and his ministers, Madanna and Akkanna. P.No.92-142, August,1931,J.H.I.H).
2. History of the Qutubshahi Dynasty - H.K.Sherwani, P.No. 625.

spiritual centres they channelised the sentiments of the masses and had aproforend influences on the political, social, economical and cultural life of the people."[1]

కుతుబ్షాహీల కాలం లోని హిందూ దేవాలయాలు, మహమ్మదీయ ప్రార్థనా మందిరాలైన మసీదులు, దర్గాలు, అలాగే హిందువుల అగ్రహారాలు, మఠాలు, మొదలైనవన్నీ ఆయా మతస్థుల ప్రార్థనా విధానాన్ని, దైవాన్ని, వారివారి నమ్మకాలను గురించి ఏర్పడినాయి. ఈ మత సంస్థలయొక్క ప్రధాన ఉద్దేశ్యం వారి వారి మత విధానాలను ప్రచారం చేయడమే. పైగా రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రజలు అభివృద్ధి చెందడానికి ఈ ఆధ్యాత్మిక మత సంస్థలు ప్రధాన రంగ స్థలాలుగా ఉన్నాయి. ప్రజలందరినీ సామూహికంగా ఒక చోట ఐక్యంగా చేర్చడానికి ఈ సంస్థలు తోడ్పడతాయి.

హిందూ ధార్మిక సంస్థలైన దేవాలయాలు, మఠాలు, ఆధ్యాత్మిక సంస్థలు ఎన్నో మన దేశంలోనే కాక, ప్రపంచంలో కూడా వైదిక సంస్కృతిని స్థాపించడానికి తోడ్పడుతున్నాయి. మరియు 16 వ శతాబ్దంలో ఈ దేవాలయాలు కుతుబ్షాహీల కాలంలో స్థాపించబడినాయి. హిందూమతం ఆధిక్యంలో ఉంది. "The temple decline as a result of the full of Hindu political power naturally led to the decline of the matha towards the end of the 16th century A.D."[2] అని సోమారెడ్డి గారన్నారు. 16 వ శతాబ్దం చివరికి హిందూ మఠాధికారులు రాజకీయంగా సుస్థిరతను సాధించారనవచ్చును.

" And the gradual expansion of the Muslim rule under the Bahamanis and Qutb Shahis in Succession led to the decline of the agrahara."[3]

హిందూ దేవాలయాలు మసీదులుగాను, దర్గాలు గాను కూడా ఈ కాలంలో మార్చబడడం మహమ్మదీయుల మత దురహంకారానికి, హిందూజాతిపై వారికున్న ద్వేషాన్ని సూచిస్తుంది. ఈ విషయాన్ని 'సోమారెడ్డి' గారు తమ గ్రంథంలో ఈ విధంగా ప్రస్తావించారు.

"The muslim scions during their process of expansion first established muslim religious institutions such as Mosques, Ashur khanas, and Dargas at various places since these acted as important centures in moulding the life of people. Some of these were converted from Hindu temples or built with the material that came from the ruins of temples."[4]

ఈ ధార్మిక సంస్థలకు వచ్చే ఆదాయం గూర్చి కూడా సోమారెడ్డి గారు ప్రస్తావించినారు.

The two main sources of income that rustained the religious institutions were, according to Dr. Soma Reddy, the longterm or fixed Assets and the short term or current Assets.

1. The First category compraised both movable and immovable properties such as villages, lands, gardens, buildings, cattle, jewellery etc.,[5]

భద్రాచలం ఆలయానికి భద్రాచలం, అశ్వారావు పేట, పానుగల్లు, పరగణాలనుండి వచ్చే ఆదాయం మొత్తం దానంగా తానాషాచే ఈయబడింది. ఇవి ఆ ఆలయ స్థిరాస్తులని చెప్పవచ్చును. గ్రామాలు, భూములు, పశు సంపద మొదలైనవి. ఇవి ఆలయాలకు, తదితర మత సంస్థల స్థిరాస్తులు.

2. Second category consisted of the proceeds of Taxes tolls and other monetary endowments.[6]

పన్నుల ద్వారాను, కానుకల ద్వారాను, ఎవరైనా దానంగా ఇచ్చే వస్తు వాహనాల వలన వచ్చే ఆదాయం చరాస్తి, ఈవిధంగా వచ్చే స్థిర, చరాస్తుల వల్ల ఈ ధార్మిక సంస్థలు అభివృద్ధి చెందాయి.

1. Soma Reddy- " Hindu and Muslim religious Institutions in Andhra Desa"(1300 -1600). P.No.9 .
2. " " " " " " P.No. 192.
3. Qutbshahi State in Deccan - Salma Ahmed - P.No.79.
4. Soma Reddy - "Hindu and Muslim religious Institutions in Andhra Desa" (1300-1600), P.No.193.
5,6. Qutbshahi State in Deccan - Salma Ahmed - P.No.81.

"It is highly probable that in the QutbShahi regine all religious institutions estates from where they derived income"[1]

ఆనాటి మత-రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆ స్థితి గతుల్ని గూర్చి సల్మా అహ్మద్ తన 'కుతుబ్షాహీ స్టేట్ ఇన్ దక్కన్' అనే పరిశోధనా గ్రంథంలో ఈ విధంగా తెలియజేశారు.

"The religious policy that was adopted by the Qutbshahi-monarchs was one of the toleration towards Hinduism their liberal mindedness was mainly to serve the purpose of keeping in fact the socio-economic structure, i.e., Feudalism which served as a tool forligitimising the state policies".[2]

కుతుబ్షాహీ రాజులు తాము సామాజికంగాను, ఆర్థికంగాను, రాజకీయంగాను సుస్థిరత పొందేందుకే ఆనాటి సమాజంలో వారు మత సామరస్యాన్ని అవలంబించారు. తమ అస్తిత్వం కొరకే ప్రయత్నించారు. అన్ని మతాల మధ్య సదవగాహన కుదిర్చే ప్రయత్నం చేసి, తద్వారా తాము రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా అలాగే సాంస్కృతికంగా కూడా లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. మరియు

"It has also been said that the Qutbshahi monarchs encouraged Hinduism but this is a debatable fact since most of the Hindu religious institutions such as the temple, matha and agrahara seemed tobe on the decline and some were even demolished in the process of Qutubshahi expansion or power".[3]

కుతుబ్షాహీల కాలంలో హిందువులు ఆధిక్యంలో ఉన్నారని చెప్పినా, ఆనాడు ఉన్న హిందూ దేవాలయాలు, మఠాలు, హిందూ అగ్రహారాలు ఎన్నో కుతుబ్షాహీల కాలంలోని హిందూ మత ద్వేషులైన వారి వల్ల నాశనం అయ్యాయి. మహమ్మదీయులు తమ ఆధిక్యాన్ని నిలుపుకొనే ప్రయత్నం చేశారని చెప్పక తప్పదు. కుతుబ్షాహీల కాలంలో నిజానికి అందరూ మహమ్మదీయులు హిందువుల యెడ గౌరవాభిమానాలు పూర్తిగా చూపలేదు. హిందువులను ఎందరినో మహమ్మదీయులు సంహరించారు. మన సంస్కృతిని నాశనం చేసే ప్రయత్నం చేశారు. మన సంస్కృతికి ప్రతి రూపాలైన దేవాలయాలనెన్నింటినో ధ్వంసం చేశారు. అందుకే పూర్తిగా కుతుబ్షాహీల కాలంలో హిందూ, మహమ్మదీయ ఐక్యత సాధింపబడలేదని కూడ చెప్పాలి. "మతం" అంటే ఏమిటో ఈ విధంగా నిర్వచించబడింది.

"Religion may be a private set of beliefs of only one person, or it may be a shared set of believes of many, but it is often practised within a formal organisation"[4]

మతం అనేది ఒక వ్యక్తి లేక కొందరు వ్యక్తుల సమూహం యొక్క నమ్మకాలకు సంబంధించింది. ఒక్కొక్కరికి ఒక్కొక్క సిద్ధాంతం, నమ్మకం ఉంటుంది. ఎవరి మతం, ఎవరి ధర్మం వారిది. అందరి అభిప్రాయాలు ఒకలా ఉండాలని లేదు. ఒక్కొక్కరు ఒక్కొక్క పద్ధతిని అనుసరిస్తూ జీవనం గడుపుతారు. కొందరు అల్లాను, కొందరు ఏసును, కొందరు రామకృష్ణులను పూజిస్తుంటారు. వారి వారి మతాలకు మత గ్రంథాలున్నాయి. ఆయా మతాల వారు వారి వారి మత గ్రంథాల్లో ఉన్న విషయాలను ఆధారంగా చేసుకొని తమ జీవన విధానాన్ని రూపొందించుకుంటారు. అయితే ఏ ఒక్క మతం వారైనా ఇతర మతాల వారిని ద్వేషించడం తగదు. ఇతర మత సిద్ధాంతాలను గౌరవించాలే తప్ప వారిని దుయ్యబట్టరాదు. వారికి కీడు చేయరాదు. ఈనాడున్న రామాయణం, భగవద్గీత, ఖురాను, బైబిలు వంటి మత గ్రంథాలన్నీ పరహింసను ఖండించాయి. అవసరమైతే పరులకు సేవ చేయమని

1. Soma Reddy - Hindu and Muslim religious institutions in Andhra desa-Madras, 1984, P.No.96.(Qutbshahi state in Deccan P.No.81).
2. Qutubshahi State in the Deccan (1518-1687) by Salma Ahmed,1992, M.Phil desertation H.C.U.P.No.78.
3. " " " " " " " P.No.79.
4. New Standard Encyclopedia, Vol-12, Chicago P.No.156.

ఉద్బోధిస్తున్నాయి. 'సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని' ఈ గ్రంథాలు కోరుకున్నాయి. ఈ మతాలన్నీ మానవుడు సృష్టించుకొన్నవే కాని, భగవంతుని దృష్టిలో జీవులంతా ఒక్కటే. అందుకే అందరూ ఐకమత్యంతో మెలగాలే గాని, ఒకరినొకరు ద్వేషించుకోరాదు. రక్తపాతం సృష్టించరాదు. కాని అనాదిగా మన దేశంలోనే కాక, ప్రపంచమంతటా వివిధ మతస్థుల మధ్య ఘర్షణలు చెలరేగుతూనే ఉన్నాయి. తద్వారా ప్రపంచ శాంతి నశించే ప్రమాదం ఏర్పడింది. మహమ్మదీయులు తమ ఆధిక్యాన్ని నెలకొల్పడానికై తీవ్రంగా కృషి చేశారు.

"The 14th century provided a new demenision to the political, religious, socio-cultural institutions of the Deccan by heralding an era of muslim domination in south Indian polity, which is evident in the establishement of muslim provincial states".[1] Such as the Bahamani's and later the Qutbshahis"[2]

By the early 16th century the Qutubshahis had established themselves, fully in early the entire Andhra region.[3]

16వ శతాబ్దం నాటికి కుతుబ్షాహీలు ఆంధ్ర దేశంలో తమను తాము అభివృద్ధి పరచుకొని, పటిష్ఠమైన ప్రభుత్వాన్ని, రాజ్యాన్ని స్థాపించారు.

### 4.5.3. వివిధ మతాలు - శాఖలు :

కుతుబ్షాహీల కాలంలో ప్రధానంగా ప్రశస్తమైన మతాలు హిందు, మహమ్మదీయ మతాలు. వీటిలో కూడా హిందువులు శైవ, వైష్ణవ మతాలు అనుసరించారు. ఇస్లాం మతంలో కూడా షియా, సున్నీలు అనే రెండు శాఖలు ప్రాచుర్యం పొందాయి. ఈ మతాల వివిధ శాఖల గూర్చి 'ది కుతుబ్షాహీ స్టేట్ ఇన్ దక్కన్' అనే గ్రంథంలో వివరింపబడింది.

"During the region of Muhammad Quli Qutubshah (1580-1612 A.D) nearly the whole of Andhra Desa was conqured and the major religious that remaineded prevellent in the kingdom were Hinduism and Islam. The various sects in Hinduism that were at the height of their glory during the proceeding centuries were Saivism (that sub sects of saivism were Pasupatas, Kalamukhas, Kapalikas, Veera Saivas), Vaishnavisam, The sub sects of Vaishnavism- Madhwas, Chaitanyas, Vithalas.[4]

Shakti cult and primitive cults (such as the siddas, worship of Veerabhadra, Ganapathi, Surya, Hanuman etc.,). Islam had started to gain a root hold from the 14th century with the muslim invasion of the Deccan which resulted in the infilteration of new muslims and proselytization in the area".[5]

### 4.5.3.0. హిందూ మతం - వివిధ శాఖలు :

కులీ కుతుబ్షా రాజ్యాన్ని పరిపాలిస్తున్న కాలంలో హిందూ, మహమ్మదీయులు ప్రధాన మతాలుగా ఉన్నాయి. హిందూ మతంలోను, శైవం, వైష్ణవం అనే రెండు ప్రధాన శాఖలున్నాయి. శైవుల్లో పాశుపతులు, కాలముఖులు, కాపాలికులు, వీర శైవులు అనే వారు ప్రధానంగా ఉండేవారు. వైష్ణవంలో -శ్రీ వైష్ణవులు, వైఖానసులు, మధ్వలు, చైతన్యులు, విఠలులు అనే వివిధ శాఖల వారు ఉండేవారు. వారే కాక 'శక్తి ఆరాధకులు' ఉండేవారు. వారు శక్తిని పూజించేవారు. సిద్ధులు, వీరభద్రుని ఆరాధించేవారు. గణపతి, సూర్యుడు, హనుమంతుడు మొదలైన దేవతలను ఈ కాలం నాటి హిందువులు ఆరాధించేవారు.

1. Soma Reddy - Hindu and Muslim institutions in Andhra desa,P.No.2, 1984, Madras.
2. The Qutubshahi State in Deccan - Salma Ahmad, P.No.73.
3. Soma Reddy - Hindu and Muslim institutions in Andhra desa , P.No. 3.
4. " " " " " " 4.
5. " " " " " " 5.

#### 4.5.3.1. మహమ్మదీయ మతం - వివిధ శాఖలు :

14వ శతాబ్దం నుండి మరోవైపు ఇస్లాం మతం ప్రాచుర్యం, ప్రాబల్యం పొందసాగింది.

"The main sects of Islam i.e., Sunnism, Shiism, and sufism. were promoted by the Deccan muslim states acording to their rules adherence, by the time of the Qutubshahis had started to rule in Golconda. The rulers of Golconda were of Shia faith. Most of the Hindu religious sects has suffered adecline due to in adequate propagation and the fall of Hindu kingdoms in the south. This inturn helped Islam in spreading further and gaining more followers".[1]

మహమ్మదీయుల్లో షియాలు, సున్నీలు, సూఫీలు అనే మూడు శాఖలవారున్నారు. కుతుబ్షాహీలు షియా మతానుయాయులు. మహమ్మదీయులు రాజులైన అనంతరం హిందూమతం మహమ్మదీయుల చేత అణచివేయబడే పరిస్థితి వచ్చింది. మహమ్మదీయుల క్రింద హిందూ రాజులు బానిసలుగా మారే పరిస్థితి వచ్చింది. మన హైందవసంస్కృతి క్షీణించే ప్రమాదం ఏర్పడింది. దానికి కారణం ఇస్లాం మతం భారతదేశం అంతటా విస్తరించడమే. మహమ్మదీయుల్లో కూడా షియా, సున్నీ, సూఫీ మతాల వారి మధ్య విభేదాలు కూడా తల ఎత్తుతుండేవి. ఒకే జాతి వారైనా వారి మధ్య భేదాభిప్రాయాలు వస్తుండేవి. ఈ వివిధ శాఖల వారి గూర్చి సోమారెడ్డి గారు ఇలా వివరించారు.

"Thus in the Qutubshahi period Shiism became the religion of the ruling elite and a naturally acquired popular support but despite thism sunnism which[2] was followed by the Tughlaqs and Bahamanis in the Deccan, seemed to predominate".

కుతుబ్షాహీలు షియా మతానుయాయులు. కాని తుగ్లక్‌లు, బహమనీలు, మొగలులు సున్నీ మతస్థులు. వారిరువురికి క్షణం పడేది కాదు. సున్నీ మతస్థుడైన ఔరంగజేబు నిరంతరం కుతుబ్షాహీలపై దాడులు జరిపి వారిని తన బానిసలుగా చేసుకోవాలని ప్రయత్నించాడు. అబుల్ హసన్ మాత్రం సూఫీ మతానుయాయి. అందుకే హిందూ, మహమ్మదీయులను సమానంగా ఆదరించేవాడు. అందుకే ఔరంగజేబు అబ్దుల్లాను, అబుల్ హసన్‌ను ద్వేషించినాడు. చివరికి గోల్కొండను జయించి వారిని బందీలుగా చేశాడు. 1687 నాటికి గోల్కొండ ఔరంగజేబు హస్తగతమైంది. "కుల వ్యవస్థ" కుతుబ్షాహీల కాలంలో ఎలా ఉందో పరిశీలించ వలసి ఉంది.

#### 4.5.4. కుల వ్యవస్థ :

కుతుబ్షాహీల కాలంలో బ్రాహ్మణులు ఆధిక్యంలో ఉన్నారని చెప్పవచ్చు. అక్కన్న, మాదన్నలు, తహసీల్దారుగా ఉన్న గోపన్నలు బ్రాహ్మణులే. వీరందరూ ఉన్నత పదవులలంకరించారు. క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య, శూద్ర అనే చాతుర్వర్ణ వ్యవస్థ ఉండేది. అందులో శూద్రులు మరియు పంచములుగా పేరు పొందినవారు సమాజానికి దూరంగానే ఉన్నారు. ఏ ప్రభుత్వ పదవికి అర్హులు కాలేకపోయారు. క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్యులకు సమాజంలో గౌరవం లభించింది. ఈ కుల వ్యవస్థ గూర్చి సల్మా అహ్మద్ గారు ఇలా వివరించారు.

" The caste system that prevailed in Hinduism was utilized by the Qutubshahis in such a way that along with serving their own interest, they could also accomodate[3] the dominent element in society. For example Brahmans were retained in revenue collection".

వివిధ ఉన్నత పదవుల్లో బ్రాహ్మణులు ఉన్నారు. కుతుబ్షాహీ రాజులు బ్రాహ్మణులను ఎంతగానో గౌరవించారు. వారికి అగ్రహారాలు, గ్రామాలు దానంగా ఇచ్చారు. మహమ్మద్ కులీ, ఇబ్రహీం కుతుబ్షా, అబ్దుల్లా, అబుల్ హసన్‌లు బ్రాహ్మణులను గౌరవించి, వారికి అగ్రహారాలు దానంగా ఇచ్చినట్లు చారిత్రకాధారాలున్నాయి. 'మీర్ జుమ్లా' కూడా (సయ్యదహమదు) బ్రాహ్మణునికి ఒకరికి అగ్రహారం దానంగా ఇచ్చాడు.

1,2 . The Qutubshahi State in Deccan - Salma Ahmad, P.No. 74.
3. " " " " P.No. 98.

వివాహ వ్యవస్థ విషయానికి వస్తే హిందువులను ఎందరినో మహమ్మదీయులు వివాహం చేసుకున్నారు. హిందూ స్త్రీలను మహమ్మదీయులు వివాహం చేసుకోవడం గమనించదగ్గ విషయం. కులీ కుతుబ్షా 'భాగమతి' అనే హిందూ స్త్రీని వివాహం చేసుకుని ఆమె పేరుతో భాగ్య నగరాన్ని ఈనాటి హైదరాబాదును నిర్మించాడు.

"Kingship in the sultanates of Bijapur and Golconda అనే గ్రంథంలో కుతుబ్షాహీల వివాహ వ్యవస్థను గూర్చి ప్రస్తావించబడింది. " Along with this the practise of muslim monarchs marry Hindu women started by the Bahamani sultans in the Deccan was continued in the succession on states. Such a marriages developed cordial relations in society.[1]

బహమనీ రాజుల కాలం నుండి హిందూ స్త్రీలను మహమ్మదీయులు వివాహం చేసుకోవడం ప్రారంభమైంది. దీంతో హిందూ మహమ్మదీయ సంబంధాలు సమాజంలో గట్టి పడ్డాయి. మరో ముఖ్య విషయం, కుతుబ్షాహీ రాజులు మత సంస్థల కొరకై ఎంతో ధనం ఖర్చు చేసేవారు. ఈ మత సంస్థలు, దేవాలయాదుల అభివృద్ధికై కొంత ధనం భద్రపరచారు.

" The Government used to keep aside a fixed amount to be spent on the religious institutions from the royal treasury".[2]

అబుల్ హసన్ తానీషా తన కుమార్తె దిలారాను గోపన్న కుమారుడు రఘురామునికి ఇచ్చి వివాహం చేసి అతడిని గోల్కొండ రాజ్యానికి చక్రవర్తిని చేస్తానని అన్నట్లు "రామదాసు నాటకం"లో ధర్మవరం గోపాలాచార్యులు వ్రాశారు. ఖైదులో ఉన్న రామదాసుతో ఈ విషయం అబుల్ హసన్ చెప్పడం, అందుకు రామదాసు నిరాకరించడం జరిగింది. ఈ సంఘటన కుతుబ్షాహీల మత సహనానికి నిదర్శనంగా వ్రాయబడింది. కాని ఇది జరిగిందనడానికి ఆధారాలు లేవు.

### 4.5.5. కుతుబ్షాహీల భాష - సంస్కృతులు :-

రామదాసు రచనలపై ఈనాటి భాష, సంస్కృతుల ప్రభావం ఎంతో ఉంది. పారసీ, ఉర్దూ భాసలు రాజ భాషలుగా ఉన్నాయి. అలాగే ఆంధ్ర ప్రాంతంలో ఉన్నందున కుతుబ్షాహీలు ఆంధ్రాన్ని కూడా ఆదరించారు. ఉర్దూ, ఫారసీలతో పాటు తెలుగులో కూడా ఫర్మానాలు, శాసనాలు వేయించేవారు. రామదాసు తన కీర్తనల్లో ఫారసీక, ఉర్దూ భాషా పదాలు ప్రయోగించాడు. హెచ్.కె.షేర్వానీ కుతుబ్షాహీల కాలంనాటి భాషను గూర్చి ఈ విధంగా వ్యక్తం చేశారు.

"There are a number of out standing features connected with the popularity of Telugu in the kingdom during the reign of Abul Hasan Qutbshah. Bi-lingual farmans in this Persian and Telugu, continued to be issued and the king became a symbol of the composite culture of his dominions. In the same way as persian became a cementing force between the Muslim and the Hindu elities, Telugu also stepped forward from its old Hindu arena to Muslim literatures, and we have atleast one outstanding example of this direct influence. As has been noted above the prime moner of the chains of events which led Abul Hasan to the throne was ShahRaju, his preee for".[3]

1. Iftarkar Ahmad Ghauri -"Kingship in the Sultanates of Bijapur and Golconda, I.C.Vol.46,1972, P.No. 50, (Indian Congress - Magzine)
2. Hindu Muslim religious institutions in Andhra desa P.No.123. & H.K.Sherwani - History of Qutubshahi Dynasty, P.No. 654-57.
3. The History of Qutubshahi Dynasty - H.K.Sherwani -P.No.605.

"కుతుబ్షాహీ రాజుల కాలంలో తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి ప్రాచుర్యం లభించింది. పర్షియన్, తెలుగు భాషల్లో ఫర్మానాలు వ్రాయడం జరిగేది. మహమ్మదీయ, తెలుగు సంస్కృతులను అభివృద్ధి పరచడానికి తెలుగు, పర్షియన్ భాషలు తోడ్పడ్డాయి. ప్రాచీన హిందూ ధార్మిక గ్రంథాలు తెలుగు నుండి ఉర్దూ, పర్షియన్ భాషల్లోకి అనువదింపబడినాయి. అలాగే ఇస్లాం మత గ్రంథాల సాహిత్యం తెలుగులోకి అనువదింపబడింది. ఆయా గ్రంథాల్లోని విషయాలు, ఇరు మతాల వారికి తెలియడం కోసం ఉర్దూ, తెలుగు భాషల్లోకి అనువాదాలు జరిగాయి. మహమ్మదీయుల భాషలు ప్రధానంగా పర్షియన్, అరబిక్, ఉర్దూలు. అలాగే ఆంధ్రుల భాష తెలుగు. సంస్కృతం కూడా ఆనాడు ప్రచారంలో ఉండేది. వేద భాషగా ఉంది. వేద పండితులు ఉపయోగించే భాష సంస్కృతం.

రామదాసు సంస్కృతంలో కూడా కీర్తనలు రచించాడు. అబుల్ హసన్ కుతుబ్షా కాలంలో పర్షియన్, తెలుగు భాషలు రెండింటికి సమ ప్రాధాన్యం ఇవ్వబడింది. ఉర్దూ భాషా పండితులతో పాటు, తెలుగు కవులు కూడా గౌరవించబడినారు. ఉర్దూ సాహిత్యంతో పాటు తెలుగు సాహిత్యం కూడా అభివృద్ధి చెందింది. క్షేత్రయ్య అబ్దుల్లా కుతుబ్షాచే గౌరవింపబడ్డాడు. కుతుబ్షాహీల కాలంనాటి భాషా సాహిత్యాల గూర్చి వారు చేసిన సేవ గూర్చి ఇంతకు ముందు తెలియజేశాను. అబ్దుల్లా కాలంలో తెలుగు భాషలో ఎన్నో ప్రభుత్వ శాసనాలు వ్రాయబడ్డాయి. ఈ విషయం హెచ్.కె. షేర్వానీ ఈ విధంగా స్పష్టం చేశారు.

" The later posts was almost invariably occupied by Hindu, and as bilingual farmans in persian and Telugu became the order of the day, it is this branch of the secretariat which must have been incharge of the Telugu versions ( except Dabir post)."[1] In fact it is not known whether any actually Hindu farmans. were issued in Abdullahas reign it is possible that the term "Hindawi" in this context meant "Non-Persian" or Telugu farmans".[2]

ఈ కాలంలో 'హిందవి (హిందీ) ఫర్మానాలు అన్న పేరుతో 'పర్షియన్ భాష కాని ఫర్మానాలు' అని ప్రసిద్ధి చెందాయి. హిందుస్థానీ భాషలో ఫర్మానాలు ఈ కుతుబ్షాహీల కాలంలో వ్రాయడం జరిగింది. అబ్దుల్లా కుతుబ్షా కాలంలో ప్రధానంగా ఇటువంటి ఫర్మానాలు వ్రాయించడం జరిగింది. ఈ విధంగా భాషా సాహిత్యాలు కూడా ముఖ్యంగా "హిందూ మత ప్రచారానికి" ఆధిక్యానికి తోడ్పడినాయని చెప్పవచ్చు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా కుతుబ్షాహీల కాలంలో హిందూ సంస్కృతి, వైదిక మతం ప్రాబల్యం పొందింది. అయితే మరోవైపు హిందూ మత ద్వేషులైన మహమ్మదీయులు హిందూ మతాన్ని నాశనం చేసే ప్రయత్నం చేశారు. భద్రాచలం ఆలయం కూడా ఔరంగజేబు ఆగడాలకు నష్టపోయింది.

ఈ విధంగా భద్రాచల రామదాసు పై కుతుబ్షాహీల కాలం (16వ శతాబ్ది ) నాటి సాంఘిక, రాజకీయ, మత, సాంస్కృతిక పరిస్థితులు చెరగని ముద్ర వేశాయి. ఆయన జీవితాన్ని ప్రభావితం చేశాయి. రామదాసు తహసీల్దారుగా ఉన్న కాలంలోనే రామాలయ నిర్మాణం గావించాడు. రామకైంకర్యం చేయించాడు. ప్రజలకు దానధర్మాలు చేస్తూ, సంతర్పణలు చేస్తూ శ్రీరామభక్తిని ప్రచారం చేస్తూ ఆనందోత్సాహాలతో కాలం గడిపాడు. కంచెర్ల గోపన్న అపారమైన రామభక్తికి నిదర్శనంగా జరిగిన ఒక ముఖ్య సంఘటన ఇది. రామదాసు కుమారుడు మరణించి తిరిగి పునర్జీవితుడైనాడు. శ్రీరామానుగ్రహంతో రామదాసు కుమారుడు పునర్జీవితుడు కావడంతో ప్రజలందరూ గోపన్నను రామదాసుగా వేనోళ్ళ కీర్తించారు. ఆయన అపారమైన రామభక్తిని కొనియాడారు. ఈ సంఘటన రామదాసు జీవితంలో మరువరానిది. ఈ సంఘటన

1. History of Qutbshahi Dynasty - H.K.Sherwani , P.No.508.
2. " " " " P.No. 509.

రామదాసుకు రాముని యెడనున్న భక్తి విశ్వాసాలకు నిదర్శనం. దీన్ని గూర్చి ఇక్కడ ప్రస్తావించాల్సి ఉంది.

### 4.6. రామదాసు కుమారుడు రామానుగ్రహంతో పునర్జీవితుడగుట :

భాగవత సమారాధనలతోపాటు తన ఉద్యోగ ధర్మాలు కూడా జాగ్రత్తగా నిర్వర్తిస్తూ ఉంటాడు. రామదాసు. ఇదిలా ఉండగా ఒకనాటి విశేషోత్సవం నాడు భాగవతోత్తములు బంతులుదీరి భోజనం చేస్తుండగా ప్రమాదవశాత్తు వారికి లేకలేక కలిగిన కుమారుడు రఘురాముడు ఆడుతూ ఆడుతూ పోయి వేడి గంజిగుంటలో పడిపోతాడు. ఆరాధనా కార్యక్రమానికి భంగం వాటిల్లుతుందని మధ్యలో చెప్పక, ఆతని భార్య కమలమ్మ దుఃఖం దిగమ్రింగి భర్తతో చెప్పక మిన్నకుంటుంది. అతిథి సంతర్పణానంతరం రామదాసు కీ దుస్సంఘటన వినిపించి దుఃఖిస్తుంది. రామదాసు పుట్టెడు దుఃఖంతో మిన్ను విరిగి మీద పడ్డట్లుగా కాగా ఆ బాలుణ్ణి ఎత్తుకొనిపోయి శ్రీరామ సాన్నిధ్యంలో ఉంచి

"ఎంతపని చేసితివి రామా -నిన్నేమనందు సార్వభౌమా" అనియు, "కోదండ రామ-కోదండ రామ" అనే కీర్తనలు ఆలపించి రాముని ప్రార్థించాడు. తన కుమారుని కాపాడమని వేడుకొన్నాడు. ఈ కీర్తనలు ఈ సందర్భంగా పాడినవే. ఆర్తి, ఆవేదన, భక్తి ప్రధానమైన కీర్తనలు ఇవి.

**"నాదనామక్రియ - ఝంప"**

*ఎంతపని చేసితివి రామ - నిన్నేమనందును సార్వభౌమ*
*పంతమా నా మీద పరమపావన నామా - సంతోషముడిపితివి సకల సద్గుణ ధామ ॥*
*నిన్నె దైవంబనుచు నమ్మి - తిన్నగ దుఃఖముల జిమ్మి*
*కన్నది నమునెమ్మి నిన్ను సేవింపగా - నన్నిట్లు నట్టేట ముంచుటెరుగక పోతి॥*
*అన్నన్న మాటాడవేరా - నీ కన్నులను నను జూడవేరా*
*చిన్నెలన్నియు దరిగి యున్న ఈ చిన్నన్న - గ్రన్ననను జూడు మాయన్న ఓ రామన్న ॥*
*భద్రాద్రి వాసుడే మనువుమము - నిరుపద్రవముగ నుండుమనుచు*
*భద్రనుత కరుణాసముద్ర యో శ్రీరామ - భద్ర నిన్నే మదిని భద్రముగ నమ్మితి ॥*[1]

ఈ కీర్తనలో రామదాసు శ్రీరామనవమి పర్వదినాన రామునికి ఉత్సవం జరిపించిన రోజునే ఈ సంఘటన జరిగినట్లు స్పష్టమౌతుంది. కన్నదినమని నెమ్మి నిన్ను సేవింపగా అని అన్నాడు. కన్న దినమంటే శ్రీరాముని జన్మదినం. శ్రీరామనవమి పర్వదినం. ఆ బిడ్డను కాపాడమని కోరాడు. మరో కీర్తన కూడా ఇదే సందర్భంలో ఆలపించాడు రామదాసు.

**"నాదనామక్రియ - ఏక"**

*కోదండరామ కోదండరామ - కోదండ మాంపాహి కోదండరామ ॥*
*నీదండనాకు నీవెందుబోకు - వాదేల నీకు వద్దు పరాకు ॥*
*శ్రీరామ మమ్ము జేపట్టు కొమ్ము - ఆదుకో రమ్ము ఆరోగ్యమిమ్ము ॥*
*జయ రఘువీర జగదేక శూర - భయనివార భక్తమందార ॥*
*మణిమయభూష మంజులభాష - రణ విజయఘోష రమణీయ వేష ॥*
*ఏల రావయ్య ఏమంటినయ్య - పాలింపవయ్య ప్రొద్ది గనవయ్య ॥*
*ఏ బుద్ధి మీడు ఎరుగని వాడు - పావడు మీడు బడలి యున్నాడు ॥*
*పానను లేపి బాధల మాన్పి - యాపద బాసి యటు ప్రీతి జూపు ॥*

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 35, కీర్తన 34.

సమ్మిన చిన్న వారెందరున్న - మమ్ములగన్న మా యన్న వన్న ॥
పుట్టింపనీవె పోషింప నీవె - ఫలమియ్య నీవె భాగ్యమ్ము నీవె ॥
రావయ్య వీని రక్షింతుగాని - సేవించువాని స్థితిగందుగాని ॥
వందనమయ్యా వాదేలనయ్య - దండన సేయ దగదు మీకయ్య ॥
శ్రీ విజయ రామ శ్రీ తులసీ దామ - పావన నామ భద్రాద్రి ధామ ॥[1]

"ఏ బుద్ధి ఎరుగని పాపడు వీడు బడలియున్నాడు, పాపను లేపి బాధల మాన్పి యాపద బాపి యటు ప్రీతి జూపు" అని అనడంలో తన కుమారుడు పూర్తిగా మరణించలేదని, సొమ్మసిల్లి మూర్ఛ నొందాడని అర్థమౌతుంది. తన బిడ్డను కాపాడమని, ఆరోగ్యవంతుని చేయమని దీనంగా ప్రార్థించాడు. శ్రీరామ చంద్ర మూర్తి కటాక్షిస్తాడు. ఆ పిల్లవాడు తెలివి పొందుతాడు. ఈ అద్భుతం చూసిన వారందరూ శ్రీరామచంద్రుని భక్త వాత్సల్యాన్ని, రామదాసు గారి భక్తిని వేనోళ్ళ పొగిడారు.

"రామదాసు చరిత్రం"లో రామదాసు పుత్ర శవాన్ని ఎత్తుకొని రామ సన్నిధికి పోయినట్లుంది.[2] కాని రామదాసుల వారు రచించిన ఈ కీర్తనలో 'పాపడు వీడు బడలియున్నాడని' ఉండడం వల్ల రామదాసు గారి కుమారుడు గంజి గుంటలో పడి చనిపోలేదని కేవలం స్పృహ తప్పి పోయాడని గమనించాలి. తన కుమారుడు బ్రతకడం వల్ల రామదాసు ఆనందాశ్రువులు రాలుస్తాడు. శ్రీ రాములవారి దయ వల్లనే తన పుత్రుడు పునర్జీవితుడైనందున ఆ రామునికై ఏదైనా కైంకర్యం చేయాలని తలపోస్తాడు. శ్రీ రామచంద్రునికి భద్రాద్రిలో నున్న జీర్ణమైన ఆలయాన్ని పునరుద్ధరించేందుకు సన్నద్ధమౌతాడు.

రామదాసు కుమారుడు వేడి గంజిగుంటలో పడి మరణించి తిరిగి పునర్జీవితుడైనట్లుగా వివిధ రామదాసు చరిత్రల్లో తెల్పబడి ఉంది. ఈ విషయం గూర్చి ప్రస్తావించడంలో కూడా వివిధ విధాలుగా చెప్పడం జరిగింది. "భద్రాచల రామదాసుచరిత్రము"నందు తిరుక్కడయూరి కృష్ణదాసుగారు ఈ విధంగా వ్రాశారు.

"శ్రీ రామనవమి పర్వ దినాన శ్రీ సీతారాములకు కల్యాణం జరిపించి అన్నదానం చేస్తున్నాడు రామదాసు. అప్పుడు ఒకనాడు తన కుమారుడు ప్రమాద వశాత్తు గంజి గుంటలో పడ్డాడు.

"ఒక దినమున సంతర్పణ -సకలాత్మునికి ప్రీతిగాగ సలుపునపుడు గో
పకవి సుపుత్రుడు పడియెను - తుకతుక నుడికెడు యా వాగు తొట్టి నురుకుచున్"

అలా వేడి గంజిగుంటలో పడిన రఘురాముడిని గూర్చి తన భర్తకు సంతర్పణానంతరం తెలియజేయగా తన కుమారుని మరణ వార్త విని గోపన్న పుత్ర మరణం వలన కల్గిన శోకంతో "ఎంత పని చేసితివి రామా " అనే అద్భుతమైన కీర్తన రామదాసు హృదయం నుండి ఆవిర్భవించింది. మరో కీర్తన "కోదండ రామ కోదండ రామ కోట్యర్కధామ" అనే కీర్తనలో వివిధ నామాలతో శ్రీహరి స్తోత్రం ఉంది. ఈ విధంగా శ్రీరామ నామ సంకీర్తనం చేయగా రామానుగ్రహంతో గోపన్న భుజంపై ఉన్న బాలుడు నిద్రనుండి మేల్కొన్న విధంగా లేచాడు. తన బిడ్డను బ్రతికించగా ఆనందంతో రాముని స్తుతిస్తున్నాడు రామదాసు. ఈ సందర్భంగా ఈ కీర్తన ఆలపించాడని తిరుక్కయూరి కృష్ణదాసు గారి 'రామదాసు చరిత్రము'లో ఉంది.

**"వరాళి - త్రిపుట"**

ఎంతో మహానుభావుడవు నీవు - ఎంతో చక్కని దేవుడవు
వింతలు నీవు చేసితివి లోకమందు - సంతత భద్రాద్రి స్వామి రామచంద్ర॥[4]

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 57, కీర్తన 62.
2. రామదాసు చరిత్రము - సింగర దాసు పుట 23.
3. భద్రాచల రామదాసు చరిత్రము - తిరుక్కయూరి కృష్ణదాసు , పుట 23.
4. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 31, కీర్తన 29.

ఈ కీర్తన రామాయణేతి వృత్త ప్రధానమైంది. రామావతార రహస్యాన్ని తెలియజేస్తుందీకీర్తన. యాదవదాసు రచించిన "రామదాసు చరిత్రము" యక్షగానంలో రామదాసు కుమారుడు గంజిగుంటలో పడి మూర్ఛ (మృతి)నొంది తిరిగి రామానుగ్రహంతో బ్రతికిన విషయం ఇందు లేదు. రామదాసు నాటకం నందు ధర్మవరం గోపాలాచార్యులు గారు సింగరదాసు, తిరుక్కడయూరి కృష్ణదాసులు రచించిన రామదాసు చరిత్రంలోని ఈ సంఘటనను వేరే విధంగా వ్రాశారు.

"రామదాసు కుమారుడు 'రఘురాముడు' వేడి గంజిగుంటలో పడటానికి బదులు బావిలో పడి మరణించాడని వ్రాశారు. శ్రీ రామదాసు గారు బ్రాహ్మణ సంతర్పణ జరిపిస్తుండగా తన కుమారుడు బావిపై కూర్చుని చదువుకుంటూ ఉండగా ఆకస్మికంగా బావిలో పడి మరణించాడని, అదే సమయంలో కబీరు అక్కడ ఉండి ఆ బావి చుట్టూ రామధ్యానం చేస్తూ తిరుగగా తన కుమారుడు రామనామస్మరణ చేస్తూ బావిలో నుండి పైకి వచ్చాడని, ఈ నాటకంలో ఉంది".[1] ఇది కల్పిత గాథ. ఇతర రామదాసు చరిత్రల్లో వలె గాక ఇందు మరోవిధంగా వ్రాయబడి ఉంది.

కబీరు ప్రస్తావన ఇక్కడ తేవడం కల్పితం. ఈ కథే ఇక్కడ కల్పితంగా చెప్పవచ్చు. ఈ కథ మరే రామదాసుచరిత్రంలోనూ లేదు. వరదరామదాసు కూడా తన రామదాసుచరిత్రంలో రామదాసు కుమారుడు గంజిగుంటలో పడి మృతిపొంది రామానుగ్రహంతో బ్రతికినట్లు వ్రాశాడు. బాలాంత్రపు రజనీకాంతరావు గారు, మిన్నికంటి గురునాథ శర్మగారు వ్రాసిన రామదాసు చరిత్రమునందు రామదాసు పుత్రుడు రామ నవమి నాడు వేడి గంజిగుంటలో పడి మృతిపొంది తిరిగి రామకృపతో బ్రతికాడని వ్రాశారు. 'రామదాసు కుమారుడు శ్రీరాముని కరుణాకటాక్షము వలన తిరిగి బ్రతికిన నాటి నుండి[2] గోపన్న గారు భక్త రామదాసుగా ప్రజలకు వెల్లడి అయి, అతని మహిమలు దేశమంతా వ్యాపించాయి' అని రజనీకాంత రావు గారు వ్రాశారు.

"భద్రాచల రామదాసుచరిత్రము" అనే గ్రంథంలో రామదాసు కుమారుడు వేడి గంజి గుంటలో పడి మృతి చెందాడు అని ఉంది. ఈ విషయం ఈయన కీర్తనలో కూడా ప్రస్తావించబడింది.

"అంత నొక్క నాడు తర్పణసేయు - నవనిసురులు ప్రేమ నారగింప
నతని ప్రియ తనూజుడందున్న తప్తయు - వాగునందుబడిన వనటజెంది. . . .
ఆ - అవనిసురులు కుడుచు నందాక బతి తోడ. . . . . .
మరణమైన సుతుని మటుగున బడవైచి - పిదప దెలిపెదనదు ప్రియున కెలమి"[3]

రామదాసు ఆ తర్వాత రాముని ప్రార్థించగా ఆ బిడ్డడు రాముని కృప వలన బ్రతికాడు. రామదాసు కుమారుడు రఘురాముడు అని చెప్పబడింది.

రామదాసు నాటకము నందు డి. వెంకట రమణయ్య, రామదాసు బ్రాహ్మణులకు అన్నదానం చేస్తున్న సమయంలో ఆకస్మికంగా గంజి గుంటలో పడి మరణానికి గురైన రామదాసు కుమారుడు తిరిగి రామ కృప వలన బ్రతుకుతాడు. బ్రాహ్మణులు, ప్రజలు గోపన్నకు రామదాసు అని బిరుదమునిస్తారు.[4] అని వ్రాశారు. రామదాసు తహసీల్దారైన తర్వాతే ఈ సంఘటన జరిగింది.

'భక్త రామదాసు అను రామదాసు విజయం'లో కీ.శే. కేతవరపు శివ రామశాస్త్రి గారు ఈ సంఘటన గురించి ఈ విధంగా తెలియజేశారు. "రామదాసు పుత్రుడు వేడి గంజి గుంటలో పడి మరణిస్తాడు.

1. రామదాసు నాటకం - ధర్మవరం గోపాలాచార్యులు - తృతీయాంకము.
2. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీ కాంతరావు గారు పుట 198-199.
3. భద్రాచల రామదాసు చరిత్రము (సింగరదాసు యక్షగానం) పుట 64.
4. రామదాసు నాటకం - డి. వెంకట రమణయ్య (ద్వితీయాంకము).

అప్పుడు అదే సమయంలో అక్కడే ఉన్న కబీరు సలహా మేరకు గోపన్న తన కుమారుని తీసుకొని రామాలయానికి వెళ్ళి రామాయణ పారాయణం చేస్తాడు. రామునికి మొర పెట్టుకుంటాడు. గోపన్న కుమారుడు రామకృప వలన పునర్జీవితుడైనాడు".[1] కబీరు రామదాసును పుత్ర మరణ సందర్భంగా కలుసుకోవడం కట్టు కథ. కుమారుడు మరణించి పునర్జీవితుడైనది నిజమే. రామదాసు కుమారుడు 3సం॥లు వయస్సు వాడు. రామదాసు తహసీల్దారైన తర్వాతే కుమారుడు కలిగాడు. రామనారాయణ కవులు వ్రాసిన "రామదాసు" అనే నాటకంలో ఈ విధంగా వ్రాశారు. "రామదాసు కుమారుడు మరణించినపుడ ఆ సమయంలో అక్కడ ఉన్న కబీరు పుత్ర మరణం వలన దుఃఖిస్తున్న రామదాసును ఓదార్చడానికి వస్తాడు. రామ ధ్యానంతో రామానుగ్రహం వలన తన పుత్రుడు తిరిగి బ్రతుకుతాడు".[2] ఇక్కడ రామదాసు కుమారుని మృతికి కారణం చెప్పలేదు. పైగా కబీరు రామదాసు వద్దకు వచ్చి అతన్ని ఓదార్చడం కూడా అసత్యం. కబీరు రామదాసుతో "శ్రీరాముడే రక్షించినా, శిక్షించినా కర్త. ఏ కార్యమైనా ఆయన ఆలోచనతోనే జరుగుతుంది అని అంటాడు. ఆనాటి నుండి[3] రామదాసుగా గోపన్న ప్రసిద్ధి చెందాడు. కబీరు గోపన్న భక్తికి మెచ్చి రామదాసని బిరుదం ఇచ్చాడు" అని రామనారాయణ కవులు వ్రాశారు. ఇక్కడ కబీరు ప్రస్తావన తీసుకురావడం అసత్యం. కీ.శే. గరిమెళ్ళ సత్య గోదావరి శర్మగారు కూడా 'గోపన్న' అనే గ్రంథంలో గోపన్న కుమారుడు రఘురాముడు " వేడిగంజిగుంటలో పడి మరణించగా, అన్న సంతర్పణానంతరం గోపన్న భార్య కమల, రఘురాముని మృతి గురించి తెలియజేయగా, ఈ విషయం తెలిసి దుఃఖించిన రామదాసు శ్రీరాముని సన్నిధిలో ఈ[4] బాలుని ఉంచి శ్రీరాముని ప్రార్థించగా, శ్రీరాముని అనుగ్రహం వల్ల ఆ బాలుడు తిరిగి పునర్జీవితుడైనాడ"ని వ్రాశారు. "రామదాసు చరిత్రము" అనే హిందుస్థానీ నాటకంలో కూడా నాదెండ్ల పురుషోత్తమ కవి ఇదే విధంగా వ్రాశారు. "రామదాసు చరిత్రము" అనే కావ్యంలో చల్లా పిచ్చయ్య శాస్త్రి గారు ఈవిధంగా వ్రాశారు.

సీ. రామనామము విన్న - రామభక్తుని గన్న
వెడనెడ నడ దాండ - వించువాడు
కన్నవారికి గాక - కనుగొన్నవారికి
నానందమునకు ముద్దైనవాడు
పుండు బూచియులేక - భూలోక చంద్రుడై
మృదు వాక్యమధువు వర్షించువాడు
చిన్నారి పొన్నారి - జిలిబిలి చెయ్యుల
నలరుచు గలకల - లాడువాడు
గీ. గోపన మహాత్ము ముద్దుల - కొడుకు గుర్ర
నంటయింట నొకానొక - వంకగాలు
గంజిగుంటను బడిపోయె - గాలుజారి
లేదొ శ్రీరామచంద్రుండు - రాడొ యుండి.[5]

ఈ విధంగా గంజి గుంటలో పడిన ఆ బాలుని " అంత దద్ధర్మపత్ని సుతుని సప్రాంతల నిగూఢముగా నెమకి నెమకి (వెదకి వెదకి) యెందును గానక తుదకా గంజిగుంటనున్న కళేబరమ్ము గని

1. భక్త రామదాసు అను రామదాసు విజయము - కీ.శే. కేతవరపు శివరామ శాస్త్రి గారు-1924, తృతీయాంకము.
2,3. రామదాసు- రామ నారాయణ కవులు (నాటకం) 1929, ద్వితీయాంకము.
4. గోపన్న - కీ.శే. గరిమెళ్ల సత్య గోదావరి శర్మ పుట. 40 - 43.
5. చల్లా పిచ్చయ్య శాస్త్రి - రామదాసు చరిత్రము -పుట 109. చతుర్థాశ్వాసము పద్యం 87.(భువనగిరి కోదండపాణి పబ్లికేషన్స్ - 1926)

యగ్గుణముల గని శ్రీహరీ! యని యిది రామచంద్రుని విలాసమని చింతించి, తన భర్తకు గనుసన్న నెఱిగించె. రామదాసుండును శ్రీరామచంద్రు దత్త్వదృష్టి తో దిలకించుచు గుర్రని భుజమున బరుండబెట్టుకుని"[1] -

రగడ."రఘుకుల జలనిధి ! రాకా శశిధర !
యఘగణ విదళన ! యజ్ఞా కృతి ధర !
నినుమది గొలిచెద ! నిష్ఠా సహచర !
ననుమది దయగను నాథా ! ధృత ధర !
బడలిక బుజమున ! వ్రాలెను బుడుతడు
తడయక మనుపవె తండ్రీ ! విడువడు
ఎఱుగడు లోకము ! నేరిన్ బిలువడు
తొఱగడు పదమున ! దోడున్ దలవడు
అడుగడుగున హరియంచుం దలచును
అడుగడెదియు గుటీ ! యందున నిలుచును
పరి చరసులభ ! కృపాళూ ! ఖగ హాయ[2]
పరిణత గుణమయ ! భద్రాద్రి నిలయ ! "

వ॥ అని యిటు రఘురాముని బాడునంత గుర్రండు నిద్రమేల్కాంచిన వడుపున జఱు నగు మోముతో గన్నుల దెఱచి చెంగున నేలకు దుమికి యందు హృదయములుప్పొంగ నానంద నృత్యంబు సలుపదొడగె. బ్రాహ్మణులు నైదువలు నెల్లరు గోపన యవతారమూర్తి యని ప్రశంసించిరి. ఇట్లు సకల భూత తృప్తిగా రామచంద్రునకు బ్రీతిగా సమారాధన మహోత్సవంబు నెఱపి యందు దగువారి దగు వసతులలో శ్రీరామునకు నిత్య ధూప దీపనైవేద్యాదులొనర్చునట్లు నియమించి నిలిపి రామదాసుడిలుసేరి స్వాధికారకృత్యము లొనర్చుచుండెనని చెప్పిన[3] " - . . . . . .

ఈ పై నాలుగు పద్య వచనాలు పరిశీలిస్తే రామదాసు బిడ్డడు బడలి భుజమున వ్రాలెను అని రగడలో వ్రాశాడు. అంటే వేడి గంజిగుంటలో పడి మరణించాడనుకున్న బిడ్డడిని రక్షించమని రాముని కోరుకుంటాడు. నిద్రనుండి లేచినట్లు లేచాడు ఆ బాలుడు అని చల్లా పిచ్చయ్య శాస్త్రి గారు వ్రాశారు.

"శ్రీరామదాసు నాటకం" లో కేశిరాజు వేంకట సుబ్బారాయ కవి ఈ రామదాసు కుమారుని మరణ సంఘటన అసలు వ్రాయలేదు. ఈ విధంగా పై వివిధ రామదాసుచరిత్రలు మరియు విమర్శ గ్రంథాలు పరిశీలిస్తే రామదాసు కుమారుడు రఘురాముడు శ్రీరామనవమి పర్వదినాన ఒకానొక సంతర్పణ సందర్భంలో వేడిగంజి గుంటలో పడి మృతి చెంది, అనంతరం రామానుగ్రహంతో బ్రతికాడని స్పష్టమౌతుంది. కాని రామదాసు తాను వ్రాసిన కీర్తనలో "పాపడు వీడు బడలియున్నాడనే" వ్రాశారు. కావున తన బిడ్డ మరణించలేదని, మూర్ఛనొంది తిరిగి రామానుగ్రహం వల్ల పునర్జీవితుడైనాడని స్పష్టమౌతుంది. రామదాసు కీర్తన లోని విషయమే మనం ప్రధానంగా స్వీకరించవలసి ఉంది. రామదాసు కుమారుడు మృతిచెందలేదనడానికి ఈ కీర్తనే ఆధారం. " ఎంతపని చేసితివి రామా ! కోదండరామ కోదండరామ !" అనే కీర్తనల ద్వారా మనకి విషయం బోధపడుతుంది.

రామదాసు తహసీల్దారు ఉద్యోగంలో ఉండగానే ఈ సంఘటన జరిగింది. ఆ తర్వాత రామదాసు తన కుమారుడు పునర్జీవితుడైనందువల్ల ఆ శ్రీరామునికి కైంకర్యం చేసి, జీర్ణావస్థలో ఉన్న భద్రాద్రి ఆలయాన్ని

1. చల్లా పిచ్చయ్య శాస్త్రి - రామదాసు చరిత్రము - పుట 109-110. పద్యం 88.
2. " " పుట 110. పద్యం 89.
3. " " పుట 110. పద్యం 90.

పునరుద్ధరించాలని నిశ్చయించుకుంటాడు రామదాసు. భద్రాచలం వెళ్లిన తర్వాత రామదాసు రామాలయ నిర్మాణం చేపడతాడు. భద్రాచలంలో ప్రసిద్ధి పొందిన భద్రగిరిపైనున్న ఆ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణం జరిగిన తీరు, ఆ ఆలయ నిర్మాణం వెనుక ఉన్న చరిత్రను, పూర్వాపరాలను పరిశీలించవలసి ఉంది.

### 4.7. భద్రాద్రి ఆలయ నిర్మాణం - ఆవశ్యకత :

**4.7.0. రామదాసు స్వప్నం : -** భద్రాచలం తాలూకా తహసీల్దారుగా రామదాసు వెళ్లడానికి కారణం "శ్రీరాముడు ఇతడికి స్వప్నంలో కనబడి భద్రాచలంలో తనకు ఆలయ నిర్మాణం చేయమని కోరడమే "[1] అని చెప్తారు స్థానికులు. భద్రాద్రి ఆలయ గాథ, ఆ క్షేత్రచరిత్రలో రామదాసుకు రాముడు స్వప్నంలో కనబడి, ఆతడిని గోల్కొండకు వెళ్లి, అక్కడి ప్రభువు తానాషాను కోరి భద్రాచలం తహసీల్దారు కమ్మని, ఆ తర్వాత ఆలయం నిర్మించమని శ్రీరాముడు కోరినట్లు ఎన్నో కథల్లో ఉంది.

రామదాసుకు కలిగిన స్వప్నం గూర్చి మిన్నికంటి గురునాథ శర్మగారు తమ విమర్శ గ్రంథం 'కంచెర్ల గోపన్న అను రామదాసు' అనే దానిలో ఈ విధంగా తెలియజేశాడు. " ఒకనాడు శ్రీరామ చంద్రుడడవులలో కష్టము పొందుచున్నట్లు, చెట్టు క్రింద గండ శిలలపై కూర్చుండి శబరి యిచ్చే యెంగిలి పండ్లను తింటున్నట్లు స్వప్నంలో గోచరించగా ఉలికిపడి లేచి కూర్చుండి యోచించాడు. తానిదివరలో భద్రాద్రికేగి దర్శనం చేసుకొని వచ్చిన శ్రీరామ విగ్రహం స్మృతికి వచ్చింది. ఇంతేకాక శ్రీరాముడు తన స్వప్నంలో కనిపించి నీవు గోల్కొండకేగి నీ మేనమామలు అక్కన్న మాదన్నల సహాయంతో భద్రాచలానికి తహసీల్దారువై భద్రాద్రికి వచ్చి నాకు ఆలయ నిర్మాణం గావింపుమని చెప్పినందు వల్లనే రామదాసు గోల్కొండకు వెళ్లి అక్కన్న, మాదన్నల సహకారంతో అబ్దుల్లా కుతుబ్షా యొక్క అనుమతిపై భద్రాచలం తాలూకా తహసీల్దారుగా వెళ్లి, అక్కడ తాను భద్రాద్రి శ్రీ సీతారాములకు ఆలయం నిర్మించే కార్యక్రమం చేపట్టాడు. ఈ సందర్భంలో భద్రాచల ఆలయ నిర్మాణం చేపట్టక పూర్వం భద్రాద్రి సీతా రాములకు కైంకర్యం చేసి ధన్యురాలైన తమ్మల దమ్మక లేక పోకల దమ్మక వృత్తాంతం ప్రస్తావించడం ముఖ్యం.

### 4.7.1. తమ్మల దమ్మక్క వృత్తాంతము :

భద్రాచలానికి సమీపాన ఉన్న భద్రిరెడ్డి పాలెం అనే గ్రామంలో శబరజాతికి చెందిన పోకల దమ్మక లేక తమ్మల దమ్మక్క అనే ఒక మహా భక్తురాలుండేది. ఆమె నిత్యం శ్రీరామ నామ పారాయణం చేస్తూ ఉండేది. ఒకనాడు శ్రీరామచంద్రమూర్తి . ఆమెకు స్వప్నంలో సాక్షాత్కరించి తాను సీతా లక్ష్మణ సహితుడై భద్రగిరిపైన ఒక తాటి చెట్టు వద్ద ఉన్నట్లు, తనకు ప్రతి నిత్యం అర్చనాదులు జరిపించవలసిందని చెప్పాడు. కొలది దినాలలో ఆమెకొక భక్తుడు సహాయం చేయగలడని, అతడు తనకు ఆలయం గోపుర ప్రాకారాదులు నిర్మింపగలడని చెప్పి అదృశ్యుడౌతాడు. అంతట ఆమె మేల్కొని స్వప్న వృత్తాంతానికి ఆశ్చర్యపడి భద్రగిరికి వెళ్లి ఆ శైల ప్రాంతం వెదుకుతుంది. స్వామి విగ్రహాలు లతల చేత, పత్రాల చేత కప్పబడి ఉంటాయి. ఆ లతాదులను తొలగించి గోదావరి జలాలతో స్వామికి అభిషేకమొనర్చి అచట ఉన్న మహా తాళ వృక్షమున గల పండ్లను నైవేద్యంగా సమర్పిస్తుంది. కొన్ని దినాల్లో ఊరి పెద్దల సహాయంతో ఒక చిన్న గుడిని కట్టించి ప్రతి దినం అర్చనాదులు జరుపుతూ ఉండేది. తర్వాత ఆ గ్రామాధికారియైన భద్రారెడ్డి అనే కాపువాని సహాయంతో నివేదిత ద్రవ్యాలను కొంత జనాన్ని, కొండనెక్కి పోయేటప్పుడు, వచ్చేటప్పుడు సహాయంగా ఉండటానికి రప్పించుకొని, తన శక్తి కొలది చిన్న మంటపాన్ని కట్టించి, అందు స్వామిని ప్రతిష్ఠ చేసి ఆ గ్రామస్థుల సహాయం వల్ల బ్రహ్మోత్సవాలు మొదలైనవి చేయిస్తుండేది. పోకల దమ్మక్కకు ఒక కుమార్తె ఉండేది. దమ్మక్క ప్రతి దినం శ్రీరామునికి తానే స్వయంగా అర్చన చేసి ఆ ఆలయ సమీపంలోనే ఉన్న తాటి చెట్టు నుండి రాలే తాటి పండు

1. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - పుట 198 - 199. బాలాంత్రపు రజనీకాంతరావు.

కూతురిని రామునికి అర్చన చేసి నివేదన చేయమని చెప్పి వెళ్లింది. అంతట దమ్మక్క కుమార్తె ఆ స్వామిని అర్చించి, పాలు నివేదనగా ఉంచింది. గొడగూచి శివునికి పాలు నైవేద్యంగా పెట్టి త్రాగలేదని మారాం చేసినట్లు, ఈ బాలిక కూడా శ్రీరాముడు ఆ పాలు త్రాగడం లేదని ఏడ్వసాగింది. అంతట ఆ బాలిక అపారమైన రామభక్తికి మెచ్చి, రాముడు ప్రత్యక్షమై ఆ పాలు త్రాగినాడట. దమ్మక్క వచ్చి ఈ కథ విని ఆశ్చర్యపడింది. కాని దమ్మక్కకు మాత్రం రామదర్శనం కాలేదు.

ఇలా ఉండగా నేలకొండపల్లె వాస్తవ్యుడైన గోపన్న జన్మాదిగా సద్వృత్తి యందుండేవాడు. కాబట్టి భాగవతాది పురాణాల్లోని గౌతమీ మహాత్మ్యం గూర్చి, భద్రాచల ప్రభావాన్ని గూర్చి విని, భద్రాద్రికి వెళ్లి శ్రీరాముని సేవించి శ్రీరామ భజన చేసే భాగ్యం ఎన్నటికి కలుగుతుందో అని తలుస్తుండగా ఒక దినాన స్వప్నంలో శ్రీరాముడు పూర్వం తమ్మల దమ్మక్కకు వలె ప్రత్యక్షమై, నీకు భద్రాద్రి తాలూకా తహశీలుదారు పని రాగలదని, కావున నీవు ఈ క్షణంనందే బయలుదేరి గోల్కొండ పట్టణానికి పోయి తానీషాను చూడమని అంతర్ధానమయ్యాడు. అతడు అదిరిపడి లేచి రాముడు చెప్పినట్లుగానే తానీషాను గోల్కొండకు వెళ్లి కలుసుకొని శ్రీరామానుగ్రహంతో భద్రాచలం తాలూకాకు తహసీల్దారుగా నియమింపబడి, భద్రాచలానికి వెళ్ళాడు.

ఇంక పోకల దమ్మక్క నిత్యం శ్రీరామ కైంకర్యం చేస్తూ, రామ దర్శన భాగ్యం కొరకు ఎదురు చూస్తూండగా ఒకనాడు శ్రీరాముడు మరల స్వప్నంలో దర్శనమిచ్చి 'తమ ప్రియ భక్తుడైన కంచెర్ల గోపన్న భద్రాచలం గ్రామానికి తహసీల్దారుగా ప్రభుత్వాధికారిగా వస్తాడని, అతడు తనకు కోవెల, గోపుర ప్రాకారాదులను కట్టించడానికి రాగలడనీ, అంతవరకు ఆమెను తన కైంకర్యాదులు చేయమనీ, ఆ తర్వాత ఆ గోపన్నను కలుసుకొని విషయం తెలియజేయమని చెప్పి రాముడు అంతర్ధానమైనాడు.

అంతట కొంతకాలానికి గోపన్న 1650 ప్రాంతంలో భద్రాచలం తాలూకా తహసీల్దారుగా రాగా, ఆ విషయం తెలుసుకొని, గోపరాజు రామ నామ సంకీర్తనా పరుడని విని, దమ్మక్క తనకు స్వప్నంలో దేవ దేవుడైన శ్రీరామ చంద్రుడు ఆనతిచ్చిన వ్యక్తి ఇతడే అని అక్కడకు వెళ్లి అతన్ని దర్శించి తన కథను ఆద్యంతం వివరిస్తుంది. "గోపరాజు దమ్మక్క వెంటపోయి శ్రీరామచంద్రుని దర్శిస్తాడు. నాటినుండి కంచెర్ల గోపన్న భద్రాద్రి రామునికి అంకితమై పోయాడు. దమ్మక్క కొంత కాలానికే పరమ పదం పొందుతుంది. దమ్మక్క ఆదేశానుసారం, జీర్ణావస్థలో ఉన్న ఆ మందిరాన్ని పునరుద్ధరించి, గొప్ప రామాలయాన్ని నిర్మింపదలుస్తాడు."[1]

దమ్మక్క పూజే భద్రాద్రి రామునికి మొట్టమొదటి మానవ పూజ. ఈనాడు పూజింపబడుతున్న స్వామి మూల విగ్రహాలే ఆనాడు దమ్మక్కకు కనిపించాయి. దమ్మక్క పేరున ఇప్పటికీ శ్రీ రామాలయ పూజాదికాల్లో ఒక భాగం. పోకల వారి వంతు అని వ్యవహరింపబడుతూ కొందరర్చకులచే అనుభవించబడుతున్నది. గోపన్న దమ్మక్క పిలుపు మేరకు భద్రాద్రికి వెళ్లి, అక్కడే నివసింప నిశ్చయించుకొన్నాడు. రామాలయ నిర్మాణం రామదాసు ప్రధానంగా చేపట్టడానికి కారణం దమ్మక్క రామదాసుకు విషయం తెలియజేయడమే. రామాలయ నిర్మాణానికి దమ్మక్కయే నాంది పలికింది అని చెప్పవచ్చు.

పోకల దమ్మక్కను గూర్చిన ప్రస్తావన "శ్రీభద్రాచల రామ సుప్రభాతమ్"[2] అనే గ్రంథంలో వుంది.

1. రామదాసు చరిత్రము - సింగర దాసు పుట 89.
2. శ్రీ భద్రాచల రామ సుప్రభాతమ్- భూతపురి సుబ్రహ్మణ్య శర్మ (సంస్కృతం)
అనువాదం - శివరామ శర్మ, గోపాలకృష్ణ శాస్త్రి (సోదరులు) 1992. శ్లో॥ 11. పుట 8.

శ్లో॥ దమ్మక్క నిర్మిత సువర్ణ సువర్ణ వేశ్మ !
శ్రీరామదాస కృత భక్తి రసైక గీత !
విద్యానిధీ ! రఘుపతే ! తమసాంనిహంత: !
భద్రాద్రి రామ భగవన్ ! తవ సుప్రభాతమ్ !

**తాత్పర్యం :** భద్రాచలంలో శ్రీరాముని దేవళమేర్పడడానికి ముందు ఆ ఊరిలో ఒక పోకల దమ్మక్క అనే పుణ్య స్త్రీ ఉండేది. ఆమెకు శ్రీరామచంద్రుడు కలలో గనిపించి నేను ఈ పర్వతంపై వెలసినాను, నాకొక దేవాలయాన్ని కట్టించమని అడిగాడట. స్వామి కోరిక మేరకు ఆ పోకల దమ్మక్క మొదట స్వామి వారికి నుంచి రంగుగల బంగారు పూత గల దేవాలయాన్ని గట్టించిందట."

నిజానికి ఇందు అతిశయోక్తి ఉంది. దమ్మక్క భక్తితో ఒక చిన్న మందిరం నిర్మించి, శ్రీరాముని సేవలో తన జన్మ చరితార్థం చేసుకుని, చివరకు దుర్లభమైన శ్రీరామసాయుజ్యం పొందింది. ఈమె ఇంతటి మహా భక్తురాలు కాబట్టే భద్రాద్రి రామ సుప్రభాత స్తోత్రంలో కూడా ప్రస్తుతింపబడింది. 'రామనారాయణ కవులు' రచించిన రామదాసు నాటకంలో వారు దమ్మక్క వృత్తాంతాన్ని ఈవిధంగా వ్రాశారు. "భద్రారెడ్డి అనే గుమస్తా, ఇంకా ఇతరులతో రామాలయం జీర్ణదశలో ఉందని, దాని పునరుద్ధరణకై సహాయపడమని కోరాడు గోపన్న. దమ్మక్క అనే శూద్రాంగన ఆ శ్రీరామునికి చిన్న గుడి కట్టి పూజలు జరిపించింది. ఆయనకు ఆలయం నిర్మించి తరించాలన్న కోరిక వెలిబుచ్చాడు గోపన్న."[1]

కేశిరాజు వేంకట సుబ్బరాయకవి తన 'శ్రీరామదాస నాటకము' లో దమ్మక్క వృత్తాంతాన్ని ఇలా తెలియజేశాడు. " శ్రీరాముడు తమ్మల దమ్మక్కకు స్వప్నంలో కన్పించి, గోపన్న అనే రామభక్తుడు భద్రాచలం తహసీల్దారుగా వచ్చి ఆలయ జీర్ణోద్ధరణ గావిస్తాడని, దమ్మక్కను, గోపన్నను కలుసుకొని విషయమంతా వివరించమని చెప్పి అంతర్థానమైనాడు. రామాజ్ఞానుసారం దమ్మక్క రామదాసును కలుసుకొని రామవిగ్రహాల గూర్చి తెలియజేయగా ఆమె ఆజ్ఞానుసారం రామాలయ నిర్మాణం గావించాలని గోపన్న సంకల్పించుకొన్నాడు.

"దేవాలయములు - తత్త్వవేత్తలు" అనే పుస్తకంలో రామదాసు రామాలయ నిర్మాణం గావించడానికి గల కారణాన్ని గూర్చి ఈవిధంగా తెలియజేయబడి ఉంది. " ఒకనాడు గోపన్న శ్రీరామచంద్రుని మందిరం వద్ద భక్తి నిమగ్నుడై నిద్రించినాడు. స్వప్నంలో ఒక బ్రాహ్మణుడు కనిపించి 'దండకారణ్యములో పవిత్ర గోదావరీ తీరమునందున్న శ్రీరామునికి ఆలయమేర్పరిచి, ఉత్సవ పూజాదుల నొనర్చుము.'[2] అని చెప్పినాడు.

ఏది ఏమైనా రామదాసుకు రాముడు స్వప్నంలో కనిపించి రామమందిర నిర్మాణం చేయమని చెప్పినమాట వాస్తవము కాకపోవచ్చు. స్థానిక గాథల్లో మాత్రం ఈ విధంగా ఉంది. వివిధ రామదాసు చరిత్రల్లో కూడా రామదాసు యొక్క స్వప్న వృత్తాంతం చెప్పబడింది. దమ్మక్క వృత్తాంతం మాత్రం నిజంగా జరిగింది. ఈమె రాముడికి నైవేద్యం పెట్టింది తాటిపండ్లు కావున, అందుకు నిదర్శనంగా ఈనాటికీ ఆలయ ప్రాంగణంలో సమీపంలో ఒక తాటిచెట్టుని చూపెడతారు. మొట్టమొదటి సారిగా భద్రాచలం వెళ్ళి రామదాసు రాముని, భద్రాద్రి రామ నిలయాన్ని ఈ విధంగా వర్ణించినాడు.

**వరాళి - ఆది.** అదిగో భద్రాద్రి - గౌతమి - ఇదిగో చూడండి
ముదముతో సీతాముదితలక్ష్మణులు - కదసి కొలువుగా రఘుపతి యుండెడి ॥
చారుస్వర్ణ ప్రాకార గోపుర - ద్వారములతో సుందరమై యుండెడి ॥

1. రామ నారాయణ కవులు - రామదాసు నాటకము - 1929. తృతీయాంకము.
2. దేవాలయములు - తత్త్వవేత్తలు - వి.టి. శేషాచార్యులు.

అనుపమానమై అతిసుందరమై - తనరు చక్రమున ధగధగ మెరసెడి ॥
కలియుగమందున గల వైకుంఠము - నలరుచున్నది నయముగ మ్రొక్కుడి ॥
పొన్నల పొగడల పూపొదరిండ్లతో - చెన్ను మీరగను శృంగారంబగు ॥
శ్రీకరముగ నిల రామదాసుని - ప్రాకటముగ బ్రోచే ప్రభువాసము ॥[1]

ఈ కీర్తన మొదటిసారిగా రామదాసు తహసీల్దారుగా భద్రాచలం తాలూకాకు నియమితుడై, భద్రాచలం వెళ్లినపుడు భక్తి పారవశ్యంలో ఎంతో కాలానికి తన కోరిక నెరవేరిందనే ఆనందంలో తన హృదం నుండి ఈ కీర్తన ఆవిర్భవించింది. తన మనస్సు లోని వైభవోపేతంగా రామునికి ఆలయ ప్రాకార, మంటపాదులు నిర్మించాలన్న ఆలోచనే ఈ కీర్తన రూపంలో బహిర్గతమైంది. చక్కని వర్ణనాత్మక కీర్తన ఇది. భద్రాచల రామాలయ శోభను మహోన్నతంగా వర్ణించినాడు రామదాసు ఈ కీర్తనలో.

తమ్మల దమ్మక్క వలన శ్రీరామ లక్ష్మణులు, సీతామాత విగ్రహాలు కనుగొన్న రామదాసు, తాను దర్శించగోరిన శ్రీరాముడు, సీతామాతలను చూడగానే తన హృదయంలో రామభక్తి భావం ఉప్పొంగగా, ఎన్నాళ్లకు నా తండ్రి రాముని, నాతల్లి సీతమ్మను కనులారాగాంచానని ఆనందాశ్రువులతో, వారిని రామదాసు ఈ విధంగా వర్ణించారు. ఈ కీర్తన రామదాసు రామభక్తికి మకుటాయమానంగా నిలిచింది.

**కాంభోజి - ఆది.** దొరికెనే భద్రాచల నిలయుడు దొరికెనే - దొరికెనే
నరగరుడాదులకు పరమతారకమైన భక్త చింతామణి ॥
కోలన దాసుల కూరిమిచే తనవారిగ బ్రోచుచు మీరిన వరమణి ॥
వ్యక్తము నెరిగిన భక్త జనుల నాసక్తిని బ్రోచే భక్త చింతామణి ॥
ఇందుని యందమామందము సేసెడి యందము గల మా యింద్రనీల మణి ॥
చేరువయౌ భద్రాచల మందున మీరి సీతతో మెరయుచున్న మణి ॥
అనుపవర రామదాసు నేలి కృప భాసురముగ వరపద మొసగినమణి ॥[2]

ఇందు రామదాసు యొక్క హర్షంతో కూడిన శాంత భక్తి ప్రదర్శితమౌతున్నది. ఈ కీర్తన లోని రచనాశైలి, రామదాసు పాండితీ ప్రకర్షకు నిదర్శనం. ఇంతటి విశిష్టతను సంతరించుకున్న శ్రీ భద్రాద్రి శ్రీసీతారామచంద్ర ప్రభువు వెలసిన ఈ భద్రాచల క్షేత్ర మాహాత్మ్యాన్ని తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## 4.7.2. శ్రీ భద్రాచల క్షేత్ర మహిమ - విశిష్టత : -

పూర్వం నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులు సూతుని వలన భవిష్యత్పురాణాలను వింటూ తమకు గోదావరీ ఖండంలోని భద్రాచల క్షేత్రాన్ని గూర్చి వివరించమని వేడుకోగా వారి కోరికను తీర్చడానికి సూతుడు భద్రాచల క్షేత్రాన్ని గూర్చి వారికి తెలియజేశాడు. శ్రీ బ్రహ్మాండ పురాణంలో గల గౌతమీ మాహాత్మ్యంలో ఈ భద్రాచల క్షేత్ర మహిమను గూర్చి వివరింపబడింది. శివ పురాణం, స్కాందపురాణం కూడా ఈ క్షేత్రాన్ని గూర్చి తెలియజేస్తున్నాయి. ఇది మహిమాన్వితమైన దివ్యక్షేత్రం. పరమపావన మైన భారతదేశంలో పవిత్ర క్షేత్రాలు, పుణ్యనదులు ఎన్నో ఉన్నాయి. శ్రీశైలం, ద్వారక, అవంతి, మధుర అయోధ్య, కంచి, కాళహస్తి, గయ, కాశీ, ప్రయాగ, అమరావతి, దక్షారామం, రామేశ్వరం, పూరీ జగన్నాథం మొదలైన దివ్య క్షేత్రాలు వేటికవే సాటి రాగల మేటి పుణ్య క్షేత్రాలు. అలాగే గంగా, గోదావరి, యమున, సరస్వతి, కృష్ణ, కావేరి మొదలైన పావన నదులు భారతీయుల్ని భరత భూమిని తరింపజేస్తున్న మహత్తరాలైన మహానదులు. ఇటువంటి

1. భక్త రామదాసు కీర్తనలు - పుట 1. కీర్తన 1- దాశరథుల బాలయ్య (సంకలన కర్త).
2. " పుట 74 - 75. కీర్తన 82. " "

పుణ్యధామంలో ఆయా గోదావరికి ఎంతో ఆసక్తితో, భక్తితో కలిగించే భద్రాచల క్షేత్రం, పావనమైన గోదావరి తీరాన ఉంది. దండకారణ్య మధ్యంలో గోదావరీ తీరాన శ్రీరామ క్షేత్రాన జనన మరణ వ్యాధి బాధా పీడితులైన నరులకు, అమృతపదమిచ్చుటకు తారకనాముడైన శ్రీరాముడు శ్రీ సీతాలక్ష్మణ సమేతంగా వేంచేసిన భద్రాచలాన పర్వత శ్రేష్ఠం ఒకటి ఉంది. ఆ పుణ్య పురం సేవక జనాభీష్టపదం, కావున ఆ క్షేత్రమహిమ యిటువంటిదని వక్కాణించడానికి బ్రహ్మదేవునికైనా శక్యంగాదు.

**4.7.2.1. భద్రుని జననం :-** పర్వత శ్రేష్ఠుడైన మేరువు సమస్తమైన సిరిసంపదలతో, సకల సుఖభోగాలతో కీర్తివంతుడై విరాజిల్లుచుండేవాడు. కాని పున్నామ నరకాన్ని తప్పించే కుమారుడు లేని కొరతతో మిక్కిలి వ్యధ చెందుతూ వుండేవాడు. మేరు నగేంద్రుని సతి మేనక, బిడ్డలు లేక దుఃఖించిందై ఎన్నో వ్రతాలు, పూజలు, దానాలు చేసింది. కాని ఆమె కోరిక నెరవేరలేదు. అంతట మేరు పర్వత రాజు, మేనకాదేవితో గూడి పుత్రుని కొరకు బ్రహ్మదేవునుద్దేశించి ఘోర తపస్సు చేసినాడు. ఫలాలు, ఆకులు అలములు, నీరు తీసుకుంటూ నియమంతో భక్తితో తపస్సు చేస్తూ చివరకు వాయు భక్షణ మాత్రమే చేస్తూ ఘోర తపమాచరించాడు. బ్రహ్మ, వారి తపోదీక్షకు మెచ్చి సాక్షాత్కరించి కావలసిన వరాన్ని కోరుకోమన్నాడు. అప్పుడు ఆ దంపతులు అత్యంతానందంతో చేతులు జోడించి బ్రహ్మకు నమస్కరించి, సుగుణసంపన్నుడు, భగవద్భక్తుడైన పుత్రుడు ఒకనిని మాకు ప్రసాదించుమని కోరుకున్నారు. అట్లే అగుగాక ! అని ఆశీర్వదించినాడు బ్రహ్మ.

మేరు దంపతులు అత్యంతానందంతో తృప్తులై నిజస్థానానికి చేరుకుని నిరంతరం జపతపాలతో దానధర్మాలతో సంతర్పణలతో ప్రొద్దు పుచ్చుతుండేవారు. కొద్దికాలానికి మేరు సతి గర్భవతియై ఒకానొక శుభ దినాన చక్కనైన కుమారుని కన్నది. ఆ పిల్లవానికి 'భద్రుడ'ని నామకరణం చేశారు. ఆ బాలుడు దిన దిన ప్రవర్ధమానుడై తల్లిదండ్రులకు ఆనందాన్ని చేకూరుస్తూ ఐదేళ్ల వయసువాడైనాడు. అంతట మేరు, మేరుసతి తమ కుమారునకు అక్షరాభ్యాసం చేయించి, బ్రహ్మమానస పుత్రుడైన వశిష్ఠ మహర్షికి అప్పగించి సకల శాస్త్ర విశారదుని చేయవలసిందిగా ప్రార్థించారు. వినయం, వివేకం, గ్రహణ శక్తి మొదలైన సద్గుణాలు గల భద్రుడు వశిష్ఠ మహర్షికి శుశ్రూషలు చేస్తూ సమస్త శాస్త్రాలు అధ్యయనం చేస్తున్నాడు. గురు సంస్కారం వలనా, తల్లి తండ్రుల గుణవిశేషం వలనా, జన్మ విశేషం వలనా, బాలుడు సద్గుణ సంపన్నుడై అన్ని విద్యలందు ఆరితేరడమే కాకుండా, భగవంతునిపై అధికమైన భక్తికలవాడై నిరంతరం రామకథా శ్రవణానంద సంతుష్టుడై వశిష్ఠుని గురుకులానికే వన్నె తెచ్చువాడైనాడు. కొంతకాలానికి విద్య ముగించుకుని వశిష్ఠుని ఆజ్ఞ తీసుకుని స్వగృహానికి చేరి తల్లి తండ్రులతో నివసిస్తుండేవాడు.

బ్రహ్మ మానస పుత్రుడైన నారదుడు ఒకసారి మేరువు వద్దకు వచ్చి అతని కుమారుడు భద్రుని చూసి ఈతని వల్ల వారివంశం ఉద్ధరింపబడుతుందని, మానవులకు గొప్ప మేలుకలుగుతుందని, రామభక్తుడుగా చిరస్థాయిగా నిలిచి పోతాడని చెప్పినాడు. నారదుడు భద్రునికి రామభక్తి యొక్క ఔచిత్యాన్ని ప్రబోధించాడు. భద్రుడు నిరంతరం రామనామ సంకీర్తనతో జీవిస్తున్నాడు. నారదుని తారక మంత్రోపదేశం చేయమని భద్రుడు కోరగా 'భద్రుని పూర్వజన్మ వృత్తాంతాన్ని' నారదుడు ఈ విధంగా తెలియజేసినాడు.

**4.7.2.2. భద్రుని పూర్వజన్మ వృత్తాంతం :-** త్రేతాయుగంలో శ్రీహరి శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ చేయడానికి శ్రీరాముడుగా భూలోకంలో అవతరించినాడు. పితృవాక్య పరిపాలనా దురంధరుడైన శ్రీరాముడు, తన తండ్రి దశరథుడు, తన పినతల్లి కైకకు ఇచ్చిన రెండు వరాల ప్రకారం రాజ్యాన్ని తన సోదరుడైన భరతునికి ఇచ్చి, సర్వాభరణాలు విడిచి, నారబట్టలతో అరణ్యవాసానికి బయలుదేరాడు. వెంట శ్రీమహాలక్ష్మియైన సీతా మహాసాధ్వి, భ్రాతృ భక్తి తత్పరుడైన లక్ష్మణుడూ, శ్రీరామునితో పాటు వనవాసానికి వచ్చారు. ఆ ముగ్గురు నార బట్టలు ధరించి కందమూలాలు తింటూ అరణ్యాల్లో తిరుగుతూ దండకారణ్యానికి వచ్చారు. సృష్టి ప్రారంభమైన నాటి నుండి అనేక జన్మలెత్తుతూ మనో వాక్కాయ కర్మల ఫలితం, జీవజ అండజ, స్వేదజ ఉద్భిజ జన్మాలను సేవిస్తూ భద్రుడు ఆ జన్మలో ఒక పాషాణమై అవతరించి దండకారణ్యంలో ఒకచోట పడియున్నాడు.

**4.7.2.3. పంచవటీ ప్రాంతం - పర్ణశాల విశిష్టత :-** శ్రీరామచంద్రుడు సతీ సోదర సమేతుడై దండకారణ్యంలో తిరుగుతూ, పంచవటీ ప్రాంతంలో ఒక పర్ణశాలను నిర్మించుకుని అందులో నివసిస్తున్నాడు. ఆ పంచవటీ ప్రాంతం యొక్క రమణీయత పవిత్రత చాలా గొప్పది. కావుననే అవతార పురుషుడైన శ్రీరామచంద్రునకు నివాస భూమియై వర్ధిల్లింది. ఒకనాడు శ్రీరాముడు అగస్త్యాశ్రమానికి వెళ్ళి అగస్త్య మహామునిని దర్శించుకుని, శ్రీరాముడు తాను తన భార్య సీత, సోదరుడు లక్ష్మణ సమేతుడై ఈ దండకారణ్యానికి వచ్చినట్లు, నివసించడానికి అనువైన స్థలం తెలియజేయమని అగస్త్యుని కోరాడు. అంతట అగస్త్య మహాముని రామునితో "పంచవటి" అనే ప్రదేశం నివాస యోగ్యమైందనీ, అది ఫల జల సమృద్ధమై తరు లతాదులతో, కీర, శారికా, పిక, కోకిలాది పక్షుల కిలకిలారావాలతో, సుగంధ శోభిత సుమ సమూహాలతో అనేక మృగాలతో శోభాయమానంగా ఉంటుందనీ పావన గౌతమీ నదీ ప్రవాహం సీతకు, రామునికి ఆనందాన్ని కలిగిస్తుందనీ, అక్కడ కుటీరం నిర్మించుకొని సుఖులై యధేచ్ఛగా వర్ధిల్లమని అగస్త్యుడు ఉపదేశించాడు. ఆయన ఆదేశానుసారం సీతారామ లక్ష్మణులు పంచవటీ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ గల రమణీయ ప్రదేశం శ్రీరామచంద్రుడు, తమ కుటీరానికి నిర్ణయించగా లక్ష్మణుడొక చక్కని పర్ణశాలను నిర్మించాడు. ప్రకృతి సొగసుల్ని సందర్శిస్తూ, గోదావరి జలాల్లో స్నాన సంధ్యాదులొనరుస్తూ, ఫలాలు, కంద మూలాలు యేరుకొని తింటూ వారాపర్ణశాలలో హాయిగా ఉంటుండేవారు. పంచవటా ప్రదేశ విశిష్టతను, సౌందర్యాన్ని, గౌతమీ నదిని గూర్చి వాల్మీకి రామాయణంలో చెప్పబడింది.

**4.7.2.3.1. అగస్త్యుడు పంచవటిని గూర్చి శ్రీరామునికి తెలియజేయుట :**

శ్రీరాముడు దండకారణ్యంలో అగస్త్య మహాముని ఆశ్రమానికి వెళ్ళి, తనకు నివాస యోగ్యమైన ప్రాంతాన్ని తెలియజేయమని కోరాడు. అంతట అగస్త్యుడు రామునితో ఇలా అన్నాడు. "ఇతోద్వియోజనే తాత ! బహు మూల ఫలోదకః దేశో బహు మృగశ్శ్రీ మాన్పంచవట్యభి విశ్రుతః"[1] నాయనా ఇక్కడికి రెండు యోజనాల దూరంలో దుంపలు, పండ్లు అధికంగా కలది, అనేక మృగాలతో కూడింది, శ్రీమంతమైంది, 'పంచవటి' అని ప్రసిద్ధి గాంచింది అయిన ప్రదేశం ఉంది.

"తత్ర గత్వాశ్రమ పదం కృత్వా సౌమిత్రిణా సహ

రంస్యసేత్వం పితుర్వాక్యం యథోక్తమను పాలయన్"[2] - లక్ష్మణునితో నీవచటికి పోయి ఆశ్రమము నిర్మించుకొని నీ తండ్రి ఆజ్ఞను యథావిధిగా నిర్వహించుచు సుఖముగా క్రీడించుచుండ గలవు.

"సహిరమ్యో వనోద్దేశ మైథిలీ తత్ర రంస్యతే, సదేశశ్లాఘనీయశ్చ నాతి దూరేచ రాఘవః, గోదావర్యా స్సమీపే చ మైథిలీ తత్ర రంస్యతే"[3] - పంచవటీ ప్రదేశము చాలా సుందరము, శ్లాఘనీయము. ఇచటకు సమీపమున నున్నది. గోదావరికిని చెంతనున్నది. కావున సీత అచట ఆనందంతో క్రీడించును.

" ప్రాజ్యమూల ఫలైశ్చైవ నానాద్విజ గణాయుతః, వివిక్తశ్చ మహాబాహో! పుణ్యో రమ్యస్త థైవచ"[4] - ఆ పంచవటీ ప్రదేశము, పండ్లు, దుంపలు అధికంగా కలది. పలు విధములగు పక్షి సమూహములు గలది. అధిక జన సంచారము లేనిది. పవిత్రమైంది. సుందరమైనదియు.

" భవానపి సదారశ్చ శక్తశ్చ పరిరక్షణే, అపి చాత్ర వసన్రామ తాపసా న్పాలయిష్యసి"[5] - నీవు భార్యా సమేతుడవై పంచవటిలో నుండదగును. నీకు తాపసులను కాపాడు సామర్థ్యమున్నది. నీవిచట నివసించుచు తాపసులను కాపాడెదవు.

1. వాల్మీకి రామాయణం - అరణ్య కాండ త్రయోదశస్సర్గః పుట 98, శ్లోకం 13, తెలుగు అనువాదం చలమచర్ల వేంకట శేషాచార్యులు.
2. " " " " శ్లోకం 14, " " "
3. " " " పుట 99, శ్లోకం 19, " " "
4. " " " " శ్లోకం 20, " " "
5. " " " పుట 100 శ్లోకం 21, " " "

"ఏత దాలక్ష్యతే వీర ! మధూకానాం మహద్వనమ్, ఉత్తరేణాస్య గంతవ్యం న్యగ్రోధ మభిగచ్ఛతా"[1] - ఓ వీరుడా! ఇదే ఇప్ప పువ్వుల పెద్ద తోటను చూడుము. దానికి ఉత్తరపు దిశగా ఒక మఱ్ఱి చెట్టు కడకు పోవలయును.

"తతః స్థల ముపారుహ్య పర్వత స్యావిదూరతః, ఖ్యాతః పంచవటీ త్యేవ నిత్య పుష్పిత కాననః"[2] - ఆపైన ఎత్తైన ప్రదేశమునెక్కి పర్వతము చెంత నిత్యము పూచిన వనములతో కూడి పంచవటి యని ప్రసిద్ధమైన ప్రదేశముకు పొమ్ము.

ఈ విధంగా పంచవటి గూర్చి ఆ విశేషాలను అగస్త్య మహాముని శ్రీరామునికి తెలియజేయగా రామలక్ష్మణులిరువురూ అగస్త్య మహాముని వద్ద సెలవు తీసుకుని, పంచవటి వైపు పయనమైనారు.

### 4.7.2.3.2. పంచవటి యందు లక్ష్మణుడు పర్ణశాలను నిర్మించుట :

"తతః పంచవటీం గత్వా నానావ్యాళ మృగాయుతామ్, ఉవాచ భ్రాతరం రామస్సౌమిత్రి దీప్త తేజసమ్"[3] అట్లు రాముడు పలు విధములగు దుష్ట సర్పములు, మృగములతో వ్యాపించియున్న పంచవటికి పోయి కైంకర్యమునకు తగినట్టి ప్రదేశము లభించుటచే సంతుష్టుడై ముఖ కాంతితో వెలుగొందు తమ్ముడగు లక్ష్మణునకిట్లనెను.

"ఆగతాః స్మయథోద్దిష్ట మముం దేశం మహర్షిణా, అయం పంచవటీ దేశ స్సౌమ్య ! పుష్పిత పాదపః[4] - అగస్త్య మహర్షి మనకు చెప్పిన ఈ పంచవటికి వచ్చితిమి. సౌమ్యుడా ! ఈ ప్రదేశము పుష్పించిన చెట్లతో నిండియున్నపది.

"రమతే యత్ర వైదేహీత్వ మహం చైవ లక్ష్మణ !, తాదృశో దృశ్యతాం దేశ స్సన్నికృష్ట జలాశయః"[5] - లక్ష్మణా ! సీతకు, నాకును, నీకును, ఏ ప్రదేశము సమ్మతమై యుండునో అట్టి ప్రదేశమును చూడుము. ఆ ప్రదేశమునకు చెంతనే తటాకముండ వలెను.

"వన రామణ్యకం యత్ర స్థల రామణ్యకం తథా, సన్నికృష్టం చ యత్ర స్యాత్సమి త్పుష్ప కుశోదకమ్"[6] - మామిళ్ళు, పొన్నలు మున్నగు వృక్ష సమూహములచే రమణీయమైన వనములు, మిట్ట పల్లములు లేక మెత్తని ఇసుక గల ప్రదేశము ఉండవలెను. అచట సమిధలు, పుష్పములు, దర్భలు, నీరు సమీపముననే యుండవలెను. అంత శ్రీరాముడి ఆజ్ఞానుసారం లక్ష్మణుడు ఆ పంచవటీ ప్రాంతమున ఒక అనువైన ప్రదేశము చూసి రాముడు చెప్పినట్లుగా నివాస యోగ్యమైన ఒక విశాల ప్రదేశమున చక్కని పర్ణశాలను నిర్మించెను.

"అయం దేశస్సమ శ్రీమాన్పుష్పితైస్త రుభిర్వృతః, ఇహాశ్రమ పదం సౌమ్య ! యథావత్కర్తు మర్హసి"[7] - ఓ సౌమ్యుడా ! ఈ ప్రదేశము ఎత్తు పల్లములు లేక సమమై సొంపుగా నున్నది. అంతటను పుష్పములు పుష్పించి యున్నవి. ఇచట యథావిధిగా ఆశ్రమము నిర్మించుము. అని లక్ష్మణుని రాముడాదేశించెను.

"ఇయమాదిత్య సంకాశైః పద్మైస్సురభిగంధిభిః, అదూరే దృశ్యతే రమ్యా పద్మినీ పద్మ శోభితా"[8] - సూర్యుని వలె ప్రకాశించునవి, కమ్మని వాసనలు గుబాళించునవగు పద్మములతో శోభిల్లు సుందరమగు తామర కొలను చెంతనే అగపడుచున్నది.

1. వాల్మీకి రామాయణము - పదమూడవ సర్గ, శ్లోకం 22, పుట 100.
2. " " శ్లోకం 23, పుట 100.
3. " పదునైదవ సర్గ, శ్లోకం 1, పుట 109.
4. " " శ్లోకం 2, పుట 109.
5. " " శ్లోకం 4, పుట 110.
6. " " శ్లోకం 5, పుట 110.
7. " " శ్లోకం 10, పుట 110.
8. " " శ్లోకం 11, పుట 111.

"యథాఖ్యాత మగస్త్యేన మునినా భావితాత్మనా , ఇయం గోదావరీ రమ్యా పుష్పితైస్తరుభిర్వృతా, హంసకారండ వా కీర్ణా చక్రవా కోప శోభితా[1] - పరమాత్మ నిష్ఠుడగు అగస్త్య మహర్షి చెప్పినట్లు ఇదిగో సుందరమగు గోదావరీ నది. పుష్పించిన వృక్షములు తీరములందు కలదై హంసకారండవ పక్షులతో వ్యాప్తమై, చక్ర వాకములతో రమణీయమై యున్నది అని రాముడంటాడు. ఈ పంచవటీ ప్రదేశమందున్న రమణీయమైన వన దృశ్యాలు, వివిధ వృక్షజాతులతోను, మృగాలతోను, పక్షులతోను కూడి అందంగా ఉన్న ఆ సౌందర్యాన్ని వాల్మీకి చక్కగా వర్ణించాడు. గోదావరీ నదీ తీర సమీపాన ఉన్న పంచవటిని గూర్చి వాల్మీకి ఇలా తెలియజేశాడు.

" ఇదం పుణ్యమిదం మేధ్య మిదం బహు మృగద్విజమ్, ఇహ వత్స్యామ సౌమిత్రే! సార్ధమేతేన పక్షిణా"[2] - లక్ష్మణా ! ఇది పుణ్యమైంది. ఇది పావనమైనది. ఇది అనేక మృగములు, పక్షులు విహరించునది. కావున మనతో వచ్చిన ఈ జటాయువుతో కలిసి ఇచట నివసించెదము. అని రాముడు అంటాడు. అంతట

" ఏవ ముక్తస్తు రామేణ లక్ష్మ: పరవీరహా, అచిరేణా శ్రమం భ్రాతుశ్చకార సుమహా బలః"[3] - అని రాముడిట్లు పలుకగా మహావీరుడును, శత్రు వీరులను సంహరించు వాడును అగు లక్ష్మణుడు శీఘ్రమే అన్నకై ఆశ్రమమును నిర్మించెను.

### 4.7.2.3.3. పర్ణశాల నిర్మించిన విధం :

"*పర్ణశాలాం సువిపులాం తత్ర సంఘాత మృత్తికామ్, సుస్తంభాం మస్కరైర్దీర్ఘై: కృత వంశాంసుశోభనామ్*"[4]

"*శమీ శాఖాభిరాస్తీర్య దృఢ పాశావ పాశితామ్, కుశకాశ శరై: పర్ణైస్సు పరిచ్ఛాదితాం తథా* "

"*సమీకృత తలాం రమ్యాం చకార లఘు విక్రమః, నివాసం రాఘవ స్యార్థే ప్రేక్షణీయ మనుత్తమమ్*"[5]

లక్ష్మణుడు చురుకైన వాడగుటచే అచ్చట మట్టిని త్రవ్వి గోడలు కట్టి పొడవైన వెదుళ్ళతో స్తంభములు నిలిపి, వానిపై అడ్డముగ మరికొన్ని వెదుళ్ళను కట్టి, వానిపై జమ్మి కొమ్మలను అడ్డముగా పరచి, వాని నన్నింటిని త్రాళ్ళతో గట్టిగా కట్టి వానిపైన దర్భలు, రెల్లు మున్నగు పర్ణములచే కప్పి, నేలను ఎత్తు పల్లములు లేకుండునట్లు సరిచేసి సుందరమైన దర్శనీయమగు పర్ణశాలా రూపమగు నివాసమును ఏర్పరచెను. ఈ పర్ణశాల గోదావరీ తీరాన ఉందనడానికి ఈ శ్లోకం నిదర్శనం

"*సగత్వా లక్ష్మణశ్శ్రీ మాన్నదీం గోదావరీ తదా, స్నాత్వా పద్మాని చాదాయ సఫలః పునరాగతః*"[6] - పిమ్మట శ్రీమంతుడగు లక్ష్మణుడు గోదావరీ నదికి పోయి స్నానము చేసి పద్మములు, పండ్లను తీసుకొని మరలి వచ్చెను. ఈ పర్ణశాలలో సీతా, రామ, లక్ష్మణులు జటాయువనే పక్షీంద్రునితో కూడి నివసించారు. గోదావరీ తీరాన గల పంచవటి యందు పర్ణశాల యందు వీరు నివసిస్తూ వనవాసం చేస్తూ, ధర్మ రక్షణ చేస్తు రామ చంద్రుడు నివసిస్తున్నాడు. సీతాదేవిని రావణుని చెల్లెలు శూర్పణఖ చూసి ఆమెను చంపబోవడం,రాముని మోహించడం, అంతట లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసి పరాభవించడం,

---

1. వాల్మీకి రామాయణం - అరణ్య కాండ , పదునైదవ సర్గ, శ్లోకం 12, పుట 111.
2. " " " శ్లోకం 19, పుట 113.
3. " " " శ్లోకం 20, పుట 113.
4. " " " శ్లోకం 21, పుట 114.
5. " " " శ్లోకం 22,23, పుట 114.
6. " " " శ్లోకం 24, పుట 114.

మాయలేడిని చూసి సీత దాన్ని కోరుకోవడం, దానికై రామ లక్ష్మణులు వెళ్లడం, ఈ విషయం తెలిసిన రావణుడు సీతను అపహరించి తీసుకొని వెళ్లి లంకా నగరంలో ఉంచడం ఈ సంఘటనలన్నీ ఈ పంచవటి యందున్న పర్ణశాల యందే జరిగినాయి. ఇదంతా వాల్మీకి రామాయణంలో ఉంది. ఐతే భద్రుని వృత్తాంతం మాత్రం లేదు. శ్రీరామచంద్రుడు అడవిలో తిరుగుతున్న సమయంలో అక్కడ ఉన్న ఒక రాతిబండపై కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ ఉండేవాడు. ఆ శిల భద్రుడేనని నారదుడు చెప్పాడు. అక్కడ గల ఆ శిలపై శ్రీరాముడు సేద తీర్చుకుని మహదానందపడుతుండేవాడు. అలసట పోగొట్టుకుని అత్యంత ఉల్లాసంగా శిలపై కూర్చుని వున్న శ్రీరామచంద్రుని చూసి సీతాదేవి యీవిధంగా అడిగింది.

"నాథా ! అలనాడు మీ పాదస్పర్శతో అహల్యకు శాప విమోచనం కలిగించినారు. ఈనాడు తమరీ రాతిపై నిత్యం కూర్చుని విశ్రాంతిపొంది మరి ఈ రాతికేమి వరమిస్తారో సెలవియ్యండి." అని ప్రశ్నించింది. "సీతా ! ఈ రాతిని సామాన్యంగా తలుస్తున్నావు కాని, జన్మ జన్మల కృత్యాల కారణంగా ఈనాడిక్కడ రాయియై పడివున్న నాభక్తుడే, యీనాడు ఆ రీతిగా సేవలందించి, ఫలితంగా ఉత్తమోత్తమమైన జన్మను పొంది నన్ను సేవిస్తాడు. నాకు నిలయమై వెలుస్తాడు. పర్వతరాజ శ్రేష్ఠుడూ, నా భక్తుడూ ఐన మేరువుకు పుత్రుడై పుడతాడు. మాకుల గురువుల వల్ల విద్యలబ్ధి, మా భక్తుడై తపంచేసి ఈప్సిత సిద్ధిని పొందుతాడు." అని శ్రీరాముడు సీతకు భద్రుని గూర్చి తెలియజెప్పాడు. అప్రకారం అలనాటి పర్ణశాల వద్దనున్న శిలయైన భద్రుడు మేరువుకు పుత్రుడై పుట్టినాడు. శ్రీరామచంద్రుని భక్తుడైనాడు. తపస్సు చేసే సంకల్పం కూడా కలిగివున్నాడు. కావున భద్రుడు తన జన్మ తరించడానికి శ్రీరామ సందర్శనం కోసం తపస్సుచేయడానికై సిద్ధపడినాడు.

**4.7.2.4. భద్రుని తపస్సు :-** నారద ప్రేరితుడైన భద్రుడు తన తల్లితండ్రులకు నమస్కరించి, తపస్సు చేసుకోవడానికి నారదుని వద్ద దీక్షకు పొందడానికి, అనుజ్ఞను కోరినాడు. తల్లితండ్రులు అందుకంగీకరించారు. భద్రుడు నారదుని వద్దకు వచ్చి రామమంత్రోపదేశం పొంది, నారదుని ఆజ్ఞానుసారం గౌతమీ తీరాన తపస్సుచేసుకోవడానికి సిద్ధపడ్డాడు. నారదుడు గౌతమీ మాహాత్మ్యాన్ని గూర్చి భద్రునికి ఈ విధంగా తెలియజేసినాడు.

**4.7.2.4.1. గౌతమీ మాహాత్మ్యము :-** గంగానది వలెనే, గోదావరీ నది కూడా పుణ్యప్రదమైంది. భరత ఖండంలోని దక్షిణ భూమండలంలో ఉన్న గోదావరి, కృష్ణవేణి, భీమనది, తుంగభద్ర, తావ, పయోష్ణి యివి అరు దేవతీర్థాలు. ఇందు గోదావరి చాలా గొప్పది. పూర్వం భూమండలంపై క్షామం సంభవించగా గౌతముడు ప్రజల కష్టాలను తొలగించడానికి, తన ఆశ్రమంలో నిరంతరం అన్నదానం చేస్తుండేవాడు. ఆయన తన తపశ్శక్తితో ప్రతిదినం పిడికెడు రేవా ధాన్యాన్ని అభిమంత్రించి, చల్లి స్నాన సంధ్యానుష్ఠానాలు తీర్చుకుని వచ్చేసరికి పైరు పెరిగి, పంట పండి, ధాన్యం రాలేవి. వాటితో అన్నదానం చేస్తుండేవాడు. ఈ విధంగా సాగుతున్న సమయంలో ఒకనాడు ఒక గోవు వచ్చి ఆ పైరును తినేస్తుండగా, గౌతముడది చూసి కంగారు పడి ఆ గోవును గడ్డిపోచతో అదలించగా ఆ గోవు మరణించింది. దానితో గోహత్య చేసిన గౌతముని సమారాధనకు ఎవ్వరూ రాకపోగా ఆయన్ని పలువిధాల దుర్భాషలాడ సాగారు. జరిగిన దారుణానికి పరితపిస్తున్న గౌతముడు గోహత్య నివృత్తికై తపస్సు చేయసాగినాడు. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా స్వామీ! పావన గంగను అనుగ్రహించి ఆ గోవుపై ప్రవహింపజేసి దానికి జీవనాన్ని, నాకు గోహత్యా పాతక నివృత్తిని కలుగునట్లు అనుగ్రహించమని కోరుకొన్నాడు. అందుకు శివుడు అంగీకరించి గంగను విడిచాడు.

శివుని జటాజూటం నుండి గంగ నాసికా త్ర్యయంబకం వద్ద భూమిపై అవతరించి గౌతముని వెంట గోవున్న తావుకు ప్రవహించి, వెళ్లి సముద్ర గర్భంలో కలిసింది. గోహత్యా పాతకాన్ని రూపుమాపు పుణ్య నదయింది. ఇక్కడ నీ తపస్సు సునాయాసంగా ఫలిస్తుంది. అని చెప్పి నారదుడు నిష్క్రమించాడు. నారదోపదేశితుడైన భద్రుడు. గౌతమీ నదీ తీరంలో తీనువైన స్థలాన్ని చూసుకొని, నిష్ఠా గరిష్ఠుడై నిరంతరం

రామనామ స్మరణతో యేకాగ్రచిత్తంతో తపస్సు చేయసాగాడు. దేవేంద్రాదులు ఆ బాలుని యేకాగ్రచిత్తాన్ని చూసి తల్లడిల్లిపోయారు. తమకు ఏమి ఉపద్రవం కలుగుతుందో అని కలవరపడ్డారు. ప్రకృతి శక్తుల్ని ప్రేరేపించి అతని తపస్సు భగ్నం చేయడానికి ప్రయత్నించారు. వాన, గాలి, ధూళి, అగ్ని వాటికి, వీటికీ ఆ బాలుడు చలించలేదు. రంభాదుల్ని పంపించి, బాలుని తపస్సు పాడుచేయ చూసారు. అతడు వారిని కను విప్పి అయినా చూడలేదు. 'ఎందుకొచ్చిన ప్రయాస ఇది ? ఆ బాలుడు మీ పదవులు ఏవి ఆశించి తపస్సు చేయడం లేదు. అతని తపస్సుకు అడ్డు తప్పకోవలసిందని' నారదుడు వారిని ఊరడిల్ల జేసినాడు. కొంతకాలానికి శ్రీరామచంద్రునికి అనుగ్రహం కలిగింది. సీతా సమేతుడై రాముడు సాక్షాత్కరించాడు. భద్రుడు పులకిత గాత్రుడై శ్రీరాముని ఆనంద పారవశ్యంతో స్తుతించాడు. శ్రీరాముడు అతని భక్తి విశేషానికి మెచ్చి భద్రుని వరం కోరుకోమన్నాడు. అప్పడు భద్రుడు ఆ శ్రీరామునికి సీతా మాతకు నమస్కరించి "పూర్వం నాకు వరమిచ్చిన ప్రకారం నీవు నా శిరస్సుపై విలసిల్లి విరాజిల్లుతూ నన్నుద్ధరించ వలసింది నీలమేఘ శ్యామా!" అని ప్రార్థించాడు. అంతట శ్రీరాముడు " భద్రా ! నీ అభీష్టము తీరును గాక. ఆచంద్ర తారార్కము నీవు మాకు నెలవై మమ్మల్ని నీ శిరమున దాల్చి అశేష భక్తకోటికి ఆకర్షణీయుడవై మము సేవించు వారిని ఉద్ధరింప జేసే క్షేత్రమై విరాజిల్లి, కల్పాంతంలో మా సన్నిధానానికి వచ్చెదవు గాక"అని వరమిచ్చాడు.

గోదావరీ నది విరజా నదిగా, నీ మస్తకమే వైకుంఠంగా తలచి మమ్ము శిరస్సుపై కలిగి ఉన్న నీకు మూడు సార్లు ప్రదక్షిణ చేసిన భక్తులకు సద్యో పుణ్య ప్రాప్తి కలుగుతుంది. నీపై ఉన్న మమ్మల్ని శ్రద్ధా భక్తులతో సేవించే వారు బ్రహ్మ హత్యాది మహా పాతక నివృత్తులై మోక్షాన్ని పొందుతారు. అటువంటి వారికి ఇలలో భోగభాగ్య ఆయుర్వృద్ధి , సత్సంతాన ప్రాప్తి , సమస్త సౌఖ్యానందాలు లభిస్తాయి అని వరమిచ్చి అదృశ్యమయ్యాడు.

4.7.2.5. భద్రాచల అవతరణ :

త్రేతా యుగంలో శ్రీరామచంద్రుని విశ్రాంతి పీఠమై ఆయన ప్రేమానురాగాభిమానాల్ని పొంది మరు జన్మలో మేరువుకు పుత్రుడై జన్మించి, వశిష్ఠుని వద్ద సమస్త శాస్త్రాలు అభ్యసించి, నారదుని వల్ల రామనామ తారక మంత్రముపదేశింపబడిన వాడై, తపస్సును ఆచరించి, శ్రీరాముని సాక్షాత్కారాన్ని , వరాలను పొందిన భద్రుడు ద్వాపర యుగ సమాప్తి వరకు శ్రీరామభక్తుడై, బ్రహ్మానందమనుభవిస్తూ కలి యుగారంభంలో గోదావరీ నదీ తీరాన పాపి కొండలకు అవతల తానొక కొండయై వెలిశాడు. ఆ కొండకు "భద్రగిరి"అన్న పేరు కలిగింది. దీన్నే భద్రాచలమని ఆ నగరాన్ని ఆనుకొని చేరిన గ్రామాన్ని సైతం భద్రాచలమని పిలవడం జన పదాన వ్యాప్తికి వచ్చింది. ఆ భద్రాచల క్షేత్రం ఆంధ్రుల ఆరాధ్య పుణ్య క్షేత్రమైంది. ఈ పవిత్ర క్షేత్రమైన భద్రాచలంలో శేష తీర్థం, శబరి నది, పంచవటి పర్ణశాల ప్రాముఖ్యం వహించాయి. పంచవటి పర్ణశాల గురించి ఇంతకు ముందు క్లుప్తంగా తెలియజేయడమైనది. ఇక శేష తీర్థం, శబరి నది ప్రాముఖ్యాన్ని, విశిష్టతను తెలుసుకుందాం.

**4.7.2.6. శేష తీర్థం :** సూతుడు శౌనకాది మహర్షులకు భద్రాచల క్షేత్ర మహిమను గూర్చి వివరించిన తర్వాత ఈ శేష తీర్థం యొక్క ప్రాశస్త్యాన్ని వారికి ఈ విధంగా తెలియజేశాడు. శ్రీరాముని మనసారా సేవించేవారు ఎంతటి పాపాత్ములైనా వారికి ముక్తి లభిస్తుంది. అందుకు ప్రధానమైన కారణం శ్రీమన్నారాయణుడు, తాను శ్రీరాముడై వనవాస కాలంలో తిరిగిన ఆ ప్రదేశాలపై మిక్కిలి ప్రీతి కలిగిన వాడై భద్రునికి ఇచ్చిన వరాన్ని సకల జనోపయోగంగా జేయగోరి, ముల్లోకాలలోని సుప్రసిద్ధ పుణ్య తీర్థాలు, ఆప్రాంతాల్లో సన్నిహితాలై ఉండేటట్లు చేశాడు. కావున విశేషాలు ఇవి అని వర్ణించడం తరం కాదు. "శేష తీర్థం" అనే పవిత్ర తీర్థం భక్తులు తిలకించ వలసిన, దర్శించవలసిన పుణ్య తీర్థం. ఈ తీర్థాన్ని గూర్చి కూడా ఒక వృత్తాంతం చెప్పబడింది.

పూర్వం నాగ లోకాన్ని పాలిస్తున్న సుర శ్రేష్టుడు శేషుడు రాక్షసుల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండేవాడు. రాను రాను రాక్షసుల దుర్మార్గాలు మితిమీరి పోవడమే కాక వారు రసాతలానికి దాడికి వెడలి నాగలోకాన్ని ఆక్రమించుకున్నారు. వారితో పోరాడలేక పారిపోయిన శేషుడు బ్రహ్మ దేవునితో మొరపెట్టుకున్నాడు. "భూలోకంలోని భద్రాచల ప్రాంతంలో గౌతమీ తీరాన శివుని గూర్చి తపస్సు చేస్తే నీకు విజయం కలుగుతుందని" బ్రహ్మ తెలియజేశాడు. ఆ ప్రకారమే శేషుడు భూలోకంలో గౌతమీ తీరంలోని భద్రాచల సమీపంలో హోమ గుండాన్ని రగిల్చి అభిచార హోమం చేయగా సదాశివుడు ప్రత్యక్షమై శత్రు వినాశకరమైన తిరుగులేని త్రిశూలాన్ని అనుగ్రహించాడు. దాని సహకారంతో శేషుడు రాక్షసులను ఓడించి, రాజ్య సుఖాలను అనుభవించాడు. తపస్సిద్ధి వల్ల పొందిన త్రిశూలంతో శేషుడు భూలోకం నుంచి నాగలోకానికి పోయిన బిలం గుండా పాతాళంలోని భోగవతీ నదీ జలాలు వచ్చి, గౌతమీ నదీ జలాల్లో-శేషుడు అభిచార హోమం చేసిన స్థలంలో కలిసాయి. అట్లా గుండంలో కలిసిన ఆ తటాకం 'శేష తీర్థమని' పేరు పొందింది. ఆ తీర్థం ఉష్ణాన్ని పొంది ఉండడం చేత "ఉష్ణ గుండం" అని ప్రసిద్ధి చెందింది.

అలనాడు పంచవటి యందు పర్ణశాలలో వాసం చేసిన శ్రీరామ చంద్రుడూ, సీతా దేవి ఈ ఉష్ణ గుండాలందే స్నానం చేస్తుండేవారు. ఆ కారణం చేత కూడా ఈ జలం పరమ పవిత్ర పుణ్య తీర్థమై భక్త కోటిని ఉద్ధరిస్తుంది.

**4.7.2.7. శబరి వృత్తాంతం :** శ్రీరాముడు వనవాసానికై అయోధ్యను విడిచి దండక వనంలోకి ప్రవేశించిన రోజుల్లో శబరి అని పిలువబడే ఓ వృద్ధురాలు ఉండేది. పూర్వ జన్మ సంస్కారం వల్ల ఆ ముదుసలి రామభక్తి కలిగి నిరంతరం రామనామం జపిస్తుండేది. ఆ రాముడు తన పాలిట పరంధాముడే అడవుల్లోకి వస్తున్నాడని విన్నది. శ్యామలాంగుని దివ్య మంగళ విగ్రహాన్ని కన్నులారా దర్శించుకునే భాగ్యం అబ్బుతుందని ఉప్పొంగిపోయింది. ఆ సాకేత రాముని రాకకై ఎదురు చూడసాగింది. అంతఃపురంలో దాసదాసీలందిస్తుంటే మధుర ఫల భక్ష్యాలను ఆరగించే రామచంద్రుడు ఈ అడవుల్లో ఏం తింటాడు ? ఈ కాయలు కసువులు తినగలడా ? ఏ ఫలమెటువంటిదో, ఏ కాయ ఎక్కడ దొరుకుతుందో తెలియనేరడే ? అంతట, స్వామి వస్తున్నాడు. ఎదురేగి వాకిట్లోకి తెచ్చి ఏమి పెట్టగలను? అని ఆ ముదుసలి తహతహలాడిపోయింది. అడవిలో దొరికే పళ్ళన్నీ ఏరుకొని వచ్చింది. వాటిలో ఏవి ఏట్లా ఉన్నాయో! రామ ప్రభునకు రుచికరాలైన వాటిని అందించాలని ఆరాటపడి పోతున్న ఆ శబరి వద్దకు శ్రీరాముడు వచ్చాడు.

ఆ స్వామిని చూసి పరవశించిపోయింది. ఆ రాముని రాకతో ఆమె తనువు విలవిలలాడి పోయింది. కన్నతల్లిలా కన్నీరు కార్చింది. మమతతో, భక్తితో ఎంగిలైనా అని ఆలోచించక ఆ పళ్ళను కొరికి రుచి చూసి మరీ తన చేతులతో తినిపించింది. ఆ పరంధాముడు భక్తురాలి ఆత్మీయతకు మెచ్చి ముక్తిని ప్రసాదించాడు. ఆ శబరి నదీ రూపమై ప్రవహిస్తూ గౌతమి నదిలో లీనమౌతుంది. ఆ అపూర్వ భక్తితో పునీతురాలైన పరమ పావన శబరి సందర్శనం, ఆ నదీ తోయాల స్నాన సంధ్యాదులు, అక్కడ వెలసిన స్వామి వారి ఆరాధన భక్తులకు కోరికలను తీర్చునటువంటిది. శ్రీరాముని దర్శన భాగ్యం పొంది శ్రీరామ సాయుజ్యం పొందిన ఈ శబరి మాత జన్మ ధన్యం.

శబరి భక్తిని గూర్చి భగవాన్ శ్రీ సత్య సాయిబాబా ఈ విధంగా వ్రాశారు. "శబరి చేతులు జోడించుకొని ఓ నాథా ! నేను నీచ జాతిలో జన్మించిన స్త్రీని, మందమతిని, మూర్ఖురాలను, ఏ విద్యను లేని అజ్ఞానిని, నేనేమని వర్ణింతును. అధమాధములలో అధమురాలను, అశక్తురాలను, మాటల పొందిక తెలియని దానను, తెలివి తేటలు శూన్యం, తపశ్శక్తి లేదు. కేవలం దైవ ప్రీతి తప్ప అన్య శక్తులలో అట్టడుగున పడిన నన్ను ఆదరించి , ఆనందమందించిన నీ కరుణ అపారం. నీ కరుణే నన్ను అనుగ్రహించెను తప్ప నా భక్తి శక్తులు కావు. అని అనేక విధములుగా రామచంద్రుని ప్రేమ, దయలను వర్ణించుచు వచ్చెను".[1]

1. రామ కథా రస వాహిని (ద్వితీయ భాగం), పుట 54,55 భగవాన్ శ్రీ సత్య సాయిబాబావారు.

"ఈ మాటలు వింటున్న రాముడు శబరి శిరస్సును నిమురుతూ అమ్మా! నాకు భక్తి ఒక్కటే ప్రధానం కాని అన్య విద్యలు, తెలివి తేటలు, జన్మ, వంశాలు నేను లెక్క చేయను. సమస్త తపశ్శక్తుల కంటే ప్రేమ పూర్వకమైన భక్తియే నాకు మధురము. నేను దానిని మాత్రమే ఆశింతును. జలము లేని మేఘమువలె, ఫలము లేని వృక్షము వలే, పాలివ్వని గోవు వలే, భక్తి లేని మనుజుడు యెంతటి వాడైననూ నాకు, భగవత్ ప్రీతికి, అతి దూరమైన వాడే. ఓ శబరీ నవ విధభక్తి మార్గముల యందుయే ఒక విధమైన మార్గము నవలంబించిన చాలు. అయితే నీవు నవ విధ మార్గములనూ అవలంబించితివి. ఇక నీకంటే అధికులు నాకు యెవ్వరునూ కనిపించలేదు.[1]

"హృదయ స్థానము నుండి వచ్చిన, ప్రవహించుచున్న నీ నిర్మల, నిశ్చల, నిస్వార్థ ప్రేమ ప్రవాహమే నన్ను అన్ని విధములా తృప్తి పరచెను . స్వప్నమందైననూ నీవు పరులను దూషించలేదు. ఇట్టి స్వచ్ఛ చిత్తము కంటే మించిన చిత్తము వేరొకటి లేదు. మంచికి పొగడి చెడ్డకు క్రుంగి కృశించే చంచల స్వభావము నీకు అతి దూరము. నీవు అన్ని విధముల ధన్యురాలవు" అని రాముడు ఉపదేశించిన వచనములను శబరి వింటూ రామా, దైవ మనస్సునకు ప్రీతి గావించుట దానికంటే భక్తునకు మరొక మార్గము లేదు కదా ? యెవరు ప్రీతి పడిననూ పడక పోయిననూ నీవే ప్రీతిని బడయుట కంటే నాకు వేరు స్వర్గమెందునూ లేదు"[2].

"లీలా నాటక సూత్రధారివైన నీ చర్యను వారానాడే తెలిపిరి(మతంగ మహర్షి) నీ నటన లోక నటన, నీ సంకల్పము లోక కల్యాణము. అంతా నీ సంకల్పమే తప్ప వేరు కాదు. నీ సంకల్పము లేకయే చిన్న కార్యము కూడా జరగదు. నాథా ! యేమి తెలియని వాని వలే నటించుచూ, సీత నిమిత్తమై విచారించునటుల నటన చేయుట పామరులు, ఆత్మ విశ్వాసులు, నాస్తికులు. ఇది సామాన్య దృష్టితో చూతురేమో కానీ దైవత్వమును తెలుసుకొన్నవారు, ఆత్మ విశ్వాసము గల సాధకులు, భక్తులు నీ నటనలను నమ్మరు. సర్వమునకూ నీవే కర్తవు, నీ సంకల్పమునకు విరుద్ధముగా నడచుటకు యెట్టివారికీ చేతకాదు. మంచియైనను చెడు అయిననూ వారిలోని భావాలు కూడా ఆయా సమయాలకు తగిన రీతిగా నీవే సంకల్పింతువు. కానీ వారు ఏ మాత్రం కర్తలు కారు. అజ్ఞానులు కొందరు మేము మా పనులకు కర్తలమని భావింతురు. అదే జ్ఞానము. రామా ! నా అతి భాషణము క్షమించి నన్ను అనుగ్రహింపుము అని పాదములపై బడెను. అంతలో యోగాగ్ని ఆమె దేహాన్ని భస్మం గావింప ప్రాణము రాముని పాదములలో చేరెను.[3]

భగవాన్ శ్రీసత్యసాయి బాబావారు వ్యాఖ్యానాత్మకంగా వ్రాసిన వాల్మీకి రామాయణేతివృత్తం ఆధారంగా రచన చేసిన 'రామకథా రస వాహిని' లోని ఈ శబరి గాథను పరిశీలిస్తే తెలిసే ముఖ్యాంశాలివి. భగవంతుని దృష్టిలో అందరూ సమానులే. ఉచ్ఛ, నీచ భేదాలు లేవు. భక్తికి ప్రధానమైంది నిర్మలమైన మనస్సు, భగవంతుని చేరడానికి కావలసింది ప్రేమ పూర్వకమైన ధర్మంతో కూడిన భక్తి. అంతేకాని తపస్సులు, వ్రతాలు మొదలైనవి ఆచరించనంత మాత్రాన, నిర్మలమైన మనస్సు లేకుంటే భగవంతుని ఏ ఒక్కరూ చేరుకోలేరు. రామావతార రహస్యాన్ని కూడా శబరి తెలియజేయడం జరిగింది. దానిలో కూడా బాబావారు భగవత్సంకల్పం లేనిదే ఏ ఒక్క వ్యక్తి కూడా ఏ కార్యం నెరవేర్చలేడు, అజ్ఞానంతో అంతా తానే కర్త అని భావించడం మూర్ఖత్వం. భగవంతుడు సంకల్పించనిదే ఎవరూ ఏ కార్యమైనా తలపెట్ట జాలరు అనే ముఖ్యాంశాన్ని తెలియజేశారు.

ప్రేమ, త్యాగం, ధర్మగుణం ఈ మూడూ ఉన్నవారు భక్తితో భగవంతుని సేవిస్తే, తప్పక ఆ భగవంతునికి చేరువౌతారు. భగవంతునికి చేరువ కావడానికి తెలివి తేటలు, పాండిత్యం అవసరం లేదు.

1,2. రామకథా రస వాహిని - ద్వితీయ భాగము. పుట 55-56 (భగవాన్ శ్రీ సత్య సాయి బాబావారు).

3. " " " పుట 57-58. " "

ప్రశాంతమైన, పవిత్రమైన మనస్సు ఉంటే చాలు అందుకు ఎవరైనా అర్హులే అని బాబా తెలియజేశారు. అందుకే శబరి తక్కువ జాతి స్త్రీయైనా ఆమెకున్న అపారమైన రామభక్తి కారణంగా ఆమె రామ సాయుజ్యాన్ని పొందింది. రాముడు ఆమె వాత్సల్య పూరితంగా పెట్టిన ఎంగిలి పండ్లను ఆరగించాడు. ఇది ఆమె భక్తి ప్రపత్తులకు నిదర్శనం. వాల్మీకి రామాయణంలో ఈ శబరి గాథను అత్యంత భక్తి భావ బంధురంగా రచించారు. వాల్మీకి సంస్కృత రామాయణంలో అరణ్యకాండ, డెబ్బది నాల్గవ సర్గలో ఈ శబరి గాథను వాల్మీకి తెలియజేశారు.

### 4.7.2.7.1. వాల్మీకి రామాయణంలో శబరి గాథా వర్ణన :

పంచవటీ పర్ణశాల వద్ద రావణునిచే సీతాదేవి అపహరింపబడింది. పంచవటి వద్దనున్న పర్ణశాలలో సీతారామ లక్ష్మణులు నివసిస్తున్న కాలంలో రావణుడు సీతను అపహరించి లంకా నగరానికి తీసుకుని వెళ్ళాడు. సీతాపహరణం జరిగింది ఈ పంచవటి యందే. సీతను అన్వేషిస్తూ రామ లక్ష్మణులు వెళ్తూ మార్గ మధ్యంలో పంపా సరస్సు సమీపంలోని శబరి ఆశ్రమానికి వెళ్ళి రాముడు శబరికి తన దర్శన భాగ్యం కల్గించాడు. శబరి గాథను వాల్మీకి చక్కని వర్ణనతో రచించారు.

"తౌ పుష్కరిణ్యాః పంపాయాస్తీర మాసాద్య పశ్చిమమ్, అపశ్యతాంతత స్తత్ర శబర్యా రమ్య మాశ్రమమ్"[1] - ఆ రామ లక్ష్మణులు పంపా సరస్సు పశ్చిమ తీరమును చేరి యచట సుందరమగు శబరి యాశ్రమము చూచిరి.

"తౌత మాశ్రమ మాసాద్య ద్రుమై ర్బహు భిరావృతమ్, సురమ్య మభివీక్షంతౌ శబరీ మభ్యుపేయః"[2] వారటకు చేరి, అనేక వృక్షములతో సుందరమగు శబర్యాశ్రమమును చూచుచు శబరి యొద్దకేగిరి.

"తౌచ దృష్ట్వా తదాసిద్ధా సముత్థాయ కృతాం జలిః, రామస్య పాదౌ జగ్రాహ లక్ష్మణస్యచ ధీమతః"[3]

"పాద్యమాచమనీయం చసర్వం ప్రాదాద్యథావిధి, తామువాచ తతో రామశ్శ్రమణీం సంశితవ్రతామ్"[4].

అపుడు యోగసిద్ధి నందియున్న యా శబరి వారలను చూచి కేల్మోడ్చి రాముని పాదములకు మ్రొక్కి, యనంతరము ధీమంతుడగు లక్ష్మణుని పాదములకు ప్రణమిల్లెను. పిమ్మట యథావిధిగా నర్ఘ్య, పాద్య, ఆచమనీయాదుల నిచ్చెను. అంత రాముడట్లు వ్రత నిష్ఠురాలగు నా సన్యాసినికిట్లనెను.

"కచ్చిత్తే నిర్జితా విఘ్నాః కచ్చిత్తే వర్ధతే తపః, కచ్చిత్తే నియతః క్రోధ ! ఆహారశ్చ తపోధనే!"[5] - తపోధనురాలా! తపస్సు చేయు సందర్భమున విఘ్నములు జయించితివా ? నీ తపము వృద్ధి నొందుచున్నదా? నీ కోపమును ఆహారమును నిగ్రహించుకొంటివా ?

"కచ్చిత్తే నియమాః ప్రాప్తాః కచ్చిత్తే మనసస్సుఖమ్! కచ్చిత్తే గురు శుశ్రూషా సఫలా చారు భాషిణి"[6] - ఓ చక్కగా మాటలాడుతానా ! నీవు చాంద్రాయణాది నియమములాచరించితివా ? నీ మనస్సు ఆనందముగ నున్నదా ? నీవొనరించిన గురు శుశ్రూష సఫలమైనదా?

"రామేణ తాపసీ పృష్టా సా సిద్ధా సిద్ధసమ్మతా, శశంస శబరీ వృద్ధా రామాయ ప్రత్యుపస్థితా"[7] - తపస్విని, సిద్ధురాలును, సిద్ధుల కాదరణీయురాలు, వృద్ధయునగు ఆ శబరిని రాముడిట్లడుగగా నామె రాముని చెంత నిలచి యిట్లనెను.

"అద్య ప్రాప్తా తపస్సిద్ధియ స్తవ సందర్శనాన్మయు, అద్యమే సఫలం తప్తం గురవశ్చ సుపూజితాః"[8] - రామా ! నేడు నా తపము నీ దర్శనము చేతనే సిద్ధించింది. నా తపము సఫలమైంది. నా గురువులిపుడు చక్కగా పూజితులైనారు.

1. వాల్మీకి శ్రీమద్రామాయణము - అరణ్య కాండము తెలుగు అనువాదం శ్రీమాన్ చలమచర్ల వేంకట శేషాచార్యులు 74 సర్గ, పుట 562, శ్లోకము 4.
2,3,4. " " " " " " " శ్లోకము 5,6,7.
5,6. " " " " " " పుట 563, శ్లోకము 8,9.
7,8. " " " " " " పుట 564, శ్లోకము 10,11.

"అద్యమే సఫలం జన్మ స్వర్గశ్చైవ భవిష్యతి, త్వయి దేవ వరే రామ!పూజితే పురుషర్షభ!"[1] - రామా! పురుషోత్తముడవు, దేవ శ్రేష్ఠుడవగు నీవు పూజితుడవగుటచే నా జన్మమిపుడు సఫలమైంది. నాకింక పరమ పదమును సిద్ధించ గలదు.

"చక్షుషా తవ సౌమ్యేన పూతాస్మి రఘునందన! గమిష్యామ్యక్షయాన్లోకాం స్త్వత్ప్రసాదా దరిందమ!"[2] - రామా! నీ చల్లని చూపు నన్ను పవిత్ర మొనరించింది. అరిందమా! నీ యనుగ్రహముచే నేనక్షయములగు పుణ్య లోకముల కేగెదను. విశేషాంశము: తవ సౌమ్యేన చక్షుషా. . . . నీ నిర్హేతుకు కటాక్షముచే నేను పవిత్రురాలనైతిని. దీనిచే ప్రాక్తన పాప వినాశము చెప్పబడినది. అరిందమ అను దానిచే ఉత్తర కాలంలో పాపములు తగులకుండుట చెప్పబడుచున్నది. త్వత్ప్రసాదాద్ - ధాతుః ప్రసాదాన్మహిమానమాత్మనః అన్న చొప్పన ఆచార్య ప్రసాదోప బృంహితమైన నీ యనుగ్రహము వలన అక్షయాన్‌లోకాన్ పునరావృత్తి రహితమగు పరమ పదమును పొందెను. (గోవింద రాజీయము.)

"చిత్రకూటం త్వయి ప్రాప్తే విమానై రతుల ప్రభైః, ఇతస్తేదివ మారూఢా యానహం పర్యచారిషమ్"[3] - సాటిలేని కాంతా గల విమానములను ఎక్కి, నేను పరిచర్య చేసిన నా యాచార్యులు నీవు చిత్రకూటము చేరు సరికే దివ్య లోకములకు పోయిరి.

"తైశ్చాహ ముక్తా ధర్మజ్ఞైర్మహా భాగైర్మహర్షిభిః, ఆగమిష్యతి తే రామస్సు పుణ్యమిమ మాశ్రమమ్"[4] - ధర్మజ్ఞులు, మహాభాగ్య శాలురగు ఆ మహర్షులు నీ పుణ్యాశ్రమమునకు రాముడు రాగలడు.

"సతే ప్రతి గృహీతవ్య స్సౌమిత్రి సహితో తిథిః, తంచ దృష్ట్వా వరాన్లోకా నక్షయ్యాంస్త్వంగమిష్యసి"[5] - నీవపుడు రామ లక్ష్మణుల నతిథులుగా నాహ్వానింపుము. నీవా రాముని చూచిన తోడనే పునరావృత్తి లేని యక్షయ లోకములకు పోయెదవు అని చెప్పిరి. విశేషము: దీనిచే నాచార్య శుశ్రూషణము భగవదనుగ్రహము ద్వారా మోక్ష హేతువగునని చెప్పినట్లైనది.

"మయాతు వివిధం వన్యం సంచితం పురుషర్షభ!, తవార్థే పురుష వ్యాఘ్ర! పంపాయాస్తీర సంభవమ్"[6] - పురుష శ్రేష్ఠుడా! ఈ పంపా తీరమున పుట్టిన చెట్ల నానా విధం ఫలములాది దివ్యమగు వన్యమగు పదార్థము నీకై చిరకాలముగ నిలువ చేసితిని. విశేషణము : ఈ సందర్భంగా పద్మ పురాణ వచనము - "ప్రత్యుద్గమ్య ప్రణమ్యాథ నివేశ్య కుశ విష్టరే, పాద ప్రక్షాళనం కృత్వా తత్తోయం పాప నాశనం, శిరసాధార్య పీత్వా చ వన్యైః పుష్పైరథార్చయత్, ఫలాని చ సుపక్వాని మూలాని మధురాణిచ, స్వయ మాస్వాద్య మాధుర్యం పరీక్ష్య పరిభక్ష్యచ, పశ్చాన్నివేద యామాస రాఘవాభ్యాం దృఢవ్రతా, ఫలాన్యాస్వాద్య కాకుత్ స్థస్తస్యై ముక్తిం పరాందదౌ"[7] - శబరి రామునకభిముఖముగ పోయి, వందనమొనర్చి దర్భాసనముపై కూర్చుండజేసి, పాదములు కడిగి, పాప వినాశకమైన, యా జలములను తలపై చల్లుకొని, పానము చేసి, అడవిలో లభించు పూలతో నర్చించెను. చక్కగా పండిన పండ్లను, తియ్యని దుంపలను ఎంపిక చేసి మాధుర్య పరీక్షకై తొలుత వానిని రుచి చూచి తరువాత వానిని రామ లక్ష్మణులకు నివేదించెను. రాముడును శబరి యిచ్చిన పండ్లు తిని, యామె కుత్కృష్టమైన ముక్తి నొసగెను.

"ఏవ ముక్తస్సధర్మాత్మా శబర్యా శబరీమిదమ్, రాఘవః ప్రాహ విజ్ఞానే తాం నిత్య మబహిష్కృతామ్"[8] - అని శబరి చెప్పగా ధర్మాత్ముడగు రాముడామె హీన జాతియయ్యు ఆచార్యానుగ్రహముచే బ్రహ్మ జ్ఞానమునకు దూరముగాక దానినే యను సంధించుచున్న దానినిగా తెలిసికొని యిట్లనెను. ఇక్కడ ఒక ముఖ్య విషయం

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | వాల్మీకి రామాయణము - అరణ్య కాండము | | | పుట 564, | శ్లోకము 12. |
| 2. | " | " | " | పుట 564,565, | శ్లోకము 13. |
| 3,4,5 | " | " | " | పుట 565 | శ్లోకము 14,15,16. |
| 6,7 | " | " | " | పుట 566 | శ్లోకము 17. |
| 8. | " | " | " | పుట 566 | శ్లోకము 18 - 74 వ సర్గము. |

గ్రహించాలి. శబరిని హీనజాతి స్త్రీగా వాల్మీకి రామాయణంలో చెప్పడం జరిగింది. కాని భగవంతుని దృష్టిలో అందరూ సమానమే. ఈ కులాలు, మతాలు మనం ఏర్పరుచుకున్నవే. వర్ణ వ్యవస్థ సమాజం అభివృద్ధికి ఒక రకంగా అడ్డుకట్టే శబరి అరణ్యాల్లో జీవించడానికి కారణం ఆనాటి వర్ణ వ్యవస్థ అని చెప్పవచ్చు. సమాజానికి దూరంగా అందరితోను కలిసి ఆమె జీవించలేదు. కాని ఆమెను వెతుక్కుంటు భగవంతుడైన శ్రీరామచంద్రుడే ఆమె వద్దకు వచ్చాడు. అది ఆమెకున్న ఉత్తమమైన భక్తికి నిదర్శనం. బ్రహ్మ జ్ఞానం పొందడానికి కులాలు ప్రధానం కాదు. బ్రహ్మ జ్ఞానం పొందిన వారే బ్రాహ్మణులు. అంతే గాని కుల ప్రధానంగా బ్రహ్మ జ్ఞానం పొందిన వారనడానికి వీలులేదు. ఎవరైతే బ్రహ్మజ్ఞానం పొంది, భగవత్తత్వాన్ని తెలుసుకుంటారో వారే బ్రాహ్మణులు. ఒక రకంగా శబరిని సమాజం నీచ కులానికి చెందిందిగా భావించి వెలి వేసినా, ఆమె ఉత్తమోత్తమమైన శ్రీరామ దర్శనం పొందింది.

"దశోస్తకాశాత్తత్వేన ప్రభావంతే మహాత్మనః, శ్రుతం ప్రత్యక్ష మిచ్ఛామి సంద్రష్టుం యది మన్యసే"[1] - మహాత్ముడగు మీ ఆచార్యుడు మతంగ మహర్షి ప్రభావమును నేను కంబంధుని వలన విని యుంటిని. నీ కాయన ప్రభావము చూపుటంగీ కార్యమగుచో, నేను దానిని ప్రత్యక్షముగ చూడగోరుచున్నాను.

### 4.7.2.7.1.1. "మతంగ మహాముని గొప్పతనం" :

"ఏతత్తు వచనం శ్రుత్వా రామ వక్త్రాద్వి నిస్సృతమ్, శబరీ దర్శయామాస తావు భౌతద్వనం మహత్"[2]. రాముని నోటి నుండి యా వాక్యము వెలువడగానే శబరి యా మహా వనమెల్ల వారికి చూపెను.

"పశ్య మేఘ ఘన ప్రఖ్యం మృగ పక్షి సమాకులమ్, మతంగ వనమిత్యేవ విశ్రుతం రఘునందన !"[3] రామా ! గొప్ప మేఘముల వలె కన్పట్టుచు, మృగములతో, పక్షులతో వ్యాప్తమైన యీ వనము మతంగ వనమనియే ప్రసిద్ధము.

"ఇహతే భావితాత్మనో గురవోమే మహావనే, జుహవాంచక్రిరే తీర్థం మంత్రవన్మంత్ర పూజితమ్"[4] - మహా తేజశ్శాలీ ! పరమాత్మ విదులగు మా గురువులు మంత్ర వేత్తల మంత్రములచే పవిత్రమైన గంగానదీ పుణ్య జలముల నిచట కావాహన చేసిరి.

"ఇయం ప్రత్యక్ స్థలీ వేదిర్యత్ర తే మే సుసత్కృతాః, పుష్పోపహారం కుర్వంతి శ్రమా దుద్వేపిభిః కరైః"[5] - ఇదే పశ్చిమ ప్రదేశమున నున్నతముగా కల్పితమైన దేవ పూజా స్థానమగు వేదిక యున్నది. దీనిని చూడుము. ఇచటనే మాన్యులగు నా గురువులు, వార్ధక శ్రమచే పూవులు గూడ ధరించుట కశక్తములై వడకుచున్న చేతులతో పుష్పార్చన చేసెడివారు.

"తేషాం తపః ప్రభావేన పశ్యాద్యాపి రఘూద్వహ ! ద్యోతయంతి దిశస్సర్వాశ్రయా వేద్యోతుల ప్రభాః"[6] - రామా ! వారి తపః ప్రభావముచే నిప్పటికిని వేదికలు కాంతులు వెదజల్లుచు, ప్రకాశముచే దిక్కుల నన్నింటిని ప్రకాశింప జేయుచున్నవి.

"అశక్ను వద్భిస్తైర్గంతు ముపవాస శ్రమాలసైః, చింతితే భ్యాగతాన్పశ్య సహితాం త్సప్త సాగరాన్"[7] - నా గురువులుపవసించుటచే శ్రమనొంది యలసి పోవుటకు శక్తి చాలక, తలంచినంత మాత్రముననే సప్త సముద్రములును వారి యాశ్రమమునకే వచ్చినవి చూడుము.

"కృతాభిషేకై స్తైర్న్యస్తా వల్కలాః పాద పేష్విహ, అద్యాపి నావశుష్యంతి ప్రదేశే రఘునందన !"[8] - రామా! వారీ సప్త సముద్రములందు స్నానము చేసి చెట్ల కొమ వైచిన నార వస్త్రములు వారి శరీర సంపర్క మహిమచే నిప్పటికిని యారకున్నవి.

1. వాల్మీకి రామాయణము - అరణ్యకాండము 74 సర్గ పుట 567, శ్లోకం 19.
2,3,4,5 . " " " " " పుట 567, శ్లోకం 20,21,22,23.
6,7,8. " " " " " పుట 568, శ్లోకం 24,25,26 .

"దేవ కార్యాణి కుర్వద్భిర్యానీ మాని కృతాని వై, పుష్పైః కువలయైస్సార్థం మ్లానత్వం నోపయుంతివై"[1] - దేవ కార్యమునకై వారు కలువలు, తక్కిన పూలతో కట్టిన మాలలు నేటికిని (పరమ భక్తితో సమర్పింపబడిన కారణముచే) వాడక యట్లే యున్నవి.

"కృత్స్నం వనమిదం దృష్ట్వ శ్రోతవ్యం చశ్రుతుత్వయా, తదిచ్ఛామ్యభ్యనుజ్ఞాతా త్యక్తుమే తత్కళేబరమ్"[2] - కావున రామా ! నీవీ వన మంతయు చూచితివి. వినదగినది యెల్ల నేను చెప్పగా వింటిని. నేనింక నీ యనుమతితో నీ కళేబరము విడువ నిచ్ఛగించు చున్నాను.

"తేషామిచ్ఛామ్యహం గంతుం సమీపం భావితాత్మనామ్, మునీనా మాశ్రయో యేషా మహంచ పరిచారిణీ"[3] - నేను పరమాత్మ నిష్ఠులగు ఏ మునుల దీయాశ్రమమో ఆ మునులకు పరిచర్య చేసిన దాననగుటచే వారి చెంతకే పోగోరుచున్నాను.

"ధర్మిష్ఠంతు వచశ్శ్రుత్వా రాఘవ స్సహ లక్ష్మణః, ప్రహర్షమతులం లేభే ఆశ్చర్యమితి తత్త్వతః"[4] - ధర్మ సమ్మతమైన ఆచార్య వైభవమును ప్రదర్శించిన శబరి వాక్యము విని ఆమె యమాయక వర్తనమున కా రామలక్ష్మణులు ఆశ్చర్యము నొందిరి.

"తమువాచతతో రామశ్శ్రమణీం సంశిత వ్రతామ్, అర్చితోహం త్వయా భక్త్యా గచ్ఛకామం యథా సుఖమ్"[5] - అంత నాచార్య సేవయే దృఢ వ్రతముగా గల యా సన్యాసినితో రాముడిట్లనెను. నీవు నన్ను భక్తితో నర్చించితివి. నీవింక కోరిన లోకమునకు సుఖముగా పొమ్ము.

"ఇత్యుక్తా జటిలా వృద్ధా చీర కృష్ణా జినాంబరా, తస్మిన్ముహూర్తే శబరీ దేహం జీర్ణం జిహాసతీ"[6]

"అనుజ్ఞాతా తు రామేణ హుత్వా త్మానం హుతాశనే, జ్వల త్పావక సంకాశా స్వర్గమేవ జగామసా"[7] - అని రాముడు పలుకగా జడలు దాల్చి, వల్కలములు కట్టిన యా ముదుసలి యగు శబరి రామునను జ్ఞ వడసి యా క్షణముననే జీర్ణమైన తన దేహము విడువ గోరి, దాని నగ్ని యందు వ్రేల్చి ప్రజ్వరిల్లు అగ్ని వలె నున్న దివ్య దేహముతో స్వర్గమున కేగెను.

"దివ్యాభరణ సంయుక్తా దివ్యమాల్యాను లేపనా, దివ్యాంబర ధరా తత్ర బభూవ ప్రియ దర్శనా, విరాజయంతీ, తం దేశం విద్యుత్సౌదామినీ యథా"[8] - ఆ శబరి దివ్యాభరణములను దాల్చి, దివ్యములగు మాలలు, చందనాదులు ధరించి, దివ్య వస్త్రములు గట్టుకొని తళుకొత్తు మెఱుపు తీగ వలె చూచు వారికి ప్రీతి కలిగించెను.

"యత్రతే సుకృతాత్మానో విహరంతి మహర్షయః , తత్పుణ్యం శబరీ స్థానం జగామాత్మ సమాధినా"[9] - పుణ్య మూర్తులగు నా మతంగ ముని శిష్యులగు మహర్షులు విహరించుచున్న యా పవిత్ర ప్రదేశమునకు తన యాత్మ స్వరూప విషయకమగు సమాధి బలముచే నా శబరి పోయెను. మరి ఇంతటి మహిమాన్వితమైన, పవిత్రమైన శబరి మాత నదీమ తల్లిగా ఈ భువిని అవతరించి మానవాళి పాపాలు తొలగింపజేసి, వారిని పుణ్య ప్రదులుగా చేసి తరింపజేస్తున్నది. ఆ శబరి రామభక్తురాలైనందు వల్లనే భద్రాద్రి యందు శబరీ నదిగా అవతరించి ఖ్యాతి గడించింది. ఇంతటి పరమ పవిత్రురాలైన, రామభక్తిలో ఓలలాడిన "మహాసాధ్వి" శబరి. అందుకే రామదాసు కూడా తన కీర్తనల్లో శబరి గుణ గణాలను, ఆమె రామభక్తిని ప్రస్తుతించాడు.

---

1. వాల్మీకి రామాయణము - అరణ్య కాండము , 74వ సర్గ పుట 568, శ్లోకము 27.
2. " " " " " " పుట 569, శ్లోకము 28.
3,4,5 " " " " " " పుట 569, శ్లోకము 29,30,31.
67,8,9 " " " " " " పుట 570, శ్లోకము 32, 33,34,35.

### 4.7.2.7.2. రామదాసు స్తుతించిన శబరి :

"ఎన్నగాను శబరి యెంగిలి భక్షణము చేసినట్టి వ్యభిచారి వీవు
నిన్ను నమ్మగరాదు నిను దైవమనరాదు నిజమూ నామాటలు రామా ![1] - ఇందు నిందా స్తుతి ఉంది. రాముని నిందించినట్లు పైకి కనిపించినా, రాముని గూర్చి ఆ శ్రీరాముడు శబరి ఎంగిలి పండ్లను ప్రేమతో తిన్న గొప్పవాడని, శబరిని తనలో చేర్చుకొన్న మహానుభావుడని, రాముని కీర్తించాడు. రామదాసు ఖైదులో ఉండి ఆలపించిన కీర్తనలోనిది ఈ చరణం.

"ఆశ పుట్టెనే శ్రీరాములతో - నావశ! పుట్టనైతిని! అనే రామాయణేతి వృత్త ప్రధానమైన సుదీర్ఘ కీర్తనలో- ఇంపుగ శబరి విందుల నిష్టముతో జేసి - యింద్ర సుతు సోదరుని హితవు గావించి[2]. . ." అని అంటాడు. తానే ఆనాడు పుట్టి వుంటే శబరితో కూడి రామునికి విందులు చేసెడి వాడను కదా! అని వాపోతున్నాడు రామదాసు. శబరి వలె తాను కూడా రామునికి స్వయంగా సేవలు, పరిచర్యలు చేయాలన్న తపన రామదాసులో కనబడుతుంది. "రామచంద్రా నన్నేలేవో, రక్షించేవో నేనేమెరుగా" అనే కీర్తనలో లీలలో శబరి వలె లాలించి విందిడనేరా"[3] అని అంటాడు రామదాసు. రామా ! నేను నీకు ఎటువంటి సేవ చేయలేని అసహాయ స్థితిలో ఈ ఖైదులో ఉన్నాను, నన్ను కాపాడు. శబరి వలె నిన్ను లాలించి, వాత్సల్యంతో నీకు విందు చేయలేని స్థితిలో నేనున్నానే ! అని దీనంగా అంటున్నాడు. రాముని ప్రార్థించాడు. కారాగారంలో ఉండగా ఆలపించిన కీర్తన ఇది. రామదాసు రచించిన రామాయణేతివృత్తం ప్రధానమైన సంస్కృత చూర్ణిక యందు

"శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండ భాండ...... అనే చూర్ణికలో "శబర్యుపదేశ పంపాతట హనుమత్సుగ్రీవ సంభాషిత[4]. . . . " అని శబరికి ఉపదేశాన్ని రాముడొసంగెనని, శబరికి రామ సాయుజ్యాన్ని ప్రసాదించాడని ప్రస్తావింపబడింది. ఈ చూర్ణిక సుదీర్ఘమైంది. దాశరథీ శతకంలో కూడా గోపన్న శబరి గాథను పద్యాల్లో ప్రస్తావించి, కీర్తించాడు.

"పాతకులైన మీ కృపకు బాత్రులు కారెతలంచి చూడ ది
ట్రాతికి గల్గె బావనమరాతికి రాజ్య సుఖంబు గల్గె దు
ర్జాతికి, బుణ్యమబ్బె గపిజాతి మహత్త్వము నొందె గావునం
దాతవ యెట్టి వారలకు దాశరథీ కరుణాపయోనిధీ"[5]

దశరథ రామా ! పాపాత్ములైనను మీ కృపకు పాత్రులైయున్నారు. ఎట్లనగా, రాయిగా నుండిన అహల్య నీ పాద రజముచే నిజ రూపమొంది కృతార్థురాలైనది. పగవారి వర్గములో జేరిన విభీషణుడు నీవలన లంకా రాజ్యము నొందినాడు. జటాయువు, శబరి మొదలయిన తక్కువ జాతులకును నీ యనుగ్రహము గలిగినది సుగ్రీవాదులైన వానరులకు గూడ మహత్త్వము గలిగినది. ఇవన్నియు జూడగా నీవు ఎక్కువలు తక్కువలు పాటింపక ఎట్టి వారికైనా కోరిన కోర్కుల నిచ్చు దాతవని తెలియుచున్నది. నా కోర్కెయు నొసంగుమా. మరొక పద్యంలో శబరి గూర్చి ప్రస్తావించాడు.

"దాసిన చుట్ట మాశబరి దానిదయామతి నేలినావు, నీ
దాసుని దాసుడా గుహుడు తావక దాస్యమొసంగినావు నే
జేసిన పాపమో! వినుతి చేసిన గావవు గావుమయ్యా
దాసులలోన నేనొకండ దాశరథీ కరుణాపయోనిధీ"[6]

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 12, కీర్తన 13.
2. " " " " " " " పుట 20, కీర్తన 17.
3. " " " " " " " పుట 110, కీర్తన 132.
4. భక్త రామదాసు రచించిన చతుర్వింశతి నామ ప్రతిపాదక చూర్ణిక - సంస్కృతం, పుట 177 కీర్తన 198.
5. దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న, పుట 41, పద్యం 52.
6. " " " " పుట 42, పద్యం 54.

రామా ! శబరి నీకు దగ్గర చుట్టము కాకపోయి నను దానిని దయతో గాపాడితివి, గుహుడు నీ దాసునిని గూడ దాసుడు గాడు, కాకపోయినను దాసునిగా జేసికొంటివి. నేను నీ దాస వర్గములో ఒకడుగా నున్నాడను, మరియు, నిన్ను స్తోత్రము చేసినను నేను చేసికొన్న పాపమేమో కాని నన్ను గాపాడవు. ఇకనయినను కాపాడుమా. మరో పద్యంలో కూడా శబరి రామభక్తిని ఈ విధంగా ప్రస్తావించాడు.

"ఎంతటి పుణ్యమో శబరి యెంగిలి గొంటివి వింతగాదె నీ
మంతన మెట్టిదో యుడుతమైని కరాగ్రనఖాంకురంబులన్
సంతసమంద జేసితివి సత్కుల జన్మములేమి లెక్కవే
దాంతముగాదె నీ మహిమ దాశరథీ కరుణాపయోనిధీ"[1]

శబరి యెంగిలిని తింటివి. అది యెంత పుణ్యము చేసికొన్నదో ఆశ్చర్యముగా నున్నది. ఉడుతయైని ముని గోళ్ళతో గీటి సంతోషపెట్టితివి. దానిపై నింత వాత్సల్యము గలుగుటకు రహస్యమేమో తెలియకున్నది. విచారించి చూడగా నీవు జాతిని కులమును పాటించు వాడవు కావు. ఔను నీ మహత్వము వేదాంత ప్రతిపాద్యమగునంత విస్తరమైంది. కాన నిరక్షణమునకు, శిక్షణమునకును కారణములు మము బోటులకు తెలియవు. ఈ విధంగా రామదాసు తన కీర్తనల్లోను, దాశరథీ శతకంలోను శబరి గూర్చి, ఆమె రామభక్తిని గూర్చి ప్రస్తావించాడు. ఇటువంటి పవిత్రమైన శబరి నదీ రూపంలో భద్రాచలం నందు వెలసింది. ఈ శబరీ నది పుణ్య నదిగా కీర్తి గడించింది. భక్తులు ఆ నదిలో స్నానమాచరించి తరిస్తుంటారు.

ఇది భద్రాచల క్షేత్ర మహాత్మ్యం, విశేషాలు, భద్రాచలంలో ఉన్న ఒక ప్రదేశంలో పర్ణశాల ఉంది. అదే రామలక్ష్మణులు సీతాదేవి నివసించిందిగా చెప్తారు. వాల్మీకి రామాయణంలో భద్రునిగాథ లేదు. ఇక భద్ర అనే పదానికి గల విశేషాంశాలు, ఆ పద నిర్వచనం, ఆపద ప్రాశస్త్యాన్ని తెలుసుకుందాం. భద్రాద్రి రాముడి విశిష్టతను ఎందరో కవులు, విమర్శకులు ఈ విధంగా తెలియజేశారు.

### 4.7.3.1. భద్రాద్రి రాముడు స్వరూపం- విశిష్టత -భద్రం పద నిర్వచనం :

"స్వశ్రేయసం శివం భద్రం కల్యాణం మంగళం శుభం". భద్రం అనే పదాన్ని ఈ విధంగా నిర్వచించడం జరిగింది. ఈ వాక్యంలో భద్రమనే పదం మధ్యలో ఉంది. అనగా భద్రం భద్రంగా ఉందని అర్థం. అది భద్రంగా ఉంది . కనుక యావద్విశ్వాన్ని భద్రంగా ఉండేలా చేస్తుంది. రాముడు రామభద్రుడుగా పిలువబడింది ఇక్కడే. భద్రాచల రాముడుగా, భద్ర రాముడుగా అయింది ఇక్కడే. కనుకనే శ్రీరాముని

"రామాయ రామ భద్రాయ రామ చంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః" అని ప్రార్థిస్తాము. లోకమును రంజింపజేయు మంగళ కరమూర్తి అయినందున శ్రీరాముడు రామభద్రుడని పిలువబడినాడు. ప్రపంచాన్నంతా భద్రంగా చూస్తున్న రామభద్రుడు భద్రాచలంలోనే కొలువైనాడు.[2] శ్రీరాముని దివ్య పాద స్పర్శతో గౌతమీ తీరాలన్నీ పావనమయ్యాయి. సీతమ్మను అన్వేషిస్తూ గోదావరీ తీరం పొడువునా శ్రీరాముని పవిత్ర చరణములు చరించాయి. పరమ పవిత్రత చేకూరింది ఈ కారణం చేతనే.[3]

భద్రమనే శబ్దానికి నిఘంటువు ఇలా అర్థం చెప్పింది.

---

1. దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న - పద్యం 98, పుట 76.
2. పలుకే బంగారం - వ్యాసం స్వామి సుందర చైతన్యానంద పుట 49(గిరిధారి స్వర్ణోత్సవ సంచిక , జనవరి/ఫిబ్రవరి 98.
3. " " " " " " పుట 50 " " " "

"అందరూ భద్రంగా ఉండాలి. ఇది భద్రాన్ని ప్రసాదించే స్థలం. భద్రమనే శబ్దం మధ్యలో ఉంది. ఈ క్షేత్రం పేరు భద్రగిరి. ఇదెప్పుడూ భద్రంగా ఉండాలి. కల్యాణంగా ఉండాలి. నిత్య కల్యాణంగా , మంగళకరంగా, శుభంగా ఉండాలి. ఇక్కడ నివసించేవారు, ఇక్కడికి వచ్చి దేవుని దర్శించేవారు అందరూ భద్రంగా ఉండాలి. ఈ క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీరామభద్రుల అనుగ్రహం చేత ప్రపంచమంతా కూడా భద్రంగా ఉండాలి. ఒక్క జీవుడు, ఒక్క కుటుంబం, ఒక వూరు, వీటిని కాపాడడానికి మాత్రమే కాదు పరమేశ్వరుడు భద్రుడు అను పేరు వహించింది. ప్రపంచమంతటికీ భద్రాన్ని అనుగ్రహించే స్థలమిది. ఇది ఉత్తరోత్తరా ఇంకా అభివృద్ధి కావాలి. రామాయణంలో ముఖ్యపాత్ర సీతా మహాలక్ష్మి. మా జానకి చెట్ట బట్టగా మహారాజువైతివి. అని త్యాగరాజు రాముని గూర్చి అన్నాడు. శ్రీరాముడిక్కడ సీతను వామ భాగంలో పెట్టుకొని ఆవిర్భవించాడు. ప్రపంచంలో మనమందరం ఆ మహాతల్లి బిడ్డలమే. ఆ తల్లే మనలనందరినీ సృష్టించింది".[1]

### 4.7.3.1. భద్రాద్రి రామ స్వరూపం :

శివావతారులైన ఆదిశంకర భగవత్పాదాచార్యులు తమ శ్రీరామ కర్ణామృత గ్రంథంలో

*"వామాంక స్థిత జానకీ పరిలసత్కోదండంకరే*
*చక్రంచోర్ధ్వకరేణ బాహు యుగళే శంఖం వరం దక్షిణే*
*బిభ్రాణం జలజాత పత్ర నయనం భద్రాద్రి మూర్ధ్ని స్థితం*
*కేయూరాది విభూషితం రఘుపతిం సౌమిత్రి యుక్తం భజే"*[2]

'వామాంక స్థిత' అని భద్రగిరీశ్వరుని స్వరూపం వర్ణించడం చేత వారీ క్షేత్రాన్ని దర్శించారని స్పష్టమౌతుంది. భద్రాచలమున శ్రీరాముడు రాముని వలె ధనుర్బాణములు ధరించియు, నారాయణుని వలె శంఖ చక్రములు గూడ ధరించి చతుర్భుజుడై కనిపించును. సీత వామాంక స్థితమై యుండ భయ నివారణ చిహ్నముగా గుడి చేత శంఖమును ధరించి యతడు పద్మాసనమున నుండును. ఉత్సవ మూర్తులందు సీతా లక్ష్మణులాతని కిరు పార్శ్వములందున్నను మూల మూర్తులలో నిరువురును వామ పార్శ్వముననే కనిపింతురు. అ,ఉ,మ్ అను అక్షరముల సంపుటిచే ఓంకారం ఏర్పడును. అకారము, పరమాత్మ (శ్రీరాముడు) మకారము జీవాత్మ (లక్ష్మణుడు) వారిరువురి నడుమ ఉకార వాచ్యమగు సీతా మహాలక్ష్మి గోచరించును. పై స్థితిని కొందరీ విధంగా వ్యాఖ్యానింతురు. దండకాటవిని జరించుచు రక్కసుల బారి నుండి తమ్ము రక్షింప వాగ్దానమొనరించిన శ్రీరాముని మునులు శ్రీమన్నారాయణునిగా భావించారు. అందుచేతనే భద్రాచలమున రాముడు శ్రీమన్నారాయణ రూపమున వెలసెనని యభిజ్ఞులు చెప్పుదురు.'[3]

'భద్రాద్రి రాముడు వేదోక్త దైవము'[4] అనే వ్యాసంలో శ్రీ పాడిచేటి రామచంద్రాచార్యులు, భద్రాద్రి రాముని విశిష్టతను గూర్చి ఈ విధంగా తెలియజేశారు.

"వేద వేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే:
వేదం ప్రాచేత సాదాసీత్సా క్షాద్రామాయణాత్మనా:"

"వేద వేద్యుడైన పరమ పురుషుడైన శ్రీమన్నారాయణమూర్తియే శ్రీరామభద్రునిగా ఇలను అవతరించాడు. వేదమే సాక్షాత్తు శ్రీమద్రామాయణముగా ఆవిర్భవించినది. ఆ శ్రీరామచంద్రుడు తిరు

1. దాసుడిరీ దాసుడైన దాశరథి - పుట 18, కంచికామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతి, "భద్రాద్రి సీతారామ చంద్రప్రభువు ఉత్సవ సంచిక, భద్రాచల దేవస్థానం , వాగ్గేయకార మహోత్సవ సంచిక.
2. భద్రాద్రి శ్రీరామ కల్యాణ మహోత్సవము -భద్రగిరి చరితము.
3. శ్రీ భద్రాచల క్షేత్రము - దివాకర్ల వేంకటావధాని, శ్రీ భద్రాచల క్షేత్ర మాహాత్మ్యము,సంపా: డి. సుదర్శన్ - పుట 14.
4. భద్రాద్రి సీతారామ చంద్ర ప్రభువు ఉత్సవ సంచిక, భద్రాచల దేవస్థానము పుట 29-30.

గాడిన ప్రదేశమే దండకారణ్యము. పరమ పావనిమైన గౌతమీ నదిచే పరివృతమై, పరమ పదధాముడే శ్రీరామ భద్రుడుగా వెలసిన క్షేత్రమే భద్రాద్రి." "భద్రాద్రిపై అర్చారూపంలో వెలసి అతి మానుష రూపాన్ని సంతరించుకొన్న రాముడే వేదోక్త దైవం. కృతయుగం నందు మేరువు తన తపః ఫలంగా భద్రుడు, నీలుడు అనే ఇరువురు భక్త శిఖామణులను పుత్రులుగా పొంది, కృతార్థుడైనాడు. భద్రుని అచల స్వరూపమే ఈ భద్రాచలం.

ఈ క్రింది వేద మంత్రం స్వామి దర్శన భాగ్యమబ్బిన భద్రునిచే స్తుతింపబడిన మంత్రంగా పెద్దలు చెప్తారు.

*"ఓం భద్రో భద్రయా సచమానతిగా*
*త్స్వసారం జారో అభ్యేతి పశ్చాత్,*
*సుప్రకేతైర్ద్యుభిరగ్ని ర్వితిష్ఠ*
*న్నుశద్భిర్వర్ణై రభి రామ మాస్థాత్.*

ఓ! మహాత్మా! నీవు సీత చేత ప్రేమింపబడి, సీతను పరిణయమాడితివి. పితృ వాక్య పరిపాలనార్థము అరణ్యముల కేగితివి. అచట సీతను జారుడగు రావణుడపహరించెను. నీవు హనుమంతుడాదిగా గల వీరుల సాహాయ్యమున రావణుని సంహరించి సీతచే అగ్ని ప్రమాణము చేయించి, లోకమున కామెను పూత చరిత్రగా నెరింగింప జేసి, ఆ సీతను చేపట్టి లోక కల్యాణము చేసినావు. అని స్థూలంగా పై మంత్రార్థం. దీనిచే భద్రాద్రి రాముడు వేదోక్త దైవంగా నెరుంగ వచ్చును. సాక్షాత్తు మూర్తీభవించిన వేదమే భద్రాచల రాముడు. ప్రణవమే సర్వ వేద సారం. ఈ విషయాన్నే శ్రీ పరాశర భట్టరు వారు కూడా తమ 'అష్టశ్లోకి' యందు ఈ విధంగా తెలియజేశారు.

*" 'అ'కారార్థో విష్ణుర్జగదుదయ రక్షా ప్రళయ కృ*
*'న్మ'కారార్థో జీవ స్తదుపకరణం వైష్ణవమిదం!*
*'ఉ'కారో నన్యార్హం నియమయతి సంబంధ మనయో*
*స్త్రయీ సారస్త్రాత్మా 'ప్రణవ' ఇవ మర్థం న మదిశత్".*

అటువంటి ప్రణవ స్వరూపంగా స్వామి ఈ భద్రతలంపై వేంచేసియున్నాడు. అకార స్వరూపుడు రాముడు. ఉకార స్వరూపిణీయగు సర్వ మంగళదాయినియైన సీతా సాధ్వి. మకార వాచ్యుడు లక్ష్మణుడు. ఈ విధంగా మూడు వేదాల సారమైన మూడక్షరాలతో కూడిన అకార, ఉకార, మకార సమన్వయ స్వరూప జనితమైన ఓంకార స్వరూపంగా విశిష్టమైన ఆకార విశేషాలతో ఒప్పుచు భద్రగిరీశుడిక్కడ వెలసి యున్నాడు.

భద్రాద్రి రాముడు శంఖ, చక్ర, ధనుర్బాణాలతో, చతుర్భుజాలతో భద్రునికి సాక్షాత్కరించి తదాదిగా తనను సేవించు, భక్త జన కోటికి కైవల్యాన్ని అనుగ్రహిస్తున్నాడు. మరియొక విశేషమేమనగా స్వామి తన దక్షిణ హస్తమునందు నాద (వేద) స్వరూపమూ, జ్ఞాన ప్రదమూ అయిన శంఖం ధరించి చేతనుల అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి (బ్రహ్మ) జ్ఞానాన్ని ప్రసాదించి, తద్వారా మోక్షాన్ని అనుగ్రహిస్తున్నాడు. కలియుగంలో, జనులందరికీ కామితార్థాలను, కైవల్యాన్ని ప్రసాదించే వేదోక్తమైన, వేద స్వరూపమైన దైవమే సాక్షాత్తు శ్రీ భద్రాచల సీతా లక్ష్మణ సమేతుడైన రాముడు.

భద్రుడు నిల్చిన శిల శ్రీ సీతా రామ లక్ష్మణ మూర్తులుగా రూపొందింది. భద్రుని రూపమైన పర్వతమగుట వలన దీనికి భద్రాచలమనే పేరు కల్గింది.

*"రామభద్ర పదాంకత్వాత్ భద్రాద్రి*
*రితి విశ్రుతిః"* అనే శ్లోకాన్ని బట్టి శ్రీరామభద్రుని పాద చిహ్నాలను ధరించిందవటం చే దానికా పేరు కల్గినట్లు కొందరు చెప్తారు. ఈనాటికీ భద్రాచల దేవాలయ ప్రాంతంలో భద్రుని ఆలయమందున్న శిలపై

శ్రీరామ పాదాల చిహ్నాలు గోచరిస్తాయి. అవి రామ పాద చిహ్నాలుగా భక్తులచే పూజింపబడుచున్నాయి. భద్రాద్రిరాముడు 'రామనారాయణుని' గా ప్రఖ్యాతి గాంచినాడు. వైకుంఠరాముడు, రామనారాయణ రూపుడై వెలసిందక్కడ తప్ప మరెక్కడా లేదు. ఓంకార రూపులైన సీతారాములు ఈ దండకారణ్యంలో దేవఋషి గణాలచే పెక్కు వేల సంవత్సరాలనుండి ఆరాధింపబడుతూ పశ్చిమాభిముఖులై ఉన్నారు. ఇచ్చట గోదావరి దక్షిణ వాహినియై ప్రవహిస్తుంది."[1] అని విద్వాన్ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు గారు భద్రాద్రి రాముని స్వరూప, విశిష్టతల గూర్చి తెలియజేశారు. భద్రాద్రి రాముడు 'చతుర్భుజ రాముడు'. మరి ఇంతటి పరమ పవిత్రమైన భద్రాచల క్షేత్రం ఆధ్యాత్మికంగా ఎంతటి వైశిష్ట్యాన్ని సంతరించుకుందో, ఐతిహాసికంగా, చారిత్రకంగానూ అంత ప్రాధాన్యాన్ని పొందింది. ఈ భద్రాచల క్షేత్రం, చారిత్రాత్మకంగా ఏ విధంగా ప్రసిద్ధి పొందిందో పరిశీలించడం ముఖ్యం.

### 4.7.4. చారిత్రకంగా రామదాస నిర్మిత భద్రాచల క్షేత్ర ప్రాధాన్యం :-

పరమ భక్తాగ్రేసరుడు, రామ భక్తుడు, కవి శ్రేష్ఠుడు, వాగ్గేయకారుడూ ఐన కంచెర్ల గోపన్న, రామదాస బిరుదాంకితుడైన ఈతడు ఈ భద్రాచల క్షేత్రాన్ని ప్రసిద్ధం చేశాడు. 'తమ్మల దమ్మక్క' చే పూజింపబడిన శ్రీరామచంద్రుడు, కాలాంతరాన రామదాసుచే పూజలందుకుని, ఆయన చేత నిర్మింపబడ్డ ఆలయాన ఈ పవిత్రమైన క్షేత్రంలో వెలిశాడు. ప్రతిష్ఠింపబడినాడు. "శ్రీరామచంద్రుడు తెలుగు వారికి కన్నతండ్రి. సీతమ్మ కన్నతల్లి. తక్కిన దైవతాల కన్నా ఎక్కువగా సీతారామచంద్రులకే తెలుగువారి హృదాయాలర్పితాలైనాయి. సీతారామ లక్ష్మణులు వనవాసం చేసినపుడు కొంతకాలం ఆంధ్రమండలంలో విహరించినారు. పర్ణశాలా ప్రాంగణంలో పెంచిన లత కూనలకు సీతమ్మ నీళ్ళు పోసినపుడు రామ లక్ష్మణులు గోదావరీ జలాలనందించినారట."[2] అని బి. రామరాజు గారు రామునికి గల ప్రాముఖ్యాన్ని తెలియజేసినారు. "ఆంధ్రదేశ మందలి శ్రీరామ క్షేత్రములలో భద్రాచల మగ్రగణ్యము. మత త్రయము వారి చేతనే గాక మహమ్మదీయులైన గోలకొండ నవాబులచే కానుకలందుకొన్న వాడిచటి శ్రీరామచంద్రుడు. ప్రభుత్వము వారియనుమతి లేకుండ, చుట్టు ప్రాకారములు సొంపుగ కట్టించుకొని తన కొక కలికి తురాయి, సీతమ్మకొక చింతకు పతకము చేయించుకొని, అవతారమెత్తిన వాడిచటి శ్రీరామచంద్రుడు."[3] అని రామరాజు గారు తెలియజేసినారు.

"ఆనాడు ప్రభుత్వం వారి యనుమతి లేకున్నను ఈ రామదాసుచే రాముడు గుళ్ళు గోపురములు కట్టించుకొనినాడు."[4] గోదావరీ నది, దండకారణ్యం, పర్ణశాల ఇవన్నీ కూడా నేటి భద్రాచలం చేరువనే ఉన్నాయి. సీతారాము లరణ్యవాసం చేసినట్లుగా రామాయణం తెలియజేస్తుంది. గోదావరి, దండకారణ్య భూములు, ఇవన్నీ దాన్లో అక్కడక్కడా కవి వర్ణించిందే. మనుష్య లోకంలో మానవులుగా జన్మనెత్తిన భగవంతుని గూర్చి వ్రాసిన కథ. వాళ్ళు సంచరించిన ప్రాంతాలు ఈనాటికీ నమ్మదగినట్లుగా మనకు కనబడుతున్నాయి. భగవదవతారమైన వాళ్ళు కాబట్టి జనం వాళ్ళు మెట్టిన ప్రతి చోటూ పుణ్య స్థలంగా భావించి గుళ్ళు కట్టి ఆరాధించుకొంటున్నారు. ఈ విధంగా ఈనాటి భద్రాచలం చాలా ముఖ్యమైంది.

ఆశలను పెంచే విషయ సుఖాలను కాలదన్ని శాశ్వత సుఖానికి లక్ష్యంగా నిలిచిన వాడు శ్రీరామ చంద్రుడు. శ్రీరామ చంద్రుడి ఆలయమే భద్రాద్రిపై నున్న గుడి. గోదావరి తల్లి చల్లగా, నెమ్మదిగా, విశాలంగా పారుతుంటే ఆ పక్కన ఈ భూమికి అభయ హస్తమిచ్చి, తన చూపుల వెల్లునిచ్చి, తన ఆదర్శపు జీవనమిచ్చి మనకోసం శాశ్వతంగా అక్కడ నిల్చాడు.

1. భద్రాద్రి రామ ప్రభువు చరిత్ర - స్తుతిమాల. విద్వాన్ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు. ప్రకాశకులు - జగ్గయ్యపూడి వేంకటేశ్వర్లు అన్న భారతి ప్రచురణలు.
2. తెలుగు వారి సంస్కృతి శ్రీరామ సాహిత్యం - బి. రామరాజు. (శ్రీరామ నామ మహిమ - శ్రీరామ సాహిత్యం) పుట 41- 42. సం. డి. సుదర్శన్.
3. " " " " " " "
4. " " " " " పుట 45. "

విశ్వ సాహిత్యానికి ఆది కావ్యం రామాయణం. పుడమిలో ప్రప్రథమంగా కవిత్వం మానుషార్థిలో పుట్టింది. కవి చక్రవర్తి శోకం శ్లోకమై మహాకావ్యమైంది. శ్రీరామ చంద్రమూర్తి తెలుగువారల ఆరాధ్య దైవం, ఆదర్శమూర్తి. భారతీయ సంస్కృతీ సర్వస్వానికి ప్రతీక. భారతీయ స్త్రీత్వాన్ని మూర్తీభవింపజేసుకున్న మహామాత సీత. అటువంటి మహానుభావులైన పుణ్య దంపతుల చరణ ధూళిలో పవిత్రమైంది కనుకనే భద్రాద్రికి అంతటి ప్రాధాన్యం. గౌతమీ నదీ పవిత్ర తరంగాలు అజస్రమూ భద్రాచల క్షేత్ర మాహాత్మ్యాన్ని గానం చేస్తుంటాయి.

రామదాసు - అవ్యాజమైన అద్వితీయమైన అద్భుతమైన భక్తి పారవశ్యంతో తనను తాను భగవదర్పణం కావించుకోగలిగిన మహా భక్తుడు. ఆయన ఏనాడు నిర్మించాడో ఆ ఆలయాన్ని. వందల సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. మార్పులు వచ్చాయి. పరిసరాలు మారాయి. ప్రభుత్వాలు పోయాయి. కాని ఈనాటికీ మహాభక్తుడు రామదాసు భక్తి గీతాలు భద్రాద్రిలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆయన తంబూరా నాదాల ఝుంకృతులు ఇప్పటికీ మంద మందంగా మధురంగా, శ్రుతిపేయంగా వినిపిస్తుంటాయి విన గలిగినవారికి.

భగవద్భక్తి అనురాగం లేని బ్రతుకు తోలు తిత్తితో సమానమని మహాత్ముడు కబీర్‌దాస్ పేర్కొన్నాడు. శ్వాసించడం ఒక్కటే మనిషి జీవించి ఉండడానికి నిదర్శనం కాదు. అదే అనుకుంటే కమ్మరి వాని తిత్తి సైతం నిశ్వసించగలుగుతుంది కదా అన్నాడు కబీర్. భక్తి తత్త్వాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని తరించిన మహాభక్తుడు గోపన్న. అంతటి భక్తాగ్రణి నిర్మించినాడు కనుకనే క్షేత్ర మహిమ నానాటికీ ద్విగుణీకృతమౌతుంది. భగవంతుని వల్ల భక్తునికే కాదు, భక్తుని వల్ల భగవంతునికి కూడా ప్రశస్తి. మహాభక్తుడైన భద్రునికి భగవంతుడు ప్రత్యక్షమై -

"వసామి శిఖరే భద్రే తవయావద్ధరిష్యతి

భూమిర్భూతాని కల్పాంతే మత్సాయుజ్యమవాప్ససి". అన్నాడు. నిజంగానే కల్పాంతాల వరకు భద్రాచల క్షేత్రం నిలిచి ఉండి మోక్షదాయకమవుతుందనడంలో ఎట్టి సందేహమూ లేదు."[1] అని శ్రీ హీరాలాల్ మోరియా భద్రాద్రి క్షేత్ర ప్రాధాన్యాన్ని, రామదాసు గొప్పతనాన్ని గూర్చి చక్కగా తెలియజేశారు. "పసి బాలుడైన ధ్రువునకు సమస్త వేద విజ్ఞానం, శాశ్వత పరమపదం అబ్బింది శంఖ స్పర్శ చేతనే గదా ! రామదాసుకు మోక్షమిచ్చిన శంఖ చక్ర ధారి యైన రాముడితడేకదా ![2]

శ్రీ ఎస్.టి.పి.వి. కూర్మాచార్యులు గారు గోపన్నచే నిర్మితమైన ఈ భద్రాద్రి ఆలయానికి, గోపన్నకు గల అవినాభావ సంబంధాన్ని, గోపన్న వలన ఆలయానికి గల్గిన ప్రాచుర్యాన్ని, ఆలయం వల్ల గోపన్నకు కల్గిన కీర్తి ప్రతిష్ఠలను గూర్చి ఈ విధంగా వివరించినారు. "మన గోపన్న భద్రాద్రి రాముణ్ణి కొలిచి రామదాసయినాడు. శ్రీరాముడు తండ్రి కోరికను మన్నించి వనవాస రాముడై గోదావరీ తీరాన వనవాసం చేశాడు. అట్టి వనవాస రాముణ్ణి, తన భక్తి ధాముణ్ణిగా ఎన్నుకొని గోపన్న కారాగార వాసుడైనాడు. భగవంతుడు కారడవుల వసిస్తే, భక్తుడు కారాగారంలో వసించాడు. ఆ వాసంలోనే గోపన్నను భక్తి ఆవేశించింది. ఆ ఆవేశం ఆలయం కట్టించిన నాటి కన్నా ఆవేదన పుట్టించినపుడే భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకుంది. అంతే కాదు గోపన్న చేసింది తప్పని రాజధర్మాన్ని నిర్వర్తించిన తానీషాకు గూడ శ్రీరాముని దర్శనం చేయించాడు. తానీషాకు శ్రీరామచంద్రుడొక్కడే పరమ భాగవతోత్తముడైన లక్ష్మన్నతో కూడా కనిపించాడు. ఇట్టి మహా మహిమ సంపన్నమై, దివ్య క్షేత్రమైన భద్రాచలానికి రామదాసు వలన ప్రసిద్ధి లభించింది."[3]

1. పుణ్య క్షేత్రం - భద్రాద్రి - శ్రీ హీరాలాల్ మోరియా.
2. భద్రాద్రి రాముడు - వేదోక్త వైనము - శ్రీ పాడిచేటి రామచంద్రాచార్యులు. పుట 30.
3. భద్రాద్రి సీతారామచంద్ర ప్రభువు ఉత్సవ సంచిక - భద్రాచల దేవస్థానం. పుట 76.
(మనఆలయాలు-వాగ్గేయకారులువ్యాసం - ఎస్.టి.పి.వి.కూర్మాచార్యులు)

ఈ సందర్భంగా శ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారు భద్రాచల రామునికి, రామదాసుకున్న అతీతమైన సంబంధం గూర్చి రమణీయంగా వివరించిన అంశాలను ప్రస్తావించవలసి ఉంది. వీరి వివరణ ఎన్నదగింది. "భద్రాచలం అనగానే రామదాసు మదిలో మెదుల్తాడు. రామదాసు అనగానే భద్రాచలం హృదిలో కదుల్తుంది. భద్రాచలం మహా క్షేత్రం. రామదాసు మహా భక్తుడు. గొప్పవైన రెండు పుణ్యాలు ఏకమై దర్శనమిస్తున్నట్లు అనిపిస్తుంది భద్రాచల రామదాసు అనే పేరు వినగానే. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జన్మించిన ఈ మహా భక్తుని పేరు గోపన్న కంచర్ల ఆయన ఇంటిపేరు. భద్రాచలంలో తహసీలుదారు ఉద్యోగం చేస్తూ ప్రభుత్వధనమును ఆలయ గోపుర ప్రాకారాది కార్యాలకు, భగవన్మూర్తుల అలంకారములకు వెచ్చించి దారుణమైన బాధలను కొని తెచ్చుకొని, వాటిని అనుభవించడంలోనే రామానుగ్రహమునే పొంది తరించిపోయిన దివ్యాత్ముడు రామదాసు. ధర్మావతార మూర్తి రామచంద్రుడు చరించిన పుణ్య గౌతమీ తీరాన గోపన్న రామదాసైనాడు. కవిగా రాణించాడు. భక్తుడుగా స్థిర పడ్డాడు. వాగ్గేయకారుడిగా శోభించాడు. శతక కవిగా కీర్తి గడించాడు. పేరుకు రామదాసే గాని, నిజం చెప్పాలంటే రామదాసుకి రాముడే దాసుడయ్యాడు. రామదాసు పంపినట్లు రాముడు తానీషా వద్దకు వెళ్లి డబ్బు చెల్లించాడు. తాను రామదాసు సేవకుడనని చెప్పకున్నాడు. భగవద్భక్తి భగవంతుని భక్తునికి దాసుణ్ణి చేస్తుంది అనే సత్యాన్ని రామదాసు భక్తిమయ జీవితం ధ్రువ పరచింది."

రామదాసుకు దాసుడైన శ్రీరామచంద్రుడు వెలిసిన క్షేత్రమే ఈ భద్రాచల క్షేత్రం. శ్రీ స్వామి సుందర చైతన్యులవారు మరో సందర్భంలో రాముడి ధర్మతత్పరత గూర్చి, ఆ ఆదర్శ రాముడి గూర్చి, మరియు అట్టి ఆదర్శవంతమైన జీవితం గడిపిన రాముని సేవించిన భక్తుడైన రామదాసు గూర్చి అత్యద్భుతంగా విశదీకరించినారు. "అన్నమాట అంటే ధర్మమున్నమాట. ధర్మమన్న మాట ధరణిలో చెల్లుమాట. అన్నమాట ఉన్నమాట అయినప్పుడే అది రత్నాల మూట. ఉన్నమాట సత్యం. అన్నమాట ధర్మం. 'ఉన్నది రాముడొక్కడే - ఊరకే చెడిపోకె మనసా !' అన్నాడు త్యాగరాజస్వామి. ఉన్న రామయ్య అన్నమాట ఎరుగడు మారుమాట. 'రామో ద్విర్నాభిభాషతే' - రాముడు రెండు మాటలెరుగడని ఒకే మాటగా పలికాడు వాల్మీకి."

అన్నమాటను నిలుపుకోవాలని ఆ మార్గంలో ఎన్ని ఆపదలెదురైనా సహించి సత్యాన్ని దర్శించాలని పట్టుదలతో జీవించి, తన ఆదర్శవంతమైన జీవితం ద్వారా ధర్మ మార్గంలో జీవించమని జనావళిచే 'అఆ' లు దిద్దించిన ధర్మాత్ముడు, దివ్యాత్ముడు శ్రీరాముడు. సర్వమానవులకు, సర్వకాలములకు, సమస్త దేశములకు ఆదర్శమూర్తి శ్రీరామచంద్రమూర్తి. "రామో రమన్తే యత్ర యోగిన:" - ఎవ్వరి యందు యోగులు రమింతురో అతడే రాముడు అని 'రామ రహస్యోపనిషత్.' రాముడు శరణాగతవత్సలుడు. ఆ దివ్యాత్ముని ఆశ్రయించిన రాయి, రప్ప, కప్ప, తిప్ప, కోతి, నాతి, నిప్ప, నీరు - అందరూ తరించి పోయారు. "భక్తజన సంరక్షణ దీక్షా కటాక్ష శుభోదయమ్మృద్ధ శ్రీహరిమ్" - భక్తజనులను సంరక్షించుట అనే దీక్షను పూనిన వాడు, శుభ గుణాలు సమృద్ధిగా గల శ్రీరామచంద్రుని సేవించుచున్నాను. అన్నాడు రామయణ చూర్ణికలో 'శ్రీభద్రాచల రామదాసు.'

మార్జాలమున్న యింటిలో పాడు చేసే మూషికాలుండవు. రాముడు ప్రవేశించిన హృదయంలో కాముడు ఉండలేడు. వైభవమున్న చోట వికరాలుండవు. మనో వికారాలుండవు. కనుక మనమందరమూ మార్జాలాన్ని ఆశ్రయించాలి. పిల్లి మన తల్లి కావాలి. మనం పిల్లి పిల్లలం కావాలి. అప్పుడే పిల్లి తన పిల్లల్ని విడువనట్టు పరమాత్మ మనల్ని వదలకుండా ఉంటాడు. ఇదే శరణాగత భావం. శాస్త్ర పరిభాషలో చెప్పాలంటే మార్జాల కిశోర న్యాయం.

1. పలుకే బంగారం (వ్యాసం) - శ్రీ స్వామి సుందర చైతన్యానంద - పుట 49-50. గిరిధారి- ఆధ్యాత్మిక మాస పత్రిక. జనవరి-ఫిబ్రవరి 1998 (సుందరచైతన్యాశ్రమం) స్వర్ణోత్సవ విశేష సంచిక - సంపా. స్వామి సుందర చైతన్యానంద. ధవళేశ్వరం. సర్వజ్ఞ కల్చరల్ ట్రస్టు.

" మనహే వికారీ స్థిరతా నయేరే
త్యాచే నిసంగే భ్రమతీ భలేరే
అపూర్వ కార్యా మనహే విటేనా
తుజ వీణ రామా మజ కంఠవేనా"

మనస్సు ఎప్పుడూ వికారమే. దానికి స్థిరత్వం లేదు. సంసారంలో తెగ తిరుగుతూ ఉంది. చేయరాని పనులు చేస్తున్నది. అయినా దానికి ఏ మాత్రం లజ్జలేదు. హే రామచంద్రా ! నీవు లేనిదే నేను కడతేరలేను. అని ప్రార్థించాడు మరాఠీ భాషలో సమర్థ రామదాస స్వామి. కామ శత్రువును జయించడానికి రామ కవచాన్ని ధరించాలి. క్రోధ శత్రువును నిరోధ స్వభావముతో ఓడించాలి. ఈ శక్తి నంతా నామమే ఇస్తుంది. రామనామమే ఇస్తుంది. రామ వైభవాన్ని, నామ మాహాత్మ్యాన్ని జీవితంలో దర్శించిన మహాభక్తులు, మహర్షులు కీర్తించన స్తోత్రాలు రామ స్వరూపాలై శోభిస్తున్నాయి.[1]

మరి ధర్మమార్గాన పయనించి, తండ్రి మాటను జవదాటక 14 ఏండ్లు అరణ్యవాసం చేసిన ధర్మమూర్తి రామచంద్రుని భక్తుడుగా రామదాసు కూడా రామచంద్రునికిచ్చిన మాట ప్రకారం భద్రాద్రిలో ఆలయ నిర్మాణం గావించి, ప్రభుత్వధనం ఖర్చు చేసినందున 12 సంవత్సరాలు కారాగార వాసం చేసిన ధర్మాత్ముడుగా ప్రసిద్ధి గాంచాడు. రాముడు తన తల్లి కైకేయి కోరిన వరాలను అనుసరించడానికై భరతునికి రాజ్యం అప్పగించి, 14 ఏండ్లు అరణ్యవాసం చేసి ధన్యుడైతే, ఆతని భక్తుడు రామదాసు రామన్నకు కోవెల ప్రభుత్వ ధనం అయినా సరే లెక్క చేయకుండా ఖర్చు చేసి నిర్మించి, కారాగార వాసం చేసి, రామునిలో ఐక్యం చెందాడు. రాముని బాటలో నడిచిన త్యాగమూర్తి. తన సర్వస్వమూ రామునికే అర్పించిన ధన్యజీవి రామదాసు. అటువంటి పరమ పవిత్రుడైన రామదాసు నిర్మించిన కోవెలయే ఈ భద్రాచల క్షేత్రం. సీతారామచంద్ర ప్రభువు దేవస్థానం నిలిచినంతకాలం రామదాసు పేరు, ఆతని వలన తానీషా పేరు కూడా చిరస్థాయిగా నిలిచి ఉంటాయి. అందుకే ఈనాటికీ భద్రాచలం వెళ్లే భక్తులందరూ రామదాసు కీర్తనలను గానం చేస్తూ వెళ్తున్నారు. పూర్వం కాలినడకన యాత్రికులు భద్రాచలం వెళ్లే రోజుల్లో రామదాసు కీర్తనల్ని గుంపులుగా కూడి పాడుకుంటూ వెళ్లి అందరూ ఆ క్షేత్రాన్ని దర్శించేవారు. భద్రాచల రామదాసుగా గోపన్న పేరు పొందాడు. కంచెర్ల గోపన్నగా కన్నా, భద్రాద్రి రామదాసుగానే ఆతని పేరు ఆంధ్రుల హృదయాల్లో స్థిరపడింది.

రామదాసు కీర్తనల్లో కూడా భద్రాచల రామదాసని ముద్ర వుంటుంది. భద్రాచలాన రామదాసు ధ్యాన మందిరంలో భవన కుడ్యాలపై ఈ కీర్తనలు చెక్కబడి ఉన్నాయి. ఈ కీర్తనల కొరకై ఒక ప్రత్యేక భవనం ఏర్పాటు చేయబడింది. అందు కుడ్యంపై పాలరాతి శిలా ఫలకాలపై ఈ కీర్తనలు చెక్కబడి ఉన్నాయి. భద్రాచలం ఆలయం వద్ద సమీపంలో నున్న ఒక ఎత్తైన కొండ ప్రదేశంపై ఈ భవనం ఉంది. అందు ఈ కీర్తనలు ఉన్నాయి. ఈ భవనం ఇప్పుడు దర్శించవచ్చును. రామదాసు భద్రాద్రి ఆలయ నిర్మాణం చేపట్టిన తీరు, ఆ ఆలయ నిర్మాణం చేపట్టినందువల్ల రామదాసును తానీషా చెఱలో వేయడం, ఆ తర్వాత రామలక్ష్మణులు చెఱ విడిపించడం మొదలైన అంశాలను గూర్చి ఈ క్రింది పద్యంలో ప్రస్తావించబడింది.

"తహసీల్ చే గుడి గోపురంబు లను సంస్థాపించి రామాది వి
గ్రహముల్ భద్రగిరిం బ్రతిష్ఠ సలుపం గావించు దానీష యా
గ్రహవృత్తిం జెఱ వేయం రాముడు దయన్ రక్షించెనే గోపనా
ఖ్యు హరిధ్యాన పరున్వశంబె యతనిం గొండాడ హిందూ రమా !"[2] (నాస్వరణము)

1. రమణీయం - జ్ఞాన బ్రహ్మ, ఆర్ష విద్యా వాచస్పతి స్వామి సుందర చైతన్యానంద. - స్వర్ణోత్సవ కెరటాలు - 32. సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్. ధవళేశ్వరం. పీఠిక స్వామి సుందరచైతన్యానంద (మాట తీరు).
2. మిన్నికంటి గురునాథ శర్మ - రామదాసు చరిత్ర విమర్శనము. అక్టోబరు 1931 భారతి పుట 511.

అని మిన్నికంటి గురునాథ శర్మ గారు తెలియజేశారు. రామదాసు ప్రభుత్వంచే భద్రాచలం పరగణాకు తహసీల్దారుగా ఉన్నప్పుడు, భద్రాచల రామునికి ఆలయం, గోపుర ప్రాకారాదులను నిర్మించి, ఆలయ నిర్మాణానికై ప్రభుత్వం సొమ్మంతా ఖర్చు చేసినాడు. ఈ కారణం చేత ఆనాటి గోల్కొండ నవాబు "అబ్దుల్లా తానీషా" రామదాసును గోల్కొండ ఖైదులో బంధించాడు. ఆ తర్వాత 12 సం॥లు తర్వాత శ్రీరాముడు లక్ష్మణ సమేతుడై రామదాసును చెర విడిపించినాడు. ఇదీ ఈయనకు, భద్రాచల రామాలయానికి ఉన్న సంబంధం. "భద్రగిరిపై వెలసిన సీతారామ లక్ష్మణులు కొంతకాలం పూజాదికం జరిగి, ఏ తురుష్క దండయాత్రల కాలంలోనో 14,15వ శతాబ్దిలో అడవి పొదలో మాటు మణిగి ఉండవచ్చు. కాకతీయుల రాజ్యంలో భద్రాచలం ఒక మండలర్క. దండయాత్రల కాలంలో 1424 లో అన్నప్ప అనే రాహుత్తు భద్రాచల పరగణాకు ఢిల్లీ సుల్తాను నుండి జాగీరుగా గ్రహించినాడు. ఆ తర్వాత శ్రీరాముని ఆలయం అజ్ఞాత వాసంలోకి పోయినట్లు తెలుస్తుంది."[1] ఈ అజ్ఞాతమైన రాముని ఆలయాన్ని వెలుగులోకి తెచ్చింది భద్రాచలానికి సుమారు ఒకమైలు దూరంలో ఉన్న భద్రారెడ్డి పాలెం అనే పల్లెయందున్న తమ్మల దమ్మక్క అనే భక్తురాలు. ఆమె ఇంటిపేరు పోకలవారు. ఈమె కథ ఇంతకు ముందే తెలియజేశాను. ఇక దమ్మక్క తదనంతరం రామదాసు ఆమె ఆజ్ఞ మేరకు అబ్దుల్లా కుతుబ్షా కాలంలో భద్రాచలం పరగణాకు తహసీలుదారుగా వచ్చి, రామాలయాన్ని పునర్నిర్మాణం గావించి ఉద్ధరించాడు. 1687 లో మొగలు సైన్యాలు, ఔరంగజేబు ఆధ్వర్యంలో గోల్కొండను వశపరచుకోవడమే కాకుండా, ఆ రాజ్యాన్ని సర్వనాశనం చేసినారు. ఆ తొడ తొక్కిడిలో రాములవారి జాగీరాశాసనం ముష్కరులెవరో చెక్కివేశారు.[2]

"1677 లో చెరనుండి విడుదలైన రామదాసైన గోపన్నగారిని అబుల్ హసన్ తానాషా - సర్వాపరాధాలనుంచీ విముక్తుని చేసి, శ్రీరాముల నిత్య సేవకోసం రేకపల్లి, భద్రాచలం జాగీర్లను శాశ్వత ప్రాతిపదికపై చెల్లుబాటయ్యే విధంగా 1652 లో జారీ అయిన ఫర్మానాను తిరిగి మంజూరు చేశాడు."[3] "ఫర్మానా లోని విషయాన్ని, పానగల్లు, భద్రాచలం, అశ్వారావు పేట మొదలైన ప్రాంతాలను భద్రాద్రి రామ కైంకర్యానికై ఆలయానికి శాశ్వతంగా తానీషా దానంగా ఇచ్చాడు. అలాగే ఎన్నో మడి మాన్యాలు, రామదాసు ప్రభుత్వానికి చెల్లించిన ఆరు లక్షలు కూడా రామదాసుకిచ్చినాడు. ఈ విషయాన్ని భద్రాచల రామునికి ప్రతినిత్యం, మరియు ప్రత్యేకంగా జరిగే కైంకర్యాదులు, ఉత్సవాల గూర్చి రామదాసు ఒక శాసనం వేయించాడు. అయితే దురదృష్టవశాత్తు మొగలుల దాడుల సందర్భంలో ఎన్నో దేవాలయాలు నాశనం అయినట్లే, భద్రాద్రి ఆలయం కూడా పూర్తిగా కాకున్నా పాక్షికంగా పాడైంది. అదే సమయంలో ఈ శాసనం కూడా విరగగొట్ట బడింది. చెక్కివేయబడింది. ఆ తర్వాత 1761 - 1803 ప్రాంతంలో గోల్కొండను ఆక్రమించిన అసఫ్ జాహీ వంశానికి చెందిన నిజామల్లీఖాను, తూము నరసింహ దాసు అనే రామ భక్త శిఖామణి విన్నపాన్ని మన్నించి, ఆ శాసనాన్ని తిరిగి మంజూరు చేసి, రామాలయాన్ని పునరుద్ధరించాడట."[4]

గోల్కొండ రాజ్యాన్ని అంతరింపజేసి మొగలు చక్రవర్తి ఔరంగజేబు హైదరాబాదుకు తన ప్రతినిధిగా గాజియుద్దీన్‌ను నియమించినాడు. కాని 1707 లో ఔరంగజేబు గతించిన వెనుక ఢిల్లీ నుండి నిజాముల్ ముల్క్, అసఫ్ జా క్రీ.శ. 1724 లో దక్కను సుబేదారుగా నియమింపబడినాడు. 1769 ప్రాంతంలో 'ధంసా' అనే తురుష్క సేనానాయకుడు ప్రబలి వరంగలు ప్రాంతంలో బలిష్టుడై ఖమ్మంమెట్టు మీదుగా ఇరువైపులకు దండయాత్రకు వెళ్లి ఒకరి వెనుక ఒకరు జమీందార్ల దోచుకుంటూ, దేవాలయాల కొల్లగొడ్తూ రాసాగెను.

1. శ్రీ భద్రాచల రామ కీర్తనలలో భక్తి మరియు రసపోషణం - శ్రీమతి డి. అశోక కుమారి. తెలుగు విశ్వ విద్యాలయం డిసెర్టేషన్. పుట 6.
2. రామదాసు కీర్తనలు - సంకలనం. మంచాళ జగన్నాథ రావు. బాలాంత్రపు రజనీకాంతరావు గారి పీఠిక - ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణలు.
3. రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పీఠిక పుట
4. రామదాసు కీర్తనలు - సంకలనం - మంచాళ జగన్నాథ రావు గారు. పీఠిక బాలాంత్రపు రజనీకాంతరావుగారు.

ధంసా యనేది బిరుదమే. మనకీతని విషయం తొలుదొల్త తెలిపినది 'భల్లా పేరయ్య' అనే కవి. "భద్రగిరి శతకం"[1] వ్రాసినాడు. భద్రగిరి శతకంలో భద్రగిరిపై ధంసా దండయాత్ర చేసి జరిపిన దురాగతాలు గూర్చి విపులంగా వర్ణిస్తూ ఒక శతకాన్ని వ్రాసి, 'భద్రగిరి శతకం' అని పేరు పెట్టాడు. ఇందు చారిత్రకాంశాలు చాలా ఉన్నాయి. కవి ఆ కాలంలోనే ఈ రచన చేసినాడు. తురకల దాడికి భయపడి పోలవరం గ్రామానికి శ్రీరామచంద్రుడు వలస వేంచేసిన విషయం గూర్చి చెప్పారు. దేవదేవుని భీరుత్వానికి ఆశ్చర్యపడుతూ నిందాస్తుతి చేసినాడు. ఇటువంటి నిందాస్తుతులు ఆంధ్ర కవిత్వ సాంప్రదాయాలై కనిపిస్తున్నాయి. ఆనాటి స్థితిగతులు కన్నుల కట్టినట్టు అభివర్ణించినాడు కవి. " ఈపాటి దొరవని యెఱుగక మిమ్ము నమ్మి అశ్వారాయుడు (భూ) పాలాయనము (నంబు) నొందె." -

"తమ గుమస్తా యనదగు నశ్వారాయని కరుణ మీరంగను గాంచలేక తొలగి పోతిరి" -[2] అనే మాలచే శ్రీరామ సేవాలాలసుండైన అశ్వారావు గారు పలాయనమై చికాకు పడుట తెలుపుచున్నాడు. అంతేగాక -

"గరుడాశ్వగజరథ వర వాహనములచే
బరగు వీథులు పీర్ల ప్రభుల జెందె
మత్స్య మాంసాదికముల నమరెను గోద
రేవులెచ్చట గన్న గోరీల నమరె " నని పలుకుచు భద్రగిరిలోని నాటి హృదయ విదారక స్థితిని దృగ్గోచరం చేసినాడు.

వీటి బుచ్చిరి గదా వీరులచే చెన్నొందు
ఘన మల్లికా పుష్పవన చయంబుల
గాజేసిరిగదా కల్యాణ మంటపా
గార వాహన గృహాంగణములెల్ల
చూఱవట్టిరి పురమెల్ల జొచ్చి విప్ర
మందిరములన్ని తురకలు మత్తులగుచు.

అతడు విరగగొట్టిన శాసన శిలాస్తంభాలు రామదాసు వేయించినవి. 1832 - 1833 నందన నామ సంవత్సరాన పుదరుద్ధరింబడినాయి. ఈ ధంసా అసలు పేరు ఇబరహీము ఖాను, ఫాజిలు బేగు అని, జాల్మంగు అని పేర్కొనబడింది. "రామదాసుగారొసంగిన వృత్తులు మాన్యాలు నిల్చిన సేవా ప్రకరణము లు కూడా తగ్గిపోవడంతో భీతి ఉదయించింది. తూము నరసింహదాసుకు, నాగెండ్ల వరదరామదాసులకు . వీరు మరల రామదాసు వేయించిన శాసన స్తంభాన్ని పునరుద్ధరించినారు. ఈనాటికీ ఈ స్తంభం భద్రాద్రి ఆలయ ప్రాంగణం లోనే దక్షిణ భాగంలో ఉంది. విరుగగొట్ట బడిన రామదాసు వేయించిన శిలాస్తంభం కూడా ఉంది."[3] అని కొండపల్లి రామచంద్రాచార్యులు తెలియజేశారు. డా॥ వి. రాఘవన్ గారు భద్రాచల క్షేత్రంగూర్చి ఈ విధంగా తెలియజేసినారు.

"In 1832 AD one Varada Ramadas who described himself as a descendant of our Ramadas, made a representation to chandulal, Dewan of Nizam of Hyderabad that he should be appointed to look. After the Rama temple at Bhadrachalam and got his request granted. In confirmation of the historicity of the whole story of Ramadas and the Muslim ruler we have had the continuing practice of the Nizam of Hyderabad making a grant for the conduct of the festival

1. కొండపల్లి రామచంద్ర రావు - భద్రాచల క్షేత్ర చరిత్రము 1961. పుట 54.
2. " " " పుట 57.
3. శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము - కొండపల్లి రామచంద్రాచార్యులు పుట. 57.

of the temple of Rama at Bhadrachalam. It was reported in the papers that during the anti-Hindu agitation and activities of Razakars and their leader "Kasim Razvi", the Nizam stopped the grant to the Bhadrachalam temple, but soon realised that it was a wrong act and restored the grant."[1]

నిజాము ప్రభువుల కాలంలో చందూలాల్ దివాన్ కు వరదరామదాసు ఒకలేఖ పంపాడు. భద్రాచలంలో క్రీ॥శ॥ 1832 లో రామదాసు అనంతరం దేవాలయ కార్యక్రమాలు చూడడానికి నియమింపబడినాడు వరదరామదాసు. నిజాము ప్రభువు 'చందూలాల్' అనుమతి మీద భద్రాద్రి రామ కల్యాణాది ఉత్సవాలు నిర్వహించడానికి, కైంకర్యం నిమిత్తం ధనం మంజూరు చేశారు. అప్పడే హిందూ వ్యతిరేక ఉద్యమాలు, దాడులను 'రజాకార్లు' నిర్వహించి, హిందూ దేవాలయాలు ధ్వంసం చేసినారు. "ఖాసిమ్ రజ్వీ" అనే రజాకార్ల నాయకుడి కారణంగా నిజాము ప్రభువు 'భద్రాచలానికి' నిధులు ఇవ్వడం మానినాడు. కాని తర్వాత తనతప్పు తెలుసుకుని పశ్చాత్తప్తుడై మరల భద్రాచల ఆలయానికి తిరిగి నిధులు మంజూరు చేసినాడు. తానీషా ప్రభువు కాలం నుండి హైదరాబాదు నుండి ముత్యాలు ప్రతియేటా సీతారామ కల్యాణోత్సవానికి శ్రీరామనవమి నాడు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు ఇతర కానుకలు పంపబడుతున్నాయి. ఆ ఆచారం ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. ఈనాటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఆనాటి తానీషా కాలం నాటి ముత్యాలు తలంబ్రాలుగా ను పట్టువస్త్రాలను సీతారాములకు పంపబడుతూనే ఉన్నాయి. శ్రీ సీతారాము కల్యాణోత్సవం భద్రాచల క్షేత్రంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతుంది. దేశ విదేశాలనుండి కూడా ఈ కల్యాణం తిలకించడానికి భక్తులు వస్తున్నారు. అది ఆ భద్రగిరి గొప్పదనం.

భద్రాచలంలో వేంచేసియున్న శ్రీరాముని విశిష్టతను గూర్చి, ఆ స్వామి స్వరూపం గూర్చి దాశరథీ శతకంలో రామదాసు ఈ విధంగా రెండు పద్యాల్లో తెలియజేశాడు.

*శ్రీరమ సీతగాగ నిజసేవక బృందము వీర వైష్ణవా*
*చారజనంబుగాగ విరజానది గౌతమిగా వికుంఠము*
*న్నారయ భద్రశైల శిఖరాగ్రము గాగ వసించు చేతనో*
*ద్ధారకుడవైన విష్ణుడవు దాశరథీ కరుణాపయోనిధీ"*[2]

దశరథ రామా ! నీవు పరమ పదమందున్న లక్ష్మీదేవిని ఇచట సీతగా జేసికొని అందలి పరివారము ఇచట వీర వైష్ణవ జనులుగా వచ్చి కొలుచుచుండగా, అచ్చట విరజానది ఇచట గోదావరిగా ప్రవహింపగా, ఆ వైకుంఠమే ఇచట భద్రగిరి కొమ్మ కొనయై రాణింపగా వేంచేసి చేతనులను ఉద్ధరించుచున్న శ్రీ విష్ణుదేవుండవే కాని వేఱుకాదు. భద్రాద్రియే వైకుంఠమని, విరజా నదే గోదావరిగా ప్రవహించిందని రామదాసు వర్ణించాడు. వైకుంఠ వాసుడైన శ్రీమహా విష్ణువు రాముడుగాను, లక్ష్మియే సీతగాను భద్రాచలంలో వెలిసింది. మరొక పద్యం ఇది.

*"కంటి నదీ తటంబు పొడగంటిని భద్రనగాధి వాసముం*
*గంటి నిలా తనూజ నురు కార్ముక మార్గణ శంఖ చక్రముల్*
*గంటిని మిమ్ము, లక్ష్మణుని గంటి కృతార్థుడనైతినో జగ*
*త్కంటక దైత్య నిర్దళన దాశరథీ కరుణాపయోనిధీ"*[3]

లోక హింసకులైన రాక్షసులను రూపుమాపి, దయా సముద్రుడవై యొప్ప శ్రీరామా! నీవు వేంచేసి యున్న భద్రగిరి యొద్దనున్న గోదావరి గట్టును, నీవు వేంచేసియున్న భద్రాచల వాసమును, సీతాదేవిని, నీ విల్లును, బాణములను, శంఖ చక్రములను, నిన్నును లక్ష్మణుని సేవించి కృతార్థుడనైతి. "చతుర్భుజ రాముడుగా"

1. Bhadrachala Ramadas. (Great composers) Dr. V. Raghavan. P.No. 13-14.

2. దాశరథీ శతకము - పుట 18, పద్యం 20.

3. దాశరథీ శతకము - పుట 19, పద్యం 21.

శ్రీమన్నారాయణుడు భద్రాచలంలో అవతరించాడు. "భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామికి ఆలయ గోపుర ప్రాకారాలు కట్టించినాడు గోపన్న. అలాగే సీతారామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు, హనుమంతుడికి వివిధ వాహనాలు, ఆభరణాలు చేయించాడు. ఆ గోపన్న ఆలయ నిర్మాణం గావించిన తీరు, తాను ఏ విధంగా రామ కైంకర్యం చేశాడో పరిశీలిద్దాం.

### 4.8. భద్రాద్రి సీతారామ చంద్రుల దేవస్థాన నిర్మాణ కైంకర్యము - జీర్ణోద్ధరణ :

నిరంతరం రామనామ తత్పరుడైన గోపన్న భద్రాచలం తాలూకాకు తహసీల్దారుగా నియమితుడై వెళ్తాడు. ఒకానొక సందర్భంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం తన గృహమునందు నిర్వర్తించిన అనంతరం, సంతర్పణ చేయిస్తాడు. అప్పుడు ప్రమాద వశాన తన కుమారుడు "రఘురాముడు" వేడి గంజి గుంటలో పడి మూర్ఛనొంది, ప్రాణాపాయ స్థితిలో ఉండగా, శ్రీరాముని అనుగ్రహం వల్ల తిరిగి బ్రతుకుతాడు. ఆనాడు తన కుమారుడు రామానుగ్రహంతో బ్రతికినందుకు ప్రత్యుపకారంగా ఏమైనా చేయాలని తలంచి, జీర్ణ స్థితిలో ఉన్న భద్రాద్రి రామాలయాన్ని పునరుద్ధరించి, ఆలయ గోపుర, ప్రాకార, మంటపాదులు నిర్మించాలని సంకల్పించుకుంటాడు. ఆలయ నిర్మాణం చేపట్టడానికి ఇదొక కారణం.

మరొక కారణం శ్రీరాముడు స్వప్నంలో సాక్షాత్కరించి తనకు భద్రాచల క్షేత్రమున ఆలయం నిర్మించమని చెప్పడం ఈ రెండు ప్రధాన కారణాల వల్ల గోపన్న భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రప్రభువునకు అత్యంత వైభవోపేతంగా ఆలయ నిర్మాణం చేపడతాడు. గోపరాజు మొదట పాల్వంచ యందు తహసీల్దారుగా ఉన్నాడు. తాను భద్రాద్రియందున్న రాముడిని చూడకుండా నిలువలేకపోతాడు. మొదటిసారిగా దమ్మక్కతో కూడి భద్రాద్రి సీతారాములను దర్శించిన నాటినుండి వారి రూపం హృదయంలో నిలిచిపోయింది. పైగా దమ్మక్క నిర్మిత ఆలయం జీర్ణమై, శిథిలమైపోగా దాని స్థానంలో పెద్ద దేవాలయం కట్టించి ఆ విగ్రహాలు పునః ప్రతిష్ఠింపచేయదలచాడు. అందుకే వెంటనే తన కార్య స్థానాన్ని పాల్వంచ నుండి భద్రాచలానికి మారుస్తాడు. నిత్యం శ్రీరామచంద్రుని సేవలు చేస్తూఉంటాడు. నిత్యం శ్రీరామ చంద్రునికి భజనలు, భాగవత గోష్ఠులు జరుపుతూ ఉంటాడు. శ్రీరాముని తలుస్తూ కవితలు అల్లుతాడు. "దాశరథీ కరుణాపయోనిధీ" అనే మకుటంతో ఒక శతకం రచించాడు. భక్తి రస భరితాలైన అనేక కీర్తనలు రచించి గానం చేస్తూండేవాడు. అతని విశేష రామభక్తిని గమనించి ప్రజలాయనను 'రామదాసు' అంటారు అప్పటినుంచి కంచెర్ల గోపరాజు రామదాసు అనే సార్థక నామంతో ప్రఖ్యాతి నొందుతాడు. శ్రీరామునికి నిత్య సేవలు చేస్తూ, నిరతాన్న దానాలు చేస్తూ "శ్రీరామనామాం మరువాం మరువాం -సిద్ధము యమునికి వెరువాం వెరువాం" మున్నగు సంకీర్తనలచే భక్తి ప్రబోధం చేస్తూ ధార్మిక జీవనం గడుపుతూంటాడు. భాగవత సమారాధనతో పాటు తన ఉద్యోగ ధర్మం కూడ జాగ్రత్తగా నిర్వర్తిస్తూ ఉంటాడు.

#### 4.8.1. ఆలయ నిర్మాణం కొరకై కావుల సహాయం కోరుట :

రామదాసు ఈ ఉద్యోగ వృత్తిని ధర్మంగా ఆచరిస్తూనే మరోవైపు రామునికి తగు ఆలయం లేదు. వస్త్ర వాహనాలు లేవు. అలంకారాలు లేవు. మహా భోగోత్సవాలు లేవు అని ఆలోచించి గ్రామీణులను భక్త జనులను సమావేశపరచి జీర్ణ దేవాలయాన్ని పునరుద్ధరించ నున్నట్లుగా విన్నవిస్తాడు. భక్తులు అంగీకరిస్తాడు. ధన సహాయం కూడా చేస్తామంటారు. రామాలయ నిర్మాణార్థమై సహాయపడమని, ఆ సందర్భంలో గ్రామస్థులతో రామదాసు ఈ విధంగా వారిని ప్రబోధిస్తాడు. వివిధ రామదాసు చరిత్ర గ్రంథాల్లో ఈ విషయం గూర్చి ప్రస్తావింపబడి ఉంది. గురునాథ శర్మగారు ఈ విధంగా వ్రాశారు. అంత క్రమముగా దమ్మక్క నిర్మించిన భద్రాద్రి ఆలయం జీర్ణదశకు చేరింది. దానిని బునరుద్ధరించి గొప్ప కోవెల నిర్మించి ధ్వజింటెత్తవలయునని గోపన్న సంకల్పించుకొని యొకనాడు రైతుల నందఱను రప్పించుకొని భక్తిని గూర్చియు ధర్మ కార్యముల గూర్చియు నుపన్యసించి యిట్లనియె.

"పొయ్యేటప్పుడు వెంటరాదు - ఒక పుచ్చిన వక్కైన .........
వెయ్యారులు దాచుకొని యనర్థుల - కియ్యలేని లోభుల కయ్యయ్యో
ఇచ్చిన మాత్రం బిచ్చును దైవము - హెచ్చడిగిన రాదు.......
వచ్చేటప్పుడు వెంటనేమయిన - దెచ్చుక రాలేదు
..........................
ఇరవుగ దొలి జన్మంబుల బేదల - కియ్యని దోసమున
దిరపెము లెత్తెడి వారిని గాంచియు దెలియక యున్నారు"[1]

అని ధర్మాసక్తిని గలిగించి మన పాపములు కొండల కొలది యెన్ని జన్మముల నుండియో పేరుకొని యున్నవి. ఎంత కాలమిట్లు పుట్టుచు జచ్చుచు వానిననుభవింతము ? ఆ పాప రాశినొక్కుమ్మడి నిర్మూలింప వలదే ? బ్రహ్మ హత్యాది పంచ మహాపాతకములేమి వాచిక కాయిక మానసిక దుష్కలుషము లేమి యన్నియు దేవాలయ నిర్మాణ వశంబు పటాపంచలై తూలిపోవును. కనుక దత్కార్యమున మీరు నాకు తోడ్పడవలయును. అన నందఱది లెస్స అట్లే యథాశక్తి దోడ్పడెదమనిరి".[2]

యాదవదాసు రచించిన రామదాసు చరిత్రము అనే యక్షగానం నందు, రామదాసు ఆలయ నిర్మాణ విషయమై కాపులతో పలికిన మాటలు ఇవి.

"నామాట వినుడిక నయముగ మీరు । నేమంబుతోడుత నే జెప్పెదాను ఈ జన్మమిక రాదు యీ భువిలోకి । గజరాజ వరదుని గనుగొందుమేము । రాముల మంటపము రభసంబుతోను । కామాటి జనులను గ్రక్కున బిలిచి । నిర్మింతు కోవెలల్ నిజముగ నిపుడు । కూర్మితో మీరింత కూడి సాయంబు । గావలె హరి మీద కాంక్షతో వేగకమ్ముల బండ్లను గాదెలు మొదలు । నమ్మతిగ నెడ్ల సరగున కట్టి । స్తంభాలు సలువలు సరగున దేండి । సంబరంబున నిలిపి స్వామినీ తలచి । జేసినంతటి మేలు చేసును మీకు । చూచేర ప్రజలంత చోద్యంబుగాను"[3] అని రామదాసు కోరగా ఆ కాపులందరును

"అయ్యా దేవుని కార్యము
చయ్యన మేమంత గూడి సరగున వేగన్
జెయ్యగ సెలవివ్వుము మా
కియ్యెడ పొట్టకును జరిపి కీర్తితో నేలు"[4] అని రామదాసుకు ఆలయ నిర్మాణానికై తమ వంతు సహాయం చేస్తామని మాటిచ్చారు భద్రాద్రి వాసులు.

తిరుక్కడయూరి కృష్ణదాసు "భద్రాచల రామదాసు చరిత్రము" అనే యక్షగానంలో రామాలయ నిర్మాణం గూర్చి, కాపుల సహాయం కోరుతూ వారితో అన్న మాటలను కవి ఈ విధంగా తెలియజేశాడు. రామదాసు తన మనస్సులోని కోరికను, తెలియజేసి "రామ కార్యాన్ని నిర్వర్తించాలని, రామాలయ నిర్మాణానికై రమదాసు కాపుల ద్వారా సహాయంతో భద్రాద్రి సీతారామ చంద్రులకు ఆలయ నిర్మాణం చేయదలచినాడు. భద్రాద్రిలో ఎక్కడ చూసినా రామభజన కూటాలు ఉండి, రామనామ జపంతో భద్రాద్రి అంతా మార్మోగిపోతుంది. రామదాసు కాపులను పిలిచి వారికి తన మనో సంకల్పాన్ని వివరించాడీ విధంగా

"హరిర్హరతి పాపాని దుష్ట చిత్తైరపి స్మృతిః అనిచ్ఛయాపి సంస్పృష్టో దహత్యేంవహి పావకః
జీర్ణోద్ధార ఫలం విష్ణోరాలయస్య పితామహః అశక్త ఏవస్మాదన్యే నక్తుం శక్తాస్తు రానర్థాః
విష్ణోరారాధ నాత్పుణ్యం స్మరణాత్పాప నాశనమ్ భవేజ్జీర్ణాలయోద్ధారాత్కోవాస్తి ఫలమీరితమ్ "[5] అని బ్రహ్మాండ పురాణంలో ఈ విధంగా చెప్పబడింది.

1. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ , పుట 74-75.
2. " " " " " పుట 76.
3,4. రామదాసు చరిత్రము (యక్షగానం) - యాదవదాసు - పుట 19.
5. తిరుక్కడయూరి కృష్ణదాసు - భద్రాచల రామదాసు చరిత్రము , పుట 47.

జీర్ణమైన విష్ణు ఆలయాన్ని ఉద్ధరిస్తే పుణ్య ఫలం కలుగుతుందని, సర్వ పాపాలు తొలగి పోతాయని చెప్పబడి ఉంది. అంతేకాదు మానవుడు ఎన్నటికైనా మరణింపక తప్పదు. అందుకే ఈ జన్మ చరితార్థం కావడానికి శ్రీహరి పాదాలు కొలిచిన పుణ్యం ప్రభవిస్తుందని

"ఎన్ని దినంబులు బ్రతికిన మరణము నున్న యగుట లేదు
పన్నుగ శ్రీహరి పదముల గొలిచిన గ్రన్నన నటుగాదు"[1]

తాను చేయదలచిన మహత్కార్యానికి, రాముడే తనయండ గలడని, భావించాడు రామదాసు. ఈ విధంగా రాముని యందు విశ్వాసం భారం ఉంచి కీర్తిస్తున్నాడు. రామాలయ జీర్ణోద్ధారణ చేయదలచినట్లు కాపులకు తెల్పగా అందరును ఆనందించి తమ సహాయం ఈ కార్యంలో ఉంటుందని మాట యిచ్చారు. "భక్త రామదాసు చరిత్రము" అనే యక్షగానంలో ఈ విధంగా చెప్పబడింది. రామదాసు తహసీల్దారుగా తన వృత్తిని ధర్మబద్ధంగా చేస్తూ, కాపుల వద్ద నుండి శిస్తు వసూలు చేస్తూ నియమబద్ధమైన జీవితం గడప సాగాడు. రామదాసు ఆలయ జీర్ణోద్ధరణ విషయమై కాపులతో పలికిన మాటలు ఈ క్రింది తొహరా యందు చెప్పబడి ఉన్నాయి.

జగదీశుని యిట్లభినుతించి తన జన్మము సాఫల్యము గాంచెన్
తగ నీ సన్నిధి జీర్ణోద్ధారణ తా జేసెదనని తలచెన్
ఒక్క దినంబున తన గృహంబునకు నొనరగ కాపుల బిలిచి
వెక్కన పడకను వినుడు తెల్పెదను వీరుగ దలవక నిలిచి
ఎన్ని దినంబులు బ్రతికిన మరణము నున్నయగుట లేదు
పన్నుగ శ్రీహరి పదముల గొలిచిన గ్రన్ననట్లులు గాదు
చేయదలచితిని రాముని కోవెల జీర్ణోద్ధారణ మేను
పాయక మీరలు ప్రబలముగా నిట ప్రబలుడు కార్యములోను
అన విని కాపులు హర్షము నొందుచు హరి భక్తుని కిట్లనిరి
మనవి వినుచు మీ మదిచొప్పనను మనగ దలతుమే మనిరి"[2]

ఈ తొహరాయందు రామాలయం పునరుద్ధరించవలెనన్న తలంపుతో, కాపులందరిని సమావేశపరచి, ఆలయ నిర్మాణానికై సహాయపడమని కోరగా, కాపులు అది ధర్మకార్యం, దైవ కార్యం అని భావించి అందుకు అంగీకరించారు. మరియు ఇంకా రామదాసు ఈ విధంగా తెలియజేశాడు. ఆ భద్రాద్రి వాసులకు ఈ విధంగా ఉద్బోధ చేస్తున్నాడు.

మరణకాలమున నొకటియు తన వెంటరాదు గాన జీవిత కాలమందే భగవత్ కైంకర్యములు జేయ వలయునని రామదాసుగారు తలచుచున్నారు.

**"నాదనామ క్రియ రాగము - ఆది తాళము"**

పొయ్యేటప్పుడు వెంటరాదుగా....... అన్న కీర్తనలో

"హెచ్చుగనిది తెలియని పామరులు దురాశను తగులుకొని
యిచ్చట నార్జించిన ధనమెచ్చట కెత్తుక పొయ్యేరయ్యయ్యొ
తనువును రక్షించుటకై మూల మూలలందును ధనము దాచెదరు
తనువును సుత బాంధవులు స్థిరమని తలచి గానగ లేరు
తలతురు వారలు పశు సుతాదులు తనవని భ్రమసేరు

1. తిరుక్కడయూరి కృష్ణదాసు - భద్రాచల రామదాసు చరిత్రము(యక్షగానం) - పుట 47.
2. భక్త రామదాసు చరిత్రము - ఎన్.వి.గోపాల్ అండ్ కో. (పండితులచే పరిష్కరింపబడింది) పుట 30-31.

తనవారెక్కడ తానెక్కడనో తనువు విడిచి యా జీవుడొంటిగ
పరులకు బలి భిక్షంబులు బెట్టని పరమ లోభులిలను
ధరలో వేంకట విఠలుని దలపక ధనమదాంధమున దగిలి మానవుడు".[1]

మానవుడు మరణించేటప్పుడు ఏమి తన వెంట తీసుకొని వెళ్ళడు. అందుకే తన వద్ద నున్న ధన, వస్తువులను దైవ కార్యానికి వినియోగించిన పుణ్య ఫలం దక్కుతుంది. అందుకే లోభితనం మాని ఎవరిక తోచిన సహాయం వారు చేసి ఆలయ నిర్మాణానికై తోడ్పడ వలసిందిగా భద్రాద్రి వాసులను, కాపులను, ఇతర ధనికులను కోరినాడు రామదాసు. ఈ విధంగా రామదాసు కాపులందరిని కోరిన మీదట, ఆలయ నిర్మాణానికై వారు సహాయపడెదమని మాట ఇచ్చారు. ఆ సందర్భంలోనే కాపుల వద్ద వసూలు చేసిన ధనం ఆరు లక్షల పైకం గోల్కొండ ప్రభుత్వం వారిది ఖజానాలో నిల్వ ఉంది. మొదట మాత్రం రామదాసు రైతుల కడ ధనం వసూలు చేస్తాడు. అందరూ తమకు తోచినంత ధనం సహాయం చేస్తారు.

### 4.8.2. రామదాసు రామాలయ జీర్ణోద్ధారణ గావించుట :

రామదాసు ఆలయ నిర్మాణం చేపట్టు సమయానికి ప్రభుత్వ ఖజానా యందు నిల్వ ఆరు లక్షలు ఉంటుంది అని చరిత్రలో చెప్పబడి ఉంది. మొదట గోపన్న నవాబు సొమ్ము నంటగూడదని తలంచాడు. రామాలయ నిర్మాణం ప్రారంభిస్తాడు. రామదాసు ఆలయ మంటప, ప్రాకార నిర్మాణం ప్రారంభిస్తాడు. "రైతులిచ్చిన ధనం చాలక పోతుంది. మొట్టమొదటనే ధనాభావం పొడసూపుతుంది. ప్రభుత్వం వారు ఒత్తిడి చేయు వరకు సరిపెట్టక పోదునా అని సర్కారు శిస్తు పైకంపై చెయ్యి వేస్తాడు. ధర్మమతియైన గోల్కొండ ప్రభువు అంగీకరించక పోతాడా అని అనుకుంటాడు. అంగీకరించనిచో శ్రీరాముడు లేడా అని అనుకుంటాడు. చుట్టూ ప్రాకారాలు, గోపుర, మంటపాలు, భరతునికి పచ్చల పతకం, శత్రుఘ్నునికి మొలత్రాడు, లక్ష్మణునికి ముత్యాల పతకం, సీతమ్మకు చింతాకు పతకం, శ్రీరామ చంద్రునికి కలికితురాయి, ఇంకా ఇతర వాహనాదులు చేయించడానికై మొత్తం ఆరు లక్షల పైకం వ్యయం చేస్తాడు. భద్రాద్రిని కలియుగ వైకుంఠంగా తీర్చి దిద్దుతాడు."[2] అని దాశరథుల బాలయ్య గారు తమ సిద్ధాంత వ్యాసంలో రామదాసు ఆలయ నిర్మాణానికి ఆరు లక్షలు ఖర్చు చేశాడని వ్రాశారు.

కాపులంతా ఆలయ నిర్మాణానికై శ్రమ పడ్డారు. ధన సహాయం చేశారు. ధనాన్ని ఇవ్వలేని వారు శ్రమదానం చేశారు. అంతా కలసి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. రామ కైంకర్యం అత్యంత వైభవోపేతంగా చేశారు. రామాలయ గోపుర ప్రాకార మంటపాదులకై కాపుల ధనం, తనవద్ద నున్న ద్రవ్యం రామార్పణం చేశారు రామదాసుగారు. అయితే సంప్రోక్షణకై, రామ విగ్రహ ప్రతిష్ఠాపనకు ధనం సమకూరలేదు. దానికై సంతాపం చెంది ఆ రాముని ప్రార్థించాడు రామదాసు. రామదాసు ఈ కీర్తన ద్వారా ఇలా కోరాడు.

**"పున్నాగ వరాళి - ఆది"**

రామాదయ యుంచవే నీ నెనరున స్వామీ దీవించవే
రామా రవికుల సోమా శంకర భీమా వినుత సుత్రామ సీతా
కోరి మిము వేడితి ఈ పనికేమి భారమనుచు జేరితి
యేరి మమ్మిక గాననెవ్వరు లేరు నన్నిక వేరు సేయక
నిన్నే నెర నమ్మితి ఈ పనులెల్ల మున్నే వినిపించితి
సన్నుతించగనేర నా పన్నుడను కృప జూడు వేగమే

1. భక్త రామదాసు చరిత్రము - సింగరదాసు (యక్షగానం) పుట 11.
2. భక్త రామదాసు జీవితము-రచనలు - దాశరథుల బాలయ్య.

వేడుకలు మీరగా నీ కన్నుల జూడు సిరి జేరగా
తోడు నీవై గావుమా నీ యాడు దైవము లేదు మాకిక
ఈ సమయమందునా భద్రాచల వాస పనులయందునా
మోసపుచ్చక కావు రామదాసుడను నన్ను విడువక"[1]

రామా ! ఈ రామాలయ నిర్మాణానికై కావలసిన ధనం సమకూరింది, కాని నీ సంప్రోక్షణకై, ప్రతిష్ఠకై ధనం సమకూరలేదు. నీవే దిక్కు అని భావించి, నీవున్నావన్న ధైర్యంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టాను. తక్కిన ఈ కార్యం కూడా పూర్తి చేయించే భారం నీదే. అని అంటున్నారు రామదాసు. ఈ కార్యం పూర్తి చేయించు, నన్ను మోసగించక ధనం సమకూర్చుమని వేడుకున్నాడు రామదాసు. భగవంతుడు భక్తుని పరీక్షించినట్లుగా ఉంది ఇక్కడ. అంతట సర్కారు పైకాన్ని తక్కిన కార్యానికి వినియోగించే ఆలోచన, ఆ బుద్ధిని రాముడే తన మనస్సున కలిగించాడని భావించి ఆ సర్కారు పైకం ఖర్చు చేయ యత్నించాడు.

### 4.8.3. రామాలయ కైంకర్యమునకై రామదాసు ప్రభుత్వ ధనం ఖర్చు చేయుట :

రామదాసు రామ కైంకర్యానికై "ఆరు లక్షలు" వినియోగించినట్లుగా రామదాసు చరిత్రల్లో ఉంది. రామదాసు రామ ప్రతిష్ఠకై, సంప్రోక్షణకై ఆరు లక్షల ప్రభుత్వ ధనం ఖర్చు చేసినట్లు, చేయ ప్రయత్నించినట్లుగా తిరుక్కడయూరి కృష్ణదాసు ఈ విధంగా తెలియజేశారు.

"రామ రామ తానీష ద్రవ్యమీ రాత్రి నిలువ యార్లక్షల్
భీమ వినుత నీకై వ్యయపరచిన స్వామి చెందునే శిక్షల్" అని యూహించి ఖజానా పైకంబా క్షణమున దెప్పించి, తన పైకము వలె ఖర్చు చేసి తన తలపు కొనలు సాగించి"[2]

రామునికి యాగ శాలలు కట్టించి, యజ్ఞం చేయించి ఆ రామునికై సంప్రోక్షణం చేయించి, ప్రతిష్ఠ చేసి బ్రాహ్మణ పూజలు చేయించాడు. అంత భద్రాద్రి రాముని సేవించిన నా జన్మ సఫలమాయెనని సంకీర్తనం చేస్తున్నారు రామదాసు ఈ విధంగా కల్యాణోత్సవం చేయించి ఆ సీతారాముల శోభను వర్ణిస్తున్నాడు ఈ కీర్తనలో.

"నాద నామ క్రియ - ఆది "

"కంటి నేడు మా రాముల కనుగొంటినేను - కంటి నేడు భక్త గణముల బ్రోచు మా
యింటి వేలుపు భద్రగిరి నున్నవాని - చెలువొప్ప చున్నట్టి సీతా సమేతుడై
కొలువు దీరిన మా కోదండ రాముని - తరణి కుల తిలకుని ఘన నీల గాత్రుని
కరుణా రసము గురియు కందోయి గలవాని - హురుమంచి ముత్యాలు సరములు మెరయగా
ములిపెంపు చిరునవ్వు మోము గలిగినవాని - ఘల్లుఘల్లుమను పైడి గజ్జెలందెలు మ్రోయగ
తళుకు బెళుకు పాద తలము గలిగిన వాని - కరకు బంగరు చేల కాంతి జగములు గప్ప
శర చాపములు కేల ధరియించు స్వామిని - ధరణిపై శ్రీరామదాసు నేలేడు వాని
పరమ పురుషుండైన భద్రగిరి స్వామిని"[3]

శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై యుండగా ఆయన శోభను వర్ణించాడీ కీర్తనలో. సీతారాముల సౌందర్యాన్ని వర్ణించి, ఆ దివ్య మంగళ విగ్రహాలను కన్నులారా గాంచి, తరించినాడు. ఆనంద పారవశ్యంతో రామయ్యను స్తుతించాడు. ఆ కల్యాణ రాముని, సీతమ్మ తల్లిని చూసి మురిసిపోయాడు. తన జన్మ ధన్యమైందిగా భావించినాడు. రామదాసు ఈ విధంగా కైంకర్యం చేసిన విషయం మిన్నికంటి గురునాథ శర్మగారు తమ గ్రంథం "కంచెర్ల గోపన్న యను రామదాసు" నందు ఈ విధంగా వివరించారు.

1. భక్తరామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 129, కీర్తన 156.
2. భద్రాచల రామదాసు చరిత్రము (యక్షగానం), తిరుక్కడయూరి కృష్ణదాసు పుట 50.
3. భక్తరామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 51, కీర్తన 54.

"గోపన్న ప్రథమమున నవాబు సొమ్ము (సిస్తు) నంటగూడదని తలంచెను. కాని రామ భక్త్యతిశయము వలన గార్యావసరముల కొలది తప్పని సరియయ్యెను. చందాల మూలమున వెంటనే ధనం గూర్చి సొలాఖరున నవాబుగారి కంపవచ్చును లెమ్మని ధైర్యము వహించినాడు. చందాలు వేయించుచున్నాడు. ఎండయనక, వానయనక, పవలనక, రేయనక తిరుగుచున్నాడు. ఆకలి దప్పలనే మరచినాడు. చెంతనుండి ప్రతి పనిని జేయించుచున్నాడు. కరణములందఱను, గొప్ప కాపుల నొప్పించి కాగితముపై వేయుడు. ఇచ్చునపుడు చూచుకోవచ్చునని పదిచోట వంద వంద చోట వెయ్యి - వేయించుచున్నారు.

నవాబు పైకం వ్యయము చేసినంత చందా పట్టికలో బడినది. గోపన్న చూచి వసూలు చేయలేక పోదునా ? అనుకొన్నాడు. అది యెంత భక్తియో ! ఉద్యోగమిచ్చినది రాముడు. ఈ పని చేయించు చున్నది రాముడు. రాముడు నాకేల యండగా లేడు? అని తలంచును ఒక్కొక్కప్పడు నేనీ యుద్యోగము జేరినదీ పనికే గదా ! అది తీర్చుకొన్న పిదప నేనెట్టైన నేమి ? యని భావించును. నక్తందివము పని సాగుచున్నది. క్షణిక వారము నిదర్శనముగా గన్పించుచున్నది. శూన్యమున బదార్థము గోచరించుచున్నది. పదార్థము భాసమానమగుచున్నది. స్థలా భోగము శిలా భోగమన్నట్లు భద్రగిరి యిప్పడు కన్నుల పండువుగా నున్నది."కలియుగ వైకుంఠము -భద్రాచల నిలయము సేవింతము" అని ప్రజల మేల్కొల్పినది. సీతారామ స్వామి దేవాలయము తయారైనది".[1] భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయ వైభవాన్ని అత్యద్భుతంగాను, రమణీయంగాను రామదాసు గారు వర్ణించారు ఈ కీర్తనలో

**"ఆనంద భైరవి - ఆది"**

*కలియుగ వైకుంఠము - భద్రాచల నిలయము సేవింతము*
*అలివేణులార మీరానందముగ వేగ - విలసితమైనట్టి వేడుక జూడరె*
*కాంచన సౌధములు - వానికి కెంపు మించిన దూలములు*
*వజ్రములు చెక్కించిన స్తంభములు - పగడములని భ్రమించగ ద్వారమ్ములూ*
*అంచయాన మరి యెంచలేను గదే - మంచి పచ్చలు గూర్పించిన వాకిండ్లు ॥కలి॥*
*బంగారు గోపురములు - కోవెలలు వెలుంగు మాణిక్యములు*
*భేరీ మృదంగాది నాదములు - భాగవతుల సంగీతపు కీర్తనలూ*
*రంగైన కల్యాణ రత్న మంటపముల శృంగారమేమని-చెలియా విన్నవింతు*
*వామాక్షులాడగను - సీతను గూడి హేమ పీఠము నందును*
*పూర్ణ కళలు మోమున వెలుగగనూ-పరివారములు ప్రేమతో గొలువగనూ*
*ప్రేమతో భద్రాద్రి రామదాసుల నేలు స్వామి - శ్రీ కోదండ రాముని వాసము ॥కలి॥"*[2]

ఈ కీర్తనలో రామదాసు భద్రాచలాన్ని కలియుగ వైకుంఠంగాను, అందు వెలసిన వారు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు, లక్ష్మీదేవి యని వర్ణించాడు. అతిశయోక్తులతో కూడిన వర్ణన ఇది. బంగారు గోపురాలు, సౌధాలు, వజ్రాలు, పగడాలు పొదిగిన స్తంభాలు, మండపాలు, పగడాలు పొదిగిన ద్వారాలతోను ఈ కోవెల శోభిల్లుతూ ఉన్నట్లుగా, శోభాయమానంగా భద్రాద్రి శ్రీ సీతారాముల ఆలయాన్ని వర్ణించి, తనకు రాముని యెడ గల అపారమైన భక్తి శ్రద్ధలను చాటుకున్నాడు.

"మఱియు నేమైనా గానిమ్మని ధైర్యము వహించి రామదాసు తహసీల్ పైకంతో వివిధ ధాన్యములకుం గొట్లు, గుడి వ్రాయసకాండ్రకు గదేరాలు, నన్నదానమునకు బచన శాలలు, నుత్సవములకు

1. కంచెర్ల గోపన్న యని రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ, పుట 75-76.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథులు బాలయ్య) పుట 50, కీర్తన 53.

దేరులు, వాహనములు నేర్పఱిచెను. రామునకు బలు దోము నెలవులు, పన్నుండు తలములు, పొన్నుచోటులు, దిరము కొల్పెను. ఉత్సవ విగ్రహముల జేయించెను. తన కీర్తికి ధ్వజముగా గొప్ప ధ్వజ స్తంభమును స్థాపించెను. పది వేల వరహాలు వెచ్చించి ప్రాకారమును, పదివేల వరహాల పచ్చల పతకమును భరతునకు, పదివేల మొహారీల మొలత్రాడు శత్రుఘ్నునకు, పది వేల వరహాల ముత్యాల పతకము లక్ష్మణునకు, పదివేల వరహాల చింతాకు పతకము సీతమ్మకు జేయించెను.

మరియు పూర్వ ప్రతిష్ఠిత మూల విరాడ్విగ్రహమును గదలింప జంకి ఉత్సవ విగ్రహమును గదలింప జంకి ఉత్సవ విగ్రహముల నెలకొల్పి యితర దేవతా ప్రతిష్ఠలాచరించి మహా వైభవముతో చైత్ర శుద్ధ ప్రతిపత్తిథి మొదలుకొని బ్రహ్మోత్సవము, సాగరంబుగ, సాంతంబుగ బాంచ రాత్రోక్త ప్రకారంబున జరిపించి నవమి నాడు సీతా రామ కల్యాణమును గావించి యెన్నియో గ్రామములనుండి వచ్చిన వివిధ వర్ణముల వారి కవ్వారిగా షడ్రసాన్నములను బెట్టించుచుండెను. స్వామి కార్యమున బాల్గొన్న బుణ్యము వచ్చునని యెట్టి సోమరియు నేదో యొక పనిని సముత్సాహంబున సల్పుచునే యుండెను"[1]

సింగరదాసు రచించిన 'భద్రాచల రామదాసు చరిత్రము' అను యక్షగానం నందు రామదాసు రామాలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనలకై, ఇతర ఉత్సవాదులకై ప్రభుత్వ ధనం ఆరు లక్షలు వరహాలు ఖర్చు చేసినట్లు చెప్పబడింది. ఈ క్రింది తొహరాయే దీనికి ఉదాహరణం. రామాలయ నిర్మాణానికి భద్రాద్రి వాసులు ధన సహాయం చేయడానికి అంగీకరించారు.

"ఆ మాటలు విని యానందంబున నప్పడే శిల్పుల పిలిపించె
యా మాటలు గొని, కడు వేగంబునా కార్యము ప్రారంభించె
రామ రామా తానీషా ద్రవ్యమీ రాత్రి నిల్వ యార్లక్షల్
భీమ వినుత నీకై వ్రయపఱచిన స్వామి కందునే శిక్షల్
దేహంబనిత్యంబని తానెంచుచు ధీరతగా నూహించెన్
సాహసమున తానీషా పైకమును సరగునతా వ్రయపఱచెన్"[2]

ఈ విధంగా తలంచిన రామదాసు ఈ విధంగా కీర్తించాడు.

**"కల్యాణి రాగం - ఆది తాళం"**

"కైంకర్యము జేసెను - రామదాసు కైంకర్యము చేసెను
కైంకర్యము జేసె కాకుత్థ్సకులునకు - సంకట హరణ సర్వాత్మయని మ్రొక్కి"[3]

మరియు " గర్భ గృహ ప్రాకారం మంటపాల్ కట్టించెను కడు బాగా
నిర్భయుడై యార్లక్షల వరహాల్ నెమ్మది సెలవటు గాక
వ్రయము చేసి కోవెలలో గల ఉబయంబంతయు జేసె
భయము లేక తన కోర్కె తీరెనని బాగుగా నానందించెన్"

ఈ విధంగా ఆలయ గోపుర ప్రాకారాదులు నిర్మించి, సీతా రామ లక్ష్మణులకు వాహనాలు బంగారు ఆభరణాలు చేయించాడు. వివిధ ఉత్సవాదులు వైభవోపేతంగా నిర్వహించాడు. తన కోరిక తీరిందని ఆనంద పారవశ్యంలో మునిగాడు. ఆరు లక్షల వరహాలు ప్రభుత్వ ధనం ఖర్చు చేశాడు. తానీషా అంటే ఇక్కడ అబుల్ హసన్ తానీషాయే. అతని కాలంలోనే ఈ ఆలయం నిర్మించాడని ఇందున్నది.

1. కంచెర్ల గోపన్న అను రామదాసు -ముద్దికంటి గురునాథ శర్మ పుట 78.
2. భద్రాచల రామదాసు చరిత్రము - సింగరదాసు (యక్షగానం) పుట 24.
3. " " " " పుట 25.
4. " " " " పుట 26.

యాదవదాసు రచించిన "రామదాసు చరిత్రము" యక్షగానం నందు ఈ విధంగా తెలియజేయబడింది.

"ఇక ఆరు లక్షల వరహాల్
యెలమితో నా చేతికట్లు యెట్లయినను
నీ కలియుగమందున స్వామికి
నిలువెల్లను భూషణములు నిర్మింతు తగన్"[1]

"కోవెల ప్రాకారంబులు
భావించియు హరిని మదిలో బహు చిత్రముగన్
గావించె మంటపము
రావలసిన దేమియున్న రాముడె కలడు"[2] అని భావించి

కీర్తన : "ప్రాకారములు గట్టెను రామదాసు భీకరముగ బాగుగా
లోక రక్షకున కనేక వాహనమూలు నాక వాసులు మెచ్చనౌనని చేయించె
గుళ్ళు గోపురములును కోవెల చుట్టు వాకిళ్ళు స్వాములును
పొరులే వేళ నైవేద్యంబు జరుపూచు పూరి వారందరు ఒప్పగ జూడగ
ఆట పాటల వారలూ సొంపుగ జనము కోట్ల కొలదిగ గుంపులు మాటి మాటికి
హరిని నేటుగ గనుగొని నూటిదప్పక సేవ సుస్థిరములు జేయ ॥ 3 ॥
మ్రోగేటి తంబురులు చాన వేసేటి మరి స్వాములు ।
వాసిగ భద్రాద్రి వాసుడయ్యె రామదాసు నేలేటి శత్రు దనుజమర్దను నాకు ॥ 4 ॥[3]

మరియు, వివిధాభరణాలు, వస్త్రాదులు, స్వామికి, అమ్మవారికి, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు సమర్పించినాడు. ఈ ద్విపదలో ఈ వివరాలున్నాయి.

ద్విపద: ఇనవంశజునకు నిష్కంబుతోడ - పని బూని వేయించె బాగుగా వినుడి
ముత్యాల హారములు ముద్దుటుంగరాలు - అత్యంత ప్రీతితో నతడటు దెచ్చి
ధోవతులు లుంగీలు దెరల కల్పించి - ఖ్యాతిగ హనుమంతుగని చాల వేడ్క
చేత జేయించె దయన మొహరు సీతమ్మకు - పట్టుచీరెలే దెచ్చి
వార వారము సొమ్ము వాంఛ నర్పించి- కీరవాణి తలను కీలు జడలంచు
ఆణి ముత్యంబులు నమరంగ జేసి - నాణ్యంబు అడుత నాశికాభరణ
మును జేసి యుప్పొంగి ముందర నిలిచి - కేల్మోగిచి నుతియించి కేరుచుండె ॥[4]

ఈవిధంగా సీతా రామ లక్ష్మణులకు వివిధ ఆభరణాలు, వస్తు వాహనాలు చేయించాడు. వివిధ ఉత్సవాలు వైభవోపేతంగా చేయించాడు. ఈ విధంగా స్వామి కార్యం జరపడానికి తానీషా వారి ప్రభుత్వ ధనం ఆరు లక్షలు వ్యయమైనాయి. ఈ క్రింది "గీత పద్యం" లో ఈ విషయం స్పష్టమైంది.

గీ॥ స్వామికార్యము నీరీతి సలుపగాను
ఆరు లక్షల వరహాలు నాయె వ్యయము
యెట్లనో గాని తానీష కెవ్వరైన
దెప్పితే గాని ప్రతిమాట జెప్పగలను ।[5]

ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో రామకైంకర్యం కొరకు ఈవిధంగా ప్రభుత్వ ధనం ఆరు లక్షలు వ్యయ పరచి, అన్నిటికి రాముడే గలడని ధైర్యంగా ఉన్నాడు.

1,2,3,4,5. యాదవదాసు - రామదాసు చరిత్రము (యక్షగానము) పుట 19 - 20.

గోపన్న ఈ విధంగా సీతారాములకు కైంకర్యం చేసి, వారిని సేవించి ఆనందించి వారిని వర్ణిస్తూ కీర్తనలు రచించాడు రామదాసు.

**"రేగుప్తి - రూపక"**

" వందే విష్ణుం దేవ మశేష స్థితి హేతుం - త్వామధ్యాత్మ జ్ఞానిభిరంతర్హృది భావ్యం
హేయా హేయాద్వంద్వ విహీనం పరమేకం - సత్తా మాత్రం సర్వ హృదిస్థం దృశి రూపం"[1] ఇది సంస్కృత కీర్తన. ఇది సుదీర్ఘమైనది. రాముని స్తుతిస్తు పాడిన కీర్తన ఇది.

**" మోహన - ఆది "**

*"వందే రఘురామ శుభనామ - శుభనామ తులసీ దళదామాభి రామ ॥*
*కనక మణి మయ హార సుకుమార - సుకుమార పంక్తి రథ మహిత కుమార*
*సువిహార అరిశూర భూధర ధీర కల్మష దూర - పాలిత వారణ దారుణ కారణ మదహరణ*
*రఘువీర రఘువీర నీరదాభ విమల శరీర నిర్వికార"[2]*

ఈ విధంగా రాముని సుగుణాలను వర్ణించాడు రామదాసు. సౌందర్యాన్ని వర్ణించాడు. రామాయణేతి వృత్త ప్రధానమైన కీర్తన ఇది. "రామావతార రహస్యాన్ని" ఈ క్రింది కీర్తనయందు తెలియజేశాడు రామదాసు.

**" వరాళి - త్రిపుట "**

*ఎంతో మహానుభావుడవు నీవు - ఎంతో చక్కని వాడవు*
*వింతలు నీవు చేసితివి లోకమందు - సంతత భద్రాద్రి స్వామి రామచంద్ర ॥ఎంతో॥*
*తొలి వేల్పు జాంబవంతుని జేసినావు - మలి వేల్పు పవనజుగా జేసినావు*
*వెలయ సూర్యు సుగ్రీవుగ జేసినావు - అల సర్వసురల కోతుల జేసినావు ॥ ఎంతో॥*
*కారణ శ్రీ సీతగా జేసినావు - గరిమ శేషుని లక్ష్మణుని జేసినావు*
*ఆ రెంటిని భరత శత్రుఘ్నుల జేసినావు - నారాయణ నీవు నరుడవైనావు ॥ ఎంతో ॥*
*రాతికి ప్రాణము లిప్పించినావు - నాతి యెంగిలి కానందించినావు*
*కోతి మూకల నెల్ల గొలిపించినావు - నీటిపై కొండల నిల్పించినావు ॥ఎంతో ॥*
*లంకపై దండెత్తి లగ్గెక్కినావు - రావణ కుంభ కర్ణుల ద్రుంచినావు*
*పంకజాక్షి సీతమ్మ బాలించినావు - లంకేశు దివ్య పుష్పక మెక్కినావు ॥ ఎంతో॥*
*వరగ నయోధ్యకు వర తెంచినావు - పట్టాభిషిక్తుడై పాలించినావు*
*వర భద్రగిరియందు వసియించినావు - ధరలో రామదాసు నేలినావు ॥ఎంతో॥[3]*

ఈ కీర్తనలో బ్రహ్మ జాంబవంతునిగాను (తొలి వేల్పు), మలివేల్పు - శివుడు హనుమంతునిగాను, సూర్యుని- సుగ్రీవునిగాను, దేవతలందరూ వానరులుగాను జన్మించారు. లక్ష్మీదేవి 'సీత'గా జన్మించింది. ఆదిశేషుడు లక్ష్మణునిగాను, శంఖ, చక్రాలు భరత, శత్రుఘ్నులుగాను, నారాయణుడు రాముడుగాను ఈ భువిపై అవతరించారు. దుష్టుడైన రావణుని సంహరించడానికే ఇలను అవతరించాడు నారాయణుడు. రాముడు రాయిగా ఉన్న అహల్యకు శాప విముక్తి నొసంగాడు. శబరి యెంగిలి పండ్లను ప్రీతితో ఆరగించి, ఆమెకు మోక్షమొసంగినాడు. వానరుల సహాయంతో సముద్రంపై వారధి నిర్మింపజేసి లంకపైకి దండెత్తి, రావణ కుంభకర్ణులను ద్రుంచినాడు. రావణునిచే చెరపట్టబడిన సీతను రావణ సంహారం జరిపి ఆమెను

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 142, కీర్తన 173.
2. " " " " " పుట 147, కీర్తన 179.
3. " " " " " పుట 31, కీర్తన 29.

కాపాడినాడు. రావణుడు సీతనపహరించి లంకలో అశోక వనంలో ఉంచగా, ఆమె జాడను హనుమంతుని ద్వారా కనుక్కొని, రాముడు లక్ష్మణ, వానరుల సమేతుడై లంకకు వెళ్ళి రావణ సంహారం గావించి, ఆ తర్వాత అందరూ కలిసి అయోధ్యకు వచ్చిన తర్వాత, అయోధ్యా నగరానికి పట్టాభిషిక్తుడై రాజై, రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించాడు. భద్రగిరియందు ఆ రాముడే సీతా లక్ష్మణ సమేతుడై వెలిశాడు. రామదాసునేలినాడు. ఈ విధంగా "రామావతార " రహస్యాన్ని ప్రాముఖ్యతను లోకానికి చాటాడు. ఈ విధంగా రామదాసు రాముని స్తుతించాడు.

విద్వాన్ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు గారు రామదాసు రామాలయ నిర్మాణం కొరకు ఎటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ధనం ఖర్చు చేశాడో వివరించారు. " అనవరతాన్న దానములు సేయుచు ప్రజలలో భక్తి ప్రబోధము సేయుచు గ్రామీణులతో నాలోచించి ఆలయ నిర్మాణమారంభించెను. కాని సహాయ పడుదమన్న గ్రామస్థులు మాట నిలుపుకొన లేకపోవుటచే, ప్రభుత్వమొత్తిడి చేయు లోపల సరి పెట్టలేమా యను ధైర్యముతో సర్కారు పైకముతో వాస్తు శాస్త్రానుసారము భద్రాద్రి గోపురాలయ నిర్మాణము చేయించెను. తగు మాత్రము గరుడ, శేష, హనుమద్వాహనములు, ముఖ కల్యాణాధ్యయన మంటపములు, రెండు గోపుర ప్రాకారములు నిర్మించెను. ఆలయ ప్రదక్షిణము చేసి వచ్చునపుడు వెనుక భద్రుని గుడి మంటపము గలదు. సజీవుడయి యిచట రూపుడయి యున్న భద్రుని శిరఃస్థానమిదియనుటకు పెక్కు నిదర్శనములు కన్పించినవి".[1]

దీనిలో రామదాసు ఆరు లక్షల ధనం ఖర్చు చేసినట్లు చెప్పలేదు. కాని ప్రభుత్వ ధనం వ్యయపరచి ఆలయ గోపుర ప్రాకారాదులు నిర్మించాడని, వాహన ఆభరణాదులు చేయించాడని తెలియజేయబడింది.

భద్రాచల రామునకు చేయించిన ఆభరణాలు, సీతా రామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు చేయించిన ఆభరణాలు, రామ ప్రతిష్ఠ జరిగిన తీరును వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు ఈ విధంగా తెలియజేశారు. రామదాసు, 'చింతాకు పతకం, పచ్చల పతకం, కలికి తురాయి, బిళ్ళల మొలత్రాడు, గజ్జెలందెలు, రవ్వల కుండలాలు గల నీలాల చెవి పోగులు, చిన్న కిరీటాలు, గొలుసు+మంగళ సూత్రాలు, జడ కొప్పులు మొదలైన మూల్యాభరణాలు చేయించాడు. గండకీ నది నుండి యేబది నాల్గు సాలగ్రామాలను తెప్పించి రెండు నక్షత్ర హారాలు సంతరించి, రామ లక్ష్మణులకు అలంకరించాడు. శ్రీ రామాలయం ప్రక్క రాజవీధి కవతల శ్రీ కాశీ విశ్వనాథుని ప్రతిష్ఠ చేశాడు. రామ లింగేశ్వరుని యభిషేక తీర్థం కనబడకుండా గోదావరిలో కలుస్తుంది. శివరాత్రికిచట కల్యాణోత్సవాలు జరుగుతాయి. దీనిపై గుట్టపై రంగనాథ స్వామి ఆలయంలో మాఘ పూర్ణిమకు కల్యాణం, రథ సప్తమికి పల్లకి సేవ జరుగుతుంది. శ్రీరామదాసు గారానాడు వెచ్చించిన ధనంతోనే శ్రీరామచంద్ర ప్రభువునికనంత కల్యాణోత్సవాలు జరుగుతూ భద్రాచలం నేటికిని, కలి యుగ వైకుంఠమన వెలియుచున్నది. రామదాసుగారు రామానుగ్రహమంది సాయుజ్యమందిరి'.[2] అని విద్వాన్ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు గారు రామదాసు నిర్మించిన రామాలయం, విగ్రహ ప్రతిష్ఠాపనాదుల గూర్చి వివరించారు.

కె.వి.భూపాలరావు గారు అనే చారిత్రక పరిశోధకులు ఈ విధంగా తెలియజేశారు. "రామదాసు దేవాలయాన్ని కట్టలేదు, ఉద్ధరించినారు. రామదాసు తయారు చేయించిన ఆభరణాలు ఇప్పుడు నిజమైనవి లేవు అని వారి ఉద్దేశ్యం. అవి ఎలా మారాయో తెలీదు అని కూడా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాని, ఈ అభిప్రాయం సరియైనది కాదు. ఆనాడు రామదాసు చేయించిన ఆభరణాలే ఈనాడు ఉన్నాయి. అవి భద్రాద్రి దేవాలయ శాఖ వారు భద్రపరచి ఉంచారు. "రామదాసు తహసీల్దారుగా ఉండి భద్రాచలంలో

1,2 . భద్రాద్రి రామ ప్రభువు - చరిత్ర స్మృతి మాల - విద్వాన్ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు.

ప్రభుత్వం సొమ్ము ఆరు లక్షల వరహాలు ఖర్చుచేసి భద్రాచల దేవాలయ నిర్మాణం చేశాడు"[1] అని కవి రాజ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు శ్రీ భద్రాచల రామ చరిత్రమున తెలియజేశారు. "ఇప్పటికి 300 సంవత్సరాల పూర్వం అనగా క్రీ.శ. 1652 ప్రాంతమున ఇచ్చట చిన్న రామాలయాన్ని కంచెర్ల గోపన్న అనే యనునాతడు అనేక కట్టడాలతో పెంచి బృహత్తర మొనర్చాడు. గోపన్న తానీషా శిస్తు పేర వసూలైన ప్రజాధనంతో పెద్ద రామాలయాన్ని, గోపురాదులను నిర్మించి సముద్ధరించాడు. అనంతర కాలంలో హిందూ మత ద్వేషులైన ముస్లింల విధ్వంస కార్యాలతో ఈ రామాలయం చాలావరకు నష్టాలపాలైంది. 1959-60లో మరల ఈ ఆలయం సముద్ధరింపబడింది".[2] అని శ్రీ రామాలయ సముద్ధరణ అనే వ్యాసంలో తెలియజేయబడింది.

వేదగిరి రాంబాబుగారు రామదాసు ఖర్చు చేసిన 6 లక్షల వరహాల గూర్చి వరహా విలువను ఆనాటి వరహాల లెక్కను గూర్చి ఈ విధంగా తెలియజేశారు.

**వరహాలు - నాణాలు (కుతుబ్షాహీల కాలంనాటి) :**

" రామదాసు 6 లక్షలు వరహాలు ఖర్చు చేసి రామాలయ నిర్మాణ కైంకర్యాదులు చేశాడు. ఒక్క వరహా అంటే 3 రూపాయలు (ఈనాటి విలువ ప్రకారం) అంటే 18 లక్షల రూపాయలన్నమాట. ఈ వరహాలనే 'హొన్ను' అని కూడా అన్నారు. బంగారు నాణాలను "హొన్ను"లని వ్యవహరించారు. ఇవి తానీషా కాలం నాటి నాణెములు".[3]

రామాలయ నిర్మాణం గూర్చి మార్టిను, హోవార్డులనే డచ్చి చరిత్రకారులు తమ గ్రంథంలో ఇలా వ్రాశారు. "శ్రీరామచంద్రునందు ఇతను విశేషమగు భక్తి కలవాడు. భక్తి పారవశ్యమున అతను ప్రభుత్వపు బొక్కసము నుండి అనేక లక్షల హొన్నులు ద్రవ్యమును వ్యయపరచి సుందరమగు నొక గొప్ప గుడి గట్టించెను. శ్రీ రామునకు అమూల్యములగు అనేకాభరణములను జేయించెను.[4] హొవార్డు, మార్టిన్ల వ్రాతల ప్రకారం, అనేక లక్షల హొన్నులు ఖర్చు చేశాడని ఉంది. కాని రామదాసు 6 లక్షల హొన్నులు ఖర్చు చేశాడని రామదాసు చరిత్రకర్తలు, విమర్శకులు తెలియజేశారు. భూపాలరావుగారి గ్రంథంలో "వరహా" గురించి ఇలా ఉంది. వరహా = 15 ఫనములు (బంగారు) లేక మూడున్నర రూపాయలు లేక ఎనిమిది షల్లింగులు.

**వరహా :** "ఇది బంగారు నాణము. దీనిని **హొన్ను** అనియు అనెడివారు. ఐరోపీయులు దీనిని **పగోడ** అనెడివారు. దీని మూల్యము నాడు దాదాపు మూడున్నర రూపాయలు . హొన్ను అన్నా వరహా అన్నా ఒక్కటే.[5] రామదాసు గోల్కొండ నవాబుల రాజ ధనమును వెచ్చించి గౌతమీ తటమున ఆరు లక్షల వరహాలు వెచ్చించి గౌతమీ తటమున సీతారాములకు ఆలయ ప్రాకారములను ఆరులక్షల వరహాలు వెచ్చించి కట్టించెను అని స్తంభాద్రి[6] అనే చారిత్రక గ్రంథంలో తెలియజేయబడింది. 'కృష్ణా మండల చరిత్ర'లో ఈ విధంగా తెలియజేయబడింది." "గోపన్న భద్రాచలం తాలూకా తహశీలుదారు పనిలో చేరి, రామదాసు ద్వారా ప్రభువుకు రైతులు చెల్లించిన శిస్తు ఆరు లక్షల రూపాయలు భద్రాద్రిలో శ్రీరామ దేవాలయమునకు ఖర్చు పెట్టెను.[7]

"రామదాసు నాటకము" నందు డి. వెంకట రమణయ్య గారు కూడా, "భద్రాచలాన దేవాలయం కట్టించడానికి, రామదాసు సర్కారు పైకం ఆరు లక్షల రూపాయలను వ్యయ పరచాడని తెలియజేశారు."[8] "భద్రాచలంలో తహసీల్దారుగా ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ధనాన్ని ఆలయ గోపుర ప్రాకారాది కార్యాలకు, భగవన్మూర్తుల అలంకారాలకు వెచ్చించి దారుణమైన బాధలను కొనితెచ్చుకొని, వాటిని అనుభవించడంలోనే

1. శ్రీ భద్రాచల రామచరిత్రము - కవి రాజ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
2. శ్రీ రామాలయ సముద్ధరణ (వ్యాసం)-ఆరాధన జూన్ 1960, వాల్యూం 4.
3. నాలుగు శతాబ్దాల నగరం - సి. వేదగిరి రాంబాబు.
4. అక్కన్న మాదన్నలు - కె.వి.భూపాలరావుగారు పుట 57.
5. " " " పుట 90.
6. స్తంభాద్రి - కొదమసింహం సత్యనారాయణా చార్యులు పుట 83-84.
7. కృష్ణామండల చరిత్ర - గుడిపాటి వేంకటేశ్వర శర్మ, పుట 41-42.
8. రామదాసు నాటకము - డి. వెంకట రమణయ్య, పంచమాంకము.

రామానుగ్రహాన్ని పొంది తరించి పోయిన దివ్యాత్ముడు రామదాసు"[1] అని స్వామి సుందరచైతన్యానందుల వారు అన్నారు. భక్తితోనే ఈయన ప్రభుత్వ ధనమైనా లెక్క చేయకుండా నిర్భయంగా రామ కైంకర్యానికై ఖర్చు చేసినాడు. రామదాసు అపారమైన రామభక్తికి ఇది నిదర్శనం.

'కృష్ణా జిల్లా మాన్యువల్‌లో రామాలయ నిర్మాణం గూర్చి ఈ విధంగా వ్రాయబడింది. " The Gopanna was so ardent avotary of Rama that he asumed the name of Ramadas and set to work to improve the temple of Rama at Bhadrachalam, using freely the public mony that came into his hands. This expenditure caused unchecked for years until it amounted to some lakhs of rupees, but a time reckoning must come at last even for a Devan's nephew and Ramadas found himself called to account and thrown into a dungeon.[2]

ఇందులో రామదాసు ఖర్చు చేసిన ధనం ఎంతో చెప్పబడలేదు. కొన్ని లక్షలు ఖర్చు చేశాడనే ఉంది. "రామదాసు ప్రభుత్వ ధనాన్ని పై అధికారులకు చెప్పకుండా వ్యయం చేశాడు. భద్రాచలం రాముని ఆలయం బాగు చేయించడానికే ఖర్చు చేశాడు. ఆ వ్యయాన్ని ఆమోదించవలసిన పై అధికారులున్నారు. వాళ్ళు ఆమోదించలేదు అనేది నిజమై ఉంటుంది"[3] అని జి.కృష్ణ తన 'ప్రముఖ వాగ్గేయకారులు' అనే పుస్తకంలో తెలియజేశారు. రామదాసు నాటకంలో ధర్మవరం గోపాలాచార్యులు ఈ విధంగా వ్రాశారు. " రామదాసు 2140 ఖైదీలను విడుదల చేసి రామ కైంకర్యానికి వినియోగించాడు. 2 లక్షల చందాగా వసూలు చేశాడు. తర్వాత ఆరు లక్షల పైకం ప్రభుత్వం సొమ్ము ఆలయ నిర్మాణానికి ఖర్చు చేయదలచినట్లు ఆ ధనం ఏటా వాయిదాల వారీగా రైతులు చెల్లించనున్నట్లు తానీషాగారికి విన్నవించుకున్నారు. ఒక ధర్మ కార్యానికై ఖర్చు చేసే ఈ ధనానికై అనుమతి తానీషాను కోరారు రామదాసుగారు."[4]

రామదాసు 2140 మంది ఖైదీలను విడుదల చేసి రామాలయ నిర్మాణానికై, రామ కైంకర్యానికై వినియోగించడం అసత్యం. ఆరు లక్షలు పూర్తిగా ప్రభుత్వ ధనం రామదాసు రామాలయ నిర్మాణానికి వినియోగించలేదు. 2 లక్షలే వినియోగించాడు. 2 లక్షలు చందాలు వసూలు చేశాడు. 2 లక్షలు "పన్ను ధనం". అది ఖజానాలో నిలువ ఉంది. సితార మనుషులు దోచుకున్నారు. ఇంక 2 లక్షలు పన్ను వసూలు కానీకుండా చేశారు. అది కూడా రామదాసు ఖర్చు కింద జమ చేయబడింది. "భక్త రామదాసు అను రామదాసు విజయము" అనే నాటకంలో కీ.శే. కేతవరపు శివరామ శాస్త్రిగారు "రామదాసు రామాలయ నిర్మాణానికై 6 లక్షల ద్రవ్యాన్ని వ్యయ పరచాడని తెలియజేశారు. ఇంకా రాముడు గోపన్న కలలో కనబడి రామాలయం కట్టమని చెప్పినట్లు అందుకై ధనం లేనందున సర్కారు పైకం ఖర్చు చేశాడు గోపన్న- అని అందరూ అనుకుంటున్నారని భటులు చర్చించుకున్నారు."[5]

" శ్రీ రామదాసు " అనే నాటకాన్ని రచించిన రామ నారాయణ కవులు రామదాసు రామాలయ నిర్మాణం గావించిన విధానం గూర్చి ఇలా వ్రాశారు. "భద్రాచల నివాసస్థులందరు సహకరించి, ధన సహాయం కొందరు, శ్రమ సహాయం కొందరు, వస్తు సహాయం కొందరు చేసి ఆలయ గోపుర ప్రాకార మంటపాదులు నిర్మించారు. గోపన్నగారు భద్రాద్రి ప్రజల సహాయంతో రామాలయ నిర్మాణం పూర్తి చేశారు. 6 లక్షల సర్కారు పైకం వ్యయపరచి ఆలయ నిర్మాణం గావించారు. రామ లక్ష్మణులకు సీతమ్మకు ఆభరణాలు చేయించారు.

1. "పలుకే బంగారం" - స్వామి సుందర చైతన్యానంద, గిరిధారి, జనవరి, పుట 49.
2. కృష్ణా జిల్లా మాన్యువల్ పుట 37,38.
3. ప్రముఖ వాగ్గేయకారులు , జి.కృష్ణ పుట 22.
4. రామదాసు నాటకము - ధర్మవరం గోపాలాచార్యులు (చతుర్థాంకము)
5. భక్త రామదాసు అను - రామదాసు విజయము - కీ.శే. కేతవరపు శివరామశాస్త్రిగారు 1924, చతుర్థాంకము.

'గోపన్న' అనే గ్రంథంలో కీ.శే. గరిమెళ్ల సత్య గోదావరి శర్మగారు, "రామాలయ నిర్మాణం, జీర్ణోద్ధరణను తాను అనుకున్న ప్రకారం పూర్తి చేశాడని, నాలుగేండ్ల సర్కారు శిస్తు పైకం ఆరు లక్షల రూపాయలు వసూలు చేసి పంపమని, తానీషా ఆజ్ఞాపించగా ఆధనం ఆలయం నిర్మాణానికై ఖర్చు చేసినట్లు, త్వరలోనే తీరుస్తానని తానీషాకు లేఖ పంపినట్లుగాను తెలియజేశారు".[1]

"రామదాసు చరిత్రము" అనే కావ్యంలో చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు ఈ విధంగా తెలియజేశారు.". . . .*యష్టరగణాలో దా గూర్చిన యాఱు లక్షల రాజ ద్రవ్యంబును శ్రీరామ గోపురాలయాదులకు వెచ్చించె భద్రాద్రియు సఖండ శోభా బంధురంబై భూలోక వైకుంఠమయ్యె*"[2] అని వ్రాశారు కవి. ఇందు ప్రభుత్వ ధనం ఆరు లక్షలు శిస్తు పైకం రామాలయ నిర్మాణానికి ఖర్చు చేశాడని చెప్పబడింది. వివిధాభరణాదులు, వస్త్ర వాహనాదులు రామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు చేయించాడు రామదాసు. ఆలయ నిర్మాణానికై, ఇతర ఆభరణాదులు, వాహనాదులకు భద్రాద్రి ప్రజలిచ్చిన సొమ్ము సరిపోయింది. ప్రతిష్ఠకై ధనం చాల్లేదు. అందుకే ఆరు లక్షల ధనం ప్రభుత్వ పైకం వెచ్చించి ప్రతిష్ఠాదులను నిర్వర్తించాడు రామదాసు".

'శ్రీరామదాసనాటకం' అనే గ్రంథంలో కేశిరాజు వేంకట సుబ్బరాయకవి "భద్రాచల వాసుల సహాయంతోను, ప్రభుత్వ ధనం ఆరు లక్షల పైకం వెచ్చించి రామాలయ నిర్మాణ కార్యక్రమం పూర్తి చేశాడు. రామ లక్ష్మణులకు వివిధాభరణాలు, వస్త్ర వాహనాలు తయారు చేయించాడు. ప్రతిష్ఠ, సంప్రోక్షణాది కైంకర్యాలు చేయించాడు"[3] అని వ్రాశారు.

'గ్రేట్ కంపోసర్స్' అనే గ్రంథంలో "రామాలయ నిర్మాణం" గూర్చి ఈ విధంగా వ్రాయబడి ఉంది.

"The Rama shrine for which Bhadrachalam was will known was in a damaged state. Ramadas felt that he should repair the temple and provide the Rama image here with new jewels, upon that time Ramadas was prompt in remitting the revenues of his division to the central Treasury but after his mind turned to the renovation of the Rama shrine, the collection came to be directed towards the Rama shrine and not to the Padshah's exchequer. In one of his songs on Bhadrachala Rama and his temple there, Ramadas describes the golden pinnacles of the towers of this temple, the bejeweled flag staff, the tank, the garden, the surrounding shrines the agrahara etc., From this song which refers to Bhadrachala as Vaikuntha on earth in this Kali age. We may see the nature and extent of improvement that Ramadas had effected in the Temple".[4]

రామదాసు జీర్ణమైన ఆలయాన్ని ఉద్ధరించేందుకై ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ ధనం ఖర్చు చేశాడు. అద్భుతంగా ఆలయం నిర్మించాడు. రామ లక్ష్మణులకు, సీతాదేవికి విలువైన ఆభరణాలు, వస్త్ర వాహనాలు చేయించాడు. ఈ భద్రాద్రి ఆలయ నిర్మాణం శోభను, ఆలయ శిఖరంపై నున్న చక్రం, ఆ చుట్టు ప్రక్కల ఉన్న వనాలు, ఆలయ ప్రాంతంలోని అగ్రహార పురాలను చక్కగా వర్ణించాడు తన కీర్తనల్లో. ఆ కీర్తనలు కలియుగ వైకుంఠము - వర భద్రాచల నిలయము, అదిగో భద్రాద్రి అనేవి. భద్రాచలాన్ని వైకుంఠంగా వర్ణించాడు రామదాసు.

**"వరాళి -ఆది"**

*అదిగో భద్రాద్రి గౌతమి ఇదిగో చూడండి - ముదముతో సీతా ముదిత లక్ష్మణులు*

1. గోపన్న - గరిమెళ్ల సత్యగోదావరి శర్మ.
2. రామదాసు చరిత్రము - చల్లా పిచ్చయ్య శాస్త్రి (కావ్యం) పుట 97.
3. శ్రీ రామదాస నాటకము - శ్రీ కేశిరాజు వేంకట సుబ్బరాయ కవి.
4. "Great Composers - Bhadrachala Ramadas - Dr. V. Raghavan P.No. 14-15.

కదసి కొలువుగా రఘుపతి యుండెడి ॥ అదిగో ॥
చారుస్వర్ణ ప్రాకార గోపుర ద్వారములతో సుందరమై యుండెడి ॥
అనుపమానమై అతి సుందరమై తనరు చక్రమున ధగ ధగ మెరిసెడి ॥
కలియుగమందున గల వైకుంఠము నలరుచున్నది నయముగ మ్రొక్కుడి ॥
శ్రీకరముగ నిల రామదాసుని ప్రాకటముగ బ్రోచే ప్రభు వాసము "[1]

ఇందు భద్రాద్రి రామాలయ సౌందర్యం వర్ణింపబడింది. ఆలయం పై నుండే సుదర్శన చక్రం గూర్చి కూడా ఈ కీర్తనలో ప్రస్తావించడం జరిగింది. నిజంగానే భద్రాద్రి ఆలయ ప్రదేశం గోదావరీ నదీ పరివాహ ప్రాంతం యొక్క అందం, చుట్టు పాపి కొండలు, అందమైన దండక వనం యొక్క సౌందర్యం చూపరులకు తిలకించడానికి అద్భుతంగా ఉంటుంది. ఆ రమణీయమైన శోభాయమానమైన భద్రాద్రి ఆలయ ప్రదేశం యాత్రికులను ఆకట్టుకునే కలియుగ వైకుంఠమే. భూలోక స్వర్గమే అనదగింది. ఇందు అతిశయోక్తి ఎంతైనా లేదు. భద్రాచలమునందున్న ప్రకృతి రమణీయమైన దృశ్యాలు ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తాయి. భక్తి, రక్తి, అనురక్తి ఈ మూడింటి సమ్మేళనమే భద్రాచల క్షేత్రం.

"కలియుగ వైకుంఠము -భద్రాచల నిలయము సేవింతము"[2] అనే కీర్తనలో ఆ భద్రాచల ప్రాంతంలోని ప్రకృతి రమణీయ దృశ్యాలను కవి చక్కగా చిత్రీకరించాడు.

"ఆనంద భైరవి - ఆది"

*తీరైన పుర వీధులు - సొగసైన కోనేరు సోపానములు - సకల ఫల తరువులు వనములు - అందుల ఋషి గంధర్వ వాసములూ సరసిజాక్షి ! వినవె సరిలేని గోదావరి స్నానమున సంపత్కరమై యొప్పినది॥*
*"చక్కని స్త్రీ పురుషులు - పట్టణమందు పిక్కటిల్లగ వింతలు - బ్రాహ్మణులు మక్కువతో జేసెడి పూజలు - వేద శాస్త్ర తార్కిక వైష్ణవులు గ్రక్కున వారిని కన్నుల జూచిన నెక్కువైన పుణ్యమేమని తెల్పెదు॥*

రెండవ చరణంలో అగ్రహారాలు గూర్చి తెలియజేయబడింది. మొదటి దానియందు భద్రాచల దేవాలయం సమీపంలోని గోదావరి నది, ఫల పుష్ప వనాలు, మొదలైన వాటి గూర్చి వర్ణింపబడి ఉంది. ఈ విధంగా ఈ రెండు కీర్తనల యందు భద్రాద్రి ఆలయ సౌందర్యం, భద్రాచల పురాన్ని అక్కడి ప్రకృతి సౌందర్యం గూర్చి వర్ణించబడినాయి. కలియుగ వైకుంఠం గా ఈ కీర్తనల్లో భద్రాచలం చెప్పబడింది. అందు వెలసిన వారు సాక్షాత్ శ్రీ లక్ష్మీ నారాయణులు అని రామదాసు అద్భుతంగా వర్ణించారు.

'హిస్టరీ ఆఫ్ కుతుబ్షాహీ డైనాస్టీ' అనే ఆంగ్ల చారిత్రక గ్రంథంలో హెచ్.కె. షేర్వాని రామదాసు రామాలయ నిర్మాణం గావించిన విధం గూర్చి ఇలా తెలియజేశారు.

" Instead of remitting the amount collected he quietly constructed a temple sacred to Srirama at his head quarters"[3]

గోల్కొండ ప్రభుత్వానికి చెల్లించవలసిన వసూలైన పన్ను తాలూకు ధనం ప్రభుత్వానికి పంపకుండా ఆ ధనాన్ని ప్రభుత్వం వారి ఆజ్ఞ లేకుండానే రామాలయ నిర్మాణానికి ఖర్చు చేశాడని హెచ్.కె.షేర్వాని పేర్కొన్నాడు. ఎంత ధనం ఖర్చు చేశాడో ఈయన తెలియజేయలేదు.

ఈ పై చారిత్రకాంశాలు, రామదాసు చరిత్ర గ్రంథాలు పరిశీలించిన తర్వాత, రామదాసు రామాలయ నిర్మాణానికై ప్రభుత్వ ధనం ఖర్చు చేశాడని తెలుస్తుంది. ఆరు లక్షల ధనం ఈ కైంకర్యానికి

1. భక్త రామదాసు కీర్తనలు పుట 1, కీర్తన 1.
2. భక్త రామదాసు కీర్తనలు పుట 50, కీర్తన 53.
3. ది హిస్టరీ ఆఫ్ కుతుబ్షాహీ డైనాస్టీ - హెచ్.కె.షేర్వాని పుట 606.

ఖర్చు చేశాడని, రామదాసు చరిత్ర గ్రంథాలు తెలియజేస్తున్నాయి. అయితే ఈ రామదాసు ఆలయ నిర్మాణం, గోపుర, ప్రాకార, మంటపాదులకు ఇతర ఆభరణాలు, వస్తు వాహనాలు అన్నిటికి భద్రాచల వాసుల వద్ద చందాగా వసూలు చేసిన ధనం రెండు లక్షలు వరహాలు ఖర్చు చేశాడని, తక్కిన సంప్రోక్షణ, ప్రతిష్ఠ మొదలైన ఉత్సవ కార్యక్రమాలకు మాత్రం ప్రభుత్వ ధనం 2 లక్షల వరహాలు ఖర్చు చేశాడని కొన్ని చారిత్రక గ్రంథాల ద్వారా తెలుస్తుంది. దీన్నిబట్టి ఆలయ నిర్మాణానికి కాక, విగ్రహ ప్రతిష్ఠాపన, సంప్రోక్షణాది షోడశోపచార విధులకు, కైంకర్యాలకు గోల్కొండ ప్రభుత్వం వారి సొమ్మును ఉపయోగించే సాహసం రామదాసు చేశాడని చెప్పవచ్చును. దానికి 6 లక్షలు ఖర్చయిందని మాత్రం నిర్దిష్టంగా చెప్పగాలము. దీనికి ఇంతకు ముందే వివరణ ఇచ్చాను. రామదాసు సీతా రామ లక్ష్మణులకు చేయించిన ఆభరణాలు, వస్తు వాహనాల గూర్చి తన కీర్తనల్లో ప్రస్తావించాడు. ఇదే విషయాన్ని పి. సాంబమూర్తిగారు ఈ విధంగా తెలియజేశారు.

" The list of jewels that he made for the dieties and the amounts he spent on them are recounted in the song".[1] 'ఇక్ష్వాకు కుల తిలక'

### 4.8.4. ఆలయ నిర్మాణం, ఆభరణాలు, వస్తు వాహనాదుల ప్రసక్తి ఉన్న రామదాసు కీర్తనలు :

**"కాంభోజి - త్రిపుట"**

*ఇక్ష్వాకు కుల తిలక ఇకనైన పలుకవె రామచంద్రా - నన్ను రక్షింపకున్నను రక్షకు లెవరింక రామచంద్రా*

*1. చుట్టు ప్రాకారములు సొంపుతో గట్టిస్తి - రామచంద్రా - ఆ ప్రాకారానికి బట్టె పదివేల వరహాలు రామచంద్రా*

*2. గోపురమంటపాలు కుదురుగ కట్టిస్తి రామచంద్రా - నన్ను క్రొత్తగ జూడక యిత్తరి బ్రోవుము రామచంద్రా॥*

*3. భరతునకు చేయిస్తి పచ్చల పతకము రామచంద్రా - ఆ పతకానికి బట్టె పదివేల వరహాలు రామచంద్రా*

*4. శత్రుఘ్నునకు నేను జేయిస్తి మొలత్రాడు రామచంద్రా - ఆ మొలత్రాటికి బట్టె మొహరీలు పదివేలు రామచంద్రా*

*5. లక్ష్మణునకు చేయిస్తి ముత్యాల పతకము రామచంద్రా - ఆ పతకానికి బట్టె పదివేల వరహాలు రామచంద్రా*

*6. సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా - ఆ పతకానికి బట్టె పదివేల వరహాలు రామచంద్రా*

*7. వాహనములు మీకు వరుసతో జేయిస్తి రామచంద్రా - జగన్మోహన సంకెళ్ళు వేసిరి కాళ్లకు రామచంద్రా*

*8. కలికితురాయి నీకు పొలుపుగ జేయిస్తి రామచంద్రా - నీవు కులుకుచు దిరిగెదవు ఎవరబ్బ సొమ్మని రామచంద్రా*[2]

ఈ విధంగా రామదాసు తాను సీతా రామ లక్ష్మణులకు చేయించిన ఆభరణాలు, వాహనాలు, ఆలయ ప్రాకార, గోపుర, మంటపాదుల గూర్చి ఈ కీర్తనలో వర్ణించాడు. ఈ కీర్తనను బట్టి చూస్తే తెలిసే విషయాలివి. గోపుర ప్రాకార మంటపాదులకు పదివేల వరహాలు ఖర్చు చేశాడు. భరతునికి పచ్చల పతకానికి పదివేల వరహాలు, శత్రుఘ్నునకు మొలత్రాటికి పదివేల మొహరీలు, లక్ష్మణునకు ముత్యాల పతకానికి పది వేల వరహాలు, సీతమ్మ చింతాకు పతకానికి పదివేల వరహాలు ఖర్చు చేసినట్లు చెప్పాడు. శ్రీరామునికి కలికి తురాయి ఇంకా ఇతర వాహనాలు చేయించాడు. ఇదంతా సర్కారు పైకంతో చేయించానని రామదాసు చెప్పకున్నాడు అందుకే

"సర్కారు పైకము తృణముగ నెంచుమీ రామచంద్రా

దెబ్బరమున గాచి యప్పు దీర్చుమయ్య రాచంద్రా ॥ అని అన్నాడు. సర్కారు పైకం రాముడే తీర్చ గలడన్న ధీమాతోనే రామదాసు ఈ ఖర్చు చేశాడు. అయితే సర్కారు పైకం తీర్చనందున జైలు పాలయ్యాడు. తర్వాత రాముడే ఈ అప్పు తీర్చి రామదాసును విడుదల చేయించాడు. మరో కీర్తనలో కూడా ఈ ఆలయ నిర్మాణానికి అయిన వ్యయం గూర్చి ప్రస్తావించాడు రామదాసు. ఆ కీర్తన ఇది.

1. P. Samba Murthy -Great composers Chapter VI, Bhadrachala Ramadas P.No.55.

2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - [illegible]) పుట 21-22 కీర్తన 10

3. " " " " పుట 22.

**"కాంభోజి - ఆది"**

ఇక్ష్వాకు కుల చంద్ర ఇట్టులుండుట మేర రామచంద్రా-నన్ను రక్షింప జూడవు రాజీవ దళనేత్ర రామచంద్రా
1. గోవిందుడని నీకు గోపురమెత్తితి రామచంద్రా -మదిని భావింప గోపురము పదివేల వరహాలు రామచంద్రా
2. ప్రాకారములు మూడు పటిమతో గట్టితి రామచంద్రా - ఆ ప్రాకారమొకటికి పదివేల వరహాలు రామచంద్రా
3. గరుడధ్వజుడవని గరుడస్తంభము వేయ రామచంద్రా-నాకు వరుసడి పదివేలవరహాలు సెలవాయె రామచంద్రా
4. మా మనోహర నీకు మకుటము చేయించ రామచంద్రా - రామస్వామీ పదివేల వరహాలు పట్టెను రామచంద్రా
5. పాలింతువని నీకు పాలకి జేయింప రామచంద్రా - నాకు ఫలమేమి పదివేల వరహాలు సెలవాయె రామచంద్రా
6. ఆభరణములనెల్ల నానాడె జేసితి రామచంద్రా-ఆభరణమొకటికి ఆర్వేల వరహాలు రామచంద్రా
7. రథముజేయించితి రాజ రాజకుల రామచంద్రా- రథము గుంజుకపోయె పదివేల వరహాలు రామచంద్రా
8. సీతాదేవికి శృంగారగాత్రికి రామచంద్రా - లోకమాతకు జేయిస్తి ముకుటాంగదాదులు రామచంద్రా
9. నీ తమ్ములకు గూడ నగలను జేయిస్తి రామచంద్రా - యిందే తప్పనకుగాను ఈ శిక్ష వేయుట రామచంద్రా
10. వాహనములు తగు వైఖరి జేసితి రామచంద్రా - జగన్మోహన దాసునికి మోమైన జూపవు రామచంద్రా
11. తురక పైకము దెచ్చి త్వరలో చెల్లించవె రామచంద్రా - ఓ పరమాత్మ యీ అప్ప భారమేమో నీకు రామచంద్రా[1]

ఈ కీర్తనలో కూడా వివిధ ఆభరణాలు, వస్తు వాహనాదులు, ఆలయ ప్రాకార గోపుర మంటపాదులు, గరుడ స్తంభాదులకు అయిన ఖర్చును విడివిడిగా ప్రస్తావించాడు రామదాసు. సర్కారు పైకం యొక్క ఖర్చుతో ఈ వస్తు వాహన, ఆభరణాదులు వారికి అమరినాయి. రామ కైంకర్యానికే ఈ ధనం ఖర్చయిందని అంటున్నాడు రామదాసు. అందుకే రాముడే ఈ అప్ప తీర్చాలని కోరుతున్నాడు. రామదాసు గోల్కొండ ప్రభువులకు తీర్చవలసిన పైకం ఆరు లక్షల వరహాలు అన్న విషయం ఈ కీర్తనలో స్పష్టమౌతుంది.

**" ఆనందభైరవి - ఆది "**

తెలియక నే మోసపోతిని - దేవుండని తెలియనైతిని ॥ ......

తక్షణమున వారార్లక్షల వరహాల్ని - లక్ష్యముగ నొసగిన సాక్షాత్కారులను ......[2]

రాముడు ఆరులక్షల వరహాలు తానీషాకు చెల్లించి అప్ప తీర్చినట్లు ఈ కీర్తనలో స్పష్టమౌతుంది. ఈ పై కీర్తనలను పరిశీలించిన మీదట, "రామదాసు రామాలయమందు 3 ప్రాకారాలు ఒక్కొక్క దానికి 10 వేల వరహాల చొప్పున 30,000 వరహాలును, గోపురానికి పదివేల వరహాలు, గరుడ స్తంభానికి పది వేల వరహాలు, పల్లకికి పదివేల వరహాలు, మకుటానికి పదివేల వరహాలు, రథానికి పది వేల వరహాలు, పచ్చల పతకానికి పదివేల వరహాలు, మొలత్రాటికి పదివేల వరహాలు, చింతాకు పతకానికి పదివేల వరహాలు ఖర్చు చేసినట్టు స్పష్టమౌతుంది. ఇంకా ఏమైనా ఉన్నాయేమో తెలియజేయలేదు. తక్కిన 74 వేలు వరహాలు కూడా ఆలయ నిర్మాణం, వాహనాలు, ఆభరణాలు మొదలైన వాటికి ఖర్చు చేసి ఉండవచ్చు, మొత్తం ఈ నిర్మాణానికి 2 లక్షలు ఖర్చు చేసి ఉండవచ్చు అని స్పష్టం అయింది. ఇక సంప్రోక్షణ, ప్రతిష్ఠ, బ్రహ్మోత్సవాది కైంకర్యాలకు '2 లక్షల' వరహాలు గోల్కొండ ప్రభుత్వధనం ఖర్చు చేసినాడని కొన్ని చారిత్రక గ్రంథాలలో చెప్పడం జరిగింది. కావున 2 లక్షలు చందాగా రైతుల దగ్గర వసూలు చేసిన ధనం, 2 లక్షల ప్రభుత్వ ధనం వెరసి 4 లక్షలు వరహాలు రామాలయ నిర్మాణ, వాహన ఆభరణాదులకు ఉత్సవ విగ్రహాలకు,

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 24-25, కీర్తన 21.
2. " " " పుట 68, కీర్తన 73.

ప్రతిష్ఠాది కైంకర్యానికి ఖర్చు చేసినట్లు స్పష్టమవుతుంది. అయితే ఇంతకు ముందు చెప్పినట్లుగా, 2 లక్షల 50 వేలు ప్రభుత్వ నిధి ఖజానాలో నిల్వ యున్న దానిని "సితార" పంపిన విద్రోహులు దోచుకున్నారు. రైతుల నుండి రావలసిన పన్ను ఒక లక్ష ఏభై వేలు వసూలు కానీయలేదు. కావున రామదాసు ఆలయ నిర్మాణానికి 6 లక్షలు ఖర్చు చేయకున్నా ఆ ఆరులక్షలు రామదాసు ప్రభుత్వానికి కట్టవలసి వచ్చింది. మహమ్మదీయులు, రామదాసంటే గిట్టనివారు చేసిన కుట్ర ఇది. ఇంతవరకు పరిశీలించిన అంశాల ద్వారా మనకు తెలిసిన ముఖ్యాంశాలివి.

### 4.8.5. ఆలయశిఖరం, సుదర్శన చక్రాల వైశిష్ట్యం :

రామాలయానికి చక్రం, గోపుర శిఖరం అమర్చబడలేదు. ఇది పెద్ద లోపం. అందుకే దాన్ని నిర్మించే దారి లభించక రామ స్మరణ చేస్తూ నిండు గోదావరి నదిలో దిగి ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు రామదాసు . వెంటనే గోదావరి ప్రవాహంలో చక్రం కనిపించింది. రామ ప్రసాదమని దానిని గ్రహించి శిఖరానికి బెట్టించాడు రామదాసు. రామదాసు గర్భగుడి శిఖరం పై అమర్చిన చక్రం చాలా విశేషం గలది. ఇది రామదాసు చేయించింది కాదు. తాను చేయించదలచుకున్న చక్రం భిన్నం కావడం వల్లనూ, మూసలో పోసిన మాటి మాటికి విరగడం చేతనూ, ఎంత ప్రయత్నించినా చక్ర నిర్మాణం కాకుండా పోతుంది. రామదాసు చక్ర నిర్మాణాన్ని గూర్చి విచారిస్తుండగా ఒకనాటి రాత్రి శ్రీరాముడు రామదాసు గారి కలలో వచ్చి తన గుడికి మానవ నిర్మిత చక్రం పనికిరాదని, దేవతా నిర్మిత చక్రం గోదావరిలో వెదికితే దొరుకుతుందని చెప్పి అదృశ్యుడౌతాడు. తెల్లవారి రామదాసు గోదావరిలో స్నానం చేస్తుండగా రాముడు చెప్పినట్లే చక్రం దొరుకుతుంది. ఆ చక్రాన్ని రామదాసుగారు గర్భాలయం మీద ప్రతిష్ఠ చేశారు. "దీనిని "సుదర్శన చక్రం" అంటారు. ఇది అష్ట కోణాలతో ఉంది. చక్రం మధ్యలో సుదర్శన మూర్తికి 32 చేతులున్నాయి. ఇటువంటి చక్రం మరే దేవాలయ శిఖరం పైనా కనిపించదు. ఈ సుదర్శన చక్రం విషయం రామదాసు చరిత్రంలో లేదు. నారుమంచి సుబ్బారావుగారి 'రామదాసు జీవిత సంగ్రహం' అనే పుస్తకంలో మాత్రం ఉంది."[1]

స్థానాచార్యులును, అర్చకులును సుదర్శన చక్ర విషయాన్ని పై విధంగానే నాతో చెప్పినారు. ఇది వారు అనుశ్రుతంగా చెప్పకుంటువస్తున్నారట. దీనిని నేను కూడ ఆలయ శిఖరంపై పరిశీలించి చూశాను. దానికి చారిత్రకాధామేమీ లేదు. కీర్తనల్లో రామదాసులవారు ఎక్కడా ఈ విషయం చెప్పలేదు. అయితే నేటికీ గర్భగుడి శిఖరంపై ఇదే సుదర్శన చక్రం కనిపిస్తుంది.

భద్రాచలం దేవాలయ శిఖరంపై ఉన్న ఈ సుదర్శన చక్రం ఎనిమిది ముఖాలు గలిగింది. 1000 హస్తాలు గలది(సహస్ర బాహువులు కల్గి, మధ్యలో సుదర్శన మూర్తి ఉంటాడు). ఈ విధమైన సుదర్శన చక్రం మరే వైష్ణవ దేవాలయ శిఖరంపైన లేదు" అని"Seat of Lord Rama" అనే వ్యాసంలో ఎం.వి.శాస్త్రిగారు ఈ సుదర్శన చక్రం గూర్చి ప్రస్తావించారు. "The sikharam is crowned with the sudarsana chakram which Ramadas got from the River Godavari. The eight faced chakram with thousand corners around, contains, sudarshana murti engraved in the centre. The outer face of the Vimanam contains beautiful stone images depicting the 48 forms of Lord Vishnu, Garuda, Simha, Samaskan da, and Krishna Murthy".[2]

ఈ సుదర్శన చక్రంతో పాటు ఒక విమానం, అందమైన ఒక ఆభరణంలో పొదిగే మణి పొదగబడిన విష్ణు, గరుడ, సింహ, సమస్కంద, దక్షిణామూర్తి, మొదలైన 48 విష్ణువు యొక్క అవతారాలు గోచరిస్తాయి.

1. రామదాసు జీవిత సంగ్రహము -నారుమంచి సుబ్బారావు. పుట 11.

2. Seat of Lord Rama - M.V.Sastry, తెలుగువాణి మాసపత్రిక మార్చి 1977.

ఈ భద్రాద్రి దేవాలయ శిఖరంపై నున్న సుదర్శన చక్రంతో పాటు ఒక విమానం కూడా ఉంది. ఈ విమానంపై రూపంలో ఉంటుంది. ఈ విమానం, సుదర్శన చక్రం ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. ఇవి రెండూ మరే వైష్ణవ దేవాలయాల్లో లేవు. ప్రపంచంలో మరెక్కడా లేవు. ఇది ఈ ఆలయ శిఖర ప్రత్యేకత. మరొక విశేషం ఏమంటే, భద్రాచలంనందు రామదాసు నది నుండి (గోదావరి) సాలగ్రామాలను గొనివచ్చి రెండు హారాలుగా సంతరించారు. ఇవి శ్రీరామ లక్ష్మణులకు అలంకరించి, అభిషేకం చేస్తారు. ఈ విషయం శ్రీభద్రాచల క్షేత్ర చరిత్రము నందు కలదు.[1]

ఇవి ఈ ఆలయ విశేషాలు. ఇంతటి ప్రసిద్ధి వహించిన ఆలయం కావుననే దీన్ని దర్శించడానికి దేశ విదేశాల నుండి కూడా యాత్రికులు వస్తుంటారు. "తెలుగువారికి నిత్య ఆత్మీయుడైన వ్యక్తి రామదాసంటే అతిశయోక్తి కాదు. భద్రాద్రి రాముడికి, అతడి భక్తుడు కంచెర్ల గోపన్న చేసిన సేవా ఫలితమే ప్రజలలో కలిగి, నిలిచిన ఈ దివ్య యాత్రా సంప్రదాయం"[2] అని జి. కృష్ణగారు తమ ప్రముఖ వాగ్గేయకారులు అనే పుస్తకంలో తెలియజేశారు. రామదాసు నిర్మించిన ఈ భద్రగిరి రామాలయం 'ధంసా,రజాకార్ల' కారణంగా కొంతవరకు నష్టాల పాలైనందున, ఆ తర్వాత రామభక్తులైన వరద రామదాసు, తూము లక్ష్మీ నరసింహదాసుగార్లు, రామదాసుగారు కట్టించిన దేవాలయంలో, రామ లక్ష్మణులను పునఃప్రతిష్ఠించారు. పునః ప్రతిష్ఠ జరిగిన తరువాత మరల ప్రవాహంగా భక్తులు స్వామివారి సేవకు వస్తూండేవారు. వారిలో యాదవదాసు మొ॥వారు వచ్చి ఇక్కడ స్థిర నివాసం యేర్పరచుకొన్నారు.

రామదాసులవారు చేయించిన ఆభరణాలు నేటికీ భద్రాచల దేవస్థానంలోని 'చిత్రకూటం'లో అద్దాల బీరువాల్లో దర్శనీయంగా భద్రపరచి ఉన్నాయి. ప్రస్తుతం ప్రదర్శనశాలలో వున్న నగల పేర్లు మొలత్రాడు, పచ్చలపతకం, కలికితురాయి, చింతాకు పతకం, శ్రీరామ మాడ, సున్నపు కాడ, తమలపాకు, రవ్వల మొలత్రాడు, కలికి తురాయి (చిన్నది) మొదలైనవి.

## 4.9. ప్రభుత్వ ధనంతో ఆలయ నిర్మాణం గావించినందుకు గోల్కొండ ప్రభువుచే రామదాసు బంధింపబడుట :

రామదాసు ఆలయ నిర్మాణ, కైంకర్యాదులను అత్యంత వైభవోపేతంగా పూర్తి చేసి నిరంతరం రామధ్యానంలో మునిగి ఉన్నాడు భద్రాచలంలో. ఈ సమయంలోనే అక్కడ గోల్కొండ నవాబు అన్ని పరగణాల నుండి రావలసిన పన్నుకు సంబంధించిన ధనం గూర్చి అక్కన్న, మాదన్నలను లెక్కలడుగుతాడు. అబ్దుల్లా కుతుబ్షా కాలంలోనే రామదాసు రామాలయ నిర్మాణం గావించాడు. (1652 ప్రాంతం) అన్ని పరగణాల నుండి ధనం వసూలు చేసి గోల్కొండకు పంపమని నవాబు ఉత్తర్వులు జారీ చేస్తాడు. భద్రాచలం నుండి తప్ప అన్ని పరగణాల నుండి ధనం వచ్చిందని ప్రభువుకు అక్కన్న, మాదన్నలు తెలియజేశారు. "భద్రాచలం"లో రామదాసు ప్రభుత్వ ధనం ఖర్చు చేసి ఆలయ నిర్మాణం గావించినందుకు, తర్వాత రాబోయే ఆపద గూర్చి భయం చెందక, అన్నిటికీ రాముడున్నాడని భావించాడు. ఉత్సవమైన తర్వాత ఆరు లక్షల పైకం గోల్కొండ ప్రభువునకు ఎట్లా చెల్లించాలని మొదట ఆందోళన పడతాడు రామదాసు. దాతలు, భక్తులు విరాళాలిస్తే సర్కారు శిస్తు చెల్లించవచ్చుననుకుంటాడు. కాని అది నెరవేరదు. అంతట తనకు రాముడున్నాడని ధీమాగా ఉన్నాడు.

"నాదనామ క్రియ - ఆది "

"తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకూ
ప్రక్క తోడుగా భగవంతుడు మును చక్రధారియై సాకుచునుండగ ॥

1. శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము -కొండపల్లి రామచంద్రరావు పుట 106.

2. ప్రముఖ వాగ్గేయకారులు - జి. కృష్ణ పుట20.

ప్రుచ్చు సోమకుని మును చంపినయా - మత్స్యమూర్తి మన పక్షము నుండగ ॥. . . .
నారాయణ దాసుని గాచిన శ్రీమన్ - నారాయణు నెర నమ్మియుండగ ॥
రామదాసు నిల రక్షించెదనని - ప్రేమతొ పలికిన ప్రభువిట నుండగ ॥ తక్కు॥[1]

అని తక్కువేమి మనకు రాముడు ఉన్నాడు నన్ను ఏ ఆపద వచ్చినా కాపాడగలడు. మరి భయమెందుకని ధైర్యంగా ఉన్నాడు రామదాసు. తన భారమంతా రామునిపైనే వేశాడు. సర్వస్వం రాముని అధీనమనుకొని నమ్ముకొంటాడు. రామదాసు గారు నిత్యోత్సవ, మాసోత్సవ, పక్షోత్సవ, సంవత్సరోత్సవాదులు మొదలైన ఉత్సవాలు త్రికాల భోగాలు, కల్యాణోత్సవ, రథోత్సవాలు లోకానంద దాయకంగా జరుపుతున్నారు. ఇంతలో ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేస్తున్నాడనే వార్త సుల్తానుకు తెలుస్తుంది. సుల్తాను కోపంతో రామదాసు ధనం ఇవ్వకపోతే బంధించి తీసుకురండని భటులను భద్రాద్రికి పంపిస్తాడు. ధనం చెల్లించలేని స్థితిలో వున్న రామదాసును భటులు గోల్కొండకు తీసికెళ్ళి విచారణ జరిపిన మీదట బంధిఖానాలో బంధిస్తాడు. ఇక్కడ పరిశీలించ వలసిన కొన్ని ముఖ్యాంశాలున్నాయి.

భద్రాచలం తాలూకా నుండి రావలసిన ఆరు లక్షల వరహాల పైకం ఖజానాలో తక్కువగా ఉంది. అది భద్రాచలం పరగణా నుండి వసూలు కావలసిఉంది. ఈ విషయం అక్కన్న, మాదన్నలకు ముందుగా తెలిసి 'అబ్దుల్లా కుతుబ్షా'కు తెలియక పూర్వమే నమ్మకస్తులైన వారిని పంపి ఆ ధనం వసూలు చేసుకొని రమ్మని పంపారు. అక్కన్న, మాదన్నలు ఆనాడు అబ్దుల్లా కుతుబ్షా వద్ద ఉద్యోగాలు చేస్తున్న విషయం ఇంతకుముందే ప్రస్తావించాను. వారు గోపన్న వద్దకు వెళ్ళి వారు తన మేనమామలు పంపగా వచ్చామని, ఆరు లక్షల ప్రభుత్వ ధనం వసూలు చేసుకొని రమ్మన్నారని చెప్పగా, రాముడి దయవలన త్వరలో ఆ ధనం ప్రభుత్వానికి తిరిగి పంపగలనని చెప్పి, ఆ విషయమై ఒక లేఖ కూడా గోల్కొండ సుల్తానుకు వ్రాసి పంపినట్లుగా చెప్పాడు రామదాసు. ఈ సమయంలో రామదాసు, రామా ! నిన్నే నమ్మియున్నవాడనురా. నిరంతరం నీ నామస్మరణం చేసే నేను ఈ అశాశ్వతమైన ధనం కొరకు పరులను, మానవులను సహాయమర్థించలేను. నీవే ఈ ఋణ భారం నుండి నన్ను విముక్తుని గావించమని ఈ విధంగా కీర్తిస్తున్నాడు. రాముని దీనంగా ప్రార్థిస్తున్నారు.

**"నాదనామ క్రియ - ఆది"**

నిన్ను నమ్మియున్న వాడరా - ఓ రామా ॥
నిన్ను నమ్మియున్నవాడ నన్ను పరుల వేడనీక మన్నన చేసి పాలింపవే ఓ రామా ॥
గతిమాలి వ్రతము చెడుటేకాని యిందేమి సుఖము-వెతబొందగ జాలనే ఓరామా॥
మానము వీడి కసుమాలపు పొట్ట కొరకై మానవుల వెంబడింతునే ఓ రామా ॥
సతతము రక్షించు చతురత నీకున్నప్పుడు మది చలింప నేటికే ఓ రామా ॥
సతతము శ్రీ భద్రాద్రి రామదాస పతివై నన్నాదరింపవే ఓ రామా ॥[2]

రామా! నేను నా పొట్ట కూటి కొరకు కూడా నీచులను ఆశ్రయించదలచు కోలేదు. రామాలయ నిర్మాణం కొరకై చేసిన ఋణాన్ని తీర్చుటకై, సామాన్యులైన మానవులను ఆశ్రయించదలచుకోలేదు. నీవే నన్ను రక్షించ వలసింది. నిన్నే సతతము ప్రార్థించే నన్ను ఈ ఆపద నుండి రక్షించు రామా ! అని ప్రార్థించాడు. మరియు రామదాసు ఎంతో కాలానికి నేను భద్రాద్రి రాముల పాద సేవకుడనైనానని ఆ స్వామికి ఆలయ నిర్మాణం చేసి వైభవోపేతంగా కైంకర్యం చేసిన నా జన్మ ధన్యమైందని భావిస్తూ ఆనందంతో ఈ విధంగా భద్రాచల రాముని స్తుతిస్తున్నాడు.

1. భక్త రామదాసు కీర్తనలు పుట 65-66, కీర్తన 71.
2. భక్త రామదాసు కీర్తనులు పుట 80-81, కీర్తన 93.

**"కాంభోజి - అట"**

"బహుకాలమునకు శ్రీభద్రాచలేశునకు పాద సేవకుడనైతి !
అహహా నా జన్మ సఫలమాయె నేటికిని అనుమానములు దీరెనూ ॥
తల్లి గర్భము నందు మలమూత్రముల మునిగి ధరణిపై జన్మించితి
కల్లలాడుచు పాప కర్మముల కొడిగట్టి కాపురుషులను జేరితి - నీవేగతి ॥
కోపుడను పాపుడను గుణ హీనుడను నేను క్రూరుడను కుత్సితుడను
రావు సేయక నన్ను రక్షింపదలచు శ్రీరామచంద్రుల భారమూ॥
అఖిల లోకంబులకు నాధారమై యున్న యాది పురుషోత్తముండూ
సఖితోడ గూడిన సమయమందున జేరి నన్నుతులు చేయగలిగె ॥
రామదాసుని నేలు మేలుకూ భద్రాద్రి ధాములై యుదయించిరీ
యేమి కొదవలు మనకు నెరుక కలుగగ జేసి నేహ్యంబు లితర మెల్లా కల్లా ॥[1]

భద్రాద్రి యందు ఉదయించిన భద్రాచల రాముడు, సీతమ్మ తల్లి నాకు అండగా ఉండగా, నాకేల భయం. నేను ఇంతకుముందు నీచ నరాధములను ఆశ్రయించినందుకు క్రూరుడను పాపుడనైనాను. అని తనను తాను నిందించుకొని భగవంతుడైన రాముని క్షమాపణలు కోరుకొని, తనను కాపాడమని, ఆ భారం నీదేనని, నీ కొరకే ఈ జీవితం అంకితం చేస్తానని ప్రాధేయపడ్డాడు. కాపురుషులు-అంటే నీచ మానవులు. ఇక్కడ మత దురహంకారులైన మహమ్మదీయులు నీచులు అని రామదాసు ఉద్దేశం. తాను అటువంటి దురాత్ములను ఆశ్రయించినందుకు పశ్చాత్తాప పడినాడు. అందుకే మరో కీర్తనలో

**"తోడి - ఆది"**

"నమ్మిన సీతా రమణుని నమ్మ వలెనయ్యా రావణు తమ్ముడైన విభీషణుని ధన్యుని జేసిన విచక్షణుని
స్వాములెందరైనా గలరు రామునికి సరిరారు పామరులైన వారు ఈ మహిని తెలియలేరు.
రామ నామమె సుధా రసము రామచరితమె పాయసము
రామునియందే మానసము రామచంద్రులదే భరవసము ॥
రామదాసుడనను కొందు రమ్మ భద్రాద్రీశుడందు
ప్రేమ వదలక నే యుందు రామ నిన్నునే నమ్మియుందు॥[2]

నమ్మితే రామునే నమ్మాలి. రామ నామమే జపించాలి. రామాయణ గాథే వినాలి. రామచరితమే తీయని పాయసం. రామనామమే అమృత తుల్యం. అందుకే రామా ! నీ దాసుడను నన్ను వదలక నీవే కరుణించు. నాపై దయ ఉంచు. నిన్నే నమ్మియుందును. నీ నామమే నేను నిరంతరం స్మరిస్తాను అని ప్రార్థించాడు. రాముని నామం యొక్క గొప్పతనాన్ని చాటాడు. మరియు అదే సమయంలో రామదాసు రాముని ఇంకా ఈ విధంగా ప్రార్థిస్తున్నాడు.

**" సౌరాష్ట్ర - ఆది "**

రామచంద్రా నన్నేలేవో రక్షించేవో నేనేమెరుగా నీ చిత్తము నా భాగ్యము నిన్నే నెరనమ్మితి ॥
భరతుని వలెను నీదు పాదుకలు పూజింపనేర కోరి లక్ష్మణుని వలె కొల్వగా నేరా
ఓర్పుతోను గుహుని వలె నోడనడుపగానేరను నేర్పుతో నావాలి వలె నిన్నెరుగగా నేరా ॥
నేను రామదాసుల వలె పూని మిము భజియింపనేరా దీనుని రక్షించు భద్రాచల రామ ధీరా ॥[3]

అని ప్రార్థించాడు. ఈ కీర్తనలో రామదాసు తాను వివిధ రామభక్తులను గూర్చి ప్రస్తుతిస్తూ

1. భక్త రామదాసు కీర్తనలు పుట 90, కీర్తన 106.
2. భక్త రామదాసు కీర్తనలు పుట 77, కీర్తన 88.
3. భక్త రామదాసు కీర్తనలు పుట 110, కీర్తన 132.

భరతుడు, లక్ష్మణుడు, గుహుడు, వాలి, అంగదుడు, సుగ్రీవుడు, జటాయువు, హనుమంతుడు, శబరి, సీతా మహాసాధ్వి, విష్ణు భక్తుడైన గజరాజు, ద్రౌపది, జాంబవంతుడు, విభీషణుడు, అహల్య మున్నగు శ్రీమన్నారాయణుని భక్తులు ఆ హరిపాదాలు సేవించినట్లుగా తాను సేవించలేక పోయానని బాధ పడుతూ, తనకు తోచినంతలోనే ఆ భద్రాద్రి రాముని సేవించానని, తనను కాపాడమని దీనంగా మొరలిడినాడు. వీరందరినీ నీవు కాపాడినావు కదా ! గుహుడు కోరగా రాముడు అతని పడవలో ప్రయాణించి ఆ పడవను పునీతం చేశాడు. రామ పాద స్పర్శతో గుహుడు ధన్యుడైనాడు.

భరతుడు రామ పాదుకలు పూజించాడు. 14 ఏండ్లు రాముడు అరణ్య వాసం చేసినంతకాలం ఆ పాదుకలకు పట్టాభిషేకం చేసి రామపాదుకలు సింహాసనంపై నుంచి రామ రాజ్యాన్ని కాపాడిన వాడు భరతుడు. తనకున్న రామభక్తిని లోకానికి చాటినవాడు భరతుడు. అంగదుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు, హనుమంతుడు మొదలైన కపీంద్రులు రామభక్తులుగా గణుతికెక్కారు. వీరిలో హనుమంతుడు చిరంజీవిగా రామభక్తుడుగా ఆచంద్రార్కం నిలిచాడు. శబరి రామునికి ఎంగిలి పండ్లను ప్రీతితో, భక్తితో తినిపించి, రామభక్తిలో ఓలలాడి తరించింది. రాముని లాలించింది. పాలించింది. బిడ్డగా సేద తీర్చింది. రామునిలో తన పుత్రుని చూసుకున్న వాత్సల్యమూర్తి, మాతృమూర్తి శబరి.

సీతాదేవి రామపత్నిగా ధరణిలో ఉత్తమ పతివ్రతా శిరోమణిగా ఖ్యాతి గడించింది. నిరంతరం రామసేవలో తన జీవితాన్ని గడిపిన ధన్యజీవి ఆ జానకి. రాముని అడుగు జాడల్లో నడిచిన మహా ఇల్లాలు. గజేంద్రుని మొసలి బంధించగా, ఆ కరిని మొసలి బారి నుండి కాపాడేందుకు శ్రీమహా విష్ణువే స్వయంగా వచ్చాడు. తన భక్తుని కాపాడినాడు. ద్రౌపదీ దేవిని పాండవులు మాయాజూదంలో పణంగా పెట్టి, కౌరవుల చేతిలో ఓడినపుడు, ఆ ద్రౌపదిని కౌరవులు నిండు సభలోకి జుట్టు పట్టి ఈడ్చుకొని వచ్చి వస్త్రాపహరణ గావింపబోగా, ఆ దుర్యోధన, దుశ్శాసనాది నరాధములు ఆమె శీలాన్ని అపవిత్రం చేయబోగా, శ్రీకృష్ణ పరమాత్మ ఆమె మానాన్ని కాపాడినాడు. వస్త్రదానం చేశాడు. శ్రీకృష్ణుని భక్తితో సేవించిన మహాపతివ్రత ద్రౌపది. ఆ ఇల్లాలిని ప్రతిక్షణం కంటికి రెప్పలా కాపాడినాడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుని సోదరిగా ద్రౌపది ప్రసిద్ధి గాంచింది. జాంబవంతుడు, విభీషణుడు నిరంతరం రామభక్తి పరాయణులై జీవించారు. రామసాయుజ్యం పొందారు. విభీషణుడు రాక్షస జాతిలో జన్మించినా రామభక్తుడైనాడు. రావణుని సోదరుడు విభీషణుడు. రామభక్తుడైనందుననే రామునిచే అనుగ్రహింపబడి రావణ సంహారానంతరం విభీషణుడు లంకా రాజ్యాధీశుడై జనులను ధర్మబద్ధంగా పరిపాలించిన పుణ్యమూర్తి. విభీషణుడు రామునే శరణు కోరినాడు. రామ పాదాలనే ఆశ్రయించాడు.

జటాయువు శ్రేష్ఠమైన పక్షీంద్రుడు. రామభక్తుడు. రాముని పత్ని సీతను రావణుడు అపహరించి తీసుకొని వెళ్తుండగా రావణుని ఎదిరించి సీతను రక్షింప ప్రయత్నించాడు. రావణుడు, జటాయువు రెక్కలను ఖండించగా నేలకూలి, కొన ఊపిరితో ఉండగా సీతను రావణుడు దక్షిణ దిశలో ఉన్న లంకా నగరానికి తీసుకొని వెళ్ళాడన్న సమాచారాన్ని రాముడికి అందజేసి రాముని పాదాల చెంత ప్రాణాలు విడిచి, రామసాయుజ్యం పొందాడు. రాముని కోసం, సీతమ్మ కోసం తన ప్రాణాలనే పణంగా పెట్టిన మహనీయుడు జటాయువు. "అహల్య" గౌతముని శాప కారణంగా తమ ఆశ్రమం వద్దనే శిలయై ఉండినపుడు, రాముడు ఆ గౌతమ మహర్షి ఆశ్రమానికి వచ్చినపుడు ఆ రామ పాద ధూళి సోకి అహల్య శాప విముక్తురాలైంది. శిలారూపంలో ఉండిన అహల్య నిరంతరం రామనామ స్మరణ చేస్తూ రాముని కొరకై ఎన్నో ఏండ్లు ఎదురుచూసింది. రామపాద స్పర్శతో ఆమె పునీతురాలైంది. ఆమె రామనామ స్మరణంలో జన్మను ధన్యం చేసుకుంది.

ఇలా ఎందరో రామ భక్తుల వలె తాను ఆ భద్రాద్రి రాముని సేవించ లేకున్నా, తనకు తోచినంతగా నిరంతరం రామ సేవా తత్పరుడై ఉన్నట్లు, తనను కాపాడి, తాను చేసిన ఆరు లక్షల ఋణం తీర్చమని కోరాడు. మరియు "రామా! ఈ సమయంలో నన్ను కాపాడరావా ! అలనాడు అహల్యను రాయి రూపం నుండి నాతిగా మార్చిన గొప్పవాడివి. నీవు నన్ను ఈ ఆపదనుండి కాపాడలేవా ! నీవు తప్ప నాకు ఈ సమయంలో దిక్కెవరు ? అని ఆర్తితో, ఆవేదనతో రామచంద్రుని వేడుకున్నాడు. ఈ విధంగా ప్రార్థించాడు. కీర్తించాడు.

"దర్బారు - చాపు"

వచ్చేవో రావో మాయింటికి - వచ్చేవో రావో వాసుదేవ నేడు
అక్షయముగ నన్నాదరించగ వేగ ॥
పాపిష్ఠినైతి రామా నీపాదము నమ్మితి -మా పాలి దైవమని మరువ కెల్లపుడు
దావు దండకు జేరి కాపాడు మంటిని ॥
కరుణించరాద రామా నిన్నెనెరనమ్మ లేదా - గరుడ గమన గౌతమసతి నహల్యను
నరరూపు జేసిన చరణముల మ్రొక్కెద ॥
మ్రొక్కెదను రారా రామా నా దిక్కుగన వేమిరా - చక్కని భద్రాచల రామ దాసుడ
అక్కర తోడ నన్నాదరించ వేగ ॥[1]

ఈవిధంగా రామదాసు రాముని ప్రార్థించి, రాముడే గలడు తనకు అని, వారికి చెప్పగా, భటులు వెళ్ళి, రామదాసును గూర్చి, రామాలయ నిర్మాణానికి సర్కారు పైకం వెచ్చించి భయం లేక రాముడే తనను రక్షించగలడని, తన అప్ప రాముడే తీర్చగలడని నమ్మకంతో భక్తితో భజనలు చేస్తూ ఉన్నాడని మాదన్న అక్కన్నలకు భటులు తెలియజేశారు. గోల్కొండ నవాబు అబ్దుల్లాకు విషయం తెలిసి, ఆరు లక్షల పైకం భద్రాద్రి నుండి రానందున, రామదాసును బంధించి తీసుకొని రమ్మని భటులను పంపగా వారు రామదాసును బంధించి తీసుకొని వెళ్ళడానికి భద్రాచలం వచ్చినారు. ఆ సందర్భంలో రామదాసు 'అతి దీనాలాపనలతో రామునికి తన వేదనను వినిపించాడు'. రామా ! దయజూడవా ! దిక్కులేని వారికి దిక్కునీవని అంటారే. నా దిక్కు నీవేకదా ! రామా ! నన్ను ఈ ఆపద సమయాన బ్రోవరావా! రామా! భద్రాద్రి వాసా రావయ్యా! ఈ దీనుని కాపాడ రావా ! అని దీనాతి దీనంగా మొరలిడినాడు. ఈ విధంగా ఆర్తితో కీర్తించాడు.

"బిలహరి - చాపు"

రావయ్యా భద్రాచల రామా రమణీయ జగదభి రామలలామా
కేవల భక్తి విలసిల్లగ భావము దెలిసిన దేవుడవైతే॥
ప్రొద్దున నిన్ను పొగడుచు నెపుడు వద్దుమీరగాను భజన చేసెదను
గద్దరితనమున ప్రొద్దులు పుచ్చుచు ముద్దులు గులుకుచు మునుపటి వలెనిటు ॥
నన్ను గన్న తండ్రి నా మదిలోన నీ కన్న నితరుల గొలిచెదనా
శ్రీకర దివ్య ప్రభాకర కుల రత్నాకర పూర్ణ సుధాకర తేజా !
అంజలి సేయనీ వరమరలేని యడియేని నీవు కటాక్షము పూని
ముజ్జగములకును ముదమిడు పదముల గజ్జెలు కదలగ ఘల్లుఘల్లుమన ॥
దోషములెంచని దొరవని నీకు దోసిలి యొగ్గితి దొలుత వరాకు
దాసుని తప్పులు దండముతో తీరు మీసము గలిగిన పోషకుడైన ॥[2]

1. భక్త రామదాసు కీర్తనలు - (సంకలనం దాశరథుల బాలయ్య) - పుట 144,145. కీర్తన 175.

2. భక్త రామదాసు కీర్తనలు - (సంకలనం దాశరథుల బాలయ్య) - పుట 113, కీర్తన 135.

రామా నేను ఏ నేరం చేయకున్నా నన్ను శిక్షింప వచ్చినారు అబ్దుల్లా భటులు. నిరంతరం నిన్ను భజించే నన్ను కాపాడ వేగమే రాలేవా ? అని ప్రశ్నిస్తున్నాడు రామదాసు. భటులు రాజాజ్ఞ మేరకు రామదాసును తీసుకొని వెళ్ళడానికి వచ్చారని, తనను శిక్షించవచ్చారని, కఠినంగా వారు తనను దూషిస్తున్నారని బాధపడి, రామా ! నీవే నన్ను కాపాడు. రక్షించు. అని రాముని ఈ విధంగా బ్రతిమాలుతున్నాడు రామదాసు.

**"తోడి - ఆది "**

రామా దైవ శిఖామణీ సుర రాజ మనోజ్ఞల భూమణీ
తామరసాక్ష సుధీమణీ, భవ్య తారక భక్త చింతామణీ ॥
నాడేమిము వేడుకొంటిగా శరణాగత బిరుదని వింటిగా
వేడుకై మిము పాడగంటిగా నన్ను దిగ విడనాడ వద్దంటిగా ॥
చింత సేయగ నేమి లేదుగా ముందు జేసిన గతి దప్ప బోదుగా
ఇంతకు మిక్కిలి రాదుగానే నితరుల గొలిచేది లేదుగా ॥
తమ్ముడు నీవొక్క జంటను రామదాసుని రక్షించుటకు
నమ్మతినుండు మా యింటను భద్రాచల వాస నీ బంటు బంటను ॥[1]

రామా ! నీవును, నీ తమ్ముడు లక్ష్మణుడు ఇరువురు కూడి నన్ను కాపాడ రాలేరా ? నేను నీ దాసుడను, ఇతరులను ఏనాటికీ నిన్ను కాదని, కొలిచేది లేదు అని ధైర్యంగా చెప్పాడు. అంతట రామదాసును భటులు బంధించగా, వారి వెంట వెళ్తూ రామదాసు భద్రాద్రి జనులతో "రామ కైంకర్యం మీ వద్ద ఉన్నంతలో జరిపించండి. నేను భద్రాచలం విడిచి వెళ్తున్నాను" అని అంటాడు. రామా ! నీ సేవలు ఇకపై నీవే జరిపించుకో. నీవు నన్ను ఇకపై ఏవిధంగా కాపాడగలవో! అంతా నీ దయ అని ఈ విధంగా రాముని వేడుకుంటున్నాడు.

**"కల్యాణి - చాపు"**

రామా దయ జూడవే భద్రాచల ధామా నను గానవే
రామా కౌస్తుభ ధామా నతజన కామా జలధర శ్యామా జగదభి రామా ॥
దేహాభిమానుడనై యున్నాళ్ళు వ్యామోహ కలితుడనై
ఐహిక సుఖములందును రాగముంచి వైదేహాత్మజా రమణ తెలియలేనైతి నిను ॥
హరుడెరుగక పోయెను నీ మాయను యజుడెరుగక పోయెను
హరిహరి నిన్నెరుగలేరా నీ కృప లేక కరుణాకర నా సరస వచ్చివేగా ॥
దిక్కులేని వారిని మక్కువతో గ్రక్కున గాతువనీ
దక్కితి నీకేను భద్ర శైలరామదాసు నే రీతిని బ్రోచెదో యికమీద ॥[2]

రామా పాలముంచినా, నీట ముంచినా భారం నీదే. నన్ను నీవేరీతి రక్షించెదవో ! భారం నీదే. దిక్కులేని నన్ను కాపాడుతావని నమ్మకంతో నీ దరి చేరాను. నన్ను బ్రోవరాదా ! అని వేడుకున్నాడు. మరియు ఇంకా ఇలా ప్రార్థించాడు. ఓ భద్రాద్రి వాసా ! రామా ! నిన్నే నమ్మాను, ఎన్ని విధాల పిలిచినా పలుకవు నేను నిరుపాధికుడను కావున రక్షించమని అడుగుతున్నాను అని ఇలా దీనంగా వేడుకుంటున్నాడు.

**" బిహారి - ఆది "**

శ్రీరామా రామ దయ జూడవే రఘురామ వేగ నను బ్రోవవే ॥
పరుల వేడలేనంటిగా నీ పద యుగములే నమ్మియుంటిగా

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం దాశరథుల బాలయ్య) పుట 120, కీర్తన 144.
2. 〃 〃 〃 〃 〃 〃 〃 పుట 131, కీర్తన 159.

*అరమర సేయవద్దంటిగా శ్రీహరి హరి నీ వాడనంటిగా ॥*
*వెరవకుమని అభయమీయవా నా వెరపు లెల్ల వేగ దీర్చవా*
*కరుణా సాగర నన్ను గావవా నా కన్నుల యెదుట వసింపవా ॥*
*హరి హరి యింత పరాకా భద్రాచల సీతానాయకా తరుణమిదే*
*భక్త పాలకా రామదాస మనోభీష్ట దాయకా ॥*[1]

రామా! భక్తపాలకా ! భద్రాద్రి వాసా! నన్ను రక్షించే తరుణం నీకు ఆసన్నమైంది. భక్త రక్షణుడనే బిరుదును నిలుపుకో రామా ! నన్ను కాపాడ వేగమే రావా అని ప్రార్థించాడు. ఈ విధంగా ఎంతో దీనంగా రాముని వేడుకుని, భటుల వెంట రామదాసు గోల్కొండకు వెళ్ళాడు. అంతేగాక ఇంకా ఇలా అంటున్నాడు. రామా! నీ సంకల్పం ఎలా ఉంటే అదే జరుగుతుంది. అని భావించాడు.

**" పూరి కల్యాణి - ఆది "**

*నీ సంకల్పం బెటువంటిదో కన నెంత వాడ రామా !*
*వాసి దొలిసి నీ దాస జనుల భువి గాసిపడిన యా ఘనత యెవ్వరిదో ॥*
*ప్రోచిన మరి విడజూచిన నీ కృప గాచి యుందుగానీ*
*తోచి తోచకను తొడరి కరంబులు చూచి పరులనే యాచన సేయను ॥*
*పటుతరముగ నీ మటుమాయలకును నేనెటు వలె నోరుతును*
*చటుల తరంబుగ జెలగు భవాంబుధి నెటు దాటుదు నేనెవరిని దూరుదు ? ॥*
*భావజ పురిసుత పరమ పురుష నీ భావము తెలియదుగా*
*దేవ దేవ నీ సేవక జనులకు సేవకుడను నను గావుము మ్రొక్కెద ॥*
*దరి జేర్చెదవని ధైర్యముచే నీ దరి జేరితి గానీ*
*అరసి ప్రోవకయె యూరడి బెట్టుట నెరుగనైతి నా దొరవనుకొంటిని ॥*
*శరణాగత రక్షణ భవ సాగర తరణా రిపు హరణా*
*కరుణ జూడు భద్రాద్రి నివాసా అరమర సేయకు హరి నిను నమ్మితి ॥*[2]

రామా ! శరణాగత రక్షణ బిరుదు గలిగిన వాడివే. నీ దరి జేరిన నన్ను నిర్దయ జూచుట న్యాయమా ! నీవే నన్ను కాపాడ గలవాడవని, నీ సన్నిధి చేరిన సేవకుడిని. నన్ను కరుణించు ఓ అయోధ్య రామా ! నీ సంకల్పం ఏ విధంగా ఉందో నేనేమి యెరుగుదును. నీ నిర్ణయం ఎలా ఉంటే అదే జరుగుతుంది అని ప్రార్థించాడు. అటుతర్వాత రామదాసును భటులు అబ్దుల్లా కుతుబ్షా వద్ద హాజరు పరచారు.

రామదాసు చరిత్రలో తానీషా వద్దకు రామదాసును బంధించి తీసుకొని వచ్చినట్లుగాను, వారిరువురి మధ్య సంభాషణ కొనసాగినట్లుగాను వ్రాయబడింది. ఈ తానీషా అబుల్ హసన్ తానీషాయే కాని అబ్దుల్లా కుతుబ్షా కాదు. తానీషా, రామదాసుల మధ్య రామాలయ నిర్మాణం కొరకు తాను ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసిన కారణం గురించిన వివరాలు తెలుస్తాయి. తానీషా రామదాసును విచారిస్తాడు.

### 4.9.1. తానాషా విచారణ : తానాషా రామదాసుల సంవాదం :

తానాషా, రామదాసుల మధ్య కొనసాగిన ఈ సంభాషణ గూర్చి 'సింగరదాసు' రచించిన రామదాసు చరిత్రంలో చెప్పబడింది. పాదుషా-రామదాసుల సంవాదం

**"నాదనామ క్రియ - ఆది తాళం"**

*పా:- రండీ గోపన్నగారు మా సైకమిప్పించండీ వేగామె మీరు భూ*

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం దాశరథుల బాలయ్య) పుట 157, కీర్తన 187.
2. " " " " " " " పుట 82, కీర్తన 95.

మండలములోని గోలకొండ తురక వాడుచాల బండాడని సుంతైన నీ గుండెలోన నుంచవైతి।రండీ ॥

గో :- వినండి తానీషగారు ఏలనా పై నుద్దండ కోపము చేసేరు

కండ క్రొవ్వుచేత నేను తుంటరికము సేయను భూ మండలములో మీ కీర్తి నిండగల్గ జేసినాను వినుడీ॥

పా- తా సంపాదించి చేసిన ధర్మాన గల్గును కీర్తియే శాస్త్రజ్ఞుడు ఇప్పుడు నీకీమతి గల్గించినాడు రండీ॥

గో- ఘనమైన మీ నగరుతొక్క దినము ఖర్చు కనదు స్వల్ప ధనమిదిగో మీ భద్రాచల పురములో గుడి కట్టినాను వినుడీ॥

పా- బలవంతుల ధనము వారిసెలవు లేక ఖర్చు నేయ తలపోవునని మదిలో దలపోయవైతి విదేమి రండీ ॥

గో- అస్థిరమౌ నీదేహమెటులేల నెఱ నమ్మలేదునీయట్ల దొర భద్రాచల శ్రీరామదాసుడనై చేసితిఋమ్మా వినుడీ ॥

ఈ విధంగా ధైర్యంగా రామ కైంకర్యానికే ప్రభుత్వ ధనం ఖర్చు చేశానని చెప్పాడు రామదాసు. తానాషా రామదాసుల సంభాషణను గూర్చి బాలాంత్రపు రజనీకాంతరావుగారు ఈ విధంగా తెలియజేశారు.

తానీషా :- సర్వసత్తాకమైన సర్కారు ధనం సర్కారు సమ్మతి లేకుండా వినియోగించవచ్చా ?

గోపన్న :- సర్వ శక్తిమంతుడైన శ్రీరామునికి చేసిన కైంకర్యంగా ఒప్పుకుంటే మీకు కూడా పుణ్యకార్యమేకదా.

తానాషా:- పైకం ఒక వారంలో సర్కారు ఖజానాకు చేరకపోతే చెరనుండి విడుదల లేదు నీకు.[2]

విచారణలో గోపన్న జవాబులు అహేతుక దైవావేశాన్ని, సర్కారు ధిక్కారాన్ని ప్రకటించినట్లు తోచి తానాషా, గోపన్నను సర్కారు ఉద్యోగుల పాలికి వదలివేశాడు. ఈ సంవాద రూప కీర్తన యాదవదాసు రచించిన యక్షగానంలో కూడా ఉంది. ఇంకా ఇతర నాటకాల్లో వచన రూపంలో ప్రస్తావింపబడి ఉంది.

వీరిరువురి సంభాషణలో గోపన్న ఎంతో వేదాంత తత్త్వాన్ని, భక్తికి గల ప్రాధాన్యాన్ని తెలియపరచాడు. రామదాసుకు రామునియందు గల అకుంఠితమైన భక్తి, విశ్వాసాలు ఈ సంవాదంలో వెల్లడవుతాయి. రాముడే తనను ఏనాటికైనా కాపాడ గలడనే ధైర్యంతో ఉన్నాడు గోపన్న. తనను ఋణ విముక్తునిగా రాముడే చేస్తాడన్న విశ్వాసంతోనే ఉన్నాడు. అందుకే నరులను ఆశ్రయించదలచుకోలేదు.

రామదాసును ధనం ఇమ్మని గోల్కొండ నగర వీధులనుండి భటులు తీసుకొని బందిఖానా వైపు పోతుండగా, గోల్కొండ పుర జనులు ఆ రామదాసును కాపాడమని రాముని ప్రార్థించారు. రామదాసు రామా ! నీ సరి వారెవరు లేరు నాకు నీవే దిక్కు. నీవు నన్నీ ఆపద నుండి కాపాడవలసిందని రాముని ప్రార్థించాడు.

"నీ సతి పెక్కు గల్మలిడ నేర్పరి లోకమకల్మషంబుగా
నీ సుత చేయు పావనము నిర్మిత కార్యధురీణ దక్షుడై
నీ సుతుడిచ్చు నాయువులు నిన్ను భజించిన గల్గకుండునే
దాసులకీప్సితార్థములు దాశరథీ కరుణా పయోనిధీ "[3]

రామా ! నీ భార్యయైన లక్ష్మి సమస్త సంపదలనిచ్చుటకు నిపుణురాలు. నీకూతురైన గంగ ముల్లోకాల్లో ప్రవహించి లోకమునందలి దోషములను పోగొట్టి పవిత్రముగా జేయును. నీ కొడుకైన బ్రహ్మ సృష్టి కార్యమంతయు నిర్వహింప సమర్థుడై ఆయువులనిచ్చును. ఇట్టి పుత్ర కళత్రాదులు గల నిన్ను భజించిన నీ భక్తులకు కోరిన కోర్కులు నెఱవేఱక పోవు" అని ధైర్యంగా ఉన్నాడు రామదాసు. మరియు రాముడు దీనదయాళువని భావించి శ్రీరాముని ఈ విధంగా స్తుతిస్తున్నాడు.

1. శ్రీ భద్రాచల రామదాసు చరిత్రము - సింగరదాసు పుట 100-101.
2. భక్తరామదాసు కీర్తనలు పీఠిక -రజనీకాంతరావు (సంకలనం దాశరథుల బాలయ్య, పుట 9.
3. దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న పుట 68, పద్యం 89.

**" యమునా కల్యాణి - ఆది "**

*దీన దయాళో - దీన దయాళో దీన దయాపర - దేవ దయాళో ॥*
*కనకాంబర ఘనశ్యామ దయాళో సనకాది ముని యోగి వినుత దయాళో ॥*
*శరధి బంధన రామచంద్ర దయాళో వరదామర బృందానంద దయాళో ॥*
*నారద ముని దేవ నాథ దయాళో సారసాక్ష రఘునాథ దయాళో*
*దశరథ సుత లోకాధార దయాళో పశుపతి శ్రీచాప భంగ దయాళో ॥*
*ఆగమ కల్పిత అమిత దయాళో భోగి శయన పరమ పురుష దయాళో ॥*
*వర భద్రాద్రి నివాస దయాళో పాలిత శ్రీరామ దాస దయాళో ॥*[1]

రామా ! హే దీనబంధో! దీన దయాళో! నన్ను కాపాడ రావా ! అని హృదయ విదారకంగా దుఃఖిస్తు మొరపెట్టుకున్నాడు. మరియు, రామా ! నన్ను అరమర సేయకు అని నిరంతరం నీ నామ స్మరణ చేసే నన్ను బాధ పెట్టడం నీకు తగదు అని, ఇలా కీర్తిస్తున్నాడు.

**" సురటి - చాపు "**

*హరిహరి రామ నన్నరమర జూడకు నిరతము నీ నామ స్మరణయేమరను ॥*
*దశరథ నందన దశముఖ మర్దన పశుపతి రంజన పాప విమోచన ॥*
*మణిమయ భూషణ మంజుల భాషణ రణజయ భీషణ రఘుకుల పోషణ*
*పతిత పావన రామ భద్రశైల ధామ సతతము శ్రీరామ దాసుడనిన నేలు ॥*[2]

ఈ విధంగా పలు విధాల రాముని స్తుతిస్తు గోల్కొండ బందిఖానాలోకి ప్రవేశిస్తున్నాడు రామదాసు. చెరసాలలో ప్రవేశించే ముందుగా శ్రీరాముని సెలవడుగుతున్నాడు. ఈ కీర్తనలో ఈ విధంగా అంటున్నారు.

**" నాదనామ క్రియ - ఏక "**

*సెలవా మాకు సెలవా యీ చెరకేగ సెలవా మాకింక జలజ సంభవసుత*
*జలజాత నేత్ర సజ్జన మిత్ర శ్రీ రామా ॥*
*నీవాడ నన్నేలుకోవా యిటు వేగరావా సమయమున కావ రామయ్య*[3] *॥*
*వాసిగ భద్రాద్రి వాసా వర రామ దాస హృదయ నివాసా రామయ్య ॥*

ఓ శ్రీరామా ! ఓ తండ్రీ ! చెరకు వెళ్తున్న నన్ను ఈ చెరనుండి నాకు విముక్తి ప్రసాదించు అని రామదాసు వేడుకున్నాడు. ఈ విధంగా రామదాసు రామాలయ నిర్మాణానికై ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేసిన కారణంగా, అది తాను తీర్చలేక, రాముడే ఆ అప్పు తీర్చగలడని భావించిన రామదాసు రాముడిపైనే భారమంతా వేసి, రాముని ప్రార్థిస్తూ, చెరసాలలో 12 సంవత్సరాలు మ్రగ్గాడు. కఠిన శిక్షలు పొందాడు. 1665-1677 వరకు 12 సంవత్సరాలు చెరసాలలో సకల బాధలూ అనుభవించాడు రామదాసు.

"అతడు శ్రీరామచంద్రునికి గొప్పభక్తుడు. సర్కారు ఖజానాకు చెందిన చాలపెద్ద మొత్తాలు ఖర్చుపెట్టి తన దేవునికి ఆలయాన్ని, శ్రీరామ ప్రభువుకూ, సీతకు, తమ్ముళ్ళకు అమూల్య రత్నాలతో ఆభరణాలు చేయించాడు. అనుమతి లేకుండా సర్కారు ద్రవ్యాన్ని అపహరించాడన్న అపరాధానికి అతనిని చెరపెట్టి, అనేక బాధలు పెట్టారు. గోలకొండ సర్కారు ఉద్యోగులు. శ్రీరామ ప్రభువే సుల్తానుకు పైకం చెల్లించి గోపన్నను చెర విడిపించాడు"అని హోవర్ట్, మాల్టిస్ అనే డచ్చి తూర్పిండియా కంపెనీ ఉద్యోగులు వ్రాశారు.[4]

ఈ విధంగా రామదాసు కారాగారంలో వేయబడి 12 సంవత్సరాలు కఠిన శిక్షను అనుభవించాడు. ఈ శిక్షలు కూడా సితార వేయించిందని చారిత్రకంగా ఇంతకు పూర్వం ఋజువు చేయడమైంది. ఇక కారాగారంలో ఉండగా రామదాసు పాడిన కీర్తనలు, ఆయన జీవితం గూర్చి తర్వాతి అధ్యాయంలో తెలియజేస్తాను.

1. భక్త రామదాసు కీర్తనలు పుట 73, కీర్తన 80.
2. " " " పుట 165, కీర్తన 195.
3. " " " పుట 160, కీర్తన 190.
4. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం దాశరథుల బాలయ్య, పీఠిక-బాలాంత్రపు రజనీకాంతరావు) ) పుట 12.

ఐదవ అధ్యాయం

# రామదాసు జైలులో వ్రాసిన కీర్తనలు

# ఐదవ అధ్యాయము

# రామదాసు జైలులో వ్రాసిన కీర్తనలు

**5.0 రామదాసు బందిఖానాలో 12 సం॥లు ఉండుట :**

భద్రాద్రి రామాలయ నిర్మాణానికై 6 లక్షలు ఖర్చు చేశాడన్న నేరం క్రింద అబ్దుల్లా కుతుబ్షాకాలంలో రామదాసు బందిఖానాలో ఉంచబడినాడు. ధనం చెల్లించడానికి వారం రోజులు గడువిచ్చాడు ప్రభువు. కాని వారం లోగా ఆధనం చెల్లించలేకపోతాడు. అందుకే 12 సంవత్సరాలు కారాగృహంలో బంధింపబడినాడు. కఠినంగా శిక్షలు అనుభవించాడు. అబుల్ హసన్ తానాషా కాలంలో 1677 వరకు జైలులో ఉన్నాడు. క్రీ.శ. 1665 నుండి 1677 వరకు జైలులో ఉన్నాడు. "1665-72" వరకు అబ్దుల్లా కాలంలో 8 సం॥లు, 1672 - 77 వరకు 6 సం॥లు అబుల్ హసన్ తానాషా కాలంలోనూ మొత్తం 12 సంవత్సరాలు జైలు జీవితం అనుభవించాడు. గోల్కొండ కోటలో ఉన్న జైలులో రామదాసు బంధింపబడినాడు. ఆ కారాగృహం ఈనాటికీ ఉంది. కారాగారంలో కూడా ఆయన అనేక కీర్తనలు రచించా గానం చేశాడు. ఆయన రచించిన కీర్తనల వల్లనే ఆయన బందిఖానాలో పడిన బాధలు మనకు తెలుస్తున్నాయి. గోల్కొండ కోటను దర్శించినపుడు, యాత్రికులు ఈ బందిఖానాను కూడా దర్శిస్తారు. ఈ బందిఖానా పై భాగంలో ఒక రంధ్రం కనిపిస్తుంది. ఈ రంధ్రం ద్వారా రామదాసుకు ఆహారం పడవేసేవారట. అంతేగాక బందిఖానాలో రామదాసు గీసిన రామలక్ష్మణుల బొమ్మలు, సూర్య చంద్రుల బొమ్మలు రామదాసుల వారు కారాగారంలో పూజించడం కొరకు వేసుకొన్నారట ! ఇవి రామదాసు తన గోటితో గీసిన బొమ్మలు అని అంటారు. రామదాసు కారాగారంలో పన్నెండేళ్ళు గడిపినట్లు ఈ కీర్తనల వల్ల తెలుస్తుంది.

1. "ఆనంద భైరవి - అట "

*ఎన్నాళ్ళదనుక నుంతుహో బందిఖానాలోనే రామా । వెన్నుడ నామొర విని వేగ - రక్షించవా శ్రీరామా ॥*
*పన్నెండు యేండ్లాయె నేను - బందిఖానాలోనే రామా । అన్నము నీళ్ళును లేక ఆర్తినొందితిని రామా ॥*
*ఎందైన సైకము నీకు - అర్పణ సేసితి కాసింతైన భార్యకు చిన్నమెత్తు సొమ్ములు లేవే ॥*
*రంజిల్లు భద్రాద్రి రామ ! రామ చంద్రా రాజా ! మీరు రంజింతు జేయరు - రామదాసానదాసుని జూడు॥* 1

2. "ఆనంద భైరవి - త్రిశ్రపుట"

*ఎందుకు కృపరాదు శ్రీరామ - నేనేమి చేసితినయ్య శ్రీరామ ॥ ...*
*పండ్లు పంద్రెండాయెనే శ్రీరామ - నీ కండ్లకు పండుగె శ్రీరామ ॥*
*వాసియౌ భద్రాద్రి వాస శ్రీరామ - రామదాసుని విడువకు శ్రీరామ ॥* 2

3. "ఆనంద భైరవి - అటి"

*ఏమిటికి దయరాదు శ్రీరాములు - నన్ను ఏమిటికి రక్షించవు శ్రీరాములు ॥*
*పరులను వేడను శ్రీరాములు నీకే - కరములు జోడితి శ్రీరాములు ॥*
*పంద్రెండేండ్లాయెనే శ్రీరాములు - బందిఖానాలో యున్నాను శ్రీరాములు ॥*
*అర్థము తెమ్మనుచు శ్రీరాములు - నన్ను అలికట్టుచున్నారు శ్రీరాములు ॥*
*తానాషా జవాన్లు శ్రీరాములు నన్ను తహసీలు జేసెరు శ్రీరాములు ॥*
*ముచ్చటాడవేమి శ్రీరాములు నీవు ఇచ్చే అర్థములిమ్ము శ్రీరాములు ॥*
*నీచే గాకున్న శ్రీరాములు మా - తల్లి సీతమ్మ లేదా శ్రీరాములు ॥*

---

1. భక్త రామదాసు కీర్తనలు - పుట 37, కీర్తన 37. సంకలనం - దాశరథుల బాలయ్య
2. " పుట 37-38 కీర్తన 38 - " "

మాతల్లి సీతమ్మకైన శ్రీరాములు నే - మనవి చెప్పకొందునయ్య శ్రీరాములు ॥
ఆశించిన దాసుని శ్రీరాములు నీకు - పోషించు భారము లేదా శ్రీరాములు ॥
నిన్ను నమ్మినానయ్య శ్రీరాములు - గట్టిగ నానెమ్మదిలో శ్రీరాములు ॥
వెడలిటు రారేమి శ్రీరాములు మీకు - విడిది భద్రాచలమా శ్రీరాములు ॥
వాసిగ భద్రాద్రి శ్రీరాములు రామ - దాసుని రక్షింపు శ్రీరాములు ॥[1]

4. షహానా - చాపు

జనక తనయ ! నాదు మనవి గైకొని జగ - జ్జనకునితో దెల్పవే ఓ జననీ ॥
పనిబూని నను బెట్టే బాధలన్నింటిని - పాటించ మహి లెస్సగా ఓ జననీ ॥
పన్నెండేండ్ల నుండి పగలు రేయి నా - పన్నుడనై మిమ్ముల ఓ జననీ ॥
ఎన్నెన్నో విధముల నన్నుతించిన గాని - కన్నుల జూడడాయె ఓ జననీ ॥[2]

5. నాదనామ క్రియ - రూపక

ముచ్చటైననాడవేమిరా - కోదండపాణి ॥ ముచ్చటైననాడవేమిరా ॥
పండ్రెండేండ్లాయె నేను బందిఖానా లోనే యుండి - నల్లుల దోమల చేత నలుగుచున్నది దేహము ॥
చైత్ర వైశాఖము లిప్పడు చెప్పతరము గాదు - తహసీలు సేయగ నాకు జామీనైనా యెవ్వరు లేరు ॥
తానాషా గారు వచ్చి తహసీలు చేసెదరు - కానులు పంపించి నన్ను కరుణచే చెరవిడిపించు ॥
వేమారు శ్రీ భద్రాచల రామస్వామి ! నీవిప్పడు - రామదాసుని చేపట్టి రక్షింపకున్నావు తండ్రి ॥[3]

6. కాంభోజి - ఆది

మిథిలేశ తనయ నా మితిలేని వెతల నీ యధిపున కెరిగింపవే ఓ జననీ ॥
వ్యధచెందుచున్నాను బుధ వినుత నాకథను వినగ రమ్మని చెప్పవే ఓ జననీ ॥
పండ్రెండేండ్లాయెను బందిఖానా జిక్కి బాధింపుచున్నారిట ఓ జననీ ॥
తండ్రి కరుణమానె తల్లి నీ కృప యెట్లో వేండ్రమాయె బ్రతుకు ఓ జననీ ॥[4]

ఈ కీర్తనలన్నీ పరిశీలించిన మీదట స్పష్టమయ్యే అంశాలివి.

రామదాసు ఖైదులో 12 సం॥లు పూర్తవుతున్న సమయంలో తానీషా (అబుల్ హసన్) రాజుగా ఉన్నాడు. 1677 నాటికి 12 సంవత్సరాలు పూర్తవుతుంది. ఈ 12 ఏండ్లు పూర్తవుతున్నా రాముడు తనను వేగమే విడిపించమని తానీషా జవాన్లు తనను బాధిస్తున్నారని, అర్థం తెమ్మని బాధలు పెడుతున్నారని, ప్రార్థించాడు. 12 సం॥లు కారాగృహంలో రామదాసు బంధింపబడినాడని, 12 ఏండ్ల తరువాత "తానీషా" చేత విడుదల కావింపబడినాడని ఈ కీర్తనలు అబుల్ హసన్ కాలంలోనే కారాగృహంలో ఉండి పాడినవని 12 సం॥ పూర్తి అయ్యే సందర్భంలో వ్రాసిన కీర్తనలుగా వీటిని పేర్కొనవచ్చు అని స్పష్టమవుతుంది.

"తన మేనమామ మాదన్న మహామంత్రిగా అబుల్‌హసన్ కుతుబ్షా వద్ద ఉండగా రామదాసు ఆ విధంగా అంతకాలం చెరసాలలో బాధలు పడవలసిన అవసరం ఏమిటి? అంటే మాదన్న మంత్రి తన మేనల్లుని విడిపించడానికి అతడు ఖర్చు పెట్టినంత పెద్ద మొత్తాలను ఖజానాకు చెల్లించదగినంత స్తోమత మాదన్నకు లేకపోయి యుండవచ్చు ననియు మనము ఊహింపవచ్చును." అని దాశరథుల బాలయ్య గారు ఈ సందర్భంలో తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. మిన్నికంటి గురునాథ శర్మ గారు "రామదాసు ఖైదునందు 12 సంవత్సరములు ఉండినాడని, అందుకు కారణాన్ని ఈ విధంగా తెలియజేశారు.[5]

1. భక్త రామదాసు కీర్తనలు - పుట 39-40. కీర్తన 41. సంకలనం - దాశరథుల బాలయ్య
2. ॥ పుట 62 కీర్తన 68. ॥
3. ॥ పుట 96 కీర్తన 114 ॥
4. ॥ పుట 99 కీర్తన 118 ॥
5. భక్త రామదాసు జీవితము - రచనలు - దాశరథుల బాలయ్య - 1985.(సిద్ధాంతవ్యాసం - ఉస్మానియా విశ్వవిద్యాలయం)

"రామదాసు ప్రభుత్వము సొమ్ముతో రామాలయ నిర్మాణం గావించిన నేరానికి. 'సితార' రామదాసు యెడ చేసిన ద్రోహానికి ఆరులక్షల వరహాలు పైనబడినందున, ఆరు లక్షలు పైకం తిరిగి ప్రభుత్వానికి చెల్లించేంత వరకు 'తానీషా' జైలునందుండమని రామదాసు నాజ్ఞాపించెను. రామదాసు ఖైదులో ఉండి అనుభవించిన కష్టములు చెప్పతరమా. దుర్భరమైన కష్టములు, బాధలు అనుభవిస్తూ రామదాసు నిరంతరం రామనామ స్మరణంతో కాలం గడపసాగాడు. 12 సం॥లు అలా జైలులో ఉన్నాడు."[1]

రామదాసు జైలులో 12 సం॥లు ఉండనది నిజమే. అయితే 1672-77 వరకు అబుల్‌హసన్ కాలంలో కూడా 6 సం॥లు ఖైదులో ఉండెను. 1665-72 వరకు 8 సం॥లు అబ్దుల్లా కాలంలో ఖైదులో ఉండెను. తానీషా కాలంలోనే పూర్తిగా "12 సం॥లు ఖైదులో లేడు. రామదాసు 12 సం॥లు గోల్కొండ జైలులో బంధింపబడలేదని, కారణం పూర్తిగా 12 సం॥లు ఆయన కాళ్లకు, చేతులకు సంకెళ్లు ఉన్నాయని శ్రీ కె.వి. భూపాలరావు గారు అభిప్రాయపడినారు".[2]

శ్రీ నారుమంచి సుబ్బారావు గారు, "భద్రాచలం తహసీల్దారుగా ఉండగా గోపన్న రైతులనుండి వసూలైన పైకం అంతా రామకైంకర్యమునకే వాడుట వలన[3] ఆ విషయం తెలిసి తానీషా 1665లో గోపన్నకు 12 సం॥లు కఠిన శిక్ష విధించి బందిఖానాలో ఉంచెను." అని తెలియజేశారు. రామదాసు తానీషా కాలంలో ఖైదులో లేడు. 1665 అబుల్‌హసన్ కాలం కాదు. అబ్దుల్లా కుతుబ్షా కాలం. 12 సం॥లు ఖైదులో ఉండమని శిక్ష వేయలేదు. నిర్దిష్టంగా 12 సం॥లు అని చెప్పలేదు. ఎప్పుడు పైకం చెల్లిస్తే అప్పుడే విడుదలచేస్తానంటాడు గోల్కొండ నవాబు. అయితే ఆ ధనం చెల్లించడానికి 12 సం॥లు పట్టింది. అందుకే 12 సం॥లు ఖైదులోనే రామదాసు మగ్గాడు.

జి. కృష్ణ తమ "ప్రముఖ వాగ్గేయకారులు" అనే పుస్తకంలో, మాదన్న ప్రధానమంత్రి కాక పూర్వమే రామదాసు బందిఖానా సంఘటన జరిగి ఉంటుంది. గోల్కొండకు బందీగా తెచ్చి ఉంటారు. చెరసాలలో పెట్టారు. బంధించి ఉంటారు. అది అబ్దుల్లా కుతుబ్షా కాలం అయి ఉండవచ్చు."[4] అని అభిప్రాయం వ్యక్తం చేశారు. వీరి అభిప్రాయం సరియైనది. అబ్దుల్లా కాలంలోనే, మాదన్న మంత్రి కాకపూర్వమే రామదాసు ఖైదు చేయబడినాడు. "ఏది ఏమైనా సర్కారు పైకాన్ని మాటమాత్రం సుల్తానుకు తెలుపకుండా ఖర్చు చేయడం తప్పే కాబట్టి రామదాసు పన్నెండేళ్లు చెరసాల బాధను అనుభవించాడు. భద్రాచలం పరగణాలో కరువు వల్ల ప్రజలు కూడ సకాలంలో రామదాసును ఆదుకోలేకపోయారు. చెరసాలలో రామదాసు పడిన బాధలు అతని కీర్తనల్లో ప్రతిబింబిస్తాయి."[5]

గోల్కొండ రాజ్యంలో కరువు వచ్చింది అబ్దుల్లా కుతుబ్షా కాలంలో. అప్పడే రామదాసు రామాలయ నిర్మాణం చేపట్టడం, ఆ తర్వాత ప్రభుత్వ ధనం ఖర్చు చేయడం, ఈ కారణంగానే ఖైదు చేయబడడం జరిగింది.

బిరుదురాజు రామరాజుగారు. "రామదాసును బందిఖానాలో పెట్టినది అబ్దుల్లాయే గాని తానీషా గాదు"[6] అని అభిప్రాయం వ్యక్తం చేశారు. "రామదాసు నాటకము" నందు ధర్మవరం గోపాలాచార్యులు గారు రామదాసు బంధింపబడిన విషయం ఈ విధంగా తెలియజేశారు.

1. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ -1935. పుట 94. (ఏడవ ప్రకరణము)
2. కె.వి. భూపాల రావు గారు నాతో ముఖాముఖి పరిచయంలో, వారుతెలియజేసిన అభిప్రాయం ఇది.
3. సంగీత మహర్షులు - మొదటి భాగం - నారుమంచి సుబ్బారావు. పుట - 44.
4. ప్రముఖ వాగ్గేయకారులు - జి. కృష్ణ . పుట 22.
5. భద్రాద్రి రామదాసు రచనలు - డా॥ కె. కుసుమాబాయి. గోల్కొండ ప్రభువుల కాలం నాటి భాషా సాహిత్య సేవ-పుట 134.
   జాతీయ సదస్సు సంచిక - సంపా. యస్వీ రామారావు.
6. అనుభవ కవి - కంచెర్ల గోపన్న - బిరుదురాజు రామరాజు.(తెలుగులో తొలి సమాజకవులు - సంపా. కె.కె. రంగనాథాచార్యులు పుట.53. ఆంధ్ర సారస్వత పరిషత్తు)
7. రామదాసు నాటకం - ధర్మవరం గోపాలాచార్యులు - చతుర్థాంకము.

"రామదాసు ప్రభుత్వధనం ఆరు లక్షలు వెచ్చించి రామాలయ నిర్మాణం గావించిన నేరానికి తానీషా జవానులు రామదాసుకు సంకెలలు వేసి బంధించారు. ఆరు లక్షల పైకమిమ్మన్నారు." తానీషా, రామదాసుల మధ్య జరిగిన సంభాషణలో రాముడే తన ధనం చెల్లిస్తాడని రామదాసు అంటాడు. రామదాసును తానీషా విడువడు. రామదాసు భార్య కమలాంబ, అబుల్‌హసన్ తానాషా భార్య సితారను కలిసి విషయం చెప్తుంది. ఎంతచేసినా తానీషా రామదాసును విడిచేలాలేరని తెలుసుకుని దుఃఖిస్తుంది సితార.

రామదాసు కుమారుడు రఘురాముడు, రాముడు ఆనాడు బావిలో పడిన తనను కాపాడాడు కదా ! తన తండ్రిని కూడా రాముడేల రక్షించరాడని దుఃఖిస్తాడు. ఈ అంశాలను పరిశీలించగా మనకు స్పష్టమయ్యే విషయాలివి. రామదాసు అంటే జాలి, బాధ 'సితార'కు ఉన్నట్లుగా ఇందులో చెప్పబడింది. కాని సితారయే రామదాసు శిక్షలకన్నింటికి కారకురాలని మిన్నికంటి గురునాథ శర్మగారు తెలియజేశారు. సితార హిందూమత ద్వేషి అని కొన్ని చారిత్రక గ్రంథాలలో వ్రాయబడిఉంది.

రామదాసు, తానీషాల సంభాషణ గూర్చి రామదాసు కీర్తనలలో ఎక్కడా ప్రస్తావింపబడలేదు. సితార, రామదాసును విడిపించమని తానీషాతో చెప్పినా ప్రయోజనం లేనందుకు దుఃఖించడం నిజం కాదు. రామదాసు ఖైదులో ఏడు దినాలున్నట్లు ఈ నాటకంలో ఉంది . ఇది నిజం కాదు. చారిత్రకంగా ఇది అసత్యం. "భక్త రామదాసు అను రామదాసు విజయము" అనే నాటకంలో కీ.శే. కేతవరపు శివరామ శాస్త్రి గారు ఈ విధంగా వ్రాశారు.[1]

"రామదాసు రామాలయ నిర్మాణం గావించిన నేరానికి రామదాసుని, తానీషా భటులు బందీగా గొనివచ్చి 10 దినాలు ఖైదులో ఉంచినారు. ఆ తర్వాత అతనిని విచారణకై తానీషా ఎదుట ప్రవేశ పెట్టినారు." మాదన్న, అక్కన్నల సహాయంతో భద్రాద్రి తాలూకాకు చెందిన ఆరు లక్షల పైకం రామాలయ నిర్మాణానికై, వెచ్చించినట్లు గోపన్నపై నిందారోపణం చేయబడింది. రామదాసును ధనం ఇచ్చేంతవరకు ఖైదులో బంధించడం జరిగింది. ఆధనం ఇచ్చిన తర్వాతనే విడుదల చేస్తామని తానీషా అంటాడు. రామదాసు ఖైదులో ఉంచబడి 12 సంIIలు పూర్తి అయింది. అయినా ఆధనం గూర్చి ఆలోచించలేదు. రాముడే ఆ ధనం తెచ్చి తానీషాకు ఇవ్వగలడన్న విశ్వాసంతో ఉన్నాడు గోపన్న."

ఈ నాటకంలో వ్రాసినట్లుగా రామదాసు రామాలయ నిర్మాణం కొరకై మాదన్న, అక్కన్నల సహాయం తీసుకోలేదు. నిందలు వేశారు అందరూ. సిరస్తాదారు 'రంగారావు' అనే అతడు రామదాసు ఖైదులో ఉంచబడడానికి ప్రధాన కారణంగా, ఈ నాటకంలో రచయిత వ్రాశారు. రామదాసును తహసీల్దారు పదవి నుండి తొలగించడానికి ఈతడు కుట్ర పన్ని, మహమ్మదీయులతో చేతులు కలిపి రామదాసు పై తప్పడు మాటలు చెప్పాడు. అక్కన్న, మాదన్నలపై కూడా నిందలు వేశాడు. ఈ కారణంగానే రామదాసు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశాడన్న నేరం క్రింద ఖైదు చేయబడినాడు. ఇది ఈ నాటకంతో ఉన్న కథ.

మహమ్మదీయులు పన్నిన కుట్ర కారణంగానే రామదాసు జైలు శిక్ష అనుభవించిన మాట మాత్రం సత్యం. హిందూ మత ద్వేషుల అమానుష చర్యలకు బలైనాడు రామదాసు. ఇది చారిత్రక సత్యం. రామనారాయణ కవులు రచించిన "రామదాసు" అనే నాటకంలో రామదాసు ఖైదు చేయబడిన సంఘటనను గూర్చి ఈ విధంగా వివరించారు. "రామదాసును 'తానాషా' విచారించి ఆరు లక్షల పైకం రామాలయ నిర్మాణానికై ఖర్చు చేసినందుకు ఖైదులో ఉంచినాడు. శ్రీరాముని ప్రార్థిస్తూ చెరలో కాలం గడిపాడు.[2]

1. భక్త రామదాసు అను రామదాసు విజయము - కీ.శే. కేతవరపు శివరామ శాస్త్రి గారు - పంచమాంకము.

2. రామదాసు - రామనారాయణ కవులు - చతుర్థాంకము (నాటకము).

రామదాసు 12 సం॥లు ఖైదులో ఉన్న విషయం మాత్రం ఇందులేదు. కాని జైలులో బంధింపబడినాడని మాత్రం వీళ్లు వ్రాశారు. ఎంతకాలం జైలులో ఉన్నాడో ఈ నాటకంలో తెలియజేయలేదు.

'గోపన్న' అనే గ్రంథంలో గరిమెళ్ల సత్యగోదావరి శర్మ గారు "భద్రాద్రి రామాలయ నిర్మాణానికై 6 లక్షలు ధనం వెచ్చించిన నేరానికి తానాషా గోపన్నను గోల్కొండ ఖైదులో ఉంచెను." అని వ్రాశారు. ఈ పుస్తకంలో రామదాసు 12 సం॥లు ఖైదులో ఉన్నట్లు వ్రాశారు. "భక్త వత్సలా ! ప్రాణ నాథా! విన్నావు గదా యా భక్తుని దీనాలాపములు ! నీ భక్తవరుడగు గోపన్న గోలకొండ చెఱలో బండ్రెండేండ్ల నుండియు బడియున్నాడు."[1] అని సీతాదేవి రాముడితో అంటుంది.

"భక్త రామదాసు" బుర్రకథలో శ్రీ దుగ్గిరాల గౌరీ మనోహర రావుగారు, రామదాసు రామునికి ఆలయం నిర్మించడానికి ఆరు లక్షల పైకం వెచ్చించిన నేరానికి తానీషా చేత ఖైదు చేయబడినాడు." అని వ్రాశారు. 12 సం॥లు జైలులో ఉన్న విషయం మాత్రం చెప్పలేదు.

"గోపన్న ఆరులక్షల పైకమును - తందానా తందాని తందన
సీతారాముల ఆలయమునకు- "
దానధర్మాది సత్కార్యములకును - "
విపుల భోజన సౌకర్యములకును - "
భద్రాద్రి పురము బాగుగ చేయుటకును - "
బహు చక్కగ ఖర్చు పెట్టినందతడు - "[2]

అందుకే విషయం తెల్సి, గోపన్నను బంధింపజేసి గోల్కొండకు రప్పించి, ఖైదు చేయించాడు. పైకమిచ్చేంతవరకు వదలనన్నాడు. "శ్రీ రామదాస నాటకము"[3] లో కేశిరాజు వేంకట సుబ్బారాయకవి గారు 'రామదాసు కారాగారంలో బందీయైన విషయాన్ని గూర్చి ఈ విధంగా తెలియజేశాడు.

"రామదాసు గోల్కొండకు బందీగా వెళ్లాడు. రామదాసు తానీషాతో "ఆధనం ఆరులక్షలు రామాలయ నిర్మాణానికై, ఒక ధర్మకార్యానికై ఖర్చు అయినట్లు చెప్పాడు. రామదాసును ఆ ధనం ప్రభుత్వానకి చెల్లించేవరకు తానాషా కారాగృహంలో బంధించాడు. రామదాసు 12 సం॥లు పూర్తిగా కారాగారంలో బంధింపబడి ఉన్నాడు. "రామదాసు చరిత్రము"[4] హిందుస్థానీ నాటకంలో కూడా, రామదాసు రామాలయ నిర్మాణానికై ఆరు లక్షల పైకం ప్రభుత్వ ధనం ఖర్చు చేసిన[5] కారణంగా తానీషాచే ఖైదు చేయబడి 12 సం॥లు జైలు శిక్ష అనుభవించాడని" ఉంది. "రామదాసు చరిత్రము" అనే కావ్యంలో చల్లా పిచ్చయ్య శాస్త్రి గారు ఈవిధంగా వ్రాశారు. "రామదాసును గోల్కొండ ఖైదులో తానీషా బంధించినాడు. రామదాసు 12 సం॥లు కారాగారంలో ఉన్నాడు. రామదాసు బందిఖానా గూర్చి ఆయన జీవితం అందు ఎలా ఉండేదో డా॥ వి. రాఘవన్ గారు ఈ విధంగా వివరించారు.

" All that he wrote, his time, his life these are all known to us authoritatively, more authoritatively that the life and career of Tyagaraja who lived much nearer out time, we can visit Golkonda and see that hill and the place where Ramadas was imprisoned and the hole by which food is said to have been dropped for him."[6]

---

1. గోపన్న - కీ. శే. గరిమెళ్ల సత్యగోదావరి శర్మ, పుట 66.
2. భక్త రామదాసు - బుర్రకథ - శ్రీ దుగ్గిరాల గౌరీమనోహర రావు గారు - పుట 15 .
3. శ్రీరామదాస నాటకము - కేశిరాజు వేంకట సుబ్బారాయ కవి - చతుర్థాంకం, పంచమాంకం.
4. రామదాసు చరిత్రము(నాటకం) - నాదెండ్ల పురుషోత్తము కవి - హిందుస్థానీ నాటకం.
5. రామదాసు చరిత్రము(కావ్యం) - చల్లా పిచ్చయ్య శాస్త్రి .
6. Bhadrachala Ramdas - Dr.V.Raghavan "Edited by Gowrie kuppu Swamy, Dr. Hariharan - Great Composers - CBH publications.

రామదాసు బందిఖానాలో పైనున్న చిన్న రంధ్రం నుండి రామదాసుకు ఆహారం వేశారు. ఆ రంధ్రం ఈ నాటికీ గోల్కొండ బందిఖానాలో పైన ఉంది. యాత్రికులు ఈ బందిఖానాను దర్శిస్తుంటారు. ఈ విధంగా రామదాసు 12 సం॥లు గోల్కొండ బందిఖానాలో ఉండి అనేక కష్టాలు, శిక్షలు అనుభవిస్తూ కాలం గడిపాడు.

**5.1. రామదాసు కారాగృహమున అనుభవించిన శిక్షలు :**

రామదాసు కారాగారంలో ఉన్నపుడు, తన బాధలను నివారించమని రాముని శరణు వేడుతున్నాడు. రామదాసు తాను కారాగారంలో అనుభవించిన బాధలను ఆయన కీర్తనలు ప్రతిబింబిస్తాయి. తన బాధలను గూర్చి, గోల్కొండ జవానులు వేస్తున్న శిక్షలను అనుభవిస్తూ తన కీర్తనల్లో చెప్పకున్నాడు.

1. రామదాసు కారాగారంలో ఉండగా ఆయనను పైకం ఆరులక్షలు చెల్లించమని బందిఖానా వద్ద ఉండే జవానులు కొరడాలు తీసుకుని కొట్టినపుడు రామదాసు ఆ దెబ్బలకు తాళలేక రామునికి ఈ విధంగా మొఱ పెట్టుకుంటాడు.

**"అసావేరి - ఆది"**

*అబ్బబ్బ దెబ్బలకు తాళలేరా - రామప్ప గొబ్బున నన్నాదుకోరా ॥*
*మేలుసేయుగ లేనంటి గదరా మేల్ - చేసితింకేమి భయమంటిగదరా ॥*
*వరహాలు మొహరీలు జమ చేసిగదరా - పరిచారకులకు నే పంచితి గదరా ॥*
*పరుల కొక్క రువ్వయిూలేదు గదరా - పరమాత్మ నీ పాదములు నమ్మినానురా ॥*
***కొరడాలు తీసుకకొట్టిరి గదరా - హరసుత గోవింద హరితాళలేరా ॥***
*ఆత్మ లోపల నిన్ను నెరనమ్మినారా - శరణాగత త్రాణ బిరుదేమైనదిరా ॥*
*శరధి బంధించిన శౌర్య మెక్కడరా - రాక్షస సంహార రక్షింపవేరా ॥*
*రామ భద్రాద్రి శ్రీరామ రామాశీ - నామమెప్పుడు భజియించితి గదరా ॥*
*రామదాసుని యిటుల జేయించి తేరా ॥*[1]

రామా ! నేను నీ కొరకు ఆలయం కట్టించడం నేరమా ! నేను పరుల కొరకు ఆధనం ఖర్చు చేయలేదే. నీ కోసమే ఖర్చు చేశాను. అన్నింటికి నీవున్నావని నేను అనుకున్నాను. ఈ కొరడా దెబ్బలతో నా ఒళ్లు హూనం చేస్తున్నారు. ఈ బాధలనుండి నన్ను విముక్తుని చేయవలసింది. అని రాముని ప్రార్థింపగా రామానుగ్రహంతో ఆ కొరడా దెబ్బల వలన శరీరం గాయపడలేదు. కందలేదు. ఈ కీర్తనలో "వరహాలు మొహరీలు చేయిస్తి గదరా - పరుల కొక్క రువ్వ ఈయలేదు గదర " అని అంటాడు. దానిని బట్టి ఆలయ నిర్మాణాదులెంత పాదుపుగ సాగించిందో తెలుస్తుంది.

2. రామదాసు చేతులకు గిట్టి కోలలు వేసి కట్టిబెట్టి కొట్టినపుడు రామదాసు ఈ విధంగా ఆర్తితో, భగవంతుడైన శ్రీరామచంద్రుని ప్రార్థిస్తాడు.

అసావేరి - ఆది

*"అబ్బబ్బా దెబ్బలకు నోర్వలేనురా - జబ్బు సేయక రారా తబ్బిబ్బాయెనురా ॥*
*అట్టే నిను పూజించినట్టి చేతులనిదిగో - కట్టిబెట్టి కొట్టి రెట్టు తాకుదునయ్య ॥*
*రట్టు తీర్చ వేళ గట్టిగానీవునా - చెట్ట బట్టేలు కో పట్టాభిరామ ॥*
***శరణాగత త్రాణ బిరుదాంకుడవు గాదా - శరధి బంధించిన శౌర్యమేమాయెరా ॥***
*పరంధామ నీ పాదములాన వినరా - పరుల కొక్క కాసునేనియ్య లేదురా ॥*
*భద్రాద్రి శ్రీరామ నీ నామ మెపుడు - ప్రేమతో భజియించు రామదాసునేలు ॥*[2]

1. భక్త రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య - పుట 3. కీర్తన 3.

2. " " పుట 6 కీర్తన 5.

రామదాసును కొరడాలతో కొట్టడమే కాక, అతని చేతులకు "గిట్టికట్టి కొట్టే రెట్టు తాకుడునయ్యో" వేడుకుంటాడు. రామా నిన్ను నిరంతరం పూజించే ఈ చేతులు విరగగొడుతున్నారు. నన్ను ఈ బాధను విముక్తుని చేయి రామా! అని వేడుకోగానే ఆ దెబ్బలు రామదాసు శరీరానికి తగలడంలేదు. రామదాసు ఈవిధంగా కొరడాలతో కొడుతూ, చేతులపై గిట్టి కోలలు వేసి కొట్టినపుడు, ఆ దెబ్బలకు తాళలేక, కోప రామా! నీ కోసం, నీ తమ్ముళ్ళ కోసం, నీ భార్య సీత కోసం నేను ఎన్నో ఆభరణాలు చేయించాను. వ వాహనాలు చేయించాను. వాటికి ఒక్కోదానికి పదివేల వరహాలు ఖర్చు చేశాను. అవన్నీ ఊ వచ్చాయనుకున్నారా! ఎవడబ్బ సొమ్మని మీరు హాయిగా అనుభవిస్తున్నారు ? అని రాముని నిలదీసి రామదా అడుగుతాడు. ఈ కీర్తనలో ఆర్తి, ఆవేదనతో కూడిన భక్తి, భగవంతుడిపై భక్తునికుండే అధికారం ప్రస్ఫుటం కనిపిస్తుంది.

**కాంభోజి - త్రిపుట**

ఇక్ష్వాకు కుల తిలక ఇకనైన పలుకవె రామచంద్రా - నన్ను రక్షింపకున్నను రక్షకులెవరింక రామచంద్ర

. . . . . . . . . . .

వాహనములు మీకు వరుసతో జేయిస్తి రామచంద్రా - జగన్మోహన సంకెళ్లు వేసిరి కాళ్లకు రామచంద్ర
కలికి తురాయి నీకు పాలుపుగ జేయిస్తి రామచంద్రా - నీవు కులుకుచు తిరిగెద వెవరబ్బ సొమ్మని రామచంద్ర
మీతండ్రి దశరథమహారాజు పెట్టెనా రామచంద్రా - లేక మీమామ జనకమహారాజు పంపెనా రామచంద్ర

అని రాముని నిందిస్తాడు. తన కాళ్లకు సంకెళ్లు వేసి కదలనీకుండా చేశారు. రామా ! నీ సేవ చేసినందుకు, ఏదో పోనీలే పాపం నీకు ఆలయం, నివాసం లేదని భావించి నీకు ఆలయం నిర్మిం ఇచ్చి, వైభవోపేతంగా ఆభరణాలు, వస్త్ర వాహనాలు చేయించి ఇస్తే, నాకు తగిన శిక్షే వేయించావు. నీ సేవ చేసినదే నేరమా ! రామా ! ఎందుకు నన్ను ఇలా ఏడిపిస్తావు అని దురుసుగా ఆరాముని తిడతాడ అంతలోనే తన తప్పు తెలుసుకుని, పశ్చాత్తాపుడై -

"అబ్బ తిట్టితినని ఆయాస పడవద్దు రామచంద్రా - ఈ దెబ్బలకోర్వక అబ్బ తిట్టితినయ్య రామచంద్రా
ఏటికి జల్లిన నీళ్లాయె నాబ్రతుకు రామచంద్రా - నేను అధముని కంటెను అన్యాయమైతినిరామచంద్రా
సర్కారు పైకము తృణముగ నెంచుమీ రామచంద్రా -ఈదెప్పరమునగాచియప్పుదీర్చుమయ్యరామచంద్రా
కౌసల్యా పుత్రక దశరథ తనయ శ్రీరామచంద్రా - కాపు క్షేమమున భద్రాద్రిలో నెలకొన్న శ్రీరామచంద్రా
భక్తులందరిని పరిపాలించెడి రామచంద్రా - నీవు క్షేమముగ శ్రీరామదాసుని నేలుము రామచంద్రా[1]

రామా ! నన్ను క్షమించు, నిన్ను నిందించాను. ఈ జవానులు కొట్టే దెబ్బలు తట్టుకోలేక నిన్ను తిట్టాను. అంతే గాని నీపై భక్తి లేక కాదు. రామా! నన్ను ఈ కష్టాలనుండి రక్షించు. నీవు ఆరు లక్షల పైకం త్వరగా సర్కారు వారికి అందజేయి. నన్ను ఈ చెరనుండి విముక్తుని చేయి అని వేడుకున్నాడు. ఇదేవిధంగా మరో కీర్తనలో కూడా తాను శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్ను లకు, హనుమంతునికి, సీతమ్మకు చేయించిన ఆభరణాలు వస్త్రవాహనాదులు, ఆలయ గోపుర ప్రాకార మంటపాదులు ఒక్కొక్క దానికి ఎంతెంత ఖర్చయిందో సెలవిస్తూ ఒక సుదీర్ఘ కీర్తన రచించినారు.

**కాంభోజి - ఆది.**

ఇక్ష్వాకు కుల చంద్ర ఇట్టులుండుట మేర రామచంద్రా - నన్ను
రక్షింప జాడవు రాజీవదళ నేత్ర రామచంద్రా ॥

---

1. భక్త రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పుట 21. కీర్తన 98.

నీ తమ్ములకు గూడ నగలను జేయిస్తి రామచంద్రా - యిందే
తప్ప నకు గాను ఈ శిక్ష వేయుట రామచంద్రా ॥
దశరథుడదయుడై తరిమె రాజ్యము వెడల రామచంద్రా - నీ
దెన జూడక మిథిలేశు డూరకుండె రామచంద్రా ॥
ఇంత సొమ్ము తిని యిటులూర కున్నావు రామచంద్రా - హో
యెంత వింతాయెను యెవరబ్బ సొమ్మురా రామచంద్రా ॥
సర్వలోక శరణ్య సర్వ పూజిత శ్రీరామచంద్రా- నా
దుర్వార దుఃఖము తుద ముట్టదాయెను రామచంద్రా ॥
కుటిలాత్ముడై నీవు కులుకుచు తిరిగేవు రామచంద్రా - నన్ను
కొట్టించితిరి గాన కోరి ప్రార్థించెద రామచంద్రా ॥
తురక పైకము దెచ్చి త్వరలో చెల్లింపవె రామచంద్రా - ఓ
పరమాత్మ యీ అప్ప భారమేమో నీకు రామచంద్రా॥
స్వామి భద్రశైల రామ సద్గుణ ధామ రామచంద్రా - శ్రీ
రామదాసుని బ్రోవ రావయ్య వేగమే రామచంద్రా ॥ [1]

రామా ! నిన్ను నీ తండ్రి నిర్దయుడై అరణ్యాలకు పంపాడు. నీ మామ మిథిలానగర రాజు కూడా నీ వైపు కన్నెత్తైనా చూడలేదు. నీవు 6 లక్షల సొమ్ము తిని ఏమీ జరగనట్టు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నావు. ఉలకవు పలకవు. ఆసొమ్ము మీ అబ్బదా యేమి ? అని నిందించాడు. మరల అంతలోనే రామా ! నీవున్నావన్న ధైర్యంతో నేను ఇన్ని బాధలు భరిస్తున్నాను. నన్ను ఈ దుఃఖం నుండి విముక్తుని చేయవలసింది. నీవు నన్ను కాపాడజాలవు. నీవు కుటిలాత్ముడవు. నన్ను , ఈ పాపాత్ముని గూర్చి ఎందుకు పట్టించుకోవు ? అని నిలదీసి అడుగుతున్నాడు. తిట్టితినని నీవు నాలో తప్పలెన్న జూడకు. మీరు నన్ను కొట్టించారు. కాబట్టే మిమ్మల్నే ప్రార్థిస్తున్నాను.

తురక పైకము అనడంలో నీచులైనవారికి ఋణపడినానని బాధపడినాడు రామదాసు. కుతుబ్షాహీ రాజుల పైకం ఆరు లక్షలు నేను తీర్చలేను నీవే త్వరలో తీర్చు. ఖైదు నుండి విముక్తుని చేయవలసింది. ఈ అప్ప తీర్చడం నీకు కష్టం కాదు గదా ! అందరినీ, అన్ని బాధలనుండి కాపాడేవాడివి. అందరి బరువు బాధ్యతలు తీర్చేవాడివి నీవు. నీవు నా అప్పభారం తొలగించలేవా, నీకు ఇది అసాధ్యం కాదుగదా ! అని శ్రీరాముని ప్రార్థించాడు. దీనంగా వేడుకున్నాడు.

రామదాసు తాను ఈ ధనం తీర్చనందుకే దెబ్బలు తింటున్నట్లుగా రామునికి చెప్పకున్నాడు. ఈ దెబ్బల బాధను తాను తాళలేనని , అందుకే తనకు దెబ్బల బాధనుండి ఉపశమనం కల్గించమని కోరుతున్నాడు.

ఆనందభైరవి - ఏక

నమ్మిన వారిని మోసము చేయుట న్యాయము గాదుర నా తండ్రి
నమ్మితమౌనా చూచేవారికి చక్కన గాదుర రఘునాథా ॥
విన్నారంటే పరులందరు నిను విడనాడుదురే రఘునాథా -
అన్నా నీకిది చిహ్నము గాదుర ఆదుకోవలెనురా రఘునాథా ॥
నిన్నా నేడా నిన్ను కొలిచేది నీకేల తెలియదు రఘునాథా
ఎన్నాళ్లీ కష్టము పడుదునిక తాళనురా రఘునాథా ॥

1. భక్త రామదాసు కీర్తనలు - సం॥ దాశరథుల బాలయ్య - పుట 24 - 25. కీర్తన 21.

*డబ్బులకై నేను దెబ్బలు పడినది దబ్బర గాదుర రఘునాథా*

*నిబ్బరముగ రామదాసు నేలుము మా యబ్బ తాళనురా రఘునాథా ॥* [1]

రామా ! నీవు నాదైవమని నమ్మి, చిన్ననాటి నుండి నీసేవే చేస్తూ, నిన్నే స్మరిస్తూ కాలం గడిపే నీ ఈ భక్తుని మోసగించడం న్యాయంకాదురా నాతండ్రి. 'ఆర్త త్రాణ పరాయణుడని' బిరుదు వహించిన నిన్ను లోకులందురూ పూజిస్తున్నారు. నన్ను మోసగించినావని తెలిస్తే ఈ లోకులందరూ నిన్ను నిందిస్తారు. నన్ను విడనాడటం నీకు మేలా ? ఎన్నాళ్ళీ కష్టాలు నాకు. ఈ కష్టాల నుండి కడతేర్చ లేవా ? ఈ బాధలు నేను తాళలేనురా రామా! డబ్బుకై అశాశ్వతమైన ధనం కొరకై నీచుల చేత దెబ్బలు తిన్నాను. అయినా కూడా నీకు కనికరం లేదా ? నీవు నన్ను అపేక్షించడం న్యాయం కాదు. నీకిది తగునా ? అని ఆ భద్రాద్రి రామునికి తన మొరవినిపించాడు. ఆర్తితో కన్నీరు కార్చాడు. ఏనాటికైనా రాముడే తనను కాపాడగలడనే నిబ్బరంగా ఉన్నాడు.

రామదాసు తాను నిరంతరం అనుభవిస్తున్న అనేకమైన బాధలను, చెరసాలలో తాను పడే కష్టాలను అన్నింటిని ఏకరువు పెట్టాడీ కీర్తనలో.

**కాంభోజి - ఆది**

*మిథిలేశ తనయ నా మితిలేని వెతల నీ - యధిపునకెరిగింపవే ఓ జననీ॥*

*వ్యధ చెందుతున్నాను బుధ వినుత నాకథను వినగ రమ్మని చెప్పవే ఓ జననీ ॥*

రాముడు తనను కాపాడుతాడో లేదో కనీసం నీవైనా నన్ను కాపాడు తల్లీ. నాబాధలన్నింటి గూర్చి రామునితో చెప్పి చూడు తల్లీ ! అని తాను చెరసాలలో పడే భరింపరాని బాధలను ఆ సీతాదేవికి చెప్పకుంటున్నాడు.

*గదముద్గరాదుల గాసి బంధించిరి కరుణ లేక భటులు ఓ జననీ*

*సదయాత్ముడీ రీతి దయలేని వాడాయె సంతోషమేమొ నీకు జననీ ॥*

*కారాగృహంబున కనుగానరాకను కఠిన శిక్షలు బొందితి ఓ జననీ*

*భారకుడితడని పలుపలు విధముల ప్రణుతించి వేసారితి ఓ జననీ ॥*

*మండు వేసగిని ఎండలో నిలిపి తిరిగండు మీరు భటులు ఓ జననీ*

*కొండంత బరువాయె మొండి జీవము పోదు దండ యెవ్వరులేరే ఓ జననీ ॥*

*ఉప్పు బియ్యము రెండునుడుక బెట్టుక తిని యున్నాడను ఈ విధమున ఓ జననీ*

*అప్ప నీవు దప్ప యెవ్వరూ లేరు దెప్పరమ్ములు దీర్చ ఓ జననీ ॥* [2]

చీకటి కొట్టు లాగా ఉండే కారాగృహంలో కళ్ళు కనిపించని ఆ అంధకారం వంటి బందిఖానాలో ఉండి కఠిన శిక్షలు అనుభవించాడు రామదాసు. మండుటెండలో గంటల కొద్దీ నిలబెట్టేవారు. ఎండ దెబ్బ తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయే వాడు. పైగా ఎండలో నిలబెట్టినా కూడా రామా ! రామా ! అంటూ రామనామస్మరణం చేసేవాడు. ఆ ఎండ దెబ్బనుండి ఉపశమనం పొందేవాడు. ప్రతిరోజూ ఖైదులో 12 సంవత్సరాలుగా తానే స్వయంగా పావు సేరు ఉప్పు, పావుశేరు బియ్యం కలిపి వండుకుని ఆహారంగా తినవలసివచ్చేది. ఇలా ఎన్నో విధాల బాధలు పెట్టేవారు. ఆ ఉప్పు, బియ్యం కలిపిన ఆహారం తినలేక రాముని ఇలా ప్రార్థించేవాడు.

1. భక్త రామదాసు కీర్తనలు - సం॥ దాశరథుల బాలయ్య పుట 78. కీర్తన 89.
2. " " పుట 99. కీర్తన 118.

వేగవ - చాపు

ఏలాగు తాళుదు నేమి సేతురా రామ - ఈ జాలి చేతను తాళజాలనురా రామా ॥
దీనజనులకెల్ల దిక్కు నీవే రామా - మనమున నిన్ను నే మరువనో రామా ॥
యమ బాధలొందగ నేరనో రామా - యమదండనలు లేక యెడబాపు రామా ॥
వాసిగ రామ కీర్తనలు జేసితి రామా - దాసుడనునామీద దయయుంచు మీ రామా ॥[1]

ఈ యమ బాధలు భరించలేను. దిక్కులేని నాకు నీవే దిక్కు. నన్ను రక్షించు. నాపై దయ ఉంచు. ఈ ఆహారం నేను తినలేను అని వేడుకొని తినబోగా అది రాముని ప్రభావం వలన దివ్యాన్నమౌతుండేది. అటువంటి ఆహారాన్ని భుజిస్తూ రామా ! నీ నామ స్మరణంతో ఈ చెఱలో ఏకాంతంగా గడపగలను అని సంతోషంగానే ఉన్నాడు. 'ఇంటికంటె గుడి పదిలమన్నట్లు ' గోపన్న సంతోషంగానే కాలం గడుపుతున్నాడు. మరొకసారి భటులు రాజాజ్ఞ మేరకు రామదాసును ముళ్లపై నడిపించేవారు. రామదాసు రామునకు మొర పెట్టుకున్నాడు. ఈ దాసునకు రాముడున్నాడు కదా ! అంతట

కళ్యాణి - రూపక

రామా దయజూడవే - భద్రాచల ధామానను బ్రోవవే - రామా దయజూచి రక్షించి మమునేలు
రామా రణరంగ భీమా జగదభి ॥ . . . .
దిక్కునీవని నమ్మితి - నీ పాదముల మక్కువ గని మ్రొక్కితి చిక్కుల బెట్టకు చిన్ని భద్రాద్రిని
గ్రక్కున వెలసిన చక్కని సీతా ॥[2]

అని ప్రార్థించగా, స్తుతించగా ఆ బాధ కూడా మటుమాయమైంది. భక్తుల మాటలే మహామంత్రాలు. రామదాసును ఎన్ని బాధలు పెట్టినా ఏమీ బాధ పడడంలేదు. ఇతడిని ఎన్నివిధాలా శిక్షించినా రామనామస్మరణంతో కాలం గడుపుతున్నాడు. ఈతడికి పసరు కట్టి యేమైనా తెలుసా ! మహిమలేమైనా ఉన్నాయా అని అనుకొని, జైలు లోకి వచ్చేటప్పుడు దేహానికి పసరు పూసుకొని వచ్చినాడు కాబోలని, ఆ మూఢులైన భటులు ఆయన శరీరాన్ని శోధించి తోమి, స్నానం చేయించి కత్తులపై నడిపించారు. అయినా ఏమీ ? తారక మంత్ర బలం వలన ఆ కత్తులు భూమిలోకి క్రుంగిపోయి, కొంచెంగూడా ఆయన శరీరానికి, పాదాలకు గాయం లేదు. అది చూసి రాజసేవకులు అదేమి చిత్రం వీనికి గారడి యేమైనా తెలుసా ! యేమి ? అట్టిన ఈ దెబ్బతో అన్నీ తీరునని భావించి ఆ దురాత్ములు పాపం ఆ రామదాసును పెద్ద ఉక్కుగుండు వీపు విఱిగేలా పైనబెట్టి ఊరంతా కొరడాలతో కొడుతూ త్రిప్పినారు. గోవర్ధనోద్ధారుడుండగా, గోపన్న కేమి కొదువ ? అప్పుడు రామదాసు ఈ విధంగా ప్రార్థించాడు.

ఆనందభైరవి - త్రిపుట

భారములన్నిటికి నీవే కలవని నిర్భయుడనై యున్నానురారామ
దారి తప్పక నీవు దరి చేర్చెదవని ధైర్యము తోచినదిరా రామా ॥
అతి దుష్కృతములనే నెన్నో చేసితిని అయిన మరేమాయెరా రామా
పతిత పావనుడను బిరుదు వహించిన నీ ప్రఖ్యాతి విన్నానురా శ్రీరామా ॥ . . .
శరణన్న వారి రక్షణ చేయు బిరుదు నిశ్చయమై నీకున్నది రా రామా
మురిపెముగా నన్నిటికి నే పట్టినది మునగ కొమ్మ గాదురా శ్రీరామా ॥ -
వాసిగ భద్రాచలేశుడవని చాల వర్ణించు చున్నానురా రామ
భాసురముగ రామదాసు నేలినట్టి భావము గన్నానురా శ్రీరామ ॥[3]

1. భక్త రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పుట 44. కీర్తన 47.
2. " " పుట 120. కీర్తన 145.
3. " " పుట 95-96, కీర్తన 113.

అన్ని భారాలు మోసే నీవుండగా నాకేల భయం. ధైర్యంగా ఉంటాను. అని రాముని మన స్ఫూర్తి ప్రార్థించగానే ఆ ఇనుపగుండును బెండు మోసినట్లుగా మోశాడు. పరుగెత్తుతూ ఉన్నాడు. ఆ చో చూసిన సేవకులు అబ్బా ! ఈ బక్కబాపనికి ఎంత బలమున్నదిరా ?మనము వీని ముందు పనికి రావ భావించి ఆతనిని మరల జైలులో ఉంచారు.

మండువేసవిలో కాలిపోతున్న ఇసుకలో గోపన్నను నిలబెట్టారు. "అంత లక్ష భక్ష్యముల భక్షిం లక్ష్యయ్యకొక భక్ష్యమా ? రామా ! శీతోష్ణాది ద్వందముల తుల్యముగా చూడవలెనని నేర్పుటకే నాకీ శిక్ష ఏర్పరచితివి." అని రామధ్యానం చేస్తూ పూ పాన్పుపై ఉన్నట్లున్నాడు. ఇతడు అపర ప్రహ్లాదుడా యేవ అందరూ భావించారు. రామదాసుకు తారకమంత్రం లభించింది. దాని ప్రభావాన్ని ప్రత్యక్షంగా అనుభవించా అందుకే

**గౌళిపంతువరాళి - రూపక**

"శ్రీరామ నీనామమేమి రుచిరా - ఓ రామ నీనామ మెంత రుచిరా ॥"[1]

అని రామనామస్మరణం చేస్తూ కాలం గడపసాగాడు. ఈ రామనామ స్మరణం చేస్తుండ వలననే అన్ని యిక్కట్లులను తాళగలిగినాడు. ఈ విధంగా పరవశుడై రామదాసు ఉండగా, కావరు వేకువ జామున లేచి చూచి అతడు మరణించాడేమోనని భ్రమపడి అతడిని బిగ్గరగా పిలవగా ఆ రామదా మేల్కొన్నాడు. అది ఆ మూఢులు గాఢ 'సుషుప్తి' అని అనుకొన్నారు. పిమ్మట ఆ మహాభక్తుడు ప్రతిది ఉదయమే మేల్కొని కాలకృత్యాలు తీర్చుకోవడానికై ఆ కారాగృహసమీపంలోనే ఉన్న ఒక బావి వద్దకు వె స్నానాదికాలు ముగించుకొనేవాడు.

## 5.1.0. రామదానును తేలు కుట్టుట :

ప్రతిదినం వలెనే ఒకనాడు ఉదయాన్నే మేల్కొని ప్రాతఃకాలంలో బావి దగ్గరకు వెళ్ళి స్నానాదికా ముగించుకొని రావాలని, వెళ్ళగా అక్కడ ఒకతేలు అతన్ని కుట్టింది. అంత రామదాసు 'తేలు కుట్టిన' బా తట్టుకోలేక రాముని ఈ విధంగా ప్రార్థించాడు.

**ఆనందభైరవి - రూపక**

*మేలైన చిటికెన వ్రేలు - ప్రాతఃకాలమందున గుట్టె తేలు*
*బాలత్వమున నేను బావి నీళ్ళకుపోయి కాలుబెట్టగ చిన్న తేలు పొడిచెనయ్య ॥*
*చలివచ్చె నీ నొప్పి చేత - దీని వేదన పాపిష్టి ఘాత ఈలాగైన నేనేలాగు తాళుదు*
*మూలమైన గురుమూర్తి పాదములాన ॥*
*మిక్కిలి నలువుచున్నది - రామ గ్రక్కున నాదరించేది వెక్కన పెట్టుచు కడతేర నీయదు*
*మ్రొక్కెద నా స్వామి నే నోర్వజాలను ॥*
*దరిజూపు స్వామి కేశవా - యిట్లు నరులు చేసిన రీతి జేసెదవా*
*పుడమిలోపల భద్రగిరి రామదాసుని బడలనీక కాపాడు తండ్రివినీవె ॥*[2]

రామా ! ఈ తేలు కుట్టిన బాధను నేను భరింపజాలకున్నాను. నన్ను ఈ బాధనుండి ఉపశమింపజేం అని ప్రార్థించగా ఆ తేలు కుట్టటం వల్ల కలిగిన బాధనుండి ఉపశమనం పొందాడు. అది చూసి భటులాశ్చ చకితులై "ఏమయ్యా ! నీ యొద్ద మందులు మ్రాకులు ఏమైనా ఉన్నాయా ? మంత్రాలేమైనా తెలుసా ? ఎ

1. భక్త రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పుట 154. కీర్తన184.
2. " " పుట 98. కీర్తన 116.

బాధలకు ఓర్చుకుంటావని ? " గోపన్నను అడుగగా, అందుకు రామదాసు అన్ని రోగాలకు నివారణోపాయం, మందు రామనామమే. నేను మందు మ్రాకులు వేరే తెలియనివాడను అని ఈ విధంగా కీర్తించాడు.

నాద నామక్రియ - చాపు

రాముని వారమైనాము - ఇతరార్యుల గణన సేయము
ఆ మహామహుడు సహాయుడై విభవముగా మమ్ము జేపట్టి గారవించును సదా ॥
యమకింకరుల జంకించెదము - పూని యమునైన ధిక్కరించెదము . . . .
గ్రహగతులకు వెరవబోము - మాకు గలదు దైవానుగ్రహము
ఇహపరములకు మాతిక నెవ్వరడ్డము మహి రామ మంత్రము పూని యున్నాము ॥
త్రిభువన దేవ దేవుండు రామ తీర్థాల దైవ రాయండు - శుభదాయిదై చాల విభవముగా బ్రోచి
ప్రభుడై రక్షించును రామదాసుల నెల్ల ॥[1]

"శ్రీరామానుగ్రహం, ఆయన దయ ఉన్నవారికి ఎలాంటి బాధలైనా మాయమవుతాయి. ఆయన నామమే నాకు మందు. అన్ని బాధలను నివారిస్తుంది. " అని ఆనందంగా రామ ధ్యాన తత్పరుడై ఉన్నాడు. రామనామ మహిమను కారాగృహం వద్ద కావలి ఉండే భటులకు తెలియజేశాడు. నిర్భయంగా ఏ ఆపద వచ్చినా తట్టుకోవడానికి సిద్ధంగా ఉన్న ఆయన ధైర్యం చూసి ఆశ్చర్యపోయారు. ఆ జైలు కాపలావారు కూడా రామనామం గొప్పతనాన్ని తెలుసుకొని, మహమ్మదీయులైనా వారు రామదాసుతో కూడి రామనామ స్మరణం చేయసాగారు. అంతట కారాగృహం అంతా రామమయం అయింది. రామనామ శబ్దంతో నిండిపోయింది. అప్పటినుండి రామదాసును "రాజాజ్ఞను తిరస్కరించి, రామదాసును భటులు తిడితే పిల్లా మేకా చచ్చిపోతామని భయపడి, ఆయనను శిక్షించేందుకు వెనుకాడారు. ఈయనెవరో సామాన్యుడు కాడని వారు భావించి, ఆయనను గౌరవించ సాగారు.

## 5.2 ఆత్మనివేదనాసక్తి - కీర్తనలు

రామదాసు ఈ విధంగా ఏళ్ళు గడుపుతున్నాడు. రామదాసు కారాగారంలో ఉంటూ, నేను ఏ జన్మలో ఏ పాపం చేశానో నేనీనాడు పూర్వజన్మ కర్మ ఫలాన్ని అనుభవిస్తున్నాను. రామ దర్శనం ఎంతకూ లభించదాయె అని దుఃఖిస్తూ రామదాసు ఆ రాముని గూర్చి ఈ విధంగా తలపోస్తున్నాడు. తన పాప కర్మఫలానికి బాధ పడుతున్నాడు.

హుసేని - చాపు

కర్మమెంత బలమో - గడుపుటకు కాలమెంత స్థూలమో ॥
మర్మమెరుగ మాయ మహిమ ఎట్టిదో కాని ధర్మ తత్త్వమిట్లని తలపోయదు ॥
గురుడు కానడాయె నా బ్రతుకునకు పరుల
వేడనాయె ఎరుకమాలి తత్తరమున చిత్తము పరుగులిడుచు నాతురగతి రవ్వాయె ॥
వాసన ఫలమెట్టిదో నా గతభవోపాసన మెంతటిదో
వాసరంబు సంవత్సర సమమాయె వాసుదేవ భవవార్థి గడుపుటకు ॥[2]
హాస విజిత కందా భద్రాచల రామదాస హర్ష బృందా
వాసవాది సుర వంద్య పదారవింద వాసుదేవ భవ వార్థి గడుపుటకు ॥

"కర్మమెంతబలమో!" అని కర్మఫలాన్ని అనుభవింపక తప్పదు. ఏ జీవుడైనా అని నా కర్మఫలమెంతకాలం ఉందో అంతకాలం ఈ కారాగారంలో ఉండి బాధలనుభవించవలసిందే. అయినా నీ సంకల్పం ఎలా ఉందో నాకేం తెలుసు. నీ మాయలు ఎవరికి తెలుసు. నీ మాయలు, నేనుతెలుసుకోలేను. నీ చిత్తమెలా ఉంటే అలాగే జరుగుతుందని భావిస్తూ రాముని ఇలా ప్రార్థిస్తున్నాడు.

1. భక్త రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పుట 116. కీర్తన 139.

2. " " పుట 54 కీర్తన 58.

**కాంభోజి - చాపు**

కటకట నీదు సంకల్పమెట్టిదో కాని కననెంత వాడరా రామా !
నిటలాక్షుడు తొల్లి నీ మాయ గనలేక తటుకున నీవల దగిలెను గనుక॥
శరణన్న జనముల బిరబిర బ్రోచెడు బిరుదు గల్గిన దొరవే ఓ రామ !
పరి పరి విధముల మొదలిడ వినక నశ్వర మర చేసిన హరి నిన్నే మందు ॥
భావజ జనక నా భావ మెరుంగవె వేవేగ దయ జూడ వే
దేవాది దేవా ! యో దీన శరణ్య ! నీవే దిక్కని నిక్కము నమ్మితి ॥
గీర్వాణ నుత ! భద్రగిరి వాస ! సర్వయోగీశ్వరేశ్వర ! రామా !
సర్వాత్మా! రామదాస హృదయాబ్జ నిలయా ! సర్వాధారా ! పరాకేల రామా ![1]

రామా ! శరణన్న వారికి అభయమిచ్చే వాడివే. నీవు నన్ను ఈ విధంగా పరీక్షించ తగునా ! ఎన్ని విధాల మొర పెట్టుకున్నా కూడా చలించవేమయ్యా ! ఆపద్బాంధవా ! ఓ దీన శరణ్యా ! అనాథ రక్షకా ! భద్రగిరి వాసా ! కాపాడవేగమే రావా ! దేవాధిదేవా ! అని దిక్కులు పిక్కటిల్లేలా రాముని వేడుకుంటున్నాడు. రాముని పిలుస్తున్నాడు. ఈ విధంగా రాముని రామదాసు కారాగారంలో శరణాగతి చేస్తూ

**యమునా కళ్యాణి - ఆది**

గరుడ గమన రారా నను నీ కరుణనేలుకోరా
పరమపురుష యే వెరవు లేక నీ మరుగు జొచ్చితిని అరమర సేయకు ॥
పిలువగానే రమ్ము అభయము - తలవగానే యిమ్ము
కలిమి బలిమి నాకిలలో నీవని - పలవరించితిని నలువను గన్నయ ॥
పాలకడలి శయనా దశరథ బాల జలజ నయనా
పాలముంచు నను నీళ్ల ముంచు నీ పాలబడితినిక జాలము సేయక ॥
ఏల రావు స్వామీ నను నిపుడేలు కోవదేమీ
యేలువాడవని చాలనమ్మితిని యేల రావు కరుణాలవాల హరి ॥
ఇంతవంతమేలా భద్రగిరీశ - వరకృపాలా
చింతలణచి శ్రీరామదాసుని అంతరంగ పతివై రక్షింపుమి ॥[2]

రామా ! నిన్నే నమ్ముకున్నాను. ఓ గరుడగమనా ! వేగమే రా ! నన్ను నీవే కాపాడు. పాల ముంచినా నీట ముంచినా నీదే భారం దేవా ! నీకు ఎందుకింతపంతం ! నన్ను కాపాడటానికి ఎందుకు రావు! నీవు ఆలస్యం చేయకుండా శరవేగం తో గరుడవాహనమెక్కి నన్ను కాపాడ రావా ! నన్నాదుకోవా ! అని దీనంగా ప్రార్థించాడు. అంతే గాకుండా,

**నాదనామక్రియ - ఆది**

ఏమిరా రామ నావల్ల నేరమేమి రామా॥
ఏమి రా రామ ఈ కష్టము నీ మహిమమో నా ప్రారబ్దమో ॥

అనే ఈ కీర్తనలో తనవంటూ ఏమైనా నేరాలుంటే బయట పెట్టమనిసవాల్ చేస్తాడు. ఈవిధంగా రాముని అడుగుతాడు.

1. భక్తరామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పుట 52. కీర్తన 55.
2. 〃 〃 పుట 58 కీర్తన 63.

కుండలి శయనా వేదండ రక్షకా అఖండ తేజ నా యండనుండవే ॥
పంకజ లోచన శంకర నుత నా సంకటమును మాన్పవె పొంకము తోను ॥
దినమొక ఏడుగ ఘనముగ గడిపితి తనయుని మీదను దయ లేదయయో ॥
సదయ హృదయ నీ మృదుపదములు నా హృదయ కమలమున వదలక నిలిపితి ॥
రామరామ భద్రాచల సీతా రామదాసుని ప్రేమతో నేలవే ॥[1]

రామా ! నేను ఏనాడు చేసిన పాపమో ! నా ఖర్మయేమో ! లేక నీ మహిమయో ! కాని నాకు దినమొక ఏడు లాగా ఉంది. ప్రతిక్షణం నీ పాదాలు నా మనసులో నిల్పి ధ్యానిస్తున్నాను. రామా ! నన్ను ప్రేమతో ఏలుమా ! నేను నీ బిడ్డను. బిడ్డ కష్టాలలో ఉంటే తండ్రి ఏమరకుండునా ? అని రాముని కోరాడు. అంతేగాక 'రామా! నన్ను రక్షించడానికి ఎందుకు రావు? అప్పలవాళ్ళు నన్ను నిలదీస్తున్నారు. ఎన్నో బాధలు పెడుతున్నారు. రామా! నన్ను రక్షించేందుకు శీఘ్రంగా రావా ? అని ఇలా రాముని ప్రార్థిస్తున్నాడు.

**శంకరాభరణం - రూపకం**

రక్షింప విధియేమో రాచ కార్యము
పుట్టె రామచంద్రా నను రక్షింపకున్నను
రక్షకులెవరింక రామచంద్రా।
అప్పుల వారిదే అరికట్టు చున్నారు రామచంద్రా స్వామి
చెప్ప శక్యము కాదు చక్షుర్గోచరమాయె రామచంద్రా!
అధికుని చేపడితి అడ్డమేమనుకొంటి రామచంద్రా
స్వామీ-అధముల కన్నను అన్యాయమైపోతి రామచంద్రా।
భయమేమి నే రామదాసుడననుకొంటి రామచంద్రా
స్వామీ- భయము బాపి ప్రోవు భద్రాద్రి పుర నిలయ రామచంద్రా।[2]

ఈ కీర్తనలో తనకు రాముడు తప్ప మరొక రక్షకుడు లేడని విన్నవిస్తాడు. శ్రీరాముడే అధికుడనుకొని 'అధికుని చేపడితి' అని భయము బాపి బ్రోవుమంటాడు. ఒకవేళ తాను చేసినవేమైనా తప్పలైతే నా తప్పల్ని క్షమించుమీ జగన్నాథా నీవాడ రక్షింపచుమీ" అని వేడుకుంటాడు. రోజులు గడుస్తుంటాయి. 'భటులు' కొందరు హిందూ ద్వేషులు రామదాసును శిక్షింపజూస్తారు. అపుడు రామదాసు రాముని ఇలా వేడుకుంటాడు.

**"కాంభోజి - త్రిపుట"**

రక్షించు రక్షించు రక్షించు రామచంద్రా - నన్ను శిక్షింప వచ్చిరి శీఘ్రముగ కృప జూడు రామచంద్రా।
రాచకార్యమేమొ రచ్చకు వచ్చెను రామచంద్రా - నన్ను రాజ రాజావన రావు చేసెదవేల రామచంద్రా।
కలకాలము నిన్ను కాంక్షించి వేడితి రామచంద్రా - యే ఫలముగానసైతి పాలించి బ్రోవవే రామచంద్రా।
కరుణమాలి భటులు కఠినోక్తులాడగ రామచంద్రా - నీ కరుణా కటాక్షము కానరాదాయెను రామచంద్రా।
ప్రేమ భద్రశైల ధాముడవై నీవు రామచంద్రా - శ్రీ రామదాసుని వేగ రక్షింప రావయ్య రామచంద్రా।[3]

రామదాసును, కారాగారం వద్ద కాపలా ఉన్న భటులు, హిందూ ద్వేషులైనవారు కఠినంగా దూషిస్తున్నారు, నిందిస్తున్నారు. ఒక నీచునిగా, ద్రోహిగా చిత్రిస్తున్నారు. అప్పుడు బాధపడి, రామా ! నేనేం పాపం చేశానని ఈ దుర్మార్గుల చేత మాటలు పడవలసి వస్తుంది. నీవు వచ్చి నన్ను కరుణించి,

1. భక్త రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పుట 42. కీర్తన 44.
2. భక్త రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పుట 102. కీర్తన 122.
3. భక్త రామదాసు కీర్తనలు - దాశరథుల బాలయ్య (సంకలనం) పుట 103,104. కీర్తన 124.

వీరికి బుద్ధి చెప్పలేవా ? నాపై ప్రేమ, జాలి చూపవా ? అని రాముని పాపం దీనుడై వేడుకున్నాడు రామదాసు. నన్ను ఒక రాజద్రోహిగా వారు చిత్రీకరిస్తున్నారని, ఈ సమయంలో నా పవిత్రతను నిరూపించ రాలేవా ? రఘురామా! జగదభిరామా! అని మొరలిడినాడు.

సరే ఇంతగా వేడినా నీకు కరుణ లేదా ? నేను నిన్ను ఇంతవరకు బ్రతిమాలినాను. నన్ను కాపాడకుండా నీవు ఎలా ఉంటావో అదీ నేను చూస్తాను. నీవు నన్ను కాపాడకుంటే నిన్ను ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యనివ్వను. అని నిలదీస్తున్నాడు రాముని. ఈవిధంగా ఈ కీర్తనలో రాముని నిలదీసినాడు.

**వరాళి - త్రిపుట**

*అడుగు దాటి కదలనియ్యను - నా కథయ మియ్యక నిన్ను విడువను*
*గడియ గడియకు తిరిగి తిరిగి - యడిగితిని వేసార వచ్చెను*
*గడువు దప్పిన నేను నిక బహు - దుడుకు తనములు సేయుదును నిను ॥*
*కుదురుగా కూర్చుండనియ్యను - నీకు కోపమొచ్చిన భయము చెందను*
*మది నెలింగీ యుండుమిక మొగ - మాటమేమియు లేదు గదనా*
*హృదయ కమలమునందు నీ మృదు - పదములను బంధించి వేతును॥*
*కూరిమిగ నిను విడిచి పెట్టిన - ధరణిలో భద్రాద్రి రాఘవ*
*రామదాసుండనెడి నామము - మారు పేరున పిలువు నన్ను ॥*[1]

"రామా ! నన్ను కరుణించి బ్రోవకున్న ఈ క్షణాన నిన్ను విడువను, అడుగు దాటి కదలనియ్యను. రేపు మాపని జరిపినా నేనాపనని" అంటాడు. సాక్షి బెట్టిన ఒక దీక్షచే సాధింతునని కూడా హెచ్చరిస్తాడు. నీచే నేను అభయయము పొందకున్న, రక్షింపబడకున్న నా పేరు రామదాసే కాదు, అని చిన్నపిల్లల వలె అన్నాడు. అంతేకాదు . . . . . . . 'నిన్ను బోనిచ్చెదనా సీతారామ' అనే కీర్తనలో,

**మధ్యమావతి - చాపు**

*నిన్ను బోనిచ్చెదనా నన్ను రక్షింపక యెన్ని విధముల నా కన్నులాన రామ ॥*
*రట్టు చేసి నిన్నరికట్టుదు నింక దిక్కుగలిగితే మొర పెట్టుకోర రామ ॥*
*తడయక నీ తల్లిదండ్రుల్ వచ్చినగాని విడిచి పెట్టని నీ కొడుకునురా రామ ॥*
*మావాడని మొగమాటము లేకుండా సేవ జేసి రవ్వ చేయుదురా రామ॥*
*నీవు భద్రాచల నిలయుడవై నన్ను గావవయ్య రామదాస విలాస ॥*[2]

అని రాముని బెదిరిస్తాడు. దిక్కుగలిగితే మొరపెట్టుకొని, నీ తల్లిదండ్రులు దశరథుడు, కౌసల్యలు వచ్చి నీ గురించి అడిగినా సరే నిన్ను విడిచి పెట్టేది లేదని, నా హృదయంలో నిన్ను కట్టేసుకుంటానని అంటాడు. రామదాసుకు రామునిపై ఉన్న అపారమైన అంతులేని భక్తి విశ్వాసాలకు ఈ కీర్తనలు నిదర్శనం. ఇంతగా రాముని నిలదీసినా కూడా ఏమీ లాభం లేకపోయింది. ఇంతదాకా నీవు దేవుడవని భావించి నిన్ను ఏమీ అనకూండా ఊరుకున్నాను. నీకు ఎందుకింత పరాకు. నేనంటే నీకెందుకింత అలుసు అని కోపంతో రామునిపై దాడి చేస్తున్నాడు.

**వంతు వరాళి - అట**

*దైవమని మీరలేక యింత తాళితి గాక పరాకా*

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 1-2, కీర్తన 1.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 81, కీర్తన 94.

*దేవదేవుడవని నిన్ను దీనత వేడితి కావలేని బిరుదు కారణమేమయ్య ॥*

*కొలువు నిల్పిన నాటి హోయీ ! నీవు తలపవదేమి బడాయీ*

*నన్ను నిలిపిన జీతమీహోయీ - నీకు అల సీతాదేవి దురాయీ*

*బెళుకుచు తిరిగెదవు - వర్ణిత నిలువుదు అలచెదనీ బంటునౌరా నన్నెరుగవా ॥*

*దొరవైనందుకు బైటచతురా మూలదూరుక తలచూపవేరా సాదులున్నారని బెదురా*

*అబ్బురముగ మూలడబ్బియ్యగ లేకను బొబ్బరింపుచు నోటి పెదవులు తడిపెదవు*

*కలిగియు నీకింత లండా - మరి గట్టుదునా యెదురెండా బల్ చెలువమైన పూలదండా*

*మెడ జుట్టుదే రామకోదండా ధరలోన నొకరిని దరిజేర్చి సొమ్ముకు గురి జూపకున్న నేగుండెత్తెక మాను॥*[1]

నీవు నన్ను తమసీల్దారుగా ఉద్యోగంలో నిల్పింది ఇందుకా. ఇంతకాలం వరకు నేను ఉద్యోగంలో ఉంటే ఎంత జీతం వస్తుందో అది అంతా నాకిచ్చేయి. నాకు ఆనాటి సుఖం తిరిగివ్వు. అయినా నీవు ఎందుకు నా నుండి తప్పించుకుంటున్నావు. అవునులే ! నీవు నాకు డబ్బిచ్చే ధైర్యంలేక తప్పించుకొని మూల కూర్చుంటున్నావు. కలిగి ఉన్న వాడివైనా నీవు నాకు సహాయపడలేని వాడివైనావు. నీకు అంతా తమాషాగా ఉందా "చతురా" నీకు. నీ చేత 6 లక్షల వరహాలు సొమ్ము ఇప్పించుకుని, తానీషాకు కట్టించకపోతే నేను రామదాసునే కాను. నీచేత ఏనాటికైనా ఆ సొమ్ము తానీషాకు తిరిగి ఇప్పిస్తాను అని సవాల్ చేశాడు. అని అంతలోనే ఇలా అంటాడు. ఇంతగా రాముని నిలదీసి అడిగినా, ఆ రాముడు ఎంత పిలిచినా పలుకడు. అప్పుడు, నేను ఇంతగా నిలదీసినా, కఠినంగా ఎదిరించినా ఒక్క మాట కూడా పలుకవేమి. నీకు మాటలు రావా. లేక నీవు మాట్లాడితే నీ బంగారం ఏమైనా తరిగి పోతుందా అని మరల దీనంగా బ్రతిమాలినాడు. ఈ విధంగా రాముని ప్రార్థించాడు.

**ఆనందభైరవి - ఆది**

*పలుకే బంగారమాయెనా కోదండపాణి*

*పలుకే బంగారమాయె పిలిచిన పలుకవేమి - కలలో నీ నామస్మరణ మరువ చక్కని తండ్రి॥*

*ఇరువుగ ఇసుకలోన పొరలిన యుడుత భక్తికి - కరుణించి బ్రోచితివని నెర నమ్మితిని తండ్రి ॥*

*ఎంత వేడిననూ నీకు సుంతైన దయరాదు - పంతము చేయ నేనెంతవాడను తండ్రి ॥*

*శరణాగత త్రాణ బిరుదాంకితుడవు గావా - కరుణించు భద్రాచల వర రామదాస పోష ॥*[2]

రామా ! ఎంత వేడినా నీకు నాపై దయరాదేమి. శరణాగత రక్షకుడవన్న బిరుదు నీకున్నది గదా ! మరి ఈ శరణు కోరిన భక్తుని కావరావా! అని దీనంగా వేడుకున్నాడు. మరియు "పాహిమాం ! శ్రీరామా అని శరణు కోరితే పలుకలేవా ? అని అలనాడు కరి, మకరి బారినుండి కాపాడమని నిన్ను ప్రార్థించగా ఆ కరిని రక్షించితివే. నన్నేల ఈనాడు కాపాడవు. అని ఇలా రాముని ప్రార్థించాడు.

**యదుకుల కాంభోజి - ఆది**

*పాహిమాం శ్రీరామాయంటే పలుకవైతివిరీ స్నేహమిట్టిదని నే చెప్పనోహో హోహోహో ఓహో ॥*

*ఇబ్బందినొంది యా కరి బొబ్బలు బెట్టినంతలోనే గొబ్బున గాచితివట జబ్బు సేయక యెంతో*

*నిబ్బరముతోనే నీకు కబ్బమిచ్చి వేడుకొన్న తబ్బిబ్బు చేసెదవు రామ అబ్బ బ్బబ్బబ్బబ్బా ॥*

*విన్నపము వినక యెంతో కన్నడ చేసెదవు రామ యెన్నటికి నమ్మరాదు రన్న న్నన్నన్నన్నన్నా ॥*

*చయ్యన భద్రాద్రి నిలయస్వామివని నమ్మినేను, వెయ్యారు విధముల రామ వినుతి సేయసాగితిని*

1. రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 74, కీర్తన 81.

2. భక్తరామదాసు కీర్తనలు (సంకళనం - దాశరథుల బాలయ్య) పుట 83, కీర్తన 97.

*యియ్యెడను రామదాసుని కుయ్యాలించి బ్రోవకున్నా నీ*
*యొయ్యారమే మనవచ్చునయ్య య్యయ్యయ్యయ్యయ్యయ్యా॥*[1]

రామా ! నిన్ను నేను ఎంతగా ప్రార్థించినా, నన్ను కాపాడవదేమి. నిన్ను నమ్మరాదు అని అంటున్నాడు. మరియు మరో కీర్తనలో

**"శహనా - త్రిపుట"**

"పార్థసారథి నిన్ను ప్రస్తుతించిన గాని పలుకవు యిదేమీ వ్యర్థుని జేయ సమర్థులుండిరి గాని వృథ్వి లోపల నన్ను బ్రోచు వారెవ్వరు"[2] అని, రామా నీవు నేను ఎంత ప్రార్థించినా పలుకవు. నీ మౌనానికి కారణమేమిటి? అని మౌనమర్థాంగీకారమా? అని ప్రశ్నించాడు. ఇలా ఎంతగా రాముని పిలిచినా పలుకడు. సమాధానం ఈయడు. ఇక రామదాసుకు అసలు రాముడు ఉన్నాడా? లేడా? ఉంటే ఎక్కడున్నాడో? అనే సందేహం వస్తుంది. ఆ సందేహం ఈ కీర్తనలలో స్పష్టమవుతుంది. తాను అంత కష్టపడుతుండగా, రాముడు ఎక్కడున్నాడని, ఎందుకు రాడని ఇలా అంటున్నాడు.

**నాట రంజని - ఆది**

*ఏడనున్నాడో భద్రాద్రి వాసుడేడనున్నాడో నా పాలి రాముడేడనున్నాడో ॥*
*ఏడనున్నాడో జాడ తెలియరాదు నాడు గజేంద్రుని కీడు బాపిన స్వామి॥*
*ద్రౌణి బాణజ్వాల దాకిన బాలునికి ప్రాణమిచ్చిన జగత్త్రాణ రక్షకుడు ॥*
*అక్షయముగ శ్రీభద్రాచలమందున సాక్షాత్కరించిన జగదేక వీరుడు॥*[3]

అని తన రాముని వెదకసాగాడు. మరియు "ఎటు బోతివో రామ ! ఎటు బోతివో" అనే కీర్తనలో రాముని వెతుకుతూ అంధకారం వంటి బందిఖానాలో నున్న నిందల నెడబాపవేల"అని, తానీషా గారు వచ్చి తరి తీర్పు చేసెదరు పైకము పంపించి వేగ బంధిఖానా వదిలించ కెటుబోతివో రామా! అనీ, అప్పల వారు వచ్చి అరికట్టుచున్నారు. ఒప్పకోబడునని చెప్పక దాగినావో" అని విలపిస్తాడు. అసలు ఇంతకీ భద్రాద్రిలో ఆ రాముడు ఉన్నాడా?లేడా? అని, ఉంటే నన్నెందుకు కాపాడడానికి రాడు అని అంటున్నాడు.

**అసావేరి - త్రిపుటి**

*ఉన్నాడో లేడో భద్రాద్రియందు ఉన్నాడో లేడో యాపన్న రక్షకుడు - ఎన్నాళ్ళు వేడిన కన్నుల కగపడడు॥*
*నన్ను గన్న తండ్రీ నా పెన్నిధానము విన్నపము విని తానెన్నడు రాడాయె*
*ఆకొని నేనిపుడు చేకొని వేడితే రాకున్నాడయ్యయ్యో కాకుత్స తిలకుడు ॥*
*వాటముగ భద్రాచల రామదాసుతో మాటలాడుటకు నాటకధరుడు ॥*[5]

అసలే మాయలమారి, నాటకాలు ఆడేవాడు, ఎప్పడు ఏ వేషం వేస్తాడో ఎవరికీ తెలీదు. అని నాటకధరుడైన ఆ శ్రీరాముడు భద్రాద్రిలో అసలు ఉన్నాడో లేడో. ఉంటే నేను ఇంతకాలంగా ఈ కారాగారంలో ఉండి బాధలు పడుతుంటే నన్ను కాపాడేందుకు రాడా! అని తలపోస్తాడు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 85, కీర్తన 100.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 87, కీర్తన 102.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 40-41, కీర్తన 42
4. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 32, కీర్తన 30.
5. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 29, కీర్తన 27.

అయినా నా అమాయకత్వమేమో తెలియదు గాని, ఆ మాయలమారిని, ఆ లీలా మానుష విగ్రహుని, నాటకధరుని ఎవరు పూజిస్తారు. ప్రార్థిస్తారు. నిన్ను నమ్ముకోవడం నాది బుద్ధి తక్కువ, నిన్ను దైవమన్నవాళ్ళు వెర్రివాళ్ళు అని ఆ రాముని దూరినాడు, నిందించాడు. తన కీర్తనలో ఈ విషయం వ్యక్తమవుతుంది. నిందాస్తుతి ఇందున్నది.

**కల్యాణి - త్రిపుట**

ఆదరణ లేని నీ నామ మంత్ర జప
మద్రిజేమని చేసెరా రామా
అదె నీకు నామీద ముదమొప్ప దయయున్న
నది దెలిసి మాట్లాడరా రామా ॥
పరమద్రోహివి నిన్ను పతిత పావనుడని
ప్రహ్లాదుడెటు దలచెను
పరమ పావని సీతనడవి కంపిన పాప
కర్మునకు దయ వచ్చునా?॥
పరబ్రహ్మమని పరమేష్ఠి యే రీతి
ప్రస్తుతి చేసెసురా?
పర సతనక యిలను భంగపరచిన వాని
వరలక్ష్మి యెటుమెచ్చెరా ? రామా ॥
ఎన్నగాను శబరి యెంగిలి భక్షణము చేసి
నట్టి వ్యభిచారివీవు
నిన్ను నమ్మగరాదు నిను దైవమనరాదు
నిజమూ నా మాటలు రామా ॥
ఆదరణ లేని నీ నామ మంత్రంబనుచు
నాడితి నిను దూరితి
ముద్దు మాటలు గాని మూర్ఖ వాదము గాదు
మురహరా ననుగావరా ॥
ముద్దు మోమిటు జూపి ముదమొప్ప
రక్షించు భద్రాద్రి పరిపాలకా
వద్దురా కృపనేలు రామదాసుని మీద
వైరమా! చలమా రామా ॥[1]

రామా ! నీ నామ మంత్ర జపం నన్ను ఆదరించలేదు. పార్వతీదేవి, ఆదరణ లేని నీ నామాన్ని ఎలా జపించినదయ్యా? నీవు పరమ ద్రోహివి. కాని ప్రహ్లాదుడు పతిత పావనుడని పూజించాడు. నీవు పరమ పావనియైన సీతమ్మనే అనుమానించి అడవులకు పంపిన పాపాత్ముడివి. నీకు నాపై దయ కల్గుతుందా? పార్వతీ మాత నీవు ఇటువంటి పాపివైనా పరబ్రహ్మమని ప్రస్తుతించిందే? శూర్పణఖ పరసతి అని కూడా భావింపక అవమానపరచిన వాడవు నీకు నీతి ఉందా. ఎంగిలి తిండి తినేవాడివి. నీవు వ్యభిచారివి. నిన్ను నమ్మరాదు. ఇది నిజం అని ఇలా రాముని దూషించాడు. పైకి ఇందు నింద ఉన్నా అంతరార్థంలో స్తుతి ఉంది.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 11-12, కీర్తన 13

అయితే అంతలోనే తాను చేసిన తప్పు తెలుసుకుని, అయ్యో! రాముని పరమ పవిత్రుని నామం "ఆదరణలేని"దని అన్నానే. అయినా నేను తెలియక అన్న ముద్దు మాటలేగాని మూర్ఖంగా తెలిసి అన్న మాటలు కావని సమాధాన పరచుకున్నాడు. రామా ! నన్ను కాపాడవా! కృప జూడుమా ! అని ప్రార్థించాడు. అంతేకాదు రామా ! నీవు నన్ను రక్షింపకుంటే చూడు. నీ తండ్రి దశరథుడు, తల్లి కౌసల్యా మొదలైన వారిపై ఆన అని ఒట్టు పెడుతున్నాడు.

**పున్నాగ వరాళి - ఆది**

*రక్షించు దీనుని రామ రామ నీ రమణి తోడు నన్ను రక్షింపకున్నను మీ తండ్రి దశరథ రాజు తోడు॥*
*అరుదు మీరగ విభీషణుని బ్రోచితి వల్లనాడు అట్లు కరుణింపకున్న మీతల్లి కౌసల్యాదేవి తోడు॥*
*గిరితొన్న ప్రేమ సుగ్రీవుని బ్రోచితి వల్లనాడు అట్లు సిరులియ్యకున్న మీ కుల గురువులైన వశిష్ఠు తోడు ॥*
*అలి కులవేణి యహల్య శాపము పాపితల్లనాడు అట్లు కలుషములన్నియు బాపకున్న లక్ష్మణుని తోడు ॥*
*పాపాత్ముడైన యక్రూరుని బ్రోచితివల్లనాడు అట్లు నెపములెంచక కృప జూడకున్న మీ వింటి తోడు ॥*
*వదలక నీ మీద నేనానలు పెట్ట వలసెనేడు భద్రాచల రామదాసుని నేలకున్న నీ పాదముల తోడు*[1]॥

రామా ! నన్ను ఈ చెరనుండి విముక్తుని చేయి. అలనాడు విభీషణుని, సుగ్రీవుని, అహల్యను, అక్రూరుని కాపాడితివే, నన్ను కాపాడకుంటే మీ తల్లి కౌసల్య, గురువు వశిష్ఠుడు, తమ్ముడు లక్ష్మణుడు, తండ్రి దశరథుడు మరియు మీరు ధరించే వింటి తోడు . వారిపై ఆన అని అందరిపై ఒట్టు పెట్టిన రామదాసు, అయ్యో ! నా రామునిపైనే ఒట్టు పెట్టానే ఆన పెట్టితినని నీవు కోపగించుకోకు. తెలియక చేసిన అపరాధం ఇది. అని మరల ఈ విధంగా రాముని ప్రాధేయ పడుతున్నాడు.

**సావేరి - ఆది**

*అపరాధినై నేనానలు బెట్టితి నమర వందితా*
*నెపము చేయక నన్ను కృప జూడు మరువకు నిర్మల స్థితా॥*
*గురుని యాన దీరె కరుణించి జూడుము పరమ పావనా*
*నన్ను నరగున బ్రోవు కౌసల్య యాన దీరె సజ్జన ప్రియా ॥*
*ఈ తప్పగాపు నీ తాతయాన దీరె భూతనాయకా*
*రామ! సీతయాన దీరె శీఘ్రము కృప జూడు శేష తల్పకా॥*
*నీపై యాన దీరె నిజముగ నన్నేలు నిగమ సంస్తుతా*
*రామ! నీ పాదములయాన నిరతము బ్రోవవె నిర్మల చరితా॥*
*వాసియౌ భద్రాద్రి వాసుడవై రామదాసు నేలవా*
*నీకు దోసిలొగ్గిన వాడ గాసి బొందితి శ్రీనివాస రాఘవా*[2] ॥

మరియు ఈ విధంగా ఆ రాముని దయతో నన్ను కాపాడమని కోరుకుంటున్నాడు రామదాసు.

**కాంభోజి - త్రిపుట**

ఆనపెట్టితినని ఆయాసపడవద్దు రామచంద్రా - నా పామరత్వము చేత బతిమాలు కొనియెద రామచంద్రా

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 101, కీర్తన 121.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 10, కీర్తన 10.

తామసింపక నన్ను దయతోడ కృప జూడు రామచంద్రా॥
తడయక మీ తల్లిదండ్రి యాన దీరె రామచంద్రా॥
ఆదరింపుము నన్ను అడియేన్ దాసుడ రామంచద్రా॥
వాదేల రామదాసుని బ్రోవుమింక శ్రీ రామచంద్రా॥[1]

ఈ విధంగా నీ దాసుడను నన్ను కాపాడవా రామా ! అని అంటూ నీవు నన్ను తప్పక రక్షించగలవు. ఆ విశ్వాసం నాకుంది అని తన సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తాడు ఈవిధంగా.

**బిలహరి - ఆట**

రక్షించు దొరవని నమ్మితి నన్ను - శిక్షింప తప్పేమి చేసితి
రక్షింప మీ కంటె రాజులెవ్వరున్నారు - దాక్షిణ్యమింతైన తలపున నుంచవు॥
నీ ప్రాపె నెర నమ్మియుంటిని నన్ను - కాపాడు బిరుదు నీదంటిని
చేపట్టి విడనాడ చెల్లదు యికనాకు - దాపు దండము మీరె దైవము సాక్షిగ॥
ఎంతో వేడిన నేల పల్కవునే - నేనెంత ద్రోహినొ దయజూడవు
ఎంతేసి వారల నేలేటి కర్తవు - అంతకంతకు నాపై నరమర చూసేవు॥
భద్రాద్రి వాస నీ బంటును ఇతర - పాపము లేదు నా వెంటను
అద్రిజా నన్నుత అమరాది వందిత భద్రేభ వరద నా పాలిటి దైవమ ॥[2]

రామా ! నేను ద్రోహిని, ఎంత పాపం చేశానో ఈనాడు ఈ ఖైదులో ఉన్నాను. నన్ను దయజూడు. నీవు కాక మరెవ్వరు నన్ను రక్షిస్తారు అనే విశ్వాసం, నమ్మకం రాముని మీద ఉంచాడు. నేను వేరు దైవాలను ఎరుగను. నా గతి నీవే అని అంటున్నాడు ఇలా. . . . .

**శంకరాభరణం - ఆది**

ఇతరములెరుగనయా నా గతి నీవే రామయ్యా
సతతము సీతాపతి నీవేయని మతి నమ్మితి సద్గతి జెందింపుము ॥
కోపము సేయగ వద్దు నా కోరిక లొసంగు ఈ ప్రొద్దు
పామరుడని విడువ వద్దునా పాపము బాపు మీ ప్రొద్దు యీ పట్టున మిము పట్టు విడువనిక ॥
తప్పలెన్న వలదంటినా తల్లిదండ్రి నీ వంటి నా యొప్పలకుప్ప వటంటి మా యప్పవు నీవనుకొంటి
అప్పటప్పటికి తప్పక నీవే తిప్పల బెట్టక తీర్చి దిద్దుకొను ॥
నా మీదను దయరాదా రామా నామనవిని వినరాదా వేమరు నాతో వాదా నను వెరవకుమీ యనరాదా
ప్రేమ మీర మా భద్రాచలపుర ధాముడవై రామదాసుని నేలుమి ॥[3]

ఓ భద్రాద్రి వాసా ! శ్రీరామచంద్రా ! నేను నిన్ను తప్ప మరెవ్వరిని ఆశ్రయించను. నా గతినీవే. నాపై కోపగించుకోకు. నేను ఏమైనా తప్పలు చేస్తే క్షమించు. నా తల్లిదండ్రి నీవే. నామీద నీకెందుకు దయరాదు. నా మనవి ఆలకించవెందుకు ? అని దీనంగా స్వామిని వేడుకొంటున్నాడు. 'ఇన్ని గల్గి మీరూరకున్న నే నెవరివాడనౌదు' అనే కీర్తనలో రాముడు కరుణించి తనను రక్షించాలంటే రాముని వద్ద శ్రీ మహాలక్ష్మి, కామధేనువు, కల్పతరువు, చింతామణి, పరుసవేది మొదలైన సాధన సంపత్తులున్నాయని అవన్నీ వున్న రాముడే తనను రక్షించక పోతే ఇంక తాను ఎవరిని వేడాలని రామదాసు దీనంగా ఇలా ప్రార్థిస్తాడు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 12,13, కీర్తన 14.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 102,103 కీర్తన 123.
3 " " " " పుట 22,23, కీర్తన 19.

**కల్యాణి - ఆది**

ఇన్ని గల్లి మీరూరకున్న నేనెవరి వాడనౌదు-కన్నతండ్రి వలె రక్షించుటకు కరుణ యేలరాదు॥
అక్షయమియ్యగ దలచిన శ్రీ మహాలక్ష్మి దేవి లేదా-రక్షింపగా దలచిన భూమియె రత్న గర్భగాదా॥
పక్షపాత మెదలించిన జాతిలో పరుసవేది లేదా-ఈ క్షణమున దయ గలిగిన ధనమెంతైనా నీకడ లేదా ॥
కరి ప్రహ్లాద విభీషణాదులను గాచితివని వింటి-హరిహర బ్రహ్మాదుల కంటెను నిను అధికుడవని యంటి॥
సిరినాయక నీమరుగు జొచ్చితిని చేపట్టుమటంటి- కరుణతో భద్రాచల రామదాసుని కావవెయని యంటి॥[1]
లక్ష్మీదేవి నీ అండనుండ ఓ సిరినాయకా!నా అప్పు తీర్చి నన్ను రక్షింపలేవా? అని ప్రార్థించాడు.

ఎంతగా ప్రార్థించినా, ఎంతగా పిలిచిన ఎంత శరణు వేడినా, కనీసం దయరాదా, అసలు నేను చేసిన నేరాలేంటి? అని రాముని ఈ విధంగా అడుగుతున్నాడు.

**సావేరి - చాపు**

సీతారామ స్వామీ నే జేసిన నేరము లేమీ
ఖ్యాతిగ నీ పద పంకజయుగమునే ప్రీతిగ దలవక భేదమెంచితినా॥
రంగుగనా పదివేళ్లకు రత్నపుటుంగరములు నిన్నడిగితినా
సంగతి బంగరు సేలువ పాగాలంగీల్ నడకట్లడిగితినా
చెంగటి భూసుర పుంగవులెన్నగ చెవులకు చౌకట్లడిగితినా
ముంగర గొలుసులు ముత్యపు సరములు నంగనలకు నిన్నడిగితినా
ప్రశస్త భద్రాద్రీశుడవని నిను ప్రభుత్వమిమ్మని యడిగితినా
దశరథసుత నీచేత ధరించిన దాన కంకణం బడిగితినా
ఏనుగు భూమిని కుచ్చెల నేలకు నెక్కువగా నిన్నడిగితినా॥[2]

రామదాసు ఈ కీర్తనలో వివిధాభరణాల గురించి ప్రస్తావిస్తూ, ఆ సంపద లేవీ నిన్నడగలేదే, నాకు ఈ చెరనుండి విముక్తి కల్పించమన్నాను అంతేకదా! అని అంటాడు. రామా నీ పాదాలే శరణు నాకు. నీ చరణాలే నేను నమ్మినాను అని నీ పాద సేవకుడను నేను అని, రామ పాదాలను మదిలో ధ్యానిస్తున్నాడు. ఆ రామ పాదాలు ఎంత పవిత్రమైనవో వివరిస్తున్నాడీ కీర్తనలో

**కాపి - ఆది**

చరణములే నమ్మితి నీ దివ్య చరణములే నమ్మితి
వారధి గట్టిన వర భద్రాచల వరదా వరదా వరదా నీ దివ్య
ఆదిశేష నన్నరమర సేయకుమయ్యా అయ్యా అయ్యా నీ దివ్య ॥
వనమున రాతిని వనితగ జేసిన చరణం చరణం చరణం నీ దివ్య
పాదారవిందమే యాధారమని నేను పట్టితి పట్టితి పట్టితి నీ దివ్య ॥
బాగుగ నన్నేలు భద్రాచల రామదాసుడ దాసుడ దాసుడ నీ దివ్య॥[3]

రామా! నేను నీ దాసుడను, సేవకుడను, నీవు ఎలా ఆజ్ఞాపిస్తే అలా నడిచేవాడిని. నీ చరణాలే నాకు దిక్కు. అందుకే నీ పాదాలే పట్టినాను. పూజిస్తున్నాను. రాతిని నాతిగా చేసిన పవిత్ర పాదాలివి. అందుకే నేను ఎంతగా కుయ్యాలించినా, మొరపెట్టుకున్నా నీవు కనికరింపవేమి? అని అంటు రామదాసుడను నేను అని చాటాడు. ఇంత ప్రార్థించినా ఏమీ లాభం లేకపోయింది. అందుకు దుఃఖిస్తూ, నీ వంటి అన్యాయ

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 23,24, కీర్తన 20.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 159-160, కీర్తన 189.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 60, కీర్తన 66.

దైవం మరెక్కడైనా ఉన్నాడా! నేను ఎంతో దీనాతి దీనంగా ప్రార్థించినా ఏమీ పట్టనట్టున్నావేమి? ఎంతసేపు నిన్ను వేడుకొనేది అని అంటు ఇలా రాముని దెప్పతున్నాడు.

**ముఖారి - త్రిపుట**

*అయ్యయ్యో నీవంటి అన్యాయ దైవము నెయ్యెడ గాననయ్యా శ్రీరామయ్య*
*ఇయ్యెడ నేను కుయ్యాడిన పలుకవు అయ్యయ్యో యేమందునయ్యా రామచంద్ర॥*
*ఎంతని వేడుదు ఎంతని పాడుదు ఎంతని దూరుదు ఏమి సేతు రామ*
*నుంతైనగానీ నీ అంతరంగమదేమొ వింతకరుగదు ఎంతో నమ్మినందులకైన॥*
*శరణన్న జనముల బిర బిర బ్రోచేటి బిరుదు గలిగిన యట్టి దొరవని నేరీ*
*మరుగు జొచ్చినందు కరమర చేయుట పరువే కరుణింప బరువే హరిహరి ॥*
*కామిత మందార కలుష విదూర తామసమేల తాళజాలనురా నీ*
*మోము జూపుము స్వామి భద్రాచల రామదాసుని ప్రేమ రయమున నేలుము ॥*[1]

రామా ! అయ్యయ్యో నీవంటి అన్యాయమైన దైవం వేరెవరూ లేరే. నేను ఎంత బాధపడినా, నీ కొరకు బ్రతిమాలినా నీకు మనసు కరుగదేమి. రామచంద్రా! నిన్ను ఎన్నిసార్లు నిలదీసి అడిగేది. ఎన్ని విధాల కఠినంగా మాటలనేది? ఎన్ని విధాల అన్నా కూడా కొంచెం కూడా నీ హృదయం కరుగదు. నీవు బండరాతివి. నీవు కఠినాత్ముడవు. శరణన్న నన్ను నీ అండ జేరిన నన్ను పట్టించుకోకుండుట న్యాయమా ! ఓ భద్రాద్రి రామచంద్ర ప్రభూ ! నీ మోము ఒక్కమారు చూపరా! అని ఎంతో హృదయ విదారకంగా దుఃఖిస్తూ ప్రార్థిస్తున్నాడు. ఆ సర్వాంతర్యామియైన రాముని వేడుకొంటున్నాడు.

తన బాధలకు తానే కారకుడనని, తనను తాను నిందించుకొంటూ వాపోతున్నాడు. ఈ కీర్తనలో ఆత్మనిందకు పాల్పడుతున్నాడు రామదాసు.

**పున్నాగ వరాళి - ఆది**

*ఏమి రామప్రభో నీ దయ నామీదను రాదేమయా పామరుడను జడుడను తామసుడను*
*నేను వర్జితంబగు నర పశువను నీ మహత్త్వమెన్న నెంతవాడను రామ రామయని తలతు నిరంజన ॥*
*ఏల నాపై కోపము మున్నేమి చేసితినో పాపము నీలవర్ణ నీ రూపము నిరతము కన్నుల జూపుము*
*ఈ సమయమునను గావర జగదీశ జనక సుతావర చేసితి సఘముల గావర నేను జేసెదను నీ సేవ*
*ఆశించిన శ్రీరామదాసు నిటు మోసము జేసిన దోసంబెవరిదో*
*వాసవార్చితాంఘ్రి వనజ యుగళభక్త పోష రామచంద్ర భద్రగిరి హరీ ॥*[2]

రామా ! నేను తామసుడను, జడుడను, నర రూపంలో ఉన్న పశువును, నీచుడను. అందుకే కదా! నీ పాదాలాశ్రయించినది. నన్నెందుకు ఈ సమయంలో కరుణించి బ్రోవవు అని వేడుకున్నాడు. ఎంతగా ప్రార్థించినా, దీనుడై దుఃఖించి మొరలిడినా లాభం లేకపోయింది. ఇక రామునిపై విసుగు చెందాడు. తండ్రికన్న బిడ్డపై తల్లికే మక్కువ ఎక్కువ కదా ! తన కష్టాలు మితిమీరిపోతుంటాయి. అందుకే ఓ రామా ! నీకు ఏదీ చేతకాదు. కనీసం తల్లి సీతమ్మకైనా నా బాధ చెప్పవయ్యా ఆమె అయినా నాబాధ, ఈ బిడ్డ ఆవేదన అర్థం చేసుకుంటుంది అని రాముని ఈ విధంగా తృణీకరిస్తూ, నా బాధను తీర్చే శక్తి నీకు లేకుంటే మా తల్లి సీతమ్మతోనైనా చెప్పు! అని అంటున్నాడు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 11. కీర్తన 12.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 42-43, కీర్తన 45.

**ఆనందభైరవి - రూపక**

*రామా నీచేనేమి కాదుగా సీతా భామకైన చెప్పరాదుగా*
*సామాన్యులు నన్ను సకల బాధలు పెట్ట నా మొరాలకించి మోమైనా జూపవు ॥*
*శర చాపముల శక్తి దప్పెనా నీ శౌర్యము జలధిలో ద్రొచ్చెనా*
*కరుణ మాలి పైకము దెమ్మని భక్త వరుల బాధింప నీ ధైర్యమెక్కడ బోయె॥*
*శంఖ చక్రాల్ పట్టినందుకూ దాసజనుల రక్షింపవదెందుకూ*
*పంకజాక్ష భక్త పరిపాలన లేని పొంకములే కాని బింకములేదయ్య ॥*
*తల్లిదండ్రీ వనుకొంటినీ నాయుల్లములో నమ్మియుంటినీ*
*కల్లరి జనములు కారుబారులు సేయ చల్లని కృప నాపై జల్లవైతివిపుడు॥*
*ఇంటి వేలువనుకొంటినీ నీ కంటె దైవము లేడంటినీ*
*ఒంటిగా పైకము నొప్పించుమని యంటే వెంట నంటి నా జంట రావైతివి॥*[1]

రామా ! నీకు నన్ను కాపాడడం చేత కాకపోతే కనీసం నా తల్లి సీతమ్మకైనా చెప్పలేక పోయావా! నీచులైన సామాన్యులు నన్ను నిర్దాక్షిణ్యంగా సకల బాధలు పెడుతూ, శిక్షిస్తూ, పైకం ఇమ్మని అంటుంటే, చోద్యం చూస్తూ ఊరుకుంటావా! నీ ఆయుధాలైన శర చాపాలకు శక్తి తగ్గిందా! నీ పరాక్రమంతో దుష్టులను శిక్షించే ధైర్యం నీకెందుకు లేదు. భక్త పరిపాలన బిరుదేమైనది నీకు. నీకు అన్నీ డాంబికాలే ఎక్కువ. పని చేత గాదు. పైకి గొప్ప వాడిలా కనిపించినా, నీ వల్ల ఏమీ కాదు. నిన్నే నాతల్లి, తండ్రి అనుకుని నేను మోసపోయాను. ఈ క్రూరులైన గోల్కొండ నవాబు భటులు నన్ను నీచంగా మాటలంటూ, అతి క్రూరంగా శిక్షిస్తుంటే నీ కృప నాపై ఎందుకు చూపించవు. త్వరగా వచ్చి నా పైకం తెచ్చివ్వు. నిన్నే నా ఇంటి వేల్పు అనుకున్నందుకు నాకు సహాయపడడానికి ఒంటరినైన నాకు తోడు నీడగా రావా ! రామా ! అని ప్రార్థించాడు. నిందాస్తుతి ఇందున్నది.

### 5.3.1. రామదాసు సీతా దేవికి మొర పెట్టుకొనుట :

ఇలా రామదాసు 12 సంవత్సరాలు రాముని నిరంతరం ప్రార్థించాడు. దుఃఖించాడు. కఠినమైన శిక్షలు కారాగారంలో ఉండి అనుభవించాడు. ఎంతగా రాముని వేడినా ఆయన దయకు పాత్రుడు కాలేకపోయాడు. చివరికి విసిగిపోయి రాముడివల్ల తన బాధలు ఎట్లాగు తీరడం లేదు. కనీసం నా తల్లి సీతమ్మకైనా నాపై కనికరం ఉంటుందేమో. సీతమ్మ ద్వారా రాముడికి తన విషయం తెలియజేద్దామని అనుకుని ఒక వినతి పత్రం రామునికి సీత ద్వారా సమర్పిస్తాడు. తండ్రి కంటె తల్లి మనసు మెత్తనిది కదా ! అని రామదాసు సీతమ్మను వేడుకుంటాడు. రామా ! నీకు నన్ను కాపాడే పరిస్థితి లేకుంటే సీతాదేవికైనా నాపై జాలి కలగదా ! అని,

**మధ్యమావతి - ఆట**

*"రామా నను బ్రోవగ రాదా - ననుగన్న సీతా భామామణి కైనా జాలిలేదా - నామీద నీకు*
*ప్రేమ లేకుండుట మర్యాదా - భద్రాచల ధామా నుంతైన నెనరు తలపున నిలుచుట కాదా ॥"*[2]

ఇదే విధంగా మరో కీర్తనలో ఇలా సీతమ్మను, రాముని ప్రార్థిస్తాడు.

**కళ్యాణి - ఆది**

*"రామా ననుజూచితే దయ రాదా - రామా ననుగన్న సీతాదేవి కైన జాలిగాదా -*

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 119, కీర్తన 143.
2. " " పుట 111, కీర్తన 133.

నిను నమ్మితె యితరమేమి - యున్నది యాది లేదా పతితపావన నామమే -[1]
నీ బిరుదు గాదా - ఇదియె మర్యాదా !!"

రామా ! నీకూ నాతల్లి పరమపావని ఆ సీతమ్మకూ నన్ను జూస్తే జాలి కలగడం లేదా ! ఎంతటి కఠినాత్ముడైనా కన్న బిడ్డలు బాధపడుతుంటే వారి హృదయం ద్రవిస్తుందే. మరి నీకు ఎందుకు నాపై కరుణ కలుగదు. ఈ రెండో కీర్తనలో రాముని సౌందర్యాన్ని రామదాసు అత్యంత రమణీయంగా వర్ణించాడు. ఆ సుందర వదనారవిందుడైన రాముడు తనను ఏల కాపాడరాడని రాముని ప్రార్థించాడు. కనీసం సీతమ్మకైనా నా పై జాలి కలుగదా ! అని వాపోతాడు. రామదాసు సీతమ్మను ఈవిధంగా ప్రార్థిస్తున్నాడు.

**సావేరి - త్రిపుట**

అమ్మ నను బ్రోవవే - రఘురాముని కొమ్మ నను గావవే !
అమ్మ నను బ్రోవవే సమ్మతి తోడ మాయమ్మ యనుచు నిన్ను నెమ్మది గొలిచెద ॥
కన్నతల్లి నీవు కనుగొని నా పాటు విన్నపమొనరించి వేగమే విభునితో ॥
యుల్లము లోన మీరుభయుల నెరనమ్మి యెల్ల వేళల వేడి వేసారితినిపుడు ॥
చలము మాని భద్ర శైల రామదాసు నలసట బెట్టక యాదర జేసి ॥[2]

అమ్మా, సీతమ్మ, తల్లీ ! నీవైనా నను బ్రోవవమ్మా ! నన్ను ఈ బాధలనుండి కాపాడు. నీ బిడ్డను రక్షించుమా ! ప్రతిక్షణం మీ ఇరువురిని మనసులో నిలుపుకుని ప్రార్థించాను. కాని 12 సంవత్సరాలుగా ఈ కష్టాలు కడతేరడం లేదు. నీవైనా నాపై దయజూపు అని రామదాసు ఆ జానకిని వేడుకున్నాడు.

అమ్మా, సీతమ్మ తల్లీ ! నా రాముడు నాపై 'చలము' చేశాడు. కనీసం నీవు చెప్తేనన్నా వింటాడేమో. నా ఈ దుఃఖం, బాధ గురించి నీవైనా రాముడికి చెప్పు తల్లీ ! నాకు దిక్కు మీరే కదా ! నీవు తల్లివి. రాముడు నా తండ్రి. తల్లి, బిడ్డ విషయం తండ్రికి చెప్తే వింటాడనే నమ్మకం నాకుంది. భార్య మాటను ఎంతవారైనా త్రోసి రాజనరు. అని రామదాసు సీతమ్మకు సిఫారసు చేస్తున్నాడు. రామునికి, సీతమ్మ ద్వారా తన సమస్యలు తెలియజేసే ప్రయత్నం చేశాడు. ఈ కీర్తనలలో ఇలా అంటున్నాడు రామదాసు.

"రామచంద్రులు నాపై చలము చేసినారు - సీతమ్మ చెప్పవమ్మా !" అని ప్రారంభిస్తాడు. రాముని యందు గల కఠినత్వాన్ని బుజువు చేస్తాడు.

**అసావేరి - చాపు**

"రామచంద్రులు నాపై చలము చేసినారు సీతమ్మ చెప్పవమ్మా !
కటకటా ! వినడేమి సేతును - కఠిన చిత్తుని మనసు కరుగదు
కర్మములు నెటులుండునో కద - ధర్మమే నీ కుండునమ్మా !
దినదినము మీ చుట్టు దీనతతో దిరుగ దిక్కెవ్వరింక మా కోయమ్మా
దీన పోషకుడనుచు వేడితి దిక్కులన్నియు ప్రకటమాయెను
ఒక్క మాటైనను వినడు ఎక్కువేమని తలతునమ్మా ॥
కౌసల్యా తనయుడు కపటము చేశాడు కారణమిటులుండెను
కన్నడ చేసెదవా నీ కన్నులకు వైభవంబ విన్నవింపగదమ్మ నీ కన్న దిక్కెవ్వరోయమ్మా ॥
దశరథాత్మజుడెంతో - దయశాలి యనుకొంటి ధర్మహీను డటేయమ్మా ॥
దాసజనులకు దాలి యితడట - వాసిగ భద్రగిరీశు - రామదాసుని నేలినాడట -
రవికులాంబుధి సోముడితడట - ॥"[3]

1. భక్త రామదాసు కీర్తనలు - సంకలనం॥ దాశరథుల బాలయ్య, పుట 134, కీర్తన 162.
2. " " పుట 10 కీర్తన 11.
3. " " పుట 114, కీర్తన 136.

అమ్మా ! సీతమ్మ తల్లీ ! రాముడు దయశాలి కాదు. ధర్మ నిరతుడు కాదు. కానీ నీవు మాత్రం ధర్మాత్మురాలివి. ధర్మం నీకుంది. ఎందుకంటే రాముడికున్నంత కఠినమైన మనసునీకు లేదు. నీవు నా కన్నతల్లివి కదా. బిడ్డ ఎంత తప్పు చేసినా కన్న తల్లి క్షమించి దరి చేరుస్తుంది. కాపాడుతుంది. అందుకే నీకు నా బాధలన్నీ చెప్పుకుంటున్నాను. నా మనవిని నీవాలకించి, రాముడికి నీవైనా చెప్పమ్మా ! వింటాడేమో ! అని తన సమస్యలు ఏకరువు పెట్టాడు. రామదాసుకు ఆ సీతామాత యెడ ఎంత భక్తి, ప్రేమ ఉన్నాయో చూడండి. రాముడి కంటె ఆ తల్లి సీతామాతకి అగ్రపీఠం వేశాడు. ఏనాటికైనా ఈ ప్రపంచంలో తల్లికే ప్రథమస్థానం ఉంది. అందుకే "రామసీతలు" అని ఎవరు అనరు. "సీతారాములనే" అంటారు. సీతాదేవి భూపుత్రిక. ఆమెకు సహనం, ప్రేమ, జాలి, దయ అన్నీ ఎక్కువే. భూదేవి ప్రజలందరినీ కాపాడి, తన ఒడిలో చేర్చుకుంటుంది. ఆమెకున్న సహనం సీతమ్మకుంది. అందుకే ఆ నమ్మకంతోనే రామదాసు సీతమ్మకు తన సమస్యల్ని విన్నవించాడు. మరో కీర్తనలో రామదాసు 'రాముడికి ఎటువంటి సమయంలో తన విన్నపం తెలియజేస్తే వింటాడో సీతమ్మకు సమయస్ఫూర్తితో సమయంకూడా తెలియజేస్తున్నాడు ఈ విధంగా -

**కళ్యాణి - ఆది**

''ననుబ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ - నను బ్రోవమని చెప్పవే !" అనే కీర్తనలో తనను రక్షించమని రామునికి చెప్పమంటాడు. ఆ చెప్పేది కూడా ఒకానొక సమయంలో 'రతికేళి' జరిగే సమయంలో కార్యం సఫలమయ్యేలా చెప్పమంటాడు. " రామదాసు సమయస్ఫూర్తి ఈ కీర్తన ద్వారా ప్రదర్శితమౌతుంది.

*"నను బ్రోవమని చెప్ప నారీ శిరోమణీ - జనకుని కూతురా! జనని జానకమ్మా ॥*
*ప్రక్కను జేరుక చెక్కిలి నొక్కుచు - చక్కగ మరుకేళి సొక్కి యుండెడి వేళ ॥*
*లోకాంతరంగుడు శ్రీకాంత నిను గూడి - యేకాంతమున నేకశయ్య నున్నవేళ ॥*
*అద్రిజా వినుతుడు భద్రగిరీశుడు - నిద్రమేల్కొను వేళ నెలతరో బోధించి ॥"*[1]

అమ్మా! జానకీ! ఆ రాముడు ముందే పరధ్యానంలో ఉంటాడేమో, నిద్ర మేల్కొన్న సమయంలో విషయమంతా జాగ్రత్తగా చెప్ప సుమా ! మీరిరువురు ఏకాంతంగా ఉన్న సమయంలో నా మనవి వారికి వినిపించవలసింది అని కోరాడు. చక్కని సమయాన్ని సూచిస్తూ తనను రక్షించమని చెప్పాడు. ఇందు "మధుర భక్తి" ద్యోతకమవుతుంది. ఇటువంటి కీర్తన మరొక్కటి లేదు. మరో కీర్తనలో "రాముడిని ఒక్కసారి నా వద్దకు రమ్మని చెప్పమని సీతమ్మను" కోరుతాడు. ఆ రాముని ఒకమారు కనుల నిండుగా చూసుకొని తరిస్తాను. నా బాధను స్వయంగా తెలియజేస్తాను. నీవు చెప్తే రాముడు తప్పక నా వద్దకొస్తాడనే నమ్మకం వ్యక్తం చేస్తున్నాడు రామదాసు ఈ విధంగా కీర్తనలో తెలియజేస్తున్నాడు. సీతమ్మకు వినతి పత్రం సమర్పించుకొంటున్నాడు.

**షహానా - ఆది**

*రమణిరో రాముని రమ్మనవే ప్రేమ మీరగ నొక ముద్దు నిమ్మనవే ॥*
*అందమైన గజ్జెలందియలు పాద ద్వంద్వముల నింపొందగనూ॥*
*కస్తూరి తిలకము జారగనూ కనక కౌస్తుభ హారముల్ గుల్కగను ॥*
*మచ్చికచె ముచ్చట లాడుచును నా యిచ్ఛను గల కోర్కె తీయగను ॥*
*ముదమున చిరు నగవులొత్తగను వాని కదిసి కన్నుల నిండ చూచెదను ॥*
*ధర రామదాసుని వదలక భద్రగిరి వాసుని నేడు వేడగను ॥*[2]

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 75, కీర్తన 84.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 104, కీర్తన 125.

రాముని సౌందర్యాన్ని చక్కగా వర్ణించాడు ఈ కీర్తనలో రామదాసు. సమస్త లోకాలకు ఆనందాన్ని చేకూర్చే ఆ సుగుణాభిరాముడు, సుందర స్వరూపుడైన, అయోధ్య రాముడు, భద్రాద్రి రాముని నగుమోము చూసి తరించి పోవాలన్న ఆకాంక్ష రామదాసు హృదయంలో ఉంది. అందుకే సీతమ్మ తల్లికి చెప్పి, రాముని రమ్మని కోరుకున్నాడు. తన మనోవేదనను, తన కోరికను సీతాదేవికి తెలియజేశాడు. ఈ విధంగా రామదాసు "రామునికి తన బాధలు తెలియజేయ వలసిందిగా సీతాదేవిని కోరాడు. ఇంకా చివరిగా తాను కారాగారంలో పొందిన బాధలన్నింటిని తెలియజేశాడు. ఇంక నేనీ బాధలు భరించలేనని, ఆవేదన చెందాడు.

### 5.4. రామదాసు విషమును గ్రహించి మరణింప పూనుట :-

రామదాసు సీతాదేవికి తన బాధలను వివరించాడు. "జనక తనయ నాదు మనవి గైకొని జగజ్జనకునితో దెల్పవే ఓ జననీ!" అనే కీర్తనలో తాను పడిన బాధలన్నీ తేటతెల్లమొనరించినాడు. 'ఇడుముల బడలేను ఉర్విపై ప్రాణములు విడిచి మిమ్ము జేరెద' అని దీనాలాపంతో విన్నవిస్తాడు. చివరకు 'అతి భీతి నొంది నేనార్జించితిని విషము ఆలస్యమిక చేయను' అని విషం త్రాగి ప్రాణాలు విడవడానికి నిశ్చయించుకొంటాడు. రామా! నీవు నన్ను కరుణించేది లేదు. నిన్ను 12 సంవత్సరాలుగా ప్రాధేయపడుతూనే ఉన్నాను. ఇంక నావల్ల కాదు. నేను మరణించి మీ సన్నిధికే చేరుతానని అనుకొంటాడు. ఈ కీర్తనలోని ముఖ్య చరణాలివి.

**షహానా - చాపు**

*జనక తనయ ! నాదు మనవి గైకొని జగజ్జనకునితో దెల్పవే ఓ జననీ ॥*
*పన్నెండేండ్ల నుండి పగలు రేయినాపన్నుడనై మిమ్ముల ఓ జననీ*
*ఎన్నో విధముల సన్నుతించిన గాని కన్నుల జూడడాయె ఓ జననీ॥*
*నిజముగ మీ పాద భజన సేసిన వారి నిర్దయ జూచినారు ఓ జననీ*
*సుజనావళిని మున్నెటు వలె బ్రోచిరో నిజము గాదని తోచెను ఓ జననీ ॥*
*గడియ గడియకు నన్ను గదిసి దూతల వలె గడు భీతి నొందింపగా ఓ జననీ*
*ఎడతెగని యాపద యే ప్రొద్దు గలిగెనే నెవరితో విన్నవింతు ఓ జననీ ॥*
*తడవేల పైకము తెమ్మని తహసీలు తాకీదు సేయింపగా ఓ జననీ*
*ఇడుముల పడలేను ఉర్విపై ప్రాణములు విడిచి మిమ్ము జేరెద ఓ జననీ ॥*
*అదిగో వచ్చెదరని యిదిగో వచ్చెదరనీ యెదురు చూచుచునుంటిని ఓ జననీ ॥*
*ఒదిగి చిన్నబోయి బందిఖానాలోనే నొంటరిగా నుంటిగదా ఓ జననీ ॥*
*సుదతిరో తెల్లవారిన వెనుక నన్నింక బ్రతుక నియ్యరు భటులు ఓ జననీ*
*అతి భీతినొంది నేనార్జించితిని విషము ఆలస్యమిక జేయకు ఓ జననీ ॥*
*పరమ పురుషుడింత యరమర జేసిన పరుల నెవ్వరి వేడుదు ఓ జననీ*
*నరసిజోదరునకు సమ్మతి గాకున్న సత్కీర్తి దక్కునటే ఓ జననీ ॥*
*మరి మరి మిమ్మెపుడు మందలించినా మనసు నీరై పోయెనుగా ఓ జననీ*
*సరి నాయిష్టము జెల్లె నేటి వరకు వెరవు లన్నియు తీరెగా ఓ జననీ ॥*
*అతివరో యన్నదమ్ముల నిటు పంపుమీ యర్థముతో గూడను ఓ జననీ*
*గతి వేరె లేదు సద్గతి నొందుటకును పతిత పావనుడు తప్ప ఓ జననీ ॥*
*ఇతర మెరుగక మీరె గతియని నమ్మిక ఇదివరకున్నాడను ఓ జననీ*
*సతతము భద్రాచల రామదాసుని సంతరింప సమయము ఓ జననీ ॥*[1]

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 62-64, కీర్తన 68.

రామా ! 12 సంవత్సరాలుగా నేను ఈ బందిఖానాలో ఒంటరిగా బ్రతికాను. అబుల్ హసన్ తానాషాగారు, రామాలయ నిర్మాణానికై నేను ఖర్చు చేశానన్న ఆరు లక్షలు పైకం ఇమ్మని వేధిస్తున్నాడు. నిరంతరం తానీషా భటులు నన్ను నానా బాధలు పెడుతున్నారు. ఇంక తెల్లవారితే నేను బ్రతకను . నన్ను తానీషా భటులు బ్రతకనీయరు. నీచులైన వారి చేతిలో మరణించడం కన్నా ఆత్మార్పణం చేసుకోవడమే మేలు. అందుకే 'విషం' కష్టపడి సంపాదించాను. నిన్ను ఈ 12 ఏండ్లుగా వేడుకున్నా, ప్రార్థించినా, స్తుతించినా కరుణ కలగలేదు. నేను ఎవరి కోసం బ్రతకాలి. నీవు నన్ను కాపాడనప్పడు నేను ఎందుకు జీవించాలి. సీతారాములు అయిన మీరు నన్ను మీ బిడ్డను నిర్దాక్షిణ్యంగా వదిలిపెట్టారు. నేను తెల్లవారే సరికి మరణిస్తాను. ఈ రాత్రికే "రామ లక్ష్మణులను" పైకం తీసుకొని రమ్మని చెప్పమ్మా! సీతమ్మ తల్లీ! ఆ ధనం తానీషాకు ఇవ్వమని తెలియజేయి అని రామదాసు అతి దీనుడై వేడుకున్నాడు. రామదాసు మరో కీర్తనలో కూడా ఈ విధంగా సీతమ్మకు తెలియజేస్తాడు.

**కాంభోజి - ఆది**

మిథిలేశ తనయ నామితిలేని వెతల నీయుధిపున తెలిగింపవే ఓ జననీ
వ్యధ చెందుచున్నాను బుధ వినుత నా కథను వినగ రమ్మని చెప్పవే ఓ జననీ ॥
పండ్రెండేండ్లాయెను బందిఖానా జిక్కి బాధింపుచున్నారిట ఓ జననీ
తండ్రి కరుణ మానె తల్లి నీ కృప యెట్లో వేండ్రమాయె బ్రతుకు ఓ జననీ ॥
పరమ పురుషుడని పతిత పావనుడని పాండవ పక్షుడని ఓ జననీ
కరిగాచినాడని కాంక్షించి వేడితే కాలహరణము జేసెనే ఓ జననీ ॥
ఉదయమైన వెనుక నురగ శయనునితోడ ఉండజాలవు అసువులు ఓ జననీ
సదయాత్ముని పంపి నన్ను సాకుమనవె సత్కీర్తి దక్కునమ్మా ఓ జననీ ॥
తానాషా పైకము తడలేక తెమ్మని తహసీలు చేయించగా ఓ జననీ ॥
మానవాధముడనై బ్రతికి యుండుట కన్న మరణమ్ము మేలమ్మ ఓ జననీ ॥
అతి దుఃఖమును బొంది యలసటచే గుంది యార్జించితి విషము ఓ జననీ ॥
పతిత పావనునిపై భారము వేసి ప్రాణమ్ములు విడిచెద ఓ జననీ ॥
పరమ పురుషుని కనుల జూడ జాలనట్టి పాపపు జన్మమేలా ఓ జననీ ॥
కరణ త్రయంబుల కాకుత్స్థ తిలకుని కంటె నన్యమెరుగనే ఓ జననీ ॥
ఎపుడైన మీదగు కృపజెందగలనని వపువుంచితీ వరకు ఓ జననీ ॥
విపరీతము జూడ కపటాత్ములైతిరి విఫలము నా బ్రతుకు ఓ జననీ ॥
స్థిరముగ భద్రాద్రి శిఖరిని సద్భక్త శేఖరుడై వెలసి ఓ జననీ ॥
పరువడి రామదాసుని బ్రోవకున్నను పరువేలాగు దొరకునే ఓ జననీ ॥[1]

రామా ! నిన్ను ఇంతకాలంగా పూజిస్తూ ప్రార్థిస్తూ గడిపింది నీ కరుణ కోసమే. నీవే నన్ను కాపాడకున్న నేను బ్రతకడం నిరర్థకం. నీవు కాపాడగలవనే నమ్మకంతో 12 సం॥లు ఎదురు చూశాను. నీవు నన్ను కాపాడి నీ కీర్తిని నిలబెట్టుకో. అమ్మా! సీతమ్మ తల్లీ! ఓ జననీ ! జానకీదేవి! రామునికి నీవైనా చెప్పమ్మా! తెల్లవారే సరికి సూర్యోదయంతోనే నేను అసువులు బాసెదను. రామా ! నిన్ను కన్నులతో చూడని ఈ జన్మ వృథా. నీవు తానాషా కడకు నీ తమ్మునితో కూడా వచ్చి పైకమిచ్చి నన్ను కాపాడు. అని ఈ విషయం సీతమ్మ ద్వారా రామునికి తెలియజేస్తున్నాడు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 99-100, కీర్తన 118.

ఈ రెండు కీర్తనలను పరిశీలించిన మీదట చారిత్రకాంశాలు గోచరిస్తున్నాయి. ఇవి రెండూ 12 సం॥లు పూర్తిగా కారాగారంలో ఉండిన చివరి దశలో ఆఖరి దినాన వ్రాసిన కీర్తనలుగా చెప్పవచ్చును. అబుల్ హసన్ తానాషా గోల్కొండ ప్రభువుగా ఉన్న కాలంలోనే ఈ కీర్తనలు వెలువడినాయి. 1677 ప్రాంతంలో రామదాసు విడుదలకు ముందు రోజున రామదాసు హృదయం నుండి ఆవిర్భవించిన గొప్ప చారిత్రాత్మక, సంఘటనలు స్పష్టం చేసే కీర్తనలివి. విషం అర్థించి, ఆ విష పానం చేయబోయే తరుణంలోనే రామ, లక్ష్మణులు రామదాసు మొర వింటారు. 12 సంవత్సరాలు రామదాసు కఠిన కారాగార శిక్ష అనుభవించిన తర్వాత, 12 సం॥లు పూర్తయిన తర్వాతనే, ఆయన కర్మ ఫలం అనుభవించడం పూర్తయిన వెంటనే, సీతమ్మ ద్వారా రాముడు తన భక్తుని ఆర్తిని, మొరను విని, రామదాసును బంధ విముక్తుని చేయ నుద్యుక్తుడవుతాడు. 12 సం॥లకు గాని శ్రీరామచంద్రునికి రామదాసుల వారిపై దయ రాలేదు. సీతమ్మచే ప్రేరేపించబడిన శ్రీరాముడు లక్ష్మణునితో కలిసి నాటి రాత్రి గోల్కొండ సుల్తానునకు భటుల వేషంతో కనిపిస్తారు.

**5.5. రామదాసు బంధ విముక్తుడగుట : తానాషాకు రామలక్ష్మణులు దర్శనమిచ్చుట :-**

రామదాసు మొర విన్న రాముడు 12 సం॥ల తర్వాత తన సోదరుడు లక్ష్మణునితో కూడి భటుల రూపంలో తానీషా శయన మందిరానికి వచ్చి, రామదాసు గోల్కొండ ప్రభువునకు ఇవ్వవలసిన, చెల్లించవలసిన, రామాలయ నిర్మాణార్థం ఖర్చు చేసిన ఆరు లక్షల పైకం అసలు, వడ్డీ నాలుగు లక్షలు వెరసి 10 లక్షలు వరహాలు బంగారు నాణాలను 'రామదాసు' తరపున తానీషాకు సమర్పించి, తానీషా కడ రసీదు పుచ్చుకొని అంతర్ధానమై, రామదాసు బందిఖానా వద్దకు వస్తారు. రామదాసు సిద్ధం చేసుకొన్న విష పాత్రను దొర్లిస్తారు. విషం మట్టిలో కలిసిపోతుంది. "రామదాసా! నీ బాకీ పైకం రద్దాయెను మరి వినుమా ! ప్రేమతో నిచ్చెదనిపుడు రసీదును ప్రియముతోడ చేకొనుమా !"[1] అని రాముడు తానీషా వేషము దాల్చి రామదాసునకు బాకీ ముట్టినట్లుగా రసీదిచ్చినట్లుగా సింగరదాస కృతమైన 'రామదాస చరిత్రం' తెలియజేస్తుంది.

"ఇద్దరు ఉద్యోగుల అసాధారణ కాంతి సౌందర్యాలకు తానీషా దిగ్భ్రాంతుడౌతాడు. హఠాత్తుగా అనేక సంవత్సరాల బకాయి ఒకేమారు చెల్లించడం ఆయనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అర్థరాత్రి వేళ పైకం తెచ్చిన ఇద్దరి రూప లావణ్యాలు చూచి ఆ సేవకులిద్దరు రామదాసు ఊహిస్తున్నట్లు రామలక్ష్మణులే తప్ప మరెవరూ కారని నిర్ణయించుకుంటాడు. ఉదయము ఆ ద్రవ్యము చూచి నిర్విషణ్ణుడౌతాడు. క్రమముగా లెక్కింపబడిన ఆ ద్రవ్యము రామదాసు గారిపై తేల్చబడిన బాకీ మొత్తమునకు నిక్కచ్చిగా సరిపోయెనని కృష్ణాజిల్లా చరిత్రకారుడు వ్రాసియున్నాడని కొండపల్లి రామచంద్రరావు గారు తెల్పినారు.[2]

"శ్రీరామ ప్రభువే సుల్తానుకు పైకం చెల్లించి గోపన్నను చెర విడిపించాడు"[3] అని హోవర్ట్, మార్టిన్ అను డచ్చి ఈస్టిండియా కంపెనీ ఉద్యోగులు వ్రాశారు. తానీషా వెంటనే రామదాసు బందీగా ఉన్న చెరసాలకు పరుగెత్తుకొని వచ్చి తనకు కల్గిన ఆశ్చర్యకరమైన దర్శనం సంగతి తెలుపుతాడు. పరి పరి విధాల వేడుకుంటాడు. రామదాసును చెర విడిపిస్తాడు. "తప్పులెన్నబోకు ఇక మీయప్ప దీరెమాకు, కుప్ప బోసి ధనమప్పగించియును రెప్పపాటుననె చెప్పకపోయిరి" అని తానాషా విన్నవించుకుంటాడు. రామదాసు తానాషాను "ధన్యుడవు తానీషా నీవు ననుకన్నయ్య పాదముల కనుల కన్నావు" అని అభినందిస్తాడు.

1. రామదాసు చరిత్రము - సింగరదాసు (ఎన్.వి.గోపాల్ అండ్ కం., మద్రాస్-1, పుట 76.
2. భద్రాచల క్షేత్ర చరిత్ర - కొండపల్లి రామచంద్ర రావు పుట 22.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పీఠిక-బాలాంత్రపు రజనీకాంతరావు పుట 12.

ఇదే కీర్తనలో "భద్రాచలము నెప్పటికి మీ రామభద్రున కిచ్చితిమి బాగుగా వినుము - ముద్రనిశానీలు చేకొనుమీ శ్రీ భద్రాద్రి వర రామదాసుడై మనుము"[1] అని తానాషా వాక్రుచ్చినట్లు రామదాసు చరిత్రము చెప్తున్నది. రామదాసును తానీషా అనేక విధాల లాంఛనాలతో భద్రాచలానికి సాగనంపుతాడు.

ప్రభుత్వము వారు ప్రచురించిన 'గోల్కొండ శిథిలములు' అనే గ్రంథంలో రామదాసు బందిఖానా నుండి విముక్తుడైనట్లు, రాముడే ఆరు లక్షల ద్రవ్యాన్ని తానాషాకు చెల్లించినట్లు తెలియజేయబడింది.

"Ramadasa was the cashier of the king's Treasury at Bhadrachalam. He utilized the funds of the king in building a temple for God Rama. The king Tanashaw got wild when he found his offers were emptied by his devotee employee. Tanashaw arrested him and hurled him into the cell. But God Rama approached the king in disguise, made good the amount spent away by Ramadas and gave him deliverence. On one of the wall of the cell are figures of Rama made by Ramadas for worship"[2]

రామదాసును అబ్దుల్లా కుతుబ్షా ఖైదులో బంధించాడు. తానీషా విడుదల చేశాడు. రామదాసును అతని మేనమామలు అక్కన్న, మాదన్నలే పైకం ఇచ్చి తానీషా కడ రసీదు తీసుకొని, రామదాసును విడిపించి ఉండవచ్చని కొందరు అభిప్రాయపడినారు. ఈ విషయం గూర్చి ముద్దికంటి గురునాథ శర్మగారు ఈ విధంగా తమ గ్రంథంలో వివరించారు.

"పైకం చెల్లించిన వదలిపెట్టెదనని తానీషా యన్నప్పుడు రామదాసునకుద్యోగమిప్పించిన వాడును, మహోదారుడును, మహైశ్వర్య విరాజితుండును, మహా మేధావియునగు మాదన్నగారు పైకము చెల్లించి తన మేనల్లుని చెఱ విడిపింపక చూచుచుండునా? అన్న ఆలోచన వచ్చును". ఇతరుల వ్రాతలెఱుంగని వరద రామదాసు మాదన్న హైందవుడని మాత్రమెఱింగి యీ ముడి వేసి యుండునని తలంపనై యుండెను. రామదాసును మాదన్న మహామంత్రే తానీషాకు పైకమిచ్చి విడిపించి యుండునని భావించుటకు కారణం ఇరువురు హిందువులేనని భావించారు వరద రామదాసు."[3]

రామదాసు కారాగృహంలో అనుభవించిన కష్టాలన్నింటికి తానీషా భార్య సితారయే కారణమని ముద్దికంటి గురునాథ శర్మగారు "కంచెర్ల గోపన్న అను రామదాసు" అనే గ్రంథంలో తెలియజేశారు. ముద్దికంటి గురునాథ శర్మగారు తమ గ్రంథంలో రాముడు తానీషాకు దర్శనమిచ్చిన విధం, రామదాసు చెర విముక్తుడైన విధం గూర్చి ఈ విధంగా తెలియజేశారు.

"రామ లక్ష్మణులు తానీషాకు స్వప్నమున కనిపించి, ఆ ధనం ఆరు లక్షలు రామదాసును విడిపించుటకై ఋణం చెల్లించి ఇచ్చినట్లు స్వప్నం వచ్చింది. ఆ విషయమే తన భార్యకు చెప్పినాడు. రామోజీ లక్ష్మోజీ అన్న పేర్లతో మహమ్మదీయుల వలె వేషంతో వచ్చి ఆరు లక్షల పైకం ఇచ్చి తానీషా వద్ద రసీదు పుచ్చుకొన్నారు. రామదాసు కడకు చెఱసాలకు తానీషా ప్రభువు భటుల వేషంలో రాముడు, లక్ష్మణుడు వచ్చి రామదాసుకు ఆరు లక్షల పైకం తానీషాకు ముట్టిన రసీదు ఇచ్చి అంతర్ధానమైనారు" అంతట ఆనందంతో రామదాసు

"అంతా రామ మయం ఈ జగమంతా రామమయం
అంతరంగమున నాత్మారాముడ నంతరూపముల వింతలు సలుపగ ॥"

అని కీర్తిస్తూ రాముని కృపకు ఆనందంతో రామభజన చేశాడు. ఋణ విముక్తుడైనాడు. రామ కృప వలన రామదాసు ధన్యుడు అయినాడు.[4]

1. రామదాసు చరిత్రము - సింగరదాసు (యక్షగానం) పుట 80.
2. భద్రాచల రామదాసు చరిత్ర - కొండాలి లక్ష్మీనారాయణ పుట 13.
3. ముద్దికంటి గురునాథ శర్మ - రామదాసు చరిత్ర విమర్శనము (భారతి అక్టోబరు1931, పుట 511.
4. కంచెర్ల గోపన్న అను రామదాసు - ముద్దికంటి గురునాథ శర్మ, పుట 114, తొమ్మిదవ ప్రకరణం.

తానీషా మాత్రం సజ్జనుడు, భక్తుడు, పరమత సమనం కలవాడు. అతని భార్య సితార ద్రోహి. రామదాసును కష్టపెట్టింది. తానీషా రామదాసును బంధించినందుకు పశ్చాత్తాప పడినాడు. అంతటి రామభక్తుడు కనుకనే రాముడే స్వయంగా రామదాసు చేసిన ఆరు లక్షల ఋణం తీర్చడానికి వచ్చాడు. రామదాసు వద్దకు తానీషా రూపంలోనే రాముడు వచ్చి రసీదు ఇచ్చిన విషయం విని తానీషా ఆశ్చర్యపోయి ఇదంతా రాముని మహిమగా భావిస్తాడు.

ఇబ్రహీము, మీర్‌జుమ్లా, సితారలు కలిసి రామదాసును 12 సం॥లు కారాగారంలో ఉండేలా చేసి నానా బాధలు పెట్టారు. ఆ విషయం తెలిసిన తానీషా ఇబ్రహీమును కూడా తొలగించాడు. "ఇబ్రహీము చేసిన పొరపాటు పనులు, అవినీతిని ఎఱింగి తానీషా అతనిని సేనాధ్యక్ష పదవి నుండి తొలగించి అక్కన్నగారికి ఆ "షాహ లష్కర్" పదవి నొసంగెను". రామదాసును గౌరవించెను".[1] బాలాంత్రపు రజనీకాంతరావు గారు రచించిన "ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము"లో రామదాసు జైలునుండి విడుదలైన విధానం గురించి ఇలా తెలియజేశారు.

"భగవంతుని కోసమే తాను సద్వ్యయం చేసిన ధనం భగవంతుడెలాగో ఒకలాగా తానాషాకు అప్పగిస్తాడనే అనంత విశ్వాసంతో రాజభటులు పెట్టే బాధలన్నింటినీ రామ సంకీర్తనములు పాడి ఓర్చుకుంటూ 12 ఏండ్లు గడిపాడు. కాని చివరకు విసిగి, ఒక రోజున విషము పుచ్చుకొని ప్రాణ హరణం చేసుకొన పోతుండగా, శ్రీరాముడు లక్ష్మణ సహితంగా తానీషాకు అంతఃపురంలో జవాను వేషంలో కనబడి, రామదాసుగారిచ్చినట్లుగా పైకం యిచ్చి, రసీదు తీసుకొని రామదాసును చెర విడిపించారు."[2]

కవిరాజ శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రిగారు " రామదాసు ఖైదులో ఉండగా 12 సం॥ల తర్వాత విరక్తుడై రామ దర్శనం కానందున విషం తీసుకుని మరణించపోవడం అనే అంశాన్ని వారి గ్రంథంలో భద్రాచల రామచరిత్ర అనే కావ్యంలో ప్రస్తావించలేదు.

"ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళాసేవ" అనే పుస్తకంలో ఈ విధంగా ఉంది. "రామదాసు ఎన్నో విధముల రాముని ప్రార్థించి, బ్రతిమాలి, భంగపడి, భయపెట్టి యాదీన మందారుని మనస్సును కఱగించెను. కడకు రామ లక్ష్మణులు రామదాసుని భటుల వేషము దాల్చి నవాబునకారు లక్షల పైకము చెల్లించి రామదాసుని చెర విడిపించిరి. కథ శోభనాంతమైనది[3] అని కలదు.

"చెరసాలలో ఉండి రామదాసు చనిపోయినట్లు కథ. కాని ఇది నిజం కాదు. రామదాసు ఖైదులో చనిపోలేదు. విడుదలయ్యాడు. దీనికి తానీషా ఫర్మానాయే నిదర్శనం".[4] "రామదాసు నాటకము" నందు డి. వెంకట రమణయ్యగారు ఈ విధంగా వ్రాశారు. "రామదాసు చెల్లించవలసిన ఆరు లక్షల రూపాయల ధనం రామ లక్ష్మణులు తానీషాకు స్వప్నమున సాక్షాత్కరించి, ఆ ధనం చెల్లించి రసీదు తీసుకొని వెళ్లి, రామదాసుకు ఇస్తారు. రామదాసును చూచుటకు తానీషా చెరసాలకు వెళ్తాడు. రామదాసును అభినందించి ఖైదునుండి విడుదల చేస్తాడు".[5]

'భక్త కవి పుంగవులు' అనే గ్రంథంలో ఈ విధంగా ఉంది. "రామదాసు రాముని ప్రార్థించాడు. ఆయనకు సీతమ్మ ద్వారా సిఫారసు చేస్తాడు. ఆ తల్లి మొరను విన్న ఆ కరుణా సముద్రుడు కరిగిపోయాడు. ఆ ఆర్తత్రాణ పరాయణుడు లక్ష్మణ సమేతంగా తానీషా అంతఃపురంలో ప్రవేశించి, ఆయనకు ఆరు లక్షల

1. బిరుదురాజు గురునాథ శర్మ - కంచెర్ల గోపన్న అను రామదాసు పుట 118.
2. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంత రావుగారు. పుట 198-199.
3. ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళా సేవ - ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ, పుట 30.
4. ఆంధ్ర ప్రదేశ్ దర్శిని - ఆంధ్ర దేశ చరిత్ర పుట 835.
5. రామదాసు నాటకము - డి. వెంకట రమణయ్య , సప్తమాంకము.

వరహాలను చెల్లించి, రశీదు తీసుకొని వచ్చి, బందిఖానాలో దుఃఖభారంతో, ఆవేదనతో సొక్కిపోయి ఉన్న గోపన్నకు మారు వేషాలతో దానిని అందించిపోయిరి".[1]

శ్రీ భావరాజు వేంకట కృష్ణారావుగారు రామదాసు జైలునందు అనుభవించిన శిక్షలు గూర్చి, ఆ తర్వాత ఆయన విడుదలైన విషయాన్ని గూర్చి ఈ విధంగా వివరించారు. అబ్దుల్లా కుతుబ్షా రామదాసును ఖైదులో ఉంచి వారమునకో, నెలకో యొకతూరి, మండుటెండలో మండుటిసుకలో కూర్చుండబెట్టియు, బెత్తములతో కొట్టించియు, వర్ణనాతీతములు దుష్కరములు నగు విపరీత శిక్షలు బెట్టుచు సర్కారు కీయవలసిన ఆరు లక్షల పైకం ఈయవలసినదని నిర్బంధించునట్లు ఆజ్ఞాపించెను. తర్వాత శ్రీ రామలక్ష్మణులు రామదాసున్న చెరసాలకు వెళ్ళి గోపన్న సిద్ధము చేసికొన్న విషము పాత్రను పారబోసిరి. తానీషా రసీదిచ్చెను. తానాషా చేతి ముద్రలు ఎఱ్ఱరంగుతో వేసిన చేతి ముద్రలు గల రెండు తెల్ల రుమాలలను గోపన పండుకొని యున్నచోట పెట్టిరి. మెలకువ వచ్చిన తరువాత గోపనయు రెండు రుమాళ్లను జూచి విస్మయమందెను. తెల్లవారిన పిదప, తానీషాయును, అక్కన్న, మాదన్నలును విచ్చేసినపుడు వారి వలన క్రిందటి రాత్రి జరిగిన వృత్తాంతమునంతయు వినినపుడు అంతయు శ్రీరామచంద్రుని కటాక్షమని యాతడు గ్రహించెను.[2] భావరాజు వేంకట కృష్ణారావుగారి పై అభిప్రాయాన్ని బట్టి అబ్దుల్లా కుతుబ్షా కాలంలో ఖైదులో ఉంచబడిన గోపన్న అబుల్ హసన్ తానీషా కాలంలో రామానుగ్రహంతో విడుదలైనాడని విశదమౌతుంది.

నారుమంచి సుబ్బారావుగారు రామదాసు కారాగార విముక్తుడైన విషయాన్ని గూర్చి ఈ విధంగా వ్రాశారు. " రామ లక్ష్మణులు జిట్టీ లాగులు తొడిగి, సేవకుల రూపములు ధరించి, ఆరు లక్షల వరహాలతో గోల్కొండకు బయలు దేరిరి. చెరసాలలో రామదాసు తండ్రీ! ఇట్టి చెరలనెన్నింటినైనను భరింతును గాని ఈ దినమున, నీ మోమును జూపవేని విషము ద్రావి మరణింతును" అని ప్రతిన జేసెను. ఒక భటునిచే విషము తెప్పించి, దానినొక పాత్రయందుంచెను. వెంటనే నిదుర పట్టెను. అటు తానీషా నిద్ర నుండి లేచి, భార్యతో రామ లక్ష్మణులు వచ్చి ఆరు లక్షల రూపాయలిచ్చి వెళ్ళినట్లు స్వప్నం వచ్చిందని చెప్పి, లేచి చూడగా రాముడు, లక్ష్మణుడు సేవక రూపంలో వచ్చి ఆ పైకము ఇచ్చి వెళ్ళారు.

"తానాషా రూపంలో చెరసాలకు రాముడు వచ్చి రామదాసు త్రాగనెంచిన విషం పారబోసి శిథిలమైన దేహం గల రామదాసుకు దివ్య రూపం ఇచ్చి మాయమైనాడు. విషయం తెలిసి. . . . . . . ." ఏమయ్యా! రామ బ్రహ్మేంద్రాదులకైన నీ మాయ తెలియ వశమా! అని పాడినాడు. తండ్రీ ! నీ పుత్రుని యందు నీ కింత యనురాగమున్నదని తెలియనైతి. ఈ దీనునికై సేవక వేషము ధరించితివా తండ్రీ ! యనుచు నా నందాశ్రువులగార్చి రాముని యవ్యాజవాత్సల్యమును బొగడెను. రాముని దివ్య లీలయంతయు, తానీషాకు గోచరమాయెను. సేవక రూపమున వచ్చినది రామ లక్ష్మణులని గ్రహించి, నేనెంత మందబుద్ధిని రామచరణముల నేల వ్రాలనైతి, నే చేసిన భాగవతాపచారమునకు పరిహారము గలదా! నన్ను క్షమింపుమని రాముని కాళ్ళ బడి ఏల కోరనైతి!యన్ని[3] వగచుచు రామదాసుని తన యంతఃపురమునకు బంగారు పల్లకియందు తెమ్మని యాజ్ఞాపించెను" అని నారుమంచి సుబ్బారావుగారు రామదాసును విడుదల చేసింది రాముడేనని తానాషాకు రామదర్శనం అయిందని, విష పాత్రను రాముడే పార వేసినాడని తెలియజేశారు.

"తెలుగులో భక్తి కవిత్వం - సమకాలీన విశ్లేషణ" అనే పరిశోధనా గ్రంథంలో పిల్లలమర్రి రాములు గారు రామదాసు జైలు శిక్షను గూర్చి విడుదలైన విషయాన్ని గూర్చి ఈ విధంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "రామదాసుగారు జైలు శిక్షను అనుభవిస్తున్న కాలంలో అనేకమార్లు దెబ్బలు తిన్నట్లు ఆయన

1. భక్త కవి పుంగవులు - పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు ( రామదాసు వ్యాసం).
2. భద్రాచలము - శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు , భారతి జూలై 1951, పుట 654.
3. సంగీత మహర్షులు -మొదటి సంపుటము - నారుమంచి సుబ్బారావుగారు పుట 42-43.

కీర్తనలు తెలుపుతున్నాయి. శిక్ష సందర్భంలో ఎదురైన బాధలను రాముడికి నివేదించుకున్నాడు. తాను రాజును కీర్తించడానికి విముఖతను చూపాడు. రామదాసు జీవితం బాధలు అనుభవించడంలోని వాస్తవికతను గుర్తింపజేస్తుంది. సాధారణ జీవితంలో రాజ నియమాన్ని ఉల్లంఘించిన వ్యక్తులు శిక్షా సమయంలో పొందే వేదన రామదాసు కీర్తనల్లో వ్యక్తమవుతుంది".[1] రామదాసు కీర్తనల్లోని ప్రధాన లక్షణం ఇదేనని రజనీకాంతరావుగారు అభిప్రాయపడ్డారు.

"They deal with the mundane miseries of life, not only those as experienced by the composer during his life, but also such as may occur to any one of us".[2]

" ప్రభుత్వానికి చెల్లించవలసిన పైకం ఎవరు చెల్లించారనే విషయంలో చారిత్రకంగా ఎలాంటి ఆధారం లేనప్పటికీ అతనిని బంధ విముక్తుడిని చేసింది రామ లక్ష్మణులేనని రామదాసు అనేక కీర్తనల్లో ప్రస్తావించాడు. రామ లక్ష్మణులు జట్టీ లాగులు తొడిగి సర్కార్వారికి పైకము చెల్లించడానికి తానీషా వద్దకు వచ్చినపుడు వారిని ఎందుకోసం, ఎవరు పంపగా ఎక్కడ నుండి వచ్చారని ప్రశ్నించగా, తనను విడిపించడానికి రామదాసే పంపించగా భద్రాచలం నుండి వచ్చి, రామదాసు చెల్లించవలసిన పైకం చెల్లిస్తున్నట్లు కీర్తనల్లో వర్ణితమైంది. (కీ. 26). జీవితంలో అత్యంత కష్టపూరితమైన సమయాలు ఎదురైనప్పటికీ విశ్వసించిన ఆశయాన్ని ఆరాధ్య దైవమైన శ్రీరాముణ్ణి విస్మరించలేదని రామదాసు జీవితం విశదీకరిస్తుంది."

పిల్లలమర్రి రాములు గారు ఎన్నో కీర్తనల్లో "రామ లక్ష్మణులు" వచ్చి రామదాసుకు చెందిన ఆరు లక్షల పైకం ఋణాన్ని తానాషాకు చెల్లించినారని వ్రాశారు. వారు ఉదహరించిన అంశం రామదాసు స్వయంగా వ్రాసిన కీర్తన ఒకే దానిలో ఉంది. రామదాసు వ్రాసిన ఆ కీర్తన ఇది. దీని ద్వారా రామ లక్ష్మణులు అర్ధరాత్రి సమయంలో తానీషా కడకు వచ్చి ఆరు లక్షల పైకం ఇచ్చి రసీదు తీసుకొని వెళ్ళారని స్పష్టమవుతుంది".[3] తానీషాకు రామదర్శనమైందనడానికి, రాముడే ఆరు లక్షల పైకం తానీషాకు ఇచ్చాడనడానికి ఇంతకన్నా మరో నిదర్శనం అవసరం లేదు. ఈ కీర్తనే దీనికి ప్రబల నిదర్శనం.

**ఆనంద భైరవి - ఆది**

*తెలియక నే వెఱాన పోతిని దేవుండని తెలియనైతిని ॥*

*నలినాక్షి వినవె కేవలమగు శ్రీ భద్రాచల ధాములయిన శ్రీ రామ లక్ష్మణులు॥*

*నిశ్చలముగ విచారింపనైతిని నిశి వేళలో ద్వారమందున॥*

*తలుపు గొట్టుచు పిల్వగా సామాన్యులని నేనెంచుకొంటిని ॥*

*రక్షించుమని వేడనయితిని ద్రవ్యాపేక్ష గలిగిన వాడనయితిని ॥*

*తక్షణమున వారార్లక్షల వరహాల్ని లక్ష్యముగ నొసగిన సాక్షాత్కారులను ॥*

*పక్షమున కరుణా కటాక్ష వీక్షణాలంకార దానవ శిక్ష సల్పిన పక్ష భువనరక్ష నను రక్షించుమనినే ॥*

*కనకాసనమీయ నైతిని, కమ్మని గంధము పూయనైతిని ॥*

*ధనము జూచి మోహమున తబ్బిబ్బైతిని, మనమున నతడాది దేవుడనుచు భక్తి॥*

*వినయ పూర్వకముగ పొగడుచు మనమున శ్రీపాద పద్మము*

*నెనరు మీరగ పట్టుకొని నన్నేలుకొమ్మనియడుగనైతిని ॥*

*పసిడి సాలువు గప్పనైతిని మంచి పన్నీరు నే జిల్కనైతిని॥*

*విశదముగా లంక వేగమే కృపతోను దశ కంఠానుజునకు మనలక నొసగియు॥*

1. తెలుగులో భక్తి కవిత్వం - సమకాలీన విశ్లేషణ - పిల్లలమర్రి రాములు పుట 205-206.

2. రామదాసు - బి. రజనీకాంతరావు పుట 40.

3. తెలుగులో భక్తి కవిత్వం - సమకాలీన విశ్లేషణ - పిల్లలమర్రి రాములు పుట 207-208.

*శశి ముఖి సీతతో భద్రాచలమున వసియించి వేడుక వసుధలోపల రామ*
*దాసుని పొసగ నేలిన రామచంద్రుని॥*[1]

ఈ కీర్తనలో తానీషా కడకు రామ లక్ష్మణులు వెళ్ళి అర్థరాత్రి సమయంలో తానీషా అంతఃపుర ద్వారం వద్దకెళ్లి తలుపు తట్టి తానాషాను పిలిచి, లోనికి సామాన్యుల వలె వెళ్లి రామదాసు తానీషాకు చెల్లించవలసిన ఆరు లక్షల పైకం చెల్లించి రసీదు తీసుకొన్నారు. తానీషా వారిని సామాన్యులుగా భావించి, వారు ఇచ్చిన బంగారు నాణాలు చూసి మోహించిన వాడై రాముని పూజింపలేక పోయినానని, వారు సామాన్యులని భావించినానని తానీషా బాధ పడినాడు. ఈ కీర్తనలో తానీషాకు రామదర్శనమైన విషయం తానీషా రామదాసుకు చెప్పగా, రామదాసు ఆ సంఘటన ఆధారంగా ఈ కీర్తన వ్రాసి ఉండవచ్చును. ఖైదులో నుండి విడుదల కాబోయే ముందు ఆశువుగా ఆలపించిన కీర్తనగా దీనిని భావించవచ్చును. రామదాసును భద్రాద్రి రామచంద్ర ప్రభువు రక్షించడానికై పైకం ఆరు లక్షలు తెచ్చి తానీషాకిచ్చాడు.

ఇంతకు ముందు తెలియజేసిన రెండు కీర్తనలు "మిథిలేశ తనయ నా మితిలేని వెతల" అనే కీర్తన, "జనక తనయ ! నాదు మనవి గైకొని! అనే కీర్తనలోను రామలక్ష్మణులు వచ్చి తానీషాకు పైకమిచ్చి వెళ్ల వలసినదిగా సీతను కోరాడు. అదే విధంగానే రామ లక్ష్మణులు సీతాదేవి కోరికమేరకు రామదాసును కాపాడటానికి మారు వేషాలలో వచ్చి, ఒక సామాన్య భటుల వలె వచ్చి, భద్రాచలం నుండి తాము వచ్చామని, రామదాసు తరపున వచ్చిమని, వారు సర్కారువారి పైకం 6 లక్షలు అసలు, 4 లక్షలు వడ్డీ కలిపి 10 లక్షలు అబుల్ హసన్ తానాషాకు అందజేశారు. వీటిని 'రామటంకాలు' లేక 'రామ మాడాలు' అని వ్యవహరించారు. ఇవి ఈనాటికీ రెండు భద్రాద్రి రాముని మెడలో ఆభరణంగా అలంకరింపబడి ఉన్నాయి. తానీషా ఈ విషయాన్ని గూర్చి తన భార్య సితారాకు కూడా తెలియజేశాడు. అక్కన్న, మాదన్నలకు కూడా తనకు కల్గిన రామదర్శన అనుభవాన్ని వారికి తెలియజేశాడు తానీషా. ఇది విన్నవారు ఆశ్చర్యచకితులై రామదాసున్న బందిఖానాకు వెళ్ళి, తానాషా అక్కన్న, మాదన్నలు కలిసి వెళ్ళి రామదాసు అపారమైన భక్తి, విశ్వాసాలకు రాముని యెడ గల భక్తికి మెచ్చుకొని, గౌరవంగా సాదరరంగా ఆయనను తమ అంతఃపురానికి ఆహ్వానించారు. జైలునందు ఆయనను ఉంచి, బాధించినందుకు క్షమాపణ కోరాడు తానీషా. "కృష్ణా జిల్లా మాన్యువల్"లో రామదాసు ప్రభుత్వ ధనంతో రామాలయ నిర్మాణం గావించి జైలు జీవితం 12 సం॥లు అనుభవించినాడని ఆ తర్వాత రామ లక్ష్మణులు తానీషా కడకు వచ్చి ఆరు లక్షల వరహాలు చెల్లించి రసీదు తీసుకొని, రామదాసును చెర విముక్తుని చేశారని చెప్పబడి ఉంది. ఈ విధంగా ఇందు వ్రాయబడింది.

" In this strait he poured forth his applications to Rama, who took pity upon the helpless prisoner. The monarch lay wrapped in slumber in his place at Haidarabad, when to hin entered two soldiers bearing an immense weight of treasure. They poured the coins on the floor and requested the astoniled king to write out a release for the defalcations of Gopanna. Abul Hasan, bewildered, turned to find writing materials, but the two peons had vanished. He thought it was a dream, but when day broke the money was there on the ground and on being counted was the exact deficiency for which Gopanna was responisible".[2]

ఆరుద్రగారు ఈ విధంగా తెలియజేశారు.[3] "అక్కడి రామాలయాన్ని (భద్రాచలం) ఉద్ధరించాడు. మేనల్లుడికి ఉద్యోగం వేయించేపాటి పలుకుబడేగాని, చెర తప్పించేంత అధికారం అక్కన్న మాదన్నలకు అప్పటికి లేదు". అబ్దుల్లా కాలంలో అక్కన్న మాదన్నలు రామదాసును విడిపించలేదు అని

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 68, కీర్తన 73.
2. కృష్ణాజిల్లా మాన్యుయల్ పుట 37-38.
3. ఆరుద్ర - సమగ్రాంధ్ర సాహిత్యము - ఏడవ సంపుటం , పుట 385.

అభిప్రాయ పడినారు కాని రాముడే వచ్చి తానీషాకు ధనం ఇచ్చాడని రామదాసును విడిపించారని వీరు ప్రస్తావించలేదు. మరో విషయం కూడా వీరు ప్రస్తావించారు. "గోపన్న 12 ఏళ్లు బందిఖానాలో మ్రగ్గాడు. క్రీ.శ. 1674 నాటికి పరిస్థితులు మారాయి. అక్కన్న మాదన్నలు అంచెల మీద గొప్ప పదవులు సంపాదించారు. మాదన్న మీర్‌జుమ్లా అయ్యాడు. వాళ్ళు చివరకు గోపన్నను విడిపించారు" అని ఆరుద్ర అభిప్రాయ పడినారు.

డా॥ కుసుమాబాయి గారు భద్రాద్రి రామదాసు రచనలు అనే వ్యాసంలో రామదాసు చెరనుండి విడుదలైన విషయం గూర్చి ఈ విధంగా వ్రాశారు. " గోపన్న వృత్తాంతాన్ని ఆధునికులు అంగీకరించడం లేదు. మారువేషాల్లో అక్కన్న, మాదన్నలే రహస్య మార్గం ద్వారా తానీషా శయన మందిరం ప్రవేశించి రెప్పపాటులో డబ్బు చెల్లించి జారుకున్నారని కొందరు అంటున్నారు. చందాలు వసూలు చేసి తానాషాకు ధనం చెల్లించి రామదాసును ప్రజలే విడిపించి ఉంటారని కొందరు భావిస్తున్నారు అని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు."[1]

'రామదాసు నాటకం' నందు ధర్మవరం గోపాలాచార్యులు గారు రామదాసు శిక్షలు, చెర విముక్తుడైన విషయాన్ని గూర్చి ఈ విధంగా తెలియజేశారు. "రామదాసును ప్రతిదినం ఎర్రగా కాలిన లోహపు కడ్డీ కాల్చి వీపుపై వాతలు బెట్టుచు, బాధించుచుండిరి, జైలు అధికారులు ఆ కడ్డీ రామ మహిమతో చల్లారిపోయేది"[2] రామదాసు కారాగృహంలో బంధింపబడి ఉన్న కాలంలో 'చాంది' అనే ఆమె, శంభుశాస్త్రుల భార్య సీతాంబ అనే ఆమెతో కలిసి రామదాసున్న చెరకు వచ్చింది. ఆమె తానీషా భార్య సితార సహాయంతో రామదాసును చెఱ విముక్తుడను చేయదలచింది. ఆ విషయం చాంది, రామదాసుకు చెప్పగా, రామదాసు అందుకు అంగీకరించడు. రాముడే తన ఋణం తీరుస్తాడని చెప్పాడు. తనను రాముడే చెరనుండి విముక్తుని చేస్తాడనే విశ్వాసం ప్రకటించాడు. 'చాంది' ని తన భార్య కమలను నిందిస్తాడు రామదాసు. తాను జైలునుండి తప్పించుకొని అవినీతికి పాల్పడలేనని అంటాడు రామదాసు"[3]. రామదాసు ధర్మ తత్పరతకు, నిజాయితీకి ఇది నిదర్శనం. తానీషా రామదాసుతో అన్న మాటలివి "తనకు ఆరు లక్షల పైకం తానీషాయే ఇచ్చి, తన కుమార్తెను (దిలారా) రామదాసు కుమారుడు రఘురామునికిచ్చి వివాహం జరిపించి, రామదాసును చెర విముక్తుని గావించి మంత్రి పదవి ఇస్తానంటాడు. తన కుమారుని యువరాజు పట్టం గట్టి రాజ్యం ఇస్తానంటాడు. ఈ భోగాలన్నీ తృణప్రాయంగా ఎంచాడు రామదాసు. రామనామ సంకీర్తనంలో ఉన్న ఆనందం వాటిలో లేదని కచ్చితంగా చెప్తాడు రామదాసు.

రామనామ స్మరణం చేస్తున్నపుడు తనకు ఎలాంటి విఘ్నాలు కలుగుజేయ వద్దని రామదాసు తానీషాను చివరి కోరికగా కోరుతాడు. రాముడే తన ఋణం తీరుస్తాడని, ఆ రామునిపై నమ్మకం, విశ్వాసం ఉంచాడు. - "కొంతకాలానికి"

"రామదాసు తరపున రామ లక్ష్మణులు సిపాయిల రూపంలో భద్రాచలం నుండి వచ్చి, రాత్రి సమయంలో తానీషా, అతని భార్య సితార నిద్రిస్తున్న శయన మందిరానికి వచ్చి రామదాసు ఈయవలసిన ఆరు లక్షల పైకం తానీషాకు చెల్లించి రామదాసును విడిపించమని కోరుతారు. రసీదు కూడా పుచ్చుకున్నారు. వారిచ్చినవి "రామ మొహరీలు". ఇది రామదాసు భక్తికి నిదర్శనం. రామ మొహరీలను సితారా కళ్ళకద్దుకొంటుంది. అందుకు మహమ్మదీయులు హిందూ ప్రతిమలకు దండం పెట్టడం ఎందుకని తానీషా అంటే దానికి సర్వ మతాలు ఒక్కటే, దేవుడొక్కడే అని తానీషాకు సమాధానమిస్తుంది సితార. అల్లా అయినా, రాముడయినా ఒక్కరే అని చెప్పింది ఆమె."[4]

1. భద్రాద్రి రామదాసు రచనలు - డా॥ కె. కుసుమాబాయి "గోల్కొండ ప్రభువుల కాలం నాటి భాషా సాహిత్య సేవ (హైదరాబాదు నాలుగు శతాబ్దాల సాహిత్య నికాసం) పుట 134.
2,3. రామదాసు నాటకం - ధర్మవరం గోపాలాచార్యులు -పంచమాంకం పుట 81.
4. రామదాసు నాటకం - ధర్మవరం గోపాలాచార్యులు - పంచమాంకం.

ఈ నాటకంలోని కొన్ని ముఖ్యాంశాలు పరిశీలించవలసి ఉంది 1. తానీషా సర్వమతాలు ఒక్కటే అని నమ్మిన సూఫీ మత తత్త్వవేత్త. అయితే రామదాసును చెర విడిపించేందుకు తానే ప్రయత్నం చేశాడని చరిత్రలో ఎక్కడా లేదు. కాని తానీషాకు రామదాసు భటులమని చెప్పి రామ లక్ష్మణులు దర్శనం ఇవ్వడం మాత్రం సత్యం. అందకు రామదాసు కీర్తనే నిదర్శనం. "సితార" రామదాసు శిక్షలకు కారకురాలని చరిత్రకారులు కొందరు తెలియజేశారు. మిన్నికంటి గురునాథ శర్మగారు కూడా సితారను హిందూమతం అంటే ద్వేషభావం కల్గిందని అన్నారు. అటువంటి ఆమె రామదాసును విడిపింప జూచిందంటే నమ్మశక్యంగా లేదు. ఒకవేళ ఆమె అటువంటి మత సహనం కల్గిందయితే ఆమెకు కూడా రామదర్శనం అయి ఉండేదేమో. కాని అలా జరుగలేదు. తానీషాకు తెలియకుండా రామదాసుకు శిక్షలు వేయించింది సితారే.

2. ఇంకొక విషయం, మత సహనం, సాధు స్వభావం కల్గిన తానీషా ఒకవేళ రామదాసును విడిపింప జూచినా నరాశ్రయాన్ని తిరస్కరించిన రామదాసు తానీషా కోరిక తిరస్కరించి ఉంటాడు. అయినా ఈ విషయం మరే రామదాసు చరిత్రలోను లేదు. భద్రాద్రి ఆలయాన్ని మహమ్మదీయ పాఠశాలగా మార్చాలని కొందరు మహమ్మదీయులు ప్రయత్నిస్తున్నట్లు, అందుకు అంగీకరిస్తే, రామదాసును చెర విముక్తుని చేయడానికి "అక్కడున్న మహమ్మదీయులు అంగీకరించనున్నట్లుగా కబీరు రామదాసుకు చెప్పడం అసత్యం. 'కబీరు' ప్రస్తావన కల్పితం. పైగా ఈ కథనం కూడా కల్పితమే.

3. రామదాసుతో తానీషా, తన కుమార్తెను ఆతని కుమారునికి ఇచ్చి వివాహం చేసి రాజ్యం అప్పగిస్తానని చెప్పడం కూడా కల్పిత గాథే. అసలు గోల్కొండ రాజ్యం ఔరంగజేబు అధీనంలోకి 1687లో వెళ్లింది. రామదాసు అతని కుమారుడు రామభక్తితో కాలం గడిపారే కాని, రాజ్యం కోసం ప్రాకులాడలేదు. అసలు తహసీల్దారుగా ఈ ప్రభువుల వద్ద చేరడానికే అయిష్టత చూపిన రామదాసు, తన కుమారుని తానీషాకు అల్లుడిగా ఇవ్వగలడా? రాజుల పొత్తునే నిరసించాడు రామదాసు. ఒక వేళ తానీషా విడిపింపజూచినా, రాజాశ్రయాన్ని తిరస్కరించి, రామాశ్రయాన్ని కోరాడు. చివరికి అంతిమ విజయం పొందాడు. ఇది జరిగిన సత్యం.

4. "రాము మొహరీలు" సితార కళ్లకద్దుకోవడం కూడా అసత్యం. ఆమె ఏనాడు హిందువులను ముస్లింలతో సమానంగా చూడలేదు. గోల్కొండ రాజ్య పతనానికి కూడా ఆమె కారణం. హిందూ మంత్రులైన అక్కన్న మాదన్నల హత్యకు కారకురాలు. అటువంటి నీచురాలు రామదాసును రామ మొహరీలను పవిత్రంగా చూసిందంటే అది నమ్మశక్యం కాదు. ఇది అసత్యం. ఇవి ఈ నాటకంలోని పరిశీలించ దగిన అంశాలు. చారిత్రకంగా పరిశీలిస్తే ఎన్నో అసత్యాలు, కల్పితాలు ఇందున్నాయి.

"భక్త రామదాసు అను రామదాసు విజయం" అనే నాటకంలో కీ.శే. కేతవరపు శివ రామశాస్త్రిగారు రామదాసు ఖైదునందు అనుభవించిన శిక్షలు, జైలునుండి విడుదలైన విషయాన్ని గూర్చి ఈ విధంగా తెలియజేశారు. "రంగారావు అనే శిరస్తాదారు ఆధ్వర్యంలో రామదాసుకు జైలునందు శిక్షలు అమలు జరిగినట్లు ఈ నాటకంలో ఉంది. కొరడాలతో కొట్టడం, మండుటెండలో నిలబెట్టడం, ముళ్లపై నడిపించడం, ఇనుపగుండు వీపుపై పెట్టి ఊరంతా మోయిస్తూ త్రిప్పడం వంటి కఠిన శిక్షలు వేశారు. రామదాసు కష్టాలన్నీ, శిక్షలన్నీ రామ మహిమతో సుఖాలుగా మారుతున్నాయి. ఆనందంగా రామనామ స్మరణంతో గడిపాడు". రామదాసును కత్తులపై నడిపింపగా అవి భూమిలోనికి కృంగిపోయాయి. ఉప్పు బియ్యంతో వండిన అన్నం పంచ భక్ష్య పరమాన్నంగా మారుతుంది". ఈ శిక్షలన్నిటి గూర్చి రామదాసు తన కీర్తనలలో ప్రస్తావించాడు. రామదాసు కారాగారంలో ఉండి కఠిన శిక్షలు అనుభవిస్తూండగా ఆయన భార్య శారదాంబ తన భర్తను రక్షించమని రాముని వేడుకొంటుంది. రామదాసును నిప్పుల గుండంలో

నడిపించదలచారు. అందు తొక్కించగా, రామనామం చేస్తూ ఆ గుండంలో నడుస్తాడు రామదాసు. రామదాసు కాళ్లు కాలి ఆ బాధ భరించలేక దుఃఖిస్తూ రాముని ప్రార్థించాడు.

రామదాసు జానకీ మాతను ప్రార్థించాడు. రామదాసు భార్య శారదాంబ, రామదాసు మిత్రుడు వేంకటేశం ఇంట తన బిడ్డతో విరాగియై జీవిస్తున్నది. తానీషాకు స్వప్నంలో రామ లక్ష్మణులు సాక్షాత్కరించి, రామదాసు ఋణం ఆరు లక్షలు తానీషాకిచ్చి ఆతనిని బంధ విముక్తుని, ఋణ విముక్తుని చేశారు. అర్థరాత్రి సమయంలో రామ లక్ష్మణులు తానీషా మందిరానికి వెళ్లారు. ఆరు లక్షలు బంగారు నాణాలు ఇచ్చి రసీదు పుచ్చుకొని వెళ్లారు."[1] "రామదాసు" అనే రామ నారాయణ కవుల నాటకంలో రామదాసు జైలునుండి విముక్తుడైన విషయాన్ని గూర్చి ఈ విధంగా తెలియజేయబడి ఉంది. రామదాసును గూర్చి "రాముడితో సీత రామదాసును రక్షించుమని కోరగా, రామదాసును రక్షించేందుకై, రామ లక్ష్మణులు ఆరు లక్షల పైకం తానీషాకు ఇవ్వదలచారు.

" తానీషా శయన మందిరంలో రామలక్ష్మణులు సాక్షాత్కరించి, రామదాసు పైకం చెల్లించి, తానీషా కడ రసీదు తీసికొని పోయినట్లు కల వచ్చింది తానీషాకు. ఈ విషయం తన భార్యకు చెప్పాడు. మొదట వచ్చిన స్వప్నమే నిజమైంది. ఆ తర్వాత రామ లక్ష్మణులు నిజంగానే తానీషాకు దర్శనమిచ్చి ఆరు లక్షల పైకం చెల్లించి రసీదు తీసుకున్నారు. రామదాసు ఖైదులో తనకు విముక్తి లేదని భావించి విషం తీసుకొని మరణింప యత్నించాడు. అంతట ఆ విషాన్ని నేలపై వేసి రాముడు రామదాసును రక్షించాడు. రసీదు చెరలో వేసి వెళ్లాడు రాముడు. తానీషా రూపంలో రాముడు లక్ష్మణ సమేతుడై రామదాసు వద్దకు వెళ్లి తన పైకం ముట్టినట్లు చెప్పి రసీదు ఇచ్చి వెళ్లాడు. ఆ వచ్చి వెళ్లింది రామ లక్ష్మణులని గ్రహించి ఆనందించాడు రామదాసు."[2]

"గోపన్న" అనే గ్రంథంలో గరిమెళ్ళ సత్య గోదావరి శర్మగారు రామదాసు కారాగారంలో అనుభవించిన బాధలు, ఆ తర్వాత విడుదలైన విషయం గూర్చి ఈ విధంగా తెలియజేశాడు. "తానీషా ఆజ్ఞానుసారం ఖైదులో ఉండి ఎన్నో బాధలు అనుభవిస్తూ, ఆ రాముని ప్రార్థిస్తూ కాలం గడిపాడు. రామానుగ్రహం కోసం ఎదురుచూశాడు. కొరడాలతో కొట్టడం, ముండ్లపై నడిపించడం, ఊరంతా ఇనుప గుండు వీపుపై పెట్టి తిప్పడం, స్తంభానికి కట్టి కొట్టడం, నిప్పులపై నడిపించడం వంటి ఎన్నో కఠిన శిక్షలు తానాషా జవాన్లు వేశారు. అయినా చలించలేదు. ఏనాటికైనా తనను రాముడే కాపాడగలడని, ఆరు లక్షల పైకం తానీషాకు ఇవ్వగలడన్న విశ్వాసంతో భక్తితో రామనామ స్మరణం చేస్తూ జీవించాడు. రాముడు తనను ఇక కాపాడ లేడేమోనని సీతమ్మ తల్లికి మొర పెట్టుకున్నాడు. చివరికి విషం తీసుకొని మరణింప జూచాడు. అంతట రాముడు మొర విన్నాడు. రామ లక్ష్మణులు కలసి రామదాసును రక్షించడానికి బయలు దేరారు. 12 సంవత్సరాల అనంతరం, రామదాసు దేవాలయ నిర్మాణానికై ఖర్చు చేసిన ప్రభుత్వ ధనం ఆరు లక్షలు తీసుకొని తానీషా కడకు అదేరోజు రాత్రి రామ లక్ష్మణులు రామదాసు జవానులుగా వచ్చి తానీషాకు ఇచ్చారు. వారు భద్రాచలం నుండి వచ్చినట్లు, రామదాసు వారిని పంపినట్లు తానీషాకు చెప్పారు. తానీషాకు ఆరు లక్షల పైకం ఇచ్చి రసీదు పుచ్చుకొన్నారు రామ లక్ష్మణులు.

"రామదాసు దేవాలయ నిర్మాణానికై ఆ ధనం ఖర్చు చేయగా, అతనిని శిక్షించడం సబబు కాదని తానీషా హెచ్చరించగా, అతడు తన తప్పు తెలుసుకొని వారిని క్షమాపణ కోరాడు. భద్రాచలం అంతా రామాలయం కొరకై దానంగా ఇస్తానని చెప్పాడు తానీషా. రాముని భార్య సీతమ్మ కూడా అచ్చటికి వచ్చింది. అంతట తెల్లవారుఝామున వారు అంతర్థానమైనారు". ఇందులో రామదాసుకు రాముడు ఎంతకూ

1. భక్త రామదాసు అను రామదాసు విజయము - కీ.శే. కేతవరపు శివరామశాస్త్రి గారు - పంచమ, షష్ఠాంకము 1924.

2. రామదాసు - రామ నారాయణ కవులు - పంచమాంకము.

దర్శనమీయలేదని విసుగు వచ్చి విషం త్రాగి మరణించదలచి, విష పాత్ర సిద్ధం చేసుకున్నాడు. అంతలో రామ లక్ష్మణులు వచ్చి ఆ విషపాత్రను దొర్లించారు. గోపన్న చేతి సంకెళ్ళు తొలగించారు. అది అంతా స్వప్నంగా భావించాడు. ఈ "రామదాసు చరిత్రం"లో రామదాసును ఖైదునందుంచింది, విడుదల చేసింది అబుల్ హసన్ తానీషాయే అని వ్రాశారు రచయిత. కాని రామదాసును అబ్దుల్లా కుతుబ్షా ఖైదునందుంచాడు. అబుల్ హసన్ విడుదల చేశాడు.

నాదెండ్ల పురుషోత్తమ కవి రచించిన హిందుస్థానీ నాటకం 'రామదాసు చరిత్ర'లో కూడా పై కథే ఉంది. 'రామదాసు చరిత్రము' అనే కావ్యంలో చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు తెలియజేసిన విషయాలు ఇవి.[1] "రామదాసును గోల్కొండ ఖైదులో తానీషా బంధించాడు. రామదాసు బందిఖానాలో అనేకమైన బాధలు అనుభవించాడు. రాముడికి, సీతకు తన బాధలు చెప్పుకుంటూ రామనామ స్మరణం చేస్తాడు. సీతాదేవి, రామదాసును కాపాడమనగా రాముడు సీతతో, రామదాసు తానీషాల పూర్వజన్మ వృత్తాంతాన్ని తెలియజేస్తాడు. రామదాసు పూర్వజన్మ కర్మఫలాన్ని అనుభవించాడని, అందుకే ఖైదులో ఉండి 12 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించినట్లుగా చెప్తాడు. ఆ కర్మ ఫలం తీరింది. కావున రాముడు తాను అతని ఋణం తీర్చి చెర విముక్తుని చేస్తానని సీతతో చెప్పాడు. ఆ తర్వాత తానీషా కడకు రామ లక్ష్మణులు వచ్చి తానీషాను అర్ధరాత్రమున మేల్కొలిపి 6 లక్షల వరహాలు ధనం ఇచ్చి రసీదు పుచ్చుకొని వెళ్ళి, ఆ రసీదు రామదాసున్న ఖైదుకు వెళ్లి అతని వద్ద ఉంచి, రామదాసు త్రాగజూచిన విషపాత్రను దొర్లించి అంతర్ధానమైనాడు.

రామదాసు తన కడకు వచ్చి వెళ్ళింది సామాన్యులు కారని, వారు రామ లక్ష్మణులే అని భావించి, వారినుద్దేశించి మేల్కొలుపులు పాడాడు. తన బాధను రాముడే తీర్చాడని ఆనందిస్తాడు. తెల్లవారగానే తానీషా ఆ రాత్రి తన వద్దకు వచ్చింది రామ లక్ష్మణులన్న విషయం అక్కన్న, మాదన్నలకు చెప్పాడు. తానీషా గోపన్నను క్షమాపణ కోరి, చెర విముక్తుని గావించాడు". ఇదీ ఈ కావ్యంలో చెప్పబడిన విషయం.

"శ్రీరామదాసు నాటకం"నందు కేశిరాజు వేంకట సుబ్బారాయ కవిగారు ఈ విధంగా తెలియజేశారు. "రామదాసు ఖైదునందున్న కాలంలో 12 సంవత్సరాలు గోల్కొండ జవానుల చేత వివిధ రకాల బాధలనుభవించాడు. పావుసేరు బియ్యం, పావుసేరు ఉప్పు కలిపి వండిన అన్నం ఆహారంగా పెట్టేవారు. కొరడాలతో కొట్టారు. వీపుపై ఇనుపగుండుంచి ఊరంతా త్రిప్పారు. ముళ్లపై నడిపించారు. నిప్పులపై నడిపించారు. ఖడ్గాలపై రామదాసును నడిపించబోగా రామ మహిమతో ఆ కత్తులు భూమిలోకి కృంగిపోయాయి. ఇలా తాను ఎన్నో బాధలు పడుతూ, తన కర్మకు బాధ పడుతూ, ఎన్నోమార్లు రాముని దూషించేవాడు. మరల దుఃఖించి రాముని ప్రార్థించేవాడు. ఇలా 12 సం॥లు గడిచిన అనంతరం తాను సీతమ్మకు మొర పెట్టుకోగా, సీతాదేవి రామునికి చెప్పగా విని రామదాసును కాపాడటానికై రాముడు లక్ష్మణ సమేతుడై తానీషా ఉన్న శయన మందిరానికి వచ్చి, ఒక భటుని వేషంలో వచ్చి రామదాసుల బంటులుగా పరిచయం చేసికొన్నారు. భద్రాచలం నుండి తాము వచ్చినట్లు చెప్పారు.

తానాషా రామదాసు చెల్లించవలసిన బాకీ ఆరు లక్షలు ధనం, వడ్డీ నాలుగు లక్షలతో కలిపి 10 లక్షలు చెల్లించారు. రసీదు పుచ్చుకున్నారు. తానీషా రూపంలో రామదాసు వద్దకు వెళ్లి నీ బాకీ అంతా నాకు చేరిందని చెప్పి రశీదు రామదాసుకు ఇచ్చి వెళ్ళాడు రాముడు. ఇదంతా మాయగా తోచింది రామదాసుకు. రాముడే తనను కాపాడ వచ్చెనని భావించి రామదాసు రాముని స్తుతించాడు. ఆ తర్వాత రోజు ఉదయం తానీషా జరిగింది గమనించి, అది కల కాదని నిజమని గ్రహించి, రామదాసు అపారమైన రామభక్తిని కొనియాడి, పశ్చాత్తాపుడై రామదాసు వద్దకు వెళ్లి ఆయనను కారాగారం నుండి విడుదల చేసి

1. రామదాసు చరిత్రము (కావ్యం-పంచమాశ్వాసం), చల్లా పిచ్చయ్య శాస్త్రి.

సాదరంగా ఆయనను సభకు ఆహ్వానించి సన్మానించాడు.

యాదవదాసు రచించిన రామదాసు చరిత్రము యక్షగానంలో కవి ఈ విధంగా రామదాసు అనుభవించిన శిక్షలగూర్చి, రామదాసు ఖైదునుండి విడుదలైన విషయం గూర్చి తెలియజేశారు.

"ఎటుల రక్షింతువో రామా ! నే కుటిలమెరుగను సార్వభౌమా ! [1]
పటుతరంబుగ నన్ను బందిఖానకిపుడు - పదపదమనుచున్నరయ్య తానీషా ॥"

ఇందున్న ఈ కీర్తనలోని పై వాక్యాల వలన రామదాసును 'తానీషా' బంధించాడని విశదమౌతుంది. రామాలయ నిర్మాణం గావించినందుకు ఆరు లక్షలు పైకం ప్రభుత్వ ధనం ఉపయోగించిన నేరానికి తానీషా రామదాసును ఖైదులో ఉంచి, కఠిన శిక్షలకు గురిచేశాడు. ఈ శిక్షల గూర్చి "పాదుషాకు చోపుదారునికి జరిగిన సంవాదం" లో తెలియజేయబడి ఉంది.

పాదుషా : ఏమి చేసినారు తహసీలు ఎట్లు గడిపినారు
స్వామి ద్రోహుడు గోపన్నను యిక చంపకుంచినారు ॥

చోపుదారుడు : విరచి కట్టినాము శిలలు విసుమిక శిరమందు
బరువుగ నుంచి తాడనంబుల బహుగజేసినాము ॥

పాదుషా : యిట్లు చేసినారా దేనికి యివ్వడం పైకమును
కల్ల మాటలు మాతో బలికెరు కనుక మిమ్ము ద్రుంతు ॥

చోపుదారుడు : ఇనుప సంకెలలును వేసి వీధులు దిప్పినాము
అనుమానింపక కొరడాలతోటి గొట్టినాము ॥

పాదుషా : ఉత్తమాటలన్నీ మీరు ఊరక బొంకెదరు
కత్తితొ మిమ్ముల గొట్టెద చూడు కల్లలాడబోకు ॥

చోపుదారుడు : శిలలు గాలబెట్టి మేము శేలుగ దొర్లించి
తలగుచు నుండె కుంపట్లన్నీ శిరము నుంచినాము ॥

పాదుషా : దేహము కాలిందా యిట్లు చేసిన పిమ్మటను
బాహుబలములను నెందుబోయెను బాగజెప్పరోయి ॥

చోపుదారుడు : చెప్పెడిదేమికను బాగుగా చేతులు బిగియించి
తప్పక భూమిలో పాతి దీపము తలపైయుంచినాము ॥ . . . . .

ఇలా ఎన్నో బాధలు పెట్టినా కూడా ఆ రామదాసు -

చోపుదారుడు : రామరామయనుచు నుండు రంపాలతొ కోసినను
దోమల నల్లుల బందిఖానాలో తోలియుంచినాము ॥

చోపుదారుడు : రక్తమాంసములు గారు రాత్రిం బవలును
ఎప్పడు శ్రీహరి యనుచు నమ్మిన యతని రాతపోవు ॥

చోపుదారుడు : యెంపజేసినాను ఊరకయెపుడు రామయనుచు
వంతముతోడుత భజనలు జేయును పాప రహితుడయ్య ॥

పాదుషా : యెట్లు చేతునేను పైకము యెట్లు యిచ్చువాడు
కల్ల మాటలు బలికిన గాని కాను యివ్వబోడు ॥

1. యాదవదాసు - రామదాసు చరిత్రము - (యక్షగానము) పుట 25.

చోపుదారుడు : వేదన బెట్టి మేము చాలా వేసారితిమయ్య
పృథివిలోపల యిటువలె మనుజునెందు జూడమయ్య ॥ ....

చోపుదారుడు : పోదాము రావయ్య మనము పొలుపు మీరగానూ.
యాదవదాసుని ఏలిన భద్రాద్రీశుండె రాగలడూ ॥[1]

ఈ సంభాషణ ద్వారా రామదాసును తానీషా జవానులు ఎన్ని విధాలా హింసించినా, పైకం తానే స్వయంగా తానీషాకు చెల్లించే ఉద్దేశ్యంలో లేకపోవడమే గాక, నిరంతరం వారు పెట్టే కష్టాలు అనుభవిస్తూ, రామనామ స్మరణం చేస్తూ జైలులో గడిపాడని వ్యక్తమవుతుంది. తానీషా మరియు రామదాసుల మధ్య సంభాషణలో రామదాసుకు రాముడిపై ఎంతటి ప్రగాఢ విశ్వాసం ఉందో స్పష్టమౌతుంది.

**తానీషా - పద్యం**

గీ ॥ వినర రామదాస విరచి కట్టి కొట్టి
సకల బాధల జేసి చంపినాను
ద్రవ్యమీయ నంచు తన క్రింద జేసేవు
యింత కఠిన మతియు నెందు జూడ ॥[2]

**రామదాసు - పద్యం**

తానీషా అడిగిన ప్రశ్నకు ఈవిధంగా రామదాసు సమాధానమిచ్చాడు.

"నీదు ద్రవ్యమంతనే దినలేదయ్య
ద్రవ్య దాత హరియె ధరణి యందు
ఏమి కొట్టిన గాని నేనేమి సేతును
చేతనయిన నీవు పుచ్చుకొమ్ము ॥[3]

ఈ పై పద్యం వలన "రామదాసు - తాను రామ కైంకర్యానికే ఆరు లక్షల పైకం వ్యయం చేశానని, అందుకే రాముడే ఆ ధనం తెచ్చి తానీషాకు చెల్లించగలడన్న దృఢ విశ్వాసంతో ఉన్నాడు. అందుకే ఎన్ని శిక్షలు విధించినా రామ స్మరణంతో భరిస్తూ గడిపాడు. రామదాసు ఈ విధంగా రాముని ప్రార్థించాడు. అయినా మొర వినలేదు రాముడు. చివరికి విసిగిపోయి సీతమ్మను ప్రార్థించాడు. నీవైనా రామునకు చెప్పవలసింది అని ఈ విధంగా అంటున్నాడు.

గీ॥ దయయు సత్యము లేదాయె దాశరథికి
ఘడియకు తహసీలు ఘనములాయె
విషము ద్రావైన ప్రాణముల్ విడువవలెను
తాళజాలను చెర నాకు చాలగలిగె.[4]

కీర్తన : నీచేతను గాకపోతే - సీతామాతకు జెప్ప మేలైతే
నీచాత్మకుల ద్రుంచి నేలితెముల్లె - దాచినది బోయెనా ధరణీశ యేమిరా । ....
సీతమ్మ నీదు పుత్రుని ప్రీతితో తహసీలు జేయ జలరుహ నేత్రి
యే తీరు జూచు చున్నావు - నాథునితో జెప్పవమ్మా నాదు మొర వేగా ॥[5]

గీ ॥ కన్నతల్లివి నీవింత కఠినమైతే
యెవ్వరున్నారు సీత నీ కెరుకలేద

1,2,3. రామదాసు చరిత్రము - యాదవదాసు ( యక్షగానం) పుట 29 - 30.

4,5. " " పుట 37.

తండ్రులిట్లయితే తల్లికి దయను లేద
ఇద్దరొకటైతె నా బుద్ధి కేమి గలదు ॥[1]

అని ఈ విధంగా సీతమ్మను ప్రార్థించాడు. అమ్మా! సీతమ్మ తల్లీ ! నేను ఇంక జీవించలేను. 12 సంవత్సరాలుగా నన్ను ఈ ఖైదులో ఉంచారు. నేను ఇక బ్రతుకలేను. విషం త్రాగి మరణిస్తాను. లేకుంటే రాముడిని వచ్చి నా ఋణం తీర్చమని చెప్పమ్మా ! అని సీతను రామదాసు కోరినాడు. రామదాసు 12 సం॥లు ఖైదులో ఉన్నాడని ఈ క్రింది పద్యంలో చెప్పబడి ఉంది.

**పంచచామరము**

"చంద్ర వదన సీత యిటకు చంచలాక్షి రాగదే
యింద్రనీల కురులు మెరయ నీదు విభుని గూడియున్
పదియు రెండు వత్సరములు బందిఖానసుంచుటా
ముదమాయెను నీకు భర్తకు కదలకుంటి రేమికన్ "[2]

అని 12 సం॥లుగా ఖైదులో ఉన్నట్లు స్పష్టమవుతుంది. 12 సం॥లు తర్వాత కూడా రాముడు ఇంకా రాలేదని సీతమ్మను మొరలిడగా, ఆమె రామునితో, రామదాసు బాధను గూర్చి తెలియజేసి, తన భక్తుడు రామదాసును రక్షిచమని, పైకం తానీషా కిమ్మని చెప్తుంది. "రామదాసు" తాను పూర్వజన్మ కర్మ ఫలాన్ని ఈ జన్మలో అనుభవించాడని చెప్పి, అతని పూర్వ జన్మ గాథను రాముడు సీతకు ఈవిధంగా తెలియజేశాడు.

**5.6. రామదాసు పూర్వ జన్మ గాథ :-**

"మునుపటి జన్మంబున నీ మనుజుడు నొక చిలుకను దెచ్చి మమతతో బెంచెన్
ఘన పంజరమున - తనమది యుప్పొంగి ఖైదుమి - తాజేసి లలనా పన్నెండేండ్లు
రాజీవనయనా - రాజీవ నేత్రి శ్రీరామ రామ యని తేజోవంతుని పేరు తేట పడగ నేర్పె."[3]

అని మరియు, సీతతో రాముడిలా అన్నాడు.

" సఖియరో విను మాసీతా - యొక వత్సర మున్నదింక వసరుగ వాడున్.
అకలంక చిత్తుడౌనే - నొక వేషము వేసి వాని యుపమున బ్రోతు
తత్తరమేల కృప తోడగాతు
చపలత్వమును వదలి యపరాధములు - లేక తపము చేయుచున్నాడిభరాజ గమనారో -"[4]

ఇంకా ఒక సంవత్సర కాలం ఆతని కర్మఫలం ఉంది. వానిని 12 ఏండ్లు పూర్తిగా ఖైదు ఉంచి కర్మఫల మనుభవించేలా చేశాను. నీ కోరిక ప్రకారం రామదాసును కాపాడగలను. అని అంటాడు. రామదాసు పూర్వజన్మలో 12 సంవత్సరాల పాటు ఒక చిలుకను పంజరంలో బంధించి 'రామనామం' పలికించాడు. ప్రేమతో పెంచాడు. కానీ ఒక నోరులేని జీవిని బలవంతంగా ఒక పంజరంలో బంధించి, స్వేచ్ఛ హరించి రామనామం పలికించడం పాపం. అందుకే ఆ నేరానికి ఈ జన్మలో రామదాసుకు 12 సంవత్సరాలు రామనామం జపిస్తూ ఖైదులో గడిపాడు. ఆ తర్వాత తన పాప ఫలం తీరిన తర్వాత విముక్తుడైనాడు.

**5.7. రామలక్ష్మణులను చోరులడ్డగించుట : రామలక్ష్మణులు తానీషాకు 6 లక్షల పైకం ఇచ్చుట :**

రామ లక్ష్మణులు రామదాసును చెరనుండి విడిపించడానికి, ఆరు లక్షలు ద్రవ్యం తీసుకుని సామాన్య మానవుల వలె తానీషా ఉండే అంతఃపురం వైపు వస్తుంటే 60 మంది చోరులు ఆ రాత్రి సమయంలో వారిని అడ్డగించారు. అంతట చోరులతో రాముడు, "మీరు ఏమి కోరినా ఇస్తాము. ఎంతద్రవ్యం కావాలన్నా ఇస్తాము." అని అన్నాడు.

1,2 . యాదవదాసు - రామదాసు చరిత్రము (యక్షగానం) పుట 38.

3,4. " " పుట 39 - 40.

అంత ఆ చోరులు వారు సామాన్యులు కారని, సాక్షాత్తు శ్రీ రామ లక్ష్మణులని భావించి తమ తప్పు తెలుసుకొని వారి పాదాలపై బడి క్షమించమని కోరి, రక్షించమని వేడుకున్నారు. ఆ తర్వాత ఆ చోరులు ఈ విధంగా అన్నారు.

"ద్రవ్యమెందుకు శ్రీరామ ధరణి నాథ
నీదు పదములె గతి మాకు నీరజాక్ష
దోషములు దొలగె మీ పాద దర్శనమున
కరుణతో మమ్ము రక్షించు కమలనాభా"[1]

ఆ సమయంబున రామచంద్రుడు చోరులకు వరంబిచ్చిన తక్షణంబున చోరులు దేహంబు విడిచి వైకుంఠంబున ప్రవేశించిరంత"[2]

ఆ చోరులు వైకుంఠానికి వెళ్ళినట్లు చెప్పాడు కవి. రాముడు భక్తవత్సలుడని, భక్తులు కోరితే ఏదైనా ఇస్తాడని, వారిని తనలో చేర్చుకుంటాడని చెప్పడానికి, రామదాసును, రాముడు కరుణించి ధనం తెచ్చి తానాషాకిచ్చి, అతనిని చెర విముక్తుని చేసి, చివరికి రాముడు సాయుజ్యమిచ్చినట్లు చెప్పడానికి ఈ కథను ఒక ఉదాహరణగా కల్పించాడు యాదవదాసు. అంతేకాని ఇది ఏ ఇతర చారిత్రక గ్రంథంలోను కనబడదు. ఈ చోరుల సంఘటన మరే రామదాసు చరిత్రములోను ప్రస్తావింపబడలేదు.

రామ లక్ష్మణులు తానీషా కడకు వెళ్ళి తానీషాను నిద్ర మేల్కొల్పి, తాము రామదాసు మనుషులమని తెలియజేశారు. "రామ లక్ష్మణులకు, తానీషాకు జరిగిన సంవాదం ఈ విధంగా ఉంది.

రామ లక్ష్మణులు :- తానాషాకిచ్చిన సమాధానమిది వినుము తానీషా పాదుషాగారు। ఎవరంచు మీరు ఘనముగ మమ్మడిగెదారు। ఘన శాంతవంతుడు గలడు రామదాసు। వినుమిక వారికి యింటి వారము మేము ॥

పాదుషా :- ఎన్ని తరముల నుండి మీరు వారివద్ద మన్నికతోను కొలువై యున్నారు అన్ని మాటలు మాకు వున్న రీతిగను। నమ్మతితోడుత సరగున జెప్పడి ॥

రామ లక్ష్మణులు :- తాత తండ్రుల నుండి మేము। స్వామి బుద్ధి చేత ప్రీతితో కొలువై యున్నాము। రాత్రింబవలును రామ రామాయని। ఖ్యాతిగ నున్నాడు ఘనుండు నాతండు॥

పాదుషా : ఏమిజీతము చేసినాడు ఆరామదాసుడు।
ఏమి జీవనమిచ్చినాడు।
నేమము తోడుతనెప్పుడు మీరలు। గ్రామములోపల కదలక నున్నారు।

రామలక్ష్మణులు: మోదముతోను వినవయ్యా తానీషగారు ప్రసాదానికె కుదిరినాము- వాదభేదములను వరుసతోజేయుము। సాధులవలెమేము చక్కగ నుందుము॥

పాదుషా: ఏమి కులము వారుమీరు। నేడిద్దరైతే ఏ వరుస గలవారు। సోమసూర్యుల శోభలు గుల్కెడు। జెప్పుడుసత్యము నాకు వేగమే॥

రామలక్ష్మణులు: రామోజీ లక్ష్మోజీ యను పేర్లు మేమిద్దరము।, ప్రేమతో అన్నదమ్ములము। భీమ పరాక్రమ బింకముతోడుత। నామము నణచెను నా జిహ్వలోపల ॥

పాదుషా :- ఎన్నడు మిమ్ము జూడలేదు। మీరే నగరమందున్నారొ ! ఎక్కడ నీ జగమందు మన్ననతోడుత మాకు జెప్పడి। కన్నుల పండువుగ గనుగొంటి నిప్పడు ॥

1,2 . రామదాసు చరిత్రము (యక్షగానం) - యాదవదాసు.

రామ లక్ష్మణులు :- వరభద్రాచలమందు మేము వసియించినాము ! కరుణతో రామదాసు మురయుచు నౌకరి బిరబిరనుండెను । అరమర లేకను అవధరించుము విను ॥

పాదుషా :- పది రెండేండ్లాయెను । వేగ రామదాసు ఖైదులోనున్నాడు ! బాగా అదిరిపడకను అట బోయె తిరిగి । కుదురుగ పలుకుబడి గుణవంతులిక మీరు ॥

రామ లక్ష్మణులు :- భేటికి నిలిచి వచ్చినాము । నారు లక్షలు నేటుగ యిచ్చి పొయ్యెదము నోటి మా నూటిగ పైకము । పాటికిచ్చెదము కనుమిక వేగమే ॥[1]

రామ లక్ష్మణులు రామోజీ, లక్ష్మోజీ అన్న పేర్లతో రామదాసు సేవకుల వలె ఆయన పంపగా భద్ర నుండి వచ్చామని తానీషాకు తెలియజేశారు. ఆరు లక్షల పైకం తానాషాకు ఇవ్వడానికి వచ్చారు మ

రామ లక్ష్మణులు :- నీకు సేవలు జేసెటివారము । మేము గాము జోక తోడుత రామదాసుడు । తో వినుము"[2] అని రామదాసు పంపంగా మేము వచ్చామని రామ లక్ష్మణులు తానీషాతో అన్నారు. రామ పరమ భక్తుడనీ, ఆతనిని ఋణ విముక్తుని చేయ వచ్చామని, మీ పైకం ఆరు లక్షలు ఇవ్వదలచామ ఇలా అన్నారు.

రామ లక్ష్మణులు :- ఆరు లక్షల వరహాల్ అందించినాము - యింపుతోడుత రసీదు మాకు యివ్వర

పాదుషా :- కనక మయము మీరు యెక్కడ గణుతి జేసినారు - ఘనముగ చిత్రాకారము దోచెను
జూచితిని ॥"[3]

రసీదు తీసుకుని ఆరులక్షలను చెల్లించి రామలక్ష్మణులు వెళ్లారు. తానీషా, ఆ వచ్చింది రామలక్ష్మ ఆలస్యంగా తెలుసుకున్నాడు. ఇదంతా స్వప్నంలోనే జరిగింది.

వ॥ "అంత రామలక్ష్మణులు అదృశ్యులైన తదుపరి తానీషా మేల్కాంచి యాశ్చర్యం యేమనుచున్నాడు॥

గీ॥ ఎంత స్వప్నంబు కంటినేనిపుడు వేగ - దైవ రూపులు శ్రీరామ లక్ష్మణులును
నారు లక్షల వరహాలు నందముగను - ఇచ్చిపోయిరి నేనింత ఎరుగనైతి ॥"[4]

"రామలక్ష్మణులు తానీషా కడకు వచ్చి ఆరు లక్షలు బంగారు నాణెములు ఇచ్చి రసీదు తీసు వెళ్లినదంతా" స్వప్నంలో జరిగింది గా భావించాడు. ఆ వచ్చింది రామలక్ష్మణులని గ్రహించలేకపోయిన వారి మాయకు ఆశ్చర్యచకితుడైనాడు. ఆ వచ్చినవారు సాక్షాత్తు రామలక్ష్మణులని తర్వాత ఉదయాననే మే అనంతరం గ్రహించి, ఆతడు వారిని సామాన్యులుగా భావించినందుకు పశ్చాత్తాప పడినాడు. ఆ జరిగిన విషయమంతా అక్కన్న, మాదన్నలతో తానీషా వివరంగా చెప్పాడు. అప్పుడు వారు "తానాషా ! ధన్యుడవు. ఆ వచ్చింది సాక్షాత్తు శ్రీరామ లక్ష్మణులే. వారి అనుగ్రహం పొంది , వారి భక్తుడవైనావు" అన్నారు. అంతట తానీషా ఈ విధంగా బాధ పడుతున్నాడు. రామదాసును ఇంతటి రామభక్తుడని భావిం వారిని ఎన్నో రీతుల 12 సం॥లుగా బాధ పెట్టానని క్షమాపణ కోరడానికి రామదాసు వద్దకు వెళ్ళాడు

రామ లక్ష్మణులు రామదాసున్న బందిఖానాకు వచ్చేసరికి ఆ సమయమందు రామదాసు త రామానుగ్రహం కలుగలేదని భావించి దుఃఖించి, మరణించదలచి కాలకూట విషం ఉన్న గిన్నెను చే ఉంచుకొని ఈ విధంగా అంటున్నాడు.

---

1. రామదాసు చరిత్రము (యక్షగానం) - యాదవదాసు పుట 49-50.
2. " " " పుట 51.
3. " " " పుట 52.
4. " " " పుట 53.

గీ॥ ఇదిగో చూడు రామ యినకులాంబుధి సోమ
విషము త్రాగుదిపుడు వీర వరద కరుణ
జూడుమిపుడు కడు సంతసంబొను
దోష రహిత నీకు దోషమయ్యు॥[1]

ఈ విధంగా రామదాసు విషం తీసుకొనేందుకు సన్నద్ధుడౌతుండగా

వ॥ ఆ సమయంబున రామ లక్ష్మణులు బందిఖానా ద్వారంబు కడకు వేంచేసి దరవాజ రంధ్రంబునుండి చూడగా రామదాసును, విషపు గిన్నెను చూసి లక్ష్మణునితో రాఘవుడు యేమనుచున్నాడు."[2]

చూడుము లక్ష్మణుండ కడు చోద్యములాయెను రామదాసు తా
నేడు విషమ్ము త్రాగుటకు నిశ్చితుడయ్యెను యేమి జేయుదున్
వాడిపుడెరుగ కుండ భువి వంచుమి పాత్రయు దాటి పోవలెన్
కీడు దొలంగి పోవు ఘన కీర్తియు పెంపును బొందు లక్ష్మణా ॥[3]

వ ॥ అనిన లక్ష్మణుని మాయచే రామదాసు చేతనున్న విషపు గిన్నె క్రింద పడినది.[4] "రామదాసు తన చేతిలో ఉన్న విషపు గిన్నె క్రిందపడిపోగా దుఃఖిస్తూ మరణించేందకు కూడా ప్రాప్తం ఎందుకు లేదు నాకు" అని బాధపడ్డాడు. రాముని ప్రార్థించాడు. రామదాసు తాను ధనం తానీషాకు కట్టలేక దుఃఖిస్తూ బాధలను భరించాడు. అంతట రాముడు రామదాసున్న కారాగృహంలో "తానాషా కడ పుచ్చుకున్న రసీదును రామదాసు దేవతార్చన మీద పారవేసి వారు భద్రాద్రికి వెళ్ళి సీతాదేవితో తాము గోల్కొండ వెళ్ళి తానీషాకు ఆరు లక్షల పైకం ఇచ్చి రామదాసు కడ రసీదు ఉంచి వచ్చామని అంటారు రామ లక్ష్మణులు.

రామదాసు కడకు తానాషా వెళ్ళి, రామ లక్ష్మణులు వచ్చి ఆరు లక్షల పైకం ఇచ్చి వెళ్ళి రసీదు పుచ్చుకొని వెళ్ళిన విషయం తెలియజేసి, రామదాసు రామభక్తికి మెచ్చుకొని గౌరవించాడు. అక్కన్న మాదన్నలు కూడా రామదాసును గౌరవించారు. ఆ తర్వాత, రామదాసును చెర నుండి విముక్తుని గావించినాడు తానీషా. యాదవదాసు రచించిన రామదాసు చరిత్రము యక్షగానం లోని గాథ ఇది.

రామదాసు, తానీషాకు రామదర్శనం అయినందుకు రామానుగ్రహం తానీషా పొందినందుకు ఆతనిని అభినందించాడు. "మహమ్మదీయుడైనా తానీషా రామానుగ్రహం పొందాడు. రామదాసుకు 12 ఏండ్లుగా రామును పూజించినా ఆతడికి రామదర్శనం కాలేదు. కానీ తానీషాకు, ఏనాడు రామనామం జపించకున్నా రామానుగ్రహం కల్గి, ఆయని దర్శన భాగ్యం పొంది, ఆయన దయకు పాత్రుడైనాడు. రామానుగ్రహం తానీషాకు కల్గడానికి కూడా, ఆతనికి పూర్వజన్మ గాథను కల్పించినారు రామదాసు చరిత్ర గ్రంథ కర్తలు.

### 5.8. తానీషా పూర్వ జన్మ వృత్తాంతం :

రాముడు ఈ కథను సీతాదేవికి తెలియజేసినట్లు అనేక రామదాసు చరిత్రములలో ఉంది. "గత జన్మమున తానీషా గొప్ప శివభక్తుడు. ప్రతి దినము గంగా జలముతో శివుని అభిషేకించెడివాడు. ఒక్క సంవత్సరమట్లు పూజించి నియమితుడై పొరపాటు పడి యొక్క రోజు ముందుగనే సంవత్సరం నిండినదని తలచి, శివుడు దర్శనమియ్యలేదని క్రోధముబూని, గంగా జలఘటమును శివలింగముపై విసరెను. అంత శివుడు ప్రత్యక్షమయి, 'ఒక దినమాగలేక తొందరపడి దుష్కార్యమొనరించితివి. మ్లేచ్ఛ ప్రభువుగ బుట్టుము. నీకపుడు రాముడు దర్శనము ఇచ్చును. అంత నీకునా సామీప్య భాగ్యము గలుగునని చెప్పెను. శివుని శాప కారణమున తానీషాకు దర్శనమిచ్చితినని రాముడు సీతతో చెప్పెను. ఇది సత్యమో, కాదో తెలియదు. తానీషాకు రామదర్శనం కావడం మాత్రం నిజం.[5]

1,2,3,4 . రామదాసు చరిత్రము (యక్షగానం) - యాదవదాసు, పుట 56.

5. సంగీత మహర్షులు - వాగ్గేయకారులు - మొదటి భాగం - నారుమంచి సుబ్బారావు . పుట 44.

అని నారుమంచి సుబ్బారావుగారు తానీషా పూర్వజన్మ గాథను గూర్చి తెలియజేశారు.

"హిస్టరీ ఆఫ్ ది కుతుబ్‌షాహీస్" అనే ఆంగ్ల చారిత్రక గ్రంథంలో హెచ్. కె. షెర్వానీ రామదాసు ఖైదు నుండి విడుదలైన విషయాన్ని గూర్చి "కృష్ణస్వామి అయ్యంగార్" తెలియజేసిన అంశాలను ఉదహరించారు.

On the discovery of this he was arrested, brought to Haidarabad and interned in Golkonda fort. Krishnaswamy Aiyangar says that,

" The story has it that a miraculous payment of the sum was made and a receipt obtained, by two men calling themselves, Rama and Lakshmana, peons of the Bhadrachalam circar, who came overnight, paid the balance demanded in cash, and obtained a receipt there and then of the padishah himself."[1]

ఇది ఒక అద్భుతమైన, మాయతో కూడిన కథనంగాతోస్తుంది. "రామదాసుకు సంబంధించిన ఈ గాథ ఒక మాహాత్మ్యంతో కూడిందిగా తోస్తుంది. రామదాసు రామాలయ నిర్మాణానికి వ్యయం చేసిన ఆరు లక్షల ప్రభుత్వ ధనం తానీషాకు ఇవ్వడానికి ఇరువురు వ్యక్తులు భద్రాచలం నుండి వచ్చి, తమ పేర్లు రామ, లక్ష్మణులని తానీషాకు పరిచయం చేసి ఆ ధనం తానీషాకు చెల్లించి ఆ రాత్రి సమయంలో రసీదు తీసుకుని వెళ్లారు. రామదాసును చెర విముక్తుని చేశారు. తానాషా రామదాసుకు రసీదు ఇవ్వడానికి వెళ్తే అక్కడ రామదాసు వద్ద మరో రసీదు ఉండడం, తానీషాకు ఆశ్చర్యం కల్గిస్తుంది." అని శ్రీకృష్ణస్వామి అయ్యంగార్ రామదాసుకు రాముని యెడ గల భక్తిని కొనియాడారు.

"భద్రాచల రామదాసు చరిత్రము" అనే యక్షగానంలో తిరుక్కడయూరి కృష్ణదాసు గారు, రామదాసు ఖైదునుండి విడుదలైన విషయాన్ని, తానీషాకు రామ లక్ష్మణులు దర్శనమిచ్చిన విషయాన్ని ఈ విధంగా తెలియజేశారు.[2] రామదాసు రామదర్శనం కానందున 12 సం॥లుగా ఖైదులో ఉండి జైలులో దుర్భరమైన వేదనలు అనుభవిస్తూ చివరికి విసిగిపోయి "విషం గ్రహించి మరణింపబోవగా ఆ సమయంలో రామలక్ష్మణులు అక్కడకు వచ్చి ఆ విషపాత్ర దొర్లించారు. ఆ పాత్ర బోర్ల పడింది. ఇది చూసిన రామదాసు ఆ శ్రీరాముని మహిమయే, మాయయే అని తలంచి, రామా ! నీ మహిమ ఎవ్వరికి తెలియతరం అని ఈ విధంగా ఆ రాముని మహిమను గూర్చి తెలియజేస్తున్నాడు.

**కల్యాణి - అట**

"ఏమయ్యా రామ బ్రహ్మేంద్రాదులకునైన నీమాయ దెలియ వశమా !
కామారి వినుత గుణధామ కువలయ దళశ్యామ నను గన్న తండ్రీ రామా ॥"[3]

అని కీర్తించాడు రామదాసు. ఓ రామా! నీ మాయలు, నీ రూపం ఎప్పుడు ఎలా ఉంటుందో ఎవరికి తెలుసు. నిన్ను గుర్తించడం మా తరంగాదు. దశరథుడు తన తనయునిగా నిన్ను భావించాడు. సుగ్రీవుడు హితునిగా కపులు అతిబలునిగా నిన్ను భావించారు. పాండవులు నిన్ను చెలికాడుగా, స్నేహితునిగా, బావగా భావించారు. జరాసంధాదులు విరోధిగా నిన్ను భావించారు. కుచేలుడు నిన్ను ఒక ప్రాణస్నేహితునిగా భావించాడు. కాని భగవంతునిగా భావించలేదు. నరులు నిన్ను సామాన్య నరుడిగానే చూశారు. యాదవులు తమ నాయకునిగా నిన్ను భావించారు. గోపికలు తమ పతిగా, ప్రియునిగా నిన్ను భావించారు. నీవు ఇన్ని విధాల అందరికి ఒక్కొక్కరి అభిప్రాయాన్ని బట్టి వారికి నీవు అలా గోచరించావు. వారిని సంతృప్తులను చేశావు. ఎవరు ఏ దృష్టితో చూస్తే వారికి అలా దర్శనమిచ్చావు. వారితో అలా మెలిగావు. నీ లీలలు ఎవరికి

1. S. Krishna Swamy Aiyangar. "Abul Hasan Qutbshah and his ministers, Madanna and Akkanna." - Journal of Indian History 1931. P.No. 128.
* History of the Qutbshahis Kingdom - H.K.Sherwani - P.No. 607.
2. భద్రాచల రామదాసు చరిత్రము - (యక్షగానము) తిరుక్కడయూరి కృష్ణదాసు. పుట 125.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 41. కీర్తన 43.

అంతుచిక్కవు. కాని నాకు మాత్రం నీవు శ్రీమన్నారాయణుడవే. భద్రాద్రిలో వెలసిన సాక్షాత్తు శ్రీహరివే. సీతాదేవి నా తల్లి. ఆదిలక్ష్మియే. నీవే ఈ సమయంలో వచ్చి నన్ను మరణింపనీక, విషపు గిన్నె పడద్రోసినావు. "రామా ! నా భాగ్యమింతేనా !" అని, మరణించి, ఆత్మార్పణం చేసుకుని నిన్ను చేరాలనుకున్నానే ! దానికి కూడా అదృష్టం లేదా నేనీ భాగ్యానికి కూడా నోచుకోలేదా ? అని పరిపరి విధాల విలపిస్తూ, రాముని కీర్తించాడు. ఈవిధంగా చెరలో రామదాసు శ్రీరాముని మహిమలను అభివర్ణిస్తూ ఉండగా, తానీషా తాను ఉదయమే మేల్కొని "రామ మొహరీలు" చూసి ఇదంతా కలకాదని, ఈ విషయం తన భార్యకు తెలియజేశాడు. తాను రామునికి అపరాధం చేసినట్లుగా భావించి దుఃఖించాడు. తానీషాకు రామ లక్ష్మణులు ఒక నిశివేళ ఏరోజైతే విషం త్రాగాలని తీర్మానించాడో ఆ రోజు రాత్రి వారు కనబడి ఆరులక్షల పైకం ఇచ్చి, రసీదు తీసుకుని మాయమైనారు. తానీషా రామదాసు వద్దకు వెళ్లి జరిగినదంతా తెలియజేశాడు. తానీషా వలన ఆ వచ్చింది రామ లక్ష్మణులని తెలుసుకుని, తాను వారిని గుర్తించక సామాన్యులుగా భావించానే అని బాధపడినాడు రామదాసు.

తానీషా తాను కూడా ఆ రాత్రి రామలక్ష్మణులను గాంచినా, వారిని సామాన్యులుగా భావించినట్టు, వారిని పూజింపలేకపోయినానని బాధపడి ఈ విధంగా తలపోస్తాడు.

**ఆనందభైరవి - ఆది**

"తెలియకనే మోసపోతిని - దేవుండని తెలియనైతిని ॥"

అనే ఈ కీర్తనను తానీషా పాడినట్లుగా ఈ గ్రంథంలో తిరుక్కడయూరి కృష్ణదాసు గారు వ్రాశారు. ఈ కీర్తనలోని భావం, ఆ అనుభవం కలిగింది తానీషాకే. కాని దీనిని పాడింది మాత్రం రామదాసే. రామదాసుకు తానీషా జరిగింది చెప్పగా, ఆ గాథను ఆధారంగా చేసుకుని తానీషాకు రామదర్శనమైన విషయాన్ని గూర్చి, ఈ కీర్తనలో ఆలపించాడు. తాను కూడా సామాన్యులుగా వారిని భావించి పూజింపలేకపోతినే అని భావించినట్లుగా కూడా రామదాసుకు ఈ కీర్తనను అన్వయింపవచ్చును.

"ఇరువురికి సామాన్యమైన భటుల రూపంలో కనపడినారు." తానీషా రూపంలో రామదాసు వద్దకు రాముడు వచ్చి రసీదు ఇచ్చి వెళ్లినట్లుగా ఈ యక్షగానంలో లేదు. ఇరువురు భటుల రూపంలో వచ్చినట్లుగానే ఉంది. "అంతట తానీషా రామదాసును చెరవిముక్తుని చేసి పల్లకీలో ఊరేగింపుగా తీసుకుని వచ్చి తన ఆస్థానానికి గౌరవంగా రప్పించి, క్షమాపణలు చెప్పాడు. అంతట రామదాసు తానీషాను రాముడే కాపాడగలడని దీవించాడు. తానీషా తాను జూసిన దైవం ఎవ్వరని అడుగగా, రామదాసు నీవు చూసినది రామలక్ష్మణులను. వారు దేవతలు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు రాముడు. ఆదిశేషుడు లక్ష్మణుడు. వారి దర్శనం నీకు లభించిందని చెప్పినాడు. నీవు రామదర్శనం పొందావు కావున నీవు ధన్యుడవు అని అన్నాడు రామదాసు..

"దర్శనమిచ్చెను రాముడు గావున ధన్యుడనీవనియెన్
వరముని దలచుచు పాలింపుము భువి ప్రాజ్ఞతతో ననియెన్"[1]

ఈవిధంగా రామదాసు ఇంకా ఇలా అన్నాడు. రామదాసు, తానీషాల మధ్యన ఈ సంభాషణ కొనసాగింది. దీనిలో రామదాసును తానీషా తన గురుతుల్యునిగా భావించి పూజించాడు.

**రాగం - వంతువరాళి - ఏకతాళం**

*గోపన్న :* ధన్యుడైనావు తానీషా రాజేంద్ర చంద్ర - ధన్యుడైనావు తానీషా ధన్యుడైనావు నేడు
దాశరథిని జూచినావు మాన్యులలో మాన్యుడగుచు మహిని వెలసినావు నీవు.

1. భద్రాచల రామదాసు చరిత్రము - (యక్షగానం) - తిరుక్కడయూరి కృష్ణదాసు. పుట 125.

తానీషా : గురుడవైనావు గోపన్నా మాబోట్ల కెల్లన్ - బరము దెల్పినావు గావునా గురుడవైనావు

నీవు గుఱుతెఱిగి బ్రహ్మజనకు పరమ పదముగాంచు రీతి బరమ సులభమనుచు దెలిపి.[1]

అని తానీషా 'ముక్తికి సోపానం' రామదాసు వేశాడని, అందరినీ ముక్తి మార్గంలో నడిపేందుకు ప్రయత్నించే గురు తుల్యునిగా రామదాసును భావించాడు. ఈవిధంగా రామదాసు రాముని కృపకు పాత్రుడై రామానుగ్రహంతో ఋణ విముక్తుడైనాడు. తానీషాచే ప్రశంసింపబడినాడు. రామదాసు కూడా తానీషాను రామదర్శనం అయినందుకు అతన్ని కీర్తించాడు. రామదాసు వలననే తానీషా రామానుగ్రహానికి పాత్రుడైనాడు. రామదాసు లేనిదే తానీషాకు కీర్తి లేదు. ఖైదులో ఉండగా

"నిత్యం రామనామస్మరణలో మునిగిన రామదాసు ఆ పారవశ్యంలోనే 'ఇకనైనా దయరాదా రామచంద్రా' అంటూ అజరామరమైన కీర్తనలెన్నో ఆలపించాడు. ఆయన స్వహస్తాలతో చెక్కిన పూజాగణపతి, రామలక్ష్మణాది 16 రాతి విగ్రహాలు గోల్కొండ గుండెల్లో భక్తి తత్త్వాలను ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి."[2]

ఈ 12 సంవత్సరాలు ఖైదులో ఉండి రామనామస్మరణంతోనే కాలం గడిపాడు. అప్పుడు మరోదైవం ఉన్నట్లు ఆయనకు తోచలేదు. ఆయన దృష్టిలో రాముడొక్కడే దైవం. ఆ స్వామిని నిరంతరం ధ్యానిస్తూ, కీర్తిస్తూ, స్తుతిస్తూ జీవితంలో సంభవించిన ఒడుదుడుకులను ఎదిరించాడు. ఈ జైలులో ఉండగా రామనామస్మరణం తోనే రాముని వశం చేసుకున్నాడు. చెర విముక్తుడైనాడు. ఆత్మ స్థైర్యంతో పాటుపడి, మోక్ష సామ్రాజ్యాన్ని చేజిక్కించుకోగలిగాడు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎన్ని ఇక్కట్లు సంభవించినా, ఆ ఒక్క రామున్నే నమ్ముకొని దుర్భరమైన శిక్షలు అనుభవిస్తూ, అమూల్యమైన ఎన్నో ఆత్మనివేదనాసక్త కీర్తనలు రచించి, జీవయాత్ర సాగించిన ధీరోదాత్తుడు. ఇది రామదాసు యొక్క అజరామరమైన వ్యక్తిత్వం.

పన్నెండు సంవత్సరాల కాలం ఆ మహాపురుషుడు చీకటి కొట్టులో, గాఢాంధకారంలో నిరంతరం యమయాతనలు అనుభవిస్తూ, దుర్భరమైన జీవితం గడిపినాడు. ఎన్నో అవమానాలకు, అవహేళనలకు గురి అయినాడు. భటులు ప్రతినిత్యం కొరడాలతో మోదుతూ, నానా విధాల దూషిస్తూ, తిడుతూ ఉంటే, భరిస్తూ ఆ నిష్కామ కర్మయోగి, తిరిగి వారిని దూషించకుండా, గోపన్న, రామనామస్మరణం తో విధికి తలవొగ్గి క్షణమొక యుగంగా గడిపాడు. శ్రీరామచంద్ర మూర్తితో తన కష్టాలు, బాధలను కీర్తనల రూపంలో పాడి వినిపించి, దీనాతిదీనంగా అర్థించాడు. రామునికి మొరపెట్టుకొన్నాడు. తన ఆక్రోశాన్ని వెళ్లబుచ్చాడు. మళ్ళీ తనను తాను తమాయించుకుని, స్వామిని లాలించి, పాలించమని వేడుకున్నాడు. అంతరంగాన ఆ రాముని నిల్పుకున్నాడు. స్వామి కరుణ లభించలేదు. అయినా ఆ సీతారాముల పైన ఇసుమంతైనా నమ్మకం తగ్గలేదు. భక్తి ప్రపత్తులు దిన దిన ప్రవర్ధమానం కాసాగాయే కాని రవ్వంత కూడా తగ్గలేదు. తనను ఏనాడైనా ఈ గండం నుండి కడతేర్చి రక్షించగల ప్రభువు ఆయనే అనే దృఢ విశ్వాసంతో, పట్టుదలతో ఆ బందిఖానాలో కాలం వెళ్లబుచ్చాడు. ఎన్నో విధాల ఆ రాముని, సీతమ్మను స్తుతించాడు. అద్భుతమైన కీర్తనలు ఆలపించాడు. రామదాసు రచించిన ఈ కీర్తనలు సహజంగా ఆయన హృదయం నుండి ఆవిర్భవించినవి. చివరికి రాముని అనుగ్రహంతో చెర విముక్తుడైనాడు.

ఈవిధంగా చెర విముక్తుడైన రామదాసు, తిరిగి భద్రాచలం వెళ్ళి రామకైంకర్యం చేసి, తుదకు రామసాయుజ్యం పొందిన విషయం గూర్చి ఆయన కారాగారవాసానంతర జీవితం గూర్చి తరువాతి అధ్యాయంలో తెలియజేస్తాను.

1. భద్రాచల రామదాసు చరిత్రము - (యక్షగానం) - తిరుక్కడయూరి కృష్ణదాసు. పుట 125.

2. శతాబ్దాల చరిత్రకు మౌనసాక్షి గోలుకొండ - భక్త రామదాసు బందిఖానా - 20 జూన్ 1993 ఆదివారం ఈనాడు దినపత్రిక ప్రత్యేక సంచి

ఆరవ అధ్యాయం

# రామదాసు కారాగారవాసానంతరం వ్రాసిన కీర్తనలు

## ఆరవ అధ్యాయం

# 6. రామదాసు కారాగారవాసానంతరం వ్రాసిన కీర్తనలు

రామదాసు రామానుగ్రహంతో గోల్కొండ ప్రభువుల చేత బంధవిముక్తుడౌతాడు. రాముడే తన సోదరునితో కూడి తానీషా వద్దకు వచ్చి ఆరులక్షల వరహాలు బంగారునాణేలను ఇచ్చి, రసీదు తీసుకుని వెళ్లి, ఈ రసీదును రామదాసునకిచ్చి వెళ్తాడు. తానీషాకు రామదర్శనం అయిన తర్వాత నిజం గ్రహించి, రామదాసు, రామభక్తుడని గ్రహించి ఆతనిని విడుదల చేస్తాడు. బంధవిముక్తుని చేస్తాడు. 12 సంవత్సరాల తర్వాత సుదీర్ఘమైన బాధలనుండి రామదాసుకు విముక్తి కల్గించాడు రాముడు. తానీషాకు రామదర్శనం అయిన తర్వాతే రామదాసు విడుదల చేయబడినాడు. 1677లో రామదర్శనం తానీషాకు కల్గుతుంది. 1665 నుండి 1677 వరకు ఖైదులోనే 12 సంవత్సరాలు ఉన్నాడు. 1677లో తానీషాచే రామదాసు విడుదల గావింపబడినాడు. ఇది చారిత్రక సత్యం.

రామదాసును తానీషా విడుదల చేసిన విషయం గూర్చి, తానీషా వ్యక్తిత్వాన్ని గూర్చి శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు గారు ఈ విధంగా తెలియజేశారు. "నిత్యానందుడు లేక నిత్యమూ పరమాత్మ యందు లగ్నమైన మనస్సు కలవాడు అనే అర్థం వచ్చే 'తానాషా' అనే ఆప్యాయ బిరుదమును పొందిన అబుల్ హసన్ కుతుబ్షా మాదన్న గారిని మహామంత్రిని చేసి, గోలకొండ సామ్రాజ్యాన్ని ఆదర్శప్రాయంగా మొగలాయీల నుంచి స్వతంత్రంగా తీర్చి దిద్ద కోరుకొన్న సూఫీ వేదాంతియైన తానాషాకు శ్రీరాముడు కనిపించి, పైకం చెల్లించి రసీదు పొందాడన్న యక్షగానం, హరికథా రచయితల విశ్వాసము - మానసికంగా ఆధ్యాత్మికంగా విశ్వసనీయమని భావిస్తాము. ఆ విశ్వాసానికి మహామంత్రి మాదన్న మాధ్యస్థము ఏ మాత్రమో తోడ్పడి ఉండవచ్చంటే హేతువాదులకు తృప్తిగా ఉంటుంది."[1] అని రజనీకాంత రావు గారు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరియు 1677 లో చెరనుండి విడుదలయిన రామదాసయిన గోపన్న గారిని అబుల్‌హసన్ తానాషా - సర్వాపరాధాల నుంచి విముక్తుని చేసి, శ్రీరాముల నిత్యసేవ కొరకై - రేకపల్లి, భద్రాచలం జాగీర్లను శాశ్వత ప్రాతిపదికపై చెల్లుబాటు అగునట్లుగా 1652 లో జారీ అయిన ఫర్మానాను తిరిగి మంజూరి చేశాడు. అప్పుడు తానీషా బహూకరించిన భూషణాలూ, నగదూ పల్లకీలో పెట్టుకుని భద్రాచల యాత్రలో వున్న రామదాసును త్రోవలో బందిపోటులు అడ్డగించారు. అప్పుడు రామదాసు భారమంతా శ్రీరాములపై వేసి, ఈ కీర్తన గానం చేశాడట."[2]

### 6.0. రామదాసును చోరులడ్డగించుట :-

*రాముడే గలడు నాపాలి శ్రీరాముడే గలడు రాముడార్తి విరాముడాహవ*
*భీముడానంద ధాముడైన శ్రీ॥ నల్లని రూపు దాసుల నేలు చల్లని చూపు*
*ఉల్లమున రంజిల్ల కృపనెద-జిల్లుచును విలసిల్లు సీతా ॥*
*తమ్ముడును తాను విల్లమ్ములు దాల్చి దయతోను క్రమ్మి యిరు పార్శ్వమ్ములను జేరి*
*నెమ్మి నీకు భయమ్ము లేదను ॥ మీరు చిరునవ్వు జిగి ముడివడ జారు సిగపువ్వు*
*సొరుగులుకు బంగారు తమ్ములను గేరి పద్మముల దారి నను జేరు ॥*
*కంటు సేయకను రామదాసు జంట బాయకను వెంటనంటి యేవేళకు కృపతో*
*కంటిని రెప్పగాచు గతి బ్రోచు ॥*[3]

1. భక్త రామదాసు కీర్తనలు - పీఠిక - బాలాంత్రపు రజనీకాంతరావు - పుట 13.
2. భక్త రామదాసు కీర్తనలు - సం॥ దాశరథుల బాలయ్య - పీఠిక - బాలాంత్రపు రజనీకాంతరావు - పుట 13.
3. భక్త రామదాసు కీర్తనలు - సం॥ దాశరథుల బాలయ్య , పుట 106, కీర్తన 128.

రామదాసు బందిఖానా నుండి విడుదలైన తర్వాత రామదాసుకు అబుల్ హసన్ తానీషా ప్రభువు రాముడు అతనికిచ్చిన ఆరు లక్షల వరహాల బంగారు నాణాలు ఇవ్వగా అవి, తాను స్వీకరించక 2 నాణాలు మాత్రం తీసుకొని, తక్కిన ధనం అంతా రామార్పణం చేసి, తానీషా ఇచ్చిన ఇంకా సకల సంభారాలు, భద్రాద్రి ఆలయ కైంకర్యానికి ప్రభువు ఇచ్చిన ధనం తీసుకొని భద్రాచలానికి, సకల పరివారంతో వెళ్తుండగా, దారిలో చోరులు రామదాసు వద్దనున్న ధనం దోచుకోబోయిరి. "రాముడే మేఘావృతంగా వాతావరణాన్ని సృష్టించి, మిక్కిలి వర్షం వచ్చేలాగా చేశాడు. చోరులను సృష్టించాడు. ఇదంతా రాముని మాయయే. రామ కైంకర్యం చేయదలచిన నన్నీ చోరులు దోచుకొన దలచిరే అని బాధపడి రాముల గూర్చి ధ్యానము చేశాడు. ఆ సమయంలో రామదాసుగారు రాముడే నాకు దిక్కు. ఈ ధనం ఆ రాముడి సొత్తు. ఆయనే దీనిని కాపాడుకోగలడు. నేను భీతిల్లను. ఆ రాముడే సర్వ రక్షకుడు. వచ్చి ఈ చోరులను తరిమి, ఈ ధనం రక్షించగలడని ధైర్యంగా ఉండినాడు. అంత రామదాసు ప్రార్థించగానే రాముడు, లక్ష్మణుడు ఇద్దరును వచ్చి విల్లంబులతో ఆ చోరులను తరిమేందుకై వచ్చారు. పల్లకికి ఇరువైపుల కావలియుండి జాగ్రత్తగా కాపాడారు. ఆ రాముడే నన్ను కాపాడగలడని, రక్షకులు వారేనని కోరుకున్నాడు." అలాగే అనుకున్న ప్రకారం జరిగింది. ఈ సందర్భంలోనే రామదాసు సుదీర్ఘమైన 62 చరణాలున్న కీర్తనను ఆలపించాడు. ఆ కీర్తన ఇది. "పాహి రామప్రభో - పాహి రామప్రభో" అనే కీర్తన. రాముని స్తోత్రం చేశాడీ కీర్తనలో. ఆయన నామ గుణ కీర్తనం గావించాడు. ఇది ప్రసిద్ధి చెందిన రామదాస కృతి.

**ఆనంద భైరవి - ఆది**

పాహి రామప్రభో - పాహి రామప్రభో పాహి భద్రాద్రి వైదేహి రామప్రభో ॥
శ్రీమన్మహా గుణస్తోమాభిరామ మీ నామ కీర్తనలు వర్ణింతు రామప్రభో ॥[2]
కొల్లలుగ నీమాయ వెల్లివిరియగ జేయ నల్లాపమున గ్రీడ సల్పు రామప్రభో ॥
తమ్ముడున్నీవు పార్శ్వములం జేరి విల్లమ్ములెక్కిడి నిల్లుటిమ్ము రామప్రభో ॥[3]
క్రమ్ముకొని శత్రువులు హుమ్మనుచు వచ్చెదరు ఇమ్మైన బాణముల్బిమ్ము రామప్రభో ॥
రమ్ము నాకిమ్ము బుభయమ్ము నీ పాదముల్ నమ్మినానయ్య శ్రీరామచంద్రప్రభో ॥[4]
కంటి మీ శంఖముగ్గంటి మీ చక్రమున్ గంటి మీ పాదుమల్గంటి రామప్రభో ॥
వింటి మీ మహిమ వెన్నంటి తమ్ముడు నీవు జంట రారయ్య నా వెంట రామప్రభో ॥[5]
మేము మీవారమైనాము రక్షింపుమన్నాము జాగేల శ్రీరామచంద్రప్రభో ॥
నా మనోవీధిపై బ్రేమతో నుండుమీ భూమి జాత సహిత జయ రామచంద్రప్రభో ॥[6]
చూడు మీ భక్తులను గూడుమీ రిపుల గోరాడు మీవెట్లు గోవింద రామప్రభో ॥
పుండరీకాక్ష మార్తాండ వంశోద్భవా ఖండలస్తుత్య కోదండ రామప్రభో ॥[7]
నీదు బాణంబులను నాదు శత్రులబిట్టు బాధింపకున్నా వదేమి రామప్రభో ॥
ఆది మధ్యాంత బహిరంతరాత్ముడ వనుచు వాదింతు నే జగన్నాథ రామప్రభో ॥[8]
పర ధనంబుల పర వనిత నపేక్షించు నరుల కబ్బునె మోక్ష మరయు రామప్రభో ॥
కామాది దుర్గుణ స్తోమంబడంగ మీ నామామృతమె దిక్కు స్వామి రామప్రభో ॥[9]
పాహి శ్రీరామ నీ పాద పద్మాశ్రయుడ పాలింపు మీ భద్రశైల రామప్రభో ॥
పాహి రామప్రభో పాహి రామప్రభో పాహి భద్రాద్రి వైదేహి రామప్రభో ॥[10]

1. భద్రాచల రామదాసు చరిత్రము - తిరుక్కడయూరి కృష్ణదాసు.
2,7,8,9,10. భక్త రామదాసు కీర్తనలు - సం॥ దాశరథుల బాలయ్య , పుట 166,168,169,173,175, కీర్తన 197.
3,4,5,6. " " " పుట 167.

ఈ కీర్తనలో మొత్తం 61 చరణాలున్నాయి. ఈ కీర్తనలో రాముని స్తుతిస్తు, శ్రీహరి దశావతారాలను కూడా చివరి 10 చరణాలలో వర్ణించాడు. తనను కాపాడమని, ఈ సంపద నీది అది రక్షించుకునేందుకు వచ్చి, చోరులను నాశనం చేయమని కోరగా, చోరుల బారినుండి రామదాసు కాపాడబడినాడు. అప్పుడు రామదాసు రామునికి కృతజ్ఞతలు తెలియజేసి, ఈ విధంగా స్తుతించాడు. రాముని మహిమను కొనియాడినాడు. ఈ సందర్భంలో ఆలపించిన కీర్తన ఇది.

**సావేరి - ఆది**

*ప్రత్యక్షముగా నను నీ వేళ బ్రతికించితివయ్యా - సత్యము సత్యము నీవే నా దైవము సదయ రామచంద్రా॥*
*ఝుమ్మను చీకటిలో వాన ఝుర ఝుర కురియగను - ఇమ్మగు సొమ్ముల నిమ్మని కత్తిని గ్రుమ్మదలపగాను*
*సొమ్మసిల్లుచును నా చిత్తమ్ము సొలసి ఝల్లుమనగా - నమ్మదగిన నా దైవము నీవని నమ్మినందుకిపుడు॥*
*ఉబ్బలిలో దారినెరుగక తబ్బిబ్బుగ నడువగను - అబ్బురముగ నాకు చోరులు ముందుగ నగపడి యెరటీయు*
*గొబ్బున నస్త్రముచే నాపైనిక దెబ్బవేయరాగా - అబ్బాయనక శ్రీరామాయని నే అప్పుడు శరణంటి ॥*
*అంత సహోవింతాచోరుని రంతు ఎంతో వింతా - పంతము చెడి యా చోరులు పారిరి పరమ పురుష స్వామీ*
*అంతట కడు వేగమున నేను నుంత భయము లేకా - దంతి రక్షకా దానపోషకా దయగలనా స్వామీ ॥*[1]

బాగా వర్షం వస్తున్న చీకటి సమయాన చోరులు వచ్చి రామదాసును కొట్టారు. అప్పుడు రామదాసు రాముని ప్రార్థించగా, రామ, లక్ష్మణులు ఇరువురు వచ్చి తమ బాణాలు వరుసగా కురిపిస్తూ చోరులను సంహరించారు. కొందరు పారిపోయారు. ఇలా రామదాసు రాముని ప్రార్థించి చోరుల బారినుండి రక్షింపబడినాడు. రామదాసుకు రామునిపై గల భక్తికి, మరొకసారి నిదర్శనం కనబడింది. రామదాసు భద్రాచలం చేరుకొని శ్రీరామచంద్ర మూర్తిని దర్శించి, ఆ రాముని కనులారా ఇన్నాళ్లకు దర్శించాను కదా ! అని అంటూ ఆనందంగా పాడుకున్నాడు.

**నాదనామ క్రియ - ఆది**

*కంటి నేడు మా రాముల కనుగొంటి నేను*
*కంటినేడు భక్త గణముల బ్రోచు మా - యింటవేలుపు భద్రగిరి నున్నవాని ॥*
*చెలువొప్పచున్నట్టి సీతా సమేతుడై - కొలువు దీరిన మా కోదండ రాముని ॥*
*తరణి కుల తిలకుని ఘన నీలగాత్రుని - కరుణా రసము గురియు కందోయి గలవాని॥*
*హారుమంచి ముత్యాల సరములు మెరయగా - మురిపెంపు చిరునవ్వు మోము గలిగిన వాని॥*
*ఘలు ఘల్లుమను పైడి గజ్జెలందెలు మ్రోయగ - తళుకు బెళుకు పాద తలము గలిగిన వాని ॥*
*కరకు బంగరు చేలకాంతి జగములు గప్ప - శర చాపముల కేల ధరియించు స్వామిని ॥*
*ధరణిపై శ్రీరామదాసు నేలేడు వాని - పరమ పురుషుండైన భద్రగిరి స్వామిని ॥*[2]

ఇందు రాముని, సీతాదేవి సౌందర్యాన్ని , శోభను వర్ణించాడు. సీతారాముల వైభవాన్ని అత్యద్భుతంగా వర్ణించాడు. రామదాసు వారిని కనులారా గాంచి తరించాడు. ధన్యుడైనాడు. 12 ఏండ్ల తర్వాత ఆ రాముని, భద్రాద్రి సీతారాములను దర్శించి, ఆనందంగా ఈ కీర్తన పాడాడు. తానాషా ఆజ్ఞానుసారం రామదాసు భద్రాద్రికి వచ్చినపుడు రెండు నాణాలు మాత్రం పూజాదికములకై వెంట తెచ్చుకొంటాడు. అవి శ్రీరామ పట్టాభిషేకం ముద్ర గల నాణాలు. ఆ నాణాలు నేటికీ భద్రాచలంలో శ్రీరాములవారి ఖజానాలో రెండు ఉన్నాయి.

తర్వాత కొంతకాలం పాల్వంచ, భద్రాచలం ప్రాంతాలను పాలిస్తూ శ్రీరామచంద్రునికి కల్యాణ భోగోత్సవాలు అంగరంగ వైభోగంగా జరిపిస్తూ, తగిన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసి శాసనం వేయిస్తాడు.

1. భక్త రామదాసు కీర్తనలు - సం॥ దాశరథుల బాలయ్య , పుట 84, కీర్తన 98.

2. భక్త రామదాసు కీర్తనలు - సం॥ దాశరథుల బాలయ్య, పుట 51, కీర్తన 54.

ఆ శాసనం ఈనాటికీ ఆలయ ప్రాంగణంలో దక్షిణ భాగంలో ఉంది. దీన్ని గూర్చి ఇంతకు ముందే ప్రస్తావించాను. 'మిన్నికంటి రఘునాథ శర్మ'[1] గారు రామదాసు కారాగార విముక్తుడైన తర్వాత భద్రాద్రికి తిరిగి వెళ్లి రామకైంకర్యం చేసిన విషయం గూర్చి, తానీషా ఇచ్చిన మాన్యాలగూర్చి ఈ విధంగా తెలియజేశారు.

"రామదాసును తానీషాకు రామదర్శన మయినంతనే చెర విడిపించెను. రామదాసును రాముడు ఋణవిముక్తుని గావించినంత, రామదాసు యొక్క అపారమైన రామభక్తికి మెచ్చి, తాను రామదాసు యెడ చేసిన పొరపాటునకు, రామదాసును శిక్షించినందుకు పశ్చాత్తప్తుడై రామదాసును క్షమించుమని కోరెను. రామదాసు చెర విముక్తుడైన తర్వాత భద్రాద్రికి వెళ్ళి రామునికి కైంకర్యాలను చేస్తూండినాడు. తానాషా రామదాసుకు భద్రాచలం, పరగణాను దానంగా ఇచ్చాడు. ఇంకను పైకం ఇచ్చాడు.
రామదాసు భార్య, బిడ్డలతో రామసంకీర్తనం చేస్తూ భద్రాద్రిలో కాలం గడుపుతుండెను. నరాశ్రయం తిరస్కరించాడు. మాదన్నగారు రామదాసును చెర విడిపించి ఉండవచ్చుగా "అని తన పుత్రుడు తన ఆవేదన వ్యక్తం చేయగా, నరాశ్రయాన్ని తిరస్కరించినట్లు చెప్పాడు. తాను రామాశ్రయం కోరాడు. ఆనందించాడు.

### 6.1. రామదాసుకు శూల బాధ కల్గుట :-

రామదాసుకు వృద్ధాప్యంలో శూలబాధ, కాలుబెణకడం వలన కలిగిన బాధ వలన భద్రగిరి రాముని కొండనెక్కి వెళ్లి దర్శింప వీలుపడలేదు. మూడునెలలుగా రాముని దర్శనభాగ్యం కలగనందుకు చింతిస్తూ రామదాసు ఈ విధంగా బాధపడుతూ రాముని ప్రార్థించాడు.

**కాంభోజి - ఆది**

*ఎక్కడి కర్మము లడ్డుపడెనో ఏమిసేతునే రామా ! అక్కట ! నా కన్నుల నెప్పడు హరిని జూతునో రామా ॥*
*ప్రకటమాయె పాపమెటుల బాధ కోర్తు రామా ! సకల లోక రాజ్య పదవి సన్నుతింప రామా ॥*
*పృథివి లోన పూర్వ జన్మ పూజలింతెకా వ్రతము గడుపవలయు విషయ వాంఛ వదలక ॥*
*మూడునెలలాయె రాముని యందు నిల్పక ఎన్నడిట్లుండి నేను నెరుగ రాఘవా ॥*
*కోరి భద్రాచల రాముని కొలుతు నంటినీ! రామదాసుని కోర్కెలొసగి రక్షించుమంటినీ ॥*[2]

రామా ! నేను నిరంతరం నిన్ను దర్శించనిదే ఉండలేనే. మూడునెలలనుండి నిన్ను చూడలేకపోతినే. నేను ఏమి పాపం చేశానో. ఎంత కర్మకాలం ఇది. ఎన్నడూ ఇలా జరుగలేదే అని బాధపడతాడు. ఈవిధంగా వృద్ధాప్యంలో అనతి కాలంలోనే రోగగ్రస్తుడైనందున రామదర్శనం చేసుకోలేకుండేవాడు. ఆ తర్వాత నిరంతరం రామ భజన చేస్తూ కాలం గడిపేవాడు. "రమారమి 55 ఏండ్లు రామదాసు జీవించిన తర్వాత రామునిలో ఐక్యమైనాడు. రామదాసు అనంతరం రామదాసు పుత్రుడు రామాలయ కార్య నిర్వహణాన్ని స్వీకరించినాడు. ఆ తర్వాత రామదాసు భార్య కొంతకాలానికి మరణించింది."[3] అని శ్రీ మిన్నికంటి గురునాథ శర్మ గారు తెలియజేశారు.

**వరాళి - ఆది**

1. *" అంతా రామమయం - ఈ జగమంతా రామమయం ॥*
*అంతరంగమున నాత్మా రాముడనంత రూపముల వింతలు సలుపగ*
*సోమ సూర్యులును సురలు తారలును - ఆ మహాంబుధులు నవనీజంబులు ॥*
2. *అండాండంబులు పిండాండంబులు - బ్రహ్మాండంబులు బ్రహ్మము మొదలుగ*
*నదులు వనంబులు నానా మృగములు - విదిత కర్మములు వేదశాస్త్రములు ॥*

1. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ ప్రణీతము. 9 వ ప్రకరణము. పుట 125.
2. భక్త రామదాసు కీర్తనలు - సంకలనం దాశరథుల బాలయ్య - పుట 33. కీర్తన 32.
3. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ ప్రణీతము . 1935 - తొమ్మిదవ ప్రకరణం. పుట 125.

3. అష్ట దిక్కులును ఆది శేషుడును - అష్ట వసువులును అరి షడ్వర్గము
ధీరుడు భద్రాచల రామదాసుని - కోరికలొసగెడి తారక నామము ॥[1]

అని రామదాసు ఖైదునుండి విడుదలైన అనంతరం ఆనందంగా 'అంతా రామమయంగా భావించి' పాటలు పాడుకున్నాడు. ఈ సృష్టి అణువు అణువు లోను రాముడే ఉన్నాడు అనిపేర్కొంటాడు రామదాసు. ఇలా భక్తి యోగం ద్వారా భగవదనుగ్రహానికి పాత్రుడై క్రీ.శ. 1680 ప్రాంతాన శ్రీరామసాయుజ్యం పొందుతాడు.'[2] అని దాశరథుల బాలయ్య గారు తెలియజేశారు.

### 6.2. రామదాసు కారాగారానంతర జీవితం - కొందరు చరిత్రకారుల, విమర్శకుల పరిశీలనలు :

రామదాసు జైలునందే మరణించినట్లు కొందరు విమర్శకులు అభిప్రాయపడినారు. అట్టివారికి శ్రీ కొండపల్లి రామచంద్ర రావు గారు ఇచ్చిన సమాధానం పరిశీలించదగింది.

"రామదాసు కారాగార విముక్తుడు కాకుండా కారాగారముననే మృతి బొందినట్లు మండల చరిత్రములో దెలుపబడియున్నదని కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు వ్రాసిరి. (పిఠాపుర సంస్థాన చరిత్ర విమర్శనము - పేజీ 75.)[3] ఉ ॥ వే ॥ శ్రీ విద్యారణ్య పంచానన ఎక్కిరాల రామచంద్రాచార్యులును తామా వ్రాతలను చదివించి, వింటిమని సెలవిచ్చినారు. కాని ఇది దురూహ్యమైన విషయం. అట్టిదే జరిగిన, మిగిలిన కొద్ది కాలమైనను భద్రాచల రామాలయము నడుపబడుట, ఈ ధర్మాదాయమును వెనుక వారగు నైజాము వంశీయులు పరంపరగా సాగనిచ్చుట పొసగని విషయములగును."[4]

"అంతేగాక శివాజీ గోల్కొండ వచ్చినపుడు రామదాసు కారాగారంలో లేడు. అప్పటికే విడుదలై ఉంటాడు. బందిఖానాలోనే ఉన్నచో భగవద్భక్తుడగు శివాజీ తుకారాం, సమర్థ రామదాసు మున్నగువారి పాదపూజ చేసినట్లు ఈయనకు కూడా చేసి, చెరసాల నుండి విడుదల చేయించి యుండెడివాడు. కనుక రామదాసు అప్పటికే విడుదలగుట ఖాయము."[5]

'బహు కాలమునకు శ్రీభద్రాచలేశునకే
పాద సేవకుడనైతి !
అహహా నా జన్మ సఫలమాయె నేటికిని
అనుమానములు దీరెనూ ॥'[6]

అనే కీర్తన వల్లనూ, "ఎక్కడి కర్మము లడ్డుపడెనో ఏలాగు తాళుదును ఓ రామా" ! అనే కీర్తన వల్లనూ
"కంటి నేడు మారాముల కనుగొంటి నేను" అనే కీర్తన వల్లనూ, రామదాసుగారికి తానాషా యిచ్చిన రెండు నాణేములు నేటికిని భద్రాచల దేవస్థానం ఖజానాలో ఉండటం వల్లనూ, రామదాసు తర్వాత రామాలయం పరంపరగా నడుపబడటం వల్లనూ, రామదాసు గారు ఆలయ ప్రాంగణంలో రామ కైంకర్యం గూర్చిన వివరాలతో వేయించిన శాసనం వల్లనూ, రామదాసు గారు కారాగార విముక్తుడైనాడని స్పష్టంగా తెలుస్తుంది. ఇందేమీ సంశయం లేదని చెప్పవచ్చును.

'భద్రాచల రామదాసు కీర్తనలలో భక్తి మరియు రస పోషణ' అనే సిద్ధాంత వ్యాసంలో శ్రీమతి డి. అశోక కుమారిగారు రామదాసు కారాగార విముక్తుడైన అనంతరం భద్రాద్రికేగిన విషయాన్ని ఇలా తెలియజేశారు.

1. భక్త రామదాసు కీర్తనలు - సం॥ దాశరథుల బాలయ్య - పుట 7-8, కీర్తన 7.
2. భక్త రామదాసు జీవితము - రచనలు - దాశరథుల బాలయ్య, ఎం.ఫిల్ 1985.
3. రామదాసు - గురునాథ శర్మ , పుట 126.
4. భద్రాచల క్షేత్ర చరిత్ర - కొండపల్లి రామచంద్రారావు, దేవస్థానం ప్రచురణ 1971, పుట 26.
5. భద్రాచల రామదాసు చరిత్ర - కొడాలి లక్ష్మీ నారాయణ , పుట 21,1977.
6. భక్త రామదాసు కీర్తనలు సం॥ దాశరథుల బాలయ్య పుట 90, కీర్తన 106.

"కారణ జన్ములైన ఈ మహనీయుల (తానీషా, రామదాసులు) కారణంగా భద్రగిరి, భద్రగిరి కారణంగా వారు చరిత్ర ప్రసిద్ధి గాంచినారు. అబ్దుల్లా కుతుబ్షా మరణానంతరం అబుల్ హసన్ తానీషా రాజైనాడు. వేదాంత, సూఫీ తత్త్వానుభూతి కలవాడు. దయార్ద్ర హృదయుడు. కావ్యగీతి ప్రియుడు. అందుచే 1677లో అతనికే శ్రీరామ సాక్షాత్కారము కలిగి, రామదాసుని విడిపించాడు. అంతేకాక అతడు రామదాసుకు మహారాజ బిరుదంతో సహా భద్రాచలాన్ని జాగీర్‌గా ఇచ్చి శిలా శాసనం కూడా చెక్కించాడు. అటువంటి సహృదయుడైన సుల్తాను 1685లో ఔరంగజేబు దండయాత్రలో ఓడిపోయి, ఖైదీగా చిక్కాడు. 1687లో గోల్కొండ మొగలాయి సామ్రాజ్యంలో కలిసిపోయింది. గోల్కొండ మొగలాయి సామ్రాజ్యంలో కలిసిపోయే నాటికి రామదాసు లేడు. రామదాసు మరణించే నాటికి తానీషా క్రిందే గోల్కొండ ఉంది. బహుశా ఆయన కుమారుడు రామాలయాన్ని భద్రంగా చూస్తున్నప్పుడే ఔరంగజేబు దాడి జరిగి ఉంటుంది. తర్వాత 1761-1803లో అసఫ్‌జాహీ వంశానికి చెందిన నిజామల్లీ ఖాన్ మళ్ళీ భద్రాచల రామ దేవాలయాన్ని పునరుద్ధరించి, సాలీన 40 వేల రూపాయలు కైంకర్యాలకై మంజూరు చేశాడు"[1].

"ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళాసేవ" లో ఈ విధంగా ఉంది. "రామదాసు చెరనుండి విముక్తుడైన అనంతరం రామజోగిమందూ కొనరే పామరులారా యనుచు వాడ వాడలా రామనామ ప్రచారము చేయుచు జీవిత శేషమును గడిపి నిరవధిక సుఖములందెను"[2] అని రామనామం చేస్తూ, రామభక్తిని ప్రచారం చేస్తూ తన శేష జీవితం గడిపాడు రామదాసు.

'దేవాలయములు - తత్త్వ వేత్తలు' అనే గ్రంథంలో రామదాసు జైలు నుండి విడుదలై తిరిగి భద్రాచలం వెళ్ళి రామ కైంకర్యం చేసిన విషయం గూర్చి ఈ విధంగా తెలియజేయబడింది. "రామదాసు కఠిన కారాగార శిక్షను అనుభవించి రామ లక్ష్మణుల సహాయంతో జైలునుండి విడుదలైన తర్వాత, ఈ విషయం ముందుగా తెలిసిన రామదాసు భార్య, పుత్రుడు పౌరులు వెదుకబోయి రామదాసుకు స్వాగతమొసంగి గౌరవించిరి. తానీషా కొన్ని దినములు భద్రాద్రియందుండి, భద్రాచలము తాలూకాయంతయు స్వామి వారికి జాగీరుగా నొసంగి, ఆ జాగీరునందు వచ్చు ఆదాయమంతయు స్వామివారి కల్యాణోత్సవములకై వినియోగించునటుల ఏర్పాటు చేసెను. రామదాసు శ్రీరామునిలో కొంతకాలమునకు ఐక్యమయ్యెను"[3] అని వి.టి.శేషాచార్యులుగారు తెలియజేశారు.

'భద్రాచల రామదాసు చరిత్రము' అనే గ్రంథంలో "రామదాసు 12 సం॥లు జైలు జీవితం గడిపాడు. ఆ తర్వాత 12 సం॥లకు రామ లక్ష్మణులు తానీషాకు దర్శనమిచ్చి ఆరు లక్షలు వరహాలు తానీషాకు చెల్లించి, రసీదు తీసుకొని ఆ రసీదు రామదాసునకిచ్చి అంతర్ధానమైరి. ఆ తర్వాత రామదాసు చెర విముక్తుడయ్యెను"[4] అని ఉంది. దానిని గూర్చి ఇదే విధంగా వరదరామదాసు వ్రాయగా, సింగరదాసు, తూము లక్ష్మీనరసింహ దాసులు యక్షగాన రూపంలో పెంచి వ్రాశారు. ఇప్పటి రామదాసు చరిత్రకు ఇది ఆధారంగా ఉంది.

భద్రాచలంలో ఉన్న శాసనం వలన "రామదాసు కారా గృహం నుండి విడుదలైనాడని, భద్రాద్రి రామ కైంకర్యానికై తానీషా మాన్యాలు, అగ్రహారాలు ఇచ్చినట్లు" తెలుస్తుంది. ఈ శాసనంలో తానీషా అనుమతి వెంబడిని జరిగించిన అని కలదు."[5] అని మిన్నికంటి గురునాథ శర్మగారు తెలియజేశారు. కావున తానీషా

---

1. భద్రాచల రామదాసు కీర్తనలలో భక్తి మరియు రస పోషణ - డి. అశోక కుమారి, పుట 7,8.
2. ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళాసేవ -ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ , పుట 31.
3. దేవాలయములు - తత్త్వవేత్తలు - వి.టి. శేషాచార్యులు.
4. భద్రాచల రామదాసు చరిత్రము - బులుసు వేంకట రమణయ్య గారిచే పరిష్కృతము 'సింగరదాసు యక్షగానం'.
5. కంచెర్ల గోపన్న అను రామదాసు - మిన్నికంటి గురునాథ శర్మ , పుట 518.

రామదాసుకు భద్రాచలం, అశ్వారావుపేట, పానుగల్లు మున్నగు పరగణాలను భద్రాచలం ఆలయం అభివృద్ధి కొరకై దానంగా ఇచ్చినట్లు చారిత్రక గ్రంథాల్లో ఉంది. తానీషా కూడా ఒక ఫర్మానా ఇచ్చారని చెప్పబడి ఉంది. కానీ ఈ ఫర్మానా ఈనాడు లభ్యం కావడంలేదు.

'రామదాసు నాటకం'[1] నందు డి. వెంకట రమణయ్య రామదాసు భద్రాచలం వెళ్ళి రామ కైంకర్యం చేసిన విషయం గూర్చి ప్రస్తావించాడు. రామదాసుకు కారాగృహ విమోచనం కల్గిన తర్వాత, తానీషా పశ్చాత్తాపుడై, రామదాసుతో గూడ భద్రాచలానికి వెళ్ళి రామ లక్ష్మణులను చూపమని కోరుతాడు. రామశాస్త్రి అనే గోపన్న మిత్రుడు అంతవరకు మోసంతో పొందిన అనుభవించిన తహసీల్దారీ పదవినుండి తొలగింపబడి పశ్చాత్తాపపడతాడు. తానీషా భద్రాచల దేవాలయం నందు రామ లక్ష్మణులను దర్శిస్తాడు. తానీషాతో పాటు అతని భార్యలు కురుషిద్ బేగం, కృపాబాయ్, రోషనారా బేగం మున్నగువారు కూడా భద్రాచలం వచ్చి సీతారాములను దర్శించుకొంటారు". మహమ్మదీయుడైన తానీషాను రామ దర్శనం చేయించిన ఘనత రామదాసునకే దక్కింది. రామదాసు వలన తానీషా కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించాయి.

'భక్త కవి పుంగవులు'[2] అనే గ్రంథంలో "రామదాసు కారాగార విముక్తుడైన అనంతరం తిరిగి భద్రాచలానికి వెళ్ళి, శేష జీవితమంతా స్వామి సేవలో వినియోగించి, బొందితో కైలాసానికి పోయినాడని కొందరు చెబుతారు". ఈ సందర్భంలో స్వామి సుందర చైతన్యానంద రామదాసు రామభక్తిని గూర్చి ఈ విధంగా తెలియజేశారు. "పేరుకు రామదాసే గాని, నిజం చెప్పాలంటే రామదాసుకు రాముడే దాసుడయ్యాడు. రామదాసు పంపినట్లు రాముడు తానీషా వద్దకు వెళ్ళి డబ్బు చెల్లించాడు. తాను రామదాసు సేవకుడనని చెప్పకున్నాడు. భగవద్భక్తి భగవంతునికి దాసుణ్ణి చేస్తుంది అనే సత్యాన్ని రామదాసు భక్తి మరియు జీవితం ధృవపరచింది". "ఉత్తమమైన భక్తి మార్గంలో నడిచిన వారికి భగవంతుడే దాసోహం అయి, వారికి ఒక సేవకుడిలా సహాయపడతాడు. అనే సత్యాన్ని రామదాసు జీవితం నిరూపించింది."[3] ఇదే అభిప్రాయం సుందర చైతన్యుల వారిది.

'శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు'గారు "రామదాసు జైలునుండి విడుదలైన తర్వాత తిరిగి భద్రాచలానికి వెళ్లెను. ఆ తర్వాత కొంతకాలానికి శ్రీరామ సాయుజ్యం పొందెను. భర్త మరణించిన కొంతకాలానికి భార్య మరణించెను. ఇప్పుడు ఆ వంశం వారెవరూ లేరు"[4] అని రామదాసు కారాగార వాసానంతరం జీవితం గూర్చి అభిప్రాయం వ్యక్తం చేశారు.

'శ్రీభద్రాచల క్షేత్ర మహాత్మ్యము'[5] నందు "రామదాసు కారాగారం నుండి విడుదలై రెండు నాణెములు మాత్రము పూజాదికములకై వెంట దెచ్చుకొని శ్రీరామ లక్ష్మణుల కలంకరించెను. నేటికి నవి యిట భాసించుచున్నవి. తానీషా తక్కిన ద్రవ్యమును తీసుకొని వెళ్ళమన్నను ఆ భక్తుడు అందు కంగీకరించలేదు. ఆ తరువాత కొంత కాలము ఇద్దేవునికి 'తానీషా యొసంగిన హసనాబాదు' పరగణా యనబడు నిప్పటి పాలవంచ - భద్రాచల ప్రాంతముల బాలింపుచు, శ్రీ సీతారామచంద్ర మహాప్రభువు వారి యనంత కల్యాణోత్సవములు, భోగోత్సవములకు వెచ్చించి భద్రాచలమున కొక కలియుగ వైకుంఠమనదగిన ఖ్యాతి గూర్చెను". ఈ విధంగా రామ కైంకర్యం చేస్తూ కారాగార వాసానంతరం భద్రాచలంలో జీవించియున్నంత కాలం తహసీల్దారుగా యుండి ఆ తర్వాత వృద్ధాప్యంలో శ్రీరామ సాయుజ్యం పొందెను" అని కొండపల్లి రామచంద్రరావు గారు తెలియజేశారు.

1. రామదాసు నాటకము - డి. వెంకట రమణయ్య - సప్తమాంకము.
2. భక్త కవి పుంగవులు - పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు.
3. పలుకే బంగారం (వ్యాసం), జనవరి/ఫిబ్రవరి, 1998, గిరిధారి, శ్రీ స్వామి సుందర చైతన్యానంద, పుట 50.
4. భద్రాచలము - శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు - భారతి, జులై 1951, పుట 654.
5. శ్రీ భద్రాచల క్షేత్ర మహాత్మ్యము - కొండపల్లి రామ చంద్రారావుగారు, పుట 44.

'రామదాసు చరిత్రము' అనే యక్షగానంలో యాదవదాసుగారు రామదాసు కారాగారం నుండి విడుదలైన తర్వాత భద్రాచలానికి వెళ్లి రామకైంకర్యం చేసి, రామ సాయుజ్యం పొందిన విషయాన్ని ఈ విధంగా తెలియజేశారు.

గీ॥ రామదాసు మీరు రమ్యంబుతోను
భద్రాగిరి జిల్లాకు పైనమయ్యి
అశ్వంబు భటులను కరుణ తోడ
కొంచుబోరయ్య జాగీరు గొనుము వేగ॥[1]

అని రామదాసునకు తానీషా భద్రాద్రి రామ కైంకర్యం నిమిత్తం, ఆతనికి సంపదగా తానీషా కానుకలుగా ఇస్తానంటాడు. అందుకు రామదాసు ఇచ్చిన సమాధానం ఇది.

కం॥ ఎందుకు మాకును జిల్లా
పొందుగ శ్రీరాము కడకు పోయెదనేనున్
సందేహింపక దశరథ
నందను బూజింపుచుందు నానందముతోన్ ॥[2]

రామదాసు తనకు ఏ కానుకలు, సంపదలు వలదని, శ్రీరాముని సేవిస్తూ కాలం గడుపుతానని అంటాడు. ఈ అశాశ్వతమైన సంపదలు, శాశ్వతమైన నా రామునితో సరిరావని అంటారు రామదాసుగారు. అంతట పాదుషాగారు రామదాసుతో 'నీవు నేను ఇచ్చే ఈ ఆరు లక్షలు భద్రాద్రి రామ కైంకర్యానికి జాగీరుగా పొందుము' అని అన్నాడు.

"అట్లు గాదు వినుము ఆ రామచంద్రుల పూజ చేయుచునెపుడు నాది
పురుష వరుని కైంకర్యమునకు జాగీరు నేడు నారు లక్షల వరహాలు నందుకొనుడు"[3]

అని పాదుషా, అబుల్ హసన్ తానీషా రామదాసునకు ఆరు లక్షల వరహాలు, ఇంకా ఇతర వస్తు వాహనాది ధనం అంతా ఇచ్చి వైభవంగా భద్రాచలానికి పంపుతున్నారు. అలా ఈయన వెళ్తుంటే మార్గ మధ్యాన చోరులు అడ్డగించడం, ఆ రాముడు వారిని తరిమి కొట్టడం జరిగింది. ఈ క్రింది దరువులో ఈ విషయం స్పష్టమైంది.

"అతి వైభవము తోడను రామదాసానందముగ తర్లెను - సతతంబు శ్రీరామ చంద్రుని పదములు మదిలోన దలచుచూ మహనీయు తేజుడ ॥ భక్తి మార్గము తోడుత రామదాసు బయలు దేరి బలు ధీరుడు । నక్తంచరుల బట్టి నేలకు ఫుతితేసి యుక్తితోడను దర్లెను సుర్వీశుడమెచ్చ ॥ నడుమ చోరులు వచ్చి ద్రవ్యము కొరకు నందరు మెచ్చరి సుందర రూపులు ముందర నడచిరి అందు వేగము చూడు జానకి సహితుడై ॥ రామదాసుని చూచియు భద్రాద్రి రాముని చూడవలయు । ప్రేమతో మ్రొక్కుచు భూమిజ నాథుని నామము దలచుచు నతి ముదమున దర్లె॥[4] ఈ విధంగా రామదాసు భద్రాద్రికి వెళ్ళాడు.

వ ॥ ఈ విధంబున తల్లి గోదావరి దాటి భద్రాద్రిం జేరి కోవెల బ్రవేశించి, ప్రదక్షిణంబులు జేసి మంగళ హారతి యిచ్చె".[5]

నారుమంచి సుబ్బారావుగారు ఈ విధంగా తెలియజేశారు.[6] "1687 ఆరంభమున రామదాసు జైలు నుండి విడుదలై భద్రాచలం వెళ్ళాడు. తానీషా ఇచ్చిన ధనముతో భద్రాచలం వెళ్తుండగా మధ్యలో రామదాసును చోరులడ్డగించి, ధనమపహరింప యత్నించిరి".

1,2,3,4,5 . రామదాసు చరిత్రము (యక్షగానం) - యాదవదాసు , పుట 60.

6. నారుమంచి సుబ్బారావు - సంగీత మహర్షులు పుట 44-45.

"పాహి రామప్రభో" అనే పాట పాడాడు. చోరులను రాముడు శిక్షించగా వారు పారిపోయారు" రామదాసు నిరంతరం రామనామ స్మరణం చేస్తూ, భక్త జనులతో కూడి వీధులందు తిరుగుచు, భద్రాద్రిని రామమయం ఒనరించుచుండ, కాలు నొప్పిచే, మూడు నెలలు రామాలయమునకు బోజాలనందుకు వగచుచు, యినుమడించిన రామభక్తితో తండ్రీ ! జీవితము దుఃఖమయము. వయస్సు గడిచినది. ఆరోగ్యము చెడినది. ఇకనైనను యీ దీనునకు నీ సాన్నిధ్య సౌఖ్యమీయరాదా ! తండ్రీ ! అని తలపించుచు, నిద్ర యెరుగక రామదర్శనాతురుడై రామస్మరణము సలుపుచుండ రాముడొక సమయమున నిట్లు పలికినటుల రామదాసునకు వినబడెను. రామనామంతో జనులను పునీతుల్ని చేయుము" అని అంత ఆ తర్వాత కొంత కాలానికి రామ సాన్నిధ్యము చేరెను".

నారుమంచి సుబ్బారావు గారు రామదాసు చోరులబారి నుండి రక్షింపబడటం, కాలునొప్పితో మూడు నెలలు రాముని దర్శించుకోలేక పోవడం అనే సంఘటనలు ప్రస్తావించారు. 1687లో రామదాసు ఖైదునుండి విడుదలైనాడని వ్రాశారు. కాని ఇది నిజం కాదు. 1677లోనే రామదాసు విడుదలైనట్లు చరిత్రకారులు తమ గ్రంథాలలో తెలియజేశారు. "12 సంవత్సరాల పాటు శిక్షను అనుభవించినా రాముడి కరుణ వల్లనే రామదాసుకు బంధ విముక్తి లభించిందనే విశ్వాసం త్యాగరాజుకు స్ఫూర్తినిచ్చింది. రామదాసు జీవితంతో ప్రభావితుడై త్యాగరాజు రామభక్తి మార్గాన్ని అనుసరించాడు"[1]

### 6.3. రామదాసు వేయించిన శాసనం :-

'వంగూరి సుబ్బారావుగారు, శ్రీ మద్దాల గురుబ్రహ్మ శర్మగారు - శ్రీ బ్రహ్మయ్య పంతులుగారికి "రామదాసు చెక్కించిన శిలా శాసనం గూర్చి వ్రాసిన దానిని వీరి శతక సంపుటంలో ప్రచురించారు.[2] ఆ లేఖలోని సారాంశం ఇది. ఆ లేఖ ఇది.

**మద్దాల గురుబ్రహ్మ శర్మగారి లేఖ - సర్వారావుపేట, 2-8-22.**

"ఆర్యవర్యా! నమస్కారములు. ఈ శాసనము భద్రాద్రిలో రాముల కోవెలకు దక్షిణ దిశను నిలువు రాళ్లమీద చెక్కబడియున్నది. దీనిని 80-90 యేండ్ల క్రిందట చెక్కించినట్టు కనబడుచున్నది. ఇందు వదలిన భాగమంతయు అగ్రహారములు, వృత్తులు పుత్సవాదులు మొదలైనవి కలవి. అనవసరమని వ్రాయలేదు. రామదాసుగారు ప్రథమమున వేయించిన శాసనమునెవరో చెక్కివేయగా ఆ సంగతులు తెలియుటకై తిరిగి వేయించినట్లు వ్రాయబడినది. ఇందువలన రామదాసుగారు ఖైదులోనే మృతి పొందక తిరిగి వచ్చి స్వామిని సేవించినట్లు చరిత్రలో వ్రాయబడిన రీతినే కనపట్టును. అక్కన్న, మాదన్నలను ఔరంగజేబు 1685 అక్టోబరు 29న చంపించెనని ఎపిగ్రఫీ జీ.ఓ లను వగయిరాలను బట్టి కనబడును. ఈ శాసనకాలం క్రీ.శ. 1652. దీని దాని మధ్య 33 ఏండ్ల వ్యత్యయము గలదు. పూర్వము రామదాసుగారు వేయించిన శిలా శాసనము కూడా ఆలయమందు పడియున్నది. కాని అది దృగ్గోచరము. ఈ శాసనములో 1554 నందన అని కనుపట్టుచున్నది. దీనిని అచ్చు వేయించి అమ్ముచున్నవారు 1574 అని వ్రాసిరి. రెండవది నందనకు సరిపోవుచున్నది. చెక్కడములో '7'కు బదులు '5'వలె చెక్కియుందురు. అచ్చు వేసిన వారు రామావరఘుల రామశాస్త్రి, పాడిచేటి సీతారామానుజాచార్యులు గారు భద్రాచలం కిమ్మతుం 0-1-0 వారు వేయించిన అచ్చు కాపీలో చాలా తప్పులు కలవు. నేను రాతితో సరిచూచి నా కాపి సవరించుకున్నాను (1574సం॥)

ఇట్లు

మద్దాల గురుబ్రహ్మ శర్మగారు.

---

1. తెలుగులో భక్తి కవిత్వం - సమకాలీన విశ్లేషణ - పిల్లలమర్రి రాములు , పుట 205-208, 1994, పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం, హెచ్‌సియు.

2. శతక సంపుటం - వంగూరి సుబ్బారావు గారు పుట 297-298.

"ఈ లేఖ మద్దాల గురుబ్రహ్మ శర్మగారు శ్రీ బ్రహ్మయ్య పంతులుగారికి వ్రాసినది. "గోపన్న చెరనుండి బయటికి రాక మరణించినట్లు జిల్లా మాన్యులులో నున్నట్లు శ్రీ బ్రహ్మయ్య పంతులువారు సెలవిచ్చిరి. అట్టి వారికి క్రింది శాసనములను, దానిపై అభిప్రాయమును వ్రాసిన శ్రీ గురుబ్రహ్మ శర్మగారి వాక్యములును సందేహ నివృత్తి చేయగలవనియా భాగము లుదాహరించుచున్నారు వంగూరి సుబ్బారావు గారు."

### 6.3.0. భద్రాచలమున ఆలయ ప్రాంగణమునందు గల శిలా శాసనము :-

"స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక వర్షంబులు 1574 అగు నేటి వర్తమాన వ్యవహారిక చాంద్రమాన నందన నామ సంవత్సర చైత్ర శుద్ధ నవమీలు భానువారం శ్రీ భద్రాచల సీతారామచంద్ర ప్రభువువారి సన్నిధిని - శ్రీరామదాసుగారు శ్రీ తానీషాగారి యనుమతి వెంబడిని జరిగించిన దేవ బ్రాహ్మణ వృత్తులు, శ్రీవారి సన్నిధిని జరిగే పుత్సవ ప్రకరణములు వ్రాసియున్న శాసనం - ధంసా ప్రపంచములో శ్రీవారు పోలవరం వలస వేంచేసినప్పడు ఒక దుర్మార్గుడు శాసనం చెక్కివేసినందున సర్వ జనులకు తెలిసి సంతోషించేందుకు లేకపోగా, ఆ దుర్మార్గుడు పుత్ర మిత్ర కళత్రాదుల తోటి నశించిపోయినాడు"

ఈ శాసనంలోని ఈ విషయం ఇంతవరకు శ్రీ మద్దాల గురుబ్రహ్మ శర్మగారు శ్రీ బ్రహ్మయ్య పంతులుగారికి వ్రాసిన లేఖలో ఉంది. తక్కిన శాసనం అంతా ఆలయ కైంకర్యం వివిధ ఉత్సవాదుల గూర్చిన వివరణ ఉంది. ఏ ఏ ఉత్సవానికి ఎంతెంత ఖర్చు చేస్తారో, ఆదాయం ఆలయానికి ఎంతున్నదో మొదలైన విషయాలున్నాయి. ఈ శాసనం "ధంసా" అనే దురాత్ముని దాడులకు చెక్కివేయబడినది. తర్వాత వరద రామదాసుగారు ఈనాడున్న శాసనం చెక్కించారు. ధంసా దాడులకు భద్రాచలంలో నున్న సీతారామ లక్ష్మణులు మొదలగు వారి విగ్రహాలు తొలగించి పోలవరంలో భద్రపరచి, ఆ తర్వాత నిజాం రాజుల కాలంలో తిరిగి పునః ప్రతిష్ఠ కావించినారు. పూజలు నిర్వహించినారు. ఈ శాసనంలోనే ఈ విషయం ఉంది.

". . . . . తదనంతరము శాలివాహన శక వర్షంబులు అగునేటి 1754,( ౧౭౫౪) నందన నామ సంవత్సరం, చైత్ర శుద్ధ ౯ ఇందువారం భద్రగిరి వరద రామదాసు అనే రామదాసు వంశమున జన్మించిన భక్తుడు కంచెర్ల వరద రామదాసుగారు అదివరకు దుర్మార్గులు ప్రపంచ పరిపాలన చేయుట చేతను దేవ బ్రాహ్మణ వృత్తులు నిరాటంకముగా జరుగుటలేనందున . . . . . . . హసనాబాదు పరగణాలో ఉండే దేవ బ్రాహ్మణ వృత్తులు అగ్రహారములు విమర్శించి సర్వ దుంబాలా జరుగగలందులకు యేర్పాటు చేసిన వివరములు -- " . . . . . . . అని కలదు."[1]

ఈశాసనం వలన, దీనిపై వివరణ ఇచ్చిన మద్దాల గురు బ్రహ్మ శర్మ గారి లేఖ ద్వారాను "బ్రహ్మయ్య పంతులు గారి అభిప్రాయం" తప్పని, తేలుతున్నది. ఈ శాసనం వలన రామదాసు కారాగారంలో మరణించలేదని, కారాగృహంనుండి విడుదలైనాడని, (1677లో ) భద్రాద్రి రామ కైంకర్యానికై తానీషా మాన్యాలు, అగ్రహారాలు ఇచ్చినట్లు స్పష్టమౌతుంది. ఇంతకన్న స్పష్టమైన నిదర్శనం రామదాసు రచించిన "తెలియక మోసపోతిని" అనే కీర్తన. దీనిని బట్టి కూడా రామదాసు ఖైదు నుండి విడుదలైనాడని, రామ లక్ష్మణులే ఆరు లక్షల పైకం చెల్లించి విడుదల చేశారని స్పష్టమౌతుంది. బ్రహ్మయ్య పంతులు గారు జిల్లా మాన్యువల్‌లో రామదాసు జైలునుండి విడుదల కాకుండా ఖైదులోనే మరణించారని ఉందని, వారు అభిప్రాయ పడ్డారు. అయితే కృష్ణాజిల్లా మాన్యువల్ లో మాత్రం రామదాసును రామలక్ష్మణులు తానీషాకు ఆరు లక్షలు ఇచ్చి విడుదల చేయించారని చెప్పబడి ఉంది. కృష్ణా జిల్లా మాన్యువల్‌లో ఈ విధంగా వ్రాయబడి ఉంది.

1. సమగ్ర శాసనము - 'రామదాసు కైంకర్యము' అను పేరుతో భద్రాద్రి శ్రీ సీతారామ విలాసినీ గ్రంథమాల వారు ద్వితీయ పుష్పముగా ప్రకటించిరి. భద్రాచలం.

"...... then the King knew that it was Rama and Lakshmana who had brought the treasure, sent orders to release Ramadas and allotted for the support of the temple at Bhadrachalam the revenues of several villages which the temple holds to this day. This legend is told in a printed book of ballads entitled " Ramadas Khaidu" (imprisonment of Ramadas), which are sung by many devotee Hindus with much feeling especially do they admire the pathos of the verse in which Ramadas bewails his wretched captivity." [1]

రామదాసు జైలునుండి విడుదలైన తర్వాత తానీషా భద్రాచలం రామకైంకర్యార్థం అగ్రహారాలు, మాన్యాలు దానంగా ఇచ్చాడని, అవన్నీ ఇచ్చి రామదాసును వైభవంగా భద్రాచలం తిరిగి పంపాడని తెలుస్తుంది. బ్రహ్మయ్య శాస్త్రి గారు ఏజిల్లా మాన్యువలులో చూసి అలా అభిప్రాయపడినారో తెలియదు.

జి. కృష్ణ గారు "ప్రముఖ వాగ్గేయకారులు " అనే పుస్తకంలో భద్రాచల రామదాసు విడుదల ఎవరి కాలంలో జరిగిందనే దానిపై ఈ విధంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "అబ్దుల్లా కాలంలో రామదాసు బంధింపబడి ఉంటే, అబ్దుల్లా సామర్థ్య లోపం వలన ఒక్కొక్కప్పుడు క్రూరుడు, ఒక్కొక్కప్పుడు జాలిగలవాడు. అతడు ఒక స్థితిలో రామదాసును చెర విడిపించి ఉండవచ్చు. అతడు కాక, అబుల్ హసన్ తానీషా గనుక పరిపాలకుడయి ఉన్నట్లయితే, దైవభక్తి కలవాడు కాబట్టి రామదాసును విడిచి ఉండవచ్చు. దైవభక్తి లేదా అనేదానికి ఋజువు మానవతా దృష్టి. మతదృష్టి మాత్రమే ఉన్నవారికి మానవతా దృష్టి ఉండకపోవచ్చు. దైవభక్తి ఉండడానికి మానవతా దృష్టి అవసరం. మానవతా దృష్టి లేనందువలననే మనదేశంలో మత కలహాలు సంభవిస్తూ ఉంటాయి కదా." [2]

అబ్దుల్లా కాలంలో చెరలో ఉంచబడి, అబుల్‌హసన్ తానీషా కాలంలో మానవతా దృష్టి గల ఈయన వలననే విడుదలైనాడు రామదాసు. అబ్దుల్లా ఏనాడూ రాజ్య వ్యవహారాలు సరిగా చూసేవాడు కాదు. ఎప్పుడూ ఏదో ఒక ప్రదేశానికి యాత్రలు వెళ్ళేవాడు. భోగలాలసుడై జీవించాడు. అందుకే అబ్దుల్లా రామదాసును చెరనుండి విడిపించే ప్రయత్నం చేయలేదు. తానీషా ఒకవేళ చెర విముక్తుని చేసే ప్రయత్నం స్వయంగా చేసినా, రామదాసు రామానుగ్రహం కోసం ఎదురు చూసినాడని చెప్పవచ్చును. అందుకే రామానుగ్రహం వలననే 12 సం॥ల తర్వాత తాను రామాలయ నిర్మాణానికై వ్యయం చేసిన ఆరు లక్షల పైకం తానీషాకు రాముడే స్వయంగా వచ్చి చెల్లించేలా చేసి, ఆ తర్వాత చెరనుండి విడుదలైనాడు. ఏనాడూ తాను చెర విముక్తుడు కావాలని ఎందరో సహాయపడేవారున్నా వారి సహాయం పొందలేదు. ఇది రామదాసు యొక్క ధర్మనిరతి. వ్యక్తిత్వం.

"అబుల్ హసన్ మత సహనం కల ప్రభువు. తానీషా (బాలయోగి) అని బిరుదు పొందిన వాడు. అధ్యాత్మిక చింతన కలవాడు తన తప్పును మన్నిస్తాడని తలచిన రామదాసు నమ్మకం వమ్మయింది. సొమ్ము చెల్లిస్తేనే రామదాసును విడిపించాడు." [3] ఈ సందర్భంలో యాదవదాసు వ్రాసిన రామదాసు చరిత్రము యక్షగానంలో తానీషాకున్న ధన వ్యామోహం ఎంతటిదో ఈ సంభాషణలో తెలియజేయబడి ఉంది.

పాదుషా : అర్థమంతయు దెచ్చినారా - లేకుంటె వేగ వ్యర్థులవలె వచ్చినారా ॥
మూర్తతనంబులు దుడుకుతనంబులు - వ్యర్థముగాకను వేగిరముడుగుడు ॥
రామలక్ష్మణులు : మూడు లక్షలు తెచ్చినాము - మాచేతగాదు కొదువది నేడిచ్చెదాము ॥
కోడు బాలయకను జాగ్రత తోడుత - నేడు లోకముల కూడి తిరిగెదము ॥

1. Krishna District Manual - P.No. 37 - 38.

2. ప్రముఖ వాగ్గేయకారులు - జి. కృష్ణ - పుట 22.

3. భద్రాద్రి రామదాసు రచనలు - డా॥ కె.కుసుమాబాయి (వ్యాసం) పుట 134. గోల్కొండ ప్రభువుల కాలం నాటి భాషా సాహిత్య సేవ - జాతీయ సదస్సు - సంచిక 1991 మార్చి హైదరాబాదు నాలుగుశతాబ్దాల సాహిత్య వికాసం. సంపా॥ ఎస్వీ రామారావు. తెలుగు అకాడమీ ప్రచురణలు.

*పాదుషా : ఆరులక్షలు వడ్డీ తోను యిస్తేగాని - భావము తోడుత విడువాము ॥*

*బలుకకను నారు లక్షల వరహాల్ - నిష్పింపుడి మాకు ॥*

*రామ లక్ష్మణులు : ఇంతకోపం యెందుకయ్య పాదుషా - వినుమంతా మీకు దెచ్చితిమయ్య ॥*

*చింతయేల నిక శీఘ్రము లెండిక - యంతయు యిచ్చిమే మావలబొయ్యెము వినుము తానీషా ॥*

*పాదుషా : బైరోజి బైరోజి నిలిచినారు - తడవాయె బయితాకు చేరి యిచ్చెదారు ॥*

*హోరముచే పైకము నారు లక్షలు పట్టుమని యిచ్చియు దండి పైకము లేవగ ॥ . . .*[1]

ఈ సంభాషణను బట్టి రామదాసును ఆరు లక్షలకు ఒక్కపైసా తగ్గినా విడిచేదిలేదని తానీషా చెప్పినట్లు విశదమౌతుంది. తానీషా ఆరులక్షలు అసలు, దానికి 12 సం॥లకు వడ్డీ లెక్కకట్టి ఇవ్వమని రాముడిని కోరాడు. రాముడు తానీషా మనస్తత్వం తెలుసుకోడానికి తాము మూడులక్షలే ఆ సమయంలో తెచ్చామని, తక్కినది తర్వాత రోజున ఇస్తామని చెప్పినా కూడా, తానీషా అందుకంగీకరింపక కోపోద్రిక్తుడైనాడు. అంతట రాముడు అంతా సొమ్ము తెచ్చామని, అసలు ఆరు లక్షలు, వడ్డీ నాలుగు లక్షలు కలిపి పది లక్షలు ఇచ్చి వెళ్లారు తానీషాకు. ఇందులో తానీషా మనస్తత్వం, ధనాశ వ్యక్తం అయింది. అందుకే తర్వాత ఆ వచ్చి వెళ్లింది రామ లక్ష్మణులను గ్రహించి, ధనాశతో వారిని గ్రహించలేక పోయానని పశ్చాత్తాప పడినాడు. ఈ విషయం రామదాసు రచించిన 'తెలియకనే మోసపోతిని' అనే కీర్తనలో కూడా చెప్పబడి ఉంది.

ధర్మవరం గోపాలాచార్యులు గారు రచించిన 'రామదాసు నాటకము'[2] నందు రామ లక్ష్మణులకు తానీషా ఇచ్చిన రసీదు, భద్రాద్రిలో ఉన్నట్లుగా వ్రాయబడి ఉంది. ఈనాటకంలో ఇలా వ్రాశారు వారు. "తానీషా ఇచ్చిన రసీదు ( ఆరు లక్షల పైకం రామలక్ష్మణులిచ్చి తానీషా కడ తీసుకున్న రసీదు) భద్రాద్రిలో ఉంది. ఆ రసీదును ఎవరో తెస్తుండగా, అనుమానం వచ్చి అతనిని భటులు తానీషా కడకు ప్రవేశపెట్టారు. అది చూసి తన చేవ్రాలుగా భావించి ఆ రసీదుని గాంచి ఆశ్చర్యపోయాడు తానీషా. అంతట రామదాసు కడకు వెళ్లి ఆ రసీదు చూపి, తమ సొమ్ము రాముడే ఇచ్చి వెళ్లాడని చెప్పి చెఱ విముక్తుని చేశాడు తానీషా రామదాసును. రాముల వారి మొలదగ్గె గుడ్డపై తానీషా చేవ్రాలు తోనున్న రసీదు ఇది. తానీషా తాను గాంచినది రాముడినే అని తనకు రామదర్శనమైనదని భావించి, అవివేకంతో వారిని గాంచనైతినని దుఃఖించాడు. 'సితార' మీరు గాంచినది రామ లక్ష్మణులనే అని చెప్పింది. రామదాసుకు క్షమాపణలు చెప్పమని, ప్రాయశ్చిత్తం చేసుకోమని కూడా చెప్పిందామె.

అంతట రాముని స్తుతిస్తాడు తానీషా. 'రామ్ రహీమ్ ఏక్ హై' అని అర్థం చేసుకుంటాడు. రామదాసుకున్న నిర్మలమైన భక్తిని తెలుసుకోలేక తానీషా యెడ కఠినంగా ప్రవర్తించినందుకు క్షమించమని, తానీషా రామదాసును వేడుకుంటాడు. ఆ సందర్భంలో -"రామదాసు తన శిరస్సును అర్పింప సిద్ధం కాగా, తన ధనమంతా ముట్టిందని, తానీషా అంటాడు. అంతట రామదాసు "తానాధనం ఇయ్యలేదని, మీకిచ్చిన వానిని, చూడలేదని," అని వానిని చూసిన నేను నమ్ముతాను అని, లేకున్న తన ప్రాణాలు తీసికొనమని తానీషాను రామదాసు కోరాడు ."

కబీరు ఆ సమయంలో అక్కడికి మరల వస్తాడు. తానీషా ఆస్థానానికి, రామదాసుండగా వచ్చి, రాముడే అప్ప తీర్చాడని అంటాడు రామదాసుతో తానీషా ఆ రాముని చూపమని కబీరుతో అంటాడు. అప్పుడు కబీరు నీకు రామునితో పనియేమి. ఆయన మానవుడు. అధర్మవర్తనుడు. అసత్యవాది. దరిద్రుడు. భక్తులను రక్షింపలేనివాడు. నీవు భూపాలుడవు. రామదాసును మంత్రిచేయగలిగిన వాడవు. అతని కొడుకుని చక్రవర్తిగా చేయగలవు. అందుకు సర్వశక్తుడవు. అని నిష్ఠురోక్తులాడుతూ తానీషాను తూలనాడగా తానీషా

1. రామదాసు చరిత్రము - యాదవదాసు ( యక్షగానం ) పుట 50.

2. రామదాసు నాటకము - ధర్మవరం గోపాలాచార్యులు - పంచమాంకము.

తన తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడినాడు. రామదాసును శిక్షించినందుకు దుఃఖిస్తాడు. అంతట తానీషా ఆరులక్షల పైకంతో పాటు మరొక ఆరులక్షలు చేర్చి ఆ రామునికే సమర్పించానని, తానిక రాజ్యభారం వదలి, దైవ చింతనతో కాలం గడుపుతానని కబీరుతో అన్నాడు. రామదాసు, తానీషాల పూర్వ జన్మగాథను గూర్చి, రాముడు ఇక్కడ ప్రస్తావిస్తాడు. "పూర్వజన్మ కర్మానుభవం వలన వీరిలో ఒకరు రాజుగా ఉన్నారు, మరొకరు ఏడు దినాలు ఖైదులో ఉన్నారు" అని వ్రాశారు. రామదాసు, తానీషాలిరువురు సహోదరులుగా పూర్వజన్మలో ఉన్నారు. ఇరువురు సజ్జనులే. ఒక తాపసి శాపవశాన చిలుకయై మానవభాషలో మాట్లాడుచుండగా, ఆ చిలుకను రామదాసు పట్టి పంజరంలో ఉంచి, అది ఎంత వేడినా ఏడు దినాలు నిర్బంధించాడు. చిలుక శాప ఫలమిప్పుడనుభవించింది. రామదాసు ఏడు దినాలు ఖైదులో ఉన్నాడు. తానీషా మోక్షాభిలాష చేత తపస్సు చేస్తూ పరమాత్ముడు ప్రత్యక్షమయ్యే సమయాన తపోభంగం గావింప వచ్చిన గంధర్వ స్త్రీని చూసి, కాముడై నందున భూపాలకుడై జన్మించాడు. ఆ గంధర్వాంగనయే 'సితార'. (తానీషా భార్య) ఆగరుత్మంతుడే కబీరు. అచిరకాలంలోనే మిమ్మల్ని వైకుంఠానికి పిలిపిస్తాను. మీకు శుభం కలుగుగాక ! అని రాముడు చెప్పాడట. అహ్మద్ - రామదాసు పట్టి ఉంచిన చిలుకట. గరుత్మంతునకు రెక్కలు వచ్చినపుడు నీకు రెక్కలు రాగలవని రాముడు అహ్మద్ కు చెప్పినాడట." ఈ కథ అంతా కల్పితమే. వీరు వ్రాసిన నాటకంలో చారిత్రకంగా పరిశీలిస్తే అనేక దోషాలు కూడా ఉన్నాయి. 'కబీరు' ప్రస్తావన ఇక్కడ కల్పితం. అసమంజసం. ఇంతకు పూర్వం కబీరుకు, రామదాసుకు సంబంధం లేదని నిరూపించాను. కబీరు - తానాషాను దండించడం అసత్యం. అయితే ఈ విషయం ద్వారా తానీషాకు రామదాసు గూర్చి, రామునిపై అతనికున్న భక్తి విశ్వాసాల గూర్చి తెలియకపోవడం వలన, విశ్వాసం లేనందువల్లనే, తానే రామదాసును విడిపిస్తానని అన్నట్లు వ్రాశారు రచయిత. అయితే ఇది కూడా కల్పితమే.

మరో ముఖ్య విషయం 'రామదాసు' తానాషాకు ఆరు లక్షలిచ్చిన వానిని చూపని అడగడం, లేకుంటే ఆత్మార్పణ చేసుకుంటాననడం, అప్పుడు కబీరు వచ్చి రామదాసుకు రాముడే తన అప్పు తీర్చాడని చెప్పడం. ఇది కల్పితమే. మరో ముఖ్యాంశం, రామదాసు ఏడు రోజులు జైలులో ఉండి, ఏడు రోజుల తర్వాత విడదలైనాడని వ్రాశారు. ఇది చారిత్రకంగా అసత్యం. 12 సం॥లు ఉండి విడుదలైనాడు. ఇందుకు ఎన్నో చారిత్రక గ్రంథాలు, ఆయన కీర్తనలే సాక్ష్యం. దీన్ని గూర్చి పూర్వ అధ్యాయంలో నిరూపించాను. ఇవన్నీ గమనిస్తే ధర్మవరం గోపాలచార్యులు గారు చారిత్రక గ్రంథాలు, కీర్తనలు పరిశీలింపకుండానే, కల్పించి ఈ నాటకం వ్రాశారని స్పష్టమవుతుంది. ఇందు ఎన్నో చారిత్రకాధారాలకు విరుద్ధమైన అంశాలున్నాయి. దోషాలు దొర్లినాయి. 'భక్త రామదాసు అను రామదాసు విజయం'[1] అనే నాటకంలో ఈ విధంగా వ్రాయబడి ఉంది. " తానీషా రామదాసు రామభక్తికి ఆశ్చర్యపడి రామదాసును క్షమాపణ కోరి, అతనిని ఖైదునుండి విడిపించాడు. రంగారావు తదితరులు భద్రాచలం ధనం ఆరు లక్షలు పంచుకొని ఆ నిందను రామదాసుపై వేసి ఆయనకు శిక్ష పడేలా చేశారీ దుర్మార్గులు. మాదన్నకు విషయం తెలిసి వానిని శిక్షింపదలచాడు. అయినా అతనిని క్షమించమని రామదాసు అన్నాడు. రామదాసు క్షమాగుణం, దయా గుణం అట్టిది. తానీషా రామదాసుకు భద్రాద్రి రామ కైంకర్యానికై ధనం సహాయం చేశాడు. కబీరు, శారదాంబ తానీషా వద్దకు వచ్చారు. రామదాసు భద్రాద్రికి తిరిగి శ్రీరామనవమి నాడు వెళ్ళి తన మిత్రుడు వేంకటేశాన్ని, తన తనయుడిని కలుసుకుంటాడు. రామభజన చేస్తూ కాలం గడుపుతాడు. రామైక్యం చెందాడు."

ఈ నాటకంలో కూడా 'కబీరు' రామదాసును చూడడానికి రావడం నిజం కాదు. జైలు నుండి విడుదలైన తర్వాత రామదాసు భద్రాచలం వెళ్ళి తహసీల్దారై ఆ తర్వాత కొంత కాలానికి రామైక్యం చెందాడు అని ఈ నాటకంలో ఉంది.

---

1. భక్త రామదాసు అను రామదాసు విజయం - కీ.శే. వేటవరపు శివరామశాస్త్రి గారు - షష్ఠ్యాంకము.

'రామదాసు' అనే రామనారాయణ కవులు రచించిన నాటకంనందు, రామదాసు కారాగార వాసానంతర జీవితం గూర్చి ఈ విధంగా తెలియజేయబడింది. ఈ నాటకంలో కూడా రామదాసు, తానీషాల పూర్వ జన్మ వృత్తాంతం గూర్చి ప్రస్తావింపబడి ఉంది. "తానీషా తన పైకం రామ లక్ష్మణుల ద్వారా అందగానే, రామదాసును అతని రామభక్తిని కొనియాడి, చెరనుండి విముక్తుని గావించి, తనను క్షమించమని కోరాడు. తానీషా పైకం చేరినట్లు రసీదివ్వబోగా, రామదాసు ఆ రసీదు తన దగ్గరుందని చెప్పగా, ఆశ్చర్యపోతాడు తానీషా. రామదాసు గొప్ప రామభక్తికి ముగ్ధుడైనాడు తానీషా. ఎన్నో మర్యాదలు చేసి, మాన్యాలు, ధనం, అగ్రహారాలు భద్రాచల రామ కైంకర్యానికై దానంగా ఇచ్చాడు తానీషా రామదాసును గౌరవంగా పల్లకీ ఎక్కించి భద్రాద్రికి పంపాడు తానీషా. భద్రాద్రి రామ కైంకర్యంతో జన్మ తరించింది రామదాసుకు.

'గోపన్న' అనే గ్రంథంలో గరిమెళ్ల సత్యగోదావరి శర్మగారు ఈ విధంగా తెలియజేశారు. గోపన్నను తానీషా భటులు చెర విముక్తుని గావించారు. అతని భార్య, పుత్రులు మంగళహారతులు ఇచ్చి గౌరవంగా, అక్కన్న మాదన్నలతో కూడి రామదాసును తానీషా వద్దకు తీసుకుని వెళ్లారు. గోపన్నను, తానీషా తన ఏకాంత మందిరానికి సాదరంగా తీసుకొని వచ్చి ఆశీనుని చేసి గౌరవించి, తన తప్పులను క్షమించమని కోరాడు. రామదాసు గొప్ప రామభక్తిని కొనియాడాడు. రామదాసును ద్రోహిగా తలంచి, వేసిన 12 ఏండ్ల శిక్షను తలచుకొని పశ్చాత్తాప పడినాడు తానీషా.

తానీషాకు రామ సాక్షాత్కారం కలుగగానే ఆనంద పడ్డాడు. "ఆరు లక్షల అసలు, నాలుగు లక్షల వడ్డీ మొత్తం పది లక్షలు తనకు రామ లక్ష్మణులు వచ్చి ఇచ్చారనీ, రసీదు పుచ్చుకొని వెళ్లారని చెప్పాడు తానీషా. ఆ రసీదు రామదాసుకు అందిందో లేదో అని, మరొక రసీదు కూడా తయారు చేసి రామదాసుకు ఇచ్చాడు. తాను చేసిన మహాపరాధానికి దుఃఖించి, తానీషా భద్రాచలాన్ని రామునికై దానంగా ఇస్తున్నట్లు చెప్పాడు. ఆయనను పల్లకీలో భద్రాచలానికి సాదరంగా పంపాడు. తానీషా కూడా స్వయంగా భద్రాచలం వెళ్లాడు. ఇదంతా స్వప్నంవలె రామదాసుకు గోచరించింది. తానీషాకు రామదర్శనం అయినందుకు, అతనిని ధన్యుడైనాడని కొనియాడాడు రామదాసు. తానీషా నిందించక తన పూర్వ జన్మ కర్మఫలాన్ని ఈ జన్మలో అనుభవించినట్లు, అంతా రామ కటాక్షం వల్లనే జరిగిందని అన్నాడు. తానీషా, రామదాసు ఉదారస్వభావానికి ఆశ్చర్యపోయి ఆయనకు పాదాభివందనం చేశాడు. గోపన్నకు గొప్ప బహుమానాలిచ్చి గౌరవించి, రామదాసుగా కొనియాడాడు తానీషా. రామభక్తునిగా ఆయన జన్మ ధన్యమైంది.

'రామదాసు చరిత్రము' అనే హిందూస్థానీ నాటకంలో ఈ విధంగా ఉంది. "రామదాసు రామ లక్ష్మణులు ఆరు లక్షల పైకం తానీషాకు చెల్లించిన తర్వాత తానీషాచే విడుదల చేయబడి, గౌరవింపబడినాడు. తానీషా భద్రాద్రి రామ కైంకర్యానికై అగ్రహారాలు, మాన్యాలు, ధనం ఇచ్చి, రామదాసును సగౌరవంగా భద్రాచలానికి తిరిగి తహసీల్దారుగా నియమించి పంపాడు. తానీషా రామదాసును కొనియాడాడు. రామదాసు భద్రాచలానికి వెళ్లి ఆ తర్వాత రామ కైంకర్యంలోను, రామ భజనలోనూ కాలం గడిపి, రామ సాయుజ్యం పొందాడు."

"రామదాసు చరిత్రము"[1] కావ్యంలో చల్లా పిచ్చయ్య శాస్త్రిగారు ఈ విధంగా వ్రాశారు. "రామదాసు కారాగార విముక్తుడైనాడు. తానీషా రామదాసును గౌరవంగా సన్మానించాడు. గోపన్నకు భద్రాచలం తాలూకాను రామ కైంకర్యానికై బహుమానంగా దానంగా ఇచ్చాడు. ఇంకను ఇతర కానుకలు ఇచ్చాడు. గోపన్న , అతని భార్య, పుత్రుడు, తానీషా, అతని భార్యలు బంధు మిత్రులు అందరూ భద్రాచలం వెళ్లి సీతారాములను దర్శించి, కీర్తించారు. రామ కైంకర్యంతో తన చరమ జీవితం గడిపి చివరకు రామునిలో ఐక్యమైనాడు రామదాసు.

1. రామదాసు - రామనారాయణ కవులు - పంచమాంకము (నాటకం).
2. రామదాసు చరిత్రము - హిందూస్థానీ నాటకము నాదెండ్ల పురుషోత్తమ కవి.
3. రామదాసు చరిత్రము - చల్లా పిచ్చయ్య శాస్త్రి - పంచమాశ్వాసం.

'శ్రీ రామదాసు నాటకం' నందు కేశిరాజు వేంకట సుబ్బారాయ కవి గారు రామదాసు జైలు నుండి విడుదలైన తర్వాత జీవితాన్ని గూర్చి ఈ విధంగా ప్రస్తావించారు. రామ దర్శనంతో తానీషా రామదాసును ఖైదునుండి విడిపించి సాదరంగా గౌరవించాడు. రామదాసు రామభక్తిని తెలుసుకోలేక తానీషా తాను చేసిన తప్పుకు పశ్చాత్తాప పడి, రామదాసును క్షమాపణ కోరుకుంటాడు తానీషా. రాముని నిర్ణయం ప్రకారం తాను 12 సం॥లు కారాగారవాసం అనుభవించాననీ, ఇందు తానీషా తప్పేమీ లేదని అంటాడు గోపన్న. రామదాసు గొప్ప మనసుకు, ఉదార స్వభావానికి ఇది తార్కాణం. తానీషాకు రామదర్శనం అయినందుకు అతడు ధన్యుడైనాడని, రామదాసు తనకు ఆ అదృష్టం లభించలేదని దుఃఖించాడు. రామదాసుకు తానీషా ఎన్నో కానుకలు, ధనం ఇవ్వగా అదంతా భద్రాద్రి రామునికే అర్పించి, భద్రాచలానికి వెళ్ళి ఆ ధనమంతా రామ కైంకర్యానికి వినియోగించాడు. తానీషా రామభక్తుడైనాడు. రామనామ స్మరణంతో కాలం గడిపాడు. మరల భద్రాచలం తహసీల్దారుగా అక్కడే శేష జీవితం గడిపి, రామునిలో ఐక్యమైనాడు. భద్రాచలం పరగణాను రామాలయానికై, రాముని కైంకర్యానికై దానంగా ఇచ్చాడు తానీషా.[1]

"Great Composers"[2] అనే గ్రంథంలో రామదాసు జైలు నుండి విడుదలై తర్వాత తానీషాచే గౌరవింపబడి, తిరిగి భద్రాచలానికి తహసీల్దారుగా నియమింపబడి, గౌరవంగా పంపబడినాడని, వ్రాయబడిఉంది. డా.వి. రాఘవన్ గారు ఈ విధంగా వ్రాశారు.

"Tanishah, on his part, expressed his gratitude to Ramadas, loaded him with enormous money, put him on a palanquin and sent him to Bhadrachalam to continue his devotion and service to Rama. To keep guard over his devotee and the riches he was taking, Rama and Lakshmana walked, bow in hand, on either side of the Palanquin? so says Ramadas in his song".

రామదాసును పల్లకీలో ఉంచి ధనం ఇచ్చి, రామ కైంకర్యాన్ని చేయించడానికై తానీషా భద్రాచలానికి పంపాడు. పల్లకీకి ఇరువైపుల రామ, లక్ష్మణులు ఉండి కాపలాగా అతనిలో కూడి వెళ్ళారట. ఈ విషయం "రాముడే గలడు"[3] అనే కీర్తనలో ప్రస్తావింపబడింది. రామదాసు తిరిగి భద్రాద్రి తాలూకా తహసీల్దారుగా కూడా నియమితుడైనాడు.

"Rama blessed Ramadas too with darshan for which Ramadas had been earning"

"రామా నీ ముద్దు మోము జూపరా"[4] ఈ కీర్తనలో రాముడిని దర్శించుకొన్న రామదాసు, రాముని కృప రామదాసుపై చూపినందుకు, ప్రసరింపజేసినందుకు, రామదాసు రాముని ఈ విధంగా స్తుతించాడు, వర్ణించాడు.

**అసావేరి - ఏక**

రామా ! నీ ముద్దు మోము జూపరా సుందర రామా
నీ ముద్దు మోము జూపరా రామా భద్రాచల ధామా తారక నామా రామా ॥
నీ ముద్దు మోము నే గంటిగా - నిన్ను చాలా నెర నమ్మి యున్నానుగా
నే నితర దైవముల వేడబోనుగా - విడువని బిరుదు గట్టుకొన్న నిన్నేగాని
యొట్టు పెట్టుకొంటి నొప్పల కుప్పవంటి ॥
మురిపెంపు కొప్పు బిగి వీడగా - ఆణిముత్యాల సిరులల్లాడగా - లేమి కిరవయిన నడుమసియాడగా
అట్టె బిర బిర వచ్చి మాపీన తల్లి సుమిత్ర స్థిరముగ కస్తూరి తిలకము దిద్దిన ॥
ముద్దు గదుర నింపొందగా - మోదమందించుచును లాలింపగా - ముద్దు

1. శ్రీరామదాసు నాటకము - శ్రీ కేసిరాజు వేంకట సుబ్బారాయ కవి. పంచమాంకము.
2. "Great composers" - V. Raghavan, Bhadrachala Ramadas P.No.17.
3. భక్త రామదాసు కీర్తనలు సంకలనం - దాశరథుల బాలయ్య , పుట 106, కీర్తన 128.
4. భక్త రామదాసు కీర్తనలు సంకలనం - దాశరథుల బాలయ్య , పుట 111-112, కీర్తన 134.

లన్నా రమ్మని దీవింపగా సురలు వెన్నుడే రాముడని వినుతించ భద్రాద్రి
చెన్నుడయినట్టి చిన్నారి బాలుడ ॥[1]

రామదాసుగారు 12 సం॥ల తర్వాత మరల రాముని దర్శించగానే తన్మయత్వంలో రా సొగసును వర్ణించాడు. బాల రాముడు ఆయనకు సాక్షాత్కరించాడు "భద్రాద్రి రాముని" బాలుడిగా భా బాలరామునిగా చూసి రామా ! నీ ముద్దులొలికే ఆ మోము, సుందర వదనారవిందం చూపరా ! చూసి తరిస్తానురా ! అని ఆనంద పారవశ్యంలో మునిగి తేలుతూ అద్భుతమైన ఈ కీర్తన ఆలపించాడు సం॥లు తర్వాత నీ ముద్దుల నగుమోము కన్నానురా ! నా జన్మ ధన్యమైందని ఆనంద భాష్పాలు రా కన్నీటితో రామపాదాలు కడిగాడా మహానుభావుడు.

"In the eastasy of the sight of Rama, Ramadas sang "కంటి నేడు మా రాముల కనుగొ నేడు" ఈ కీర్తనకు వివరణ ఇంతకు ముందే తెలియజేశాను. రాముని ఎన్నో ఏళ్ల తర్వాత చూడ గలిగినంద భద్రాద్రి సీతారాములను అద్భుతంగా ఈ కీర్తనలో వర్ణించాడు. స్తుతించాడు.

Taking him liation and honour as equal, deeming as friends even those who subjected l to suffering, Ramadas, exemplifying the Gita ideal of equanimity, Tulya, ninda stutih tulyo.

"తుల్య, నిన్దాస్తుతిః, తుల్యోమనపమనయోః" మరియు "తుల్యోమిత్ర: పక్షయోః" అని గీతా సారం. became the receipient of the grace of the Lord in full.

రాముని తన స్నేహితుని వలె, తనతో సమానంగా భావించి కోపగించాడు. మరల పొగిడా ఇందు నిందాస్తుతి ఉంది. కొన్నింటిలో స్తుతితో కూడిన నింద ఉంది. ఇది భక్తితో చేసిన నిందారోప మరియు నన్ను ఎవరు దూషించినా, నా రాముని ఎవరు దూషించినా నేను రామునికి దాసుడనే. నా అన్ని విధాలా సహాయపడేవాడు రాముడే అని అంటున్నారు రామదాసుగారు. ఈ కీర్తనలో "తన సర్వస్వ రాముడేనని" ఆ రాముని దయ వలనే తాను బంధ విముక్తుడైనందుకు కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తున్నాడ ఈ విధంగా కీర్తిస్తున్నాడు.

**"బిలహరి - త్రిపుట"**

'ఎవరు దూషించిన నేమి - మెచ్చి యెవరు భూషించిన నేమి' అనే కీర్తనలో రాముడు నాకు సర్వస్వం అ అంటూ కీర్తించారు.

*ఎవరు దూషించిననేమి - మెచ్చి యెవరు భూషించిన నేమి ?*
*అవగుణములు మాన్పి - యార్చేరా తీర్చెదరా? నవనీత చోరుడు నారాయణుడుండ ॥*
*పిమ్మట లాడిన నేమి - మంచి ప్రియములు పల్కిననేమి కొమ్మరో రమ్మని కోరికలొసగెడి*
*సమ్మతి నాపాలి సర్వేశ్వరుండుండ ॥ వాసి పంతము మాకేల - వట్టి వాదుల తోడ పోరేలా*
*దూషించే వారితో పలుమారు పొందేలా కాచి రక్షించెడి ఘనుడు రాముడుండ ॥*
*అపరాధములు నెంచువారు - మాకు ఉపకారులై యున్నవారు విపరీత చరితలు వినుచు నెల్లప్పుడు*
*కపట నాటకధారి కనిపెట్టి యుండంగ ॥ వాసి వన్నెలు నల్పనేల - మూడు వాసనల భ్రమయనేల*
*వాసిగ భద్రాద్రిదాసుడై నిరతము భాసురముగ రామదాసుడై యుండంగ ॥[2]*

నేను అపకారికైనా ఉపకారం చేయగలవాడిని. నా రాముడు నాకు తోడుగా ఉండగా ! నాకెందుకు భయం. నన్ను దూషించినా, నన్ను మెచ్చి కానుకలొసగినా, నాకు అవసరం లేదు. అన్నీ రాముడే చూస్తాడు. నన్ను గూర్చి నీచంగా ఎవరైనా పలికినా నాకు బాధ లేదు. కారణం, ఏ బాధ కల్గకుండా నన్ను భద్రాద్రి రాముడు పదిలంగా చూస్తాడు.

1. భక్త రామదాసు కీర్తనలు సంకలనం - దాశరథుల బాలయ్య , పుట 51, కీర్తన 54.
2. భక్త రామదాసు కీర్తనలు సంకలనం - దాశరథుల బాలయ్య , పుట 32, కీర్తన 31.

నాలో దోషాలెన్నే వారిని కూడా నేను దోషిగా భావించను. వారిని కూడా క్షమించే గొప్ప గుణం, ఔదార్యం నా రామయ్యకుంది. ఇంతెందుకు అన్ని విధాలా అందరినీ కాపాడే జగద్రక్షకుడు భద్రాద్రి రాముడు. అని ధైర్యంగా ఢంకా బజాయించి మరీ చెప్పాడు. రాముడు తప్ప వేరు దైవం తనకు లేడని చాటాడు.

" History of the Qutbshahi Dynasty" అనే చారిత్రక గ్రంథంలో హెచ్.కె.షేర్వాని రామదాసు ఖైదు నుండి విడుదలైన విషయాన్ని గూర్చి ఈ విధంగా తెలియజేశారు.

"This is a variation of the popular tradition that it was in a dream that Abul Hasan received payment from Shri Rama and his brother and on awakening he found the money lying by his pillow. How ever that maybe Gopanna was there upon released, and impressed by the miraculous payment, the sultan endowed the revenues of Bhadrachalam and two other villages as agraharam for the expences of the newly constructed temple, The miracle has earned Gopanna the titled "Ramadas". Various events connected with Ramadas are included in his life. Bhadrachala Ramadasa charitram the author of which is not known. His kirtanas are interwoven in to his life history and in them would be found the story of the payment of money to Abul Hasan while he was asleep.[1]

రామదాసు ఖైదులో ఉండగా, 12 సం॥ల అనంతరం, రామ లక్ష్మణులు తానీషా శయన మందిరానికి ఒక రాత్రి సమయంలో వచ్చి రామదాసు ప్రభుత్వానికి చెల్లించవలసిన ధనాన్ని వారిచ్చి, రసీదు తీసుకొని వెళ్ళారు. ఆ తర్వాత రామదాసు జైలు నుండి తానీషాచే విడుదల చేయబడినాడు. తానీషా భద్రాచలం పరగణా నుండి వచ్చే పన్నుల తాలూకు ఆదాయం, మరియు ఇతర అగ్రహారాలు ఆలయ అభివృద్ధికై, కైంకర్యానికై దానంగా ఇచ్చాడు. గోపన్న జీవితంలో జరిగిన ఈ అద్భుతం కారణంగా ఆయన రామదాసుగా కీర్తింపబడినాడు. రాముడికి దాసుడైనందుననే "రామదాసు"గా ఖ్యాతి గడించాడు. హెచ్.కె. షేర్వాని గారు, వసుమతి గారు వ్రాసిన 'తెలుగు లిటరేచర్ ఇన్ కుతుబ్షాహీ పీరియడ్' అనే గ్రంథంలోని అంశాలను ఉదాహరణగా ఇచ్చారు.

" ఈయన జీవితంలో జరిగిన సంఘటనలన్నీ ఆయన రచించిన కీర్తనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. రామ లక్ష్మణులు తానీషాకు ధనం ఇవ్వడం, రామదాసును తానీషా విడిపించడం, అనే అంశం కూడా ఈయన కీర్తనల్లో ఉంది. రామదాసు చరిత్రలోని కథకు ఈయన కీర్తనలే ఆధారం. ఇవే నిదర్శనంగా ఉన్నాయి" అని వసుమతి గారు అభిప్రాయబడినారు. ఇది నిజమే. రామదాసు వ్రాసిన కీర్తనల్లో రామదాసు జీవితంలోని ప్రతి సంఘటన దాగి ఉంది. రామదాసు పుట్టిన నాటినుండి మరణించినంత వరకు రామదాసు జీవితంలో జరిగిన సంఘటనలు, అద్భుతాలు అన్నీ కీర్తనల్లో దాగి ఉన్నాయి.[2]

రామదాసు మహ్మదీయ పాలకుని కూడా వెంట తీసుకొని వెళ్ళడం రామదర్శనం చేయించడం ఆశ్చర్యకరమైన విషయం. "ధన్యుడవు నీవు తానీషా నీవు - నన్ను కన్నయ్య పదములు కన్నుల కన్నావు" అని రామదాసే చెప్పి దివ్య దర్శనానుగ్రహం పొందినందుకు తానీషాను అభినందించాడు" అని వాగ్గేయకార ఉత్సవ సంచికలో ఉంది.

**6.4. రామ టంకాలు - రామ మాడాలు :-**

రామదాసును విడుదల చేయడానికి రామ లక్ష్మణులు తానీషాకు ఇచ్చిన బంగారు నాణాలు ఆరు లక్షలు, వడ్డీ 4 లక్షలు కలిసి 10 లక్షల బంగారు నాణాలు ఇచ్చారు. వాటిని 'రామ మాడా'లు లేక 'రామ టంకా'లు అని వ్యవహరించారు. ఒకవైపు రామ పట్టాభిషేక ముద్ర, ఒకవైపు ఆంజనేయుని చిత్రం వీటిపై ఉంటుంది. ఇవి రామదాసుకు శ్రీరామ చంద్రుడు ఇచ్చినవి. తానీషాకు రాముడిచ్చిన 6 లక్షల బంగారు

1. History of the Qutbshahi Dynasty - H.K.Sherwani, P.No. 607.
2. Telugu Literature in Qutbshahi period - E. Vasumathi. P.No. 264.
3. భద్రాద్రి శ్రీసీతారామ చంద్ర ప్రభువు ఉత్సవ సంచిక (వాగ్గేయకార మహోత్సవ సంచిక), పుట 23.

నాణేలు ఈ ముద్రలతోనే ఉన్నాయి. రెండు మాత్రం వాటినుండి స్వీకరించి భద్రాచలం తీసుకొని వెళ్లి రాముని మెడలో అలంకరించాడు. ఇవి ఈనాటికీ ఉన్నాయి. రామదాసును చెర విముక్తుని గావించడానికై రామ లక్ష్మణులు వచ్చి రామదాసు చేసిన ఋణం ఆరు లక్షలు ఆ తానీషాకు ఇచ్చినారనడానికి ఈ రెండు నాణాలు నిదర్శనంగా ఉన్నాయి. రామదాసు కీర్తనలల్లో ఈ రామ లక్ష్మణులు 6 లక్షల వరహాలు చెల్లించినట్లు ప్రస్తావించారు. వడ్డీ 4 లక్షల గూర్చి వ్రాయలేదు. రామదాసు చరిత్ర కర్తలు కొందరు, విమర్శకులు కొందరు 10 లక్షలు ఇచ్చినట్లు వ్రాశారు.

'భద్రాచల రామదాసు చరిత్రము' అనే యక్షగానంలో "రామదాసు ఖైదునుండి విడుదలైన తర్వాత జీవితం గూర్చి ఈ విధంగా తెలియజేయబడింది. రామదాసును, రామ లక్ష్మణులు ఆరు లక్షల పైకం తానీషాకు ఇచ్చిన మీదట, ఆతడు ఖైదునుండి విడుదల చేసి ఆతని రామభక్తిని కొనియాడాడు తానీషా. ఈ విధంగా రామదాసు విడుదలైన తర్వాత కొన్ని దినాలు తానీషాతో కలిసి గోల్కొండలోనే ఉండి ఇష్టాగోష్ఠీ , వినోదాలతో ప్రొద్దు పుచ్చుచున్నాడు. అంతట అక్కడ తానీషా పైకాన్ని భద్రాచల రామ లక్ష్మణులు చెల్లించిన తర్వాత ఆ భద్రాచలంలో జరిగిన సంఘటనలివి."

"రామ లక్ష్మణులు తానీషాకు ఏ రూపంలో కనబడినారో ఆ రూపంలో భద్రాచలం ఆలయంలో అర్చకులకు దర్శనమిచ్చారు. ఈ విషయం యముల్దారునితో చెప్పారు అర్చకులు. ఒక వస్త్రంపై దట్టీపై రసీదుగా వ్రాసి ఇచ్చాడు తానీషా. ఆ వస్త్రం రాముని నడుముకున్నది. దానిని తెచ్చి తానీషాకు చూపారు. అది చూసి తానీషా ఆశ్చర్య చకితుడయ్యాడు. ఆ రసీదును రామదాసుకు ఇచ్చాడు తానీషా. రామదాసు అపారమైన రామభక్తికి మెచ్చుకొని, కొనియాడాడు తానీషా.[1] ఈ విధంగా అన్నాడు. కృష్ణదాసు గారు ఈ సందర్భంలో వ్రాసిన కీర్తనలో ఈ విషయం ప్రస్తావింపబడి ఉంది.

**రాగం - నాదనామ క్రియ - ఆదితాళం**

రామదాసు గారు రండీ రసీదందుకోండీ - రండీ మనవి వినండీ కృప యుంచండీ
రాముల మహిమ గనుండీ ॥రామ॥
వచ్చి నిల్చిరిందు రాతిరి వహ్వా యేమందు - వచ్చి యిచట మీ పైకంబంతయు నిచ్చి
రసీదును పుచ్చుక వెళ్లిరి ॥రామ॥
జిట్టీల లాగులతో వారలు పట్టా కత్తులతో - నెట్టన మిట్మ్మ్ పట్టున మనుపగ
యిట్టి వేషములనుట్టి పడిరి యిట ॥ రామ ॥
యెంత శాంతనిధులో మీదగు స్వాంతంబది యెటులో - యింత కష్టముల కెట్లోర్చితిరో
వంతగించితిని యంతరంగ మెరుగక ॥రామ॥
కృపణుడనే గనుకా మీ పై కృపలేశము లేకా - యపవాదంబున కాలయముడైతిని
కృపతో బ్రోడుము కేవలుడనకను ॥ రామ ॥
తురకవాడనగుట నాకు దుర్భగణమె బాట - పరమ పావనుని భద్రగిరీశుని స్థిరమతి
దలచక చింత గుందెదను ॥ రామ ॥[2]

ఈ కీర్తనలో "రామదాసును రక్షించడానికి రామ లక్ష్మణులు జిట్టీ లాగులు తొడుక్కొని నడుముకు దట్టీ కట్టుకొని వచ్చినట్లుగాను, ఆరు లక్షల పైకానికి ఆ అర్ధరాత్రి సమయాన రసీదివ్వడానికి వారి దట్టీ గుడ్డపై తన చేవ్రాలుతో వ్రాసిన రసీదును తీసుకొని వారు వెళ్లినట్లుగాను, వారు అదే రూపంలో రామాలయంలో అర్చకులకు దర్శనమిచ్చారనీ, ఆ విషయం తెలిసిన ఆ ఆలయ ధర్మకర్త ఆ భద్రాద్రి రాముని విగ్రహాల వద్ద

1,2 . భద్రాచల రామదాసు చరిత్రము - తిరుక్కడయూరి కృష్ణదాసు (యక్షగానం), పుట 127.

నడుముకున్న దట్టీ గుడ్డను, దానిపై తానీషా చేవ్రాలు ఉన్న రసీదును తెచ్చి తానీషాకు చూపగా, ఆశ్చర్య చకితుడై రామదాసు రామభక్తిని కొనియాడి, తన తప్పులు క్షమించమని కోరినట్లు ఇందు తెలయజేయబడింది. తాను ఒక తురక వాడైనందు వలన భద్రగిరి రాముని మహిమను తెలుసుకోలేక పోయానని బాధపడ్డాడు. రామదాసును క్షమాపణ కోరాడు. అంతట ఆ తానీషా ఈ విధంగా రామదాసును స్తుతించాడు. " భద్రాచలాన్ని జాగీరుగా ఇస్తూ ఫర్మానా వ్రాసి రాముడిచ్చి వెళ్ళిన అర్లక్షల పైకమును మరియు, అనేక రత్నాభరణాలను ఇవ్వగా పుచ్చుకొని పరమానందంతో రామదాసుగారు రామభజన చేస్తూ భద్రాచలానికి వెళ్లారు. ఈ సందర్భంలో రామదాసు రామానుగ్రహంతో ఖైదునుండి విడుదలైన కారణంగా ఆనందంతో రామనామ స్మరణం ఈ విధంగా చేస్తున్నాడు. రామనామం పలుకని వారి జన్మ దండుగ అని ఈ కీర్తనలో తెలియజేశారు.

**కల్యాణి - రూపక**

*రామ రామయని నోట రవ్వంత సేపైన నీమము తప్పక మంచినీ బల్కని వాడు*
*మత్తుడూ - మూఢ చిత్తుడూ దేహమశాశ్వతమని తెలియక దుర్బుద్ధి చేత*
*సాహసమున సాధు జనుల సంకట పెట్టేడివాడు పాతకీ - బ్రహ్మ ఘాతకీ ॥*
*కండలు పెంచుచు నేను దండివాడ ననుచు చాల - చండితనము కలిగి పరుల*
*దండను గోరేటివాడు నిక్కునా భువిలో దక్కునా ॥*
*మన్ననతో పిన్న పెద్దల కన్నుల గానకను భాగ్యమున్నదని గర్వమున నన్నము పెట్టని వాడు*
*హీనుడూ - దుస్సంధానుడూ ॥*
*ధనమెంతో కలిగియున్న దాన ధర్మములు లేనివాడు హీనుడయ్యు భూమిలోను*
*మానుగ నెన్నాళ్ళు బ్రతికిన నేటికీ - తాముమ్మాటికీ ॥*
*పరిపాటి తెలియకను పరుల ద్రవ్యమపహరించి కరుణ లేక పేదసాదల కష్టము*
*పెట్టేటివాడు తట్టునా - తుదముట్టునా ॥*
*దూరభారము తెలియలేక దుర్బుద్ధి తలపోసి మేరు దప్పి పరుల సతుల మెల్లన పొందేటి వానికి*
*మోసమూ - చాలా దోసమూ ॥*
*స్నేహము చేసిన వానికె ద్రోహము చేసినవానికి కుహకమున యముని దూతలు కులిశము*
*నను మెండుగోతురూ - కొరతలవేతురూ ॥*
*రామదాసుని నేలినట్టి ప్రేమతో శ్రీభద్ర శైల ధామ సీతారామచంద్రుల గామించి*
*కొలువకున్నా గొబ్బునా మోక్షమబ్బునా ॥*[1]

రామదాసు రాముని గూర్చి కీర్తించిన ఈ కీర్తనలో "రామనామం జపించని వారు మూఢులని అన్నాడు. ఈ కీర్తనలోని ముఖ్యాంశాలు ఇవి. " రామదాసును అమాయకుడైన ఏ పాపం తెలియని అతనిని నిర్దాక్షిణ్యంగా చెరయందుంచి కష్టాలు పెట్టారు. ప్రతిజీవి ఏదో ఒకనాటికి మరణిస్తాడని తెలిసి కూడా ఇతరులను శిక్షిస్తూంటారు. రామదాసును కుతుబ్షా రాజులైన అబ్దుల్లా, అబుల్ హసన్ తానీషాలు ఖైదునందుంచి కఠిన శిక్షలకు గురిచేశారు. సాధు పుంగవుడైన, రామభక్తుడైన రామదాసును కష్టాలు పెట్టిన వీరిని నిందిస్తున్నాడు ఈ కీర్తనలో. వారిరువురు కూడా అంటే అబ్దుల్లా, అబుల్ హసన్‌లు. ఔరంగజేబు చేతిలో చిక్కి 13 సం॥లు కారాగారంలో బాధలు పడి మరణించినవారే. వారు చేసిన పాపం వారు అదే జన్మలో అనుభవించారు. (దేహమశాశ్వతమని. . . . . ) రెండవ చరణం చూస్తే - ఎవరికి వారు దేహబలం చూసుకొని పరులను హింస పెట్టేవారికి ఈ భూమిపై సుఖం లభించదు. వారు కూడా కష్టాలు పడుతారు

1. భక్త రామదాసు కీర్తనలు - సంకలనం - దాశరథుల బాలయ్య , పుట 132-133, కీర్తన 161.

అని చెప్పడంలో ఉద్దేశం, తానీషా, అబ్దుల్లాలు తనను బాధించినందుకు, రాజులమన్న అహంకారంతో 12 సం॥లు ఖైదులో ఉంచి బాధించినందుకు వారికి రాముడే తగిన శిక్ష వేయగలడని భావించాడు. ఈ రెండవ చరణంలో స్పష్టమయ్యే అంశం ఇది. (కండలు పెంచుచు. . . . )

మూడవ చరణంలో "పవిత్రులైన రామభక్తి పరాయణులైన రామదాసును, అలాగే సత్ప్రవర్తన గల్గిన వారిని ధనం ఉందనే గర్వంతో బాధపెట్టి కడుపు నిండా మంచి తిండిని పెట్టని వారు హీనులు, దుష్టులు అని రామదాసు అభిప్రాయపడ్డాడు. రామదాసు 12 సం॥లు కారాగారంలో ఉండగా పాపం ఆహారం కూడా సరైంది పెట్టలేదు. పావుసేరు ఉప్పు, పావుసేరు బియ్యం కలిపి వండిన అన్నం తిన్నాడు రామదాసు. ఆ సంఘటనే ఈ చరణంలో ప్రస్తావించాడు. పంచభక్ష్య పరమాన్నాలు భుజించే రాజులు ధనం ఉందనే గర్వంతో కనీసం ఒక సామాన్య మానవుడు తృప్తిగా తినే ఆహారం కూడా రామదాసుకు పెట్టలేదు. కుతుబ్షాహీ రాజులు అయిన వారిరువురూ వారు ఆ రామదాసు యెడ చేసి ద్రోహమిది. హీనులుగా వారిని ఇందు చిత్రించాడు.

నాల్గవ చరణంలోని అంశం ఇది. ధనముందన్న గర్వంతో దాన ధర్మాలు చేయని వారు ఈ భువిలో జీవించినా ఒకటే మరణించినా ఒకటే. తానీషా విషయంలో రామదాసును ఆరు లక్షలలో ఒక్క పైసా తగ్గినా అతడిని విడిచి పెట్టడానికి అంగీకరింపని వాడుగావడం వలన, అతడెంత ధనదాహం కలవాడో స్పష్టమవుతుంది. ఆ ధనం మంచికి ఉపయోగిస్తే మంచిదన్నాడు. చివరికి "ధనంపై వ్యామోహాన్ని వదిలాడు తానీషా.

అయిదవ చరణంలో, పరుల ద్రవ్యాన్ని అపహరించి, ఆ నిందను ఇతరులపై మోపి పేద సాదలను కష్టపెట్టేవాడు నశించకుండా ఉంటాడా ? అని అన్నాడు రామదాసు. రామదాసంటే అయిష్టత కలవారు, గిట్టనివారు నీచులైన మహమ్మదీయులు, హిందూ మత ద్వేషియైన సితార కలిసి భద్రాచలంలోని ఖజానా సొమ్ము అపహరించి "ఆరు లక్షలు" ధనం రామదాసే ఖర్చు చేశాడని లేనిపోని నిందలు వేసి, మీర్జుమ్లా, సయ్యదహమదు, ఇబ్రహీంలు, సితార కలిసి రామదాసుకు శిక్ష పడేలా చేశారు. వారికి ఈ భూమిపై ఏనాటికైనా కష్టాలు రాక మానవని స్పష్టం చేశాడు. ఇలాంటి నీచుల్ని నిరసించాడు రామదాసు.

ఆరవ చరణంలో, ఆనాడు గోల్కొండలో మహమ్మదీయులు, ఔరంగజేబు మనుషులు దాడులు చేసి పర సతులను అపహరించుకొని పోయేవారు. ముఖ్యంగా హిందూ వనితలను అపహరించి వారిని దాసీలుగా చేసుకొని బాధించేవారు. విచక్షణా రహితంగా హిందువులపై దాడి చేసి ఆ స్త్రీల భర్తలను సంహరించి, వారిని అపహరించిన ద్రోహులు, దుర్మార్గులు మహమ్మదీయ రాజులు. వారు హిందువులపై చేసిన దాడులు చెప్పనలవి కాదు. ఈ విషయాన్నే ఈ చరణంలో స్పష్టం చేశాడు. పర స్త్రీలను అపహరించేవాడు పాపాత్ముడని అన్నాడు రామదాసు.

ఏడవ చరణంలో, ఈ విషయం స్పష్టమవుతుంది. రామదాసుతో కలిసిమెలిసి ఉన్న స్నేహితులే ఆయనను మోసగించి, రామదాసును తహసీల్దారీ వృత్తి నుండి తొలగింప చేయడానికి, మహ్మదీయులతో చేతులు కలిపి కుట్రపన్ని, ఆయనపై ద్రవ్యాపహరణ నేరం మోపి అబ్దుల్లాకు ఆయనపై లేనిపోని నేరారోపణలు చేసి ఖైదు చేయించారు. పదవి నుండి తొలగింపజేశారు. అలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని రామదాసు స్నేహం చేసిన, నమ్మిన వారికి ద్రోహం చేయడం మంచిది కాదని, అలాంటి వారికి నరకమే గతి అని అంటాడు రామదాసు.

ఈ విధంగా ఈ కీర్తనలోని ఒక్కొక్క చరణం రామదాసు జీవితంలో జరిగిన సంఘటనకు నిదర్శనంగా కనిపిస్తుంది. రామదాసు కారాగృహంలో ఉండటానికి కారకులైన వారిని, వారి మనస్తత్వాలను నిరసించాడు. ఇవి అందరికీ వర్తిస్తాయి. ఈ కీర్తనలో చెప్పిన విషయాలు సర్వ మానవాళికి కూడా వర్తిస్తాయి. రామదాసును ఇన్ని విధాల కష్ట పెట్టినా అతనికి ఏమీ కాలేదు. రాముడి దయ వలన తాను జైలు నుండి

విడుదలై సుఖంగా ఉన్నాడు. రామదాసు రామ సాయుజ్యం పొందాడు. కాని తానీషా అబ్దుల్లాలు, ఇంకా రామదాసును బాధించినవారు ఆయన ఖైదులో ఉండడానికి కారకులైన విద్రోహులు అందరూ నశించిపోయారని చరిత్రలో ఉంది. రామదాసు ఖైదు నుండి విడుదలైన తర్వాత పాడిన కీర్తన ఇది.

అందరినీ దుర్మార్గ ప్రవర్తన నుండి కాపాడేది ఒక్క రామనామమేనని, దానినే పలుకుతూ జీవించమని ఉద్బోధ చేశాడు ఈ కీర్తనలో. ఈ విధంగా రామనామం గూర్చి రామదాసు తానీషాకు తెలియజేశాడు. రామనామం జపించక దుర్మార్గ వర్తనులై ఉన్నవారిని నిరసించాడు. మరియు తనను కాపాడిన రాముడు నీకే విధంగా బంధువని తానీషా అడుగగా, రామదాసు ఈ విధంగా అంటున్నాడు.

**కాంభోజి - చాపు**

*దినకర వంశ పావనులైన శ్రీరామదేవుడు మా తండ్రిగా*
*జనకుని పూర్వ సంచిత భాగ్యమున గన్న జానకి మా తల్లిగా ॥*
*కలికు బంగరు ఛాయ గల లక్ష్మణుడు మాకు అన్నయ్య గావలెగా*
*శత్రుల నిర్జించు శత్రుఘ్నులు మాకు చిట్టన్న గావలెగా*
*క్షత్ర ధర్మమునందు సర్వజ్ఞులైన కుశలవులె యన్నలుగా ॥*
*దశరథ జనక భూధవులిద్దరు మాకు దాతలు గావలెగా*
*విశదముగా వారి వెలదులు మాకు ముత్తవ తల్లులవుదురుగా ॥*
*పవన తనయ జాంబవంతాది కపులెల్ల బలువైన బంధువులుగా*
*వారి సేవించిన మునులెల్ల మాకు ఘనమైన యాప్తులుగా ॥*
*వర భద్రగిరి రఘువర వంశజులెల్లను వసుధ దాయాదులుగా*
*ధరను సీతారామ దాసుడననిపించి దైవమీడేర్చే గదా ॥*[1]

రాముడు నా తండ్రి, సీత మా తల్లి, లక్ష్మణుడు పెద్దన్న, శతృఘ్నుడు చిన్నన్న , కుశ లవులు కూడా అన్నలేనట. దశరథుడు, జనకుడు తనకు తాతలు, వారి భార్యలైన కౌసల్య, సుమిత్ర, కైకేయి, జనక మహారాజు ధర్మపత్ని మొ॥నవారు ముత్తవ్వలు. జాంబవంతుడు, హనుమంతుడు మొదలైన కపులు అంతా బంధువులు. వారిని సేవించినవారు తనకు ఆప్తులు అని అంటూ శ్రీరాముని వంశం వారంతా తనకు కావలసిన వారని అన్నాడు. రామునిపై తనకున్న భక్తిని చాటాడు. ఈ బంధుత్వం వల్లనే రామలక్ష్మణులు వచ్చి నన్ను ఆదుకొన్నారని తానీషాతో అన్నాడు రామదాసు. రామదాసు భద్రాచలానికి ప్రవేశిస్తూ ఈ విధంగా రామనామ సంకీర్తనం చేస్తున్నాడు.

**సురటి - చాపు**

*హరిహరి రామ నన్నరమర జూడకు నిరతము నీ నామస్మరణ యేమరను ॥*
*దశరథ నందన దశ ముఖ మర్దన పశుపతి రంజన పాప విమోచన*
*మణిమయ భూషణ మంజుల భాషణ రణజయ భీషణ రఘుకుల పోషణ ॥*
*పతిత పావన రామభద్ర శైలధామ సతతము శ్రీరామ దాసుడనిన నేలు ॥*[2]

రామా ! నీ నామాన్ని నేను ఏమరను. నన్ను కాపాడే దేవుడివి నీవే. నీ నామ స్మరణం చేసే నీ దాసుడిని . నన్నేలు రామా ! అని ప్రార్థించాడు. రామునికి పూజలు చేసి, రాముని కన్నులారా గాంచి, తర్వాత స్వగృహానికి వెళ్లదలచాడు. రాముని సేవకై భద్రశైలం ఎక్కుతూ ఈ విధంగా సంకీర్తనం చేస్తున్నాడు రామదాసు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 75, కీర్తన 83.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 175, కీర్తన 195.

**నామనాద క్రియ - త్రిపుట**

ఆనందమానంద మాయెను - శ్రీ జానకీ పతి స్మరణ సేయను నే
దార్శ్యుల కృపమాకు గల్గెను - ఇప్పుడిరువైయేడిట నున్న పరమాత్ము జూడగనే ॥
పరమ భక్తి శ్రద్ధ గలిగెను - బహు దురిత జాలములెల్ల తొలగెను
పటు రాగద్వేషములెల్ల వీడెను - అట్టి రాజయోగంబున రాజు చూడగనే ॥
పూర్వ పుణ్యము లొనగూడెను - శ్రీ పార్వతీ జపమంత్ర మీడెను
ఆ పూర్వ కృతిని గనబడెను - పరమ పావనమై శ్రీహరి పాద సేవ కల్గినేడు ॥
సామాన్యు చెంత జేరము - వట్టి పామర జనులనిక గూడము
విషయ కామరస బుద్ధుల వేడము - మాకు హరినామ స్మరణ చేయు భాగవతులే దిక్కు ॥
రామభక్తుల జేర గల్గెను - ఇతర కామములెల్ల వీడ గల్గెను
పరభామల పయి భ్రాంతి దొలగెను - మేము పరుల దోషములెన్న నెదురాడము ॥
ఇతర చింతన లిక చేయము - ఇతర దైవముల గొనియాడము
ధరా పతులకు జిక్కి చింత సేయము - ఇనకుల చంద్రుడౌ భద్రాచల రాము గొలుతుము ॥
భద్రాద్రి స్వామి మాకు దైవము - వేరు క్షుద్ర దేవతలను దలంపము
దారిద్ర్యము లెల్ల మది నెంచము - భద్రగిరి రామదాసుల నేలు పరమ దయాళుడు గల్గె ॥[1]

రామా ! ఇన్ని సంవత్సరాలకు నీ దర్శన భాగ్యం కల్గబోతుంది. నిన్ను దర్శించడానికి వస్తున్న నా మనస్సు ఆనందంతో ఉప్పొంగి పోతున్నది. నీపై మరింత భక్తి శ్రద్ధలు అధికమైనాయి. పూర్వ జన్మ సుకృతం వల్లనే నేను మరల నిన్ను దర్శించే అదృష్టం కల్గింది. నేను సామాన్యుల చెంత చేరను. నిన్ను పూజించే భాగవతులే నాకు దిక్కు. నిన్ను చేడగానే రాగ ద్వేషాలు తొలగుతాయి. రామభక్తులతో కూడి మరల భజనలు చేసే భాగ్యం నాకు కల్గింది. నేను చేసిన పొరపాట్లు ఏమైనా ఉంటే అవన్నీ నేటితో తీరిపోతాయి. ఇతర ఆలోచనలు చేయక, నిన్నే మనసులో ఉంచుకొంటాను. ఇతర దైవాలను కూడా పూజించను. నేను మరల రాజుల్ని ఆశ్రయించను. వారి సేవ చేయను. నిన్నే కొలుస్తాను. నీవే నా దైవం. భద్రాద్రి రామా ! నిన్నే పూజిస్తాను. భద్రాద్రి స్వామి మాకు దైవం. వేరు క్షుద్ర దైవములను తలంపము అని లోకానికి చాటాడు. తాను రామదాసుడేనని రాముడే నా దైవమని ఘంటా పథంగా చెప్పాడు. రామా ! నీ దయకు పాత్రుడైన నాకు ఆనందం కల్గింది అని పరవశుడై ఆనందంగా భద్రాచలం ఆలయంలోకి ప్రవేశించాడు. అక్కడి అర్చక స్వాములు, ధర్మకర్తలు భద్రాద్రి వాసులందరూ సాదరంగా ఆ రామదాసుగారిని ఆలయంలోకి తీసుకొని పోయినపుడు "ధ్వజస్తంభం" వద్ద సాగిలబడి ఈ విధంగా స్తుతిస్తున్నారు రామదాసు గారు.

**నాదనామ క్రియ - ఆది**

గోపాల రామ భద్రాచల కోదండ రామ
మా పాలి దైవమా ఆపద తొలగెను - పాపములన్ని పటాపంచలై పోయె ॥
ఏమి నీ మహిమ ముందుగ జలనిధిలో ఈదినాడవు శంక లేదు నీకింతైన
సాటి గలరే మీతో పాటి వారేరి తాబేటిపై కొండ మూపున దాల్చితివి ॥
ముందు హేమాక్షుని క్రిందు బరచి భూమి గొమ్మున నెత్తిన వరాహావతారా
శరణన్న ప్రహ్లాదు రక్షణ గావించి కనక కశిపు ద్రుంచినావు నరసింహా ॥
ముద్దు వడుగువై ధరణి మూడడుగుల దానమడిగిన నీదు గుణము నేమనవచ్చు
బడుగు బ్రహ్మచారి పావన మూర్తి బలినడంచిన నీకు సాటి యెవరయ్యా ॥

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 13-14, కీర్తన 15.

రావణ కుంభ కర్ణాదుల ద్రుంచిన శ్రీరామ మూర్తి నీ సాటి యెవరయ్యా
శూరులనెల్లను శోషింపజేసిన పరశురామా నీ సాటి యెవరయ్యా ॥
హలధారివై నబల రామావతార మోదిత రూప శ్రీ బౌద్ధ స్వరూపా
రంగైన మేటి తురంగము నెక్కిన కలికి రూపా నీదు చెలువ మేమనవచ్చు ॥
మీ సాటి గలరే విలాసమున భద్రాద్రి వాసుడవై రామదాసు నేలిన తండ్రి ॥[1]

ఇందు శ్రీమహా విష్ణువు యొక్క దశావతారాలు వర్ణింపబడినాయి. రామా! నీవు నన్ను కాపాడినావు. ఓ గోపాల రామా ! నా ఆపదలు తొలగాయి. పాపాలు కూడా నశించాయి. నీ దర్శన భాగ్యం కల్గింది. శ్రీహరీ ! నీ మహిమను వర్ణించ తరమా ! నీవు దుష్ట శిక్షణార్థం, శిష్టులను రక్షించడానికై "పది అవతారాలు" ధరించావు. "మత్స్య మూర్తి"గా అవతరించి ద్రుచ్చు సోమకు ద్రుంచినావు. తాబేటి రూపంలో మందరగిరిని మోసినావు. పాల కడలిని, దేవ దానవులు, వాసుకి సర్పాన్ని మందర పర్వతానికి చుట్టి తోక భాగంలో దేవతలు, తల భాగంలో రాక్షసులు కూడి చిలకడానికి ఉద్యుక్తులైనారు. అమృతం కొరకు వీరు ఈ పాల సముద్రాన్ని చిలికినపుడు ఆ మందర పర్వతం సముద్రంలో మునిగి పోకుండా "కూర్మ రూపుడవై" నీవు అవతరించి, ఆ పర్వతాన్ని మోశావు. హిరణ్యాక్షుడు భూమిని చాపలా చుట్టి అపహరించి సముద్ర గర్భంలో దాగగా, ఆతడిని 'వరాహరూపుడవై' వచ్చి సంహరించి భూదేవిని కాపాడావు. ప్రహ్లాదుని శ్రీమన్నారాయణ భక్తుడిని హిరణ్య కశిపుడు, తన కుమారుడని కూడా భావింపక, తన శత్రువైన శ్రీహరి నామాన్ని జపిస్తూ ఉన్నాడనే కోపంతో హిరణ్య కశిపుడు ప్రహ్లాదుని కొండపై నుండి త్రోయించడం, పాములతో కరిపించడం, విషం పాలల్లో కలిపి ఇవ్వడం, అగ్నిలో పడ త్రోయడం, ఏనుగులతో త్రొక్కించడం ఇలా ఎన్నో బాధలు పెట్టినా శ్రీమన్నారాయణ స్మరణం చేస్తే ఆ భక్తుడిని కంటికి రెప్పలా కాపాడినాడు శ్రీహరి. నీవు 'నరసింహరూపుడవై' వచ్చి ఆ హిరణ్య కశిపుని ఇంటి గుమ్మంలో, సంధ్యా సమయంలో నీ తొడలపై ఉంచుకొని, నీ గోళ్ళతో వానిని సంహరించావు. స్తంభంలో నుండి అవతరించి వచ్చి వానిని సంహరించి, ప్రహ్లాదుని కాచినావు.

బలి చక్రవర్తిని, మూడడుగుల నేల దానంగా అడిగి ఒకపాదం భూమిపై ఒక పాదం ఆకాశంపై మరొక పాదం బలి శిరస్సు పైనుంచి బ్రహ్మచారివైన వామనరూపంలో దర్శనమిచ్చిన ఒక బాల బ్రాహ్మణుడిగా వచ్చి, బలిని పాతాళానికి అణగద్రొక్కి, ధరను శాంతిని నెలకొల్పినావు. "వామనావతారం"దాల్చినావు. మూడు అడుగులతో విశ్వమంతా వ్యాపించి నీ విశ్వ రూపాన్ని ప్రదర్శించినావు. రావణ కుంభ కర్ణులను సంహరించి, సీతను లంకనుండి తీసుకొని వచ్చి అయోధ్యలో పట్టాభిషిక్తుడవైన రామా ! నీ మహిమనేమని కొనియాడ గలను ? రావణాది రాక్షసులను సంహరించి, భువిపై శాంతి నెలకొల్పిన, దుష్ట శిక్షణార్థం రాముడిగా ఒక నర రూపంలో అవతరించిన శ్రీమన్నారాయణుడివి నీవు. 'రామావతారం' దాల్చినావు. ప్రజలను ధర్మబద్ధుడుగా పాలించినావు. పరశువుతో ధరలోని దుష్ట రాజులనందరినీ సంహరించిన 'పరశురామా' ! నీ సాటి యెవరు ? హల ధారివైన 'బలరామ మూర్తి,' ధరను శాంతిని స్థాపించడానికై అవతరించిన 'బౌద్ధ స్వరూపా!' అహింసా పరమో ధర్మః అని చాటడానికి బుద్ధునిగా జన్మించిన ఓ హరీ ! అద్భుతమైన తురగమునెక్కి కలియుగంలో ధర్మాన్ని రక్షించేందుకై అవతరించిన 'కల్కిమూర్తీ' ఇన్ని రూపాలు నీవే. నీవే దశావతారాలు దాల్చావు. ఈ విధంగా మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, శ్రీరామ, పరశురామ, బలరామ, బుద్ధ, కల్కి అనే పది అవతారాలు దాల్చి దుష్ట సంహారం గావించి, శిష్టులను, సజ్జనులను కాపాడిన ఓ శ్రీమన్నారాయణా ! భద్రాద్రి రామా ! నన్ను కూడా ఆపాదలు తొలగించి కాపాడినావు. ఇదే నీకు నా ప్రణామం అని రాముని స్తుతించాడు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 60, కీర్తన 65.

ఆ తర్వాత దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ, రామనామ సంకీర్తన చేస్తూ ఆలయంలోకి ప్రవేశించాడు. ఆ సీతా రామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను కనులారా గాంచి, పులకిత గాత్రుడై, నిమీలిత నేత్రుడై శ్రీమన్నారాయణునికి నమస్కరించి తన జన్మ ధన్యమైందని భావించి రాముని కనులార దర్శించాడు. తరించాడు. ఆ స్వామిని తుంబుర శృతి మీటుతూ అందెలు కాలికి తొడుగుకొని నృత్యం చేస్తూ హరిదాసుడై తన్మయత్వంతో శ్రీరాముని స్తుతిస్తున్నాడు. రామదర్శనమైనందుకు ఆనందంతో ఈ విధంగా కీర్తిస్తున్నాడు.

**నాదనామ క్రియ - ఆది**

*దరిశన మాయెను - శ్రీరాముల వారి ॥*

*దరిశనమాయెను - ధన్యుడనైతిని యురము నందు సిరి మెరయుచున్న వాని ॥*

*విభుశంభులకు యోగి ప్రభువుకు నైనను అభిముఖుడై యానసము జూపని వాని ॥*

*కండ క్రొవ్వున తను గనని తల చెండెదనని కోదండ మెత్తిన వాని ॥*

*పరమ భక్తులకిల సిరులొసంగెదనని కరమున దాన కంకణము గట్టిన వాని ॥*

*స్థిరముగ భద్రాచల రామదాసుని నరసి ప్రోచెదనని బిరుదు దాల్చిన వాని ॥*[1]

రామ దర్శనమైందని తాను ధన్యుడైనానని ఆనంద తాండవం చేశాడు. హృదయమందు లక్ష్మితో కూడిన శ్రీరాముని యొక్క దర్శనమైందని, కండ క్రొవ్వుతో ఆ రాముని కనని వారిని సంహరించేందుకు కోదండమెత్తిన వానిని, పరమ భక్తులకు ఈ భువియందు సిరులనిచ్చే వాని దర్శనమైందని, భద్రాద్రి రామచంద్రుల దర్శన భాగ్యం 12 సం॥ల తర్వాత కల్గిందని, ఆనందంతో సంకీర్తనం చేశాడు. ఇదే సమయంలో తనను కాపాడిన తల్లి సీతాదేవిని కూడా కనులారా గాంచి ఆ తల్లితో తనను కరుణించమని, కాపాడమని, ప్రార్థించాడు. ఆ సౌందర్య రాశియైన సీతాదేవిని కనులారా గాంచి, తరించి ఈ విధంగా స్తుతిస్తున్నాడు.

**సౌరాష్ట్ర త్రిపుట**

*కరుణ జూడవే ఓయమ్మ కాకుత్స రాముని కొమ్మ ॥ శరణంటి నను గావవమ్మ జనక తనయ సీతమ్మ ॥*

*సరసిజానను గన్న సాధ్వి నీ మహిమల నెన్నగా*

*తరమే యింద్రాదులకైనా తథ్యమిది యని శృతులచే విన్నా*

*కలకంఠి నీ ముద్దుల మోము కనుగొంటి నాదే భాగ్యము*

*ఎలనాగ నే నోచిన నోము ఎన్న ఎవరికి శక్యమోయమ్మ*

*పతిత పావన నామ నీ భాను వంశాబ్ధి సోముని*

*క్షితి విజయుని నేలిన ఘనుని చెలిమి చేసిన పరమ కల్యాణి ॥*

*భద్రాద్రి వాసుని కొమ్మ భద్రాద్రి శ్రీరామ దాసుని కమ్మ*

*భద్రము లొసగుమి అమ్మా భద్రం భగవతు తే మాయమ్మా ॥*[2]

శ్రీహరి సతియైన ఓ లక్ష్మీ ! అన్ని శుభాలు గూర్చే జానకీ మాత ! నీ ముద్దుల మోమును కనుగొన్నాను. నాదే భాగ్యం. నేనోచిన నోము ఫలం వలన నీ దర్శన భాగ్యం కల్గింది అని ఆ సీతామాతను స్తుతించాడు. అంతేకాక రామనామం యొక్క మహిమను తెలియజేస్తు రామా ! ఇంత కాలం నీ దర్శనం కోసం ఎదురు చూశాను. ఆభాగ్యం నాకు కల్గింది. ఇక నీవు నాకు విముక్తి నొసంగి, నా జన్మను తరింపజేయుమా ! అని అన్నాడు. అయితే ముక్తి కన్నా ముందు రామభక్తికి ప్రాధాన్యాన్ని అధికంగా ఇచ్చాడు రామదాసు. నీలో నన్ను ఐక్యం చేసుకో రామా ! అని రాముని ఇలా ప్రార్థించాడు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 72, కీర్తన 78.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 55, కీర్తన 60.

**పున్నాగ వరాళి - ఆది**

జానకీ రమణా కల్యాణ గుణ సజ్జనావన నిపుణా ఓనమాలు వ్రాయగానే నీ నామమే తోచు ॥
ఎందు జూచిన నీదు అందమే గానవచ్చె ముద్దు మోమును జూచి మునులెల్ల మోహించిరి ॥
దుష్టులు నిన్ను జూడ దృష్టి తాకును గాని ఎన్ని జన్మాలెత్తినా నిన్నే భజింప నీవే ॥
ముక్తినే నొల్ల నీదు భక్తి మాత్రమే చాలు రాతి నాతిగ జేసె నీ తిరువడిగళే గదా ॥
నారదాది మునులు పరమందిరి గదా సత్య స్వరూపమున ప్రత్యక్షమైనావు ॥
భద్రాచల నివాస పాలిత రామదాస ॥[1]

రామా ! నీ ముద్దు మోమునుచూసిన అందరి దృష్టి నీకు తగులునేమో ! నీ నామాన్నే మొదట ఓనమాలు దిదిస్తు పిలల్లకు విద్యాభ్యాస సమయంలో వ్రాయిస్తారు. శ్రీరామ అనే మంత్రం అతి పవిత్రమైంది. నేను ఎన్ని జన్మలకైనా నీ నామాన్నే జపిస్తాను. నాకు ముక్తి అవసరం లేదు. నీభక్తి చాలు అన్నాడు రామదాసు. "రామభక్తి" సామ్రాజ్యాన్ని ఏలిన మహానుభావుడు. అందుకే ఆ ఆలయంలో ఆ స్వామిని కనులారా దర్శించి ఎన్నటికైనా నీ భక్తుడిగానే నన్ను చేరదీయి. నాజన్మ సార్థకం చేయమని ప్రార్థించి ఆ తర్వాత కొండ దిగి, ఆ భద్రగిరి నుండి క్రిందికి వచ్చి అనేక భక్త సమూహాలతో కూడి అత్యంత ఆనందోత్సాహాలతో భక్తులను గాంచి ఈ విధంగా అంటున్నారు రామదాసు.

## 6.5. రామనామ ప్రశస్తి

**నాదనామ క్రియ - చాపు**

రాముని వారమైనాము - ఇతరార్యుల గణన సేయము ॥
ఆ మహామహుడు సహాయుడై విభవముగా, మమ్ము జేపట్టి గారవించును గదా ॥
యమ కింకరులను జంకించెదము పూని యమునైన ధిక్కరించెదము ॥
అమరేంద్ర విభవము అదియెంత మాత్రము కమలజునైన లక్ష్యము సేయకున్నాము ॥[2]

రాముని వారము మాకెందుకు భయం అని, మరియు ఇంకా ఇలా అంటున్నారు.

**ఆనందభైరవి - ఆది**

రాముని వారము - మాకేమి విచారము స్వామి నీదే భారము- దాశరథే జీవాధారము ॥
తెలిసి తెలియ నేరము - మాదేవునిదే యుపకారము తలచిన శరీరము-మది పులకాంకుర పూరము॥
ఘోరాంధకారము - సంసారము నిస్సారము శ్రీరాముల యవతారము - మది చింతించుటే సారము ॥
ఎంతెంతో విస్తారము - ఆవింతల యొయ్యారము ఎంతో శృంగారము-మా సీతేశుని యవతారము ॥
ఇతరుల సేవ కోర్వము-రఘుపతినే నమ్మినారము అతి రాజసుల జేరము-మామతి రంజిల్లుచున్నారము॥[3]

అని రాముని కృపకు పాత్రులమైన మేము, ఇతరుల సేవ చేయబోము. రఘుపతినే నమ్మినాము అని ధైర్యంగా తెలియజేశాడు రామదాసు. ఇంకా ఇలా నరులను తిరస్కరిస్తున్నాడు. మానవుల తప్పులు ఎత్తి చూపుతున్నాడు.

**మోహన - చాపు**

సామాన్యుల చెంతజేరము - రామ నామ మంత్రమె మాకు నీమము
సామగాన లోలు సన్నుతించిన - మాకేమి కొదవ సీతా రాములె యున్నారు ॥
మూల కారణుని లీల దెలియలేని మూఢులైన వారి నొల్లము
వాలాయముగను వారిజాక్షుని కథల మేలెరుగని వారి నొల్లము

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 64, కీర్తన 69.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 110, కీర్తన 139.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 117, కీర్తన 140.

యేల యితరమైన పాలు మాలిన జోలి రామమూర్తి పాద పద్మములె చాలు ॥
ధర్మ శూన్యులైన దారుణ కర్ముల దరికి జేర మేమొల్లము
మర్మమెరిగినట్టి మదన జనకుడైన ధర్మమూర్తి రామ తారకమె చాలు ॥
తామసంబు చేత తామె పెద్దలమని తత్త్వమెరుగని వారి నొల్లము
కామాదుల చేత గర్వమొంది యున్న కలుష చిత్తుల వారి నొల్లము
నియమ కర్మాది వినిష్ఠకాని పరమ నీచులైన వారి నొల్లము
రామదాసు నేలు రఘుకులాగ్రజుని ప్రేమతో భద్రాద్రి ధాముని గొలువని ॥[1]

రామదాసు తాను ధర్మ హీనులైన వారిని, రాముని లీలలు తెలియని మూఢులను, ఆ రాముని కథలు వినని వారిని, అంగీకరించనని అన్నాడు. నిరంతరం రామనామ స్మరణంతో గడిపేవారే నాకు ఆనందాన్నిస్తారు. రామ పాదాలే నాకు శరణ్యం. తామసం చేత పెద్దలమనే వారిని, రామ తత్వాన్ని ఎరుగలేని వారిని, నియమ నిష్ఠలు లేని నీచుల్ని మేము దరి జేరనీయం అని రామదాసు అన్నాడు.

ఈ విధంగా అక్కడి ప్రజలతో రాముడే నాకు సర్వస్వమని అంటు ఆయన రాజవీధులందు తిరుగుతూ, రామభజన చేస్తూ ఈ విధంగా భాగవతులతో కూడి ఆనందంగా రామనామ స్మరణం చేస్తున్నారు.

**ధన్యాసి - ఆది**

అబ్బబ్బ రామనామం అత్యద్భుతం గొబ్బున నే భాగ్యశాలి కబ్బునో శ్రీరామ నామం ॥
సారహీన సంసార సాగర మీదే రామనామం పారద్రోలు ముస్నూటరువది పాపములన్ని
చేరి పంచేంద్రియములన్ని చేరక పోదోలు నామం ఘోరమైన యమదూతలను కొట్టెడి నామం ॥
ముక్కంటి సతికి శాశ్వత కీర్తినిచ్చే రామనామం యెక్కువైన వాల్మీకి ఋషి యెప్పడనుష్ఠానం
ఒక్కసారి రామ యంటే ఓంభూ స్వాహా పాపములన్ని మ్రొక్కి రెండు మారులంటే మోక్షమిచ్చే రామనామం॥
కామ క్రోధలోభ మోహ గర్వమడచే రామనామం స్వామి భద్రాద్రీశుని తోడి సద్గతి నామం
నీమముతో బలికితేను నిత్య మోక్షపదవి నామం రామదాసు నేలినట్టి శ్రీ రామనామం ॥[2]

రామనామం జపిస్తే సారహీనమైన సంసార సాగరాన్ని సులభంగా దాటగలం. కామక్రోధాది అరిషడ్వర్గాలను అణచేది రామనామం. మోక్షాన్ని ప్రసాదించేది రామనామం అని రామనామం యొక్క గొప్పతనాన్ని తెలియజేశాడు రామదాసు మరియు ఇలా సంకీర్తనం చేస్తున్నాడు. మానస బోధ ప్రధానంగా ఉన్న కీర్తనలు ఇవి.

**వంతువరాళి - రూపక**

"ఎన్నగాను రామభజన కన్న మిక్కిలున్నదా సన్నుతించి శ్రీరామచంద్రు తలచవే మనస
కన్న విన్న వారి వేడుకొన్న నేమి ఫలము మనస॥"[3] అని రామభజన చేశాడు. అలా రామభజన చేస్తూ, స్వగృహానికి వచ్చి, ఓ మనసా! మరల సంసార సాగరంలో మునగబోయెదవు సుమా ! మరల అట్లా మునిగితే చెడిపోయెదవు సుమా ! అని మానస బోధను చేస్తున్నారు. ఈ కీర్తనలో ఈ విధంగా తెలియజేస్తున్నారు.

**నామనాద క్రియ - ఏక**

చెడిపోయెదవు సుమీ మనసా చెడిపోయెదవు సుమీ
చెడిపోయెదవు చెడు గుణములచే యెడ తెగక హరి యడుగులు నమ్మనిచో ॥
కచ్చితములు పోను లోపలి మచ్చరములు మాను హెచ్చుగ రాముని విచ్చల విడిగా
లచ్చి నాయకుని ముచ్చట విననిచో కాయము సతమనకు యిక నీ గాయకమేమరకు ॥

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 160-161, కీర్తన 191.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 6-7, కీర్తన 6.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 38, కీర్తన 39.

పాయక రాముని పాద పూజనము సేయక మోహము మాయల బడితే ॥
భామములో నమ్మి భద్రగిరీశుని వేడుకొమ్మీ ! దేవ దేవ రామదాసుడేయని కావుకావుమని కల కాలమనినచో॥[1]

మనసా! నీవు శ్రీరాముని పాదాలు పూజించకున్నా, ఆ పవిత్రమైన రాముని కథలు వినకున్నా నీవు చెడిపోతావు సుమా ! అని మానస బోధ చేస్తూ రామనామాన్ని జపిస్తూ, రామ కథా శ్రవణం చేయమని జనులకు ఉద్బోధ చేస్తున్నారిక్కడ రామదాసుగారు. అశాశ్వతమైన ఈ దేహం కొరకు కాలం వృథా కానీయకు. రామపాద సేవే నీకు ఆనంద దాయకం అని బోధించారు. ఈవిధంగా రామధ్యానం చేస్తూ, చైత్ర శుద్ధ నవమి నాడు శ్రీరామనవమి రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిపించారు. ఆ సందర్భంలో రాముల వారికి పండుగ చేశారన్న ఆనందంతో ఈ విధంగా పూజిస్తు , రాముని ప్రార్థిస్తున్నారు. "మానస బోధ" ఇందున్నది. సకలేంద్రియములను సద్దు చేయక ఉండమని అంటున్నారు.

**కాంభోజి - జంపె**

సకలేంద్రియములార జరుగ సమయము గాదు సద్దు సేయక యుండరే
ప్రకటముగ మా యింట పండుగై జానకీ పతి పూజ సేయువేళ మీరు ॥
నిరతమును పదునాల్గు భువనములు కుక్షితో నిర్వహించెడి స్వామిని
ఇరువుగను నా హృదయ కమల కర్ణిక మధ్యమున భక్తి నుంచి కొనియు
శరణాగత త్రాణ బిరుదు గల్గిన తండ్రి కరుణింపుమని వేడుచు
నరసింహ దేవునకు పంచామృత స్నానమొనరించు వేళ మీరు ॥
శిరమునను శతకోటి సూర్యులను మించు భాసుర కిరీటము ధరించి
హరి పాద కమలములకును మంచి స్వర్ణంపు పువ్వులను పూజ చేసి
యురు ధూప దీప నైవేద్య తాంబూలాది సకలోపచారమొనగి
నరస భద్రాద్రీశునకు రామదాసుండు సాష్టాంగ నతి సేయు వేళ మీరు ॥[2]

ఈ కీర్తన రామదాసింట సీతా రామ కల్యాణోత్సవం జరిగిన సందర్భంలో ఆయన జరిపిన షోడశోపచార పూజ గూర్చి వర్ణింపబడింది. ఇది మానస పూజగా కూడా చెప్పబడుతుంది. ఇదే సందర్భంలో రామదాసుగారు శ్రీరాములను నమ్మి సేవించు వారికి చింతల పనియేటికి మనసా అని అంటూ మానస బోధ చేస్తున్నారు.

**ధన్యాసి - చాపు**

శ్రీరాముల నమ్మి సేవించు వారికి చింతల పని యేటికి మనసా ।
తారక నామ కీర్తన సేయువారికి వేరు మంత్రము లేటికి మనసా ॥
పన్నగ శయనుని కృప కల్గువారికి పాప సంఘములేటికి మనసా ।
మన్నించు భద్రాద్రి రామదాసుడనైతి మర్మమెరుగలేవటే మనసా ॥[3]

అని శ్రీరాముల నమ్మిన వారికి వేరే ఆలోచనలు ఎందుకు? శ్రీ భద్రాద్రి రాముని కృప ఉన్న వారికి ఏ పాపాలు అంటవు అని మానస బోధచేసినట్లున్న ఈ కీర్తనలోని సారం, అందరినీ ప్రబోధిస్తున్నట్లుగా ఉంది. అదే విధంగా

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 61, కీర్తన 67.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 161, కీర్తన 192.
3. " " " " పుట 156-157, కీర్తన 186.

**తోడి - ఆది**

సీతా రమణుని సేవ నిరతమును పాతక హరణమె ఓ మనసా ।
పాతక హరణము జేసి యహల్యను పావన జేసిన పద యుగళము ॥
సకల చరాచర భూతములందున ముకుళిత భావమె ఓ మనసా ।
ప్రకటానందముతో శ్రీరాముల ప్రస్తుతించవే ఓ మనసా ॥
పామరమున పలుమారు దలచితిని కామాదుల తిరుగకు ఓ మనసా ।
రామదాసుండని భద్రాచల రాముని గొల్వవె ఓ మనసా ॥[1]

ఇందు మానస బోధ ఉంది. సీతా రమణుని సేవించిన సర్వ దుఃఖాలు నశిస్తాయి. సకల చరాచర జగత్తులోని అన్ని భూతాలందు రాముడే వ్యాపించి ఉన్నాడు. ఆ రాముని ఆనందంగా స్మరిస్తే సర్వ దుఃఖాలు నశిస్తాయి. భద్రాద్రి రాముని మనసా వాచా కర్మేణ స్మరించు అని కామాది అరిషడ్వర్గాలకు దూరంగా ఉండి రామసేవ చేసి తరించమని ప్రబోధిస్తున్నాడు రామదాసు. ఈ సందర్భంలో ఆయన గృహమందు అందరు కూడి ఈ విధంగా భజన చేస్తున్నారు.

**సావేరి - ఆది**

దినమే సుదినము - సీతారామ స్మరణమే పావనము ॥
ప్రీతినైన ప్రాణ భీతినైన కలిమి చేతనైన మిమ్మే తీరు దలచిన ॥
అర్థాపేక్షను దినము వ్యర్థము గాకుండ సార్థకముగా మిమ్ము ప్రార్థన చేసిన ॥
నిరతము మెరుగు బంగరు పుష్పముల రఘువరుని పదమ్ముల సమర పూజించిన ॥
ఘనమైన భక్తిచే పెనగొనియే వేళ మనమున శ్రీరాముని చింతించిన ॥
మృదంగ తాళము తంబుర శ్రుతి గూర్చి మృదు రాగముల గీతములు పాడిన విన్న ॥
దీన శరణ్యయో మహానుభావ యోగానలోల నన్ను కరుణింపుమని గొల్చు ॥
వాసిగ శ్రీహరి దాసుల గూడుక వేయుచు గంతులు వాసుదేవుని పాడు ॥
అక్కర తోడ భద్రాచలమున నున్న చక్కని సీతారాముల జూచిన ॥[2]

ఈ విధంగా ఆనందంతో హరిదాసుల గూడి రామనామ స్మరణం చేస్తూ, రామభజన చేస్తూ అందరితో కూడి ఆ రామనవమి ఉత్సవాలు వైభవోపేతంగా జరిపించాడు రామదాసు. ఈ విధంగా పరమానందంగా ప్రతి సంవత్సరం శ్రీరాములకు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిపిస్తూ, దాన ధర్మ పరోపకారాలను చేస్తుండగా పరమ ధర్మాత్ముడుగా కొనియాడబడే రామదాసును చూసి ఓర్వలేని కొందరు దురహంకారులు రామదాసు రాజద్రోహియై, ద్రవ్యమపహరించాడని కొందరు అనగా ఆ విషయం తెలిసిన రామదాసు గారు కోపగించుకోకుండా నిర్మల చిత్తంతో ఈ విధంగా అంటున్నారు.

**కాంభోజి - చాపు**

తాజేసిన మేలు దైవమెరుంగ వెల తా జెప్పకోవలెనా
తన మనసును వశము చేసుకొన్న చాలు కాశికి పోవలెనా ॥
కలకాలము తల్లి కరుణ భోజనమిడు కాలమందు చూడుడీ
కులుకుచు పెంచిన కొడుకుల గుణముల కోడలొచ్చిన చూడుడీ ॥
ప్రేమ గల్గినట్టి పెండ్లాము గుణమెల్ల పేదరికమున చూడుడీ
కామించి బంధువుల కరుణా రసంబెల్ల కలసి మెలసి చూడుడీ ॥

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 163, కీర్తన 193.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 72, కీర్తన 79.

అలరుచు తిరిగేటి అన్నల గుణమెల్ల అవిభక్తుల చూడుడీ
చెలగుచు తిరిగేటి చెలికాని గుణము లేమి కలిగిన చూడుడీ ॥
జన్మము గల్గి జన్మ రాహిత్యముకు గుణము కలిగితె మంచిది
ధనము కల్గితేను ధనమునకు తగినట్లు ధర్మమున్నను మంచిది ॥
హరిదాసుల నెల్ల నాదరించినట ఆనందమిదె చూడుడీ
వర రామదాసుని వాగ్వైఖరి విన్న వారలకే ఫలితము ॥[1]

ఇందులో రామదాసు వివిధ మనస్తత్వాలు గలవారి గుణగణాలను తెలియజేస్తున్నారు. ఎవరైనా సరే తాము చేసిన మంచి పనుల గూర్చి ప్రకటించుకోనవసరం లేదు. తాము చేసిన మంచి, చెడులు దైవానికి తెలుసు. ఆయనకు తెలియకుండా ఏమీ జరగదు. మానవుడు ధర్మంగా జీవించాలని, తల్లిదండ్రులను వృద్ధాప్యంలో సరిగా చూడని కొడుకులను గూర్చి ప్రస్తావిస్తూ ఇది ధర్మం కాదని అంటాడు. మానవ నైజం గూర్చి చెప్పాడు. ప్రేమతో ఉండే భార్య పేదరికంలో భర్తను సరిగా చూడని పరిస్థితిని, కుటుంబంలో అంతవరకు కలిసి మెలసి ఉన్న అన్నలు, కొంత కాలం తర్వాత విడిపోయి, స్వార్థం చూసుకోవడాన్ని విమర్శించాడు. ధనం ఉన్న ధనవంతుడు, ధర్మ గుణం, దాన గుణం కూడా కలిగి ఉండాలని, హరిదాసులను ఆదరించాలని, వారికి అన్నం పెడితే అదే ఆనందం అని మూర్ఖులైన మానవుల్ని విమర్శిస్తూ వారిలో మంచితనం పెంచమని రాముని ప్రార్థించాడు. ఎవరి పాప పుణ్యాలు వారివే. ఆ ఫలితం వారిదే. ఎవరి దోషం వారికి అలాంటి ఫలితాన్నే ఇస్తుంది అని ఆ అవివేకుల్ని క్షమించమని రామదాసు రాముడిని వేడుకుంటాడు. ఇందు సామాజికత ఉంది. అజ్ఞానంతో , అవివేకంతో జీవించే, అస్తవ్యస్తంగా ఉండే వారి మనస్తత్వాల్ని మార్చమని, వారిని భగవంతునికి దగ్గర చేయమని ప్రార్థించాడు రామదాసు.

కావున ఎవ్వరేమన్నా బాధ పడరాదు. పాప పుణ్యాల నెరిగిన కర్త రాముడు ఉండగా మనకెందుకు భయం. నిరంతరం రామునియందే బుద్ధి నిల్పమని, జనులకు ఉద్బోధ చేశాడు రామదాసు. అందుకే సర్వ రోగ నివారిణీ, దివ్యౌషధం రామ మంత్రమని, రామజోగి మందును గ్రహించమని కీర్తనం చేస్తున్నారు రామదాసుగారు ఈ విధంగా.

**నాదనామ క్రియ - ఆది**

రామజోగి మందుకొనరే! పామరులారా రామజోగి మందుకొనరే !
రామజోగి మందు మీరు ప్రేమతో భజియించినపుడే కామక్రోధములనెల్ల కడకు పారద్రోలుమందు ॥
మద మత్సర లోభములను మాటలో నిలిపేటి మందు గుది గొన్న కర్మములను గూడక యెడదోలు మందు ॥
కాటుక కొండల వంటి కర్మములెడ బాపుమందు సాటి లేదు జగమునందు స్వామి రామజోగి మందు ॥
కోటి ధనము లిచ్చునని కొన్నను దొరకని మందు సాటిలేని భాగవతులు స్మరణ చేసి తలచుమందు ॥
ముదముతో భద్రాద్రి యందు ముక్తి పొందించే మందు సదయుడైన రామదాసు సద్భక్తితో గొలిచేమందు ॥[2]

ఈ కీర్తనలో కామ క్రోధాది అరిషడ్వర్గాలను పారద్రోలి, కాటుక కొండల వంటి కర్మలను ఎడబాపి, భవ రోగాలను తీర్చి, మోక్షాన్ని ప్రసాదించే "రామ తారకం" అనే ఔషధాన్ని సేవించి తరించమని రామదాసుల వారు జనులకు బోధిస్తున్నారు. ఈ కీర్తనలోని పంక్తులు పరిశీలిస్తే రామ తారకమనే దివ్యౌషధంలోని మహత్తు ఎంతటిదో తెలిసి పోతుంది. అందుకే అందరినీ ఈ మందును తీసుకోమని, తరించమని అంటూ ఉద్బోధ చేశాడు రామదాసు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 70, కీర్తన 76.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 104-105, కీర్తన 126.

రామనామాన్ని స్మరించడం మరువకు. రామ మంత్రమే అన్నిటికీ మూలమని మరువకు ఓ మనసా ! అని మానస బోధ చేస్తున్నారు రామదాసుగారు ఈ విధంగా.

**మోహన - ఏక**

మానసమా నీవు మరువకుమీ - పెన్నిధానము రామ మంత్రాను సంధానము ॥
సారపు గురుభక్తి మీరకుమీ సంసార ఘోరాటవిలో దూరకుమీ
దరి జేరని కోర్కుల కోరకుమీ అయిదారింటి వెనువెంట బారకుమీ -భ్రష్ట ॥
పరదైవతములకు మ్రొక్కకుమీ లోల సరసిజ ముఖులకు దక్కకుమీ
ఘోర నరక దుఃఖములెల్ల బాయసుమీ దాశరథీ కథామృతము గ్రోలు సుమీ ॥
చిద్రూపము వెలుగొందు సుమీ అజ రుద్రాదులకెల్ల విందు సుమీ
దారిద్ర్య వ్యాధికి మంచి మందు సుమీ శ్రీ భద్రాచల రామదాస పోష భక్త ॥[1]

రామ మంత్రం మనకు పెన్నిధానం ఓ మనసా ! నీవు సంసారం అనే ఘోరాటవిలో పడబోకుమా. నీవు అనవసరమైన సుఖాల కొరకై ప్రాకులాడకు. వాటి వెంట పడబోకు. నీవు "రామ మంత్రాన్ని" జపించు. పర దైవాలేవీ నీ సమస్యలు తీర్చలేవు. ఒక్క భద్రాద్రి రాముడే నరక దుఃఖాలను తొలగిస్తాడు. దాశరథీ కథామృతమే సేవించిన జన్మ ధన్యమౌతుంది. ఆ చిద్రూపమే అందరికీ వెలుగునిస్తుంది. ఆ రాముడే అందరికీ ఆనంద సౌఖ్యాలనిస్తాడు. దారిద్ర్యమనే వ్యాధిని తొలగించేందుకు దివ్యౌషధం, మంచి మందు ఈ రామ తారక మంత్రం. అందుకే నిరంతరం ఆ మందునే సేవించమని ఉద్బోధ చేస్తున్నారు రామదాసుగారు. ఇది మానసబోధ అనిపించినా, అందరినీ ఉద్దేశించే ఈ విషయం తెలియజేస్తున్నారు. రామ మంత్ర మహిమను చాటుతున్నారు. సర్వ దుఃఖ నివారిణీ ఈ మందు. అది సేవించిన వారి జన్మ చరితార్థమౌతుంది అని స్పష్టం చేశారు. ఇంతేగాక మరో కీర్తనలో కూడా రామ మంత్రం యొక్క విశిష్టతను తెలియజేశారు రామదాసుగారు. ఈ కీర్తనలో మంత్రములన్నింటికీ మూలమైనది రామ మంత్రమని అంటున్నారు.

**శంకరాభరణం - ఆట**

మంత్రములకు మూలమంత్రమైనది శ్రీరామ మంత్రము
యీ తంత్రములని యేటి దైత్య సంహారము రామ మంత్రము ॥
రాణించు సిరులిచ్చు రఘుకుల తిలకము రామ మంత్రము
మంచి నాణెమైన దివ్య నవ రత్న ఖచితమే రామ మంత్రము ॥
గ్రహ భూతములకు నిగ్రహ భూతమైయుండు రామ మంత్రము
దురిత గ్రహములన్నింటిని దహనము జేయించు రామ మంత్రము ॥
ఫణిలోచన శంభు రాణి నుతించిన రామ మంత్రము
ప్రాణి ప్రదంబైన భవ్య నిధానము రామ మంత్రము ॥
వాసిగ భద్రాచలేశుండైన శ్రీరామ మంత్రము
రామదాసుని రక్షించె తారక నామము రామ మంత్రము ॥[2]

ఈ మంత్రం దుష్ట గ్రహాలను దూరం చేసేది. సిరి సంపదలిచ్చే మంత్రమిది. శంభురాణి అయిన పార్వతీ దేవి పఠించిన శ్రేష్ఠమైన మంత్రమిది. ముక్తికి సోపానం ఈ మంత్రం. శ్రీ భద్రాద్రి రాముడి మంత్రం, రామదాసును రక్షించిన మంత్రమిది. ఇంత గొప్పదైన రామ మంత్రాన్ని, తారక నామాన్ని జపించమని జనులకు తెలియజేస్తున్నాడు రామదాసు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 97, కీర్తన 115.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 98, కీర్తన 117.

రామదాసుగారు భగవంతుని నామాలను, గుణాలను, అవతార లీలల్ని అనేక కీర్తనల్లో రచించి గానం చేశారు. నోరారా కీర్తించారు. అటువంటి కీర్తన ఇది. శ్రీరామ నామం మరువాం మరువాం అనే కీర్తనలో భగవంతుని కేశవాది నామాలను ఇరవై నాలిగింటిని ప్రయోగించి గానం చేశాడు.

**నాదనామ క్రియ - ఆది**

శ్రీరామ నామం మరువాం మరువాం సిద్ధము యమునికి వెరువాం వెరువాం
కేశవయని మృత్యు గెలుతా గెలుతాం దాశరథిని మది తలుతాం తలుతాం ॥
నారాయణుని మేము నమ్మేం నమ్మేం నర నాథులను మేము నమ్మాం నమ్మాం ॥
మాధవు పదసేవ మానాం మానాం మరి యితరుల సేవ మానేం మానేం ॥
గోవిందునే వేళ గొలుతాం గొలుతాం దేవుని గుణములు తలుతాం తలుతాం ॥
విష్ణుకథలు చెవుల విందాం విందిం వేరు కథలు వల్లమందాం మందాం ॥
మధుసూదనునివే మహిమల్ మహిమల్ మధురేశు దానులె మనుజులు మనుజులు ॥
హరిదప్ప ఒకరికి అదరాం అదరాం వేరే దేవుళ్లకు బెదరాం బెదరాం ॥
మెట్టపల్లి సిరలు మమ్మేల్ మమ్మేల్ అతని గొల్చిన వారె ముక్తుల్ ముక్తుల్ ॥
రామదాసులు మాకు సారం సారం కామదాసులు మాకు దూరం దూరం ॥
నారాయణుని మేము నమ్మేం నమ్మేం నరులనింక మేము నమ్మం నమ్మం ॥
మాధవ నామము మరువాం మరువాం మరి యమ బాధకు వెరువాం వెరువాం ॥
అవనిజా పతిసేవ మానం మానం మరియొక జోలంటి మౌనం మౌనం ॥
భద్రగిరీశుని కందాం కందాం మోదముతో మనముందాముందాం ॥[1]

ఈ కీర్తనలో 31 చరణాలున్నాయి. 26 నామాలున్నాయి. ఇందులో శ్రీమహా విష్ణువునకున్న వివిధ నామాలనుపయోగించి రాముని స్తుతించాడు రామదాసు ఈ కీర్తనలో. "శ్రీరామ, కేశవ, దాశరథి, నారాయణ, మాధవ, గోవింద, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నారసింహ, అచ్యుత, జనార్ధన, ఉపేంద్ర, శ్రీకృష్ణ" అని 24 నామాలు ఇందున్నాయి. విష్ణువునకున్న వేయి నామాలలోనివే ఇవి. ఈ 24 నామాలుపయోగించి రామదాసు ఈ కీర్తన వ్రాశాడు. పైన ఉదహరించినట్లే ఈ కీర్తన సాగిపోతుంది. సుదీర్ఘమైన ఈ కీర్తనలో శ్రీమన్నారాయణుని నామగుణ కీర్తనం ఉంది. శ్రీరామ పరంగా ఈ కీర్తన సాగుతుంది. ఈ కీర్తనలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం సఖ్యమాత్మ నివేదనం అనే నవ విధ భక్తి రీతులున్నాయి.

**నవ విధ భక్తి రీతులు :**

శ్రవణం : విష్ణు కథలు చెవుల విందాం విందాం
కీర్తనం : శ్రీరామ నామం మరువాం మరువాం
స్మరణం : దామోదరుని తలుతాం తలుతాం
పాద సేవనం : మాధవు పదసేవ మానాం మానాం
అర్చనం : గోవిందునే వేళ గొలుతాం గొలుతాం
వందనం : శ్రీధరుని చేర్చింది చిత్తం చిత్తం చిన్మయునుతి జేసి చూతాం చూతాం
దాస్యం : అవనిజా పతి సేవ మానం మానం

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 149-152, కీర్తన 181.

సఖ్యం : అనిరుద్ధు ముందరి ఆటల్ ఆటల్ ఫణి శయనుని మీది పాటల్ పాటల్

ఆత్మ నివేదనం : పద్మనాభునిదే భారం భారం పరమేశ్వరుని యాజ్ఞ మీరాం మీరాం

ఇలా నవవిధ భక్తి రీతులు, రాముని నామ గుణ సంకీర్తనం ఇందున్నది. రామదాసు విష్ణుభక్తికి ఈ కీర్తన నిదర్శనం.

## 6.6. సామాజికత - నీతి వైరాగ్యాలు గల కీర్తనలు :

ఈ కీర్తనల్లో కూడా రామనామం యొక్క ప్రాముఖ్యాన్ని గూర్చి రామదాసుగారు చక్కగా విశదీకరించారు. భక్తి ద్వారా సామాజిక చైతన్యం సమాజంలో తేవడానికి ప్రయత్నించాడు రామదాసు. ఈ కీర్తనలే ఇందుకు ఉదాహరణలు.

**ధన్యాసి - ఏక**

శ్రీరామ నామమే జిహ్వకు స్థిరమైయున్నాది శ్రీరాముల కరుణ లక్షీకరమై యున్నాది
ఘోరమైన పాతకములు గొట్టేసన్నాది మమ్ము జేరకుండ నాపదలను చెండేసన్నాది
కామక్రోధ లోభముల గడవమన్నాది మోదముతో స్త్రీల పొందు మోసమన్నాది
వదలని దుర్విషయ వాంఛ వదలమన్నాది మదిలో హరిభజన సంపత్కరమై యున్నాది
కోపమనియెడు ప్రకృతిని కొట్టుమన్నాది యిపుడు ప్రాపు నీవేయనిన దారి - జూపేసన్నాది
భక్తి భావము తెలిసి మమ్ము బ్రతుకుమన్నాది పరమ భక్తులకు సేవ జేసి ప్రబలుమన్నాది
ముక్తి మార్గమునకిది మూలమన్నాది విరక్తుడు భద్రాచల రామదాసుడన్నాది ॥[1]

ఈ కీర్తనలో సామాజిక అంశాలు ప్రస్తావింపబడి ఉన్నాయి. మానవుడు కోపాన్ని తగ్గించుకోవాలని, కామ క్రోధ లోభ మోహ మద మత్సరాలనే అరిషడ్వర్గాలకు దూరంగా ఉండాలని అన్నాడు. ఈ అరిషడ్వర్గాలను నశింపజేసే శక్తి రామ నామానికే ఉంది. శ్రీరామ నామ స్మరణం చేస్తూ ఉంటే ఘోర పాతకాలన్నీ తొలగుతాయని, దారి తెన్ను లేకున్నా వారికి దారి చూపేది రామ నామమేనని, నిరంతరం భక్తి భావం కల్గి జీవించమని, పరమ భక్తుల సేవ చేసి తరించమని, ముక్తి మార్గానికి మూలం రామనామమే అని ఉద్బోధించాడు రామదాసు. భక్తి ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలని ప్రయత్నించాడు రామదాసు. రామనామాన్ని ఆయుధంగా చేపట్టాడు రామదాసు. "శ్రీరామ నామమె జీవనం" అనే కీర్తనలో శ్రీరామ నామంలోని మాధురీ మహిమ ఎంతటిదో వివరిస్తున్నారు. రామ నామమే అన్నిటికీ ఆధారం. అదే జీవనాధారం.

**ఆనంద భైరవి - ఏక**

శ్రీరామ నామమే జీవనము అన్యమేమి రామ కృపావనము
రామనామ సుధారసము మది నేమరక భజియించు మాకిక ॥
శ్రీలమేలు భయానకము - రఘు వీరు లీలలే పానకము
పాలు మీగడ జారు తేనియ - పాల కన్నను మేలిమైనది
ఈ రసములెల్ల నీరసము - రఘు వీరు కథలెల్ల పాయసము
సారె మాకు చేకూరు నాకలి - తీరె తృష్ణ చల్లారె నౌభళా ॥"
ఘోర భవ సింధు తారకము - హృదయారి వర్గ నివారకము
సారమౌ ఘన సార కదళీ ఫలోరు సౌఖ్య మపార సారము
సుందర శ్రీ రాజములు - రఘు నందనాం ఘ్రి సరోజములు
చెంది బ్రహ్మానంద భావము - నంది ముక్తిని పొందజేసిన
భాసమాన శుభాకరము - నిజ దాస లోక వశీకరము
భూసుతా హితుడై భద్రాచల వాసుడై రామదాసు నేలిన[2]

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 153, కీర్తన 182.
2. 〃 〃 పుట 153, కీర్తన 183.

ఈ కీర్తనలో రామ నామామృతాన్ని సేవించమని, శ్రీలమేలు భయానకము రఘువీరు లీలలే పానకము అని పాలు మీగడల కన్నా, తియ్యని తేనె కన్నా ఈ రామనామమే మధురమైనదని అంటున్నారు. అంతేకాదు రామ నామామృతాన్ని సేవించడం వలన బ్రహ్మానందం కలుగుతుందని కూడా చెప్తున్నారు అందుకే

"సుందర శ్రీ రాజములు - రఘునందనాంఘ్రి సరోజములు - చెంది బ్రహ్మానంద భావము - అందరికినిం పొందజేసిన రామ నామమె జీవనము - అని అంటాడు మరియు ఘోర సంసారం నుండి రక్షించేది ఈ తారక మంత్రం. మనస్సునందున్న అంతః శత్రువుల్ని నాశనం చేసే మంత్రం ఇది. కదళీ ఫలం కన్నా మధురమైంది నామం అని తెలియజేశారు రామదాసుగారు. "శ్రీరామ నీ నామమేమి రుచిరా" అనే కీర్తనలో కదళీ ఖర్జూరాది ఫలముల కన్నను పతిత పావన నామమేమి రుచిరా అనీ, దధి ఘృత మధు రస ఫలముల కన్నను పతిత పావన నామమేమి రుచిరా అని అంటున్నారు ఈ విధంగా

*నవ రస పరమాన్న నవనీతముల కంటె అధికమౌ నీ నామమేమి రుచిరా*
*పనస జంబు ద్రాక్ష ఫల రసము కంటె అధికమౌ నీ నామమేమి రుచిరా ॥*
*అంజనా తనయ హృత్కంజతలము నందు రంజిల్లు నీ నామమేమి రుచిరా*
*సదాశివుడు నిన్ను సదా భజించెడి సదానంద నామమేమి రుచిరా ॥*
*సారము లేని సంసారమునకుం సంతారకమగు నామమేమి రుచిరా*
*తుంబురు నారదుల్ డంబుమీరంగ గానంబు జేసెడి నామమేమి రుచిరా ॥*
*అరయ భద్రాచల శ్రీరామదాసుని నేలిన నీ నామమేమి రుచిరా ॥*

శ్రీరామ నామ మాధుర్యాన్ని ఈ విధంగా ఈ కీర్తనలో తెలియజేశాడు రామదాసు. ఇంత రుచికరమైన నామాన్ని గ్రహించకున్న జన్మ వ్యర్థం అని తుంబుర, నారదులు ఈ రామనామాన్ని గానం చేసి తరించారు. భద్రాద్రి రాముడి నామమే నన్ను కాపాడింది అని తాను "భద్రాచల రామదాసుగా" చెప్పకొన్నాడు. 'శ్రీరాముల దివ్య నామ స్మరణ చేయుచున్న జాలు' అనే కీర్తనలో కూడ రామనామం యొక్క ప్రాధాన్యతను గూర్చి రామదాసు తెలియజేశాడు.

**వరాళి - రూపక**

*శ్రీరాముల దివ్య నామ స్మరణ చేయుచున్న చాలు ఘోరమైన తపములను కోర నేటికే మనసా ॥*
*తారక శ్రీరామనామ ధ్యానము చేసిన జాలు వేరు వేరు దైవములను వెదక నేటికే మనసా ॥* అనే ఈ కీర్తనలో
*పరుల హింస సేయకున్న పరధర్మ మంతె చాలు పరులను రక్షింతునని పలుక నేటికే మనసా*
*దొరకొని పరుల ధనము దోచకున్ననంతె చాలు గురుతుగాను గోపురములు గూర్చ నేటికే మనసా ॥*
*అతిథి వచ్చి ఆకలన్న యన్నమిడిన నంతె చాలు క్రతువు సేయవలెననెడి కాంక్ష లేటికే మనసా ॥*

వంటి పంక్తులలో నీతిని బోధించే మానవతా వాదం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఈ భావాలు అభ్యుదయ వాదులకూ, విప్లవ వాదులకూ, సంతోషం కలిగిస్తాయి. ఊరకే యజ్ఞ యాగాలు చేయడం కన్న ఆకలిచే మలమల మాడే అన్నార్తుల కడుపుమంట చల్లారిస్తే చాలునంటాడు. రామదాసుల వారి కరుణా రస హృదయం ఎంతటిదో ఈ మాటల వల్ల తెలుస్తుంది. అంతే కాకుండా 'భాగవత సేవ' చేసి తరించమని కూడా పేర్కొన్నాడు.

*భాగవతుల పాద జలము పైని జల్లుకొన్న చాలు బాగు మీరినట్టి యమృత పానమేటికే మనసా ॥*
*హరిదాసులకు పూజలాచరించినను జాలు హరిని పూజ సేతుననే యహమదేటికే మనసా ॥*
*జప తపోనుష్ఠానములు చేసిరి మూఢులకై బుధులు జగదీశుని దివ్యనామ చింత కోసమై మనసా ॥*

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 154-155, కీర్తన 184.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 155, కీర్తన 185.

చపలము లేక యేవేళ చింతించే మహాత్ములకు జప తపోనుష్ఠానములు సేయనేటికే మనసా ॥

సతతము మా భద్రగిరి స్వామిని నమ్మిన జాలు ఇతర మతములని యేటి వెతలవేటికే మనసా ॥

అని అన్నారు. భాగవత సేవ చేస్తే భగవంతుని సేవించినట్లే, హరిదాసుల పూజలు చేస్తే చాలు హరిని పూజించినట్లే అని, జప తపో నిష్ఠాదులు ఆచరించ పనిలేదు. భగవంతుడైన రాముని నామాన్ని స్మరిస్తే చాలు ముక్తి లభిస్తుంది అని అంటాడు రామదాసు. వ్రతాలు, నోములు, పూజల కన్నా రామ నామం మిన్న. తపస్సు చేయడం వలన కలిగే ఫలితం కన్నా, రామ నామ స్మరణం చేయడం వలన వచ్చే ఫలం అధికం అని వస్తుందని రామదాసుగారు అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకే అందరినీ రామ నామ స్మరణం చేసి జీవితం సఫలం చేసుకోమని ప్రబోధించాడు. రామదాసుగారు రామనామం పల్కని వారిని నిరసిస్తూ ఉన్నారు. రామనామం జపించిన ఆ రాముడు కోరిన కోర్కెలు తీరుస్తాడు. ఓ మనసా ! నీవు ఎందుకు రామనామం పల్కవని ప్రశ్నించాడు. వారికి ఇలా బోధిస్తున్నాడు.

**వంతు వరాళి - ఆది**

రామ నామము పల్కవే - పాపపు జిహ్వా రామ నామము పల్కవే ॥

రామ నామము నీవు ప్రేమతో పల్కిన స్వామి యెల్లప్పటికి కామితార్థములిచ్చు ॥

మతిలేని వారలెల్లా సీతాపతిని సతతము దలచినను

హితవుగా వారి పూర్వ కృతములెల్ల మార్చి అతులిత సామ్రాజ్యానంద మొందజేయు ॥

మార సుందర రూపుని వేసార కెపుడు కోరి భజియింపుము నీ

భూరి కృత కల్మష దోషములన్నియు చేరనియ్యక కొట్టి పార దోలెడి రఘు ॥

దాసులను బ్రోచుచు భద్రగిరిని వాసుడయి జగము లేలుచు

దోసము లెల్ల బాసి వాసిగ ధరలో రామదాసుల హృదయ నివాసుడైన సీతా ॥[1]

రామనామం పల్కని నాలుక పాపపు జిహ్వ. రామనామం ప్రేమతో ఉచ్చరిస్తే ఆ రాముడు శ్రీమన్నారాయణుడు ఎల్లప్పుడూ కామితార్థాలిస్తాడు. మతిలేని మూర్ఖులందరూ ఆ రామనామం జపిస్తే, ఆ నామ మహిమ వల్ల పూర్వ జన్మలో వారు చేసిన పాపాలన్నీ తొలగి ఆనందంగా ఉంటారు. ఆ సుందర రూపుని ఎడతెగక నిరంతరం భజిస్తూ ఉంటే సర్వ దోషాలు తొలగిపోతాయి అని భద్రగిరి వాసుడయిన రాముని సేవించిన వారు మోక్షాన్ని పొందగలరని రామదాసు ఉద్బోధ చేస్తున్నారు. మరియు ఇంకా ఇలా అంటున్నాడు.

**నాదనామ క్రియ - త్రిపుట**

నారాయణ యనరాదా మీ నాలికపై ముల్లు నాటియున్నదా ॥

పనిలేని వార్తలు నూరు యట్టే పలుమారు వాదించి పలుకుచున్నారు

మనసున్న వెతలెల్ల తీరు మీ జననము లీడేర జనులార మీరు ॥

ఆలుబిడ్డల పొందు బాసివట్టి అడవిలోపల పండుటాకులు మేసి

జాలి చెందుట వట్టి గాసి లెస్స సంసారియై యుండి సమబుద్ధి చేసి ॥

కలుష వారధికి నావ నిన్ను గలిసేటందుకు చక్కని బాట త్రోవ

ఇలలో తెలివికి దేవ దేవ నరహరి నామ కీర్తనములెలేవ ॥

కామ క్రోధముల చాలించి పూర్వ శ్రీమంతుడై భక్తి గాంచి

భద్రాచల రామదాసుని మదిలోన యెంచి ॥[2]

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) , పుట 109, కీర్తన 131.

2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 79, కీర్తన 91.

హరినామ స్మరణం మాని మీరు ఆలు బిడ్డలు, సంసార సౌఖ్యమే శాశ్వతమని భావించి, అజ్ఞానంతో భగవంతునికి దూరమౌతున్నారు. అలా కాక రామనామాన్ని జపించి కామ క్రోధాలను చాలించి కర్మ బంధాలకు దూరంగా ఉంటే ముక్తి లభిస్తుంది అని రామ నామ స్మరణే ముక్తికి సోపానం అని 'నరహరి నామ కీర్తనములే ముక్తి మార్గానికి చక్కని బాట వేస్తాయి అని నారాయణ నామం జపించమని ప్రబోధించాడు రామదాసు.

"శాశ్వత పదవి జెందగోరుటకు సన్నాహులు కారాదా
విశ్వేశ్వరుడే విభుడని యెంచుచు విహరించుట చేదా !"[1]

భగవంతుడే నిత్యుడు. శ్రీరాముడే శాశ్వతుడు. శాశ్వతానందాన్ని, మోక్షాన్ని ఇచ్చేది శ్రీ రామనామమే అని రామభజన చేయమని ఇలా ప్రబోధిస్తున్నాడు రామదాసు. మానవుల అజ్ఞానాన్ని తుడిచే ప్రయత్నం చేస్తున్నాడు.

**కల్యాణి - ఆది**

*రామభజన సేయరే ఓ జనులారా రక్షకుడితడే వినరే ॥*
*రామ రామ యిదేటి పాపము యేమి కష్టము మీరు రామ*
*నామమనియెడు మధుర వాక్యము ప్రేమతో గ్రోలకున్నారు ॥*
*నీటి బుగ్గలు తనువులు యీ భువిలోన నిక్కములా భ్రమలు*
*సారమ్ము లేని సంసారమ్ములీ పదవులేల నీ వారలేరీ భువిలోన ॥*
*కారు కలిసిన మెరుపులీ - సంసార పదవులు మాయ జాలపు గారడీ*
*లోకమెల్ల ఎండ మావుల గానకే యున్నారు మీరు ॥*
*ఆలు బిడ్డల పొందు కూరిమి పెంచ మేలిమి లేదందు*
*గాలాలు వేసుక వ్రాలు వాని రీతి ప్రేలాడుచుందురు వెర్రులై భువిలోన ॥*
*కాల కింకరులడచి పట్టుక కాల సన్నిధి కేగు చుండగ ॥*
*నాలుకప్పడు భజన సేయగ జాలునో జాలదో మీరు*
*కాశికీ బోనేలా కావళ్లు దేనేలా మూసిన బూరు వేసాలు వేసుక ॥*
*నాసక దిరిగిన కాసైన రాదిక ఆసలెల్ల నిరాశ జేసి వికాసమందిన*
*రామదాసుల దాసునేలిన భద్రగిరి రామేశు గొలిచిన గలదు మోక్షము ॥*[2]

ఇందు వైరాగ్య తత్త్వ ప్రబోధం ఉంది. ఈ అశాశ్వతమైన దేహి కొరకు, నీటి బుగ్గవంటి ఈ తనువు కొరకు ఎంతోకాలం వృధా చేస్తున్నారు. మీరు ఎందుకు రామనామం జపించరు. ఇదేం పాపం. మీరు ఆ రామనామాన్ని జపించకుండా, నిరంతరం సంసార సాగరంలో కొట్టుకొని పోతూ, ఈ భార్య, బిడ్డలు అనే ప్రేమలు, బంధాలు శాశ్వతం అనుకొంటు భ్రమ పడుతున్నారు. ఇవన్నీ శాశ్వతం కాదు. మానవ దేహం ఏనాటికైనా నశిస్తుంది. రామనామమే శాశ్వతానందాన్నిచ్చేది. అందుకే ఈ తనువులో జీవుడున్నంత వరకూ రామనామం పలుకుతూ రాముని గూర్చి భజన చేస్తూ కాలం గడిపితే అదే శాశ్వతమైన మోక్షానికి నిన్ను తీసుకెళ్తుంది. **అందుకే అవసాన దశలో రామనామం పల్క గలవో లేదో !** ఇప్పుడే వయసులో ఉండగానే శక్తి ఉండగానే రామ నామ స్మరణం చేసి తరించండి. 'కాశి'కి పుణ్యం లభిస్తుందని పోనవసరం లేదు. రామనామ స్మరణం వల్ల పుణ్యలోక ప్రాప్తి కల్గుతుంది. ఈ విషయం తెలుసుకుని రామునికి దగ్గరవండి అని జనులకు ఉద్బోధ చేస్తున్నాడు రామదాసు. అందుకే భుక్తికై కాక ముక్తికై విచారించమని వారికి

1. భద్రాచల రామదాసు చరిత్రము - తిరుక్కడయూరి కృష్ణదాసు, పుట 45.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 130-131, కీర్తన 158.

తెలియజేశాడు. రామదాసుకు క్రమేపీ వార్ధక్యం సంప్రాప్తమైంది. అంతట రాముని తలచుకొని ఈ విధంగా అంటున్నాడు.

### 6.7. మోక్షమునకై రామదాసు రాముని కీర్తించుట :

నాదనామ క్రియ - త్రిపుట

*భళి వైరాగ్యమెంతో బాగైయున్నాది చంచలమైన నా మనస్సు నిశ్చలమై యున్నాది ॥*
*అరిషడ్వర్గములు నన్నంటకున్నవి శ్రీహరి నామ స్మరణ జిహ్వకు అనువై యున్నాది ॥*
*గురుధ్యానమున మనసు కుదురై యున్నాది చిత్తమిరువది యారింటి మీద నిరవై యున్నాది ॥*
*పరమ శాంత మెన్నగను బాగై యున్నాది మాకు పర తత్త్వమందే బుద్ధి పట్టి యున్నాది ॥*
*విరసము పోరులేని విధమై యున్నాది మాకు ప్రకృతి యెడబాసి మోక్షమున కిరవై యున్నాది ॥*
*గురు భద్రాద్రీశు నందే గురువై యున్నాది యిపుడు అరమర లేక రామదాసుడనదగి యున్నాది ॥*[1]

ఈ కీర్తనలో రామదాసుల వారు వైరాగ్యంలోని ఆనందమెంతటిదో వ్యక్తం చేస్తున్నారు. చంచలమైన తన మనస్సు నిశ్చలమై పోయింది. దాని వలన తనకు శాంతి లభించింది. అరిషడ్వర్గాలు తనకు అంటడం లేదు. బాధించడం లేదు. తానిప్పుడు పుణ్య పురుషుడైనాడు. సత్త్వ గుణ సంపన్నుడైనాడు. తన ఆనందానికి అవధి లేదు. అది అనిర్వాచ్యం. ఆ ఆనందానికి కారణం వైరాగ్యం. అదీ సాత్త్విక వైరాగ్యం. భళీ! ఈ వైరాగ్యమెంతో బాగుందని రామదాసుల వారు తలపోశారు. ఈ సాత్త్విక వైరాగ్యాన్ని ఆయన అవలంబించడం వల్ల ఆయనలో ఎన్నో మార్పులు జరిగాయి. అందుకే భళి ! వైరాగ్యమెంతో బాగై యున్నది అని గంతులు వేస్తూ పాడారు రామదాసుగారు.

మరియు రామదాసు రాముని సాయుజ్యమియ్యమని ప్రాధేయపడుతున్నాడు. సారహీనమైన సంసార వాంఛతో నా జీవితం వ్యర్థమైపోతుంది. " సారహీన సంసారములో బడి తారితినో రామా ! ఘోర నరకముతో చెను సంస్కృతి గుండజాల రామా, ఇహసుఖంబుచే నొల్లను నీదగు యేలుబడిని జూపు, అహరహంబు నీ మూర్తి జూచుచు విహరించగ నిలుపు[2] అని మోక్షాపేక్షతో ప్రార్థిస్తున్నారు రామదాసుగారు ఈ విధంగా.

బిలహరి - ఏక

*రావోయి రామన్న రావోయి ఈవోయి సాయుజ్యమింపొందగాను ॥*
*ఏదయా పర నీదు సేవకై నేనాసించి యున్నాడ నార్త రక్ష వేగ ॥*
*దేవార వారిధి పావన బిరుదే నావంటి వారిని గానదిక్కేది*
*క్రూర కర్మములు నేరక చేసితి వేరే ప్రాపకులు లేరు నుమ్ము రామ ॥*
*మదనాంధకారము మది తెలియనీయదు వలదు సంసార వాంఛ యేమి చేతు*
*మదిలోన యముడంటె మరి బెదురుచున్నది అదె వెరవకుమని యభయమిమ్ము రామ ॥*
*పున్నమి చంద్రుని బోలు నీ నగుమోము కన్నుల జూవరా కరుణా సముద్ర*
*ఎన్నాళ్ళు దుర్బుద్ధులే మందురా నన్ను గన్న తండ్రి వేగ మన్నించరా రామ ॥*
*నీవు భద్రాచల నిలయుండవై యుండి కావవయ్యా రామదాస విలాసా ॥*[3]

రామా ! నేను ఇక ఈ దుర్భరమైన సంసార సాగరాన్ని ఈదలేను. నాకు ముక్తిని ప్రసాదించు. ఈ సంసార దుఃఖాలను తొలగించి నన్ను కరుణించి సాయుజ్యాన్ని ప్రసాదించు. నీ దర్శనంతో నా జన్మను తరింపజేయి. ఒక్కమారు నీ నగుమోమును నాకు చూపరా రామా ! నా కనులారా నీ దర్శనం చేసుకుని

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 92, కీర్తన 109.
2. భక్త రామదాసు చరిత్రము - తిరుక్కడయూరి కృష్ణదాసు , పుట 143.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 123, కీర్తన 148.

తరిస్తాను. యమగండం నుండి నన్ను కాపాడు. నీకు ఎక్కడ దూరమౌతానోనని భయంగా ఉంది. నా భయాన్ని తొలగించి నీదరి జేర్చుకో రామా ! అని ఆ శ్రీరామచంద్రుని మనస్ఫూర్తిగా భక్తి తత్పరతలతో ప్రార్థిస్తున్నాడు.

రామా ! నీనామాన్నే జపిస్తూ, నిన్నే నేను మనసున నిల్పాను. నాకు మోక్షం ప్రసాదించరాదా! నాకు ఈ లోకం నుండి విముక్తి ప్రసాదించు. నన్ను బ్రోవరా రామా ! అని అంటూ ఈ విధంగా రామ నామ స్మరణం చేస్తున్నారు రామదాసుగారు.

**కాపి - ఆది**

*పావన రామ నామ సుధారస పానము చేసేదెన్నటికో*
*సేవించియు శ్రీహరి పాదంబులు చిత్తము నుంచేదెన్నటికో ॥*
*దాసులగని సంతోషమ్మున తవ దాసోహమ్మను టెన్నటికో*
*భూసుతకును అతి ప్రాణ ప్రదంబగు పురుషోత్తము గనుటెన్నటికో ॥*
*చంచల గుణములు మాని సదా నిశ్చల మతి నుండేదెన్నటికో*
*పంచ తత్వములు తారక నామము పరియించుట నా కెన్నటికో ॥*
*ఇన వంశాంబుధి చంద్రుడు కృప నిష్టార్థము లొసగే దెన్నటికో*
*కనకచేలు కరుణాల వాలుని కన్నుల జూచేదెన్నటికో ॥*
*వంచన లేకను భద్రాద్రీశుని వర్ణన చేసేదెన్నటికో*
*అంచితముగ రామదాసుడ ననుకొని ఆనందించేదెన్నటికో ॥*[1]

రామా ! నీ నామ సుధా రసాన్ని పానం జేసేది ఎన్నటికో, నేను సేవించిన శ్రీహరి పాదాలు నా మనస్సున నిల్పేదెన్నటికో. నేను వృద్ధాప్యంలోకి అడుగు పెట్టాను. జవ సత్వాలు కోల్పోతున్నాను. నా రాముని పూజించే శక్తి నశిస్తున్నది అని నాలోనున్న చంచల గుణాలు పోయి నిశ్చలంగా నా మనస్సు ఎన్నటికి ఉంటుందో. నా రాముని నా కనులారా కాంచేదెన్నటికో, ఆ రాముని కృపకు నేను ఎన్నటికి పాత్రుడనవుతానో కదా ! అని వృద్ధాప్యంలో అనారోగ్య కారణంగా రామదర్శనం చేసుకోలేక, రామనామం జపించలేక ఉన్న సందర్భంలో దీనుడై రాముని ప్రార్థించాడు రామదాసు. ఇంకా 'తనకు వార్ధక్యం పైన బడినందున సంసారంపై అయిష్టత కల్గింది. నీపై భక్తి మెండైంది. నాకు నీవే దిక్కు. నీ పాద సేవే నాకు ముఖ్యం. నన్ను ఈ సంసార సాగరం నుండి దూరం చేసి నీ దరి జేర్చుకో అని తన ఆవేదన వ్యక్తం చేశాడీ విధంగా.

### 6.8. రామదాసు వార్ధక్య జీవితం :

**మోహన - త్రిపుట**

*గోవింద సుందర మోహన దీన మందార గరుడ వాహన భవ బంధాది దుష్కర్మ*
*దహన భక్త వత్సల త్రిలోక పావన ॥*
సతి సుతులపై ప్రేమ రోసితి సతతము మీపై భారము వేసితి
మదిలోన మిము కనుల జూడగ నెంచి మీ దయ కెపుడెదురు జూచితి ॥
చాలా దినముల నుండి వేడితినే కాల హరణము చేసి గనలేనైతి
మేలు నీ నామము పాడితి మేలుగా ముందటి విధమున వేడితి ॥
క్రోధాన వచ్చెను 'వార్ధక్యము' యిక ప్రాపేది బహు సామీప్యము
పదముల విడనందు గోప్యమా మీరెపుడు చూపెదరు స్వరూపము ॥

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 86, కీర్తన 101.

భద్రగిరి యందు లేదేమొ యునికి భక్తుల మొర విని రావేమొ
కరిగాచిన హరివి గాదేమో రామదాసుని మొర విని రావేమో ॥[1]

రామా ! నిన్ను ఇంతగా వేడినా నను కరుణించవేరా ! నీవు అసలు ఆ భద్రగిరి యందున్నావో లేవో. ఉంటే నా బాధ గ్రహించి నన్ను నీ దరి జేర్చుకోలేవా ! నాకును శక్తి సన్నగిల్లుతున్నది. అందుకే నీవు వేగమే రావా ! అని నిన్ను ఇంక విడువను. నీవు నాకు మోక్షమిచ్చి అడుగు ముందుకు వేయి అని ఆ రాముని కదలనీయకుండా ఇలా అడుగుతున్నాడు. నాకు మోక్షం ఇవ్వడానికి నీవెందుకు బిడియపడుతున్నావు? అని ఈ విధంగా రాముని ప్రశ్నిస్తున్నారు. నిలదీసి అడుగుతున్నారు.

**మధ్యమావతి - ఆది**

బిడియమేల నిక మోక్షమిచ్చి నీ వడుగు దాటిపోరా రామా
తడవాయెను నేనోర్వలేను దొరతనము దాచుకోరా రామా ॥
మురియుచు నీ ధర చెప్పినట్టు విన ముచికుందుడ గాను రామా
అరుదు మీరలని తలచి ఎగురగా హనుమంతుడ గాను రామా ॥
గరిమతోడ మా సీతను గాచిన గొప్పలు నేవింటి రామా
పరగ భద్రగిరి శిఖర నివాసా పరబల సంహారా రామా ॥
నరహరి నను రక్షింపుమయా శ్రీనారాయణ రూపా రామా
మరచి నిదురలోనైనను మీ పద సరసిజముల విడువ రామా ॥[2]

రామా ! నాకు మోక్షమిచ్చు నీలో చేర్చుకునే దాకా నిన్ను నేను విడువను. నీవు మా సీతమ్మను, రావణుని బారి నుండి కాపాడింది నేను విన్నాను. నీ గొప్పతనం నాకు తెలుసులే అని అన్నాడు రామదాసు.

ఈ కీర్తనలో విష్ణు భక్తుల గూర్చి ప్రస్తావించారు రామదాసుగారు. ముచికుందుడు, హనుమంతుడు, జాంబవంతుడు, విభీషణుడు, నారదుడు, అర్జునుడు వీరంతా శ్రీమహా విష్ణువుని స్తుతించి, ఆయనను కీర్తించి, సేవించి, తరించిన వారే. శ్రీహరి భక్తులే. వారివలె తనను కూడా కాపాడమని, దరిజేర్చుకోమని, వారందరి వలె తాను కూడా నిరంతరం రామనామ స్మరణంతో జీవితమంతా గడిపానని తనకు కూడా సాయుజ్యం ప్రసాదించమని, రామునిలో ఐక్యం చేసుకోమని ప్రార్థించాడు రామదాసు. దశరథుడు కూడా రాముని మనస్సున నిల్పిన వాడే. దుర్లభమైన మోక్షం పొందిన వారే వీరంతా. నేను నిన్నే నా మనస్సున నిల్పితినే. నాకు మోక్షం ఇవ్వు అని అర్థించాడు రామదాసు. అయినా ఇంకా ఎన్ని జన్మాలెత్తాలో నేను. ఈ మానవ జన్మ ఎంత దురదృష్టకరమైంది అని అంటు వాపోతున్నాడిలా. "ఎన్ని జన్మములెత్తగా వలయునో" అనే కీర్తనలో తానింకా ఎన్ని జన్మాలెత్తాలో, ఎన్ని బాధలు భరించాలో, శరీరం అశాశ్వతమని తలపోయనైతిని, శ్రీరామ ధ్యానం సలుపనైతిని, యోగం అభ్యసించనైతిని అని దుఃఖిస్తున్నాడు. 'మనస్సు నిల్పక, గురూపదేశం పాటించక చెడిపోతినని' చింతిస్తున్నాడు. బాల్య, యౌవన, వృద్ధాప్యములందు తన కాలం ఏ విధంగా వ్యయమైపోయిందో చెప్పకొంటున్నాడు.

మొదట నెరుగని తనమున సగమాయువు నిదుర పాలై పోయెగా ఓ రామా
పదపడి తక్కిన పదియేండ్లు తెలియని బాలత్వమున పోయెగా ఓ రామా ॥
వదలక యౌవనము పరభామల వలల తగులనాయెగా ఓ రామా
ముదిమిని సంసారాంధ కూపములో జిక్కి మునిగి తేలనాయెగా ఓ రామా ॥

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 59, కీర్తన 64.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 91-92, కీర్తన 108.
3. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 29, కీర్తన 28.

అని అన్నప్పుడు భర్తృహరి వైరాగ్య శతకంలోని ఈ క్రింది శ్లోకం జ్ఞప్తికి వస్తున్నది.

*ఆయుర్వర్ష శతం నృణాం పరిమితం రాత్రౌ తదర్థం గతం*
*తస్యార్ధస్య పరస్య చార్ధ మఖిలం బాలత్వ వృద్ధత్వయో*
*శేషం వ్యాధి వియోగ దుఃఖ సహితం సేవాది భిర్నీయతే*
*జీవే వారితరంగ చంచల తరే సౌఖ్యః కుతః ప్రాణినాం ॥*[1]

చివరకు తన పొట్ట కొరకై దీనుల వేడి దీనత్వమొందితినని ఓ భద్రాశైల వాసా ! నిన్ను నమ్మిన వాడను, నిన్ను నమ్మిన వారికి భవపాశములంటవుగా అని దోసిలొగ్గి ప్రార్థించాడు. అలాగే మరో కీర్తనలో రామదాసు ఈ విధంగానే వైరాగ్య భావంతో, ఈ మానవ జన్మ ఎంతటి కష్ట తరమైంది మానవుడు పుట్టిన నాటినుండి మరణించేంత వరకు అనేక కష్టాలు పడి చివరకు మరణించి దేహం విడుస్తాడు. తల్లి గర్భంలో ఉండినప్పటి నుండే ఈ జీవుడు సమస్యలెదుర్కొంటాడని అంటున్నారీ విధంగా. బాల్యంలోనే రామదాసులో వైరాగ్య భావం పొడసూపిందనడానికి ఈ కీర్తన నిదర్శనం.

**వరాళి - ఆది**

*అయ్యయ్యోనే జెల్ల యీ జీవునకు సుఖమెయ్యడ లేదు గదా ! జన్మాలు ఎన్నెన్నో కలవూ గదా*
*చయ్యన రఘుకుల సార్వభౌమ యేచందాన బ్రోచెదవో రామయ్య ॥*

మానవ జీవితం ఏవిధంగా సాగుతుందో ఈ కీర్తనలో ఉంది. బాల్యం, కౌమారం, యౌవనం, వార్థక్యం, వృద్ధాప్యం అనే అయిదు దశలు పూర్తి చేసుకొని జీవుడు శరీరాన్ని విడుస్తాడు. ఆత్మ పరమాత్మలో ఐక్యమవుతుంది. ఒకవేళ పూర్వ జన్మలో చేసిన పాపమేదైనా ఉంటే మరల జన్మించి గత జన్మ పాప కర్మఫలాన్ని అనుభవించి, పుణ్య కార్యాలు చేస్తే పుణ్య లోక ప్రాప్తిని పొందుతాడు . ఈ విషయం ఈ కీర్తనలో ఉంది. మానవుడు, లేక ఏజీవియైనా ఈ అయిదు అవస్థలు పూర్తి చేసుకోవాల్సిందే. పుట్టిన ప్రతి మనిషి గిట్టక మానడు. భగవంతుడైన శ్రీకృష్ణ పరమాత్మ దేహం అశాశ్వతమని తెలియజేశాడు భగవద్గీతలో. ఈ ఆత్మ ఎప్పడూ పరమాత్మలో ఐక్యమవుతుంది. మానవుడు, జీవుడు అనుభవించే కష్టాలు, సుఖాలు అన్నీ నా మాయే. నా ప్రమేయం వల్లే జరుగుతాయి. అని భగవాన్ శ్రీకృష్ణుడు అర్జునునికి గీతోపదేశంలో తెలియజేశాడు. అర్జునునితో శ్రీకృష్ణుడు తెలియజేసిన విషయం ఈ కీర్తనలోని విషయానికి వర్తిస్తుంది.

*"దేహినోస్మిన్ యథా దేహే , కౌమారం యౌవనం జరా*
*తథా దేహాన్తర ప్రాప్తిః ధీర స్తత్ర నముహ్యతి ॥*[3]

"దేహి ఈ దేహమందు, బాల్యము, యౌవనము, వార్థక్యము, కౌమారము మొదలగు మార్పులను ఎట్లు చెందుచుండునో అట్లే ఒక దేహము నుండి మరియొక దేహమునందు ప్రవేశించును. పుట్టుట, పెరుగుట, చచ్చుట మొదలగు షడ్భావ వికారములు దేహ ధర్మములే గాని దేహియగు ఆత్మ ధర్మములు కావు. బాలుడు, శైశవము, బాల్యము, యౌవనము మొదలగు మార్పులు జెందినపుడు ఎట్లు దుఃఖించుట లేదో అట్లే మరణమునకు కూడా దుఃఖింప రాదనుట గ్రహించవలెను." ఇదంతా మాయ అని గ్రహించలేని మానవుడు వివిధ బాధలు పడి, భగవంతునికి దూరమౌతున్నాడని ఈ విధంగా అంటున్నాడు రామదాసు.

*వనజ నాభుని మాయ తెలియకనే వెర్రి వగల బొందుచు నుంటిగా కొన్నాళ్లు*
*మునుపు చేసిన పాప పుణ్య సంఘములచే మునిగి తేలుచునుంటిగా కొన్నాళ్లు*
*ఎనుబది నాల్గు లక్షల యోనులందెల్ల వేసరక పుట్టితిగా కొన్నాళ్లు*

1. భక్త రామదాసు జీవితం -రచనలు - దాశరథుల బాలయ్య, ఎం.ఫిల్, 1985.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 4, కీర్తన 4.
3. శ్రీమద్భగవద్గీత - ద్వితీయోధ్యాయము - సాంఖ్య యోగము, శ్లోకం 13, పుట 25 ( ఇంటింటి గీత - శ్రీ శిష్టా సుబ్బారావు వ్యాఖ్యాత)

*అనయము నరకములనుభవించి స్వర్గమంతను జొచ్చితిగా ఓ రామా ॥*

అని బాధపడినాడు మరియు

*అంతట మృతి బొంది యలముచు యమునిచే అతి బాధలొందితిగా కొన్నాళ్ళు*

*వింతగా నీ రీతి పుట్టుచు గిట్టుచు వేదనంబడుచుంటిగా కొన్నాళ్లు*

*కంతు జనక భద్రాచలపతివని నిన్ను గనలేక తిరిగితిగా కొన్నాళ్లు*

*వింతగానే రామదాసుడనైతిని ఇకనెట్టు బ్రోచెదవో ఓ రామ ॥*

అని మరుజన్మ లేకుండా చేసి నన్ను నీలో ఐక్యం చేసుకో అని అర్థించాడు. ఈ కీర్తన సుదీర్ఘంగా సాగుతుంది. జీవుడి, మానవుడి జన్మ రహస్యం ఇందు చెప్పబడి ఉంది. అని అంటూ రామదాసు మానసమున రాముని నిల్పి, రాముని గూర్చి అందరూ ఆ భద్రాద్రి వాసులు వినేలా కీర్తనం చేస్తున్నారీ విధంగా

### 6.9. రామదాసుగారి మహా ప్రస్థానం :

**పున్నాగ వరాళి - ఆది**

*తర్లీపోదాం చాల దయలుంచండి యిక మరలి జన్మకు రాము మదిలో నుంచండి ॥*

*బార్లు గట్టి భక్త వరులు భజనలు చేయగను మూడు పేర్లు కలసినట్టి దారి నెరగి వేగముగ ॥*

*సోహంబని యెడి కత్తి చేగొని అట్టే మోహపాశముల నెల్ల మొదటనే ద్రుంచి ॥*

*ఈషణత్రయముల నెల్ల ఇలలోనే డించి సంతోష సాగరంబునందే సంచరించుచున్నాను ॥*

*తారకమంత్రౌషధ ధారలు గ్రోలి ఏపు మీరగాను మోక్షపదవి హెచ్చనుచు గాంచి ॥*

*ఆరు కమలముల మీద అద్భుతమైన సహస్రార కమలమందు జేరి సంతరించుచు ॥*

*చక్కని భద్రాద్రి రామస్వామి కృపను పెంపెక్కిన రామదాసులని పేరు గాంచినారము ॥*[1]

భద్రాద్రి వాసులందరితోను రామదాసుగారు ఇలా అంటున్నారు. నేను నా రాముని కడకేగే సమయమాసన్నమైంది నేను తిరిగి మరల జన్మించను. "జన్మ రాహిత్యాన్ని పొందగోరి రాముని కడకేగుతున్నాను. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే ఆరు అరిషడ్వర్గాలు ఆరు కమలాలుగా తెలియజేశారు. వీటన్నింటినీ జయించిన ఏడవదైన వేయి రేకులున్న కమలమైన మోక్షాన్ని పొందవచ్చు అని ఆ మోక్షమనే కమలాన్ని అందుకొని, అందు చేరడానికై వెళ్తున్నాను అని నేను "తారక మంత్రౌషధాన్ని ఏపుమీరగా గ్రోలితిని. ఇదే నాకు మోక్ష పదవినివ్వగలదు" ఆ పదవి కొరకై నేను శ్రీరాముని కడకేగుతున్నాను. నాకు అనుమతి నీయండని కోరాడు. ఆ సమయంలో భద్రగిరి వాసులందరూ బారులు తీరి రామభజన చేస్తూ ఉన్నారు. ఈ సందర్భంలో బాలాంత్రపు రజనీకాంతరావు గారు తెలియజేసిన విషయాలను ప్రస్తావించవలసి ఉంది.

"నిత్య సంకీర్తన గోష్ఠులూ, రామకోటి లేఖనమూ, సాధు జన సంతర్పణా, భద్రాచల శ్రీరామ సేవా చేస్తూ భక్తి ప్రచారము చేసి, జీవన్ముక్తుడైన రామదాసు గోలకొండ సామ్రాజ్యము మొగలు సైన్యాల స్వాధీనం అయేనాటికి తనకిష్ట బంధువులైన మంత్రులు లేక నిరాశా వృతమైన ప్రపంచంలో పూర్తి వైరాగ్యం చెంది భక్తులు బారుల తీర్చి రాగా భద్రాచల కొండ శిఖరాన్ని చేరి సంకీర్తన గోష్ఠిలో ఉండగా స్వర్గం నుంచి విమానం వచ్చి ఆయన్ను ఇహ జీవితం నుంచి విముక్తుణ్ణి చేసింది".[2] ఇది చివరి సంకీర్తనం అని, వారు ఆనాటి చారిత్రక నేపథ్యాన్ని, రామదాసు మహా ప్రస్థాన సమయంలోని దేశ కాల పరిస్థితులను గూర్చి తెలియజేశారు.

రామదాసు ఈ విధంగా భద్రాద్రి వాసులందరికి తెల్పి నిశ్చల చిత్తంతో భద్రాద్రి రామసన్నిధికి పోతున్నారు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 69, కీర్తన 74.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పీఠిక-బాలాంత్రపు రజనీకాంతరావు, పుట 15.

**ధన్యాసి - ఏక**

కోదండ రాములు మము గన్నవారు కుదురుగ మము పెంచి విడనాడలేరు ॥
ముదముతో కూడుకొని తమ్ముని తోడ ఖలులు బాధించు వేళ నాకు భక్తి తోడు ॥
సీతారామ నామములే మా జిహ్వాయందు యమ దూతల పారద్రోలు దొడ్డమందు ॥
పట్టాభి రాముల చేపట్టినాము మేము గట్టిగ యమునికి నామమిడినాము ॥
ప్రేమతో భద్రగిరీశ రామదాసుని రామస్వామి వేగ రక్షింపుమయ్యా ॥[1]

నా రాముడు నన్ను ఎన్నడూ విడనాడలేదు. రామనామం నా దరికి యమదూతల రానీయదు. నన్ను రామ దూతలే తీసుకొని వెళ్తారు. పట్టాభిరాముని నామాన్ని చేపట్టిన మాకు యముడిని ఎదిరించే శక్తి ఉంది అని వేగంగా నన్ను కాపాడవా ! నీలో ఐక్యం చేసుకో రామా ! ఓ భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ! అని వేడుకొని సంకీర్తనం చేశాడు. ఈ విధంగా కీర్తిస్తూ రామదాసు గారు భద్రగిరి శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయానికి వెళ్ళగానే, ఆ ఆలయం తలుపులు మూసి ఉండటం చేత విచారించి రామా ! నీ మూర్తిని చూసే భాగ్యాన్ని కల్గించమని ఈ విధంగా రాముని స్తుతిస్తున్నాడు, ప్రార్థిస్తున్నాడు.

**నాదనామ క్రియ - ఆది**

ఇది గురు వాక్యంబిది వేదాంతబిది తారకమిది బ్రహ్మము
ఇది మొదలిది నడుమిది తుది నాదము తెలిసిన వాడే వాడా ॥
నేడు చూచినను నీడ చందమున తోడై యుండుట నీవేగా
నేడై వాడై నీడను నీడై నిండిన వాడవు నీవేగా ॥
ఆడుచు పాడుచు తేటల మాటల నన్నిటి కూటము నీవేగా
ఓడకుమనిగురుడాడినమాటకుజాడజూవుటయునీవేగా॥ ॥
అకారంబున యష్టాక్షరియై మాత్రకు ప్రణవము నీవేగా
ఉకారంబునను ఉన్నతోన్నత పోషకుండవు నీవేగా ॥
మకారంబునను మరి భవ భయముల మడియజేయుటలు నీవేగా ॥
అకలంకతను అఖండ రూపమై యలరెడు ప్రణవము నీవేగా
నాయకి గనినా నాయకి కావల నాయకత్వము నీవేగా ॥
పాయక చీకటి బయల గలిపి భవ భయముల ద్రుంచుట నీవేగా
కాయంబును నిరాకారంబును ధృతి కలుగజేయుటలు నీవేగా ॥
మాయ ప్రపంచపు మాయలలో బడవేయు మాయకూడ నీవేగా
కామ మోహముల గట్టుబడక మము గడతేర్చుటకు నీవేగా ॥
తామస గోష్ఠిని తగలనీక నీ తత్త్వము తెలుపుట నీవేగా
పామరత్వమున బడయనీక చేపట్టి బ్రోచుటయు నీవేగా ॥
రామదాస గురు రాయ భద్రగిరి ధామ సర్వస్వమును నీవేగా ॥[2]

ఈ కీర్తనలో గురు వాక్యమే వేదాంతమనీ, అదే తారకమనీ, బ్రహ్మమనీ, ఆది మధ్యాంతాలు అదే అనీ, ఆ నాదం తెలిసిన వాడే బ్రహ్మమనీ పాడుకున్నారు రామదాసుల వారు. రాముడు అకార, ఇకార, ఉకార, మకారముల సమ్మిళితమైన ప్రణవ స్వరూపుడు. భద్రాద్రి రామ స్వరూపం ఇదే అని ఇంతకు ముందు తెలియజేశాను. అందుకే "అకార, ఉకార, మకార మిళితమైన ప్రణవం కూడా నీవే" అని గానం చేశాడు.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 57, కీర్తన 62.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 26-27, కీర్తన 24.

ఈ సృష్టి అంతా నిండియున్నది నీవే. సృష్టి స్థితి లయ కారుడవు నీవే. చివరకు మాయలో పడవేసేవాడునూ, మాయనుండి కడతేర్చువాడునూ, సమస్తమునూ పరమేశ్వరుడే అని ఆనందలహరిలో తేలియాడాడు రామదాసు ఈ కీర్తనలో. గురు వాక్యానికి గల ప్రాధాన్యం, దాని వల్ల మనుజుడు దైవీ సంపద కలిగి యుండి 'అహం బ్రహ్మాస్మి' అనే మహావాక్యాన్ననుసరించి, తాను అఖండ సచ్చిదానంద పరబ్రహ్మంలో లీనం కాగలడన్న విషయం స్పష్టమౌతున్నది. రామదాసు గారు తాను ఆ భద్రగిరి రామునిలో ఐక్యం కావాలని ఆత్రుతగా, వేగంగా రాగా ఆలయ ద్వారాలు మూసి ఉండగా, తాను ఆ రాముని ప్రార్థించగా ఆ ద్వారాలు తెరచుకున్నాయి. అంతట- "విశ్వాకారుండగు ఆ భద్రాచల రాముడు దశదిశాకాశా పరిపూర్ణంబగు దివ్య తేజః పుంజంబును దుర్నిరీక్ష్యంబునునగు తన విశ్వరూపంబును రామదాసుడు జూడ ఆతడి అశ్వంబును, ఛత్ర ధారుని హయచోదకునిం దనయందైక్యంబు చేసికొనుటకై రాగా రామదాసుగారు ఆ రాముని, ఆ విశ్వ రూపుని దర్శించుకొంటూ ఆ విరాట్స్వరూపుని నేను గాంచలేకుంటినీ, నారాయణుని చూడలేనైతినీ, ఇంతకాలంబైనను నీ దర్శనం పొందలేకుంటిని"[1] అని ఈ విధంగా కీర్తిస్తూ "నీ చెంత నను చేర్చరాదా ! రామా నీ పాద సేవ చేయనీ ! నీలో ఐక్యం చేసుకో ! అని అర్థిస్తూ ఇలా ఎవరికీ సాధ్యం గాని, లభ్యం కాని రాముని, శ్రీమన్నారాయణుని విశ్వ రూపాన్ని సందర్శిస్తూ, ఆ హరిని ఇలా స్తుతిస్తున్నాడు. తన జన్మ ధన్యమైందని, చరితార్థమైందని భావించాడు.

**సావేరి - త్రిపుట**

*అయయ్యో నేనేరనైతినీ ఆది నారాయణుని తెలియనైతినీ*
*వెయ్యారు జన్మాల వెతల జెందితి గాని చయ్యన సద్గతి సాధింపలేనైతి ॥*
*మోసమేమని దలచియుందు దోష వాసనల తగిలినే విందు*
*ఆశాపాశములను నరసి ప్రోచి ముందు వాసిగ వైరాగ్య వాసన గననైతి ॥*
*మూడు మేలని నమ్మియుంటి నిరుమూడు శత్రుల గూడి యుండి*
*మూటిరెంటి గూర్చి మూటికెక్కువ యైన కూటస్థు బొడగని కూడలేనైతి ॥*
*బంధకములు ద్రుంచి వేసి భద్రగిరి రాఘవులలోనే గలసి*
*సదయుడై నెలకొన్న శ్రీరామదాసుని స్థిరముగ చేపట్టి పోషించు మననైతి ॥*[2]

రామా ! నిన్ను నేను తెలుసుకోలేక పోయాను. నన్ను ఈ సంసార సాగరం నుండి విముక్తుని చేయి. ఆశాపాశాల నుండి దూరం చేసి, నీ దరి చేర్చుకో. నీవు నాకు బంధనాలన్నీ త్రుంచి నన్ను నీలో ఐక్యం చేసుకో రామా ! శ్రీమన్నారాయణా ! పాహిమాం పుండరీకాక్ష ! అనాథ రక్షకా ! ఆపద్బాంధవా! హే ప్రభో! సర్వాంతర్యామి ! నీలో నన్ను ఐక్యం చేసుకో అని ఆ విశ్వ రూప సందర్శనం చేసి నానావిధాల ఆ శ్రీమన్నారాయణుని ప్రార్థించి, స్తుతించి గానం చేశాడు. అశ్రుపూరిత నయనాలతో ఆ రాముని పాదాలు కడిగి, మంగళ హారతులిస్తూ ఈ విధంగా ఆ జగన్మోహనాకారునికి మంగళ గీతాలు పాడుతూ తన్మయత్వంలో మునిగిపోయాడు.

**నవరోజు - ఏక**

*రామచంద్రాయ జనక రాజజా మనోహరాయ మామకాభీష్టదాయ మహిత మంగళం ॥*
*కౌసలేయాయ మంద హాసదాస పోషణాయ వాసవాది వినుత సద్వరద మంగళం ॥*
*చారు కుంకుమోపేత చందనాను చర్చితాయ హార కటక శోభితాయ భూరి మంగళం ॥*
*లలిత రత్న కుండలాయ తులసీ వనమాలికాయ జలజ సదృశ దేహాయ చారు మంగళం ॥*

1. భద్రాచల రామదాసు చరిత్రము - తిరుక్కడయూరి కృష్ణదాసు (యక్షగానం).
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 8., కీర్తన 8.

దేవకీ పుత్రాయ దేవదేవోత్తమాయ చాపజాత గురువరాయ భవ్య మంగళం ॥
పుండరీకాక్షాయ పూర్ణ చంద్రాననాయ అండజాత వాహనాయ అతుల మంగళం ॥
విమల రూపాయ వివిధ వేదాంత వేద్యాయ సుజన చిత్త కామితాయ సుభగ మంగళం ॥
రామదాస మృదుల హృదయ తామరస నివాసాయ స్వామి భద్రగిరి వరాయ సర్వ మంగళం ॥[1]

ఈ కీర్తనలో వివిధ నామాలతో ఆ స్వామిని వర్ణిస్తూ స్తుతించాడు రామదాసు. ఈ విధంగా రామునికి , ఆ శ్రీమన్నారాయణునికి మంగళాశాసనం పలుకుతూ రామునిలో దేదీప్యమానంగా వెలిగిపోతూ, అందరూ భక్తవరులు, భద్రగిరి వాసులు చూస్తుండగా శ్రీరామునిలో ఐక్యమైపోయారు రామదాసుగారు. ఇలా ఆ పరమాత్మ అయిన శ్రీరామ పాద సన్నిధిలో పుట్టిన నాటినుండి గడుపుతూ, ఆ రామనామ సంకీర్తనం చేస్తూ రామకైంకర్యం చేసి తరించాడు రామదాసు. చివరికి దుర్లభమైన శ్రీరామ సాయుజ్యం కూడా పొందాడు.

ఈ విధంగా రామదాసు భద్రాద్రి ఆలయ నిర్మాణం చేపట్టి, ప్రభుత్వ ధనం ఖర్చు చేసినందుకు, 12 సం॥లు కారాగారంలో మ్రగ్గి, రామనామ సంకీర్తనంతో కాలం గడిపి, తర్వాత ఆ రామానుగ్రహంతో కారాగారం నుండి విడుదలై భద్రాద్రి రాముని సేవలోనే ఆయన సన్నిధిలోనే చరమ జీవితం గడిపి, చివరికి ఆ స్వామిలో ఐక్యం చెందిన పరమ భక్తాగ్రేసరుడైన శ్రీ రామదాసు జన్మ ధన్యం.

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 121-122, కీర్తన 146.

ఏడవ అధ్యాయం

# రామదాసు కీర్తనలలో సంగీత, భాషా విశేషాలు

# ఏడవ అధ్యాయం

# రామదాసు కీర్తనలలో సంగీత భాషా విశేషాలు

## 7.1. సంగీతాంశాలు

రామదాసు కీర్తనలోని సంగీతం స్పష్ట లయాన్వితమై సూటియైన భావ స్ఫురణంతో, సామాన్య ప్రజానీకానికి గూడ అందుబాటులో ఉంటుంది. ఈయన పాడిన కీర్తనలు ప్రసిద్ధ రాగాంగరాగ, భాషాంగరాగాల్లోనే కాక, దర్బారు, బేగడి, కాఫీ, కమాసు, యమునా కల్యాణి వంటి కొన్ని ఉత్తర హిందూస్థానీ రాగాల్లోనూ వున్నాయి. ఒక్క విశేషమేమిటంటే అంతవరకూ వాగ్గేయ కారుల రచనల్లో ప్రయుక్తం కాని 'ఆనంద భైరవి' రాగం సాంప్రదాయకమైన రామదాసు కీర్తనల్లోనే ప్రథమంగా మనకి కనిపిస్తుంది. వినిపిస్తుంది. ఆ రాగంలో ఆయన ప్రసిద్ధమైన కీర్తనలెన్నో వున్నాయి.

కర్ణాటక సంగీత విద్వాంసులు కచేరీలలో 'ఎన్నగాను రామభజన కన్న మిక్కిలున్నదా' అనే రామదాసు కీర్తన పాడుతుంటారు. ఇది తప్ప తక్కినవన్నీ భజనలలో ఆలపిస్తారు. అంతేకాక కచేరీలలో తలవనే తలవరు. ఆ కీర్తనల్లో ఆ విద్వాంసులు విద్వత్తకర్షకు అవకాశం తక్కువై, వాటి సంగీతం సరళ స్పష్ట లయాన్వితమై, భావ స్ఫురణ సూటియై సామాన్య జనానికి, గుంపులుగా కూడి పాడుకోటానికి కూడా సుకరమై, సులభ రచనలు ఉండటం కూడా శాస్త్రీయ విద్వాంసులకు వాటి యెడల అనాదరం కలిగించి ఉండవచ్చు. మరికొన్ని ప్రసిద్ధ రాగాలు ఆనంద భైరవి, ఆహిరి, వరాళి, ధన్యాసి, సౌరాష్ట్ర, యదుకుల కాంభోజి,కాంభోజి, సైంధవి, సురటి, నాదనామ క్రియ, కల్యాణి, శంకరాభరణం, పున్నాగ వరాళి, పంతు వరాళి, గౌళ పంతు, బిళహరి, ముఖారి, సావేరి, నవరోజు, నీలాంబరి మొదలైన రాగాలలో రామదాసు కీర్తనలు భజన గోష్ఠుల్లో ప్రచారంలో ఉన్నాయి. వీటిలో దక్షిణ భారత ప్రాచీన రాగాలు, మాత్రమే కాక కాఫీ, కమాసు, దర్బారు, బేగడ, కాపడ, యమునా కల్యాణి, వంటి ఉత్తరాది సంపర్క రాగాలు కూడా గోల్కొండ దర్బారుకు వస్తూ పోతూ ఉండే ఉత్తరాది గాయకుల ద్వారా రామదాసు కీర్తనలకు ఆలంబనాలై ఉన్నట్లు తెలుస్తుంది. రామదాసు భక్తి అకుంఠితమూ, కవితా ధార అనర్గళమూ, అయిన సంగీతాభినివేశం ఆయన భక్త్యావేశానికి ఔపచారికమూ, సహజంగా వెల్లి విరిసిన, సాంప్రదాయిక కళా వ్యాసంగమే కాక, ప్రత్యేకంగా ఆయన విద్వత్తకర్ష కోసం ఉద్దేశ పూర్వకంగా గాయక వృత్తిలో కృషి చేసినట్లు తోచదని కొందరు సంగీతజ్ఞులు ఊహిస్తారు.

ప్రసిద్ధ సప్త తాళాలలోను, సుమారు 25, 30 రాగాలలో ప్రస్ఫుటమైన సంగీత రచనలుగా ఆయన కీర్తనలు వింటుంటే, ఆయన పాండిత్య ప్రకర్ష కాక, భక్తి తన్మయ సాధనకు ప్రధానావశ్యకమైన ఉపకరణ మాత్రమే అనీ బోధపడుతుంది. సహజ భక్తి భావావేశంలో, తన్మయత్వంలో అప్రయత్నంగా సంకీర్తన భావానుగుణంగా పైకి పొంగిన సరళ రచనలే రామదాసు భక్తి సంకీర్తనలు, కర్ణాట సంగీత కృతుల వలెకాక, సంగీతంలో నిష్ణాతులైన విద్వాంసుల వలె కాకున్నా, సర్వ సామాన్యుడైన ప్రతి పామరుని పది గొంతులలో, వంద గొంతులతో తన గొంతుకూడా కలిపి ఒకే పాట సునాయాసంగా పాడించగలిగే రచనలు. "మంచాళ జగన్నాథరావు గారు ఈ కీర్తనలకు స్వరాలు కూర్చారు. ఈ కీర్తనలందలి స్వరాల కూర్పు సాహిత్యానుగుణమైన స్పష్టమైన లయ విభజనను పాటించని రాగాలప్తి పద్ధతికి అనుగుణంగా కృతులలోని స్వరాల కూర్పును స్ఫురింపజేస్తుంది. ఇది దక్షిణదేశ పాఠం. ఆంధ్ర సంప్రదాయనికంటే భిన్నం ఇది."[1]

రామదాసుకు సంగీతం నేర్పిన గురువులెవరో తెలియదు. రామదాసు శిష్యవర్గం గూర్చి కూడా తెలిసింది చాలా స్వల్పం. తాళ్ళపాక అన్నమయ్య కాలం నాటికి సంకీర్తనగా ప్రారంభించిన కీర్తన, రామదాసు

1. రామదాసు కీర్తనలు - పీఠిక. బాలాంత్రపు రజనీకాంత రావు గారు - సంకలన కర్త. మంచాళ జగన్నాథరావుగారు పుట 8-9.

టికి భజన కీర్తనగా అధ్యాత్మ కీర్తనగా పరిణమించింది. అదే విధంగా అన్నమయ్య నాటి పల్లవి, మూడు చరణాలు గల రచనలకు ప్రాధాన్యముంటే, రామదాసు కాలం నాటికి అను పల్లవులతో కూడిన కీర్తనల రచనలు వెలుగులోకి వచ్చాయి.

సంగీతంలో స్వామిని ఆరాధించడం, నాద ప్రయోగంతో, బ్రహ్మానంద మనుభవించడం రామదాసు రచనల్లో కనిపిస్తుంది.

''మృదంగ తాళము తంబుర శృతి గూర్చి మృదు రాగము కీర్తన పాడినను "

"నాద స్వరూపుని కర్థమె"

"నృత్య గీత వాద్యంబుల నాతని తృప్తి సేయగరాదా" అని రామదాసు రచించాడు. ఆనంద భైరవి రాగాన్ని సంగీత చరిత్రలో మొట్ట మొదట ఉపయోగించిన వాగ్గేయకారుడు రామదాసు.

7.1.0. ఆనందభైరవి రాగ ప్రాశస్త్యం

ఆంధ్రులాదరించిన రాగం ఆనందభైరవి. సంగీతం తెలిసిన వారు "ఆంధ్ర భైరవి ఆనంద భైరవిగా ప్రకాశిస్తుంది." అని అంటారు. రామదాసు వ్రాసిన ఆనందభైరవి రాగ సంకీర్తనలు - రారా సీతారామ, తరలి పోదాము, రాముని వారము, కలియుగ వైకుంఠము, ఏటికి దయరాదు, రామనామమే జీవనము, పలుకే బంగారమాయెనా మొదలైనవి ప్రసిద్ధ ఆనందభైరవి రచనలు. ఈ కీర్తనలు రామదాసు పాండిత్యానికి నిదర్శనంగా పరిగణింపబడుతున్నాయి. గానం చేసే విధానాన్ని గుర్తించి పట్టి చూసినపుడు రామదాసు రచనలు బృందంగా పాడినపుడు రక్తి కడుతుంది. ఎన్ని గొంతులు కలిసినా శ్రావ్యంగా వినిపించే పదబంధం రామదాసు కీర్తనల్లో సహజంగా ఉంది. అందుచేత భజన గోష్ఠుల్లో రామదాసు కీర్తనలకున్న ప్రసిద్ధి ఇతరుల కీర్తనలకు లేదు. సంగీత పరిచయం ఏమాత్రం వున్నా చాలు, రామదాసు కీర్తనలు అవలీలగా పాడుకోవచ్చు. అంతేకాక ఆ కీర్తనలో ఆ విద్వాంసుల విద్వత్ప్రకర్షకు అవకాశాలు తక్కువై, సంగీత రచన సరళమై సూటియైన భావస్ఫురణతో, అసామాన్య స్ఫురణతో, సామాన్య జనానికి కూడా అందుబాటులో ఉండేటంత సుగమంగా ఉండడమే ఇందుకు కారణం.

ఇవిగాక పుత్ర మరణ సందర్భంలో రామదాసు పాడిన "కోదండరామ" అనే కీర్తన పుస్తకాలలో కళ్యాణి అని, నాదనామక్రియ అని ఉన్నా, భజన సంప్రదాయగోష్ఠుల్లో ఆనందభైరవి రాగంలో పాడుతుంటారు ప్రాసానుగుణమైన లయతో ఆ కీర్తన పాడుతుంటే వినే వారికి భావావేశంతో ఒళ్ళు పులకరిస్తుంది. ఈ కీర్తనతో రాముడి హృదయం కరిగి, పుత్రునికి ప్రాణం పోశాడంటే వింత కాదనిపిస్తుంది.

రామదాసు ప్రత్యేకంగా సంగీత విద్వత్తు కొరకు ప్రయత్నించి కృషి చేయలేదనుకోవచ్చును. ఈ సంగీతం అప్రయత్నంగా జాలువారిందే. అతని కీర్తనలు, సంస్కృతాంధ్ర భాషలు రెండింటి లోను కూడా వేర్వేరు రాగాలలో మరియు త్రిపుట, ఆది, చాపు, రూపక, అట, ఏక, ఝంపె తాళాలలో కనబడుతుంది. అందుచేత అతన్ని సంగీతంలో పాండిత్యం సంపాదించలేదని చెప్పడానికి వీలులేదు. కాని అతని సంగీత రచనల్ని బట్టి అతని ఆశయం పాండిత్య ప్రకర్ష కాదని, సంగీతం అతని భక్తి సాధనకు ఉపకరణ మాత్రమనీ చెప్పవచ్చును. అతని కీర్తనలందుకే సహజభక్తి భావావేశంలో, తన్మయత్వంలో అప్రయత్నంగా సంకీర్తన భావానుగుణంగా వచ్చిన సరళమైన రచనలు. అందుకే ఒకసారి ఎన్ని గొంతుకలు చేరి పాడినా శ్రావ్యమైన మేళంలో వినిపించే బృందగీతులవి. రక్తికి భజన గోష్ఠులలో రామదాసు కీర్తనల తర్వాతనే మిగిలిన వారి కీర్తనలకు పేరు. ఆంధ్ర దేశంలో గ్రామ గ్రామంలో వెలసిన ప్రతి రామమందిరంలోనూ నాటినుండి నేటివరకూ శ్రీరామ నవమి ఉత్సవాలలో ఎక్కువగానూ, తదితర సమయాల్లో నిత్యమూ సాయంకాలాల్లోనూ, శాఖోపశాఖల దీపపు సెమ్మెలను నడుమ ఉంచుకుని తంబురా, చిరతలతో తాళ జాలరులతో కాళ్లకు గజ్జెలు కట్టుకున్న గ్రామీణ భక్త బృందం రామదాసు కీర్తనలను గానం చేస్తూ ఉంటారు.

### 7.1.1. పదకవిగా రామదాసు సంగీతానికి - సాహిత్యానికి చేసిన సేవ :

పదకవిగా రామదాసు చేసిన సేవ అమూల్యం. పద్యకవిత పండితులకు మాత్రమే పరిమితంగా వుండగా, పామరుల కోసం పదరచన చేసిన కవులలో రామదాసు ప్రముఖుడు. జానపద సాహిత్యాన్ని పండితులు పరిగ్రహించనందున దానికి నిబద్ధతను చేకూర్చి, అనిబద్ధతను తొలగించి, చివరికి పండితులకు సైతం కనువిప్పు కలిగించి వారి మెప్పుకు పాత్రుడైన వాడు రామదాసు. "రామదాసు కీర్తనలలోని ఎక్కువ భాగం 'నాద నామ క్రియ' రాగంలో ఉన్నాయి. నాదనామక్రియ హెచ్చుగా వాడబడింది. నాదనామక్రియ పామరులు కూడా అలవోకగా పాడుకోడానికి వీలైన సరళరాగం."[1]

రామదాసు కీర్తనల్లో సుమారు ఇరవై అయిదు రాగాలుపయోగించబడినాయి. రామదాసు కీర్తనల్లో పాఠాంతరాలు ఉండవచ్చు. స్వర పాఠంలోనూ వ్యత్యాసాలుండొచ్చు. రామదాసు కీర్తనలు ఎక్కువగా భజన గోష్ఠుల్లో బృందగానంగా రామోత్సవ సందర్భాలలో గ్రామగ్రామాన పాడుకోవడం వింటుంటాం. వాటిలోని సంగీత పాఠం, కీర్త పాఠాలు, అందలి యతి ప్రాసలకు అనుగుణమైన సరళ తాళావర్తాలలో విభక్తాలై ఝలరీ, మృదంగ, ప్రయోగానికీ భక్తుల అడుగుల బృందనర్తనానికీ అనుగుణంగా ఉండడం సహజమూ, మన ఆంధ్రదేశంలోని సంప్రదాయమూనూ, మన ఆంధ్రదేశంలోని సంప్రదాయమూనూ. ఈ విధమైన స్వరాల కూర్పును కీర్తన పద్ధతి అనవచ్చు.

రామదాసు సంగీత గురువులెవరో తెలియదు. శ్రీ నూకల చిన సత్యనారాయణ గారుతెలుగులో పదకవిత అనే పుస్తకంలో రామదాసు సంగీతం గురించి ఇలా వ్రాశారు. "ఒక విధంగా చూస్తే సంగీత విద్వాంసుల ఉదాసీనత రామదాసు కీర్తనలకు, సంగీత విద్వాంసులు కాని వారికి ఉపకారమే జరిగిందేమో. వాటిని గాని సంగీత రచనలు చేసి విద్వాంసులు పాడితే ప్రజలకు అందుబాటులో ఉండక పోయేవేమో. కనుక బహుజన ప్రయోగార్థం రామదాసు కీర్తనలు భజనకీర్తనలుగా ఉండటమే సముచితం."[2]

### 7.2. రామదాసు కీర్తనలు - భాషా విశేషాలు

ఏదైనా ఒక సాహిత్య రూపం సామాన్య ప్రజల్లోకి వెళ్ళడానికి ఆ సాహిత్య రూపంలో వాడిన భాష ప్రధాన పాత్ర వహిస్తుంది. నిజానికి భాషను బట్టే ప్రజలు సాహిత్య రూపాన్ని సొంతం చేసుకుంటారు. ముఖ్యంగా సంగీతాత్మక ప్రక్రియల్లో భాష సరళ సుందరంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అపుడే ఆయా ప్రక్రియలు గాన యోగ్యంగా శ్రవణశుభగంగా ఉంటాయి. కీర్తనలు, పదాలు, కృతుల్లో వాడే భాష సమాస భూయిష్టంగా కాకుండా, సరళ గ్రాంథికంలో ఉండాలి. రామదాసు కీర్తనల్లో ఈ రకమైన భాషా శైలి దాదాపుగా కనబడుతుంది. ఆనాటి సమాజంలో ప్రజల జీవన వ్యవహారంలోని భాషను అత్యంత సమర్థవంతంగా రామదాసు తన రచనల్లో సందర్భోచితంగా ఉపయోగించుకున్నాడు. రామదాసు కీర్తనల్లో వాడబడిన పదాలు, పద బంధాలు మరింత ఔచిత్యవంతంగా భాసిస్తాయి.

### 7.2.0. పద ప్రయోగాలు :

రామదాసు సంస్కృతాంధ్రాలలో వ్రాసిన కీర్తనలు ఆయన ఉభయ భాషా పాండిత్యాన్ని నిరూపిస్తున్నాయి. రామదాసు సంస్కృత కీర్తనల్లో చాలావరకు ప్రౌఢ శైలి కనిపిస్తుంది. ఈ కీర్తనలు చక్కని శైలితో మంచి పద ప్రయోగాలతో, గాన యోగ్యంగా ఉన్నాయి.

---

1. ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళాసేవ - ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ, పుట - 25 - 30.

2. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావుగారు.

**సావేరి - చాపు**

కలయే గోపాలం కస్తూరీ తిలక సుఫాలం - కుండల రుచి - లలిత కపోలం
జలద సన్నిభ కాంతి కాంతం జగన్నాథ పుర నిశాంతం ॥[1]

**వంతు వరాళి - ఆది**

పతిరేవ గతి రఘునా శ్రీసీతా పతిరేవ గతి రఘునా ॥
సుమహిత మణీ మకుట నిటలతట కమనీయ నీలాలకో
నూతన చారు కమల దళ లోచనో మౌక్తికోజ్జ్వల భూషణ కర్ణో ॥[2]

పై కీర్తనల్లో 'తకార' పునరుక్తి వలన వేగవంతమైన కీర్తన గతి, గానయోగ్యమైన స్థితికి కారణభూతమౌతుంది. తెలుగు కీర్తనల్లో జన జీవన వ్యవహారాలలోని పలుకుబడి, నుడికారం, జాతీయాలు, ఇబ్బడి ముబ్బడిగా కనబడతాయి. పామర జనులలోని ఆలోచనల్లోని ఉద్వేగం, ఆర్తిని యథాతథంగా రామదాసు కీర్తనల్లో చూడవచ్చు.

అడుగు దాటి కదలనీయను నాకభయమియ్యక నిన్ను విడువను ॥
"ఏమిరా రామ నావల్ల నేరమేమిరా రామ"
" తరలి పోదాము చాలా దయలుంచండి"
"ఉన్నాడో లేడో భద్రాద్రి యందు"
"బూచివాని పిలువబోదునా"

వైష్ణవ స్వీకారం వల్ల రామదాసు రచనల్లో తమిళ పదజాలం కూడా కనిపిస్తుంది.

"రాతిని నాతిగ జేసే నీతిరువడిగలికదా"
"ఆదరింపుము నన్ను అడియేన్ దాసుడ"

ఆయన కీర్తనల్లోని భాష ప్రత్యేక శ్రద్ధతో ప్రయోగించినట్లుండదు. ఆయన కీర్తనల్లోని భాష భక్తి, మొర, ఆర్తి మొదలైన భావాలకు తగిన రీతులను జనులు భజన కూటాల్లో పాడుకొని భక్తి పారవశ్యంతో మైమరచి పోయే విధంగా ఉంటాయి.

### 7.2.1. పలుకుబళ్ళు :

రామదాసు కీర్తనల్లో చక్కని తెలుగు పలుకుబళ్లు ఉన్నాయి. ఇవి ఆయన లోకజ్ఞతకు నిదర్శనంగా కనిపిస్తాయి. "ఆర్చేర తీర్చేర, రేపు మాపని, తేపతేపకు బ్రతిమాలినను, సాక్షి బెట్టియు, మారు పేరున బిలువు, మునిగి తేలనాయె, దోసిలొగ్గితి, ఆరడి బెట్టుట, అరమర సేయకు, మూల దూరుక, పెదవులు తడుపుకొను, కనుల కానుక, దూరభారము తెలియలేక, మేరతప్ప, తక్కువేమి మనకు, పలుకే బంగార మాయెనా, అడుగు దాటి కదలనియ్యను, ఏడనున్నాడో, ఎక్కడి కర్మము, ఉన్నాడో, లేడో, గొబ్బున మొదలైన పలుకు బడులు, ఆయన కీర్తనల్లో కోకొల్లలు.

### 7.2.2. అన్య దేశ్యాలు :

రామదాసు కీర్తనల్లోని అన్యదేశ్యాలు పరిశీలిస్తే, వానిలోని అనంత ముఖాలైన భాషా వైభవం కనిపిస్తుంది. ఆనాటి అన్యభాషా సాహచర్యం వల్ల ఒక భాష ప్రభావితం కావడం, తన్మూలంగా పరిపాలనా విషయంగాను, సాంస్కృతికంగానూ, అన్య దేశ్య భాషా పదాలు వచ్చి చేరిపోవడం సర్వ సామాన్యమే. అదే విధంగా రామదాసు భాషలో అన్యదేశ్యాలు కొన్ని చోటు చేసుకున్నాయి. రామదాసు కీర్తనల్లో "కన్నడ,

1. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య) పుట 53, కీర్తన 57.
2. భక్త రామదాసు కీర్తనలు (సంకలనం - దాశరథుల బాలయ్య), పుట 84, కీర్తన 99.

తిరువడిగళే, తురాయి, బడాయి, శాలువా, ఖైదు, బందిఖానా, తహసీలు, తక్కు, వరహా మొదలైన అన్యదేశ్య పదాలు చాలా కీర్తనల్లో కనిపిస్తాయి.

రామదాసు కీర్తనల్లో సంస్కృత సమాస ప్రయోగమున్నను కీర్తనలు ద్రాక్షాపాక శైలిలో సర్వ జన సుబోధకాలై ఉన్నాయి. సంస్కృత సమాసాల ప్రక్కన తెలుగు నుడికారపు చరణాలు కూడా వ్రాయబడడం విశేషం. "రామదాస, భద్రాచల వాస, భద్రాచల, భద్రగిరి, భద్రాద్రి, భద్రశైల" ఇత్యాది ముద్రలు ఆయన కీర్తనల్లో ప్రయోగించాడు.

### 7.2.3. పద బంధాలు :

"రేపుమాపు, దొడ్డమందు, యమ బాధ, కన్నది కానుపు, పెట్టుపోతలు, రాతి మనసు, కొండంత బరువు మొదలైన పద బంధాలు రామదాసు కీర్తనల్లో విశేషంగా దొరకుతాయి.

### 7.2.4. జాతీయాలు :

"కాటుక కొండల వంటి కర్మములు, పాల ముంచునను నీళ్లముంచు, కంటికి రెప్పగాచు గతి, నట్టేట ముంచు, జాబిల్లి కూన వంటి మోము" మొదలైన జాతీయాలు ఎన్నో రామదాసు కీర్తనల్లో ఉన్నాయి.

### 7.2.5. దాశరథీ శతకం - రామదాసు కీర్తనల పోలికలు :

దాశరథీ శతకంలోని భావాలు కొన్ని, రామదాసు కీర్తనల్లో కనిపిస్తాయి. శతకంలో 68 నుండి 78 వరకు గల పద్యాల్లో దశావతార వర్ణన ఉంది. "తక్కువేమి మనకు రాముడు ఒక్కడుండు వరకు" అనే కీర్తనలో దశావతార వర్ణన ఉంది. "కలియుగ వైకుంఠము భద్రాచల నిలయము" అనే కీర్తన, దాశరథీ శతకంలోని 'శ్రీ రమసీత గాగ' అని భద్రాచలాన్ని కలియుగ వైకుంఠంగా వర్ణించిన పద్యానికి అనుసరణగా భాసిస్తుంది.

రామదాసు దాశరథీ శతకం, కీర్తనలు గాక, "పాహి రామప్రభో" అనే వృత్తపదం, "శ్రీమదఖిలాండ కోటి " అనే సంస్కృత రామాయణేతి వృత్త ప్రధానమైన చూర్ణికను ఒకదానిని, 24 నామాలలో శ్రీ మహావిష్ణువును రామ పరంగా స్తుతిస్తూ రచించాడు.

ఈ విధంగా రామదాసు కీర్తనల్లో అత్యంత సహజ సుందరమైన, సజీవమైన భాషా శైలి వ్యక్తమవుతుంది.

ఎనిమిదవ అధ్యాయం

# రామదాసు కీర్తనల ప్రశస్తి

## ఎనిమిదవ అధ్యాయం

# రామదాసు కీర్తనల ప్రశస్తి

రామదాసు కేవలం రామభక్తుడు మాత్రమే కాదు, గొప్ప వాగ్గేయకారుడు. కరుణా గుహారి అయిన ఆ శ్రీరామచంద్ర పాదార విింద మకరందాన్ని తనివి తీర ఆస్వాదించి, ఆనందించి, ఆ శ్రీరామ నామ జపంతోనే ఇహపరాల రెంటినీ కరతలామలకం చేసుకున్న 'భక్తాగ్రణి' రామదాసు. కావున ఆయన ఆంధ్రులకు నిత్య స్మరణీయుడై వెలుగొందుతూ ఉన్నాడు. చివరికి చెరసాలలో పడిన బాధలన్నీ కూడా అతనిని రామభక్తి నుండి విముఖుని చేయలేదు. సరికదా అధిక భక్తిని రేకెత్తించింది.

*పోకన్ మానవ దేహమే విధమునన్ పోషించి రక్షించినన్*
*రాకన్ మానవ హాని వృద్ధులు మహారణ్యంబులో దాగినన్ !*

అని విశ్వసించాడు. ఒకప్పుడు కొందరు కిరాతులు

*వనేచ రామః వసుచాహ రామః ! నదీస్త రామః నభయంస్మరామః*
*ఇతరయంతోపి వనే కిరాతః దివంగతాః రామపదానుషంగాత్॥*

అని తమలో తాను అనుకొంటూ రామ పదాన్ని ఉచ్ఛరించడం వలన మోక్షాన్ని పొందారు. రామనామ మహిమ అట్టిది. నిజానికి ఆ కిరాతులు రామనామ మహిమ యెరుగరు. తాము మాట్లాడే సంస్కృత భాషలో అంటే, "వనమున సంచరించగలము, ధనమును హరింపగలము, నదులను దాటగలము, భయమును స్మరింపము అంటూ కాలడవులను బయలు దేరినారు. వారు అనుకొన్న ప్రతిమాట యందు 'రామ' అనే పదం కూడి ఉండటం చేత వారికి స్వర్గం లభించింది. రామనామ మహిమఅట్టిది.[1]

ఆదికవి వాల్మీకి హృదయం నుండి నిర్గమించిన శోకం "శ్లోకం" రూపం దాల్చి రామాయణ మహాకావ్యం అయినట్లే, రామదాసు హృదయం నుండి వెలువడిన రామకీర్తనలే మహాభక్తి భావ భరితాలై గోపన్న హృదయాంతరాల నుండి ప్రకాశిస్తున్నాయి. తెలుగు వారికి ఇవి అమూల్య సంపదలు. ఆయన తెలుగు వారి దృష్టిలో చిరంజీవి. భద్రాచల మహాక్షేత్రంలో శ్రీసీతారామచంద్రులు, గోపన్న తెలుగువారి హృదయాల్లో సుప్రతిష్ఠితులై ఆచంద్ర తారార్కమూ ఉంటారు.

రామదాసు అవ్యాజమైన, అద్వితీయమైన, అద్భుతమైన భక్తి పారవశ్యంలో తనను తాను భగవదర్పణం కావించుకో గలిగిన మహా భక్తుడు. ఆయన ఏనాడో ఆ ఆలయాన్ని నిర్మించాడు. వందల సంవత్సరాలు కాల గర్భంలో కలిసిపోయాయి. కానీ ఈనాటికీ రామదాసు భక్తిగీతాలు భద్రాద్రిలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆయన తంబుర నాదధ్వనులు ఇప్పటికీ మధురంగా వినిపిస్తుంటాయి. భక్తి తత్త్వాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని తరించిన మహాభక్తుడు గోపన్న. అంతటి మహాభక్తుడు నిర్మించాడు ఆ భద్రాచలం దేవాలయాన్ని. అందుకే ఆ క్షేత్ర మహిమ నానాటికీ ద్విగుణీకృతమౌతుంది. భగవంతుని వల్ల భక్తునికే కాదు, భక్తుని వల్ల భగవంతునికి కూడా ప్రశస్తి లభించింది.

డా॥ నూకల చిన సత్యనారాయణ గారు రామదాసు సంగీతం గూర్చి, ఆ కీర్తనల విశిష్టతను గూర్చి ఈ విధంగా తెలియజేశారు. "సామాన్య జనానికింతగా ప్రమోదం కలిగిస్తున్న ఈ కీర్తనల్లోని సంగీతాన్ని ఆంధ్రులు పునరుద్ధరించుకొని, త్యాగరాజ స్వామి సంగీతంలాగా స్వర నిబద్ధం చేసి, సంగీత సభలకు తీసుకొని రాకపోతే ఇప్పటికే నష్టపడి లుప్తమై పోతున్న తెలుగు కళలకు మరింత నష్టం వాటిల్లుతుంది. రామదాసు క్రీ.శ. 1680 ప్రాంతంలో శ్రీరామ సాయుజ్యం పొందాడని చారిత్రకుల ఊహ.

1. భద్రాచల క్షేత్ర మహిమ - వి. సుదర్శన్ (సంపాదకుడు)

అయితే ఆ వాగ్గేయకారుడు చివరి రోజుల్లో ఎక్కడ నివసించాడో తెలీదు. త్యాగరాజ స్వామి ఉత్సవాలలాగానే రామదాసు ఉత్సవాలు జరుపుకునే రోజులెప్పుడొస్తాయో?"[1] అని నూకల చిన సత్యనారాయణగారు అన్నారు.

"జాతీయ సమైక్యతా సాధనకు రామదాసు మనోధర్మం ఆదర్శం కావాలని 1965 జూలై 13వ తేదీన కీ.శే. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణగారు వివరించారు. మహమ్మదీయ ప్రవక్త అయిన కబీరు వద్ద జ్ఞాన భిక్ష పొందిన రామదాసు మన సాంప్రదాయిక సర్వమత సమాదరణకు శాశ్వత స్మృతి" అని ఆయన అన్నారు.

ఇక్కడ ఒక ముఖ్య విషయం గమనించాలి. కబీరు మహమ్మదీయ ప్రవక్త కాదు. రామ్, రహీంలను ఐక్యం చేసిన అద్వైత వాది. కబీరు రామదాసుకు రామ మంత్రోపదేశం చేయలేదని ఇంతకు ముందే తెలియజేశాను.

## 8.0. రామదాసు కీర్తనల వ్యాప్తి :

సామాన్య ప్రజల్లో, భజన కూటాల్లో సర్వత్రా వినిపించే, స్మరింపబడే, కీర్తింపబడే కీర్తనలు రామదాసు కీర్తనలే అన్న విషయం సర్వ జనైక వేద్యం. రామదాసు కీర్తనలకున్న ప్రజాదరణ అటువంటిది. ఆధ్యాత్మ, భక్తి, నీతి, వైరాగ్యాల్లో ఇతర తెలుగు వాగ్గేయకారులతో సరితూగ గల భక్తాగ్రేసరుడు రామదాసు. ఆర్తి, మొర మొదలైన గుణాల్లో అత్యున్నతుడు రామదాసు. రామదాసు రచించిన కీర్తనలు గానం చేసే పట్టి వర్ధనముల దాసరులు, నెమిలి కుంచెలతోను, ఇత్తడి చిలుకల నెమ్మలతోను, నడుమున బిగించిన పట్టు బట్టలతోను, నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ, తీర్థాల్లోనూ, పల్లెల్లోనూ ప్రత్యక్షమౌతుంటారు.

హరి ఆదిశేషువు గారు ఈ కీర్తనల గూర్చి ఈ విధంగా తెలియజేశారు. " రామాలయము లేని పల్లె గాని,'హైందుకయితే వుంచినావు బ్రంధిఖానా'లో అని అక్షర సాంకర్యాలతో అచ్చమైన జానపద భాషలోనైనా ఆలాపించని, నిరక్షరాస్య భక్తులు గాని కన్పించని చోటు తెలుగు దేశంలో ఉండదు. ఎన్ని అభిప్రాయ భేదాలు తెలుగుదేశంలో కనిపించినా, రామదాసు కీర్తనల మాధుర్యాన్ని గూర్చి, వాటికి గల పామరామోదాన్ని గురించీ, అభిప్రాయ భేదం కన్పించదు."[2]

ప్రజాదృష్టి, బాహ్య లక్షణాలందు లగ్నమైయున్నా, గోపన్న శుద్ధమైన రామభక్తియందు, లగ్నమైన విధానాన్ని 'దాశరథీ శతకం' విశదం చేస్తుంది. ఆంధ్ర దేశనందు, ద్రవిడ దేశనందు లేని ఒక విశేషం కనిపిస్తుంది. శ్రీరామభక్తి దేశం నలుమూలలా వ్యాపించి ఉంది. శ్రీరామ భజనలు, రామమందిరాలు, గ్రామాలకు జీవకళలుగా ఉన్నాయి. ప్రజలు కుల వివక్ష లేకుండా, బ్రాహ్మణ, బ్రాహ్మణేతరులు కలిసి దీపారాధనను చేసి రామభజనను చేస్తూ, గ్రామ సంకీర్తనం చేయడం పరిపాటిగా ఉంది. ముఖ్యంగా గ్రామోపద్రవ సమయాలందు, ప్రజలు రామభక్తి పరవశులై భజనలు చేస్తున్నప్పుడు, చూసినవారికి, ఆంధ్రదేశంలో శ్రీరామభక్తి వ్యాప్తి పొందిన విధం విశదమౌతుంది. రామభజనలందు పాడే కీర్తనలు విశేషంగా రామదాసు కీర్తనలై ఉంటాయి.

ఉదా : 'కోదండ రామ కోదండ రామ, 'ఏమిరా రామ నావల్లనేరమేమిరా రామా !, నను బ్రోవమని చెప్పవే, కంటి నేడు మా రాముల, ఏ తీరుగ నను దయజూచెదవో. ఇవేగాక బాగా ప్రచారంలో ఉన్న రామదాసు కీర్తనలు, ముఖ్యంగా భజన కూటాల వారు పాడే వాటిలో ప్రసిద్ధమైన కీర్తనలు కొన్ని "తారక మంత్రము, తక్కువేమి మనకు, పలుకే బంగారమాయెనా, పాహి రామప్రభో, రాగజోగి మందుకొనరే, ఇక్ష్వాకు కులతిలక, పాహిరామప్రభో, ఏడనున్నాడో భద్రాద్రి వాసుడు, అంతా రామమయం, అదిగో భద్రాద్రి, ఎన్నగాను

1. రామదాసు - నూకల చిన సత్యనారాయణ, 'తెలుగులో పదకవిత', ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రచురణలు.

2. జానపద గేయ వాఙ్మయము - పరిచయము - హరి ఆదిశేషువు. పుట 227.

రామభజన కన్న మిక్కిలున్నదా, ఓరామ నీ నామమెంతో రుచిరా - శ్రీరామ నీ నామమేమి రుచిరా, నను బ్రోవమని చెప్పవే, గరుడ గమన రారా, రామచంద్రాయ జనక . మొదలైన ఈ కీర్తనలన్నీ బహుళ ప్రచారం పొందిన రామదాసు కీర్తనలు.

డా॥ సి. రమణయ్య గారు ఈ రామదాసు కీర్తనల ప్రాముఖ్యాన్ని గూర్చి ఈ విధంగా తెలియజేశారు. "భద్రాచల రామదాసుగా పేరు పొంది, ఆంధ్రదేశంలోనే కాక భారత దేశం అంతటా ప్రసిద్ధి చెందిన పరమ భక్తాగ్రేసరుడు, వాగ్గేయకారుడు అయిన ఇతని కీర్తనలు రక్తికి, భజన గోష్ఠులలోని భజన సంకీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. ఆంధ్రదేశంలో ఈ కీర్తనల తర్వాతనే మిగిలిన వారి కీర్తనలకు పేరు."[1] అంతేకాక ఈ భద్రాద్రి రామకీర్తనలు భక్తి జ్ఞాన సమ్మిళితమై ఆంధ్ర హృదయ జిజ్ఞాసకు నిదర్శనాలుగా ఉన్నాయి. శ్రీరామ భక్తి రసపూరితాలైన శ్రీరామదాసు కీర్తనలు ఆంధ్ర హృదయేశ్వరుడైన శ్రీరామచంద్ర సంకీర్తనలన్నీ మనోహరంగా చేస్తూ రామభక్తి వ్యాపనాన్ని విశదం చేస్తున్నాయి. ఇతడు చెరసాలలో ఉంటూ శ్రీరాముని ఆర్తితో వేడుకుంటూ పాడిన అనేక కీర్తనలకు ప్రాచుర్యం లభించింది.

ప్రముఖ వాగ్గేయకారుడిగా రామదాసు పేరు చిరస్థాయిగా నిలిచింది. రామదాసు కీర్తనలు, సంగీత సాహిత్యాలందు అంత విశేషం కలవి కాకున్నా, భక్తి పారవశ్యం కలిగించేవాటిలో మేలు తరాలు. తెలుగు నాట ఆబాల గోపాలానికి నోట వచ్చిఉండేవి. 'దాసర్లు' రామదాసు కీర్తనలను ప్రత్యేకంగా పాడుతూ దేశాటనం చేస్తూ, రామనామాన్ని ప్రచారం చేస్తుంటారు. ఈ కీర్తనలు భజన కూటాల్లో మిక్కిలి వాడుకలో ఉండి, పద యమకాలతో మహాధారగా నడచిపోతుంటాయి. వేటూరి ఆనందమూర్తి గారు ఈ రామదాసు కీర్తనలను ఈ విధంగా ప్రస్తుతించారు. "తాళ్లపాక కవులలోని భక్త్యంశ ఆకృతి దాల్చిన మహనీయుడు ఈ రామదాసు. ఈయన భజన కీర్తనలు నేటికీ భజన కూటాల వారికి భక్తవరులకు ప్రాణప్రదములు. రామభక్తి సామ్రాజ్యమున పరవశించి పాడుకొని తబ్బిబ్బై తన కాలము వారికి భక్త్యమృతమును చూఱయిచ్చిన మధుర వాగ్గేయకారుడు."[2]

మరి యింతటి ప్రాశస్త్యాన్ని పొందిన ఈ రామదాసు కీర్తనలను, తత్త్వాలను పూర్వం యాచకులు, బైరాగులు పాడుతూ, ప్రజా హృదయాలందు భక్తి, జ్ఞానాలను కలుగజేస్తూ ఉండేవారు. రామభక్తిని ఈ విధంగా ప్రచారం చేశారు. ఆయన కారాగార శిక్ష వలన పద వాఙ్మయానికి శ్రీరామ రక్ష. ఆయన కష్టాలు, బాధలు ఒక కరుణ రసాత్మక గాథ. ఆయన తన జీవితాన్ని కర్పూరంలా వెలిగించుకుని ఆహుతైపోయి, ఆ మంగళ హారతి వెలుగులో లోకానికి శ్రీరామదర్శనం చేయించాడు. ఆయన గొప్ప వాగ్గేయకారుడు. వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ కూడా రామదాసుడై, చరితార్థుడైన ధన్యజీవి. ఎన్ని వందల పాటలు పాడుకున్నాడో గానీ, మనకీనాడు మిగిలినవీ, ఆ భజన పద్ధతినే అనుసరించిన యాదవదాసు, తూము నరసింహదాసు, కంచి వరద రామదాసు ప్రభృతి ప్రఖ్యాత భజనపరులు సంప్రదాయ సిద్ధంగా పారంపర్యంగా పాడుకొని నిలిపినవీ, రామదాసు జీవితాన్ని నిబంధించిన యక్షగాన రచనల్లో లభించేవీ అన్నీ కలిసి సుమారు నూట తొంబైయెనిమిది కన్నా అధికంగా లేవు, లభించలేదు. దాశరథుల బాలయ్య గారు ఈ 198 కీర్తనలను సంకలనం చేసి పుస్తక రూపంలో అచ్చు వేయించారు. "భక్త రామదాసు కీర్తనలు" అన్న పేరుతో ఈ పుస్తకం ఈనాడు లభిస్తుంది. ఈ నూట తొంబైయెనిమిది కీర్తనలు రామదాసు ముద్రతో ఉన్నవే.

రామదాసు చెరసాలలో ఉంటూ శ్రీరాముని ఆర్తితో వేడుకుంటూ అనేక కీర్తనలు రచించాడు. భద్రాద్రి తహసీల్‌లో ఉద్యోగిగా ఉండి సర్కారు పైకం రామకైంకర్యం నిమిత్తం ఖర్చుపెట్టి అబ్దుల్లా , అబుల్ హసన్ తానీషాల చేత బందిఖానాలో పండ్రెండేండ్లు ఉంచబడి, చాలా కష్టాలు పడి, శ్రీరామానుగ్రహాన్ని పొందినాడు. బందిఖానాలో భక్త్యావేశంతో , దుఃఖావేశంతో ఆలపించిన కీర్తనలే రామదాసు కీర్తనలుగా ప్రాచుర్యం పొందాయి.

1. తెలుగులో పదకవులు - డా॥ సి. రమణయ్య, సప్తగిరి , ఏప్రిల్ 1989.

2. పద కవితలు - వేటూరి ఆనందమూర్తి, పుట 178-182, తెలుగువాణి - ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక, ఏప్రిల్.

శ్రీ వింజమూరి నరసింహాచార్యులుగారు ఈ కీర్తనల గూర్చి ఈవిధంగా తెలియజేశారు. "రామదాసు కీర్తనలు పదగుంభనము లేని తేలిక మాటలతో నుండుటచేత, రాగ తాళములు సుసాధ్యములై, పామర వేద్యములగుటచేతను, భావములు పుంఖాను పుంఖములై అంతరంగికానుభవములను దెలుపుట చేతను, దక్షిణాపథమంతయు విస్తరింప గలిగెను. అరవలు , కన్నడులు, కేరళులు, అందరు ఈయన కీర్తనలు సభలయందును, భజనలయందును పాడుచున్నారు. తెనుగు దాసరులు పట్టెడు నామములు ధరించి నృత్యములతో విలీన మానసమున వీనిని పాడుటకందుము. వీనియందలి రాగకళ అతి సులభము, సుసాధ్యము, మధురము. ఈయన రచనలు సరళమై పండిత పామర రంజకమై యుండెను."[1]

రాముణ్ణి తెలుగు వారికి దగ్గర చేశాడు గోపన్న. రాముడు అందరికీ ఇష్టదైవం. భద్రాచలాన్ని రామునికి స్థిర నివాసం చేశాడు గోపన్న. ప్రతినిత్యం గోదావరిని రామనామ స్తోత్రం చెయ్యమని కోరాడు. తాను రామచంద్రుణ్ణి ప్రార్థించి పునీతుడయ్యాడు. ఆయన చరిత్ర రామభక్తులందరికీ మహాకావ్యం. కోదండపాణి, కోటి సూర్యుల కాంతితో ప్రకాశిస్తున్నట్లు దర్శనమిస్తాడు రామదాసు కీర్తనల్లో. రామయ్య అందరికీ తండ్రి. సీతమ్మ అందరికీ తల్లి. ప్రతివారికీ పితృ పాత్రులైన దేవతల దర్శనం ప్రతినిత్యం కావచ్చు. కాని సీతారాముల దర్శనం కోసం ప్రాకులాడుతూ వుంటారు. ప్రార్థనలు జరుపుతూ వుంటారు. ఊరూరా కల్యాణం జరుగుతుంది. శ్రీరామనవమి సందర్భంలో అందరి తలలపై తలంబ్రాలు వెదజల్లబడతాయి. అందరి హృదయాలు భక్తి భావాలతో పల్లవిస్తాయి. రామదాసుగారు

*రావయ్య రామా నవనీరద శ్యామా ॥*
*మునివేళ్లను ఎగిరి ఎగిరి ఎదురు చూచినది శబరి*
*నీ అరికాళ్లను తుడిచి తుడిచి పడవనెక్కించెను గుహుడు ॥*

అని అంటాడు. ఆంధ్రదేశంలో ఊరూరా ఒక శబరి, ప్రతి గృహంలో గుహుడు ఉన్నారంటే ఆశ్చర్యం లేదు. రామదాసు కీర్తనలే తెలుగు వారిలో, భారతీయులలో రామభక్తిని పాదుకొల్పడానికి తోడ్పడినాయి. రామభక్తిని భారతీయులందరి హృదయాలలో నిలిపినాడు రామదాసు. ఆంధ్రదేశంనందలి పల్లె పల్లెయందూ అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే భేదం లేకుండా రామదాసు కీర్తనలు వ్యాపించి ఉన్నాయి. ఆ కీర్తనలను తాళపత్రాలలో వ్రాసిపెట్టుకొని, మొన్న మొన్నటి వరకూ మనవారు దేవతార్చన గృహపీఠాలందు భద్రం చేస్తూ జాగ్రత్తగా కాపాడుతూ వచ్చారు. పూర్వం రామదాసు కీర్తన ఒక్కటైనా రాని ఆంధ్రుడు కనిపించేవాడు కాడు. కాని నేడు ఆంధ్రదేశంలోని ఆంధ్రుడు కూడా మారిపోయాడు. ఈనాడీ కీర్తనలు ఆలపించడం తగ్గింది. భజన కూటాల వారు మాత్రం రామదాసు కీర్తనలను ఆలపిస్తున్నారు. వారే ఈ కీర్తనలను కాపాడుతున్నారు. అమాయకమును, నిష్కల్మషమును, ఉద్రేక పూరితమునైన తెలుగుల సహజ ప్రవృత్తికి ఏమాత్రమూ పొచ్చెము లేని ప్రతినిధి రామదాసు. ఈతని కీర్తనల్లో ఎక్కువ భాగం 'నాదనామ క్రియ' రాగంలో ఉన్నాయి. ఈతని తర్వాతే మామూలు వాడుక భాషలో సూటిగ భావాలను వ్యక్తీకరిస్తూ వేదాంత తత్త్వాలు వ్రాయడం మొదలైంది.

నారుమంచి సుబ్బారావు గారు రామదాసు కీర్తనల వైశిష్ట్యాన్ని గూర్చి ఇలా తెలియజేశారు. "రామదాసు గారు తమిళ దేశమున కాలుపెట్టినట్టు లేదు గాని, వీరి కీర్తనలు తమిళ దేశమునందంతటను పాడబడుచున్నవి. తమిళ దేశమున రామదాసు కీర్తన పాడబడని పాట కచ్చేరీ లేదని చెంబై వైద్యనాథ భాగవతార్ వ్రాసియున్నారు. సరస్వతీబాయి, బన్నీబాయి, పట్టుకోట సామి భాగవతార్ మొదలగు చాలామంది

1. ఆంధ్రుల సంగీతము - శ్రీ వింజమూరి నరసింహాచార్యులు, ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, పార్థివ, 1945.

హరిదాసులు వీరి కీర్తనలలో రామదాసుగారి హరికథ చెప్పచుండుట స్పష్టము. ఇంటింటను వీరి కీర్తనలు పాడబడుచున్నవి."[1]

ఆంధ్రదేశంలోనే గాక అనేక ప్రాంతాల్లో నేటికీ వీరు రచించిన, గానం చేసిన భక్తి రసవత్తరమైన కీర్తనలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. రామదాసు పేర నాటకాలు ప్రదర్శిస్తూ, హరికథలు చెప్తూ భజన సమయాలందు వారి కీర్తనలు పాడుతుండడం చాలా గొప్ప విషయం. వీరు రచించిన దాశరథీ శతకంలోని పద్యాలు సాహిత్యంనందే గాక, భక్తి పారవశ్యంతో గూడి, కీర్తింపబడటం గమనార్హం. రామదాసు కీర్తనలు భజన కూటాలవారు పాడుకోవటం వలన ఈ కీర్తనలు విశేషంగా ఆంధ్రదేశంలోనే కాక, యావద్భారత దేశంలోనూ వ్యాప్తి చెందాయి. ప్రాచుర్యం పొందాయి.

జి.కృష్ణగారు రామదాసు కీర్తనల ప్రాముఖ్యాన్ని గూర్చి ఈ విధంగా ప్రస్తావించారు " అతడి కీర్తనలలో ఒకటి రెండింటి మొదళ్ళయినా ఏదో ఒక్కనాడైనా పలకని ఆంధ్రుడు ఉంటాడా ! అతడి కీర్తనలలో ఒకటి రెండింట మొదళ్లను 'తిరుమంత్రం'లాగా మననం చేసి తీరుతారు తెలుగువారు. భక్తులం అయినా కాకపోయనా, అతడి పాటలకు మనం వారసులం అని తప్పక అనిపిస్తుంది.[2] అందుకే రామదాసుగారు వ్రాసిన 'తక్కువేమి మనకూ రాముండొక్కడుండు వరకు', తారక మంత్రము కోరిన దొరికెను, పలుకే బంగారమాయెనా, ఏ తీరుగ నను దయజూచెదవో ' వంటి అద్భుతమైన రామభక్తి ప్రపూరితాలైన కీర్తనలెన్నో రామదాసును ప్రజలకు సన్నిహితుడిని చేశాయి. వాగ్గేయకారునికి కావలసింది పాండిత్యం కాదు. జీవుడు తాను పడే వేదన , హృదయం రెండూ కలిస్తే బండ రాళ్లను కూడా కరిగించవచ్చును. తరతరాల సహృదయులకూ ఆత్మీయుడిగా మిగిలిపోవచ్చు. ఇదే రామదాసు జీవిత కథ ద్వారా నేర్చుకొనే విషయం.

రామదాసుగారి కీర్తనలు రామభక్తి ప్రపూరితాలు కాబట్టే "ఎక్కడ రామనామ స్మరణం జరుగుతుందో అక్కడ ఆంజనేయ స్వామి ప్రత్యక్షంగా ఉంటారని విశ్వాసం ఉన్నట్లు , ఎక్కడ రామదాసు కీర్తనలు భజింపబడతాయో, అక్కడ శ్రీ సీతారామ చంద్రమూర్తి విలసిల్లుతాడనటంలో అతిశయోక్తి లేదు.

ఆ భద్రాగిరి రాముడి కృపకు రామదాసుల వారు పాత్రులైనందువలన, భద్రగిరిలో అద్భుతమైన ఆలయం నిర్మించినందు వలన ఆతని జన్మ తరించిందని ఈ గేయం తెలియజేస్తుంది.

*అందరికీ ఆరాధ్యుడైన " అట్టి రాముడు తెలుగు వారల*
*నట్టింట వెలసిన దైవమాయెను అల్లదిగో భద్రాద్రిపై సత*
*దానంద కరముగ కొలువు దీరెను. రాముడితడే, నీల మేఘ*
*శ్యాముడితడే, గోపరాజుకు స్వామి యితడే నమ్మి కొలిచిన వమ్ము చేయని దైవమితడే ॥*
*పూత గౌతమి పొంత వెలసిన పూజ్యుడీ రఘురామ చంద్రుడు*
*కాన నేర్చిన నేత్రములలో కంటి పాపగనుండు దేవుడు ।*
*గోపరాజు మహానుభావుడు గుడిని కట్టెను స్వామి కోసము*
*నిరర్థనుండగు కవి కుమారుడు స్వామి సన్నిధికేమి తెచ్చును ?*
*పూలవంటివి తెలుగు పలుకులు మాల కట్టును, స్వామికిచ్చును*
*తల్లి నవ్వును, తండ్రి నవ్వును నవ్వులే దిశలెల్ల వెలుగును ॥*[3]

ఈ గేయాన్ని శ్రీ వేదుల సోమనాథ శాస్త్రిగారు వ్రాశారు. అద్భుతమైన భావమిందున్నది. రామదాసు గారు రాముడినే దైవంగా నమ్మి రామనామ సంకీర్తనం చేస్తూ, ఆయనకు ఆలయం నిర్మింపజేసి తరించి,

1. తెలుగు సంగీత విద్వాంసులు - నారుమంచి సుబ్బారావు , పుట 137.

2. ప్రముఖ వాగ్గేయకారులు - జి. కృష్ణ, పుట 21.

3. శ్రీ భద్రాచల క్షేత్ర మహిమ - సంపా॥ డి. సుదర్శన్, పుట 108.

ధన్యుడైనాడు. రామదాసు గారి కీర్తనలు తేట తెలుగు మాటలతో అందరూ హాయిగా పాడుకునే భజన సంకీర్తనలుగా ప్రసిద్ధి గాంచాయి.

### 8.1. రామదాసు కీర్తనలు - సంఖ్యా నిర్ణయం :

రామదాసుగారు రచించిన కీర్తనలు పరిశీలిస్తే మూడు విధాలుగా ఉన్నాయి.

1. కారాగారవాస పూర్వం వ్రాసిన కీర్తనలు - ఇవి ప్రధానంగా నామగుణ కీర్తనలుగా ఉన్నాయి.

2. కారాగార వాసం చేస్తున్నప్పుడు వ్రాసిన కీర్తనలు - ఇవి ప్రధానంగా ఆత్మ నివేదనాసక్తి కీర్తనలుగా ఉన్నాయి.

3. కారాగారం నుండి విడుదలైన తర్వాత వ్రాసిన కీర్తనలు - ఇవి ప్రధానంగా తత్త్వ ప్రధానమైన, వేదాంత, వైరాగ్య ప్రబోధకమైన, నీతిని బోధించేవిగా ఉన్నాయి. రామదాసు జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా వారి కీర్తనల్ని ప్రధానంగా ఈ మూడు విధాలుగానే పేర్కొనడం జరిగింది. ఈ సిద్ధాంత వ్యాసం పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమౌతుంది.

### 8.1.0.నామ గుణ కీర్తనలు :

కారాగార వాసం చేయకముందు వారు రచించిన కీర్తనల్లో భగవంతుని నామాలను, గుణాలను, అవతార లీలలను గూర్చి గానం చేశారు. ప్రస్తావించారు. అందందు రామాయణ, భారత, భాగవత ఇతివృత్త ప్రధానమైన కీర్తనలు కూడా ఉన్నాయి. ఆయా సందర్భాలలో ఆయా గాథలకు సంబంధించిన ఘట్టాలను కూడా పేర్కొని పాడుకున్నారు. ఇటువంటి నామ గుణ కీర్తనల్లో కవిత్వాంశం తక్కువగా ఉన్నప్పటికీ భజన కూటాల వారికి ఎంతో ఆనందం సమకూర్చి పెట్టేవి ఈ కీర్తనలే. కారాగార వాసానికి పూర్వం రామదాసుగారు దుర్భరమైన వేదనలు అనుభవించలేదు. ఆనందంగా రామనామ సంకీర్తనం చేస్తూ, భజన గోష్ఠులతో, సంతర్పణలు చేస్తూ, శ్రీరామ ఉత్సవాలు చేస్తూ గడిపిన కాలం అది. అందుకే ఆయన ఈ కాలంలో వ్రాసిన కీర్తనల్లో కూడా ఆ ఆనందం, ఆ వైభవమే గోచరిస్తుంది. సంస్కృత కీర్తనలు కూడా కారాగార వాసానికి పూర్వం వ్రాసినవే. ఏదో ఒకటి, రెండు తప్ప తక్కినవన్నీ కారాగారవాస పూర్వం వ్రాసినవిగా చెప్పవచ్చును. కారాగార వాసానికి పూర్వం రామదాసుగారు వ్రాసిన కీర్తనలు 47గా గుర్తించవచ్చును.

### 8.1.1. ఆత్మ నివేదకములు :

కారాగార వాసం చేస్తున్న 12 సంవత్సరాల కాలంలో రామదాసు రచించిన కీర్తనల్లో ఆవేదన, నిర్వేదం, ఆర్తి ప్రధానంగా చోటు చేసుకున్నాయి. ఆత్మ నివేదనాసక్తియే ఈ కీర్తనల్లో ప్రస్ఫుటంగా ద్యోతకమవుతుంది. రామదాసులవారు జీవితంలో తనకు కల్గిన సుఖ దుఃఖాలను, మానావమానాలను శ్రీరామచంద్రునికి విన్నవించుకొన్న కీర్తనలే ఆత్మ నివేదకాలు. కారాగారంలో ఉండగా రామదాసు పాడుకొన్న కీర్తనలను పరిశీలిస్తే మనకీ విషయం స్పష్టమవుతుంది. వీటిలో ఆయన కోపం, విసుగు, బాధ, ఉపాలంభన, అనురక్తి మొదలైన భావాలు, ఆర్తి, శరణాగతి, మధురమైన భక్తి, జ్ఞాన విషయాలు, ఈ కీర్తనల్లో కనిపిస్తాయి. ఈ కీర్తనలు సహృదయ హృదయ రంజకంగా ఉంటాయి. భక్తులకే గాక కవితాను రక్తులకు కూడా ఆనంద పారవశ్యాన్ని, భక్తి భావాన్ని కలిగింపజేస్తాయి ఈ కీర్తనలు. రామదాసు కారాగార జీవితం గూర్చి తెలియజేసిన అధ్యాయంలో నేను ఉదహరించిన కీర్తనలన్నీ ఈ కోవకు చెందినవే. ఈ విధంగా ఆత్మ నివేదకాలైన కీర్తనలు ఎన్నో రచించి, తన స్థితిగతుల్ని విన్నవించి శ్రీరాముని గూర్చి గానం చేశారు రామదాసుగారు.

కారాగృహంలో ఉండగా రామదాసు బంధింపబడి 12 సం॥లు కారాగార జీవితం గడిపినంత కాలం వ్రాసిన కీర్తనలు 100. ఇవన్నీ 'ఆత్మ నివేదకాలే'.

### 8.1.2. తాత్త్విక కీర్తనలు :

కారాగారం నుండి రామదాసు విడుదలైన తర్వాత అతని చరమ దశలో, సంసార జీవితం అంటే విరక్తుడై, వైరాగ్య భావం కల్గి ఉండి, వేదాంత, భక్తి, జ్ఞాన, కర్మ సిద్ధాంతాలను గూర్చి, తత్త్వ జ్ఞానాన్ని కలిగి, దాని ద్వారా నీతిని బోధించే ప్రబోధాత్మకమైన కీర్తనలు ఎన్నో రచించారు రామదాసుగారు. ఇవన్నీ తాత్త్విక కీర్తనలుగా పేర్కొనవచ్చు. రామదాసుగారు తత్త్వాన్ని బాగా తెలిసినవారు, జీవిత సారం అంతా గ్రహించిన వారు కావుననే ఆ సారం అంతా మదించి ఈ తత్త్వాన్ని జనులకు తెలియజేశారు. అద్భుతమైన తాత్త్విక కీర్తనలు వీరు రచించారు. ఈ కీర్తనల్లో వారు నీతి, వైరాగ్యం, ఆధ్యాత్మికత్వం, యోగం మున్నగు విషయాలు తెలియజేశారు. కారాగార వాసానంతరం రామదాసుగారు పాడిన, వ్రాసిన కీర్తనలను పరిశీలిస్తే ఈ విషయం గ్రాహ్యమవుతుంది.

ఈ విధంగా రామదాసుల వారి తాత్త్విక కీర్తనల్లో తత్త్వాన్ని గూర్చిన లోతైన విషయాలు, వైరాగ్య భావాలు, వేదాంతం, లోకతత్త్వం, సామాజిక వాస్తవం, ప్రబోధం మొదలైన వాటికి సంబంధించి విషయాలు ఎన్నో ఉన్నాయి. నేటి నినాదాలు గల కవిత్వానికి సంబంధించిన భావాలు కూడా కొన్ని వీరి కీర్తనల్లో చోటు చేసుకున్నాయి. రామదాసుల వారి తాత్త్విక కీర్తనల్లో భాష కన్న భావానికే ప్రాధాన్యమీయ వలసి ఉంటుంది. కవిత్వం పాలు తక్కువైనప్పటికీ పండిత, పామర రంజకమై నేటికీ రామదాసుల వారి కీర్తనలు విరాజిల్లుతున్నాయి. కారాగార వాసానంతరం రామదాసుగారు రచించిన కీర్తనలు 51. ఇవన్నీ తాత్త్విక కీర్తనలే.

రామదాసుగారు రచించిన కీర్తనల్లో 'పాహి రామప్రభో' అనే వృత్త పదం ఒకటి ప్రధానమైంది. 61 చరణాలున్న కీర్తన ఇది. ఒక రామాయణేతి వృత్త ప్రధానమైన చూర్ణిక కూడా సంస్కృతంలో వ్రాయబడి ఉంది. "చతుర్వింశతి నామ ప్రతిపాదక చూర్ణిక" - శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండభాండ తండోపతండ" అనేది. 196 కీర్తనలు, 1 చూర్ణిక, 1 వృత్త పదం కలిపి 198 కీర్తనలను రామదాసుగారు రచించారు. కారాగార వాసానికి పూర్వం వ్రాసినవి 47, కారాగారంలో ఉండగా వ్రాసినవి 100, కారాగార వాసానంతరం వ్రాసినవి 51. మొత్తం 198. ఇవి కాక దాశరథీ శతకం వ్రాశారు. ఇంత గొప్ప శతక కర్త, పదకవి, రామభక్తుడు మన తెలుగునాట ఆవిర్భవించడం మన అదృష్టం. అందుకే త్యాగరాజ స్వామివారు కూడా రామదాసును తన కీర్తనల్లో , రచనల్లో ప్రస్తుతించారు.

## 8.2 .రామదాసును స్మరించిన త్యాగరాజు :

రామదాసుల వారి కీర్తనల ప్రభావం త్యాగరాజుపై ఉంది. రామదాసుల వారి కీర్తి త్యాగరాజ స్వామి వారికి పూర్వమే దక్షిణాదిలో వ్యాపించిందనడానికి త్యాగరాజుల వారే సాక్ష్యం. రామదాసునకు దాదాపు పది సంవత్సరాల తర్వాతి వాడు త్యాగరాజు. త్యాగరాజునకు పూర్వయుగంలో సంగీత కచేరీల్లో రామదాసు కీర్తనలు కొన్ని తప్పని సరిగా పాడేవారు. త్యాగరాజు తల్లిదండ్రులూ, త్యాగరాజూ భద్రాద్రి రామభక్తుని పాటలను పాడారనడం సర్వవిదితం. త్యాగరాజు అక్షరాలా రామదాసును ఆరాధించాడనవచ్చును. ఆనంద బ్రహ్మోపాసకుడు, రామదాసుల వారిని 4,5 మార్లు భక్తి శ్రద్ధలతో తన కృతుల్లో స్మరించారు.

1. కీరవాణి రాగం - ఆది తాళం "కలిగియుంటే గదా కల్గును - కామిత ఫలదాయక" అనే కీర్తనలో "భాగవతాగ్రేసరులగు నారద ప్రహ్లాద పరాశర రామదాసులు" అని రామదాసుల వారిని, నారదాదులతో సమానంగా నిలబెట్టారు.

**2. శంకరాభరణం - చాపు తాళం :** "బుద్ధిరాదు బుద్ధిరాదు పెద్దల సుద్దులు వినక" అనే కీర్తనలో "యోగములభ్యసించినా - భోగములెంతో గలిగినా త్యాగరాజునుతుడౌ - రామదాసుల చెలిమి సేయక అని రామదాసుల వారిని గొప్పగా ప్రశంసించారు.

**3. దేవ గాంధారి - ఆది తాళం :** "క్షీర సాగర శయనా - నన్ను చింతల పెట్టవలెనా" అనే కీర్తనలో "ధీరుడౌ రామదాసునిబంధము తీర్చినది విన్నానురా" అని రామదాసులవారి ధైర్యాన్ని, శ్రీరామచంద్రుని అనుగ్రహాన్ని స్పష్టం చేశాడు త్యాగయ్య.

**4. సారంగ రాగం - ఆది తాళం :** "ఏమి దోవ బల్కుమా -యిక నేనెందు బోదు శ్రీరామా " అనే కీర్తనలోను, "రామదాసు వలెనైతే - సీతాభామ మందలించును నీతో" అని తాను రామదాసులై యుంటే సీతమ్మ తనను రక్షించుమని పోరు పెట్టేదని చెప్పకొంటాడు.

**5. తోడి రాగం** - 'బృందావనలోలా' అనే కృతిలో త్యాగయ్య తాను రామదాసు దాసునిగా చెప్పకున్నాడు. అంతేగాక త్యాగయ్య తాను రచించిన "ప్రహ్లాద భక్త విజయం" అనే యక్షగానంలో మొదటి పద్యంలో శ్రీరామచంద్రుని, రెండవ పద్యంలో విష్వక్సేనుని, మూడవ పద్యంలో సరస్వతిని, నాల్గవ పద్యంలో నారదుని, ఐదవ పద్యంలో తులసీదాసును, ఆరవ పద్యంలో పురందర దాసును, ఏడవ పద్యంలో భద్రాచల రామదాసును ఈ విధంగా ప్రశంసించినారు.

> **"కలియుగమున వర భద్రా**
> **చలమున నెలకొన్న రామచంద్రుని వద భ**
> **క్తులకెల్ల వరుడనందగి**
> **వెలసిన శ్రీరామదాసు వినుతింతు మదిన్"**

ఈ విధంగా త్యాగరాజ స్వామి వారు రామదాసును ఐదారు కీర్తనల్లోనూ, ఒక పద్యంలోనూ స్మరించడం వలన త్యాగరాజ స్వామివారికి, రామదాసుపై ఎంతటి భక్తియో, ఎంతటి గౌరవమో, ఎంతటి ప్రేమయో తేట తెల్లమౌతుంది. వీరిద్దరి కీర్తనలను పరిశీలింపగా భావాల్లోనూ, కవితాకల్పనలోనూ, భాషలోనూ, పద ప్రయోగంలోనూ అనేక పోలికలు కనిపిస్తాయి. ఈ విధంగా త్యాగరాజు రామదాసును స్మరించాడు. ఆయన రచనా సరళిని కూడా అనుసరించాడు త్యాగరాజు.

## 8.3. రామదాసు కీర్తనలపై ఆతని జీవిత ప్రభావం :

ఈ భక్త రామదాసు కీర్తనల గూర్చి, వాటి ప్రాముఖ్యాన్ని గూర్చి శ్రీ కొండపల్లి రామచంద్రరావుగారు ఈ విధంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. "అతి క్రూరమగు రాజదండనము ననుభవించుచు, నెంతయార్త దశలో నున్నను రామనామ సంకీర్తనము గోపన్న మానలేదు. అతి క్లేశములగు తన యనుభవములను స్వామిని సన్నుతించుటలోనే సంపుటీకరణ మొనర్చి అట్టి సాహిత్యముచే నప్పటి పరిస్థితులను నేటికిని మనమూహింప గలుగు మహోపకార మొనర్చెను."[1]

ఈ భక్త రామదాసును నిరంతరం జీవిత సమరంలో సంభవించిన కష్ట నష్టాలు, వొడుదుడుకులు, అవమానాలు, ఆటుపోట్లు ఆయన హృదయాన్ని స్పందింపజేశాయి. మనసును కలచి వేశాయి. రాపిడి పెట్టాయి. ఆయన తన హృదయ విదారకమైన బాధలను, తీరని ఆరాటాలను, భగవంతునితో మొర పెట్టుకున్నాడు. ఆయన హృదయ కుహరం నుండి వెలువడిన ఆ దుఃఖం, ఆర్తి కీర్తనల రూపం దాల్చాయి.

---

1. భద్రాచల క్షేత్ర చరిత్రము - కొండపల్లి రామచంద్ర రావుగారు.

తెలుగువారికి జాతి సొత్తుగా, సంపదగా దక్కాయి. ఆ మహనీయుని పాంచభౌతిక దేహం మన మధ్యనుంచి అంతర్థానమై పోయినా, కీర్తనల రూపంలో, నాద స్వరూపంలో భక్తాగ్రగణ్యుడై, నిరంతరం ఆయన మన మధ్యనే నిలిచి ఉంటాడు. భక్త రామదాసు తన నిత్య జీవితంలో అనుక్షణం అనుభవించిన కష్ట పరంపరలకు ప్రతిబింబాలే ఆయన మహత్తరమైన రచనలు. అవి ఆయన గుండె లోతుల్లోంచి దూసుకొని వచ్చినవే గాని, ఏవో మొక్కుబడికోసం, తాను కవి కావాలనే ఉబలాటంతో, ఆరాటంతో ఆర్భాటంతో వ్రాసినవి మాత్రం కావు. అవి ఆయన గుండెలను పిండి వ్రాసినవి గనుక, నిజ జీవితానికి సన్నిహితంగాను, సందర్భోచితంగాను ఉన్నాయి. ఆ పుణ్య పురుషుడు నిరంతరం అనుభవించిన ఆ కష్ట పరంపరలన్నీ మన హృదయాన్ని, మనసును కలచివేస్తాయి.

"అతి వాస్తవికతకు ఆయన జీవితం దర్పణం" ఆ మహనీయుని రచనలు వింటే భక్తి భావం దానంతట అదే మనస్సులో ఏర్పడుతుంది. రామదాసువలె శ్రీరామ నామ సుధా మాధురిని గ్రోలి, అంత గొప్పగా చవి చూచిన, తరించిన మరో భక్తుడు తెలుగు నాట లేడంటే ఇసుమంతైనా అతిశయోక్తి ఉండబోదు. రామదాసు భక్తిలో ఒక ప్రత్యేకత ఉంది. దివ్య పారవశ్యముంది. తన ఇష్టదైవమైన శ్రీరామచంద్ర మూర్తిని ప్రత్యక్షంగా దర్శించాలని, భాషించాలని రామదాసు హృదయం తల్లడిల్లింది.

"ఏమిరా రామా ! నా వల్ల నేరమేమిరా" అని రాముణ్ణే ప్రశ్నించడం జరిగింది. "ఆశించి యుండిన దాసుని శ్రీరాములూ - నీకు పోషించే భారము లేదా శ్రీరాములూ" అంటూ రామునికి కర్తవ్యాన్ని గుర్తు చేసే స్థాయికి కూడా వెళ్ళింది రామదాసు భక్తి. "అడుగు దాటి కదలనివ్వను - నా కథయమివ్వక నిన్ను విడువను" అని శ్రీరాముని అప్పిచ్చిన వానివలె నిలదీసిన సన్నివేశాలు కూడా ఉన్నాయి. పిలిస్తే రాముడు పలకలేదని 'పలుకే బంగారమాయెనా! కోదండపాణి! అని ఎత్తి పొడిచాడు. ఇలా అనితర సాధ్యమైన రీతిలో భక్తిని చేసి శ్రీరాముని కృపతో తన పలుకును బంగారం చేసుకొన్నాడు రామదాసు.

బంగారు కీర్తనలు రచించాడు. భక్తి పరిమళం గల బంగారు శతకాన్ని రచించాడు. అదే దాశరథీ శతకం. రామదాసు భక్తి హృదయం ఈ శతకంలో ముంజేతి కంకణంలా ప్రస్ఫుటమౌతుంది. రామదాసువలె "తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు" అని మనం కూడా ధీమాగా జీవిద్దాం."[1] అని శ్రీ సుందర చైతన్యానంద స్వామి వారు రామదాసు యొక్క భక్తి భరిత కీర్తనలు, ఆయన భక్తి శతకం గూర్చి అతి చక్కగా వివరణనిచ్చారు. ఆ కీర్తనల వలన మానవ జీవితానికి ఒక మార్గం ఏర్పడిందని వారి ఉద్దేశం. వారి జీవితం నేటి మానవాళికి ఆదర్శం కావాలని, సుందర చైతన్యానందగారు ఉద్బోధించారు.

"రామదాసు భైరుకు వెళ్తూ, కేవల మానవుల యాచించునా ! ఆ మహాభక్తుడు. అందుకే "నీ సంకల్పంబెటువంటిదో గననెంత వాడ రామా ! అనే కీర్తనలో "తోచి తోచకను తొడరి కరంబుల జూచి పరులనే యాచన సేయను" అని తన మనో నిశ్చయం వెల్లడిచేసెను."[2] నరులను యాచించక, రామునే యాచించి తన పంతం నెగ్గించుకున్న ధీరుడు రామదాసు. "శ్రీ భద్రాచల సుప్రభాతమ్" అనే గ్రంథంలో రామదాసు రచనల గూర్చి ఈ విధంగా ప్రస్తావింపబడి ఉంది.

"మహిత భక్తి గల శ్రీరామదాసుచే రచించబడిన భక్తి రసమయ గీతములు గలవాడా ! ఓ భద్రాచల రామచంద్రా ! నీవు విద్యానిధివి. రఘువంశమున కధిపతివి. మానవుల అజ్ఞానపు జీకటిని తొలగించి జ్ఞానమనెడి వెలుగునిచ్చు ప్రభువు నీవు. నీకు సుప్రభాతమగు గాక" అని రామదాసు రచనలు

1. గిరాధారి - స్వర్ణోత్సవ విశేష సంచిక - శ్రీ స్వామి సుందర చైతన్యానంద - పలుకే బంగారం(వ్యాసం) పుట 50.

2. శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము - కొండపల్లి రామచంద్రరావు , పుట 31-32.

రామభక్తి ప్రపూరితాలైనవి అని తెలియజేయబడింది."[1] రామదాసు కావ్య రచన కూడా చేశాడు. జీవనోపాధి కొరకో, ఏమో, ఎందుకో గాని గోపన్న తన కావ్యాలను దురాత్ములకిచ్చి మోసపోయాడు[2] అని ఆరుద్రగారు తెలియజేశారు. ఆ కావ్యాలేవో తెలీదు. దాశరథీ శతకంలో కూడా 'మనగొని రేగు పండ్లకును. . .' అనే పద్యంలో ఈ విషయం ప్రస్తావింపబడింది. పాపం నరులకు ఆ కావ్యాలను అంకితంగా ఇచ్చినందుకు బాధ పడ్డాడు రామదాసు.

**నిందా స్తుతి కీర్తనలు :**

కలియుగంలో భద్రాచల రామదాసు పడరాని బాధలు పడి, విసిగి వేసారి జీవితంలో ఆశలుడిగి అసమానమైన నిందాస్తుతితో కొన్ని కీర్తనలు వ్రాశారు. అవి బాహ్యంగా రాముని నిందించినట్లు తోచును గాని, అంతరార్థంలో అతి తీవ్రమైన అనుపమానములైన అపూర్వ భక్తితో నిండి ఉన్నాయి. అవి.

1. ఆదరణ లేని నీ నామ మంత్ర పఠనము
2. బిడియమేలనిక మోక్షమిచ్చి నీవడుగు దాటి పోరా
3. రక్షించు దీనుని రామ రామ
4. అడుగు దాటి కదలనివ్వను
5. నిన్ను పోనిచ్చెదనా
6. ఇక్ష్వాకు కుల తిలక
7. రావయ్య భద్రాచల రామ . . . . . . మొదలైనవి.

"రామదాసు కీర్తనలు సామాన్య మానవుని సంతోషం, వేదన, వగైరాలను ప్రకటించేవిగా కానరాక తప్పదు. ఇది సంగీతం కోసం భావన చేసిన సాహిత్యం కాదు. సాహిత్య మర్యాదలకు ఉదాహరణ కావడానికి చేసిన రచనలుగా ఇవి కనబడవు. అతడు తన సంతోషం కొరకు రాముని భజించాడు. తన సంతోషాన్ని దుఃఖాన్ని ఇతరులకు పంచే ప్రయత్నమే అతడి కీర్తనలు. అతడి సుఖ దుఃఖాలు మనవి. అట్లా మనతో కలిసిపోయాడు. మనలోకి చేర్చుకున్నాడు. అతడి వ్యక్తిత్వం కాస్తో కూస్తో అర్థజ్ఞానం, సానుభూతి ధర్మం ఉన్న వారందరకూ, ఇతడు మనవాడే అనిస్తుంది."[3] అందుకే వారి కీర్తనలు మన హృదయాల్లో స్థిరంగా నిలిచిపోయాయి. తెలుగువారి రామభజన కూటాలలో ఈ కీర్తనలు ప్రముఖ స్థానం పొందాయి.

కుతుబ్షాహీ రాజులు ప్రత్యేకంగా ఆయనను ఒక కవిగా గుర్తింపకున్నా ఆయన కీర్తనలు, శతకం ఈనాటికీ మన ఆంధ్రుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయాయి. అందుకే కుతుబ్షాహీల సాహిత్యాన్ని ప్రస్తావించినప్పుడు రామదాసు అని ప్రఖ్యాతి వహించిన కంచెర్ల గోపన్నను గూర్చి చెప్పక తప్పదు. అందరు కవులూ రాజుల పోషణలో కావ్యాలు వ్రాస్తే, ఈ భక్తకవి ఆ భూపతులు వేసిన శిక్షను అనుభవిస్తూ, గళమెత్తి కీర్తనలు పాడాడు. అప్పటి నుండీ ఇప్పటి దాకా అవి తెలుగు వారిని తన్మయుల్ని చేస్తున్నాయి. సామాన్యులలో రామదాసు కీర్తనలు ఎంత ప్రచలితమైనాయో రవ్వంత పాండిత్యం కలిగిన వారిలో భద్రాద్రి రామదాసు శతకం కూడా అంతటి ప్రాచుర్యం పొందింది. ఒక విధంగా చెప్పాలంటే రామదాసు తానీషా ప్రభువును భద్రాద్రి క్షేత్రాన్ని అజరామరం చేసిపోయినాడు.

తెలుగులోనే కాక సంస్కృతంలో కూడా ఈ కవి అద్భుతమైన, రమణీయమైన రచనలు చేశాడు. సంస్కృత కీర్తనలు, సంస్కృత పండితులైన పదకవులైన జయదేవుడు, లీలాశుకుడు, తదితరుల రచనలకు ఏమాత్రం తీసిపోవు.

1. శ్రీ భద్రాచల రామదాసు సుప్రభాతమ్ (1992) - భూతపురి సుబ్రహ్మణ్య శర్మ, పుట 9.
2. సమగ్రాంధ్ర సాహిత్యము - ఆరుద్ర , పుట 384.
3. ప్రముఖ వాగ్గేయకారులు - జి. కృష్ణ , పుట 20-21.

"History of the Qutbshahi Dynasty" అనే ఆంగ్ల చారిత్రక గ్రంథంలో రామదాసు రచనల గూర్చి, సాహిత్యం గూర్చి ఈ విధంగా చెప్పబడి ఉంది. " Ramadas has composed a large number of Kirtanas or songs in praise of the divinity and these are woven into the anonymous Bhadrachala Ramadasa Charitra. These kirtanas are very popular all over the Andhra region and are sung even to this day. These Ramadasu kirtanalu were composed during his imprisonment in Golconda fort and continued even after his liberalisation. He says that he sometimes hears Sri Rama's voice, while at times he is not so rewarded and he has to turn to sitaja for intervention, with her husband. It is his sincerity and intense devotion which have made his kirtanas so popular wherever Telugu language is spoken or understood"[1].

"రామదాసు స్వరబద్ధం చేసిన కీర్తనలు రాముని స్తుతిస్తూ పాడినవి. ఇవి రామదాసు జీవిత చరిత్రను తెలియజేసేవిగా ఉన్నాయి. ఈ కీర్తనలు ఆంధ్ర దేశం అంతటా బాగా ప్రచారంలో ఉన్నాయి. రామదాసు ఖైదులో ఉండగా పాడిన పాటలే కాక, కారాగారం నుండి విడుదలైన తర్వాత కూడా రాముని స్తుతిస్తూ కీర్తనలు పాడాడు. ఇవి అన్నీ ప్రసిద్ధి గాంచాయి. రామదాసుకు కొన్ని సందర్భాల్లో రాముని స్వరం వినబడేదట. ఆ సందర్భంలో వారు రచించిన కీర్తనలకు రామ సహాయం లభించేదట. సీతాదేవి, రామునికి తన బిడ్డ రామదాసును గూర్చి చెప్పినట్లుగా అనిపించేది. ఇదంతా ఆయన అపారమైన రామభక్తికి నిదర్శనం. ఆయన అనితర సాధ్యమైన రామభక్తికి ఈ కీర్తనలే దీటుగా నిలిచాయి. తెలుగు భాషా సాహిత్యాల్లో రామదాసు కీర్తనలు ఒక ప్రముఖ స్థానం పొందాయి. దీనిలోని తెలుగు భాష సామాన్యులకు అర్థమయ్యే వ్యవహారిక భాష ఉంది. అందుకే అతి త్వరగా సామాన్య మానవుడిని ఏమాత్రం సంగీత పరిజ్ఞానం లేని నిరక్షరాస్యుడైన పామరుని కూడా ఈ కీర్తనలు ఆకట్టుకున్నాయి. ఆంధ్రదేశం అంతటా రామభక్తి ప్రచారం కావడానికి ఈ కీర్తనలు బాగా తోడ్పడ్డాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆంధ్ర రాష్ట్రమే కాదు ఈనాటికీ ప్రపంచమంతటా తెలుగువారి మనసును దోచుకున్నాయి ఈ కీర్తనలు. ఇంతటి మహిమాన్వితమైనవి ఈ కీర్తనలు. రామ మందిరం ఉన్నచోటల్లా రామదాసు కీర్తనలు మారుమ్రోగుతున్నాయంటే అతిశయోక్తి కాదేమో.

రామదాసు భక్తి సాహిత్యం గూర్చి, కీర్తన సాహిత్యం గూర్చి డా॥ వి. రాఘవన్ గారు ఈవిధంగా వివరణ ఇచ్చారు. సంస్కృత చూర్ణిక గూర్చి కీర్తనల గూర్చి ఇతర రచనల గూర్చి వివరించారు. "Ramadas gained a note worthy place in the tradition of the galaxy of Rama Bhaktas. His songs on Rama spread all over the country. His life, his sufferings and his obtaining in the end the blessings of Rama became a common story among the people. Rama Bhakta who was born in choladesa, Sri Tyagaraja, salutes Ramadas at the very outset in his Prahalada Bhakti Vijaya[2].

ఈ విధంగా రామదాసు రామభక్తుల్లో ఒక అగ్రగణ్యుడిగా కీర్తిని పొందాడు. అతని కీర్తనలు భారతదేశమంతటా ప్రచారం పొందాయి. రామదాసు అనుభవించిన జీవితం, అతని బాధలు, సుఖదుఃఖాలు, ఆయన రాముని వలన పొందిన ఆనందం, రాముడిచే ఆయన పొందిన సహాయం, ఆయన అపారమైన రామభక్తిని జనులు ఈనాటికీ కథలుగా చెప్పకుంటున్నారు. ఇవన్నీ ఆయన కీర్తనల్లో ప్రతిఫలిస్తున్నాయి.

ఈ విధంగా ఆంధ్రదేశంలో 16-17 శతాబ్దాల్లో ఆవిర్భవించిన రామదాసు రచించిన రామభక్తి ప్రపూరితాలైన కీర్తనలు యావద్భారత దేశంలోనూ ప్రచారం పొందాయి. సంగీత సామ్రాజ్యంలో రామదాసు కీర్తనలకు, వాగ్గేయకారులలో రామదాసుకు ఒక ఉన్నత పీఠం లభించింది. ఉత్తమ వాగ్గేయకారుడిగా పద సాహిత్యంలో పేరు పొందాడు కంచెర్ల గోపన్న. ఇంతటి ప్రాచుర్యం పొందాయి గనుకనే రామదాసు కీర్తనలు అజరామరంగా నేటికీ నిలిచి ఉన్నాయి. ఈ కీర్తనలు తరువాతి వాగ్గేయకారులకు మార్గదర్శకాలైనాయి.

1. H.K. Sherwani - History of the Qutbshahi Dynasty P.No.607.
2. "The Bhadrachala Ramadas " by - V.Raghavan,(Article) P.No. 18-19.
"Great Composers " - Edited by P. Sambamurthy.

# ముగింపు

ఈ సిద్ధాంత గ్రంథంలో, రామదాసు జీవితంలో జరిగిన వివిధ సంఘటనల ఆధారంగా రామదాసు రచించిన కీర్తనలను అందలి సాహిత్యాన్ని గూర్చి ప్రస్తావించడం జరిగింది. ఈ కీర్తనలపై రామదాసు జీవితం యొక్క ప్రభావం, ఆయన జీవించిన కుతుబ్షాహీ రాజుల కాలం నాటి అంటే 17వ శతాబ్దం నాటి సమకాలీన రాజకీయ, సాంఘిక, మత, చారిత్రక పరిస్థితుల ప్రభావం ఎలా ఉందో పరిశీలించడం జరిగింది.

రామదాసు కీర్తనలను, ఆయన కారాగార వాసానికి పూర్వ జీవితం, కారాగార జీవితం, కారాగార వాసానంతరం జీవితం ఆధారంగా ఈ మూడు విధాలుగా పరిశీలించడం ఈ సిద్ధాంత వ్యాసంలోని ప్రధానాంశం. ఇంకా రామదాసు కీర్తనల్లోని భాషా, సంగీతాంశాలు, ఆ కీర్తనలకు ఉన్న ప్రాచుర్యం, విశిష్టత, ప్రశస్తి గూర్చి ప్రస్తావించడం జరిగింది.

ఈ సిద్ధాంత గ్రంథంలో రామదాసు కీర్తనలను నేను కుతుబ్షాహీ రాజుల కాలం నాటి చారిత్రక, రాజకీయ, ఆర్థిక, మత, సాంఘిక పరిస్థితులకనుగుణంగాను, ఆయా పరిస్థితుల ప్రభావం రామదాసు కీర్తనల్లో ఏవిధంగా ఉందో, ఈ దృక్కోణంతో పరిశీలించడం జరిగింది. రామదాసు కీర్తనల సాహిత్యంపై నా యీ పరిశోధన ఇంతవరకే పరిమితమైంది. ఇంతేకాక ఈ రామదాసు కీర్తనలను, ఇతర వాగ్గేయకారుల రచనలతో పరిశీలించి తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి, ఇందలి భాషా విశేషాలను గూర్చి భాషాశాస్త్ర అధ్యయనం రీత్యా క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఆస్కారం ఉంది. ఈ కోణంలో కూడా ఈ రామదాసు కీర్తనలను పరిశీలించి, పరిశోధన చేయవచ్చును. ఇంకా ఈ కీర్తనలలోని సాహిత్యాంశాలు, భక్తి, వేదాంత ప్రధానమైన అంశాల గూర్చి విస్తరించి పరిశోధన చేయవలసిన ఆవశ్యకత ఉంది. ముందు ముందు ఈ రామదాసు కీర్తనల సాహిత్యం గూర్చి పరిశోధన చేయాలన్న ఆసక్తి ఉన్న పరిశోధకులకు నా యీ సిద్ధాంత గ్రంథం మార్గదర్శకమవుతుందని భావిస్తున్నాను.

నేను ఈ పరిశోధన ద్వారా రామదాసు కాలంనాటి సమకాలీన రాజకీయ, చారిత్రక, సామాజిక, మత పరిస్థితుల ప్రభావం ఏవిధంగా ఉందో, ఆ పరిస్థితులు రామదాసు కీర్తనలు ఆవిర్భవించడానికి ఎలా దోహదపడినాయో, రామదాసు కీర్తనల ఆధారంగా 16,17 శతాబ్దుల నాటి(కుతుబ్షాహీల కాలం నాటి) రాజకీయ, సాంఘిక, చారిత్రక, మత పరిస్థితులు గూర్చి, ఆ పరిస్థితులు రామదాసు జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయో మొదలైన విషయాలను గూర్చి క్షుణ్ణంగా పరిశోధించి, వెలుగులోకి తీసుకుని వచ్చే ప్రయత్నం చేశాను. ఈ పరిశోధన గ్రంథం తర్వాత "రామదాసు కీర్తనా సాహిత్యం" పై చేయాలనే ఆసక్తి గల పరిశోధకులకు మార్గదర్శకంగా ఉంటుందని భావిస్తున్నాను.

# ఉపయుక్త గ్రంథములు

## తెలుగు గ్రంథములు


1. అచ్యుతరామం - ఆకెళ్ళ : త్యాగరాజ స్వామి భక్తి కవితా వైభవము యువభారతి ప్రచురణ, సికింద్రాబాదు, 1952.
2. అనంతకృష్ణశర్మ - రాళ్ళపల్లి : రాళ్ళపల్లి పీఠికలు రాళ్ళపల్లి అభినందన సమితి, మైసూరు, 1978.
3. అనంతకృష్ణశర్మ - రాళ్ళపల్లి : సాహిత్యోపన్యాసములు - మూడవ సంపుటము.
4. అనంతకృష్ణశర్మ - రాళ్ళపల్లి : క్షేత్రయ్య పద కవిత్వము
5. అప్పలస్వామి - పురిపండ (సం) : సారంగపాణి పదములు
6. అప్పారావు - పి.ఎస్.ఆర్ : నాట్య శాస్త్రము, ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘ ప్రచురణలు, సికింద్రాబాద్ 1959.
7. అప్పారావు - విస్సా (సం) : క్షేత్రయ్య పదములు , 1963.
8. ఆనందమూర్తి - వేటూరి : తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు.
9. ఆంజనేయులు - తాళ్ళూరి : రామదాసు, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలు, 1990.
10. ఆదినారాయణ శాస్త్రి : రామదాసు చరిత్రము
11. ఆరుద్ర : సమగ్రాంధ్ర సాహిత్యము ( ఏడవ సంపుటము)
12. ఉమ.సి. : ప్రాచీన మధ్య యుగపు వాగ్గేయకారుల సారస్వత పరిచయము (సిద్ధాంత వ్యాసం, తెలుగు విశ్వవిద్యాలయం, 1991)
13. ఉషాలక్ష్మి : త్యాగరాజ కీర్తనలు - రసభావ పోషణం (1982).
14. కళాపతి - వి : వైష్ణవ క్షేత్ర మాహాత్మ్య కావ్యములు - అనుశీలన
15. కిరణ్‌చంద్ర ముఖర్జి : రామదాసు స్వామి
16. కృష్ణ . జి : ప్రముఖ వాగ్గేయకారులు , పబ్లికేషన్స్ డివిజన్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ ప్రచురణలు, 1990.
17. కృష్ణదాసు , తిరుక్కడయూరి : భద్రాచల రామదాసు చరిత్రము(యక్షగానము), వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్, మద్రాసు, ప్రచురణలు, 1911.
18. కృష్ణమూర్తి - పాడుగుపాటి : మన పవిత్ర వారసత్వము ( మన సంస్కృతి - దేవాలయ సంపద), పబ్లిషర్స్ - శ్రీ సూర్యమిత్ర ధార్మిక వీధి, వాసవీ నగర్, సికింద్రాబాద్, 1993.
19. కృష్ణమూర్తి శాస్త్రి - శ్రీపాద : భద్రాచల రామదాసు చరిత్ర
20 కృష్ణమూర్తి శాస్త్రి - శ్రీపాద : భద్రాచల రామచరిత్రము
21. గంగప్ప - ఎస్ : సారంగపాణి పద సాహిత్యం
22. గంగప్ప - ఎస్ : అన్నమాచార్య - ప్రముఖ వాగ్గేయకారులు- తులనాత్మక అధ్యయనం, శశి ప్రచురణలు, 15ఎ-సి/ 73, శ్రీనివాస నగర్ కాలనీ, గుంటూరు.
23. గంగప్ప - ఎస్ : తెలుగులో పద కవిత, శశి ప్రచురణలు,15ఎ-సి, శ్రీనివాస నగర్ కాలనీ, గుంటూరు, ఆగస్టు 1983.
24. గంగప్ప - ఎస్ : తెలుగు వాగ్గేయకారులు (యువ భారతి ప్రచురణలు, 1983)
25. గంగప్ప - ఎస్ : క్షేత్రయ్య పద సాహిత్యం
26. గురునాథ శర్మ - మిన్నికంటి : కంచెర్ల గోపన్న అను రామదాసు, వెంకటేశ్వర అండ్ కో, పబ్లిషర్స్, గుంటూరు, 1935.
27. గోపన్న - కంచెర్ల : దాశరథీ శతకం (వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్‌సన్స్ ప్రచురణలు, మద్రాసు, 1962.)

28. గోపాల కృష్ణయ్య - వడ్లమూడి : వాఙ్మయ మహోద్యమకుని పరిశోధనా వాఙ్మయం - మార్గ, దేశి కళాకృష్ణలు అండ్ ప్రోజెని ప్రచురణలు, హైదరాబాదు.

29. గోపాలాచార్యులు - ధర్మవరం : రామదాసునాటకం - బళ్లారి శ్రీ రామకృష్ణ ప్రెస్ ప్రచురణలు.

30. గోపాలకృష్ణారావు - కె. : ఆంధ్ర శతక సాహిత్య వికాసము, ఆంధ్రసారస్వత ప్రచురణలు,1976.

31. గోపాలరెడ్డి - కె.వి : శతక సాహిత్య చరిత్రము

32. గోవింద దీక్షితులు : సంగీత సుధ

33. గౌరీ మనోహర రావు - దుర్గిరాల : భక్త రామదాసు (బుర్రకథ)

34. చిన తిరుమలాచార్యులు - తాళ్ళపాక : సంకీర్తనా లక్షణము

35. జగన్నాథ రావు - మంచాళ : రామదాసు కీర్తనలు (సంకలనం, తెలుగు సంగీత నాటక అకాడమీ ప్రచురణలు, హైదరాబాదు.

36. జానకి రామన్ - ఎస్.ఆర్ : సంగీత శాస్త్రసారము (మొదటి భాగము, 1986)

37. దొణప్ప - తూమాటి (సం) : విజ్ఞాన సర్వస్వము

38. నరసింహ భాగవతార్ -ఋుంప్యావరపు : శ్రీభద్రాచల సీతారామచంద్ర ప్రభువు వారి ఉత్సవ సేవా కార్యక్రమము (భద్రాచల దేవస్థాన ప్రచురణలు)

39. నరసింహాచార్యులు - వేముగంటి : భక్త రామదాసు (కావ్యం)

40. నరసింహదాసు - తూము : రామదాసు చరిత్రము (గోపాల్ అండ్ కో ప్రచురణలు, మద్రాసు, 1970)

41. నరసింహారెడ్డి - పాపిరెడ్డి : ప్రాచీన తెలుగు కావ్యాల్లో తెలుగునాడు (శ్రీనివాస మురళి పబ్లికేషన్స్, తిరుపతి, 1984.

42. నాగయ్య - జి : తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటము) 1985.

43. నాగరంజని - టి.వి. : రామదాసు కీర్తనలు - స్వరలయ విన్యాసం సాహిత్య రసపోషణం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, ఏప్రిల్ 1990.

44. నారాయణాచార్యులు - పుట్టపర్తి : వాగ్గేయకారులు - పదకృతి సాహిత్యం (ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక, ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణ, ఏప్రిల్, 1975

45. నారాయణాచార్యులు - పుట్టపర్తి : తెలుగులో పదకవిత

46. నారాయణరావు - డి.వి. : తెలంగాణా దేవాలయాలు - శిల్ప సంపద, స్రవంతి పబ్లికేషన్స్ ప్రచురణలు, హైదరాబాదు, 1984.

47. పిచ్చయ్య శాస్త్రి - చల్లా : రామదాసు చరిత్రము (కావ్యము), భువనగిరి కోదండపాణి (ప్రచురణకర్త), రైతు ముద్రాక్షర శాల, 13-4- 1926.

48. పార్థసారథి - యస్.పి. : గాన కళాబోధిని, బాలసరస్వతి బుక్ డిపో, కర్నూలు - 1965.

49. పురుషోత్తమ కవి - నాదెండ్ల : శ్రీరామదాసు చరిత్రము (హిందుస్థాని నాటకము), ఆర్యానంద ముద్రాక్షర శాల ప్రచురణలు, మచిలీ పట్టణం, 1916.

50. బలరామమూర్తి - ఏటుకూరి : ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర

51. బాలకృష్ణా రెడ్డి - ఎర్ల : జానపద పారమార్థిక గేయ సాహిత్యము, చైతన్య ప్రచురణలు, శ్రీశైలం ప్రాజెక్టు - 1986.

52. బాలయ్య - దాశరథుల : భక్త రామదాసు కీర్తనలు (సంకలనం) మెదక్ జిల్లా రచయితల సంఘము ప్రచురణలు, జనవరి, 1993.

53. బాలయ్య - దాశరథుల : భక్త రామదాసు జీవితము - రచనలు, 1982.

54. భూపాలరావు - కె.వి. : మాదన్న మహామంత్రి, మాదన్న ట్రస్టు, సావిత్రి సదనం, బర్కత్‌పుర, హైదరాబాదు, ఆగస్టు 4, 1982.

55. భూపాలరావు - కె.వి. : మహామంత్రి మాదన్న కథ. మాదన్న ట్రస్టు ప్రచురణలు, సావిత్రి సదనం, బర్కత్‌పుర, హైదరాబాదు.

56. మలయవాసిని - కోలవెన్ను : ఆంధ్ర వాఙ్మయము - రామాయణము.
57. మహతీ శంకర్ : తెలుగు కవులు - భక్తి తత్వం, 1984.
58. యాదవదాసు : రామదాసు చరిత్రము (యక్షగానము), సిద్ధేశ్వర పబ్లికేషన్స్ ప్రచురణలు, ఫీల్‌ఖానా, హైదరాబాదు.
59. రాధాకృష్ణ శర్మ - చల్లా : తమిళ సాహిత్యము - దక్షిణ భారత సాహిత్యములు.
60. రఘుపాత్రో పట్నాయక్, నర్సింగరావు : భద్రాచల మాహాత్మ్యము
61. రజనీకాంత రావు - బాలాంత్రపు : ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ - 1975.
62. రామకృష్ణయ్య - కోరాడ : దక్షిణ దేశ భాషా సారస్వతములు - దేశి.
63. రామచంద్ర రావు - కొండపల్లి : భద్రాచల క్షేత్ర చరిత్రము, మే - 1961.
64. రామరాజు - బిరుదురాజు : తెలుగు జానపద గేయ సాహిత్యం, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు - 1978.
65. రామలింగ శాస్త్రి - మంగిపూడి : భారత సంగీత ఇతిహాసం, ప్రథమ భాగం.
66. రామనారాయణ కవులు : రామదాసు (నాటకము).
67. రామానుజరావు, సోమరాజు : రామదాసు
68. రాంబాబు - వేదగిరి : నాలుగు శతాబ్దాల నగరం - హైదరాబాదు, నాగరాజు పబ్లికేషన్స్, ప్రచురణలు, వనస్థలి పురం, హైదరాబాదు, నవంబర్,1991.
69. రాంబాబు- రామడుగు : మన్నెంకొండ హనుమద్దాసు కీర్తనలు - ఒక పరిశీలన.
70. రాములు - పిల్లలమర్రి : తెలుగులో భక్తి కవిత్వం - సమకాలీన విశ్లేషణ, పిహెచ్.డి.పరిశోధన గ్రంథం,కేంద్రవిశ్వవిద్యాలయంహైదరాబాదు.
71. లక్ష్మీ అన్నపూర్ణ - సి.హెచ్. : గీత, వాద్య, నృత్య సమ్మేళనము సంగీతము, పరిశోధన గ్రంథం, తెలుగు విశ్వవిద్యాలయం - 1993.
72. లక్ష్మీనరసమ్మ- చక్రవర్తుల : రామదాసు.
73. లక్ష్మీనరసమ్మ - ఊటుకూరి : ఆంధ్రుల కీర్తనా వాఙ్మయ కళా సేవ, మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్ ప్రచురణలు, గాంధీనగర్, హైదరాబాదు, 1982, సెప్టెంబరు.
74. లక్ష్మీనరసింహారావు -వెన్నెలకంటి : శ్రీరామక్షేత్రము, శ్రీ శిశు గ్రంథమాల, అశోకునగర్, హైదరాబాదు.
75. లక్ష్మీనారాయణ - కొడాలి : భద్రాచల రామదాసు చరిత్ర
76. లక్ష్మీరంజనం - ఖండవల్లి : ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి.
77. లక్ష్మీరంజనం - ఖండవల్లి : ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము.
78. లీలావతమ్మ - పొన్నా : పదకవితా వైజయంతి - పొన్నా పబ్లికేషన్స్, పానకం, రాజమండ్రి.
79. వరదాచార్యులు - ధనకుధరం : ఆళ్వారులు - దివ్య ప్రబంధములు.
80. వరద రామదాసు - కంచి : రామదాసు చరిత్రము.
81. విజయలక్ష్మి- సి. : 15-16 శతాబ్దాల తెలుగు సాహిత్యంలో సంగీత గద్య ప్రబంధాలు, పరిశోధనా గ్రంథం, తెలుగు విశ్వవిద్యాలయం - 1990.
82. విజయపల్లీ దేవి - వేములకొండ : అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల్లో ఆత్మనివేదనము, పరిశోధనా గ్రంథం, తెలుగు విశ్వవిద్యాలయం, రాజమండ్రి 1988.
83. విద్యావతి - ఎ. : తాళ్ళపాక కవుల సాహిత్య సేవ.
84. వీరభద్రరావు - అయ్యగారి : రామదాసు చరిత్రము.
85. వీరాచార్యులు - పి.బి. : శ్రీ భద్రాచల క్షేత్ర మాహాత్మ్యము, గొల్లపూడి వీరాస్వామి సన్స్ ప్రచురణలు, రాజమండ్రి, 24-3-1991.
86. వేంకటనారాయణ రావు - కె. : ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము.

87. వేంకట రమణయ్య - డి. (రావూ సాహెబు) : రామదాసు నాటకము, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ ప్రచురణలు, చెన్నపురి, 1927.

88. వేంకట రమణయ్య - బులుసు : ఆంధ్ర కవి సప్తశతి, 1956.

89. వేంకట రాధాకృష్ణయ్య - జె. : దేవాలయ చరిత్రము.

90. వేంకట రామశాస్త్రి-కేతవరపు : ఆంధ్ర గేయ వాఙ్మయము.

91. వేంకటరాయ శాస్త్రి - వేదం : అక్కన్న - మాదన్నల చరిత్రము - 1951.

92. వేంకటరామయ్య - నిడుదవోలు : శతక సంపుటం - ప్రథమభాగం (సంకలన గ్రంథం), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణలు, హైదరాబాదు, డిసెంబర్, 1966.

93. వేంకట శేషయ్య - నీలంరాజు : శ్రీరామదాసు కీర్తనలు.

94. వేంకట సుబ్బరాయకవి-కేశిరాజు : శ్రీరామదాసు నాటకము, ప్రకాశకులు- కేశిరాజు గౌరీ శంకర్, 1985.

95. వేంకట సుబ్రహ్మణ్యదీక్షితులు-కల్లూరి : భద్రాద్రి రామప్రభు చరిత్ర - స్తుతిమాల.

96. వేంకటేశ్వర్లు - పుల్లాభొట్ల : భక్త కవిపుంగవులు.

97. వేంకటేశ్వర శర్మ - గుడిపాటి : కృష్ణామండల చరిత్ర.

98. వేంకటావధాని - దివాకర్ల : ఆంధ్ర వాఙ్మయ చరిత్రము.

99. శమంతకమణి - పండా : తెలుగు సాహిత్యములో రామకథ, ఆంసాపరిషత్ ప్రచురణలు, 1972.

100. శమంతకమణి - యస్. : త్యాగరాజు కవిత్వము - విమర్శనాత్మక పరిశీలనము.

101. శార్ఙదేవుడు : సంగీత రత్నాకరము, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణలు.

102. శాస్త్రి - బి.ఎన్. : గోలకొండచరిత్ర-సంస్కృతి-శాసనములుమూసీపబ్లికేషన్స్హైదరాబాదు.

103. శాస్త్రి - బి.ఎన్. : ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి (మూడవ భాగం) మూసీ పబ్లికేషన్స్.

104. శివరామశాస్త్రి - కేతవరపు : భక్తరామదాసు అను రామదాసు విజయము. (నాటకము)

105. శేషగిరిరావు - చీమకుర్తి : లలిత కళలు - సమీక్ష - వికసన చరిత్ర , విజ్ఞానసర్వస్వకేంద్ర ప్రచురణలు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

106. శేషగిరి రావు - కొండిపర్తి : సమన్వయ స్వరాలు.

107. శేషగిరి రావు - కొండిపర్తి : కాంతి - శాంతి.

108. శేషాచార్యులు - వి.టి. : దేవాలయములు - తత్త్వవేత్తలు.

109. శ్రీదేవి - సి. : లలిత కళలు - సంగీత ప్రాముఖ్యత.

110. శ్రీనివాస్ - వి.ఆర్. : సంగీత శిల్పం - రస సిద్ధాంతం.

111. శ్రీనివాసరావు పంతులు -చిల్లరిగి : ఆంధ్రదేశ చరిత్రము (మొదటి భాగము), ఆంధ్ర సరస్వతీ గ్రంథమాల, 1993.

112. శ్రీరామ అప్పారావు - పోణంగి : నాట్యశాస్త్రము .

113. శ్రీరామమూర్తి - ధూళిపాళ : మహాభక్త విజయము.

114. శ్రీహరి : తులసీదాసు వినయపత్రిక - రామదాసు కీర్తనలు - తులనాత్మక పరిశీలన, దామరాజు ప్రచురణలు, నవోదయ బుక్ డిపో, హైదరాబాదు, జూన్, 1994.

115. శ్రుతి : సాహిత్యంలో సంగీత ప్రపత్తి, పరిశోధనా గ్రంథం, తెలుగువిశ్వవిద్యాలయం.

116. సత్యగోదావరీ శర్మ - గరిమెళ్ల : గోపన్న, ఆర్. వేంకటేశ్వర అండ్ కో ప్రచురణలు, మద్రాసు, 1973.

117. సత్యనారాయణ - కేశాప్రగడ : రామాయణం - శరణాగతి, పరిశోధనా గ్రంథం, తె.వి.

118. సత్యనారాయణ మూర్తి - అంపిరాల : సంగీత కళాప్రదర్శిని, సంపుటం 1,2. విజయవాడ, 1979.

119. సర్వోత్తమన్ - కె. : రామదాసు - త్యాగయ్య

120. సింగరదాసు : రామదాసు చరిత్రము(యక్షగానము, బులుసు వేంకట రమణయ్య గారిచే పరిష్కృతము), బాలసరస్వతీ బుక్ డిపో, ఎడ్యుకేషన్ పబ్లిషర్స్, కర్నూలు, టాగూర్ పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1990.

121. సీతాపతి-పి., వేంకటేశ్వర రావు(సంపా): శృంగార పదములు (అజ్ఞాత కవి కృతము).

122. సుదర్శన్ - డి. (సంపా) : శ్రీ భద్రాచల క్షేత్ర మాహాత్మ్యము, కాంగ్రెస్ జాతీయ వార పత్రిక పబ్లిషర్స్, వరంగల్.

123. సుబ్బరామ దీక్షితులు : సంగీత సంప్రదాయ ప్రదర్శిని - మొదటిభాగం.(అనువాదకులు - నోరి నాగభూషణ శర్మ), ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణలు.

124. సుబ్బారావు - ఏకా : కొత్త సంగీత విద్యా దర్పణం.

125. సుబ్బారావు - నారుమంచి : శ్రీ భద్రాచల రామదాసు జీవిత సంగ్రహము.

126. సుబ్బారావు - వంగూరి (సం) : శతక కవుల చరిత్రము, కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్ ప్రచురణలు, నరసాపురం, 1957.

127. సుబ్రహ్మణ్యం - జి.వి. : సాహిత్యంలో చర్చనీయాంశాలు, తెలుగుఅకాడమీ ప్రచురణలు.

128. సుబ్రహ్మణ్య శర్మ - భూతపురి : శ్రీ భద్రాచల రామ సుప్రభాతం, 1992.

130. సూర్యనారాయణ రావు - గాడేపల్లి : రామదాసు.

131. సోమయాజులు - గంటిజోగి : రామాయణ ప్రశస్తి - మొదటి భాగం, కర్నూలు- 1987.

132. సోమశేఖర శర్మ - మల్లంపల్లి : గోల్కొండ సుల్తానులు - ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము.

133. హనుమంతరావు - బి.ఎస్.ఎల్. : ఆంధ్రుల చరిత్ర (ప్రాచీన మధ్య యుగాలు).

134. హనుమంతరావు - భట్టిప్రోలు : ఆంధ్రుల చరిత్ర.

135. హరి ఆదిశేషువు : జానపద గేయ వాఙ్మయ పరిచయము, నవ్య విజ్ఞాన ప్రచురణలు, 1967.

136. హిమబిందు - సి.హెచ్. : కర్ణాటక సంగీతంలో పదం - ఒక పరిశీలన, పరిశోధనా గ్రంథం, తెలుగు విశ్వవిద్యాలయం.

## పత్రికలు - వ్యాసాలు - ప్రత్యేక సంచికలు


1. అనంత కృష్ణ శర్మ - రాళ్లపల్లి : సంగీత సాహిత్యాలు - అక్షర రమ్యత, భారతి, అక్టోబర్, 1945.
2. అనంత కృష్ణ శర్మ - రాళ్లపల్లి : తాళ్లపాక వారి సారస్వత సేవ, శ్రీవాణి - 22 సెప్టెంబర్, 1956.
3. అనంత కృష్ణ శర్మ - రాళ్లపల్లి : పదములు - క్షేత్రయ్య, ఆంధ్ర పత్రిక - 1942-43.
4. అప్పలాచార్యులు - శ్రీభాష్యం : శ్రీరామాయణ పరమార్థము - సత్ప్రవర్తనము, సాహితీ నీరాజనం
5. ఆనంద మూర్తి - వేటూరి : పదకవితలు, తెలుగు వాణి (ప్రపంచ తెలుగు మహా సభల ప్రత్యేక సంచిక - 1975).
6. ఆనందమూర్తి - వేటూరి : తెలుగు సంకీర్తన లక్షణము - లక్ష్య లక్షణ సమన్వయము, భారతి- ఆగష్టు, 1971.
7. ఆంజనేయ శాస్త్రి - తంగిరాల : అక్కన్న - మాదన్న, ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, సంపా॥ ఖండవల్లి లక్ష్మీరంజనం. 1971.
8. కామాక్షి రావు : హిందీ వాఙ్మయము, కిన్నెర - జనవరి, 1955.
9. కోదండరామయ్య - తిమ్మావఝల : పదములు - శృంగారము, భారతి - సెప్టెంబరు, 1952.
10. కృష్ణమాచార్యులు - నల్లాన్‌చక్రవర్తుల : త్యాగరాజు పదములు, తెలుగులో పదకవిత, ఆంధ్ర సారస్వత పరిషత్ రజతోత్సవ సంచిక, హైదరాబాదు- 1973.
11. కృష్ణమూర్తి : గోల్కొండ, విజ్ఞాన దీపిక - ఒకటవ సంపుటము.
12. గంగప్ప - ఎస్. : పద కవిత్వం, శ్రీ కోరాడ రామకృష్ణయ్య జయంత్యుత్సవ సంచిక, సాహితీ నీరాజనం.
13. గంగప్ప - ఎస్. : తెలుగు, తమిళ, కన్నడ పదకవిత్వములు. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి షష్టిపూర్తి సంచిక.
14. గంగిరెడ్డి - ఎమ్. : శ్రీ విష్ణుతత్త్వము, సప్తగిరి, జనవరి - 1984. తి.తి.దే. ప్రచురణలు
15. గురునాథ శర్మ - మిన్నికంటి : రామదాసు చరిత్ర విమర్శనము, భారతి - అక్టోబర్, 1931.
16. గోపాల కృష్ణా రావు - కోపూరు : గోల్కొండ సుల్తానులు - సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం, మూడవ సంపుటం సంపా॥ మామిడిపూడి వెంకట రంగయ్య హైదరాబాదు - 1962
17. గోపాల కృష్ణా రావు - కోపూరు : గోల్కొండ నవాబులు, శ్రీవాణి - 1975.
18. చాయప్ప - ఎమ్. : విజయనగర సామ్రాజ్య ఉత్సవములు - హంపి, విజయనగర ఉత్సవ సంచిక, సంపా॥ రాళ్లబండి సుబ్బారావు. ఆంధ్ర హిస్టారికల్ రీసెర్చి సొసైటి, రాజమండ్రి, 26 జులై, 1974.
19. చిన సత్యనారాయణ - నూతల : కంచెర్ల గోపన్న, తెలుగులో పదకవిత, ఆంధ్ర సారస్వత పరిషత్ రజతోత్సవ సంచిక - 1973.
20. చెంచయ్య - ఆలూరి, లక్ష్మీరంజనం -ఖండవల్లి : అబుల్‌హసన్ తానీషా, అబ్దుల్లా కుతుబ్షా, ఆంధ్ర దేశ చరిత్ర - భూగోళ సర్వస్వము, మొదటి సంపుటం, ఆంధ్ర రచయితల సంఘం, హైదరాబాదు - 1971.
21. జోగినాయుడు - పి. : గోల్కొండ కోట - ఆంధ్రప్రదేశ్, ఉగాది ప్రత్యేక సంచిక,1995.
22. నాగ పద్మినీ దేవి - పుట్టపర్తి : వైష్ణవ తత్త్వము - సప్తగిరి, మార్చి, 1993.
23. ప్రతాపరెడ్డి - సురవరం : కుతుబ్షాహీల ఆంధ్ర భాషాపోషణము - సరస్వతీ సామ్రాజ్యం, అయ్యంకి వెంకట రమణయ్యగారి సన్మాన సంచిక.
24. ప్రమీలాదేవి - మంగళగిరి : సంస్కృత భాషలో రచన చేసిన ఆంధ్రవాగ్గేయకారులు, భారతీ కళా తరంగిణి, 1982
25. భద్రాచల దేవస్థానం ప్రచురణలు : భద్రాద్రి సీతారామచంద్ర ప్రభుపు ఉత్సవ సంచిక.

26. బాలకృష్ణ శాస్త్రి - వి.(సమీక్షకులు) : భక్తరామదాసు గ్రంథ సమీక్ష సప్తగిరి, మే 1989.

27. భూపాలరావు కె.వి. (సం) : మహామంత్రి మాదన్న త్రిశత వర్ధంతి ప్రత్యేక సంచిక, 23,24, మార్చి, 1987.

28. భూపాలరావు కె.వి. (సం) : మహామంత్రి మాదన్న, 306వ వర్ధంతి, హైదరాబాదు నిర్మాణ చతుశ్శతాబ్ది సమాప్తి ప్రత్యేక సంచిక.

29. మాధవ రావు - రామగిరి : గోల్కొండ రాజ్యము - మన సంస్కృతి చరిత్ర, నవోదయ సమితి, హైదరాబాదు, 1960.

30. మునిరత్నం - కె. : విష్ణునామ మహిమ - సప్తగిరి, ఫిబ్రవరి 1989.

31. యూహూటీ మోనూహిన్ : భారతీయ సంగీత ప్రాశస్త్యము, కిన్నెర, మే, 1963.

32. రమణయ్య - సి : తెలుగులో పదకవులు - సప్తగిరి, ఏప్రిల్ 1989.

33. రవి శంకర్ : గాన రసము , భారతి, ఫిబ్రవరి, 1966.

34. రామయ్య పంతులు - జయంతి : అక్కన్న మాదన్నలు - ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక శుక్ల నామ సంవత్సరం, ఆశ్వీజ కార్తీక మాసములు.

35. రామరాజు - బిరుదురాజు : అనుభవ కవి కంచెర్ల గోపన్న, తెలుగులో తొలి సమాజ కవులు (సం. కె.కె. రంగనాథాచార్యులు), ఆంధ్రసారస్వత పరిషత్ ప్రచురణలు.

36. రామారావు - ఎస్.వి (సం) : హైదరాబాదు నాలుగు శతాబ్దాల సాహిత్య వికాసం, జాతీయసదస్సు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, మార్చి - 1991, తెలుగు అకాడమీ ప్రచురణలు.

37. లక్ష్మీనారాయణాచార్యులు : సంగీత సాహిత్యాల సంబంధము, భారతి, జనవరి - 1977

38. లక్ష్మీనారాయణ శాస్త్రి : సంగీత సాహిత్య సమ్మేళనము, ఆంధ్ర సారస్వత పరిషత్ పత్రిక, శ్రావణ భాద్రపదాలు - ఈశ్వర, 1937 -38.

39. వరాహ నరసింహాచార్యులు - వింజమూరి : ఆంధ్రుల సంగీతము, ఆంధ్ర పత్రిక, 1945.

40. విజయలక్ష్మి - కె. : గోల్కొండ కుతుబ్షాహీల సాంఘిక చరిత్ర, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల వ్యాస సంపుటం. 1960.

41. విద్యాధరి - జి. : రామదాసు పదములు - చారిత్రక సామాజిక నేపథ్యం, జాగృతి, అక్టోబరు 28 - నవంబరు 3, 1991.

42. వేంకట కృష్ణారావు - భావరాజు : భద్రాచలము, భారతి -జులై, 1951.

43. వేంకట నారాయణ - ఎల్లా ప్రగడ : సామవేదాదిదం గీతం, భారతి - డిశంబరు, 1968.

44. వేంకట నారాయణ - ఎల్లా ప్రగడ : నారదుని సంగీత మకరందం, భారతి - ఆగస్టు, 1965.

45. వేంకట హనుమంతరావు - పిల్లల మర్రి : శ్రీరామ సాహితి, శాంతి- జనవరి, 1961.

46. శేషగిరి రావు - కొండిపర్తి : సంగీత సాహిత్యములు, సప్తగిరి - మే, 1994.

47. శేషగిరి రావు - కొండిపర్తి : సంగీత కళలో సాహిత్యం, సప్తగిరి - జూన్, 1994.

48. శ్రీనివాసుల సెట్టి - కె. : పద కవిత, భారతి - మార్చి, 1975.

49. శ్రీనివాస్ సింగ్ - ఎమ్. : పద సాహిత్యంలో రారాజులు, సప్తగిరి - మే, 1994.

50. సత్యనారాయణ - యండమూరి : పద వాఙ్మయము - సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం, 5వ సంపుటం, 1966.

51. సుబ్బరాయన్ - బుడ్డిగ : రామదాసు, బాలల విజ్ఞాన సర్వస్వం, సంస్కృతి విభాగం.

52. సుబ్బారావు - ఆర్.వి.ఎన్. : సంగీత కళానిధులు - త్యాగయ్య , రామదాసు (సమీక్ష), స్రవంతి, ఏప్రిల్ - మే 1995.

# Reference Books (English)



| | | |
|---|---|---|
| 1. Bilgram - S.A.A. | : | Landmarks of the Deccan. |
| 2. Chopra - P.N.(Editor) | : | The Gazetteer of India,(Indian Union ) Vol.II , History and Culture Gazetteers Unit, Dept. of Culture Minister Education and Social Welfare, October, 1973. |
| 3. Danteswari Bhaskar | : | The Bhakti movement in North India during the Fifteenth Century with special reference to Kabir in his Socio - Economic content. Dept. of History, H.C.U, 1991. |
| 4. Krishna Sastry - V.V. | : | Select Monuments of Hyderebad. Director of Archaeology & Museum,A.P., |
| 5. KrishnaSwamyAiyangar-S | .: | Abul Hasan Qutbshah and his Ministers, Madanna & Akkanna, Journal of Indian History, August,1931. |
| 6. Krishna Swamy Aiyangar-S. | : | The Brahmin Ministersof the last Qutbshahi King, J.I.H., August.1931. |
| 7. Kulasekhara Rao -M. | : | Telugu Language and Literature, Editor - Helen. B. Butt. The Composite nature of Hyderabad culture (An Extension Seminor). |
| 8. Parthasarathy I.A.S.,(Editor) | : | Places of Interest in Andhra Pradesh, A monograph, Vol I. Published by District Gazetteers Department, A.P., 1984. |
| 9. Raghavan - V. | : | Bhadrachala Ramadas, Great composers, Edited by Gowrie Kuppuswamy, Hariharan. M. - C.B.H. Publications. |
| 10. Rajagopal - M.V.(Edi) | : | Places of Interest - Bhadrachalam, Khammam Dist. Gazetteer, Published by Gazetteers of India, The Government of A.P. - 1977. |
| 11. Raza Alikhan | : | Hyderabad A city In History. |
| 12. Salma Ahmed | : | Qutbshahi State in Deccan, M.Phil., Dissertation, Dept. of H.C.U. 1992. |
| 13. Samba Murthy - P. | : | The Great Composers. |
| 14. Samba Murthy -P. | : | South Indian Music, Book-V, Published by The Indian Music Publishing House, 14, Siripuram, Raya pettah, Madras. 1990. |
| 15. Sasi Mitra Lakshmi - C. | : | The Carnatic Music in the 18th Century - A Case study of Tanjavur(with reference to Thyagaraja Swamy), M.Phil., Dissertation, Dept. of History, H.C.U., |
| 16. Sastry - M.V. | : | Seat of Lord Rama , Telugu Vani, 1977. |
| 17. Satyanarayana - K. | : | Religion And Society - The Qutbshahis of Golkonda(summary), AP History Congress - 1978. |
| 18. Sherwani - H.K., | : | History of Medieval Deccan , Vol - I, (1295 - 1724 ). |
| 19. Sherwani - P.B., | : | The Qutbshahis of Golkonda, Hyderabad. |
| 20. Sherwani - H.K., | : | History of the Qutbshahi Dynasty, Publishers : Munshiram Manoharlal Pvt., Ltd., New Delhi - 1974. |
| 21. Vasumathi - E. | : | Telugu literature in Qutbshahi period. |
| 22. Venkata Ramanayya -V. | : | The Qutbshahis, Qutbshahis History and Andhra Samskriti,Editor-Qadri zore.S.M. |

23. Temple India - Published by Vivekananda Kendra Prakashan, 3- Singarachari Street, Triplicane, Madras.1974


24. The Imperial Gazetteer of India, The Indian Empire, Vol - II (Historical) Published by Today & Tomarrow's Printers and publishers, 22-B\5, Original road, Karol Bagh, New Delhi -5.

25. The Imperial Gazetteer, Vol - I.

26. Krishna District Manual , Printed by A.P. State Archieves.



మ్మవారి మంగళసూత్రాలు | పూసలహారం... | పచ్చలహారం | చింతాకు పతకం



కల్యాణరాముని వజ్రాల కిరీటం | సీతారాముల కిరీటాలు | 'రామటంకాలు' అని పిలిచే... 'మాడలు'

# భక్త రామదాసు శ్రీ సీతారాములకు చేయించిన ఆభరణాలు